# శ్రీశంకరావతార చరితము

యఱ్ఱాప్రగడ వెంకటసూర్యనారాయణ మూర్తి



Devullu.com

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీ శంకరావతార చరితము


రచన

యఱ్ఱాప్రగడ వేంకట సూర్యనారాయణ మూర్తి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

2017

# SRI SANKARAVATHARA CHARITAMU

*by*

**Yerrapragada Venkata Suryanarayana Murthy**

T.T.D. Religious Publications Series No. 1254
© All Rights Reserved

*First Edition : 2017*

*Copies :* 1000

*Published by*

**Sri ANIL KUMAR SINGHAL,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*

**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507





శ్రీ ఆది శంకరాచార్యుల వారు

# ముందుమాట

భారతావనిలో వైదిక సనాతనధర్మాన్ని సుప్రతిష్ఠితం చేసి ప్రాచుర్యం కావించిన ప్రముఖమతాలు అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం. వీటిని త్రిమతాలు అంటారు. ఈ మతాల సిద్ధాంత ప్రవర్తకులు శ్రీ శంకరాచార్యులు, శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు.

శ్రీశంకర భగవత్పాదులవారిని సాక్షాత్తు పరమశివుని అంశగా చెప్తారు. సనాతన ధర్మోద్ధారకులయిన శంకరులవారి కీర్తిచంద్రికలు ప్రపంచమంతటా వ్యాపించాయి. వీరు అద్వైతసిద్ధాంత ప్రవర్తకులు.

"శ్రీ శంకరావతారచరితము' అనే ప్రస్తుతగ్రంథంలో శంకరాచార్యులవారి జీవితచరిత్ర చెప్పబడింది. ఈ గ్రంథకర్త యఖ్హాప్రగడ వేంకట సూర్యనారాయణమూర్తిగారు. ఈ గ్రంథం మృదుమధురమైన శైలిలో, పండిత పామర రంజకమైన భాషలో, పాఠకులకు విసుగుపుట్టించక చదివించే రీతిలో, రసవత్తరంగా సరళసుందరంగా రచించబడింది.

ఈ గ్రంథంలో ఆదిశంకరులవారి అవతారచరిత్ర – కాలడికాండ, బాలకాండ, సన్న్యాసకాండ, విజయకాండ, ఉద్ధారకాండ, శాంతికాండ – అని ఆరు కాండలుగ రచించబడింది. అనుబంధంగా శంకరులవారి కాలనిర్ణయాదులను తెలిపే అంశాలు కూడ పొందుపరచడమైనది.

తెలుగుసాహిత్యంలో శంకరులవారిని గురించి ఉన్నంతలో సమగ్రంగా తెలియజేసే గ్రంథరాజమిది.

ధార్మిక సద్గ్రంథ పఠనాసక్తులయిన సహృదయపాఠకులు ఈ గ్రంథాన్ని చదివి శంకరాచార్యులవారిని గురించి ఎన్నెన్నో విశేషాలను తెలుసుకొనగలరు.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రచురిస్తున్న సద్గ్రంథాలలో ఈ గ్రంథం కూడ పాఠకులకు సత్ఫలితాలను అందించగలరని ఆకాంక్షిస్తూ–

*సదా శ్రీవారి సేవలో...*




**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

# విన్నపము



శ్రీ యజ్ఞాప్రగడ వెంకట సూర్యనారాయణ మూర్తి - (1907-1986)
శ్రీమతి యజ్ఞాప్రగడ సత్యవతి - (1908-1987)

నేడు తెలుగు జనావళిలో భక్తి చాల ప్రబలంగా వ్యాప్తి పొంది ఆస్తికతపాలు విస్తారంగా పెరిగినదన్న మాట నిర్వివాదాంశం. అయినా, ఆధ్యాత్మిక పథానికి శ్రీ ఆదిశంకరుడు నిర్దేశించిన జ్ఞానపద్ధతి గురించి తెలిపే ఈ దివ్య గాథ ఎన్నటికీ ఆదరణీయము, పఠనీయము కదా!

మా పితృదేవుల కలం నుండి జాలువారిన ఈ రచన వెలుగు లోనికి వచ్చేలా సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం, ప్రోద్బలం అందించి అడుగడుగున ముందుకు నడిపించిన వారు నా సోదరి శ్రీమతి ముసునూరి పద్మావతి, సోదరుడు చిరంజీవి రామకృష్ణ.

ఈ రచనలో కొన్ని చిన్ని సవరణలు చేయ సాహసించాము. అందులో ప్రధానంగా రెండు: (1) పద్మపాదుని తీర్థయాత్రల లోని వివిధక్షేత్రాల వర్ణనలు (2)పరకాయప్రవేశానంతర ఘట్టాల వివరాలు తగ్గించడం. ఎడ నెడ జరిగిన సంక్షేపీకరణ యత్నంలో పాఠ్యభాగం తగ్గి గ్రంథం నిడివి కుదింపుకు గురి ఐనది. ఈ మార్పులు ప్రధానకథాంశానికి గాని తత్త్వసారానికి గాని భంగం చేకూర్చలేదని మా నిశ్చితాభిప్రాయం. అవి కాక (1) శ్రీశంకరుల కాలనిర్ణయం మొదలైన పది అనుబంధాలు ఉన్నవి.

దయార్ద్ర దృష్టితో ముందు మాటగా ప్రస్తావన వ్రాసి ఇచ్చిన మహనీయులు వాగ్దేవీ వరపుత్ర బిరుదాంకితులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారికి నమ్రంగా నమస్కరిస్తున్నాము.

శ్రీశ్రీశ్రీ శృంగేరీ శారదా పీఠాధిపతి జగద్గురు శ్రీ భారతీతీర్థస్వామి వారి అనుజ్ఞ, ఆశీస్సు ఈ కృతికి మంగళాశాసనము.

శంకరనిలయము
అవిడి, కొత్తపేట మండలము,
తూ.గో.జిల్లా, ఆం.ప్ర.

**భవదీయుడు**
**యజ్ఞాప్రగడ మూర్తి**



श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्री शारदापीठम्, शृङ्गेरी
**Sri Sri Jagadguru Shankaracharya Mahasamstanam**
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.



Ref :                Camp : SRINGERI

శృంగేరి

పరమశివావతారులూ, సనాతనధర్మోద్ధారకులూ అయిన జగద్గురు ఆదిశంకరాచార్యులవారు సమస్తాస్తిక జనులకు సంసేవ్యులు, సమారాధ్యులు అయియున్నారు. వారు కేవలం 32 సంవత్సరములు మాత్రమే జీవించిననూ వారు సాధించిన కార్యములు అనితర సాధ్యములు. శ్రీశంకరులు కాలటీ క్షేత్రమునందు శివగురువు, ఆర్యాంబా అనే పుణ్యదంపతులకు పుత్రుడిగా అవతరించారు. బాల్యములోనే సకల వేదశాస్త్రాలలో ప్రావీణ్యమును సంపాదించిన శ్రీశంకరులు నర్మదానదీతీరంలో తపోనిరతులుగానున్న శ్రీగోవిందభగవత్పాదాచార్యులవద్ద సన్న్యాస్యం తీసికొని, వారి ఆజ్ఞప్రకారం కాశీక్షేత్రమునకు వెళ్ళి విశ్వేశ్వరును దర్శించి, బదరి వెళ్ళి అక్కడ ప్రస్థానత్రయ భాష్యములు రచించి, కాశీకి వచ్చి అక్కడ వేదవ్యాసుల ఆశీస్సులు పొందారు. తరువాత అద్వైతసిద్ధాంతప్రచారం చేస్తూ వివిధ ప్రాంతాలలో సంచరించి, సనాతన ధర్మప్రచారకార్యము నిరంతరము జరుగవలెనని భారత దేశముయొక్క నాలుగు దిక్కులలో చతురామ్నాయ పీఠములను శృంగేరి – పూరి – ద్వారక – బదరిలలో స్థాపించి, కాశ్మీరులోని సర్వజ్ఞపీఠాన్ని అధిష్ఠించి అక్కడ నుండి కేదారక్షేత్రమునకు వెళ్ళారు. ఇది శ్రీ శంకరుల యథార్థమైన చరిత్ర. ఈ చరిత్ర శ్రీవిద్యారణ్యులు రచించిన మాధవీయ శంకరదిగ్విజయంలో విస్తరముగా చెప్పబడినది.

కీ.శే.శ్రీయఱ్ఱాప్రగడ వెంకటసూర్యనారయణమూర్తిగారు రచించిన 'శ్రీశంకరావతారచరితము'ను శ్రీజగద్గురు మహాస్వామివారవలోకించినారు. సులభశైలిలో మనోజ్ఞమైన రీతిలోరచించిన ఈ గ్రంథమును తి.తి.దేవస్థానంవారు ముద్రించనున్నారన్న విషయమును తెలిసికొని శ్రీచరణులు చాల సంతసించినారు.

శ్రీశారదాచంద్రమౌళీశ్వరానుగ్రహమువలన ఈ గ్రంథము ఆస్తికమహాజనుల మన్ననలను పొందుగాకయని శ్రీచరణులాశీర్వదించినారు.

ఇట్లు

Phone : 08265-250123 / 250192 Fax : 08265-250792
E-mail : info@sringerisharadapeetham.org Visit us : www.sringerisharadapeetham.org



**సమన్వయ సరస్వతి, వాగ్దేవీ వరపుత్ర**
**బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు**
**ఋషిపీఠ వ్యవస్థాపకులు**

## ప్రస్తావన

ఆదిశంకర విజయ గాథను సంస్కృతంలో చాలా మంది మహాత్ములు రచించారు. దేశభాషల్లోనూ చాలా గ్రంథాలున్నాయి. విద్యారణ్యులు రచించిన శంకరవిజయం ఆధారంగా రచించిన ఈ గ్రంథం – శాస్త్ర మర్యాదలతో మంచి చిక్కని చక్కని తెలుగులో బ్రహ్మశ్రీ యల్లాప్రగడ వెంకట సూర్యనారాయణమూర్తి గారిచే గొప్పగా తీర్చిదిద్దబడింది. దివ్యజీవితంలోని కొన్ని ఘట్టాలను తీర్చి దిద్దిన తీరు గొప్పగా ఉంది.

ఇక–

ఆదిశంకరులు ఆ నాడు వివిధ దార్శనికులతో చేసిన అద్భుత వాదనలను సుబోధకంగా తెలుగులో వ్రాయడం సామాన్యం కాదు. అలాంటి అసామాన్య కార్యాన్ని సామాన్యులకు సైతం అవగతం అయ్యేలా శిల్పించిన రచయిత ప్రతిభా పాటవాలు ప్రశంసనీయాలు.

ఆదిశంకరుల అవతార వైభవంలో వారి గాథ – బోధ రెండూ దీప్తిమంతంగా ఈ గ్రంథంలో చిత్రించబడ్డాయి. నేటి తరం అవశ్యం పఠించవలసిన సద్గ్రంథ మిది.

తమ తండ్రి ఆ నాడే రచించిన ఇంత మంచి పుస్తకాన్ని ప్రత్యేక శ్రద్ధతో వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేసిన శ్రీ యల్లాప్రగడ మూర్తి గారు పితౄణ విముక్తు లవడమే కాక, గురు సేవలో కూడా కృతకృత్యు లయ్యారు.

ఈ సద్గ్రంథానికి శ్రద్ధతో నమస్కరిస్తూ – బుధజన విధేయుడు.

సామవేదం షణ్ముఖ శర్మ

( సామవేదం షణ్ముఖ శర్మ )

# తొలిపలుకు

వేదముల కాస్థానమైన భారతభూమిలో విభిన్న మతములు తలయెత్తి హిందూమతమునే మట్టుమాపు పరిస్థితులు ఏర్పడినవి. మతమన్న నేమియో నెరుగనివారు మతము పేరిట మారణహోమములు జరుపుచుండిరి. హిందూమతనిజతత్త్వమును కానరాక తలకొకవిధముగా ప్రచారము చేయుచు హిందూమతమునకు మచ్చలు బూయుచుండిరి. నాస్తికులదే నాయకత్వ మైనది. అట్టి తరుణమున భారత దేశమున "సంభవామి యుగేయుగే" అన్నట్లు శ్రీ శంకరభగవానుడు ఆదిశంకరుడై అవతరించి బాల్యముననే సర్వజ్ఞుడై వేదాంతతత్త్వసారగ్రహీతయైనాడు.

స్వార్థరహితుడైన శ్రీఆదిశంకరులు తానుపొందిన జ్ఞానమును ప్రజలకందించ దేశం నలుమూలలు పర్యటించి మతమన్న నేమియో తెలియపరచి హిందూమతఐక్యమును సాధించెను. హిందూమత సారమును గ్రహించి ప్రజలకందించిన వారలలో అగ్రగణ్యులు శ్రీ ఆదిశంకరులే. తన దిగ్విజయము చిరస్థాయిగ నుండునట్లు దేశము నలుమూలల నాలుగు వేదమఠములను స్థాపించి జయధ్వజము నెగురవేసిన యుగపురుషుడు శ్రీ ఆదిశంకరుడు.

అట్టి శంకరులదివ్యచరితమును గురువరేణ్యుల ఆశీర్వాదమున యథాశక్తిరచించగలిగితిని. పండితుడను కాని కారణమున లోపము లుండుట సహజము. దానికి క్షంతవ్యుడను.

ఈ గ్రంథరచనకు, ప్రచురణకు సలహాసంపత్తినిచ్చి తోడ్పడిన మిత్రులకు కృతజ్ఞుడను.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటచలాధీశుడు నన్ను అనుగ్రహించి ఈ గ్రంథాన్ని ముద్రింపజేస్తున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఈ గ్రంథాన్ని స్వీయముద్రణగా స్వీకరిచినందులకు నేను సర్వదా కృతజ్ఞుడను.

**ఓం తత్సత్**

అవిడి

తూర్పు గోదావరి రచయిత

# మంగళాచరణము

## (శంకరాచార్య కృతః)

శ్లో. ప్రజ్ఞానాంశు ప్రతానైః స్థిర చర నికరవ్యాపిభి ర్వ్యాప్యలోకాన్
భుక్త్వా భోగాన్ స్థవిష్ఠాన్ పునరపి ధిషణోద్భాసితా న్కామజన్యాన్
పీత్వా సర్వాన్విశేషాన్ స్వపితి మధురభుఙ్మాయయా భోజయన్నో
మాయా సంఖ్యా తురీయం పరమమృత మజం బ్రహ్మయత్తన్నతోఽస్మి॥

శ్లో. యో విశ్వాత్మా విధిజ విషయా న్ప్రాశ్య భోగాన్ స్థవిష్ఠాన్
పశ్చా చ్చాన్యాన్ స్వమతి విభవాన్ జ్యోతిషాస్వేన సూక్ష్మాన్
సర్వా నేతా న్పునరపి శనైస్స్వాత్మని స్థాపయిత్వా
హిత్వా స్సర్వా న్విశేషా న్విగత గుణగణః సాత్వసౌన తురీయః ॥

## । గురుస్తుతి ।

**గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణుః, గురు ర్దేవో మహేశ్వరః**
**గురు స్సాక్షా త్పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవే నమః ॥**

శ్లో. శాంతం సుందర మందహాస వదనం తద్బ్రహ్మ తేజోనిధిం
దత్తాత్రేయ కలాభిజాత మఖిలానందానుసంధాయినం
ధీరం ధీరజనానుకంపి హృదయం యోగీశ్వరం స్వామినం
శ్రీమద్దేవకినందనాశ్రమ యతిం సేవా విధేయం భజే ॥

## । ఇష్టదేవతా ప్రార్థన ।

మా యిలువేల్పువై కరుణమై వివిధార్థసమూహ సదృశ
శ్రీయుతులం బొనర్చుచు తరింపగ జేయుదు మామకీయ వం
శీయుల, నేటి యీకృతి రచింప దొడంగితి భార మెల్ల నీ
దే యని నమ్ముచున్ తిరుమలేశ్వర! శ్రీపతి వేంకటేశ్వరా!

## । గణపతి ప్రార్థన ।

నిను భావింపక యుద్యమింపరు భవానీనందనా నిర్జరుల్
మనుజుల్ క్రొత్త తలంపులున్ పనులు, గమ్యప్రాప్తి చేకూరు నీ
యనుకంపన్, సుగమంబు లౌగద గణాధ్యక్షా! మహాకార్యముల్
నిను ధ్యానించిన, కూర్మి మద్రచనమున్ నిర్విఘ్నముం జేయుమా!

## । సరస్వతీ ప్రార్థన ।

శ్రుతివాగ్వైఖరులన్ మునిప్రతతి సంస్తోత్రంబు గావింప సం
తతమున్ సుందరహస్తపద్మమున వీణం బూని చిందించు నా
ద తరంగంబుల దేలియాడుచు ననంతం బైన సృష్టిక్రియన్
మతి గీలించు విధాతృరాణి మది సంభావింతు నిష్పాప్తికిన్.

## । విష్ణు ప్రార్థన ।

శ్రీరమణీమనోహరు నశేషకృపాకరు శిష్టరక్షణో
దారు భవాంధసంచయసుధాకరు శ్రీకరు శేషశాయి నం
భోరుహనేత్రు నక్షయు ముముక్షు జనావనకార్యదక్షునిన్
నారదగానలోలుని జనార్దను గొల్తు నభీష్టసిద్ధికిన్.

## । ఈశ్వర స్తుతి ।

భువిజను లజ్ఞతాంధమున మున్గిన వారికి జ్ఞాన దీధితిన్
సువిమల మోక్ష పద్ధతుల జూపగ నెత్తిన పూజనీయమౌ
భవదవతారగాథ తెలుపం దలపెట్టితి నాదరింపుమీ
భవహర! చంద్రశేఖర! కృపాకర! శంకర! నీలకంధరా!

## । కవిస్తుతి ।

ఆదికవీంద్రుడై అమరగానము చేసె, లోకవంద్యుండు వాల్మీకియోగి
వరపురాణమ్ములు పరమేతిహాసముల్, వినిచె వేదవ్యాసవిబుధవరుడు

నన్నయ తిక్కన నాచనసోము డె, ఱ్ఱాప్రగడాది పూర్వాంధ్రకవులు
పోతనశ్రీనాథముఖ్యులౌ వంద్యులు, కవితాధురంధరుల్ కలరుపెక్కు
రాంధ్ర దేవభాషా వాఙ్మయంబు లందు,
పూర్వకవు లాధునికులును పుణ్యపురుషు
లస్మదాదుల కాదర్శమైన వారు
వారి యాశీస్సు నాకు లభ్యమగుగాత!

## । భక్త స్తుతి ।

అంబరీష శుక రుక్మాంగద శౌనక భీష్మ వసిష్ఠ విభీషణులును
నరపరాశర దాల్భ్య నారద ప్రహ్లాద పుండరీక వ్యాస మునిప్రభృతులు
భరతుడుధ్రువుడుశబరియుమార్కండేయుడాంజనేయుడును మున్నయినవారు
పుణ్యచరిత్రులు పోతన త్యాగరాజు కబీరు రామదాసు మొదలైన
భక్తపుంగవులకు ప్రణతు లర్పించెద, భక్తపాదధూళి భవ్య మంద్రు
భక్తు కోర్కె దీర్చు పరమాత్ము డనిశంబు, ప్రస్తుతింప నగునె భక్తమహిమ!

## । మాతృస్తవము ।

పరగుచుండు వసిష్ఠవైనతేయములకు నడుమను లంకగన్నవరమొందు
నిరతాన్నదాత్రియైనెగడెను డొక్కాన్వయవిభూషణము సీతమాంబ యచటె
అందుగన్నవరాన్వయంబున శేషమాంబాసుబ్బరాయదంపతుల కనుగు
పట్టియైపుట్టి యుభయగౌతమీమధ్యఖండమై యొప్పు మున్గండకుత్త
రమున పోతవరమను గ్రామమందు,వెలయునెఱ్ఱాప్రగడకులతిలకులనగ
దొడరుకామేశ్వరమ్మమృత్యుంజయులకుకోడలిగవచ్చిప్రజకెల్లకూర్చితమ్మ!

మరువగ లేమమ్మా నిను
నిరుపమ సద్గుణనిధాన! నీ జీవిక మా
కెఱిగించినది 'న మాతుః
పరదైవత' మనెడి పలుకు పరమార్థంబున్.

తనయుల ముగ్గుర నలుగురు
తనయల గని తొంబదేండ్ల తనువున గంటే
మనుమలకున్ మనుమల గని
కనులారగ జూచికొనెడి ఘనభాగ్యంబున్.
ఎన లేని ప్రేమమూర్తిగ
నిను నెల్లరు జెప్పికొంద్రు నీ నామంబున్
మనుమలు మునిమనుమలు పుర
జనులున్ ధరియించుకొనిరి జననీ! భక్తిన్.
అమ్మా! ధన్యుల జేసితి
మమ్ముల నీ పుణ్యచరిత మా తండ్రి కిలన్
నెమ్మిం గూర్చెను కీర్తి ఘ
నమ్ముగ దీవింపు మమ్మ! నడుమ తనూజున్.

## । పితృ స్తవము ।

నవనీతమ్మగు నిండు చిత్తమున విజ్ఞానార్జనాసక్తి మ
ధ్య వయస్సందున గల్గ నేర్చితివి విద్యల్ పెక్కు; లోకజ్ఞుగా
కవిగా కర్షకుగా మనీషిగ మహోకర్మిష్ఠిగా నున్నతిన్
వివిధ ప్రజ్ఞల దేజరిల్లితివి తండ్రీ! నా నమోవాకముల్.
"పితృదేవో భవ" యన్న ధర్మమును సంప్రీతిన్ తలం దాల్తు సం
తతమున్ వైదిక ధర్మతత్పరత తత్త్వజ్ఞాన సంపన్నతన్
శతవర్షాధిక జీవయాత్ర కడు ధన్యంబై జగన్మాన్య జీ
వితసారమ్యము నొందె నీ చరిత దీవింపం గదే నన్ గృపన్.

## కృతి ప్రదానము

శివుడున్ విష్ణువు శక్తి వీవ యగుటన్ జింతించి శ్రీవేంకటే
శ విభుం డంచును శ్రీనివాసు డనుచున్ సన్మాత బాలాజి యం

చవిరోధమ్ముగ శైవవైష్ణవులు శక్త్యారాధకుల్ కొల్వగా
భవబంధమ్ములు తూల్చి కాచెదవు దేవా! వేంకటేశప్రభూ!

ఒక్కండయ్యు ననేకరూపములతో నొప్పారుచు న్నామముల్
పెక్కుల్ కల్గియు జన్మకర్మ గుణవైవిధ్యమ్ము లేకుండ స
మ్యక్కారుణ్యరసాబ్ధివై జగములన్ మన్నించు నీ పాదముల్
దిక్కంచున్ మది నమ్మి కొల్తును సదా శ్రీవేంకటేశప్రభూ!
శ్రీమచ్ఛంకర దేశికేంద్ర పదసంసేవానురాగాన త
ద్భూమానంద రసాప్తి హేతుచరితమ్మున్ దెన్గు గద్యమ్మునన్
నీమమ్మొప్పగ వ్రాసి మీ పదములందే పెట్టి మా యింటి వే
ల్పౌ మీ పాదము లాశ్రయించితిని దేవా! వేంకటేశప్రభూ!

కుల మెఱ్ఱాప్రెగడాఖ్యమై తనరు మా గోత్రర్షి మౌద్గల్యుడై
వెలయన్, మాతయు బుచ్చిమాంబ, పితయున్ విజ్ఞుండు శ్రీవేంకటా
చల విఖ్యాతుడు, వేంకటప్రముఖమై జానొందు సూర్యాఖ్య నా
కలరున్ నీ పదభక్తియుక్తుడను దేవా! వేంకటేశప్రభూ!
ప్రణతి "శ్రీ శంకరావతారచరితము" ను
వ్రాసి నీకు సమర్పించి వాసి గొంటి
కౌశికీతీర మందున గ్రాలు 'అవిడి'
మా నివాసము, కావుము మానివాస!

# విషయ సూచిక

**1. కాలడి కాండ**

1.1 కేరళ ప్రాంతము 1

1.2 శివగురుని జననము 2

1.3 శివగురుని విద్యాభ్యాసము 2

1.4 శివగురుని వివాహము 3

1.5 ఆర్యాంబ పిల్లలను గారవించుట 6

1.6 ఆర్యాంబా శివగురుల తపస్సు 6

1.7 శివుని వరము 7

1.8 శంకరుని జననము 8

**2. బాల కాండ**

2.1 శంకరుని పసితనము 11

2.2 బాల్య లీలలు 12

2.3 పరివారము 14

2.4 సరస్వతికి శాపము 14

2.5 సరస్వతి భూలోకమున జన్మించుట 15

2.6 విశ్వరూపునిగా బ్రహ్మ ఆవిర్భావము 16

2.7 కన్యాన్వేషణ 17

2.8 ఉభయభారతీ విశ్వరూపుల పరిణయము 19

2.9 విద్యాభ్యాసము 20

2.10 శివగురుడు దివి కేగుట 21

2.11 ఉపనయనము 22

2.12 వేదాధ్యయనము 22

2.13 బంగరు ఉసిరిక పండ్ల వాన 23

2.14 శంకరుని విశాలాశయము 27

2.15 గురుకుల వాస విశిష్టత 27

2.16 భరద్వాజుడు, వేదాలు 28

2.17 శంకరుడు పూర్ణానదిని తన యింటి కడకు తెచ్చుట 29

2.18 కేరళదేశాధిపతి పిలుపు 30

2.19 శంకరుని కడకు రాజు వచ్చుట 32

2.20 రాజుకు శంకరుని వరము 34

2.21 శంకరుని శిష్యులు 35

2.22 మాతృస్థాన విశిష్టత 36

2.23 పెండ్లి ప్రయత్నము 36

2.24 తల్లికి శంకరుని ఓదార్పు 39

2.25 సన్న్యాసాశ్రమ స్వీకార బీజము 40

2.26 సోదరునితో ఆర్యాంబ చర్చ 41

**3. సన్న్యాస కాండ**

3.1 మానసిక సన్న్యాసము 43

3.2 తల్లికి శంకరుని వాగ్దానము 44

3.3 తల్లిని జ్ఞాతులకు అప్ప జెప్పుట 44

3.4 శ్రీ కృష్ణాలయ పునరుద్ధరణ 45

3.5 ఆర్యాంబ బెంగ 46

3.6 సన్న్యాస యోగము 47

3.7 సద్గురువుకై అన్వేషణ 49
3.8 కాలడిని విడనాడుట 50
3.9 గురువుల కడకు ప్రయాణము 51
3.10 నర్మదా నదీ ప్రాంతము 52
3.11 శ్రీ గోవిందభగవత్పాదాచార్యుల సన్నిధి 53
3.12 గురువుకు తా నెవరో ఎఱిగించుట 55
3.13 శంకర యతి శంకరాచార్యు డగుట 56
3.14 శిష్యరికము 57
3.15 నర్మద పొంగును కుండ లోని కెక్కించుట 58
3.16 శంకరావతార గాథ 61
3.17 కాశీ ప్రయాణము 62
3.18 గంగావతరణ గాథ 63
3.19 సనందుడు శిష్యు డగుట 65
3.20 కాశీలో ప్రచారము 67
3.21 చండాలోపాఖ్యానము 68
3.22 బదరీ ప్రయాణము 72
3.23 బ్రహ్మసూత్ర భాష్య రచన యొక్క ఆవశ్యకత 73
3.24 బ్రహ్మసూత్ర భాష్య రచన 74
3.25 ఉపనిషత్తులకు భాష్య రచన 75
3.26 సనందనుడు పద్మపాదు డగుట 76
3.27 వ్యాస మహర్షి రాక 78
3.28 వ్యాస-శంకర వాదోపవాదములు 79
3.29 వ్యాస దర్శనము 80

**4. విజయ కాండ**


| | |
|---|---|
| 4.1 విజయ యాత్ర | 83 |
| 4.2 ప్రయాగ మహిమ | 84 |
| 4.3 అక్షయ వట వృక్షము | 85 |
| 4.4 కుష్ఠ రోగి బాగుపడుట | 86 |
| 4.5 కుమారిల భట్టు | 86 |
| 4.6 అమరావతిలో కుమారిలభట్టు | 88 |
| 4.7 తుషానల ప్రవేశము | 91 |
| 4.8 ప్రభాకరాచార్యుడు | 92 |
| 4.9 హస్తామలకుడు | 94 |
| 4.10 మాహిష్మతీ పురము | 96 |
| 4.11 మండన మిశ్రు నింట ప్రవేశము | 98 |
| 4.12 వాద భిక్ష | 102 |
| 4.13 పరిషత్సభ | 104 |
| 4.14 ఉభయభారతి ప్రతిజ్ఞ | 105 |
| 4.15 వాదోపవాదములు | 106 |
| 4.16 జీవేశ్వరాభేదము | 107 |
| 4.17 మండనమిశ్రుని సంశయములు | 109 |
| 4.18 జైమిని ప్రత్యక్ష మగుట | 110 |
| 4.19 మండనమిశ్రుడు శంకరుని స్తుతించుట | 111 |
| 4.20 ఉభయభారతి కథ | 112 |
| 4.21 ఉభయభారతి శంకరుల మధ్య వాదము | 112 |

4.22 పరకాయప్రవేశముపైశంకరుని వివరణ 113
4.23 శంకరుని పరకాయప్రవేశము 117
4.24 పట్టపు దేవి అనుమానము 120
4.25 శంకరశిష్యుల అన్వేషణ 122
4.26 గాయక వేషధారులు 124
4.27 గాయకులు బందీకృతు లగుట 126
4.28 'జితాస్మి' 127
4.29 మండనమిశ్రుని సన్న్యాసాశ్రమము 128
4.30 మహావాక్యోపదేశము 128
4.31 దక్షిణ దేశ యాత్ర 131
4.32 శ్రీశైల క్షేత్ర దర్శనము 132
4.33 కాపాలికుల కుట్ర 135
4.34 పద్మపాదుని నృసింహావతరణ 137
4.35 పద్మపాదుని కథ 138
4.36 గోకర్ణ క్షేత్రము 139
4.37 హరిహర క్షేత్ర దర్శనము 139
4.38 మూకాంబికా క్షేత్రము 140
4.39 బల్యగ్రహారము 141
4.40 శృంగగిరిలో శారదా పీఠము 141
4.41 తోటకాచార్యుడు 142
4.42 నైష్కర్మ్యసిద్ధి 145
4.43 అవసానదశలో ఆర్యాంబ 148

4.44 పద్మపాదుని తీర్థ యాత్రలు 150

4.45 టీకాగ్రంథము 152

4.46 పద్మపాదుడు గురువు కడకు రాక 153

4.47 కేరళరాజు 155

4.48 మధ్యార్జునేశ్వరము 156

**5. ఉద్ధార కాండ**

5.1 రామేశ్వరములో శాక్తేయులు 158

5.2 భవానీ ఉపాసకులు 160

5.3 లక్ష్మీ ఉపాసకులు 161

5.4 సారస్వతేయులు 162

5.5 వామాచార్యులు 164

5.6 పాశుపతులు 166

5.7 లింగధారులకు తత్త్వ బోధ 172

5.8 అనంతశయన క్షేత్రము 178

5.9 పంచాయతన పూజ 179

5.10 భాగవతులు 181

5.11 శార్ఙ్గపాణికి తత్త్వబోధ 182

5.12 పాంచ రాత్రులు 184

5.13 వైఖానసుడు 185

5.14 కర్మహీన శాఖీయులు 188

5.15 హిరణ్యగర్భ మతము 190

| | |
|---|---|
| 5.16 అగ్నిదేవోపాసకులు | 192 |
| 5.17 సౌర మతస్థులు | 193 |
| 5.18 గాణాపత్యులు | 196 |
| 5.19 కాంచీపురము | 200 |
| 5.20 తామ్రపర్ణీతీరస్థులు | 202 |
| 5.21 ఆంధ్రదేశ సంచారము | 203 |
| 5.22 విదర్భ రాజు స్వాగతము | 204 |
| 5.23 క్రకచుడు | 206 |
| 5.24 ఉన్మత్తభైరవుడు | 211 |
| 5.25 చార్వాకుడు | 213 |
| 5.26 పీనకాయుడు | 215 |
| 5.27 క్షపణకుడు | 217 |
| 5.28 జైనమతస్థుడు | 218 |
| 5.29 శబలుడను బౌద్ధుడు | 219 |
| 5.30 మల్లారిభక్తులు | 221 |
| 5.31 విష్వక్సేనాలయము | 223 |
| 5.32 మన్మథ మతవాదులు | 225 |
| 5.33 మగధ పురము | 226 |
| 5.34 దేవేంద్రభక్తులు | 229 |
| 5.35 యమ భక్తులు | 230 |
| 5.36 ప్రయాగ | 233 |
| 5.37 శూన్య మతస్థుడు | 235 |

5.38 వరాహమతస్థుడు 237

5.39 లోకసేవక వాదులు 238

5.40 గుణోపాసకులు 239

5.41 సాంఖ్యులు 240

5.42 కాపిల మతస్థుడు 241

5.43 పరమాణువాదులు 244

5.44 కర్మవాదులు 245

5.45 చంద్రమతస్థులు 246

5.46 కుజాదిగ్రహోపాసకులు 247

5.47 క్షపణకుడు శిష్యు డగుట 248

5.48 పితృమతస్థులు 249

5.49 గరుడ శేష భక్తులు 250

5.50 సిద్ధోపాసకులు 251

5.51 గంధర్వోపాసకులు 251

5.52 భేతాళ  మతస్థులు 252

5.53 గోకర్ణ క్షేత్రము 253

5.54 నీలకంఠుడు 255

5.55 ద్వారకా నగరము 264

5.56 భట్టభాస్కరుడు 265

5.57 అర్హ్వ డను జైనుడు 270

5.58 అభినవగుప్తుడు 273

**6. శాంతి కాండ**


6.1 భగంధర వ్యాధి 275

6.2 చికిత్స 277

6.3 పద్మపాదుడు వ్యాధిని కుదుర్చుట 279

6.4 శ్రీ గౌడపాదాచార్యులు 280

6.5 శ్రీ గౌడపాదుల ప్రశంస 281

6.6 సర్వజ్ఞ పీఠ దక్షిణ ద్వారము 282

6.7 పీఠాధిరోహణ పరీక్ష 283

6.8 సర్వజ్ఞపీఠాధిరోహణము 290

6.9 చతురామ్నాయ మఠ స్థాపన 292

6.10 మఠముల వివరణ 293

6.11 పశ్చిమామ్నాయ మఠము 298

6.12 పూర్వామ్నాయ మఠము 299

6.13 ఉత్తరామ్నాయ మఠము 300

6.14 దక్షిణామ్నాయ మఠము 300

6.15 మఠామ్నాయ మహానుశాసనము 301

6.16 తత్త్వ గ్రంథములు 305

6.17 ఉపదేశ గ్రంథములు 305

6.18 స్తోత్రములు 307

6.19 భాష్యగ్రంథములు 309

6.20 సాధన పంచకము 309

6.21 నిజ ధామ నిష్క్రమణము 312

# అనుబంధములు


1. శ్రీ శంకరాచార్యులవారి కాలనిర్ణయము 315

2. శ్రీ శృంగేరీ శారదా పీఠాధిపతి శ్రీభారతీతీర్థస్వామివారి చరిత్ర 320

3. శ్రీ దేవకీనందనాశ్రమస్వామివారి ఆశీస్సు 324

4. శ్రీ దేవకీనందనాశ్రమస్వామివారి చరిత్ర 326

5. శ్రీ విద్యాశంకరభారతీస్వామివారి ఆశీఃప్రశంస 330

6. శ్రీ సత్యానందేశ్వర సరస్వతీస్వామివారి ఆశీఃప్రశంస 332

7. శ్రీ బ్రహ్మానందతీర్థస్వామివారి ప్రశంస 333

8. బ్రహ్మశ్రీ బులుసుఅప్పన్నశాస్త్రిగారి ఆశీఃపూర్వకప్రశంస 335

9. విద్యాభాస్కర శ్రీ దినవహి సత్యనారాయణగారి ప్రశంస 337

10. రచయిత వంశక్రమము 340

# 1. కాలడి కాండ

## 1.1 కేరళ ప్రాంతము

అది ఒక మనోహర దృశ్యం. చూడ ముచ్చట గొలిపే కొబ్బరి తోపు లొక వంక, విమలజలధారలతో జలజల పారే జలపాతా లొక వంక, కన్నుల పండువై విందు గొల్పగా, విప్రవర్యుల వేదఘోషలతో ఆ గిరిసానువులు మార్మ్రోగుతాయి. హాయి నిచ్చే పైరు గాలి విహరించే ఆ వనం నందనోద్యాన వనాన్ని మఱపిస్తుంది. సముద్రతరంగాల తాకిడికి రక్షణయో అన్నట్లు పడమటి కొండల అండ. పరమ పావన మని పేరు గన్న వృషాచల మచ్చటే ఉంది. పూర్ణానది కూడా అక్కడే ప్రవహిస్తుంది. దేశాన్ని పాలించే రాజు పేరు రాజశేఖరుడు. ధార్మికుడైన ఆ రాజు పాలనలో ప్రజలు అన్నివిధాలా సుఖసంతోషాలతో ఉండేవారు.

ఒకనాడు రాజుగారి కలలో పరమేశ్వరుడు కనిపించి తాను వెలసిన జ్యోతిర్లింగస్థలం చూపించి అక్కడ ఆలయం కట్టించ మని ఆదేశించాడు. రాజు పరమానందభరితుడై గొప్ప శివాలయాన్ని అచట నిర్మించి నిత్యదీప ధూపనైవేద్యాదికైంకర్యాలు చిరస్థాయిగా ఉండే ఏర్పాట్లు చేసి ఆ గుడిని సుప్రభ మనే పేరుతో సేవించు చుండేవాడు. జగదీశ్వరుని అనుగ్రహ ప్రభావంతో ఎటు చూచినా నూరు మైళ్ళ పర్యంతం ఆ ప్రాంతం సర్వ సంపదలతో తులతూగుతోండేది.

దగ్గరలోనే ఉన్నది కాలటి అనే అగ్రహారం. యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, పరిగ్రహం అనే ఆరు వైదిక కర్మలకూ ఆలవాలం ఆ పేటలోని భూసుర గృహాలు. బ్రహ్మణ్యు లైన బ్రాహ్మణులందరూ వేదవాక్కులతో ముప్పిరి గొన్న భక్తితో విశ్వేశ్వరుణ్ణి భజించే నంబూద్రి శాఖవారు. ఆంధ్రప్రాంత మైన గోదావరీమండలము లోని పిఠాపుర

సమీపంలో హంసవరము నందుండి వెడలిన వంశం అట్లు విలసిల్లిన దని పెద్దలు పలుకుదురు.

## 1.2 శివగురుని జననము

కాలటి అగ్రహారంలో ఎన్నదగిన మేటి విద్యాధిరాజు అనే పేరు గల బ్రాహ్మణుడు. ఆ కుటుంబం వారు శివ భక్తులు. ఎంత సంపద లున్నా వారికి సంతానము లేమితో ఎన్నో వ్రతములు తపములు చేశారు. తుదకు వారి పూజలు ఫలించి చక్కటి పుత్రుడు కలుగగా శివగురుడని పేరు పెట్టుకొని అల్లారు ముద్దుగా పెంచుకొంటున్నారు. దినదినప్రవర్ధమానుడగుచున్న ఆ బాలునికి ఉపనయనము చేయు వయస్సు వచ్చింది. యోగ్య మగు ముహూర్తమును నిర్ణయించి యధావిధి గా ద్విజకర్మ చేశారు. పిమ్మట విద్యాభ్యాసం కోసం సద్గురువుల కప్పగించారు.

## 1.3 శివగురుని విద్యాభ్యాసము

పూర్వం గురువుల కడ విద్య నేర్వాలన్న ఎన్నో నియమాలను పాటించాలి. బ్రహ్మచర్య వ్రతం ఆచరించాలి. త్రికాలముల యందు సంధ్యావందనం, అగ్నిహోత్రం చేయాలి. కౌపీనధారి కావాలి. గురువును పరమదైవంగా భావించాలి. మధుకరవృత్తి నవలంబించి తా దెచ్చినది గురువుకు సమర్పించి గురువు తినగా మిగిలినది తినాలి. చాప మీదనే పరుండాలి. పుష్పం ముట్టరాదు. అద్దం చూడరాదు. తాంబూలం సేవించకూడదు. ఇలాంటి కఠోర నియమాలు పాటిస్తూ శివగురుడు కుశాగ్రబుద్ధి కాబట్టి స్వల్పకాలంలోనే వేదవేదాంగాలు కంఠగతం చేసికొన్నాడు.

ఒకనాడు ప్రశాంతసమయం చూచి గురువు శివగురువును ఆప్యాయంగా పిలచాడు. శివగురువుతో 'బిడ్డా! నీ చదువు పూర్తి అయ్యింది. ఇంటికి పోయి గృహస్థాశ్రమం చేపట్టు.' ఆ పలుకులు శివగురువుకు

ములుకులుగా తోచినవి. ఆందోళన, భయము, దుఃఖము పుట్టుకొచ్చినవి. అయినా ధైర్యం తెచ్చుకొని గురువు గారితో ఇట్లా విన్నవించుకొన్నాడు: 'గురుదేవా! ఱోతను పుట్టించే సంసారకూపము లోనికి పొమ్మంటున్నారు. సంసారం ముముక్షువులకు అడ్డం కదా! తీవ్రవిరాగి అయిన వానికి గృహస్థాశ్రమం ఎందుకు? నేరుగా సన్న్యాసాశ్రమం లోనికి పోవచ్చు గదా! ఎందరెందరో అలా వెళ్ళిన వారున్నారు కదా! ఈ దీనుని కరుణించి గురుసేవాభాగ్యం కలుగజేయండి. నన్నింటికి పంపకండి' అని వేడుకొన్నాడు. కాని గురువు కరుణించ లేదు. మౌనమే వహించాడు.

లేక లేక కలిగిన కుమారుడు తల్లిదండ్రులకు బిడ్డను చూడాలని ఉంటుంది కదా! మంచి రోజు చూచుకొని తండ్రి విద్యాధిరాజు గురువుల ఆశ్రమానికి బయలుదేరి వెళ్ళాడు. అడుగకనే గురువుగారు శివగురుని విద్యాభ్యాసం పూర్తయిందని, కొడుకును తీసికొని వెళ్ళి వివాహము చేయమని సెలవిచ్చారు. అందుకు విద్యాధిరాజు చాలా సంతోషించి, గురుకట్నం సమర్పించి శివగురువును తోడ్కొని ఇంటికి బయలు దేరాడు. చేసేది లేక విధి బలీయ మని నిశ్చయించు కొన్నాడు శివగురువు. ఇంటికి చేరడానికి కొన్ని రోజులు పట్టింది. చూడవచ్చిన బంధుజనులతో ఇల్లు పండగలా అందరూ ఆనందంలో గడిపారు. తండ్రికి అందరి ఎదుటా కొడుకు నేర్చిన విద్యలను ప్రశ్నించాలని కోరిక పుట్టింది. అన్ని శాస్త్రాల మీద ప్రశ్నల వర్షం కురిపించాడు. శివగురువు తడవకుండా చెప్పిన జవాబులకు అంతా సంతోషించి పిల్లవాని మేధను కొనియాడారు.

## 1.4 శివగురువు వివాహము

ఎనలేని ధనధాన్యకనకవస్తువాహనసంపత్తి. నలు దెసల వ్యాపించిన విద్యావికాసవైభవము. వరుడువిశిష్టుడైన యోగ్యుడు. కన్యాదాతలు తహ తహ లాడుతూ స్వయంగానో మధ్యవర్తుల ద్వారానో వర్తమానాలు

పంపుతున్నారు. కట్నాలు ఒకరిని మించి ఒకరు వెయ్యి, రెండు వేలు, మూడు వేలు అంటూ విద్యాధిరాజుకు ఈ జూపుతున్నారు. వరుని తండ్రికి కట్నాలతో నిమిత్తం లేదని తెలియక. ఆయన చూచేవి ఆచార సంపత్తి, గౌరవ మర్యాదలు, సద్గుణగణాలు. నూరేళ్ళ పంటకు కావలసినది అనుకూల దాంపత్యం. చివరికి 'నా కుమార్తె ఆర్యాంబను మీ కుమారుడైన శివగురునకు ఇచ్చి వివాహం చేయాలని ఉంది. దయయుంచి నా కోరికను మన్నించండి' అని అడిగిన మఖపండితునితో వియ్య మంద నిశ్చయించిన విద్యాధిరాజు ఒక షరతు పెట్టాడు. అది వివాహం తన ఇంటనే జరగాలని తెలవు లేక మఖపండితుడు ఒప్పుకోక తప్ప లేదు.

దైవజ్ఞులు శుభకరమైన ముహూర్తం నిర్ణయించారు. తగినంత వ్యవధి ఉండడంతో ఇరు వైపులా సందడికి లోటు లేదు. బంధువులకు, స్నేహితులకూ శుభలేఖలు వ్రాయించి పంపుకొన్నారు. రకరకాల మంగళవాద్యకారులను కుదుర్చుకొన్నారు. ఆకాశాన్నంటే పందిళ్ళు వేశారు. వాటికి పచ్చని మామిడి తోరణాలు, స్తంభాలకు రంభాఫలవృక్షాలు కట్టారు. పలురకాల అలంకారాలతో కల్యాణమంటపం చూడ ముచ్చటగా తయారయ్యింది. ఊరిలోని ప్రతి ఇంటికీ వెల్లలు వేయించి ఊరంతా కలకల లాడే టట్టుగా చేశారు. పెండ్లికి వచ్చే బంధువులకు బసల ఏర్పాట్లు జరిగాయి. కవులకు, గాయకులకు ఆహ్వానాలు వెళ్ళాయి. ముందుగానే వచ్చిన ఆడపెండ్లి వారితో కలిసి మంగళవాద్యపురస్సరంగా ఇంటింటికీ వెళ్ళి పిలుచుకొని వచ్చారు.

స్నాతకవ్రత మాచరించి వివాహానికి సిద్ధ మయ్యారు. పెండ్లి కుమారుడు మంగళవాద్యములతోను, దేవకన్యల నృత్య గీతాలతోను, వేదఘోషలతోను, బంధు జనులతో ఊరేగి సుముహూర్తానికి చాల ముందుగా కల్యాణ మంటపం ప్రవేశించాడు. వశిష్ఠుల వంటి పురోహితులు వివాహకార్యక్రమాన్ని ఆరంభించారు. ఒక వైపు వేదమంత్రాలఘోష జరుగుతుండగా, గాయకుల

ఆలాపనలూ, నృత్తగీతాలు, రమడోలు మ్రోతలు, సన్నాయి స్వనం పెళ్ళి యిల్లు సందడి మిన్ను ముట్టేలా ఉంది. వంది మాగధులు స్వస్తివాచకాలు చెప్పుతున్నారు. సుముహూర్తం సమీపించడం తోటే జీలకట్ట ముద్దలు వధూవరుల చేతులలో ఉంచారు. బ్రహ్మలు మంత్రాలు చదువుతూండగా వధూవరుల చేతులను ఒకరివి మరొకరి శిరములపై ఉంచారు. అది వారి జీవిత పరమావధికి సుముహూర్తం. భావాలు ఏకమయ్యే సుసమయం. అట్లొక ముహూర్తకాలం ఉంచారు. దేవతలు వచ్చి ఆశీర్వదించారు. వేదమాతఆశీర్వచనం పలుకుచున్నది. బ్రాహ్మణోత్తములు, బంధుజనులు, మిత్రలోకము మొదలైన వారందరూ 'శతమానంభవతి! శతాయుష్యేంద్రియే ప్రతితిష్ఠతి' అంటూ శుభాక్షతలు జల్లారు. తరువాత మాంగళ్యధారణ, తలంబ్రాలు ఎంతో వేడుకగా జరిగినవి. ఇరువంకల వారు వచ్చిన అతిథు లందరికీ చందనతాంబూలాది సత్కారాలు జరిపారు. బ్రహ్మ గారు నూతన దంపతులకు బట్ట ముడి వేసి సభకు, తల్లిదండ్రులకు నమస్కారం చేయించారు. నాటి విధానము అంతటితో ముగించగా అందరూ భోజనాలకు లేచారు.

అది అయిదు రోజుల పెండ్లి. షడ్రసోపేత భోజనాలలో వండిన కూరలు వండకుండా, వండిన పిండి వంటలు కాకుండా అద్భుతంగా ముంచెత్తారు అందరినీ. సదస్యం నాడు మగపెళ్ళి వారి వైపు బాహ్మణు లందరికీ కాసులు, శాలువాలు, పంచెల చాపులు అర్హత ననుసరించి సత్కారములు చేసారు. వచ్చిన బంధువు లందరికి యథోచితంగా నూతనవస్త్రాలతో బహూకరించారు. ఈ విధంగా శివగురుడు గృహస్థు డయ్యాడు. ఆర్యాంబ అతనికి సహధర్మచారిణి అయ్యింది. పతివ్రతలకు మించిన వ్రత మాచరిస్తూ ఆర్యాంబ పతికి తలలో నాలుకగా మసలుతూ అత్తమామలకు బాసటగా ఉండి పేరు తెచ్చుకొంటోంది.

## 1.5 ఆర్యాంబ పిల్లలను ఆదరించుట

కొంత కాలానికి విద్యాధిరాజదంపతులు పెద్దవారై పుణ్యలోకాలకు ప్రయాణమై ఇల్లు, వాకిలి, ధాన్యాది సంపత్తి యావత్తు కొడుకు చేతిలోను, కోడలి చేతిలోను పెట్టి వెళ్ళిపోయారు. స్వధర్మానుష్ఠానం చేస్తూ అతిథి అభ్యాగతులను గౌరవిస్తూ బీదసాదలను కనిపెడుతూ పండితులతో పండిత గోష్ఠులతో జ్ఞానామృతాన్ని ఆస్వాదిస్తూ శివగురు దంపతులు చీకూ చింతా లేని గార్హస్థ్యజీవనాన్ని సాగిస్తున్నారు. ఆర్యాంబకు చిన్న పిల్లలంటే ముద్దు. ఇరుగు పొరుగు వారి చిన్ని పిల్లలను మచ్చిక చేసికొని సరదా తీర్చుకొనేది. తలలు దువ్వి బొట్టు పెట్టి, ఆడ పిల్ల లయితే కాటుకలు అద్ది జడలు వేసేది. వాళ్ళ కోసం చేసిన తినుబండారాలను అందించేది. దానితో పిలవకుండానే వచ్చే వారు పిల్లలు సంతోషంగా. మరీ చిన్నపిల్ల లైతే ఉయ్యాలలో పరుండ బెట్టి జోలపాటలతో జోకొట్టేది. ఒకప్పుడు పసిపాప ఏం చేసినా ఏడ్పు మానకుండా ఉంటే ఆ పాప తల్లి పరుగు పరుగున వచ్చి ఆదుకొనేది. అట్టి భాగ్యం తనకు లేకపోయిందే అని మనస్సు చివుక్కు మనేది. తన దగ్గఱకు వచ్చిన పాపలకే కాక ఊళ్ళోని పిల్లలందరికీ మహౌదార్యంతో ఆవు పాలు అందేలా ఏర్పాటు చేసింది ఆర్యాంబ. పండుగలకు ఆ పిల్లలందరికీ కావలసిన చొక్కాయిలూ, లాగులూ, ఆడపిల్లకు పరికిణీలు, జాకెట్లు తయారు చేయించి స్వయానా తానే వారికి తొడిగి మురిసి పోయేది. ఇంత చేసినా పిల్లలు ఏదో సమయంలో తమ తమ ఇళ్ళకు తుఱ్ఱు మని పారి పోయే వారు. అంతే కదా! ఎంతయినా ఎవరి పిల్లలు ఎవరికి అవుతారు. ఈ సత్యం ఆర్యాంబకు క్రమేణా తెలిసి వస్తూ, మనసులో దిగులు ఆరంభ మయ్యింది.

## 1.6 ఆర్యాంబా శివగురుల తపస్సు

ఆర్యాంబ మనసు లోని తపన శివగురునికి అర్థం అయ్యింది. కాలం పరుగెత్తుచున్నది, వయసు మీరుతోంది. పుత్రుల వలననే పరలోకసుఖాలు లభిస్తాయి. పుత్రులు లేకపోతే వంశం అంతరిస్తుంది. ముందు ముందు

పుత్రహీనుల్ని పలకరించే వారు కూడా ఉండరు. ఇలా వారిరువురూ మానసికంగానే తపిస్తూండగా ఒక నాడు ఆర్యాంబయే ధైర్యం చేసి, నాథుడితో ఇలా అంది. 'స్వామీ! పరమేశ్వరుడు మన కోరిక తప్పక తీరుస్తాడు. ఆయన పరమ కరుణాలయుడు. త్వరగా ఆ విశ్వేశ్వరుని వేడుకొందాం రండి' అని భర్తకు పిలుపు నిచ్చింది. శివగురునికి ఈ ఉపాయం బాగా నచ్చింది. మరు నాటి వేకువనే లేచి కాలకృత్యాలు చేసికొని, పూర్ణానదిలో స్నానం చేసి, సంధ్య నుపాసించిన తర్వాత వారిరువురు నది ఒడ్డున సుఖాసీను లయ్యారు. చిత్తాలను పరమేశ్వరాయత్తం చేసి, నిమీలిత నేత్రాలతో తపస్సు మొదలు పెట్టారు. కొలది రోజులు కందమూలాలను తిని, తరువాత అవి మాని వాయుభక్షణం చేస్తూ కఠోర నియమాలతో వారి ఘోరతపం నడుస్తోంది. ఆర్యాంబ శరీరం శుష్కించ సాగింది.

## 1.7 శివుని వరము

ఒకనాటి ఠేయి స్వప్నంలో శివగురునికి శివసాక్షాత్కారం లభించింది. భక్తుని కోరిక విన్న పరమేశ్వరుడు శివగురువును ఇట్లా అడిగాడు. 'అల్పాయుష్కుడై సద్గుణసంపన్నుడైన ఒక పుత్రుడు కావాలా లేక పెక్కురు దుష్ట సంతానం కావాలా?' అని. శివగురువు సత్పుత్రుణ్ణే కోరుకొన్నాడు. ఈశ్వరుడు అట్లనే కలుగు నని ఇక తపస్సు మాన మని సెలవిచ్చి అంతర్ధాన మయ్యెను. మెలకువ వచ్చి భార్య ఆర్యాంబతో జరిగిన వృత్తాంతము చెప్పాడు. తపం చాలించి ఇంటికి మరలారు. నిజ నివాసంలో బ్రాహ్మణ సమారాధన చేసి శేషించిన ఆ ప్రసాదం భుజించిన శివగురువు లోనికి ఈశ్వరతేజం ప్రవేశించింది. తన కోరిక ఫలించిన ఆర్యాంబ ఈశ్వర తేజస్సుతో గర్భం ధరించింది.

శివుని పరమానుగ్రహ మహిమ సామాన్యమా? ఆర్యాంబ నూతన కాంతులతో వెలుగుతోంది. పదునాల్గు భువనాలు మోయడ మంటే మాటలా. నడక మందమయినా ఉత్సాహం నానాటికీ ఇనుమడిస్తోంది. ఆభరణాలు

గంధమాల్యాదులు ధరించడానికి ఆమెకు భారం మెండుగా ఉంది. ఇరుగు పొరుగు వారు అనుమానించి అదో రకంగా పలుకరిస్తున్నారు. ఆర్యాంబ మనస్సులో క్రొత్త క్రొత్త కోరికలు ఉదయింప సాగాయి. అవి తీర్చబోతే తిరస్కరించేది. మరల మరొక కోరిక పుట్టడం, దానిని తీర్చ బోతే తిరిగి తిరస్కరించడం మామూలైపోయింది. బంధుమిత్రులు ఆప్యాయంగా తీసుకొని వచ్చిన సూడిద లన్నీ గ్రామంలో అందరికీ పంచిపెట్టడమే. మామూలుగా గర్భవతులకు వచ్చే అరుచి, ఆందోళన, నీరసం అలాంటివి ఆర్యాంబకు లేవు. నడుస్తున్నా, పని చేస్తున్నా చూచే వాళ్ళకు జాలి పుట్టుకొచ్చేది. ఇన్నాళ్ళకు గర్భం వచ్చింది ఎలా మోస్తుందో పాపం అనుకొన్నారు చుట్టుప్రక్క వాళ్ళు. కాని భిషగ్వరుడు సాక్షాత్తు సర్వేశ్వరుడే ఆమె గర్భంలో ఉండగా ఆరోగ్యాని కేం కొదవ? మరి కొన్నాళ్ళకు ఆర్యాంబకు శంకరుడు చాటుగా మాటుగా కనిపించడం మొదలు పెట్టాడు. ఆమె గుమ్మాలు ఎక్కడం దిగడం మానుకొంది. ఒకనాడు స్వప్నంలో జయజయనాదాలమధ్య సపరివారంగా కనిపించాడు. కళ్ళు విప్పి చూస్తే ఏమీ లేదు. విభ్రాంతురా లయ్యింది. ఆమె చూపే దయ ఆదరం పరమసాత్త్వికత వలన ఊరంతటికీ ఆర్యాంబ ప్రీతిపాత్రురాలు. పదవ మాసం వచ్చి పది రోజు లయ్యింది. ఆర్యాంబ బాగా సొక్కింది. అలాటి సమయం పరమ పవిత్ర మయినది. లోక కల్యాణకరుడు ధర్మసంస్థాపనాచార్యుడు సాక్షాత్ పరమశివుడే భూతలాన అవతరించిన వేళ. దేవతలు పుష్ప వర్షం కురిపించారు. దేవ దుందుభులు మ్రోగాయి. కృష్ణద్వైపాయనాది మహర్షులు హర్షాతిరేకం పొందారు. శంకర జననంతో ఆ గది కోటి సూర్యుల వెలుగున కాకర మయ్యింది. బిడ్డ పుట్టగానే క్షణం సేపు మూర్ఛిల్లిన తల్లి అంతలో తేరుకుంది.

## 1.8 శంకరుని జననము

నెమళ్ళు పింఛాలు ఎత్తి మనోహరంగా నాట్యం చేస్తున్నాయి. చూపరులను మైమరపించే విధంగా తరులతాదులు పుష్పశోభలతో ఆనందంగా సుగంధాల్ని దశదిశలా వెదజల్లుతున్నాయి. ఆనందబాష్పాలు

గ్రుమ్మరిస్తున్నాడు సంతోషంతో ఉబ్బిన మేఘుడు పర్వతవీథుల నుండి. సెలయేళ్ళ కోలాహలం చెప్ప నలవి కాదు. నదీఝరులు కన్ను మిన్ను కానని రీతిలో ఉరకలు వేసికొంటూ ఒడ్లను దూసుకొంటూ పారుతున్నాయి. సహజవైరుధ్యమున్న జంతువులు మైత్రీభావంతో మెలగుతున్నాయి. సుజనులకు శుభ నిమిత్తాలు, దుర్జనులకు దుర్నిమిత్తాలూ గోచరించ సాగాయి.

యుధిష్ఠిరశకంలో రెండు వేల ఆరు వందల ముప్పది సంవత్సరాలు గడచాయి. నందన నామ సంవత్సరం. వైశాఖ శుక్ల పంచమి భానువారం కర్కాటక లగ్నం, మేష మందు రవి, పునర్వసులో చంద్రుడు గురునితోడ, మందుడు తుల యందు, అంగారకుడు మకర మందు ఉన్నారు.

ఈ వార్త క్షణంలో ఊరంతా ప్రాకి, స్త్రీ లందరూ చూడ వచ్చి చూడ లేక పోతున్నారు ఆ రవిసహస్రదేదీప్యమానుడైన చిట్టి పాపణ్ణి. మంత్రసానికి కోద్దామంటే బొడ్డు కాన రావటం లేదు. అంతా చాలా హడావిడిగా ఉంది. బిడ్డ కెవ్వు మన్న ఏడ్పు అందరు బిడ్డలలా లేదు. ఓంకారరవం అంటున్నారు. బొడ్డు కోసి నీళ్ళు పోసి బిడ్డను పరుండ బెట్టారు. పాపని చూచిన వారు చూచినట్లుగా నిలబడి పోయి ఉంటున్నారు. ఒకసారి చూచిన వాళ్ళే తనివి తీరక మరల మరల వచ్చి చూస్తున్నారు. బిడ్డడు కేవలం అవతార పురుషు డని చెప్పు కొంటున్నారు. అది విన్న మగ వాళ్ళు కూడ చూడ వచ్చారు. ఆ నాడు శివగురుని గృహం ఒక యాత్రాస్థలం అవ్వడంలో ఆశ్చర్య మేముంది? పుట్టిన శిశువు సామాన్యుడయితే కదా! మూడు నెలల బిడ్డ డేమో అన్నట్లు ఉన్నాడు. చక్కటి ముక్కు, తామర రేకుల వంటి కన్నులు, శ్రీకారాలను పోలిన చెవులు, విశాల ఫాలం, వెడల్పయిన వక్షఃస్థలం, మల్లెపువ్వ వంటి మేని చాయ, తుమ్మెద రెక్కల బోని నల్లని కురులు, బిడ్డ రూపు అతివేలంగా ముచ్చట గొలుపుతున్నాయి. ఆర్యాంబా శివగురుల తపఃఫలమని అందరూ సంబరపడ్డారు.

శివగురుడు జన్మకాల ఘడియలు కట్టుకొని జాతకం వ్రాసికొన్నాడు. పురుడు పది రోజులు సుఖంగా గడిచాయి. పదకొండవ నాడు పురిటి స్నానం చేయించి శాంతులు తీర్చి జాతకర్మ యథావిధిగ చేసికొన్నాడు. వంశం వారందరూ శివ భక్తులు. శివ ప్రసాదంగా జనించిన బిడ్డడు కాబట్టి శంకరు డని నామకరణం చేసాడు.

శ్రీ శంకరుడే ఇలా అవతరించాడని తెలియదు కదా!

**ఇది శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకశేఖర ముముక్షుజననిధాన శ్రీ దేవకీ నందనాశ్రమస్వామిగురుప్రసాదలబ్ధ విజ్ఞాన వితాన యల్లాప్రగడ వెంకట సూర్యనారాయణ మూర్త్యభిధాన విరచిత శ్రీ శంకరావతార చరితము నందు కాలడి కాండ సమాప్తము.**

# 2. బాల కాండ

## 2.1 శంకరుని పసితనము

తెలివైన దైవజ్ఞులను రావించి కుమారుని జాతకం వ్రాయించాడు శివగురుడు. భావాలన్నీ పరిశీలించారు వారు. పిల్లవాడు మంచి మేధావి, విద్యలకు వ్యాసుడు, స్వాతంత్ర్యానికి సర్వేశ్వరుడు, ధర్మమూర్తి, గురువులకు గురువు, కవనానికి ప్రాచేతసుడు, మేధలో సురగురుడు, బ్రహ్మణ్యుడు, యోగరాశి, శాంతమూర్తిగా ప్రఖ్యాతిగాంచుతాడని ఆనందకరమైన ముత్యాలను కుప్పగా పోశారు. తండ్రికి ఆ రాజాధిరాజ యోగాలు వీనుల విందొనగూర్చాయి. ఆయువు సంగతి మఱుగయ్యింది. సంతోషంతో వారికి పారితోషికా లిచ్చి పంపించాడు.

మంచి ముహూర్తం చూచి ఆర్యాంబ ముద్దుబిడ్డను తొట్టెలో పెట్టడానికి సంరంభం ఆరంభించింది. ఊరి ముత్తైదువు లందరినీ పిలిచికొని వచ్చి, వచ్చిన పేరంటాండ్రకు కాళ్ళకు పసుపులు తానే రాసి బొట్లు పెట్టి చందన చర్చ చేసింది. శనగలు, అరటి పండ్లతోబాటు అత్తరువు లద్దిన రవికల గుడ్డలతో తాంబూలా లిచ్చి ముచ్చట తీర్చుకుంది. ఉయ్యేలకు మధ్యగా మణులతో మనోహరంగా అలంకరించి కట్టి వ్రేళ్ళాడదీసినారు. ఆ పాలవెల్లిని చూచి శిశువు సుఖంగా ఆడుకొంటా డని. వచ్చిన నారీమణులు బిడ్డను ఎత్తుకొని ముద్దాడి విడువ లేక విడువ లేక ఎవరి ఇండ్లకు వారు వెళ్ళే సరికి జాము రాత్రి అయ్యింది ఆ నాడు. అమ్మలక్కలందరూ ఏదో వేళ వచ్చి ఆ బిడ్డను చూడకుండా ఉండగలిగే వారు కారు. వారి దైనందిన కార్యక్రమంలో ప్రముఖస్థానం అది! శంకరశిశువు వారికి ప్రత్యక్షశివునిలానే అనిపించి అలరించే వాడు. ఆ పరమానందానుభవంలో వారికి ఇల్లూ, వాకిలీ, భర్తా, బిడ్డలూ మరచిపోయే వారు. ఆర్యాంబాశివగురువుల గృహం శివాలయమే అయింది. చీకటి పడే సరికి పిల్లవాడు ఓంకార రవం చేసేవాడు. అప్పుడొక

ముసలి అవ్వ వచ్చి విభూతి మంత్రించి పెట్ట మన్నది. అలా చేయగానే బిడ్డ ఊరకుండి పరుండేవాడు. పరమేశ్వరునికి విభూతిప్రీతికరమైనది కదా! మరొక పెద్దముత్తైదువు వచ్చి రుద్రాక్ష కట్టింది. ఒక ఉవిద తాయెత్తును, మరొకామె మొలకు పులి తోలును కట్టింది. వేరొక వనిత మెడ కొక మంత్రించిన త్రాడు వేసింది. ఇవన్నీ చూస్తే శివదర్శనానుభూతి కలిగినట్లు పరవశించి పోయే వారందరూ.

## 2.2 శంకరుని బాల్యలీలలు

ఒకనాడు ఆర్యాంబ బిడ్డకు పాలిచ్చి ఉయ్యాలలో జోకొట్టి బిడ్డ నిద్ర పోయాక లోపలికి వెళ్ళింది. భర్తకూ శిష్యులకూ భోజనా లయ్యాక. తాను పెట్టుకొని తింటున్నది. అంతలో ఉయ్యాల లోని బిడ్డ క్రింద పడినట్లు చప్పుడయ్యింది. గుండెలు దడదడ కొట్టుకొంటూండగా పరుగుపరుగున వెళ్ళి బిడ్డను చూచి గుండెలు బాదుకొంటూ గొల్లు మన్నది. భార్య రోదన విన్న శివగురువు వెళ్ళి చూచే సరికి ఆర్యాంబ మూర్ఛలో ఉంది. ఉపచారాలు చేయగా లేచి 'పాము పాం...మెడలో ఆడుతోంది బిడ్డను బ్రదికించండి, పాముల వాణ్ణి పిలిపించండి' అన్న మాటలు విని భర్త కూడా ఒళ్ళు పట్టు తప్పి పడ్డాడు. 'పాము పాము' అన్న కేకలు విన్న శిష్యులు పరుగున కఱ్ఱలతో వచ్చారు. బిడ్డ సుఖంగా ఆడుకొంటున్నాడు. ఏమీ కాలేదు. లేవండి అని తెలివి వచ్చిన తల్లికి చెప్పారు. తల్లి బిడ్డను ఎత్తుకొని ఱొమ్ముకు అద్దుకొంది. పెద్దలు 'మీ శంకరుడు నాగధరుడు. తన లీలలు మీకు చూపిస్తున్నాడు. మీరెంతో ధన్యులు సుమా!' అన్నారు.

వేరొక రోజున మరొక విచిత్రం జరిగింది. బిడ్డకు ఉగ్గు పెట్టి, నీళ్ళు పోసి, పాలిచ్చి నిద్ర పుచ్చాక దొడ్లోనికి స్నానానికి వెళ్ళుతూండగా భర్త ఎదురయ్యాడు. 'శంకరుడు నిద్రపోతున్నాడు. నేనిప్పుడే వస్తాను బిడ్డను చూస్తుండండి' అని చెప్పి వెళ్ళింది ఆర్యాంబ. 'సరే' అన్న శివగురుడు గది గుమ్మంలో కూర్చొని పార్వతీ పరిణయం పారాయణ చేస్తున్నాడు. అంతలో

గదిలో పెద్ద వెలుగు వెలిగింది. గది లోనికి తొంగి చూచాడు. బలిసిన ఒక పెద్ద యెద్దు, దాని మెడలో పెద్ద గంట చెవులు గింగురు మనేలా గణగణ ధ్వని వినిపించాయి. శివగురుని గుండెలు దడ దడ కొట్టుకొన్నాయి. ఆ యెద్దుపై హస్తం ఆన్చి నిలబడి ఉంది ఒక నల్లని వనిత. ఉయ్యాల లోని బిడ్డను చూస్తూ ఒయ్యారంగా ముసి ముసి నవ్వులను అందిస్తోంది ఆమె. బిడ్డడు నవ్వుల మూటగా చూస్తున్నాడు. అంతలోనే ఆ దృశ్యం మటుమాయ మయ్యింది. సంగతి విన్న ఆర్యాంబ, శివగురువులు పరమేశ్వరునికి పరి పరి విధాలుగా నమస్కారాలు చెప్పుకొన్నారు.

మరొక సమయంలో బిడ్డ పరుండిన తర్వాత బిడ్డను చూస్తుండ మని శిష్యులకు చెప్పి బయటికి వెళ్ళింది ఆర్యాంబ. శివగురుడు ఆవుకు కుడితి పెడుతున్నాడు. శిష్యులు పాఠాలు వల్లె వేస్తున్నారు. మధ్యమధ్య ఒక శిష్యుడు గదిలోనికి వెళ్ళి బాలుణ్ణి చూచి వస్తున్నాడు. అలా వెళ్ళిన శిష్యుడు చూచి గొంతెత్తి పెద్ద కేక  వేసాడు. విని మిగిలిన శిష్యులూ వచ్చి వాళ్ళూ గొల్లు మన్నారు. గందరగోళం విన్న ఆర్యాంబా, శివగురువూ వచ్చి చూస్తే మాట రాక క్రింద చదికిల పడ్డ శిష్యులు, ఉయ్యాలలో హాయిగా పరున్న బిడ్డడు. కొంత తమాయించు కొన్న పిదప చెప్పారు శిష్యులు తాము చూచినది. నాలుగు చేతులున్న నల్లని వాడు, నాలుగు ముఖాల వాడు, గడ్డాలు మీసాలు ఉన్న వాళ్ళు పలువురు బిడ్డ చుట్టూ మూగి తొంగి తొంగి చూస్తున్నారట. బిడ్డను ఎత్తుకు పోతారేమో అని భయం వేసిందండీ అని చెప్పారు. ఆ మాటలు విన్న ఆర్యాంబా శివగురువుల కేమి చెప్పాలో తెలియ లేదు.

శంకరుడు ఆ రోజు కా రోజు ఎదుగుతున్నాడు. కూర్చుండడం, ప్రాకడం కల కల లాడుతూ ఇల్లంతా కలయ బ్రాకే వాడు. గడపలు పట్టుకొని నడవడంతో మొదలుపెట్టి తప్పటడుగులతో మెల్లి మెల్లిగా నడక నేర్చుకొంటున్నాడు. అయినా తల్లి బిడ్డను చంకను వేసుకొనే తిరిగేది ఎక్కడ కంది పోతాడో అని. కాలడిలో అందరూ శివభక్తులు కాదు. అలాంటి

వాళ్ళు కూడా ఈ బాలుణ్ణి చూచి ఆ వర్చస్సు, నుదుట నున్న ముక్కంటి రేక, కంఠాన నాగరేఖలూ మొదలైనవి చూచి తేరుకొని శంకరావతారమే అని  నిర్ధారించు కొని వెళ్ళారు.

## 2.3 పరివారము

రావణాది క్రూర రాక్షసులను సంహరించడానికి భగవానుడు శ్రీరామునిగా అవతరించి నపుడు సోదరులుగా భరత లక్ష్మణ శత్రుఘ్నులు కూడ భువిపై వెలశారు. తర్వాతి యుగంలో శ్రీకృష్ణునితో బాటు యుధిష్ఠిరాదులు జనించారు. యుగే యుగే ధర్మాన్ని ప్రతిష్ఠించడానికి పూనుకొంటాడు పరమాత్ముడు. కలియుగంలో మన శంకరుని అవతారాశయము కూడ ధర్మ సంస్థాపనమే. క్షీణించుచున్న కర్మకాండలను ఉద్ధరించడానికి కుమారస్వామి అంశతో కుమారిల భట్టు, బ్రహ్మ గారి అంశతో మండనమిశ్రుడు జన్మించారు. విష్ణ్వంశతో పద్మపాదుడు పుట్టి గురుభక్తి మహిమను లోకానికి చాటాడు. సూత్రభాష్యాన్ని, ఉపనిషద్భావాలను సులువుగా తెలియజేయడానికి బృహస్పతి అంశలో ఆనందగిరి ఉద్భవించాడు. హస్తామలకుడు వాయుదేవుని అంశతో పుట్టాడు. భారత దేశం ఆనాడు అల్లకల్లోల స్థితిలో ఉంది. నాస్తికత బలపడింది. ఆస్తిక పండితులు పరస్పర వైరుధ్యాలతో దారి తెన్ను తెలియని అయోమయావస్థలో మున్గి ఉన్నారు. వైదిక ధర్మార్థాన్ని పునరుద్ధరించ వలసిన అవసరం బలవత్తరంగా ఉంది. ధర్మానికి గ్లాని కలిగినపుడు ఉదయిస్తా నన్నాడు కదా పరమాత్మ. ఆ పరిస్థితులలో శంకరావతారమున కావశ్యకత ఏర్పడిన అపురూపమైన తరుణం అది.

## 2.4 సరస్వతికి శాపము

చతురాననుని అధ్యక్షతలో సత్యలోకంలో ఒక మహా సభ. మహర్షులు నిలబడి వేదవాక్కులలో బ్రహ్మను ప్రస్తుతిస్తున్నారు. నలువ రాణి వింటున్నది

కాని ఆ మహామహిషికి రుచించడం లేదు. కారణం దూర్వాసుని బోసి నోట వెడలిన ఉచ్చారణ స్వరం. సరస్వతీదేవి పక్కున నవ్వింది. కారణం అర్థం చేసికొన్న దూర్వాసమహర్షికి అవమానంతో క్రోధాగ్నితో భగభగ మండింది శరీరం. శపించాడు ఆ వాగ్దేవిని: 'మానవులకు సుస్వరం లేదని నీకు తెలియదా? ఈ విషయం నీవు తెలిసికోవలసి ఉన్నది. ఇందుకు మానవజన్మ ఎత్తుదువు కాక!'. శాపం విన్న శారదామాత బ్రహ్మ వైపు చూచింది. మహర్షుల వైపు చూచింది. అందరూ దిగ్భ్రాంతులై చేసేది లేని వారుగా అవాక్కులయ్యారు. ఋషిశాపాని కెదురు లేదా? ఎవ్వరూ ఉలుకరు పలుకరు. అప్పుడు గత్యంతరం లేక ఆ దూర్వాసమునీశ్వరుని వంక తిరిగి నమస్కరించింది. తక్కిన ఋషు లందరు ధైర్యంతో దూర్వాసుని వేడుకొన్నారు శాపోపహరణం కోసం. అప్పటికి కొంత దిగిన కోపోగ్రతతో ఇలా అన్నాడు. 'అద్వైతమతవ్యాప్తికై పరమేశ్వరుడు శంకరావతారం ధరిస్తాడు. వారి దర్శనంతో నీకు శాపవిముక్తి లభిస్తుంది. పైగా నీ పతి దేవుడు కూడ నీతోనే ఉంటాడు'. ఈ విధంగా బ్రహ్మ గారికి కూడా తన శాపాన్ని తగిలించాడు మహర్షి పుంగవుడు! మహనీయుల శాపాలు శాపవిమోచనాలూ అన్నీ లోకకల్యాణకరాలే!

## 2.5 సరస్వతి భూలోకమున జన్మించుట

శోషనదీ తీరాన పరమశ్రోత్రియవంశం లోని విశ్వమిత్రుడు విద్యా వినయసంపన్నుడు, తేజోమూర్తి. భాగ్యశాలి అయినా నమ్రశీలి. అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ బంధు మిత్రులకు ఏడుగడయై, ఎల్లరి మన్ననలను పొందుతున్న గృహస్థగ్రామణి. లేక లేక పుట్టింది ఆ యింట వంశ పావనిగా సాక్షాత్తు సరస్వతీ మాత. తెల్లని మేని ఛాయతో, దివ్య తేజస్సుతో, పద్మపత్రాల వంటి కన్నులతో చూపరులకు అద్భుతంగా కనిపిస్తూ వెలసినదా చదువుల తల్లి. శుక్లపక్ష చంద్రునిలా దినదినప్రవర్ధమానయై ఆ బిడ్డ పసితనంలోనే చూపించిన తెలివితేటలు ప్రజలకు మిక్కిలి అబ్బురంగా అనిపించాయి.

ఆ బిడ్డను తడవు లేకుండా ఉభయభారతి అనే సార్థక నామంతో పిలిచారు. యుక్త వయస్సు వచ్చాక ఆమె తనకు కాబోయే వరుడెక్కడ ఉన్నాడో తెలిసి కోవాలన్న తపన మొదలైంది. విశ్వమిత్రుని యింటికి ప్రతి రోజూ విప్రవర్యులు దూరదేశాల నుండి వచ్చే వారు. ఆ వచ్చిన వారి నుండి వివరాలు అడిగి తెలిసికొనేది తనకు కాబోయే వరుడెక్కడ వెలిసాడో నని. జాడ తెలియక అలమట పడేది.

## 2.6 విశ్వ రూపునిగా బ్రహ్మ ఆవిర్భావము

వేరొక పవిత్ర గృహంలో అవతరించి ఉన్నాడు విరించి. కతిపయ దూరంలో ఉన్న హిమమిత్రు డనే పుణ్యాత్ము నింట విశ్వరూపనామం ధరించి. అటు ఉభయభారతి లాగే ఈయన కూడా తపన పడుతున్నాడు తనకై ఉదయించిన సత్యలోకపు టిల్లాలు గురించి. ఈ ఉభయుల తపనలూ ఆందోళనలు, ఆరాటాలు రోజు రోజుకీ పెరిగిపోతూ శరీరాల్ని కృశింప జేస్తున్నాయి. అటు ఉభయభారతి తల్లిదండ్రులకు గాని, ఇటు విశ్వరూపుని మాతాపితలకు గాని ఈ ఇరువురి మనోగత విరహాగ్ని పరిస్థితులు తెలియనే తెలియవు. ఏ విధమైన లోట్లు లేవు. ఏ రకపు అసంగతపు విషయాలు లేనే లేవు. ఆకలి దప్పులు లేని విధంగా ఏదో విధమైన బెంగ ఆవహిల్లి వారిద్దరి దేహాలను క్రుంగదీస్తోంది. పెద్ద వాళ్ళకు ఏమీ తోచక భిషగ్వరులను రప్పించి చూపించారు. కారణం ఎవ్వరికీ అవగతం కాలేదు. ఒక్క విషయంలో ఇరు వైపుల వైద్యులూ ఆ యా చోట్ల ఒకే నిర్ణయానికి వచ్చారు. అచ్చట విశ్వరూపునికీ ఇక్కడ ఉభయభారతి గురించీ. ఏ రుగ్మత లేదని తేల్చి చెప్పారు. అయినా తల్లిదండ్రులకు చింత పోలేదు. అక్కడ హిమమిత్రుడు పుత్రుణ్ణి చేరదీసి 'నాయనా! నువ్విలా చిక్కిపోతుండడం చూడలేకపోతున్నాం. నిన్ను వేధిస్తున్నది, బాధిస్తున్నది ఏదయినా ఉందా. దాచక చెప్పు' అని అడిగాడు. అదే విధంగా ఒకనాడు విశ్వమిత్రుడు ప్రియపుత్రికను చేరదీసి'అమ్మా! నిన్ను మనస్సు వికలం చేస్తున్న దేమో చెప్పు. ఏ నగలు కావాలి? ఏ నాణ్యాలు

కావాలి?' అని అడగగానే ఉభయభారతి తండ్రితో 'నాయనా! నాకు కావలసినది, మీ రియ్యని దేమున్నది?' అని సమాధానం చెప్పింది.

ఒక నాడు హిమమిత్రుడు ఊరకుండ లేక తనయుణ్ణి నిర్బంధంగా అడిగాడు దాచక కారణం చెప్ప మని. ఇక దాచి లాభం లేదని తెలుసు కొన్న విశ్వరూపుడు తండ్రి దగ్గఱ తన వ్యథ నంతటినీ వెల్లడించాడు: 'నాన్నా! శోణనదీ తీరంలో విశ్వమిత్రు డనే బ్రాహ్మణోత్తముడున్నాడు. ఆయన కొక్కగా నొక్క కూతురు రూప గుణ విద్యా వైభవాదులలో సరి లేని కాంతా మణి మీకు కోడలుగాను అమ్మ ఆశయాల కనుగుణంగాను. అమ్మ ఆశయాలకు తగినదై ఈ యింటికి కోడలు కాదగ్గ కాంత కాకుండా పోతుందేమో అని దిగులు పడుతున్నాను' అని విశదీకరించాడు వెంటనే హిమమిత్రుడు సమర్థులైన విప్రవరులను ఇద్దరిని రావించి కావలసిన దారిబత్తెము లిచ్చి విష్ణుని ఊరికి పంపించాడు.

అటు ఇక వేచి ఉండ లేక ఉభయభారతి కూడ తండ్రితో తన మనో వ్యథకు కారణం బయట పెట్టింది. 'తన ఆశయాల కనుకూలుడు సుగుణరాశి అయిన సుందర రూపు డొకడున్నాడు. అతని పేరు విశ్వరూపుడు. నిరంతరం నా వైకల్యానికి కారణ మదే. మనస్సు ఆయన పాదారవిందాలనే భజిస్తోంది. అలాంటి అల్లుడు మీకు లభించడం అదృష్టం. మీరందుకు తోడ్పడాలి' అని తల్లిదండ్రులను వేడుకొన్నది ఉభయభారతి. విశ్వమిత్రుని హృదయం కుదుట పడ్డది. తమ ముద్దుల బిడ్డ అన్ని విధాలా తగిన వరుణ్ణే ఎన్నుకొన్న దని. కాని ఆ ప్రాంతము వారి ఆచారం ప్రకారం నాడు కన్యాన్వేషణే కాని వరాన్వేషణ చేసే వారు కాదు. అందు వలన వరుని కొఱకు ఎదురు చూస్తున్నాడు.

## 2.7 కన్యాన్వేషణ

హిమమిత్రుడు పంపిన విప్రులు కాలి నడకను బయలుదేరి అనేక గ్రామములు దాటి అనేక దేశములు దాటి బహుదినములకు విష్ణుమిత్రుని

ఇంటికి చేరుకున్నారు. వారికి విష్ణుమిత్రుడు అర్ఘ్యపాద్యాదు లిచ్చి ఎన్నో పరిచర్యలు చేశాడు. కొంత సేపు విశ్రాంతి తీసుకొన్న పిమ్మట కుశలప్రశ్నలతో పలకరించాడు: 'బ్రాహ్మణోత్తములారా! మీరు చూడగా బహుదూరదేశం నుండి వచ్చి నట్లనిపిస్తోంది. మీ రాకతో మా గృహం పావన మయ్యింది. మీకు ఈ దాసుడు ఏ రీతిగా సేవ చేయగలడు నా అదృష్ట మని భావిస్తున్నాను. చెప్పండి'.

ఆ మాటలు విన్న విప్రులు తోడనే తాము వచ్చిన కార్యం ఇలా సెలవిచ్చారు: 'మహానుభావా! మీ సాంత్వనపు మాటలు, మీ మర్యాదలు మాకు సేద తీర్చాయి, వినండి. మేము వచ్చిన పని ఏమిటో చెప్పుతాము. హిమమిత్రు డనే బ్రాహ్మణశ్రేష్ఠుని పంపున మీ వద్దకు వచ్చాము. అతని కుమారుడు విశ్వరూపుడనే పిల్లవాడు రూపు రేకలలోను, విద్యలకు, వినయ గుణ సంపత్తికి పేరు గన్న వాడు. మీ ప్రియపుత్రిక అయిన ఉభయభారతికి అన్న విధాలా అర్హుడైన వరుడని సంకల్పించి మా నిర్ణయాన్ని తమకు నివేదించ మని హిమమిత్రుడు విన్నవింపుడని మమ్మల్ని పంపాడు'. 'ఆడబోయిన తీర్థ మెదురయింద' న్నట్లైంది విశ్వమిత్రునికి. ఇంటి లోనికి పోయి ఆ సంతోషంతో సంగతి భార్యకు చెప్పాడు. హిమమిత్రుని కుమారుడు విశ్వరూపు డనే వరునకు మన ఉభయభారతి నిచ్చి వివాహం చేయమని అడగడానికి వచ్చిన బ్రాహ్మణుల గుఱించి. పైకి చాలా ఆనందపడ్డా ఉభయభారతి తల్లికి కొన్ని అనుమానాలు పొడసూపాయి. ఉన్నది ఒక్కతే కూతురు గదా! వాళ్ళు ఉన్న ఊరు చాలా దూరం. ఎప్పుడయినా చూడడానికి వెళ్ళాలంటే ప్రయాసలు కదా! పిల్ల వాని చదువు లేమిటో మంచి చెడ్డలు తెలుసుకొన్న పిమ్మట నిదానంగా ఆలోచన చేసి నిర్ణయించాలి కదా! అని ఆ తల్లి తన అభిప్రాయాలసూ అనుమానాలనూ వ్యక్తం చేసింది. ఆ మాటలకు సమాధానంగా విష్ణుమిత్రుడు భార్యతో ఇలా అన్నాడు: 'కుండిన నగరానికీ ద్వారకకూ ఎంత దూరమో తెలుసా? కొన్ని రోజుల ప్రయాణం అటు

నుండి రావడానికి. భీష్మకమహారాజు ఏమయినా శ్రీకృష్ణుని గూర్చి తెలిసి కొందామని చారులను పంపాడా? శ్రీకృష్ణుని కీర్తి జగద్వ్యాప్తం కదా! అదే విధంగా ఈ విశ్వరూపుడు కూడ బహు యశస్సు సంపాదించుకొనిన వాడు. పైగా కుమారస్వామి అవతార మయిన కుమారిలభట్టు వద్ద చదువు నేర్చుకొన్న ప్రజ్ఞావంతుడు. ధనసంపద అంటావా? బ్రాహ్మణునికి విద్యయే తరగని అమూల్య మయిన విత్తం. అది కాక హిమమిత్రుడు ధన ధాన్యాది ఐహికభాగ్యం లోనూ లోటు లేని గృహస్థుడు'. ఆ విధంగా సంప్రతించు కొన్న తరువాత ఉభయభారతి చెవిలో వేశారీ మాట. విన్నంతనే ఆ యమ ఆనందంతో సిగ్గుతో అరమొగ్గలా అయింది. వివాహప్రయత్నం తప్పక జయప్రద మగు ననే నమ్మకం ఉభయభారతికి. ఆ నమ్మకంతో తానే ఒక గొప్ప ముహూర్తాన్ని నిశ్చయించినది. సకలశుభలక్షణములూ కల ముహూర్త మది. ఆ ముహూర్త యోగబలాన్ని బట్టి వ్యవధి పదునాలుగు రోజులే ఉన్నా ఒక ఆకు మీద లిఖించిన పత్రికను తమ వైపు బ్రాహ్మణున కిచ్చి పంపించారు వచ్చిన విప్రవరులతో బాటు. పరుగు పరుగున వారు హిమమిత్రుని దగ్గఱకు చేరుకొన్నారు. లగ్నపత్రిక అందుకున్న హిమమిత్రుని ఆనందానికి అవధి లేదు. శుభవార్త అందించిన ఆ విప్రులను బహురీతులుగా సత్కరించాడు హిమమిత్రుడు. తాము అందరూ సకుటుంబ పరివారంగా తరలి వస్తున్నామని వర్తమానం తెలిపారు మగ పెండ్లి వారు ఆడ పెండ్లి వారికి. సమయ వ్యవధి తక్కువ కావడంతో పెళ్ళికి సంబంధించిన పనులు సకలం చకచకా చురుకుగా జరుగుతున్నాయి.

## 2.8 ఉభయభారతీ విశ్వరూపుల పరిణయము

పందిళ్ళు వేసే వాళ్ళు ప్రమోదంతో నిర్మించి, చూత పల్లవాలతో అలంకరించుచుండగా, వివాహవేదిక సర్వాంగ సుందరంగా తయారవు తోంది. పురమంతా పందిళ్ళే. ఊరంతా పెళ్ళివారే. మగపెళ్ళివారికి తగు విడిది ఏర్పరచారు. మేళతాళములు, మంగళవాద్యాలు మొదలైన వన్నీ

సమకూర్చుకొని మగ పెళ్ళివారి రాకకై ఎదురు చూస్తున్నారు విశ్వమిత్రుని వైపు వారు.

ఇక హిమమిత్రుని వెంట ఆ పురప్రజలు అందరూ ప్రయాణ మయ్యారు. విప్రులతో, మిత్రులతో, భృత్యులతో, వేశ్యకన్యకల బృందాలతో, ఢంకా నౌబత్తుకానాలతో, రామఢోళ్లతో, ఇంకా పలురకాల మంగళవాద్యాలతో మంచి వేళ చూచికొని బయలు దేరారు మగపెండ్లి వారు. ముత్యాల పల్లకిపై మందహాసంతో కూర్చున్న పెండ్లి కొడుకు విశ్వరూపుడు. గాయక శిఖామణులు, కవిపుంగవులు, బ్రహ్మణ్యులైన బ్రాహ్మణులు వేద వాక్కులు పలుకుచుండగా, వాహనములపై ఎక్కి విజయపరంపరలను అందుకొనుటకు వెడలే విజయుని సేనావాహిని వలె విరాజిల్లినది ఆ జనసందోహం. మధ్య మధ్య మకాములు వేసికొంటూ, తొందర ఏ మాత్రం లేక నిబ్బరంగా తరలి వస్తున్నారు. వెళ్ళి వెళ్ళి శోణనదీతీరం చేరుకొనగానే చెవులు చిల్లులు పడేటట్లు తూతూబాకాలు మారు మ్రోగాయి. అది మగ పెళ్ళి వారు వచ్చినట్లు సంకేతం. ఉలిక్కిపడిన కన్యాదాత వెంటనే ఎదురు వెళ్ళి స్వాగతం పలికి వారిని వెంటబెట్టుకొని ప్రత్యేకించి ఏర్పరచిన విడిదిలో ప్రవేశపెట్టాడు. ఒకరి నొకరు ఉదాత్త మర్యాదాపూర్వకంగా పలకరించుకొన్నారు.

వేదవిహితమైన వివాహకార్యక్రమం ముగిసింది. మండనమిశ్రుడు మంగళసూత్రమును ఉభయభారతి గళసీమను అలంకరింప జేశాడు. మంచి ముత్యాల తలబ్రాల వేడుక చూడని వారు లేరు. పెండ్లిలో ఆఖరి తంతు అప్పగింతలు. తల్లికీ, తండ్రికీ, తోబుట్టువులకూ, వారి భర్తలకు, పిన తండ్రి పెద తండ్రి మొదలైన పెద్దలకు, వారి భార్యలకు, మంత్రయుక్తంగా అప్పజెప్పారు పెండ్లి కుమార్తెను. పిల్ల తల్లి దండ్రులు పరితపించడమే కాదు చూచిన వారందరు కంట తడి పెట్టుకొన్నారు.

## 2.9 విద్యాభ్యాసము

ఏడాది వెళ్ళకుండా శంకరబాలుడు అక్షరాలన్నీ గుర్తించ గలిగాడు. రెండవ యేడు రావడంతో పలు భాషల లిపులు విపులంగా నేర్వ

నారంభించాడు. దిద్ద నక్కఱ లేదు చూడడమే తడవుగా ఏదయినా ఆకళించుకోగలడు. రెండవ యేడు దాటలేదు శబ్దాలు కావ్యాలు నేర్వడం పూర్తయ్యింది. తాను నేర్వడమే కాదు తోటి బాలురకు కూడా నేర్పేవాడు. గురువుల నోట రావడం తడవు అన్నీ పలికే వాడు. తరువాత పురాణాలు చెప్పడం మొదలు పెట్టాడు. విద్య లన్నీ శంకర బాలుని ఆ విధంగా చేరుకొన్నాయి. ఆ విద్యాపాటవం ఆ నోట ఈ నోట ప్రాకి లోకులంతా విభ్రాంతులయ్యారు. వచ్చీరాని వయస్సులో మహావిద్వత్సంపన్నుడవడం వింతలలో వింత. సాక్షాచ్ఛంకరుడే అనిపించాడు.

వేదవిద్య శంకరునికి సహజంగానే అబ్బింది. ఆ మృదుమధురవేద నిస్వనం వినిన వారికి మరల మరల వినాలనిపించేది. శాస్త్రాల మాటకు వస్తే మంచి నీళ్ళ ప్రాయమే. దిగ్గజాల వంటి పండితులతో చేసే చర్చలు బహు వినోదకరంగా ఉండేవి. ఉద్ధతులైన పండితులను ఇట్టే పల్టీలు కొట్టించ గలిగే వాడు. కాని  తర్కం జోలికి పోయేవాడు కాదు ఇష్టం లేక. కాని కుతర్కవాదులు ఇతని ముందు తల వంచ వలసిందే. బాలుని ప్రతిభ ఎంతదో తెలిసి కొందా మని వచ్చిన వారందరూ శంకరునితో వాదులాడిన పిమ్మట అతనికి జోహారులర్పించే వారు.

## 2.10 శివగురుడు దివి కేగుట

సర్వసమర్థుడైన సత్పుత్రుని విద్యావైభవాన్ని కనులార గాంచి అమంద పుత్రోత్సాహసంభరితు డైన శివగురుడు ఇలా భావించాడు. చిత్తమూ, విత్తమూ, జీవితమూ అన్నీ క్షణభంగురాలే. ఈ పాంచభౌతిక గాత్రం నశ్వర మని నమ్మి పరమాత్మ లేని చోటు లేదని తలపోస్తూ, శివగురుడు పరమ జ్ఞానిగా శాశ్వతంగా పరమపద మందే దిశగా అస్తమించాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆర్యాంబను గ్రామం లోని స్త్రీపురుషాదులు చూడ వచ్చారు. దగ్గరగా చేరి, ఆమెకు ఊరటగా ఇలా చెప్పారు: ‘నీకు చెప్పదగిన వారము కాము. మమ్ముల నందరినీ ప్రేమతో చూచినదానవు. శివగురుడు నిజంగా

పోలేదు. చినిగిన బట్టను వదలి నట్లు తన పాంచభౌతిక దేహాన్ని త్యజించి పరమాత్మలో లీనమయ్యాడు. సర్వజ్ఞు డాయన. మనల కందరికీ వైరాగ్య జ్ఞానభిక్ష ప్రసాదించిన ఘనుడు. ఈ బిడ్డను చూసికో. ఇటువంటి బిడ్డను నీ చేతులలో పెట్టి వెళ్ళాడు నీ భర్త. తెలివికి నిధానమయిన ఈ బిడ్డనికి పట్టుమని ఆయిదేండ్లు లేవు. మానవులం మన విధులు మనం నిర్వర్తించడం కన్న చేయగలిగే దేముంది' అంటూ సప్రేమగా ఊరివారు ఆర్యాంబకు బాసటగా ఊరట నిచ్చారు.

## 2.11 ఉపనయనము

ఏడాది అప్పుడే గడచి పోయింది. నాలుగేళ్ళు నిండి ఐదవ ఏడు వచ్చింది. ఉపనయన వయస్సు రా నక్కఱ లేదు మన శంకరబాలునికి. దైవజ్ఞులచే మంచి ముహూర్తం స్థిరపరచారు. చుట్టాలు, పక్కాలు, ఊరివారందరు, ఎందరో పండితప్రకాండులు వీరు వారన నేల: నేల ఈనినట్లుగా ఆ అవతారపురుషుని ఉపనయనమహోత్సవాన్ని చూడడానికి వేంచేశారు తండోపతండాలుగా. వటువు తండ్రి లేడన్న చింత తక్క మరో చీకు లేదు శంకరుని తల్లికి. మహర్షుల సన్నిధానంలో జరిగింది ఆ వేదవిహిత ప్రక్రియ. వేదవిదుల ఆశీర్వచనాలు, బ్రహ్మచారికి ఉపయుక్త మయ్యే కానుకలు ఎన్నలేని వెన్నో అందాయి వటువుకు. పసుపు రంగు కౌపీనం ధరించి అదే రంగు యజ్ఞోపవీతం మెడలో ఉండగా, చేత పలాశ దండాన్నీ, చంక నొక జోలెని, జలపాత్రను ధరించిన నూతన వటువు బ్రహ్మసన్నిధానంలో తొలిగా మాతృదేవికి భిక్షావందన మాచరించాడు. ఆ నాటితో రెండవ జన్మ ఆరంభమయ్యింది శంకరునకు. ద్విజుడైన శంకరుని బ్రహ్మవర్చస్సు అసమానం అద్వితీయం.

## 2.12 వేదాధ్యయనము

ఉపనయన మయ్యాక వచ్చే శ్రావణ పౌర్ణమినాడు నూతన వటువుకు ఉపాకర్మ చేయడం సాంప్రదాయం. ఆ పిమ్మటే వానికి వేదాధ్యయనాధికారం

లభిస్తుంది. యధావిధిగా శంకరునికి ఉపాకర్మ జరిపించింది ఆర్యాంబ. తరువాత గురువుల కప్పగించింది తనయుణ్ణి. గురువుల పెదవులు చూచే శంకరు డందుకుంటున్నాడు. వేదవిద్య అసమానమైనది. మన భారతభూమి పలు విధాల భిన్న భిన్న సంప్రదాయాలకు ఆటపట్టు. ఆహారవ్యవహారాలలో, భాషాపద్ధతులలో చాలా వైవిధ్యం ఉన్నప్పటికీ అతిప్రాచీనమైన సంస్కృతి మనది. దానికి జీవగఱ్ఱ వేదాలు. దేశ ప్రజల నందరినీ ఏకసూత్రబద్ధులను చేసేదే వైదిక ధర్మ సంస్కృతి. అపౌరుషేయాలయిన వేదాలను పరమాత్ముని ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలుగా వర్ణిస్తారు. ఒక్కొక్క వేదం పదిరెండేడులు చొప్పున నాలుగు వేదాలు నేర్వడానికి నలుబదిఎనిమిది ఏళ్ళుపట్టుతుంది. ఊహింపరాని అద్భుత శక్తియుక్తుడైన శంకరునికి మాత్రం అత్యల్ప కాలంలోనే స్వాధీన మయ్యాయి వేదాలు సర్వస్వమూ. పరాత్పరుడే తన శిష్యు డయ్యాడని పొంగిపోతున్నాడు శంకరుని గురుడు. బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబిస్తూ మధూకరవృత్తితో ఆదర్శరీతిలో గురువుల కడ విద్య నభ్యసిస్తున్నాడు.

## 2.13 బంగరు ఉసిరిక పండ్ల వాన

దండమూ. జలపాత్ర, జోలె ధరించి కౌపీనధారియై భిక్షాటనకై బయలుదేరాడు శంకరవటుడు. వామనమూర్తి వస్తున్నాడని వీధుల్లో వ్రేళ్ళాడి చూచేవారు అతణ్ణి. ఒక ఇంటి ముందు నిలబడి 'భవతీ భిక్షాం దేహి' అన్నాడు. ఆ ఇంటి ఇల్లాలు విన్నదా పిలుపు. ప్రత్యక్షంగా నైనా చూడ నోచుకోని పరిస్థితి. తలుపు సందు ద్వారా చూచింది. భిక్ష పెట్టడానికి పట్టెడన్నమయినా లేదు. ఆమెకు ఏమీ తోచక కండ్లు గిర గిర తిరిగాయి. దుఃఖ మాపుకోలేక భగవంతుని తలచుకొని ఇలా పరితపించింది: 'పరాత్పరా! కట్ట బట్టా, తిన తిండీ లేని బ్రతుకిచ్చావు. ఇటువంటి పుణ్యపురుషునికి పట్టెడు పెట్టే భాగ్యం నా కెప్పుడు వస్తుందో కదా! ఈ దీనురాలి యెడ దయతో ఏదైనా దారి చూపించవా!'. బ్రహ్మచారి నుద్దేశించి 'నాయనా! నా నాథుడు గ్రామం లోనికి వెళ్ళి యున్నాడు. కనికరించి కొంచెము సేపు

కూర్చుండవా' అని వేడుకొన్నది. అది విన్న శంకరుడు ఆ ఇంటి వైపు చూచాడు. ఆ యిల్లు వారి కాశ్రయమిచ్చే గృహం కాదు, చంద్రార్కుల కాపురమని గ్రహించాడు. ఆ ఇల్లాలు వైపు తిరిగి 'అమ్మా! నీ బిడ్డని చేతిలో ఒక ఉసిరిక ఫలం ఉంది. అది నాకు భిక్షగా జోలెలో పడవేయుము' అని అడిగాడు. వెంటనే తన కుమారుని చేత నున్న ఉసిరిక ఫలాన్ని శుభ్రంగా కడిగి పరమ భక్తి భావంతో బ్రహ్మచారి జోలెలో వేసి నిట్టూర్చింది.

ఆ ఇల్లాలి దీనావస్థ చూచిన శంకరబాలుని హృదయం ద్రవించి పోయింది. శ్రీ మహాలక్ష్మిని తలంచి మహాదేవికి ఆయత్తం చేసి ఈ విధంగా స్తోత్రం చేసాడు.

"అఙ్గం హరేః పులకభూషణ మాశ్రయన్తీ, భృఙ్గాఙ్గనేన ముకులాభరణం తమాలం
అఙ్గీకృతాఖిల విభూతి రపాఙ్గలీలా, మాఙ్గల్యదాఽస్తు మమ మఙ్గల దేవతాయాః ॥

ముగ్ధా ముహుర్విదధితీ వదనే మురారేః, ప్రేమత్రపా ప్రణిహితాని గతాగతాని,
మాలాదృశోర్మధుకరీవ మహోత్పలేయా, సామే శ్రియందిశతు సాగర సంభవాయాః ॥

విశ్వామరేన్ద్ర పదవిభ్రమ దాన దక్ష, మానన్ద హేతు రధికం మురవిద్విషోఽపి
ఈష న్నిషీదతు మయి క్షణమీక్షణార్థ, మిన్దీవరోదర సహోదర మిన్దిరాయాః ॥

ఆమీలితాక్ష మధిగమ్య ముదా ముకున్ద, మానన్ద కన్ద మనిమేష మనఙ్గతన్త్రం,
ఆ కేకర స్థిత కనీనిక పక్ష్మ నేత్రం, భూత్యై భవేన్మమ భుజఙ్గ శయాఙ్గనాయాః ॥

కాలామ్బుదాళి లలితోరసి కైటభారే, ర్ధారాధరే స్ఫురతి యా తటి దఙ్గనేవ
మాతుస్సమస్తజగతాం మహనీయమూర్తి, ర్భద్రాణిమేదిశతు భార్గవనన్దనాయాః ॥

బాహ్వన్తరే మురజితః శ్రితకౌస్తుభేయా, హారావళీన హరినీలమయీ విభాతి
కామప్రదా భగవతోఽపి కటాక్షమాలా, కల్యాణ మావహతు మే కమలాలయాః ॥

ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్, మాఙ్గల్యభాజిమధుమాథిని మన్మథేన
మయ్యాపతేత్తదిహ మన్థర మీక్షణార్థ, మన్దాలసంచ మకరాలయ కన్యకాయాః ॥

దద్యాద్దయానుపవనో ద్రవిణాంబుధారా, మస్మిన్నకిఞ్చ నవిహఙ్గ శిశౌ విషణ్ణే
దుష్కర్మ ఘర్మమపనీయ చిరాయదూరం, నారాయణ ప్రణయినీ నయనాంబువాహః ॥

ఇష్టా విశిష్టమతయోఽపి నరాయయాద్రాగ్, దృష్టాస్త్రివిష్టప పదం సులభం భజన్తే,
దృష్టిః ప్రహృష్టకమలోదర దీప్తిరిష్టాం, పుష్టిం కృషీష్ట మమ పుష్కర విష్టరాయాః॥

గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి, శాకంభరీతి శశిశేఖర వల్లభేతి,
సృష్టి స్థితి ప్రళయ కేళిషు సంస్థితాయా, తస్యై నమ స్త్రిభువనైక గురో స్తరుణ్యై ॥

శ్రుత్యై నమోఽస్తు శుభకర్మఫలప్రసూత్యై, రత్యై నమోఽస్తు రమణీయగుణార్ణవాయై
శక్త్యై నమోఽస్తు శతపత్రనికేతనాయై, పుష్ట్యై నమోఽస్తు పురుషోత్తమ వల్లభాయై ॥

నమోఽస్తు నాళీక నిభాననాయై, నమోఽస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై
నమోఽస్తు సోమామృత సోదరాయై, నమోఽస్తు నారాయణ వల్లభాయై ॥

నమోఽస్తు హేమామ్బుజ పీఠికాయై, నమోఽస్తు భూమణ్డల నాయికాయై
నమోఽస్తు దేవాది దయాపరాయై, నమోఽస్తు శార్ఙ్గాయుధ వల్లభాయై ॥

నమోఽస్తు దేవ్యై భృగు నన్దనాయై, నమోఽస్తు విష్ణో రురసిస్థితాయై
నమోఽస్తు లక్ష్మ్యై కమలాలయాయై, నమోఽస్తు దామోదరవల్లభాయై ॥

నమోఽస్తు కాన్త్యై కమలేక్షణాయై, నమోఽస్తు భూత్యై భువన ప్రసూత్యై
నమోఽస్తు దేవాదిభి రర్చితాయై, నమోఽస్తు నన్దాత్మజ వల్లభాయై ॥

సమ్పత్కరాణి సకలేన్ద్రియ నన్దనాని, సామ్రాజ్యదాన నిరతాని సరోరుహాక్షి
త్వద్వన్దనాని దురితాహరణోద్యతాని, మామేవ మాత రనిరశం కలయన్తు మాన్యే ॥

యత్కటాక్ష సముపాసనా విధిః, సేవకస్య సకలార్థ సంపదః
సన్తనోతి వచనాఙ్గ మానసైః, స్త్వాం మురారి హృదయేశ్వరీం భజే ॥

సరసిజ నయనే సరోజహస్తే, ధవళతమాంశుక గంధమాల్యశోభే,
భగవతి హరివల్లభే మనోజ్ఞే, త్రిభువన భూతికరి ప్రసీద మహ్యమ్ ॥

**దిగ్ఘస్తిభిః కనకకుమ్భ ముఖావసృష్ట, స్వర్వాహినీ విమల చారు జలప్లుతాఙ్గీం**
**ప్రాతర్నమామి జగతాం జననీ మశేష, లోకాధినాథ గృహిణీ మమృతాబ్ధిపుత్రీమ్ ॥**

**కమలే కమలాక్ష వల్లభే త్వం, కరుణాపూర తరఙ్గితై రపాఙ్గైః**
**అవలోకయ మా మకించనానాం, ప్రథమం పాత్ర మకృత్రిమం దయాయాః॥**

**స్తువన్తి యే స్తుభిరమాభిరన్వహం, త్రయీ మయీం త్రిభువన మాతరం రమాం**
**గుణాధి గురుతర భాగ్య భాజినో, భవన్తి తే భువి బుధభావితాశయాః ॥"**

పై విధంగా మృదువుగాను, మధురంగాను శ్రీమహాలక్ష్మీకటాక్షం కోసం చేసిన స్తోత్రాన్ని విని ఆ శశిసోదరిసాక్షాత్కరించింది. చల్లని చూపులు ప్రసరిస్తున్న ఆ దేవి వంక తిరిగి ఇలా ప్రార్థించాడు బాలశంకరుడు. "అమ్మా! ఈ గృహిణి పుణ్యవతి కడు బీదరాలు. లేమి వెతతో బ్రదుకుటకు కష్టపడుతున్నది. జాలి వహించి ఈమెను అనుగ్రహించు". దానికి శ్రీమహాలక్ష్మి ఈ విధంగా సెలవిచ్చింది: "శంకరా! వీరలు పేదలని కదా నీ పరితాపము? పూర్వజన్మలో ఏ కొలది పుణ్యము చేసికొనరైరి. ఈ జన్మలో భాగ్యమెట్లు ప్రాప్తించును?" నిశ్శంకగా తేల్చి చెప్పిన ఆ మహాలక్ష్మి మాట విని శంకరుడు మరల ఈ విధంగా దేవిని వేడుకొన్నాడు. "సర్వమంగళ దేవతవు. సర్వలోకాధీశుని సంతోషపెట్టగల నీ శక్తి అపారం. ఈ చిన్న పని నీకు లెక్క లేదు. సాగరసుతవు. సాగరాన్ని మించిన దయాంబురాశివి. కల్పవృక్షాన్ని మించిన భాగ్యదవు. ఈమె ముందు జన్మలో ఏ పుణ్యమూ చేసి ఎఱుగ దన్నావు. మరి ఈ జన్మలో ఇప్పుడే నాకు ఉసిరికఫలం ఇచ్చింది. తత్ఫలితం ఎప్పుడో కాక ఇప్పుడే ప్రసాదింపవా! నీ అనుగ్రహా మున్న లోటేమి?" అని వేడిన ఆ అపురూపపు బ్రహ్మచారి కోరికను మన్నించి కరుణా తరంగిణియైంది. సిరుల రాశి చూపుల దయాప్రవాహం కనకధారాపాతమై ఆ పేదరాలి ఇల్లూ, వాకిలీ బంగారు ఉసిరిక పండ్లతో నిండిపోయింది. ఆ మహాదేవి కరుణతో సాధ్యము కానిదేది? నరుడామె

అండతో ధీనిధి అగును. కులీనుడగును. వేయేల ఆ తల్లి కరుణించిన జీవి ధన్యాత్ముడగును. (యస్యాస్తి విత్తం సనరః కులీనః సపండితః స్వశ్రుతిమాన్ గుణజ్ఞః స యేన వక్తా స చ దర్శనీయః సర్వే గుణాః కాంచన మాశ్రయన్తే). ఆ నాటి నుండి నేటికీ ఆ కనకధారాస్తవం అత్యంత ప్రస్తుతి కెక్కినది.

## 2.14 శంకరుని విశాలాశయము

పేదవారిని చూచి జాలి పడడం ఒక వంతు. కొందరు ఓదారుస్తారు శుష్కవాక్కులతో. దానివలన కలిగే ప్రయోజనం శూన్యమే కాక మానసిక దౌర్భాగ్యానికి దారి తీయవచ్చు. ఉపకారసాహాయ్యం అందించ కుండా కనబరచే సానుభూతి నిష్ఫలం. శక్తి కలిగిన మేరకు ఆదుకోవాలి తమ కన్న తక్కువ స్థితిలో నున్న తోడివారిని. బాలుడు శంకరుడు తన శక్తి చూపించాడు ఆదుకున్నా డొక పేద రాలిని. ఆ నాటి మధూకరం శంకరునికి పూర్తి కాలేదు. ప్రక్క నున్న సంపన్నగృహాన్ని చేరడమే తరువాయి ఆ యింటి యజమాని సిద్ధంగా ఉన్నాడు భిక్ష చేత్తో పట్టుకొని. ఆ పెద్ద మనిషిని చూచి నిష్కర్షగానే ఇలా చెప్పాడు. “సంఘంలో మసలుతూ తోడి వారిని ఆదరించని వారొసంగిన భిక్షాహారం భుజిస్తే న్యాయభావం జనిస్తుందా?” మొదట ఆ మాటలా గృహస్థుని కర్థం కాక వివరంగా శంకరుడు చెప్పాక విని పరివర్తన రాగా బాలశంకరుని కాళ్ళపై బడి “స్వామీ! నా మాట వినండి. ఈ క్షణం నుండి నా ధనాన్ని ధర్మానికి ఉపయోగిస్తాను. మీ పాదాలే సాక్షి” అని నివేదించుకొన్న భాగ్యశాలి నిజమైన భాగ్యశాలి అయ్యాడు ఆ క్షణం నుండి.

## 2.15 గురుకులవాస విశిష్టత

ఆనాటి విద్యావిధానం నేటివలె కాక పూర్తిగా వేరుగా ఉండేది. ఎంత తరచి చూచినా పోలిక లేమీ పొడగట్టవు. నాటి పద్ధతుల వలన బాలురలోని సుషుప్తశక్తులను వెలికి తీసి వికసింపజేయగల మెలకువ లుండేవి. నిజమయిన పౌరులను తయారు చేసే విధంగా కొనసాగే వా గురుకులవాస

పద్ధతులు. కేవలం ఉపన్యాసాలు విని, గ్రంథాలు చదివితే సర్వంకషంగా సాంఘిక జీవన యానానికి ఉపయుక్తమైన జ్ఞానం అలవడదు. అది సరియైన శిక్షణతోనే లభిస్తుందన్న విశ్వాసమే ఆనాటి గురుకులవిద్యారంగానికి మూలసూత్రం. ఆ శిక్షణలో మొదటిది మధూకరవృత్తి అనబడే భిక్ష. తేనెటీగలూ, తుమ్మెదలూ పుష్పాల లోని తేనెను సంపాదించుకొనే విధానం. ఆ వ్యాసంగంలో వినయము, విధేయత బలపడి దురభిమానాన్ని దూరం చేస్తుంది. నమ్రతతోడి భక్తి, శ్రద్ధ, సహపౌరులపై ప్రేమ జనింప చేస్తాయి. భవిష్యత్తుకు మంచి బాట విద్యార్థులకు పడడమే కాక, లేత ప్రాయములో ఉన్న వారిని చూచిన పెద్దలకు వాత్సల్యం పొడచూపుతుంది. గురుకులంలో గుంట ఓనమాలు నేర్పరు. అవన్నీ ముందుగా ఇంట్లోనే నేర్చుకొని ఉండాలి. గురుకులవిద్యార్థికి విత్తంతో పని లేదు. వేదాలు వేదాంగాలు క్షుణ్ణంగా అభ్యసించే వారు. విద్యాపాటవానికి పేరెన్నిక గన్న నాటి భారత దేశం లోని విశ్వవిద్యాలయాలకు దేశదేశాల నుండి వచ్చి నేర్చుకొనే వారని చరిత్రలు చెప్పుచున్నాయి.

## 2.16 భరద్వాజుడు, వేదాలు

పూర్వం భరద్వాజముని బ్రహ్మచర్య వ్రతమూని వేదాలను నేర్చుకోవడం మొదలు పెట్టాడట. ఆయనకున్న మూడు బ్రహ్మకల్పాల ఆయువు ఐపోవచ్చింది కాని వేదాధ్యయనం పూర్తి కాలేదు. అప్పుడు అధ్యయనం కట్టిపెట్టి ఆయువు కోసం ఘోరతపస్సు చేయగా మెచ్చిన బ్రహ్మగారు దేవేంద్రుణ్ణి పంపించి ఆయన కేమి కావాలో చూడమన్నాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై మరొక బ్రహ్మకల్పం ఆయుష్షు ప్రసాదిస్తూ అడిగాడు భరద్వాజుని ఈ ఆయువుతో ఏమి చేద్దా మనుకొంటున్నావని. భరద్వాజుడు వేదాధ్యయనం పూర్తి చేద్దామని. ఇంద్రుడు చూపించా డావేదరాశిని. మహామేరుపర్వతాల్లాగ కోటి సూర్యుల కాంతికి మించిన ప్రకాశంతో వెలుగుచున్న వేదాలను కంటితో చూడలేకపోయాడా మహాముని. మూడు

వేదాల పుంజాలను ఋషి మ్రోల పెట్టి వీటితో సరిపెట్టుకో. గృహస్థాశ్రమం చేకొని శిష్యులకు చెప్పుకొంటూ ఈ కల్పం గడుపుకో అని. మూడు గుప్పెళ్ళుగా ఇంద్రుడిచ్చిన వేదరాశులు కలగాపులగంగా ఉండి పోయాయి. బ్రహ్మ అంశంతో అవతరించిన కృష్ణద్వైపాయనుడు వాటిని నాలుగు భాగాలుగా చేసే వరకు. అలా వెలసిన ఋగ్వేదము, సామవేదము, యజుర్వేదము, అధర్వవేదము దైవప్రసాదితము లైన అనంత విజ్ఞానఖనులు. వేదవ్యాసుడు పైలునకు, వైశంపాయనునకు, జైమినికి, సుమంతునకు ఒక్కొక్కరికి ఒక్క వేదం చొప్పున ఉపదేశించాడు.

## 2.17 శంకరుడు పూర్ణానదిని తన ఇంటికి తెచ్చుట

అది మండు వేసవి. మిట్టమధ్యాహ్నవేళ. నిప్పులు చెరిగే మండుటెండకు వడగాడ్పు తోడయ్యింది. ఆర్యాంబ పూర్ణలో మునిగి బిందెడు నీళ్ళు తెచ్చుకొందామని బయలుదేరింది. నది ఊరికి ఎంతో దూరంలో లేదు. ఇసుకదారిలో వెళ్ళాలి. కొంత దూరం వెళ్ళాక ఆర్యాంబ కాళ్ళు కాలి, తల మాడిపోయి ఒళ్ళు తెలియక పడిపోయింది. ఒక పుణ్యాత్ముడు చూచి లేవనెత్తి ఉపచారాలు చేసాడు. శంకరునికి కబురు చేశాడింకొకాయన. ఆర్యాంబను ఆ ఊరిలో అందరు తల్లిగా ఎంతో గౌరవంగా చూసికొనేవారు. పరుగున వచ్చి తల్లిని చూచాడు శంకరుడు. ఇంటికి చేర్చి అక్కడ ఉపచర్యలు చేస్తున్న కొడుకును చూచి ఆమె అడిగింది: “నాయనా! ఈ మండుటెండలో ఎలా రాగలిగావు? నాకోసం ఎంత శ్రమపడుతున్నావో కదా!” అంటూ కుమారుని చూచుకొని కడుపు కద్దికొంది. అప్పుడన్నాడు తల్లితో: “అమ్మా! పెద్దదాని వయ్యావు. ఈ వయస్సులో ఎందుకిలా శ్రమపడతావు. ఇంటి దగ్గఱ నూయి ఉన్నది కదా. ఆ నీళ్ళు వేడిచేసికొని వేన్నీళ్ళ స్నానం చేసుకో వచ్చు గదా. నేనే నూతిలో నీళ్ళు తోడి పెడతాను. రోజూ రెండు తడవులు నదికి వెళ్ళి రావడం ఎంత కష్టమో తెలుసా? శ్రమపడకు. నదికి వెళ్ళకు” అంటూ కాళ్ళా వ్రేళ్ళా బ్రతిమిలాడాడు. ఆ బిడ్డ మాటలకు ఆనందంలో మునిగిన తల్లికి ఆనందబాష్పాలు జలజలారాలుతుండగా “నాయనా! నీవింకా పసి

పాపవు. నీవు నీళ్ళు తోడడ మేమిటి? అంతమాట అన్నావు. నాకదే ఆనందం. మీ నాన్న గారు కూపోదకం స్నానానికి పనికి రాదన్నారు." అని చెప్పింది ఆర్యాంబ. ఇంక మా అమ్మ నదికి వెళ్ళడం మానుకోదు అని ఎఱిగి ఆ తల్లితో అన్నాడు. "అమ్మా! నీ మాట కాదంటానా? నీ పాదాల కడకే వస్తుందిలే ఆ మహానది. ఇంక నీ ఇష్టం వచ్చినట్లు స్నానాలు చేయవచ్చు" అని చక్కున అన్నాడు.

ఆ మాటల లోని ప్రేమాధిక్యాన్ని గుర్తించిన ఆర్యాంబ సంబరపడి పోయింది. అమ్మ చంక దిగి అటూ ఇటూ తిరుగుచున్న శంకరుని మనస్సులో పట్టుదల ప్రవేశించింది. తిన్నగా పూర్ణానదీతీరం చేరాడు. రెండు చేతులనూ మొలకు ఆన్చి అలనాడు గంగ రాకకై ఎదురు చూస్తున్న గరళకంఠునిలా పూర్ణానది వైపు తిరిగి చూపు నిలిపి తన అభీష్టం తెలిపే మౌనంగా ఒక క్షణం నిలబడ్డాడు. గిఱ్ఱున ఇంటికి తిరిగి వచ్చాడు. ప్రొద్దు గ్రుంకే సమయం అది. వాతావరణం క్షణంలో మారింది. ఆకసాన నిండా కప్పిన కారు మబ్బులు. ఉఱుములూ, మెఱుపులతో పిడుగులతో ప్రారంభమై చినుకూ చినుకూ గాలి వానగా మారి ఊరుకోక కుండపోతగా కురిసింది వర్షం. రాత్రంతా ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లు కని విని ఎఱుగని వర్షం. ఆ నీరంతా పూర్ణానది తన పొట్టలో ఇమిడ్చుకొని పొంగు హద్దు మీరగా ఊరు మీదకు వచ్చింది. వచ్చి వచ్చి శంకరుని ఇంటి గుమ్మం ప్రక్కగా ఒరుసుకొని వెళ్ళింది. ఆర్యాంబ తలుపు తీసికొని చూచుకొనే సరికి పూర్ణానది తన గుమ్మం దగ్గఱగా ప్రవహించడం చూచింది. "అమ్మా! చూచావా! పూర్ణకు నీ మీద నున్న ప్రేమ." అని చమత్కరించాడు. "బాల వాక్యం బ్రహ్మవాక్యం" అన్నారు పెద్దలు.

## 2.18 కేరళదేశాధిపతి పిలుపు

ఆ ప్రాంతాన్ని పాలించే నృపాలుడు రాజశేఖరుడు అను పేరు గలవాడు. ధర్మపాలన చేస్తూ, దేశానికి రక్షణ ఇస్తూ, భక్తులనూ యతులనూ గౌరవిస్తూ, ప్రజలకు ప్రీతిపాత్రుడై ఏలుతున్నాడు. బాలుడై బ్రహ్మచారియై, విద్యావినయ

సంపత్తులలో అద్వితీయుడై విఖ్యాతి నందుకొనుచున్న అద్భుత బ్రహ్మచారిని కనులారా చూడాలనిపించి, కబురంపించాడు యోగ్యుడైన మంత్రిని శంకరుని వద్దకు పంపి. రాజాజ్ఞ శిరమున దాల్చి పరివారంతో ప్రయాణమైన మంత్రి కొన్ని రోజులకు శంకరుని ఊరు చేరుకొన్నాడు. శంకరబాలుని చేరి నమస్కారము లర్పించి వినయం ఉట్టిపడేటట్లు ఇట్లా నివేదించాడు: “స్వామీ! మన కేరళదేశానికి రాజుగా ఉన్న రాజశేఖరుడు పంపగా రాజాజ్ఞానుసారం మీ దర్శనానికి వచ్చాము. మన రాజు ఎల్లవేళలా ప్రజాభీష్టాన్నే కోరుకొంటూ ప్రజలను తన బిడ్డల వలె చూచుకొనుచున్న వాడు. సామంత మంత్రి సేనానాయక పండిత ప్రముఖకళావిదులతో నిండిన నిండు సభలో కొలువుండి శాస్త్ర చర్చలతో ధర్మసందేహ విచారణలతో అనునిత్యము గడపడం, ధర్మం ఉన్నచోటే జయమున్నదని నమ్ముతున్నవాడు. తమ కీర్తిప్రభలకు అత్యంతం సంతోషితుడై, తమ పాదధూళితో మా రాజభవనాన్ని పావనం చేయాలని కోరుకొంటూ మీకు విన్నపం సమర్పించమన్నాడు. మీ రాకతో రాజగృహమే కాక కేరళ రాజ్యమే సుఖంగా ఉంటుంది. మా రాజు కోరికను మన్నించి దయచేయండి”. దానికి సమాధానంగా శంకరు డిట్లా అన్నాడు: “నేను బ్రహ్మచారిని. బ్రహ్మచర్య వ్రతాన్ని నియమబద్ధంగా ఆచరించాలి కదా. మూడు వేళలా స్నానాలు చేస్తూ సంధ్యోపాసన చేయాలి. దినకరుణ్ణీ, పావకుని, గురువులనూ తప్పక కొలువాలి. అర్హదినాలలో ఉపవాసాలు చేయాలి. తక్కు సమయాలలో వేదాన్ని అధ్యయనం చేయాలి. శిష్యులకు విద్య గఱపాలి. మా తల్లి పెద్దది. ఆమె సంరక్షణ చేయాలి. ఇక తీరిక ఎక్కడుంటుంది చెప్పండి? ఈ పరమ పునీతమైన నియమాలను విడనాడి గజ వాహనాలు, రాజభోగాలు మాకేల? మా సందేశంగా రాజున కిట్లనుడు: పితృదేవతలకు ఋషులకు ప్రజలు ఎప్పుడూ ఋణపడి ఉంటారు. ఎందుకంటే వారు ప్రజల శ్రేయోభిలాషులు. రాజా! ప్రజలు ఆ ఋణం తీర్చుకొనేటట్లు కనిపెట్టాలి. ఆ విధులన్నీ జనులు

పాటించేలా చూడడం నీ బాధ్యత". సందేశం పంపాడు శంకరుడు.

## 2.19 శంకరుని కడకు రాజు వచ్చుట

ఆతృతతో ఎదురుచూస్తున్న రాజును కలిసి విన్నవించాడు మంత్రి: "మహారాజా! అ శంకరుడు కేవల బ్రహ్మచారి కాదు. మానవరూపంలో ఉన్న జగదీశ్వరుడే, సందేహము లేదు. ఏ పూర్వ పుణ్యఫలమో మా కాయన దర్శన మయినది. కైలాసవాసునిలా బాలసూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. ఏడేండ్లు నిండ లేదు. అతని మేను మల్లెపూరంగును మించి మిల మిల మెఱసిపోతున్నది. ఆయన ఏ మణులు ధరించలేదు. ధరిస్తే ఆ మణులే ఈ మహానుభావుని తేజస్సులో మాయమౌతాయి నిస్సందేహంగా. ముఖాన్ని చంద్రబింబంతో పోల్చడం కవుల చేతకానితనం అవుతుంది. కండ్లు రెండూ సూర్యచంద్రులే. ఆ బాలశంకరుని చూడగా చూడగా ఒకప్పుడు భారతి వలెను, ఒకసారి మహేశ్వరుని వలెను, మరొకపరి కమలనాభునిలా కన్పట్టుతాడు. ప్రభూ! పంచభూతాలు, అష్టదిక్పాలకులూ, ఇంద్రాది దేవతలూ, రుద్రగణాలు, పదునాల్గు భువనాలు, సమస్త చరాచర సృష్టి జాల మంతా ఆయనలోనే ఇమిడి పోయి నట్లగపడుతుంది" అని పరమానందంతో శంకరుని సందేశాన్ని కూడా రాజుకు తెలియ జేసాడు మంత్రి. "మంత్రిశేఖరా! ఇంక తడవెందుకు? సుముహూర్తం నిర్ణయం చేసి మన ప్రయాణానికి సన్నద్ధం చేయండి" అని రాజాదేశించాడు.

రాజు, పరివారము శంకరుని ఊరు చేరగానే ఊరు బయట దూరంగా నిర్మించిన డేరాలలో పరివారాన్నుంచి రాజశేఖరుడు ఒక్కడు పాదచారియై వడి వడిగా అడుగులు వేసికొంటూ శంకరుని దర్శనానికి బయలుదేరాడు. అల్లంత దూరాన ఉన్నప్పుడు రాజుకు మహాద్భుత దృశ్యాలు కన్పట్టాయి. ఒక దివ్య సభ కండ్లకు కనబడింది. మహర్షిగణాల మధ్య శారదాదేవితో చతురాననుడు సింహాసనాసీనుడై ఉన్నాడు. "ఆహా! సత్యలోకమా! ఏమి

అదృష్టము!"అనుకొను నంతలో దృశ్యం చెల్లాచెదరయ్యింది. ఇంతలో మరొక దృశ్యం. తెల్లని పాలసముద్రం. ఆదిశేషుని పాన్పుపై పద్మనాభుడూ, పాదాలొత్తుతున్న లక్ష్మీదేవి. ప్రక్కనే శూలము, కపాలము, దండము చేతులలో ధరించి మెడలో సర్పహారాలతో గరళకంఠుడు, సామగాన మాలపించు నారదాది దేవర్షులు పరివేష్ఠించి ఉన్న పరమాత్ముని ప్రార్థిస్తున్నాడు రాజు. ప్రార్థన ముగియు నంతలోనే ఆ దృశ్యం తెర మఱుగైంది. మరి కొంత దూరం వెళ్ళాక ఇంకొక దివ్యదర్శనం. మేరుపర్వతం మీద పార్వతీపతి తాండవ నృత్యం చేస్తున్నాడు. ప్రక్కనే గిరిజాదేవి ఎద్దు మీద చేయి వేసి ఆన్చి నిలబడి ఉంది. నారదాదులు నమస్కరిస్తున్నారు. తమ సతులతో బ్రహ్మ, విష్ణుమూర్తి, దేవేన్ద్రుడు విచ్చేసి ఉన్నారు. గంగాధరునితో వారందరూ ఏవేవో అడుగుతున్నారు. వారి వారి కోరికల్ని ప్రసాదిస్తూ అతి శీఘ్రంగా బయలుదేరాడు పశుపతి. ఆ దృశ్యం చూచీ చూడకుండానే అంతలో అదృశ్య మయ్యింది. అక్కడ నలుగురు బ్రహ్మచారులున్నారు. గోష్పాదమంత శిఖ, తెల్లని యజ్ఞోపవీతము, చేత పాలాశదండము, మొలకు మౌంజి త్రాడు, వెన్నరంగు శరీరచ్ఛాయ కలిగి తామర రేకల వంటి కన్నులతో, తెల్లని కౌపీనము, విభూతి రేఖలు, మొలకు కృష్ణాజినము ధరించి దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు బాలుడు ఏడెనిమిది ఏండ్ల ప్రాయము వాడు. ఆ బాలుడే తా కలుసుకొనడానికి వచ్చిన దివ్యబాలుడని ఎవరూ చెప్ప నక్కఱ లేకుండానే తెలిసిపోయింది రాజుకు. భక్తితన్మయుడై సాష్టాంగ నమస్కారం చేశాడు. శంకరుని ఆశీర్వచనం విని లేచాడు. ముకుళిత హస్తుడై కులగోత్రాలు చెప్పుకొని వినయవిధేయతలతో నిలబడ్డాడు రాజశేఖరుడు. తనకు దగ్గఱగా ఒక దర్భాసనం ఇచ్చి కూర్చోబెట్టినాడు. సింహాసనమూ, హంసతూలికా తల్పమూ ఈ దివ్యదర్భాసనానికి సరి రావనిపించింది రాజశేఖరునికి. బ్రహ్మచారికి నమస్కరిస్తూ "మహానుభావా! అనేకజన్మలలో సంపాదించు కొన్న పుణ్యం తమ దర్శనంతో పండింది. నేను, నా కుటుంబము, నా ప్రజలు పరమపవిత్రులం అయిపోయాము నేడు. మీరందించిన సందేశం

నాకు శిరోధార్యం. తప్పక అలాగే ఆచరిస్తాను” అని పరమానందపూర్వకంగా నివేదించుకొన్నాడు రాజు శంకరునితో.

రాజు మాటలకు సంతోషించిన శంకరుడు అతనితో ఈ విధంగా ప్రసంగించాడు: “రాజా! నీకు కుశలమే కదా! నీ పేరు ప్రసిద్ధమైనది. ధర్మాన్ని తప్పకుండా పాలిస్తున్నావు కదా! ఎల్లవేళల రాజ్యప్రజల గురించి ఆలోచిస్తున్నావు కదా! దేశంలో అందరూ ఎవరి వృత్తులు వారు నిర్వర్తిస్తున్నారు గదా! విజ్ఞులైన పండితులను, దైవజ్ఞులను ఆదరిస్తున్నావు కదా! సమర్థులైన వారినే తగు స్థానములలో నియమిస్తున్నావు కదా! దుర్గాల్ని వైరి దుర్భేద్యంగా కాపాడుకొంటున్నావు కదా! ధరాతలం సస్య శ్యామలంగా ఉన్నదా! ” ఈ విధంగా యోగక్షేమాలు అడిగి తెలిసి కొన్నాడు ఆ విశిష్ట వటువు. శంకరునికి వందనం చేసి, విడచి వెళ్ళలేక వెళ్ళలేక సెలవు తీసికొన్నాడా రాజశేఖర ప్రభువు తన జన్మధన్యమైనదన్న సంతుష్టితో.

## 2.20 రాజుకు శంకరుని వరము

వెళ్ళే ముందు రాజుకు ఒక కోరిక ఉదయించింది. రాజశేఖర మహారాజు కేవలం ప్రతాపవంతుడైన ప్రభువు మాత్రమే కాదు. కవి, విద్వాంసుడు, శాస్త్రకోవిదుడు. నిత్యము కవితా రసాస్వాదనలో తనియు కళాప్రపూర్ణుడు. రాజశేఖరుడు ముచ్చటగా మూడు నాటకాలు రచించాడు సంస్కృతభాషలో. తన ఆస్థానంలో నున్న కవులు పండితులు ఎంతో మెచ్చుకొన్న కృతులవి. కాని రాజుకు తృప్తి లేదు. ఏలన రాజు కదా అని విరుద్ధంగా ఎవరు మాట్లాడుతారు? శంకరుడు సహజకవీంద్రుడని విని ఆయన అభిప్రాయమే విశ్వసనీయమని తలచి శంకరుని చేరి ఒక పళ్ళెరములో పది వేల బంగారు నాణెములను ఉంచి, అందులో తాను రచించిన నాటక ప్రతులను పెట్టి భక్తితో శంకరునికి సమర్పించాడు. “స్వామీ! ఈ నాటకాలు మూడూ నాచే దేవభాషలో రచించబడినవి. దయతో తాము ఒక్కపరి పరిశీలించిన నా ఆనందానికి మేర ఉండదు తమ అభిమతాన్ని

ప్రసాదించెదరు గాక!" వినయభయభక్తులతో వేడుకొన్నాడు. అపుడు శంకరుడు రాజుకు నాటకాల నందిచ్చి చదివి వినిపించ మన్నాడు. ఇష్టదేవతా ప్రార్థనలు చేసి రాజశేఖరుడు రమ్యమైన స్వరంతో శ్రావ్యంగా వినిపించాడు తన రచనలను శంకరునికి. "రాజశేఖరా! నీ నాటకాలు పండితులనూ, కవులనూ అలరించేలా నవరసపూర్ణమై క్రొత్తపోకడలతో ప్రకాశిస్తున్నాయి. నాకు ఆనందాన్నిచ్చాయి. అందు వలన నేను నీకొక వర మీ దలచాను కోరుకో రాజా!" అని పలికిన బాలుని మాటలకు ఉబ్బి తబ్బిబ్బయి రాజశేఖరుడు "స్వామీ! మీ దయ వలన రాజ్యం సుభిక్షంగా సురక్షితంగా ఉంది ఇప్పుడు. నా పరోక్షాన దేశాన్ని ఇంకా మెఱుగుగా పాలించే నాథుడుండాలి కదా! అదే కొఱత నా మనసు లోని దిగులు. సత్పుత్రుణ్ణి ప్రసాదించండి". అలానే అనుగ్రహించి పుత్రకామేష్టి చేయమని చెవిలో చెప్పాడు శంకరుడు. "బ్రహ్మచారిని. నాకీ ధన మేల? ఈ ఊరి జనులకు పంచి పెట్టండని ఆనతిచ్చాడు బ్రహ్మచారి శేఖరుడు.

## 2.21 శంకరుని శిష్యులు

బాల్యంలోనే గురు వయ్యాడు శంకరుడు. ఎందరెందరో ఆయన కడ వేదం నేర్చుకొని వేదపారంగులయ్యారు. శాస్త్రాలను క్షుణ్ణంగా చదువుకొన్న వారు కూడ వాటిలోని సూక్ష్మాలను తెలిసికొనడానికి శంకరుని వద్దకు వచ్చేవారు. అట్టి వారందరికీ ధర్మమర్మాలను విశదీకరించే వాడు. విద్యార్థుల స్థాయి నెంచుట కోసం అప్పుడు రహస్యపరీక్షా పద్ధతిని ప్రవేశ పెట్టాడు. ఆ విధంగా శంకరుని శిష్యులు మణిపూసల వలె ఎల్లర మన్నలూ పొందేవారు. శంకరుడు కాదు శంకర శిష్యుడన్నా పండిత ప్రకాండులకు సైతం హడలే, ఆనందమే! మహిమాన్వితుడు కావడంతో బాలుడైనా శంకరుని దైవంగానే భావించుకొనే ఆ శిష్యులు కూడ పురాజన్మఫలంగా ఆ భాగ్యం పొందారు. శంకరుడన్న గురుడే. గురుడే శంకరుడు.

## 2.22 మాతృస్థాన విశిష్టత

'న మాతు: పరదైవతమ్' మంత్రాలలోని కెల్ల గాయత్రి మంత్రం శ్రేష్ఠం. దైవాలలో కెల్ల మాత శ్రేష్ఠదైవం. ఎందువలన? బీజోత్పత్తి నాటి నుండి తన గర్భంలో పదిలంగా కాపాడుతూ, తన జీవ సత్త్వాలు బిడ్డకు సమర్పించుతూ, తన్మూలాన బలహీనురాలయినా భరిస్తూ, నవ మాసాలు, నవ రాత్రులు, నవ ఘడియలు మోసి, దుర్భర వేదన అనుభవించి కన్న బిడ్డను కంటి ఱెప్ప వలె కాపాడుతూ ఉంటుంది. బిడ్డను చంక నుండి దింపదు. దించితే ఏడుస్తాడని చంకనే ఎత్తుకొని పనులు చేసికొంటుంది అహరహము. చంకలోని బిడ్డ కంటిలో గుచ్చుతాడు. మెడలోని మాంగల్యాన్ని పీకుతాడు. అవన్నీ ఇష్టంగా సహిస్తుంది. బిడ్డ మల మూత్రాదులను ఓపికతో బాగు చేస్తుంది. ప్రేమకు, సహనానికి, వాత్సల్యానికి, కారుణ్యానికీ మారు పేరే అమ్మ! బిడ్డ పెరిగి చెడ్డవాడయినా తల్లి ప్రేమ పోగొట్టుకోదు. ఇన్ని పాట్లుపడి పెంచిన తల్లి ఋణం ఎన్ని జన్మ లెత్తినా తీరనిది అంటారు. నరుడై పుట్టినవాడు ఋణాలు తీర్చుకోవాలి. ఋణాలు మిగిలి ఉంటే జన్మరాహిత్య మెలా? కనుక తల్లికి పుత్రుడు భక్తి శ్రద్ధలతో సేవ చేయాలి. తల్లి ఏర్పఱచిన ప్రేమపాశాన్ని తల్లియే తొలగించాలి. అప్పటికి గాని జనని ఋణం తీరదు. ఈ ధర్మాలన్నీ శంకరునికి పుట్టుక తోనే ఎఱుక. తల్లికి అపార సేవ చేసేవాడు.

## 2.23 పెండ్లి ప్రయత్నము

తాను అత్తగారు కావాలని ప్రతీ తల్లికీ ఉండడం సహజం. కాని ధర్మ బద్ధమైన ఆంతర్యం వేరు. కుమారునికి పెండ్లి జరిగితే పితృదేవతల ఋణాలు తీరే దారి ఏర్పడుతుంది. ఆర్యాంబ పుట్టింటి వారు కూడా ఆర్యాంబకు కోడలు రావాలని ఉబలాట పడుతున్నారు. శంకరుని కీర్తి దేశం దశ దిశలా వ్యాపించి ఉండడంతో ఆడపిల్లలు కలవారెందరో శంకరుని అల్లునిగా పొందాలని ఉవ్విళ్ళూరుతున్నారు. వచ్చి చూచి తల లూపి తమ అభిమతం

ఆర్యాంబ చెవిలో చెప్పి వెడుతున్న వారెందరో. ఆర్యాంబ ఉబలాటం మేరలు దాటుతోంది. తన కుమారుడు తండ్రి వలెనే గృహస్థుడై యజ్ఞ యాగాదులు చేసికొంటూ, అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ పిల్లా పాపలతో కళకళలాడుతూ ఉండే భాగ్యాన్ని కనులార చూడాలని ఆమె ఆకాంక్ష. అదేమీకాక, పరమ హంస పరివ్రాజకుడై జగద్గురుడై ఆసేతు హిమాచల పర్యంతం దిగ్విజయ యాత్ర చేసి, ధర్మస్థాపన చేసి ఆచంద్రతారార్కం నిలిచిపోతాడని ఆ ముద్దరా లెఱుగదు.

శ్రీరామునికి నిశ్చయించిన పట్టాభిషేక సంరంభం ఆగకపోతే రాము డడవులకు వెళ్ళడం ఎప్పుడు, దుర్వారులు ఖర దూషణాది రాక్షసులను, రావణ కుంభ కర్ణాది దుష్టులను మట్టు పెట్టే దెపుడు అనే ప్రశ్న వచ్చేది. అదే విధంగా ఆర్యాంబ ఉత్సహించిన రీతిగా శంకరుడు గృహస్థుడై ఇంటి పట్టున ఉండి తన సంసారాన్ని తల్లినీ కనిపెట్టుకొని కాలం గడుపుతుంటే భారతభూమిలో కావలసియున్న అద్వైతధర్మపరిరక్షణ మరి ఎవరి వలన సాధ్యం అన్న ప్రశ్న ఉదయించింది మహర్షి సత్తములకు. వెంటనే బయలు దేరి చేరారు శంకరుని ఇంటికి. మహర్షులు వేంచేయగానే కనిపెట్టి వారికి అర్ఘ్యపాద్యాది అర్చనలు చేశారు శంకరుడు, ఆర్యాంబ. ఆర్యాంబ అడిగింది ఋషులను ఈ విధంగా: “మహర్షివరులారా! మీ రాకతో మా యిల్లు పావన మయ్యింది. పిల్లవాడు నా బిడ్డడు. మీరు మహనీయ తపోధనులు. మీ మీ తపో వ్యాసంగాలను మాని మమ్ములను ఈ విధంగా అనుగ్రహించడం మా అదృష్టం. మీ సేవలు చేసికొనే భాగ్యాన్ని మాకు ఒసగారు మా పూర్వపుణ్యవిశేష ఫలంగా. మా పాపాలు నేటితో పటాపంచలయినట్లు తోచుచున్నది” అంటూ ఆర్యాంబ మునులకు నమస్కరించినది. మహర్షు లాశీర్వదించారు.

మరల మునులతో అంటుంది ఆర్యాంబ: “స్వాములారా! ఈ నా కుమారుడు పుట్టినప్పటి నుండి కని విని ఎఱుగని ప్రజ్ఞలు చూపిస్తున్నాడు.

మూడో యేటకే శాస్త్రాలన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. పెద్ద పండితులను నిర్భయంగా సునాయాసంగా జయిస్తున్నాడు. వాదంలో ఓడిపోయిన వారు వీణ్ణి ఏదైనా చేస్తారేమోనన్న భయం నన్ను పట్టి పీడిస్తోంది. తన మతం వదలడు. ఇతరమతాలు మతి లేని వంటున్నాడు. ఓడిపోయిన వారు నవ్వుతూ పోతున్నారు. ఈ బాలునిపై ఎంత అభిమానం లేకపోతే మీరిలా వస్తారు? మీ రాకలో ఏదైనా పరమ రహస్యం ఉండాలి. నేను వినదగిన దయితే చెప్పండి" అని వేడుకొన్నది ఆమె. అందుకు సమాధానంగా మహర్షులు ఆర్యాంబతో "అమ్మా! నీవూ నీ భర్త శివగురుడు పార్వతీ పతిని గూర్చి తపస్సు చేయగా ఉద్భవించిన వాడీ బాలుడు. ఆ పరమేశ్వరుడు నీ పతిని కోరుకొమ్మన్నాడు: పూర్ణాయుర్దాయము కల పేరు ప్రతిష్ఠలు లేని పలువురు పుత్రులు కావాలా, లేక పూర్ణాయువు లేని లోకోద్ధారకు డగు సత్పుత్రుడు కావలెనా యని. సత్పుత్రునే కోరుకొన్నాడు నీ భర్త. నిన్ను బాధపెట్టడం ఇష్టం లేక శివగురుడీ విషయం నీకు చెప్పి ఉండక పోవచ్చును. ఆ నాటి మాట అటుంచు. నేడు మీ పుట్టుకలు సార్థక మయ్యాయి. ఈ యీ నీ బిడ్డ సాక్షాత్తూ పరమేశ్వరుని అవతారము. ఆ పరాత్పరుడే నీ కుమారుడై నీ ముందు తాండవిస్తున్నాడు తెలిసిందా! నీవు శంకరుని కొక్కతివే తల్లివి కాదు. నీవు లోకమాతవు. నీ బిడ్డ మహిమలు హిమవన్నగం వలె మహోన్నతాలు. ఆయనను దర్శించడానికే మేము వచ్చినది" రహస్యాన్ని చల్లగా వెలిబుచ్చారు మహర్షులు.

ఆ మాటలు విన్న ఆర్యాంబ దిగ్భ్రాంతురాలై ఒక ప్రక్క తన కొడుకు గుఱించి చెప్పిన పరమరహస్యం విని మనస్సులోని ఆనందం పెల్లుబ్బగా అంతలోనే ములుకులు వలె నాటాయి బిడ్డ ఆయువు గుఱించి వారు పలికిన మాటలు. ఆమె తేరుకొనే లోపల మునులు మరల అన్నారు: "తల్లీ! అల్పాయువు గూర్చి అలజడి పడకు. మరో ఎనిమిదేండ్లు సంపాదించు కొంటాడు. తిరిగి ఇంకొక పదేండ్లు ఉండడానికి వరం పొందుతాడు.

అంతటితో ముప్పది రెండేళ్ళ ప్రాయం. అమ్మా! అవతార పురుషులకు ఆయుువుతో నిమిత్త మేల? ఆ సర్వేశ్వరుడు అంతటా నిండి ఉంటాడు. అట్టివానికి జనన నిధనాలుండవు. ఎల్లప్పుడూ మనందరితో ఉండే పరమాత్ముని గూర్చి ఎందుకు గుండెలు నీరు చేసికోవడం?".

## 2.24 తల్లికి శంకరుని ఓదార్పు

మహర్షులు వచ్చిరన్న సంతోషం పరితాపంగా మారింది ఆర్యాంబకు. ఆ విషయం తలపుకు వస్తే చైతన్యం తప్పి కూలబడి పోతుంది. బిడ్డ మీద గంపె డాసలు పెట్టుకొన్న తల్లి ఆ ఖేదాన్ని ఎలా భరించ గలదు? ఆనాటి కానాడు ఆర్యాంబ క్రుంగిపోతోంది. తన తనయుని యిల్లు వెయ్యిళ్ళ మొదలు కావాలనుకునే ఆమె ఈ పరిస్థితిని తట్టుకోలేకపోతోంది. కుమారుని చూడకుండా ఉండలేదు. చూచి నపుడల్లా కండ్ల నీరు ధారాపాతమే. అతడు చూడకుండా బట్టతో ఒత్తుకొనేది. చూస్తే బిడ్డ డేమౌతాడో నని బెంగ. తల్లి పడుచున్న వేదనను చూచి "అమ్మా! మునుల మాటల కింత బాధపడడమెందుకు? వెఱ్ఱిదానవు కదా! మన మెవ్వరం నిజం కాదు తెలుసునా? కొందరు ముందు కొందరు తర్వాత. అందరికీ అంతే. నీటి బుడగలు ఎంతసేపు నిలకడగా ఉంటాయి? మన పుట్టుకలు కూడా అట్టివే. ఈ దేహం కట్టుకొన్న వస్త్రం లాంటిది. శిథిల మైతే పారవేసి క్రొత్త బట్ట కట్టుకొంటాం. అంతే ఈ నశ్వర శరీరం కూడా. శరీరాల మీది మమకారం విచిత్రమైనది. జీవుల తాపత్రయం ఇది. ప్రయాణాలలో మన కెందరో తారసపడతారు. పరిచయ మౌతారు. తర్వాత ఎవరి దారిన వారు పోతారు. అదే మన జన్మ విషయంకూడా. పోయేటప్పుడు మనం చేసిన పుణ్యపాపాలు మాత్రమే మూట కట్టుకొని తీసికొని వెడతాము తరువాతి జన్మలో తత్ఫలా లనుభవించడానికి. పుణ్యపాపాల అనుభవం పూర్తి కాగానే ఈ పాంచభౌతిక కాయంతో నిమిత్తం లేదు. ఆ జీవి ఒక్క క్షణమైనా ఉండదా శరీరంలో. దీన్నే కాలచక్ర మన్నారు. ఈ చక్రం అలా తిరుగుతూనే ఉంటుంది. అమ్మా!

అందరిలాగా మాయలో పడిపోకు" అని పరిపరి విధాల అనునయ వాక్యాలతో ఊరడిస్తూ తల్లికి జ్ఞాన బోధ చేశాడు తనయుడు.

## 2.25 సన్న్యాసాశ్రమ స్వీకార బీజము

ఒకనాడు శంకరుని చేరి ఆర్యాంబ "నాయనా! ఎప్పుడూ ఇంటిపట్టున ఉండవు కదా! ఇలా ఇల్లూ వాకిలీ వదలి పెట్టి వెళ్ళిపోతూ ఉంటే నే నేమైపోతాను? వచ్చిన పెండ్లి వారందరూ ఇంటి వద్ద ఉండవని చెప్పుకొంటున్నారు. వారందరి ఇళ్ళకూ వెళ్ళడం ఎందుకు? ఇక్కడనే ఆ గోష్ఠి పెట్టుకోవచ్చు గదా! నీ ఉపనయనం తరువాయి ఎలాగూ తీరింది. ఇంక పెళ్ళి చేస్తాను. కోడలు రావాలని ముచ్చట పడుతున్నాను. నీకు బిడ్డలు కలగాలని ఆ బిడ్డలను ముద్దాడాలనీ ఉంది. ఎప్పుడు తీరుస్తావో గదా నా కోరిక!" అని చెప్పిన తల్లి మాటలకు ఇలా సమాధానం చెప్పాడు శంకరుడు: "అమ్మా! నా కోసం బెంగ పెట్టుకోకు. నీకు మాత్రం ఊళ్ళో వారి మీద ప్రేమ లేదా? అందరి యిళ్ళూ నీకు సమానమే. దేశమంటే ధర్మ మంటే నీ కెంత ప్రేమ ఉందో నాకు తెలుసు. వేదధర్మాలన్నీ పాడయి పోతున్నాయి అని ఎన్నో సార్లు నాతో అన్నావు. నేను మాత్రం నీలాగున తలపోయడం తగదా? కాని దానికి నేను పూనుకొంటే కష్టంగా ఉంటుంది. నేను పెండ్లాడాలనీ, వైదిక ధర్మాలు కాపాడాలనీ నీ ఆకాంక్ష. నీ కోరిక మంచిదే. కాని దేశ మంతటా నీ వను కొన్నట్లుగా ఆచరించేట్లు చేయవలసి ఉంది. నిజానికి మన ఇద్దరి ఆశయాలు ఒకటే" చల్లగా తన కోరికను వెల్లడించాడు శంకరుడు. దానికి మండిపడి ఆర్యాంబ "చాల్లే చెప్పావు. కుట్టినాగమ్మవు. నీ కోరిక లిప్పుడా? పెళ్ళి చేసుకోవాలి. పిల్లలను కనాలి. మనుమలూ, ముని మనుమలూ కలగాలి. అప్పుడు నీ కోరిక తీర్చుకో". కొడుకు కోరికను మొక్కను మొదట్లోనే త్రుంచి నట్లు పలికింది. మళ్ళీ అంటుంది "సంసారం ఈది ఈది వైరాగ్యానికి వెళ్ళాలి. అప్పుడే అది నిలబడుతుంది. బౌద్ధసన్న్యాసులను చూస్తున్నావు కదా! వాళ్ళ జీవితాలు

ఎలా వెళుతున్నాయో” తల్లితో శంకరు డిలా నచ్చ జెప్పుతాడు: “అమ్మా! నీ ఊహలు నా ఊహలు వేరు కాదు. నిన్ను చూచుకొన్నట్లుగానే తల్లులందరినీ చూచుకోవలదా? నేను బౌద్ధుల వంటి సన్న్యాసాన్ని కోరుకోవడం లేదు. అదియా నీ బెంగ!” అని అప్పటికి తల్లికి ధైర్యం చెప్పాడు.

## 2.26 సోదరునితో ఆర్యాంబ చర్చ

ఆర్యాంబకు తోడబుట్టినవాడు చెట్టంతవాడు ఉన్నాడు. అతని పేరు జయదేవుడు. ఆమె పుట్టింటివారు తఱచు రావడం పోవడం ఉంది. తన మేనల్లుడు అవతార పురుషుడని విని ఎంతో సంబరపడిపోయే వాడు. శంకరుడు సన్న్యసిస్తాడని ఆ నోటా ఈనోటా తెలిసి క్రుంగిపోయాడు. ప్రేలెడు లేడు సన్న్యాసమా! నా సోదరి ఎంత బాధ పడుతోందో! కనుక్కుందా మని వచ్చాడు శంకరుని ఇంటికి. ఆదరించి సంతోషంగా లోపలికి తీసుకొని వెళ్ళింది ఆర్యాంబ అన్నగారిని. పుట్టినింటి వారందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకొంది. అల్లుడు కనబడడే? అని అడిగాడు. “ఏం చెప్పమంటావు అన్నా! వెళ్ళేటప్పుడు చెప్పి వెళ్లే అలవాటు లేదు. వెళ్ళడానికీ రావడానికీ ఒక వేళ అంటూ లేదు. నేనెంత పోరినా ప్రయోజనం లేదు. చూడగా చూడగా వాడు ఇంట్లో ఉంటాడనిపించడం లేదు. కాని నేనంటే హద్దు లేని ప్రేమ. నా మీద ఈగ వాల నివ్వడు. తన బ్రహ్మచర్య నిష్ఠలో అంతరాయం రానీయడు. నా కష్టం చూచి పూర్ణానది నీ కాళ్ళ దగ్గఱకు వస్తుందిలే అన్నాడో లేదో అలాగే జరిగింది. ఊరివారంతా నీ పుత్రుని మహిమే అన్నారు. ఎంద రెందరితోనో వాదిస్తాడు. వాళ్ళ మతాలను ఖండిస్తాడు. ఒప్పుకొని వెళ్ళిన వారందరూ ఆనందంగానే వెడతారు. దేశంలో తల ఒక మతమూ అవలంబిస్తున్నారట. కర్మకాండ కాలిపోయినదట. దారి తెన్ను తెలియక ఒకరి నొకరు ద్వేషించు కొంటూ నిందించుకుంటూ అజ్ఞానాంధంలో ఉన్నారట. పరిస్థితి చక్క దిద్ది ధర్మం నిలబెట్టవలసిన సమయ మట. లోకం లోని ఇళ్ళన్నీ తనవే నట. తల్లులందరూ తన తల్లులే నట. నా ఆలనా

పాలనా ఎవరికి కావాలి చెప్పు? నీ కన్నీ బోధపరచాను. నాకేం చేయాలో తెలియడం లేదు. నీవే ఏదో ఉపాయం చూడాలి" తన గోడు వెళ్ళబోసుకొంది. అప్పుడు జయదేవుడు ఇలా అన్నాడు చెల్లెలితో: "శంకరుడు మామూలు బాలుడు కాదు. సర్వజ్ఞుడు. మాటలతో వానిని ఒప్పించడం నీ తరం నా తరం కాదు. నాకొక ఆలోచన వచ్చింది. ముందు వానికి పెండ్లి చేద్దాము. అప్పుడు సన్న్యాసం తలపు సన్నగిల వచ్చు. పైగా పెళ్ళి కుదిర్చేదీ చేసేదీ పెద్దవాళ్ళం మనమే కదా! ఆ పైన మన మాట కాదంటాడా?".

పుత్రుని మనోభావనలు ఉద్దేశాలు విశాలము ఉదాత్తమైనవని తెలుసా తల్లికి. "నాయనా! నన్ను విడచి వెడతా వన్న మాట. నీ తండ్రి నింత బూడిద చేసికొనే యోగం ఆనాడు నీకు లేకపోయింది. నాకు కూడా అటువంటి గతే పట్టిస్తావా నాయనా! నీ చేతులారా నన్నింత బూడిద చేసికో. నా కోరిక అదే. ఆ తర్వాత నీ ఇష్టం. నా ఇష్టంతో పని ఉండదు. సన్న్యాసం ఇప్పుడు పుచ్చుకుంటే నా కోరిక తీరదు గదా! నన్ను కాదనకు" అని తన అనుమానాన్ని వ్యక్తం చేసింది ఒకనాడు తనయుని దగ్గఱ. దానికి బదులుగా "అమ్మా! నీ కోరిక ఏనాడు తీర్చలేదు? ఇంత దానికే భయపడిపోతావా! ఎన్ని కష్టాలయినా, ఎన్ని గడ్డు అడ్డాలు వచ్చినా తప్పక నీ కోరిక తీరుస్తాను. నన్ను నమ్ము. నా మాటపై మొదట నమ్మకం లేకపోవడం తర్వాత ఆశ్చర్యపోవడం నీకు మామూలే కదా! నా జన్మ అందరికోసం. నీ అనుమతికోసం ఎదురుచూస్తోంది." తల్లి మౌనం వహించడంతో అర్ధాంగీకార మని తెలిసింది.

**ఇది శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక శేఖర ముముక్షు జన నిధాన**
**శ్రీ దేవకీనందనాశ్రమస్వామి గురుప్రసాద లబ్ధ విజ్ఞానవితాన**
**యజ్ఞాప్రగడ వెంకట సూర్యనారాయణమూర్త్యభిధాన విరచిత**
**శ్రీ శంకరావతార చరితమునందు బాల కాండ సమాప్తము**

# 3. సన్న్యాస కాండ

## 3.1 మానసిక సన్న్యాసము

శంకరుడు తల్లిని ఒక్క క్షణం కూడా విడిచి పెట్టి ఉండడం లేదు. ఒకరోజు ఆర్యాంబ నదికి స్నానానికి బయలుదేరింది. శంకరుడు తోడి బాలురు కూడా వచ్చారు. ఒడ్డు దరినే మొల లోతు నీళ్ళలో స్నానం చేస్తోంది ఆర్యాంబ. పిల్లలందరికీ ఈత కొట్టడం వచ్చు. మెల్లగా దిగి బారలు వేస్తున్నారు. సరదాగా చిన్నచిన్నఆటలు ఆడుతున్నారు. వెనుక ఈత ఈదుతున్నాడు శంకరుడు. అది ఆ పిల్లలకు రాదు. అంతలో శంకరుడు మునగడం తేలడం చూస్తున్నారు. అది ఈతలా లేదు. అనుమానం వచ్చి "మొసలేమోరా!" అని ఒకడు, "ఏదో పట్టుకొని పోతున్నట్లు ఉంది" అని ఇంకొక బాలుడు అంటున్నాడు. "మొసలి లాక్కుపోతుంది వాళ్ళమ్మకు చెప్పండిరా" ఇంకొకడన్నాడు. అది చూచిన ఆర్యాంబ గొల్లుమంది. "అమ్మా! అమ్మా! అమ్మా!" అంటున్నాడు శంకరుడు మునుగుతూ తేలుతూ. "నాయనా! నాయనా!" అని తల్లి రోదన. ఇంతలో శంకరుని నోట నుండి "అనుమతి! అనుమతి! అనుమతి!" ఆతురతతో శంకరుని ప్రార్థనాస్వరం. ఆ మాటలు కడసారి మాటలులా అనిపించా యామెకు. మరల "ఉత్తమ మరణం! ఉత్తమ మరణం!...అనుమతి! ..." అన్న పలుకులు తెలిసీ తెలియని ధ్వనిలో ఆమె చెవులకు సోకాయి. "నా బిడ్డను రక్షించు ఆపద్బాంధవా! కరుణించు" దీనాతి దీనంగా వేడుకొంటోంది. "ఓ పంచభూతములారా! ఈశ్వరా! భాస్కరా! దేవతల్లారా! అనుమతించాను నాయనా! నా బిడ్డ సన్న్యాసిగా నైనా బ్రతికి ఉంటే సంతోషిస్తాను" త్రికరణ శుద్ధిగా అనేసింది ఆర్యాంబ. ఆ శపథం వినీ వినగానే శంకరుడు "సన్న్యస్తం మయా" అన్నాడు మునుగుతూ తేలుతూ. ఎనిమిదేండ్లు నిండీ నిండని బాలశంకరుడు మకరి బంధంలో నుండి బయటపడ్డాడు. మకరిని సంహరించి కరిని బ్రోచిన దైవం కరుణతో. ఈదుకొంటూ వచ్చిన బిడ్డను కౌగిట ఇరికించుకొంది తల్లి.

## 3.2 తల్లికి శంకరుని వాగ్దానము

"సన్న్యస్తం మయా" అన్న మాటతో శంకరుని బంధనా లన్నీ పటాపంచలై సర్వస్వతంత్రుడైనాడు ఆ క్షణం నుండి. ఒక క్రొత్త పుట్టుకకు నాంది ఆ క్షణం. ఆర్యాంబ ఏమో పెన్నిధి దొఱకిన పేదలా శంకరుని చంక నుండి దింపడం లేదు. తోడి వారితో కలిసి ఇల్లు చేరుకుంది. శంకరుడు తల్లితో "అమ్మా! నన్ను బ్రతికించుకొని నీకు లోకంపై ఉన్న ప్రేమను చాటుకున్నావు. నిజానికి ఈ నాటితో లోకమాత వయ్యావు. నీ కరుణతో లోకానికి అక్షయమైన జ్ఞాన భిక్ష నందించావు. జగత్ప్రఖ్యాతి పడసిన మా నాన్న గారి సహచర్యభాగ్యం నీకు లభించింది. తల్లీ! నీకు ఏ లోటూ లేకుండా చూచుకుంటాను. నా తండ్రి ధనం మన వంశీయుల చేతుల్లో ఉంచితే నిన్ను బంగారంలా చూచుకొంటారు. నన్ను నమ్మ్మ" అన్న తనయుని మాటలు అమృతాలులా భావించి ఇలా అడుగుతుంది: "నాయనా! సరే కానీ, ఇంతబ్రదుకు బ్రదికి ఇంత గొప్ప పుత్రుణ్ణి కని నా అంత్యక్రియలు కడకు జ్ఞాతుల చేతుల్లో పెట్టి వెడతావా? నీవన్న మాట మఱచావా? చెప్పు". దానికి శంకరుడు

"అమ్మా! నీకు ఇచ్చిన మాట ఎలా మరువగలను? ఆడిన మాట తప్పడం మహాపరాధం కదా! నేనే వచ్చి నీ అంత్య క్రియలు చేస్తాను. తప్పను. తప్పను. అంతే కాదు. అవసానకాల మందు నన్ను స్మరించుకో. ఎక్కడున్నా మనో వేగంతో వచ్చి నీ ముందు వాల్తాను. నీ ముప్పు గడిపి నీ మెప్పు అందుకొంటాను" అని తల్లికి నచ్చజెప్పుతాడు.

## 3.3 తల్లిని జ్ఞాతులకు అప్పజెప్పుట

శంకరుని సన్న్యాస వార్త విని కాలడి గ్రామం అంతా ఒక్కసారి గుప్పుమన్నది. ఆర్యాంబకు అండ పోతోందని అంతా బాధ పడ్డారు. "ఎంతటివాడు పుడితే నేమి? పాశాలు త్రెంపుకు పోతున్నాడు. అందరూ అనుమానిస్తూనే ఉన్నారు. ఏ నాడో ఇలా ఉడాయిస్తాడని. అనుకొన్నంతా

అవుతోంది” అని తమలో తాము ఆర్యాంబకు చెప్పుకొంటున్నారు. కాని మరి కొందరు అర్థం చేసికొన్నవారు ధైర్యం మాటలు పలుకుతున్నారు: “ఆర్యాంబా! నీవు ధన్యురాలవు. మీ వంశానికి అశేష కీర్తి గడించే కొడుకును కన్నావు. మేమంతా నీ హృదయంలో నిండి ఉన్నాం. లోకాన్ని రక్షిస్తోన్న అమ్మవు నువ్వు. నీ సాటి అమ్మ ఏది?’ అని కొందరూ, “అమ్మా! వనంలో మొలిచిన మలయజానివి నీవు. రవిని మించిన తేజస్సుగలవాడు నీ సుతుడు. ఇతడు లోకాలకే వెలుగు” అని మరి కొందరూ, “నీ కుమారుణ్ణి అందరికీ కుమారునిగా చేసావు. శంకరుడు లోక శంకరుడు. లోకాలకు నేడు పండుగ. లోకాలకు జ్ఞానభాస్కరుడు లభ్యమయ్యాడు నేడు” అని కొందరు పలు విధాల అభిప్రాయాలు సంతోషాలు వ్యక్తం చేసికొన్నారు. చిద్విలాసంతో ఉన్న శంకరుని చూపులు మిరుమిట్లు గొలుపుతూ చూపరులకు సంభ్రమాశ్చర్యాలు కలగ జేశాయి. అప్పుడు జ్ఞాతుల వంక తిరిగి “లోకానికి సేవ చేయడానికే పుట్టాను. ఆ పుట్టుక నేటితోనే ఆరంభం. కాలడి నిత్యకల్యాణ నిలయం. మా అమ్మ అందరికీ అమ్మగా మీరు చూచుచుండే వారు. మా నాయన ఇచ్చిపోయిన అపార ధనంతో నాకు పని లేదు. మా అమ్మకూ పని లేదు. ఈమె సంగతి తెలియని వారెవ్వరు? ఇలాంటి ఈ అమ్మను మీరు ఎంతో ఆదరిస్తారని నాకు తెలుసును” అంటూ తల్లి రెండు చేతులూ పట్టుకొని జ్ఞాతులకు హస్తగతం చేశాడు శంకరుడు.

## 3.4 శ్రీ కృష్ణాలయ పునరుద్ధరణ

కాలడిలోని తమ ఇంటి ప్రక్కగానే ప్రవహించే పూర్ణానది ప్రక్కన ఆర్యాంబ కట్టించు కొన్న ఆలయంలోని శ్రీకృష్ణుని రోజూ చూచుకొంటూ మురిసి పోతూ వెడుతోంటుంది. ఒక నాడా పరవళ్ళ సందడిలో ఆలయం ప్రాకారం ప్రవాహపు ధాటికి ఆగలేక పడిపోయింది. ఒకవైపు ఒరిగినది విగ్రహం. ఆ ఆలయం మీద పూచీ ఎవరిది? శంకరుని దని తెలుసును శ్రీకృష్ణుని వారికి. “శంకరా! నీవు ఇల్లు వాకిలి వదలి వెళ్ళిపోతున్నావు. ఈ గుడి

నెవరు పట్టించు కొంటారు?" అన్నట్లుగా ఆకాశవాణి వినబడింది శంకరుని వీనులకు. వెంటనే జాప్యం లేకుండా ఆ ఆలయం బాగు చేయడానికి తగిన ఏర్పాట్లు కావించాడు. శ్రీకృష్ణాలయము ఎప్పటి వలె కళకళ లాడుతూంది.

## 3.5 ఆర్యాంబ బెంగ

తనయునితో అంటోంది తల్లి: "నాయనా! నాకు జ్ఞాన బోధ చేశావు. లోకానికి సేవ చేయాలంటున్నావు. దేశం కాని దేశం తిరుగుతావు. వేళ కాని వేళలు. వేళకింత అన్నం నీకు ఎవరు పెడతారు? ఎవరాదరిస్తారు? మాటాడితే పెద్దపెద్ద కబుర్లతో కడుపు నింపుతావు. ఎన్నడూ ఎవర్నీ దేహి అని అడిగిన వాడవు కాదు. నీ గురించి బెంగతో నా కడుపు తరుక్కు పోతున్నది". అమ్మ వేదన విన్న శంకరుడు ఇలా అంటాడు: "అమ్మా! అదా నీ బెంగ! వినలేదా ఈ శ్లోకం?

'సత్యం మాతా పితా జ్ఞానం ధర్మం భ్రాతా దయా సఖా। శాంతం పత్నీ క్షమా పుత్రా షడైతే మమ బాంధవా:' అమ్మా! నాకు కూడా ఆరుగురు వెంటాడుతుంటారు. తల్లీ, తండ్రీ, భ్రాత, సఖుడు, పత్నీ, పుత్రుడు వీళ్ళే నా పరివారం. వాళ్ళెవళ్ళూ ఎవరికీ కనబడరు. కాని నాలో ఉంటారు. సత్యం తల్లిగాను, జ్ఞానం తండ్రి గాను, ధర్మం సోదరుడు గాను, దయ మిత్రుడు గాను, శాంతము భార్య గాను, క్షమ పుత్రుడు గాను ఉంటూ నన్ను ఎన్నడూ విడనాడక నా బాగోగులు సర్వదా చూచుకొంటారు.

"అమ్మా! సత్యవ్రతం తల్లిలాంటిది. తల్లి ఎన్నివిధాల బిడ్డణ్ణి కంటికి ఱెప్పలా కాపాడుతుందో సత్యం కూడా జీవికి అండగా ఏడుగడగా ఉంటుంది. మరి తండ్రి తనయుని చదువు సంధ్యలు మొదలయినవి ఎన్నో సమకూరుస్తాడు జ్ఞానము వలెనే. ధర్మప్రవర్తన సోదరుని వంటిది. శరీరానికి అవయవాలు ఏ రీతిగా సహాయసంపత్తి సమకూరుస్తాయో అలాగే సోదరుడు

సహకరిస్తాడు కదా! ఇక మిత్రులు ఫలాపేక్ష లేకుండా చేదోడు వాదోడుగా ఉండేవారు కదా! దయాగుణం మిత్రుడి వంటిది. లోకంలో భార్య అన్నది ఎంతో ఓర్పుతో నేర్పుతో తన భర్తకు పిల్లలకు సకలోపచారాలు చేస్తూ, సంసారాన్ని సముద్రుడి వలె గంభీరంగా భరిస్తుంది. అదే శాంతమంటే. పుత్రులు ముసలితనంలో తల్లిదండ్రులను ఆదుకొనే వారు. క్షమతో ఓర్పుతో ఆ లోటుండదు. అన్నీ చక్క బడతాయి. నా భవిష్యజ్జీవనంలో ఈ గుణాలే నన్ను రక్షించాలి. తదనుగుణంగా ఉంటుంది నా ప్రవృత్తి. నీవు ఏమీ భయపడ నవసరం లేదు. ఇక నాకు ముందు ముందు పని ఉంది."

శత్రువులన్న వాళ్ళు ఎదిరిని నాశనం చేయడానికి పొంచి ఉంటారు. వాళ్ళకు నిద్రాహారాలు ఉండవు. శత్రురాజులచే జయింపబడితే ప్రజల్ని పీడిస్తారు. అది బహిశ్శత్రువుల ప్రభ. ఇక అంతశ్శత్రువుల మాట? కంటికి కనుపించని శత్రువులు వీళ్ళు. లెక్కకు పదముగ్గురు. ఒక్కొక్కడొక శాఖకు అధిపతి. వీరందరికీ సర్వసేనాధ్యక్షుడు చిత్తవృత్తి. మరొక పేరు కాముడు. తక్కిన వారందరూ వీనికి దాసులు. ఈ కాముణ్ణి జయిస్తే మిగిలినదంతా సులభమే. శంకరుడు సహజ విరాగి, విజ్ఞాని. అంతరంగవైరులే ఈయన ముందు తలవంచుకొని పారి పోవలసిందే.

## 3.6 సన్న్యాస యోగము

తపస్సు, యజ్ఞ యాగాది క్రతువులూ, దానధర్మాలు తప్పక ఆచరించమని శాస్త్రాలు చెప్పుతున్నాయి. ఇవన్నీ మానవులు పవిత్రచిత్తులవడానికి వైరాగ్యసిద్ధికి మార్గాలుగా నిర్దేశించారు. కర్మలు చేస్తూ ఉన్నా, తత్కర్మఫలాలను అపేక్షించకూడదు. కామ్యకర్మలు అసలే మానితే అది సన్న్యాస మవుతుంది. కర్మలు చేస్తూ కర్మఫలం పరమేశ్వరాయత్తం చేసి సన్న్యాసి అనిపించుకో వచ్చు. మనకు నాలుగు ఆశ్రమాలు ఏర్పరచారు: వివాహ మయ్యేంత వరకు బ్రహ్మచర్యం, విహితకర్మాచరణలతో కూడిన గార్హస్థ్యం. ఆ తరువాత గృహసుఖాలకు దూరమై, ఎక్కడో వనంలోనికి పోయి నియమితమైన

కట్టుబాట్లకు లోబడి గడిపే తపోజీవనం వానప్రస్థం. సద్బుద్ధితో ఆలు, బిడ్డల్ని, ఇల్లూ వాకిలి వీడి విరాగియై నడచేది తుది ఆశ్రమం సన్న్యాసం.

సన్న్యాసాశ్రమంలో ప్రవేశించే వ్యక్తి విధిగా కొన్ని శ్రాద్ధకర్మలు పెట్టాలి. మొదట వైశ్వదేవశ్రాద్ధము, తర్వాత నాందీముఖశ్రాద్ధము, దైవశ్రాద్ధము, ఋషిశ్రాద్ధము, దివ్యశ్రాద్ధము, మానుషశ్రాద్ధము, పితృశ్రాద్ధము, మాతృశ్రాద్ధమూ పెట్టాలి. ఇవన్నీ ముగించి తన శ్రాద్ధము తానే పెట్టుకోవాలి. శక్తి ననుసరించి వీటి కన్నింటికీ ధనం వెచ్చించాలి. భూదానం, అన్నదానం, వస్త్రదానం శక్తివంచన లేకుండా చేయాలి. మూడవనాటి కర్మకాండ కున్న ధనంలో కొంత మిగుల్చుకొని శేషించినది పుత్రుల కిచ్చివేయాలి. ఆ పైన బంధుమిత్రులతో విందారగించాలి. ఆనాడు దిగులుండకూడదు. దాన్ని కనిపెట్టడానికి ఉపాయం చెప్పారు. దిగులుతో ఉన్నవానికి అన్నం రుచించదు. రుచి కలుగనినాడు ఉపవాసం చేయాలి. శ్రాద్ధాన్నాన్ని వాసన చూడాలి. మరునాడే భోజనం.

తొలినాడు క్షురకర్మ ఆచరించాలి. స్నానం చేసి మంచి వస్త్రాలు ధరించాలి. అప్పుడు తన కుపదేశం చేసే గురువుకీ సన్న్యాసికీ యుక్తవస్తువులు దానం చేయాలి. ఉపదేశగురువు కడు సమర్థుడై ఉండాలి. ఆనాడు విధివిహితకర్మ యావత్తూ ఆచరించాలి. తదుపరి నారాయణోపనిషత్తు పఠిస్తూ బంధుమిత్రులతో కలిసి దగ్గఱలోని నదికి గాని తటాకానికి గాని వెళ్ళాలి. తన అపరాధాల నన్నిటినీ క్షమించమని వేడుకోవాలి. బంధుమిత్రులు వెళ్ళిన తరువాత ఆ నీట దిగి తానాచరించవలసిన కర్మను ముగించుకోవాలి. ఇంత కాండా సర్వులూ చేయాలా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. వృద్ధులూ, రోగులూ, అవసాన దశలో ఉన్నవారు, విపత్తులో ఉన్నవారూ కర్మకాండ చేయలేరు కదా. అట్టివారికి 'ఆతుర సన్న్యాసం' విధించారు. ఆపద్దశలో 'సన్న్యస్తం మయా' అని ముమ్మారు పలికితే చాలు. సన్న్యాస స్వీకార ఫలం గడచిన 101 తరాల, రాబోయే 300 తరాల పితృదేవతలూ తరిస్తారని జాబాలముని మతం.

అయితే ఈ తుది ఆశ్రమం అనుసరించడ మంటే చెప్పినంత తేలిక కాదు. మతి నతి నిర్మలంగా ఉంచుకోవాలి. వశీకృత చిత్తుడై ఉండాలి. శబ్ద స్పర్శ జ్ఞానం తెలియకూడదు. లేక పోతే స్పర్శతో కాయం పరవశం అవుతుంది. శబ్దం వినబడితే తన పని దగ్ధమౌతుంది. రాగద్వేషాలను పారద్రోలాలి. ద్వేషం మంటలను పుట్టిస్తుంది. మమ అనే దాన్ని మరువాలి, విడువాలి. ధ్యానయోగంలో నిమగ్నుడై ఉండాలి. ఏకాంతవాసం వైరాగ్యం వృద్ధి పొందించుకోవాలి.

మనస్సూ వాక్కూ అధీనంలో ఉండాలి. ఇన్ని ఉన్నా శాంతి లేకపోతే ప్రయోజనం ఉండదు. ఈ సన్న్యాస ధర్మాలన్నీ క్షుణ్ణంగా అవగాహన చేసికొన్నవాడు శంకరుడు. సన్న్యాస మంటేనే ఆయన జీవితం!

## 3.7 సద్గురువుకై అన్వేషణ

గురువులు పలురకాలు. చదువు చెప్పే గురువు ఆయనకు అక్కఱలేదు. ఆయనకు పనికి వచ్చే గురువు శంకరుని కన్న అధికుడై ఉండాలి. తెరను తొలగించి రహస్యాన్ని వ్యక్తం చేయగల గురువు కావాలి. రహస్య మంతా నాలుగు మహావాక్యాలలో ఇమడ్చబడి ఉన్నది. ఆ వాక్యాలు ఇవి: తత్త్వ మసి. అహంబ్రహ్మాస్మి. అయమాత్మా బ్రహ్మ. ప్రజ్ఞానం బ్రహ్మ. ఆ వాక్యాలకు అర్థం చెప్పేవారు కావలసినది. ఆ వాక్యాల భావాల స్వరూపవంతుణ్ణి తయారు చేసే సామర్థ్యంకల గురువుకావాలి. అట్టి గురువు లభిస్తే అఖండజ్ఞానం ప్రాప్తిస్తుంది. అలాంటివారు ఒకరిద్దరు ఉండకపోరు. దొఱకాలంటే పూర్వపుణ్య ఫలం ఉండాలి. అలాంటి మహాయోగసంపన్నుడు శంకరుడు. గురువులు అందరూ ఒకలాగున ఉండరు. గూఢుడు, ప్రీతుడు, మౌని, సకృత్కామగతుడు అని రకాలు. వీరిలో మరల విహంగమ, కూర్మ, మత్స్యభేదాలు ఉన్నాయి. విహంగమ గురుడు ఎలా ఉంటాడు? పక్షి తన పక్షాల క్రింద గ్రుడ్లను పొదిగి పిల్లలను చేస్తుంది. పక్షి వలె హస్త మస్తక సంయోగంతో తనశిష్యుని

అజ్ఞానావరణంలో నుండి తొలగించి తనంత వానిగా చేస్తాడు. దీనినే విహంగవృత్తి అంటారు. తాబేలు గ్రుడ్లు పెట్టి ఎక్కడో సంచరిస్తుంది. దానికి ఎప్పుడో గ్రుడ్ల మాట జ్ఞాపకం వస్తుంది. ఈ లోగా ఆ గ్రుడ్లు పగిలి పిల్లలు బయటికి వస్తాయి. ఇది కూర్మ వృత్తి. ఇందులో శిష్యులకు గురువు దూరంగా ఉంటాడు. కాని శిష్యుడు తనంత వాడు కావాలన్న దృఢ సంకల్పం ఇందులో ఉంటుంది. అందువలన శిష్యులు జ్ఞాను లౌతారు. చేప కూడా గ్రుడ్లు పెడుతుంది. అవి ఎక్కడో నీటి అడుగున బుఱదపై ఉంటాయి. అప్పుడప్పుడు వెళ్ళి చూసి వస్తుంది. అప్పుడా గ్రుడ్లు పగిలి పిల్లలు బయటికి వస్తాయి. అదే విధంగా గురుదేవులు శిష్యులపై తమ ప్రసాద దృష్టి ప్రసరింప జేసి శిష్యుణ్ణనుగ్రహిస్తారు.

ఇది కాక వేదాంత విజ్ఞాన పథంలో నాలుగు విధాల వారున్నారు: బ్రహ్మవిదుడు, బ్రహ్మవిద్వరుడు, బ్రహ్మవిద్వరీయుడు, బ్రహ్మవిద్వరిష్ఠుడు. శాస్త్రం చెప్పినది తానాచరిస్తూ, శిష్యుని తరింపజేసే వానిని గూఢగురువని, బహ్మావిదుడని అంటారు. తాను చేయవలసిన మంచి పనులు కూడా మఱచి జ్ఞానదానంచేసే వాడే పరమహంస. దృఢగురువు అని కూడా పిలువ బడతాడు. ఆహారం మాత్రం విడిచిపెట్టక ఇతరములన్నీ మాని ఉండేవాడే బ్రహ్మావిద్వరుడు. అట్టివానిని ప్రీతుడని కూడా వ్యవహరిస్తుంటారు. సదా నిర్వికల్ప సమాధిలో ఉంటూ తెలివి వచ్చినపుడు మాత్రమే ఏదయినా సేవించేవాడు సకృత్కామగతుడనీ, బ్రహ్మావిద్వరిష్ఠుడు అనబడతాడు. అంతంత ప్రభావాలుండి బ్రహ్మాదులు కూడ గుర్తించ లేనంత శక్తిమంతులై ఉంటారు గురువులు. సద్గురువుకై అన్వేషించుకోవడం, దొఱకిన గురువును పరీక్షించుకోవడం శిష్యుని విధి. అందు కొఱకే శంకరుని ప్రయాణము.

## 3.8 కాలడిని విడనాడుట

ఒకనాడు బ్రహ్మచర్యాశ్రమం నాటి పలాశదండాన్ని వదలి దాని స్థానే జ్ఞానదండం వహించాడు. రాత్రంతా పూర్ణ ప్రక్కన ఉన్న కృష్ణాలయంలో

గడిపాడు. తెల్లవారు జామున లేచి, అరుణోదయవేళకే కాలకృత్యాలు తీర్చుకొన్నాడు. తన ప్రయాణానికి అంతరాయం ఉండదని, రవి రాకుండా బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. ఎలా తెలిసిందో ఊరు ఊరంతా వచ్చి ముట్టడించారు శంకరుని. వచ్చిన వాళ్ళలో ఉన్న తల్లిని చూచి సాష్టాంగవందనంచేసి సెలవడిగాడు. ఆమె నోట మాట రాలేదు. మౌనం అర్ధాంగీకారమని వచ్చిన వారందరి దగ్గఱా సెలవు తీసికొని ఉత్తర దిశగా అడుగులు వేశాడు.

ఊరివారు శంకరుని వెన్నంటే వస్తున్నారు ఊరు దాటినా వారు వదిలి పెట్టలేదు. శంకరుడు లేని ఊరిలో ఉండగలమా! అనుకొంటున్నారు. జయ జయ ధ్వానాలు మిన్ను ముట్టడంతో శంకరునికి అర్థమైంది ఊరందరూ తన వెంటే ఉన్నారని. అపుడు వారిని ఉద్దేశించి "తండ్రులారా! తల్లులారా! నేను దేశం విడిచి వెళ్ళిపోవడం లేదు. మీ మీ పనులు మానుకోకండి. ఇళ్ళకు వెళ్ళండి. నాపై నున్న ప్రేమను ఊరిపై పెట్టండి. దయ యుంచి మరలి వెళ్ళండి" అని ప్రార్థించాడు. విడువ లేక విడువ లేక మరలు ముఖాలు పెట్టారు ఆ ఊరి జనం. మనస్సులలో వింతా, విచారమూ అలముకొని కన్నీరుగా ప్రవహించాయి.

## 3.9 గురువు కడకు ప్రయాణము

కోటిసూర్యతేజస్సుతో వెలిగిపోతున్న శంకర బాలయతిని ఎవరా అని సిగ్గుతో తొంగి చూస్తున్నాడు బాలభాస్కరుడు. పల్లెలూ పట్టణాలూ దాటి వెళ్ళుతున్నాడు. దారిలో ఉన్న ఊరి ప్రజలు చాలా ఆసక్తిగా ఆశ్చర్యసంభూతులై సందర్శించుకొంటున్నారు ఆ అవతారమూర్తిని. ఎలా ఉంది ఆ విగ్రహం! పసిమి చాయ తోడి పాల బుగ్గలు. దొండపండును మించిన అధరోష్ఠము. శ్రీకారాలను మించిన దానిమ్మపండు రంగు కల వీనులు. పద్మదళాలను పోలిన నేత్రాలు. లేత అరటి దూట వంటి కాలుచేతులు. బంగరు మేని

ఛాయ. తళ తళ లాడే విభూతి రేఖలు. పాదపద్మాల నుండి పావుకోళ్ళకు జారుచున్న దానిమ్మ పుప్పొడి. చూచిన వారికి కన్నుల పండువైంది. వీధులలో శంకరుడు నడచి వెడుతుంటే అరుగుల పై కూచున్న వాళ్ళు చరచరా దిగి వచ్చి ఆ బాలయతికి వినయ విధేయతలతో నమస్కారాలర్పించే వారు. కొందరు ఆయన వెంట కొంత దూరం నడచి వెళ్ళేవారు. అప్రతిహత తేజంతో విరాజిల్లే ఆ బాల సన్న్యాసిని చూచి సంబరపడని వారు లేరు. మరికొందరు ఆ బాలుని తనివి తీరా పలకరించి అట్టి భాగ్యం తమకు లభించినందుకు మురిసిపోయేవారు. అట్టివారికి శంకరుడు ఇచ్చే సందేశం ఎప్పుడూ ఇదే: “ధర్మం మఱువకుండా ఆచరించండి. సత్యాన్ని విడువకండి”. ఊరి బయట బయళ్ళలో గోపాలబాలునిగా భ్రమించి ఆలమందలు మోరలెత్తి దగ్గఱగా సమీపించేవి. గోపాలురు ఆ వింత చూచి పరుగు పరుగున వచ్చిపడేవారు.

వన్యమృగాలు బహుళంగా విహరించే కాఱడవిలో నుండి వెళ్ళడం శంకరునికి కష్ట మనిపించలేదు. అలా కొంత దూరం పోయాక మార్గం కంటకావృతమయ్యింది. జాగ్రత్తగా అడుగులిడుతూ నడుస్తున్నాడు. ఇరు పార్శ్వాలు దట్టమైన పొదలు అలుముకొని ఉన్నా ఆయన పురోగతికి అడ్డు లేదు. వనంలోని మృగాలకు బాలయతి అర్ధనారీశ్వరుడై కన్పట్టాడు. బహు దూరంగా ఉన్న సింహాలు తమ ఏలిక గిరిజయే వచ్చిందని శంకరుని వామపార్శ్వం చేరాయి. మహానాగులు పడగ విప్పి ఛత్రం పట్టాయి. గజరాజులు ఘీంకారం చేస్తూ తొండాలెత్తి జేజేలు పలికాయి. పరమాత్మ చింతనలో ఉన్న ఆ అవతార పురుషుని మహిమలు ఎవరూహించగలరు?

## 3.10 నర్మదా నదీ ప్రాంతము

మన బాలశంకరుడు నర్మదానదీప్రాంతం చేరుకోబోతున్నాడు. లోకోత్తర మహాపురుషుడు అన్న వార్త తెలిసిన వాయుదేవుడు పరివారాన్ని ఆయత్త

పరచి దారి పొడుగునా వృక్షరాజములచే వంగి వంగి నమస్కారాలర్పించ జేసాడు. పరిమళములు గుబాళించే పుష్ప వర్షాన్ని కురిపించి స్వాగతం పలికాడు. అందుండి సమీరుడు బాలయతిని ఒక నందన వనంలోనికి ప్రవేశపెట్టాడు. కొంత విశ్రాంతి తీసికొన్న పిమ్మట మధురాతిమధురమైన ఫలాలను నివేదన చేశాడు. ప్రయాణపు బడలిక లేకున్నా ఆ పండ్లు తిని ఒకింత తడవు విశ్రమించాడు శంకరుడు. ముందు ముందు పోగా పోగా మునులు నివసించే జాడలు పొడగట్టాయి. మరి కొంత దూరం ఆ వైపుగా నడవగా ఆరవేసిన మునులు కట్టే బట్టలు కనబడ్డాయి. అక్కడ జంతువులు తమ తమ సహజ వైరం మఱచి పరస్పర మైత్రీభావంతో మెలగుచున్నాయి. శంకరుడు రావడం చూచిన ఋషులు ఆడబోయిన తీర్థం ఎదురైం దనుకొన్నారు. అతని లేబ్రాయమూ, దివ్యతేజమూ చూచి విభ్రాంతు లయ్యారు. బాల్యంలోనే పరమవిరాగి అయిన అతని పూర్వభవ పుణ్యానికి విస్తుపోయారు. ఒక ముని ప్రశ్నించాడు: “బాలకా! ఎందుకో ఈ తావు చేరావు? ఎచటికి పోనుంటివి?” “మునివర్యా! గోవింద భగవత్పాదాచార్యుల కడకు నా ప్రయాణం” అని శంకరుని సమాధానం.

## 3.11 శ్రీ గోవిందభగవత్పాదాచార్యుల సన్నిధి

అప్పుడా ముని మరుమాటాడక తనతో రమ్మని దారి చూపుచూ ముందుకు నడుస్తున్నాడు. దగ్గఱలో ఉంది ఒక గుహ. అక్కడికి చేరాక అందు దేదీప్య మానంగా వెలుగొందుచున్న గురువర్యుడు కానవచ్చాడు బాలయతికి. అది తన గురుని సన్నిధియే అని గ్రహించి శంకరుడు గుహ చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఇలా ప్రార్థించాడు: “సద్గురుదేవా! జ్ఞానదాతా! పరబ్రహ్మస్వరూపా! బ్రహ్మానందదాయకా! నిరంజనా! నిర్వికల్పా! సర్వధీసాక్షిభూతా! త్రిగుణాతీతా! దివ్యమూర్తీ! పూర్ణకృపానిధీ! ప్రసన్నాత్మా! యోగీశ్వరేశ్వరా! జ్ఞానస్వరూపా! నిరాకారా! చిదానందా! సచ్చిదానందా! జగద్గురో!” అని ప్రథమ ప్రదక్షిణ చేసాడు. “విశ్వాతీతా! నిష్కళంకస్వరూపా!

సమస్తజగదాధారమూర్తీ! దీనబాంధవా! ప్రణవస్వరూపా! మహాప్రాజ్ఞా! త్రికాలజ్ఞా! ద్వంద్వాతీతా! సద్గురుమూర్తీ! ఆర్తత్రాణపరాయణా! వందనములు" అని ప్రార్థిస్తూ రెండవ ప్రదక్షిణం. మూడవ ప్రదక్షిణం చేస్తూ ఇలా స్తుతించాడు గురువును: "నాదబిందుకళాత్మకా! జన్మకర్మనివారకా! భవతారకా! సర్వకారణమహేశ్వరా! భూతాత్మా! భక్తవత్సలా! పురుషోత్తమా!". బిలద్వారానికి ఎదురుగా నిలబడి ఉన్నాడు శంకర యతి. ఆ ద్వారం చాల చిన్నదిగాఉంది.

"స్వామీ! నిన్ను ఆశ్రయించడానికి వచ్చిన దీనుడను. ఆత్మతత్వాన్ని బోధించి తరింపజేస్తూ అఖిలానందాన్ని ప్రసాదించుటకు అవతరించిన మహామహుడవు. శేషశయనునకు హాయి నిచ్చే ఆదిశేషుడవు. మమ్ము తరింపజేయుటకు వెలసిన కరుణామయుడవు. విశాలహృదయంతో వ్యాకరణశాస్త్రానికి భాష్యం అందించిన అప్రమేయుడవు. శరణని వేడిన శిష్యునిలో బంధింపబడి యున్న జుగుప్స, సంశయము, శీలము, కులము, బలము, భయము, మోహము, దయ – అనబడే ఈ ఎనిమిది పాశాలను ఛేదించగలవాడే సద్గురువని తెల్పి యున్నావు. అన్నింట మిన్న అయిన మిమ్ములను ఆశ్రయించ వచ్చాను". అప్పుడు శంకరుడు ఈ విధంగా గుర్వష్టకం చదివాడు:

**'శరీరం సురూపం తథా వా కలత్రం, యశశ్చారు చిత్రం ధనం మేరు తుల్యమ్**
**మనశ్చేన్న లగ్నం గురో రఙ్ఘ్రిపద్మే, తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥'**

**కలత్రం ధనం పుత్రపౌత్రాది సర్వం, గృహం బాంధవాః సర్వమేతద్ధిజాతమ్।**
**మనశ్చేన్న...**
**షడఙ్గాది వేదో ముఖే శాస్త్రవిద్యా, కవిత్వాది గద్యం సుపద్యం కరోతి।**
**మనశ్చేన్న...**

**విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః, సదాచారవృత్తేషు మత్తో న చాన్యః ।**
**మనశ్చేన్న...**
**క్షమామణ్డలే భూపభూపాలబృందైః, సదా సేవితం యస్య పాదారవిన్దమ్ ।**
**మనశ్చేన్న...**
**యశో మే గతం దిక్షు దాన ప్రతాపాత్, జగద్వస్తు సర్వం కరే యత్ ప్రసాదాత్ ।      మనశ్చేన్న...**
**న భోగో న యోగో న వా వాజి రాజౌ, న కాన్తా సుఖే నైవ విత్తేషు చిత్తమ్।      మనశ్చేన్న...**
**అరణ్యేన వాస్వస్య గేహే న కార్యే, న దేహే మనో వర్తతే మే త్వనర్ఘ్యే ।**
**మనశ్చేన్న...**
**అనర్ఘ్యాణి రత్నాని భుక్తాని సమ్యక్, సమాలిఙ్గితా కామినీ యామినీషు।**
**మనశ్చేన్న...**

**గురో రష్టకం యః పఠేత్ పుణ్య దేహీ, యతిర్భూ పతి ర్బ్రహ్మచారీ చ గేహీ**
**లభేత్ వాఞ్ఛితార్థం పరం బ్రహ్మ సంజ్ఞః, గురో రుక్త వాక్యే మనోయస్య లగ్నమ్॥**

"గురుదేవా! వేరొకరి శరణు గానక మీ శరణు గోరి మీ చరణములు శిరమున దాల్చ గోరి వచ్చిన వాడను. ఇదిగో మీ శిష్యుడు. అనుగ్రహించుడు. మీ యిచ్చ చొప్పున శాసించుడు" సవినయంగా నివేదించాడు శంకరుడు. ఆ పలుకులు వీనులకు విందులై ఈ తెఱంగున ఎవరూ వేడుకొన లేదే!' అని మదిలో తలపోసాడు శ్రీగోవిందభగవత్పాదాచార్యులు.

## 3.12 గురువుకు తానెవరో ఎఱిగించుట

చేతులు జోడించి బిలద్వారానికి ఎదురుగా వినయం ఉట్టిపడుతూ నిలబడి ఉన్న ఆ బాలుణ్ణి "ఎవ్వడవు నీవు?" అని ప్రశ్నించారు గురువు.

గురుడు కరుణామూర్తియై ఉన్నాడని తన పంట ఫలించిందని గ్రహించి ఈ క్రింది రీతిని చెప్పుకొంటున్నాడు.

"మనో బుద్ధ్యహఙ్కార చిత్తాని నాహం, న జిహ్వా న చ ఘ్రాణ నేత్రమ్
న చ వ్యోమ భూమి ర్న తేజో న వాయు, శ్చిదానన్దరూపః శివోహం
శివోహమ్॥

అహం ప్రాణసజ్ఞో న వై పఞ్చ వాయు, ర్నవా సప్తధాతు ర్న వా పఞ్చకోశః
న వాక్ పాణిపాదౌ న చోపస్థపాయూ, చిదానన్దరూపః శివోహం శివోహమ్॥

న పుణ్యం నపాపం నసౌఖ్యం నదుఃఖం, నమన్త్రో నతీర్థం నవేదా నయజ్ఞాః
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా,శ్చిదానన్దరూపః శివోఽహం
శివోఽహమ్॥

న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ, మదో నైవ మాత్సర్యభావః
న ధర్మో న చార్థో న కామో న మోక్ష, శ్చిదానన్దరూపః శివోఽహం
శివోఽహమ్॥

న మృత్యు ర్న శఙ్కా న మే జాతి భేదః, పితానైవ మే నైవ మాతా న జన్మ
న బంధు ర్న మిత్రం గురుర్నైవ శిష్య, శ్చిదానన్దరూపః శివోఽహం
శివోఽహమ్॥

అహం నిర్వికల్పో నిరాకారరూపో, విభుత్వాచ్చ సర్వత్ర సర్వేన్ద్రియాణామ్
న వా బన్ధనం నైవ ముక్తి ర్న బన్ధః, శ్చిదానన్దరూపః శివోఽహం
శివోఽహమ్॥

ఈ అతుల విన్నపం విన్న శ్రీ గోవిందభగవత్పాదాచార్యులు పరమానంద భరితులై శంకరుని దగ్గఱకు రమ్మని పిలిచారు.

## 3.13 శంకరయతి శంకరాచార్యు డగుట

మన శంకరుని సన్న్యాస కర్మకాండ పూర్తి కావడానికి మఱొక అంశం ఉంది. శిఖ, యజ్ఞోపవీతం విసర్జించాలి. ఆ పని కాస్తా గురువులు

యథావిధిగా జరిపించారు. తక్కుగల కర్మకాండ యావత్తూ శాస్త్రోక్తంగా నిర్వర్తింప జేసి మహామంత్రోపదేశం చేశారు. పిమ్మట మహావాక్యోపదేశం చేసారు. పూర్వాశ్రమంలో పెట్టిన పేరు విసర్జించాలి. అంతే కాదు విస్మరించాలి. జన్మించిన ఊరి పేరే కాక తల్లిదండ్రుల పేర్లు కూడా తలపరాదు. చెప్పరాదు. సన్న్యాసంతో అవన్నీ పోతాయి. ఈ ఆశ్రమంలోనిది క్రొత్త పుట్టుక. క్రొత్త పేరు ధరించాలి. శ్రీ గోవిందపాదులు ఆలోచించి శంకరాచార్యుడు అని నామకరణం చేసారు. శంకరుడంటే ఆనందకరుడని. ఇది ఈ యతికి అన్వర్థనామం. తల్లిదండ్రులు పెట్టిన పేరు ఈ ఆచార్య రూపంలో ప్రసిద్ధి కెక్కినది. నేటి పీఠాధిపతులకూ ఇదే నామం. ఇక గురు పరంపరకు వస్తే పరాశరునకు వ్యాసుడు, వ్యాసునకు శుకుడు, శుకునకు గౌడపాదుడు, గౌడపాదునకు గోవిందభగవత్పాదుడు, గోవిందభగవత్పాదునకు శంకరాచార్యుడు శిష్యులైనారు.

## 3.14 శిష్యరికము

ఆదిశేషుని అవతారమైన పతంజలి మహావిజ్ఞానియై గొప్ప తపస్సాచరించి గౌడపాదుని శిష్యుడయ్యాడు. అట్టి గోవిందభగవత్పాదుడు తన కడకు చేరిన శిష్యుని గుణగణాలను గ్రహించినాడు. గురువుకు తగ్గ శిష్యుడు. శిష్యునికి తగ్గ గురువు. అటువంటి జంట కూడుట కడు దుర్లభం. అవతారమూర్తి అయిన శ్రీరామునికి వసిష్ఠుడు, శ్రీకృష్ణునికి సాందీపని లాగ శంకరాచార్యునికి గోవిందభగవత్పాదుడు గురువయ్యాడు. మరి గురుసేవ శాస్త్రసమ్మతంగా, నిష్కళంకంగా జరపాలి. అట్లా చేసినవాడు శంరాచార్యుడు. సదా గురుస్మరణ, గురుభజన, గురుస్తుతి, గురుసేవ చేస్తూ గురుదర్శనమైనపు డల్లా సాష్టాంగ వందన మాచరించేవాడు. గురువు కడ బిగ్గఱగా మాట్లాడడం ఎఱుగడు. అసత్యవాక్కు పలికి ఎఱుగడు. కోప మన్నది మచ్చుకయినా లేదు. గురువును పలకరించు నపుడు సంబోధించి మరీ మాట్లాడేవాడు. గురువు ఉపదేశించిన మహామంత్రాన్ని నిరంతరం

జపించుకొంటూ మననం చేసికొనేవాడు తద్భావాన్ని. గురువునకు సకలోపచారాలూ తానే చేసేవాడు. తనువూ మనస్సూ సకలం గురువుకు సమర్పించి పరమభక్తితో చరించేవాడు. గురువు సకల పాపాలను పటాపంచలు చేయగల సమర్థుడు. కోపంతో గురుడు శపిస్తే దానికి నివృత్తి కల్పించడం బ్రహ్మరుద్రుల తరం కాదని శంకరాచార్యునికి తెలుసును. గురువు గోవిందపాదుని ఆశయాలు మహోన్నత మయినవి. దానికి తగ్గట్టుగా తీర్చి దిద్దుతున్నాడు ఆ శిష్యశ్రేష్ఠుణ్ణి. అజ్ఞానపు చీకట్లను చీల్చి చెండాడ గల జ్ఞానప్రభాపూర్ణునిగా తయారు చేసికొన్నాడు శంకరాచార్యుని. అలా చేయడానికి నాలు గేండ్లు పట్టింది. దేశంలో విజయ దుందుభులు మ్రోగించగల శక్తి, దృఢసంకల్పము, వాత్సల్యభరిత మనోధృతి తన శిష్యునిలో కలవని నిశ్చయించుకొన్నాడు గోవిందభగవత్పాదుడు.

## 3.15 నర్మద పొంగును కుండ లోనికి ఎక్కించుట

శంకరునికి పదిరెండేడులు ఇంకా నిండలేదు. ఆయన యశము దశ దిశలా ప్రాకింది. శంకరాచార్యుని చల్లని చూపులకు మ్రోడులు చిగిర్చునై ఉన్నాయి. గోవులకు చక్కని చిక్కని పసరాలను అందించడానికి ఉద్యుక్తమగుతున్నాయి పచ్చని పచ్చిక బయళ్ళు. పొలాలు సస్యశ్యామలం చేసికొందామని ఉవ్విళ్ళూరుచున్నారు కృషీవలులు. భక్తుల హృదయాల నానందింపజేయడానికి ఉద్యానవనాలు పుష్పసంతతిని వికసింపజేయాలని ఉబలాటపడు తున్నాయి. మేఘుడికీ ఆనందం పట్టలేకుండా ఉంది. బ్రహ్మాండం బ్రద్దలయ్యే అట్టహాసపు ధ్వనులతో విద్యుత్కాంతులతో వచ్చాడు. ఇంతలో అంతా క్రీకారణ్యమయింది. మార్గాలు దుర్గమ మయ్యాయి. చిన్ని తుంపరలతో మొదలై ఏనుగు తొండాల లాగ జలధారలు మారడంతో లోకం భీభత్సంలో మునిగింది. అత్తరి నర్మద ఒంటరియై విజృంభించి ఊళ్ళు మ్రింగడం మొదలు పెట్టింది. ఎందరో మనుష్యులను, పశువులను ఆ భీకర ప్రవాహం పొట్టను పెట్టుకొంది. మిగిలిన వాళ్ళు భయభ్రాంతులై

గోవిందభగవత్పాదులకు నివేదించడానికి వచ్చారు. గురుదేవులు బదరికావనం వెళ్ళా రన్న సంగతి విని నిర్వీర్యులై ఆశ్రమంలో చదికిలబడ్డారు. వచ్చిన వారి ఆర్తనాదాలు విన్న శంకరాచార్యుని మనస్సు కరుణతో ఉప్పొంగింది. నర్మదను అణగారేటట్టు చేయడమే ముఖ్యకర్తవ్యంగా భావించాడు. ఒక సరి క్రొత్త భాండాన్ని తెప్పించాడు. దాన్ని చేత్తో పట్టికొని, నిమీలితనేత్రాలతో, నర్మద ఎదురుగా నిలబడి ఇలా స్తుతించాడు:

**"సబిందు సింధురస్థల త్తరంగ రంజితం, ద్విషస్తు దాపజాతకారి వారిసంయుతం**
**కృతాంతదూత కాలభూత భీతిహారి వర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**త్వదంబులీన దీన మీన దివ్యసంప్రదాయకం, కలౌ మలౌఘ భారహారి సర్వతీర్థనాయకం**
**సమత్స్య కచ్ఛ నక్ర చక్ర చక్రవాక శర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**మహా గభీర నీర పూర పాప భూత భూతలమ్, ధ్వనత్సమస్త పాతకావిదారి తాపదాజలం**
**జగల్లయేమహాభయే మృకండుసూనుహర్మ్యదే, త్వదీయపాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**గతం తదైవ మే భయం త్వదంబు వీక్షితం యదా, మృకండు శౌనకాసురారి సేవి సర్వదా**
**పునర్భవాబ్ధి జన్మజం భవాబ్ధి దుఃఖ వర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**అలక్ష లక్ష కిన్నరామరాసురాది పూజితం, సులక్ష నీర తీర ధీర పక్షి లక్ష కూజితమ్**

**వసిష్ఠ శిష్ట పిప్పలాది కర్దమాది శర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**సనత్కుమార నాచికేత కశ్యపాది షట్పదై, ర్ధృతం స్వకీయ మానసేషు నారదాది షట్పదైః**
**రవీందు రంతిదేవ దేవరాజ కర్మ శర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**అలక్షలక్షలక్ష పాప లక్ష సార సాయుధం, తతస్తు జీవతంతు తంతు భుక్తి ముక్తి దాయకమ్**
**విరించి విష్ణు శంకర స్వకీయధామ వర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**అహోమృతం స్వసంశ్రుతం మహేశకేశజాతటే, కిరాత సూతబాడబేషు పండితే శఠే నటే**
**దురంత తాపతాపహారి సర్వ జంతు శర్మదే, త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥**

**ఇదంతునర్మదాష్టకంత్రికాలమేయయే సదా, పఠంతితే నిరంతరంనయాంతి దుర్గతిం కదా**
**సులభ్యదేహదుర్లభంమహేశధామ గౌరవమ్, పునర్భవానరానవై విలోకయంతి రౌరవమ్॥**

అని స్తోత్రం చేసి కుండను నర్మదకు ఎదురుగా ఉంచాడు శంకరాచార్యుడు. వెంటనే పాముల వాని బుట్టలో పాము దూరినట్లు కిక్కురు మనకుండా ఆ భాండం లోనికి నర్మదా జలం దూరింది. అప్పుడా నది వేసవి నాటి నర్మదలా ప్రత్యక్షం కావడంతో అందరి కన్నులలో పున్నమి పొడచూపింది. కలా! మాయా! అన్నట్లుగా ఒక్క క్షణం ఆశ్చర్యచకితు లయ్యారు వచ్చిన జనం. వే విధాల శంకరాచార్యుని స్తుతించి వందనాలు

అర్పించారు. ఈ అద్భుతఘటనను గోవిందభగవత్పాదులకు చెప్పారు వారు వచ్చాక. గురువు గారు పరమానంద భరితు లయ్యారు.

## 3.16 శంకరావతార గాథ

ఈనర్మదా నదీ ఘటన వృత్తాంతం విన్న గోవిందభగవత్పాదునకు గతంలో తనకు సంఘటిలిన ఉదంతం స్మరణకు వచ్చింది. పూర్వం ఒకనాడు హిమాలయ గిరిపై అమరేంద్రుడు యజ్ఞం చేస్తున్నపుడు వేదవ్యాసమహర్షితో గోవిందభగవత్పాదుడు ఇట్లా మాట్లాడాడు. “మహాత్మా! మీరు వేదాలను విభజించి లోకోపకారం చేసారు. పదునెనిమిది పురాణాలు రచించారు. యోగశాస్త్రాన్ని వ్రాశారు. పతంజలి యోగశాస్త్రానికి భాష్యం చేకూర్చారు. ఇదీ కాక వేదసారంలో ఉపనిషత్తులను చవిగా కలిపి నారికేళపాకంగా అందించారు బ్రహ్మసూత్రాలనే పేరిట. అది వెలలేని గ్రంధరాజమై వేదాంత తత్త్వానికి శిరోభూషణమై విరాజిల్లుతోంది. కాని నేటి చిక్కేమంటే బహుళ ప్రచారంలో ఉన్నా ఏకాభిప్రాయం కుదరక భిన్నభిన్న దృక్పథాలు వెలువడి సత్యము కనుచూపులో కానకుండా పోతున్నది. ఆ సూత్రముల లోతుపాతులు తమకే తెలియును కదా! మీరే ఆ వ్యాఖ్య అందిస్తే ముముక్షువులు ధన్యులవుతారు” అని వ్యాసుని వేడుకొన్నాడు గోవిందభగవత్పాదుల వారు. అందుకు సమాధానంగా ఆ మహర్షి ఈ విధంగా తెల్లపరచారు.

“ఆచార్య వర్యా! ఒకప్పుడీ ప్రస్తావన వచ్చినపుడు శివుడు చెప్పిన పరమ రహస్య మేమిటంటే, వ్యాసమహర్షికి దీటయిన ప్రతిభా సంపత్తులతో శివావతార సంభూతు డయిన వాడు నీకు ప్రధానశిష్యుడై వస్తాడు. నర్మదానది భయంకరంగా పొంగిన తరుణంలో ఆ వెల్లువను కడవలోనికి ఎక్కిస్తాడు. అదే ఆనమాలు సుమా!” ఈ పలుకులు మన:ఫలకంలోనికి హఠాత్తుగా స్మరణకు వచ్చాయి. ముప్పిరిగొన్న ఆనందబాష్పాలతో ఆ మహనీయ శిష్యుణ్ణి పారవశ్యాతిరేకంతో బిగిగా కౌగిలించుకొన్నాడు. విచిత్ర మేమిటంటే ఆ

కౌగిలి మామూలు కౌగిలి కాదు. గోవిందభగవత్పాదాచార్యుని నుండి దివ్యశక్తులు అన్నీ శంకరాచార్యునికి దత్తం చేయబడ్డాయి. తనకు జ్ఞప్తికి వచ్చిన కథను కూడా శిష్యునికి వినిపించాడు.

## 3.17 కాశీప్రయాణము

గోవిందభగవత్పాదాచార్యుడు ఒకనాడు శంకరాచార్యుని పిలిచి ఆప్యాయంగా దగ్గఱకు తీసికొని ఇలా సెలవిచ్చాడు: "ఆచార్యా! నీవు నా దగ్గఱ నేర్వ దగ్గది పూర్తి అయింది. నీవు ఇక్కడ ఉండవలసిన పని లేదు. తిన్నగా కాశి పట్టణానికి వెళ్ళి కైలాసనాథుని, అన్నపూర్ణామాతనూ దర్శించుకో. వారు నీ రాకకు ఎదురు చూస్తూంటారు. అన్ని ఏర్పాట్లు సమకూరుస్తారు. విద్యలకు నిలయమై, పరమ పవిత్రమైన దా స్థలం. నీవు చేయవలసిన ప్రక్రియలకు అచటనే నాంది. అచ్చోట నుండే బ్రహ్మసూత్రభాష్యకారుడవు కమ్ము. అపచారభ్రష్ట మగుచున్న అద్వైతమునకు ప్రస్థాపనము చేయవలసి ఉంది. నీకు చెప్పదగినది లేదు. త్వరపడుము" గుర్వాజ్ఞకు మించినది లేదని తెలుసును శంకరాచార్యునికి. గురువుకు సాష్టాంగప్రణామం చేసి అంజలి ఘటించి నిలబడ్డాడు వారి అనుమతి కోసం. దిగ్విజయం పొందమని ఆశీర్వదించి నారాయణ స్మరణ లనుగ్రహించాడు గురువు. వెనుతిరుగక ధర్మసంస్థాపనార్థం వెళ్ళే వీరవర్యునిలా సాగి పోతున్న శిష్యశేఖరునికి అభయం ఇస్తూ 'జయోస్తు' 'జయోస్తు' 'జయోస్తు' అని దీవించాడు గురుడు మహదానందంగా. తనలో గల మహిమ నెరుగని బాలుడు, తన కార్యభార మపార మని తెలియని బుద్ధిమంతుడు, మితిమీరిన ఆటంకాలు కలుగునని యెఱుగని వీరుడు శంకరాచార్యుడు. గురుకార్యం నెరవేరుతుందన్న ధైర్యంతో గుర్వాజ్ఞనే వజ్రాయుధంగా చేసికొన్నాడు. తాను గురుసాన్నిధ్యాన్ని విడనాడినా ఆ గురువునే తన హృదయాంతరాళాలలో ప్రతిష్ఠించుకొని ముందుకు పోతున్నాడు.

## 3.18 గంగావతరణ గాథ

శంకరాచార్యుడు గంగానదీ పరిసరాలకు చేరుకుంటున్నప్పుడు దివి నుండి భువికి తెచ్చిన భగీరథప్రయత్నం గుర్తుకు వచ్చింది. కపిలమహర్షి కోపాగ్నికి అరువది వేలమంది సాగరులు భస్మమై పోయారు. వారికి ఉత్తర గతులు కల్పించడానికి సగరుడు, అంశుమంతుడు, దిలీపుడు విఫలు రయ్యారు. వారి తర్వాత భగీరథుడు అకుంఠిత సంకల్పంతో అనితరసాధ్యమైన మహాఘోరతపస్సు చేసి గంగను భువికి రమ్మని ప్రార్థించాడు. గంగ అతనితో "రాజా! నా ప్రవాహవేగాన్ని భూమి తట్టుకోలేదు. ఒక్క ఈశ్వరునికే అది సాధ్యం" అని చెప్పింది. అపుడు తిరిగి పరమేశ్వరుని గూర్చి తపంచేసి మెప్పించి వేడుకొన్నాడు గంగను శివుని తల మీదుగా భువికి దించడం కోసం. ఈశ్వరుడు ఒప్పుకొన్నాడు. ఉఱకలు వేసికొంటూ మహావేగంతో వస్తున్న గంగ కాస్తా శివుని జటా జూటంలో చిక్కుకొంది. మరల భగీరథుడు పరమేశ్వరుని వేడుకొన్నాడు: "గంగాధరా! శంకరా! ఆర్తత్రాణపరాయణా! కరుణాసాగరా! విశ్వదేవా! మహాదేవా! భక్తవత్సలా!" గంగను విడుమని మనసా వేడుకున్నాడు భగీరథుడు.

ప్రసన్నుడైన పశుపతి గంగను దిగవిడచాడు పర్వతాల మీదుగా. అందుండి కన్నూ మిన్నూ కానక పరుగు లెత్తిన ఆ దేవనది ఒకచో నున్న మునివాటికను ముంచడం మొదలు పెట్టింది. అది జహ్నుముని ఆశ్రమం. ఆయన కోపం గంగను మ్రింగింది. వెనుకనే పరుగెత్తి వస్తున్న భగీరథునికి మరల మరొక అంతరాయం వాటిల్లింది. పరితాపంతో అర్థించిన భగీరథుని గోడు విని కరుణించి మ్రింగిన గంగను కర్ణం ద్వారా విడిచిపెట్టాడు పవిత్రతకు భంగం లేకుండా. అక్కడి నుండి కదలి తూర్పు ముఖంగా పాటి పాతాళలోకం సొచ్చి సాగర భస్మరాశులను ముంచింది జాహ్నవి. శంకరాచార్యునికి భాగీరథీ దర్శన మయ్యింది.

ఆ తీర పరిసరాలలో గల కదంబవనాలు, లతలతో పెనవేసికొన్న పొదలూ ముచ్చటగా చూచాడు. పొదలలో తపస్సు చేసుకుంటున్న మునులు కనబడ్డారు. గంగను దర్శించడంతో అందు స్నాన మాడాలనిపించింది. ఆ నిమ్నగను స్తవం చేశాడు

"భగవతి భవలీలా మౌళి మాలే తవాంభః ,
కణ మణు పరిమాణం ప్రాణినో యే స్పృశంతి
అమర నగర నారీ చామరగ్రాహిణీనాం,
విగత కలి కలంకాతంక పంకే లుఠంతి॥

బ్రహ్మాండం ఖండయంతీ హరశిరసి జటావల్లి ముల్లాసయంతీ
స్వర్లోకా దాపతంతీ కనకగిరి గృహా గండశైలాత్ స్థలంతీ॥
క్షోణీ పృష్ఠే లుఠంతే దురితచయ చమూ నిర్భరం మర్త్యయంతీ
పాథోధిం పూరయంతీ సురనగర సరిత్పావనీ నః పునాతు॥

మజ్జన్మాతంగ కుంభచ్యుత మదమదిరామోద మంత్రాతిజాలం
స్నానై స్సిద్ధాంగనానాం కుచయుగవిగళత్కుంకుమా సంగపింగమ్
సాయం ప్రాతుర్మునినాం కుశకుసుమచయై శ్చన్న తీరస్థ నీరం
ప్రాయాన్నో గాంగ మంభఃకరి కలభకరాక్రాంతరం హస్త రంగమ్॥

ఆదావాది పితామహస్య నియమవ్యాపారపాత్రే జలం
పశ్చాత్పన్నగశాయినో భగవతః పాదోదకం పావనమ్
భూయశ్శంభు జటావిభూషణమణి ర్జహ్నోర్మహర్షేరియం
కన్యా కల్మషనాశినీ భగవతీ భాగీరథీ భూతలేః ॥

శైలేంద్రా దవతారిణీ నిజజలే మజ్జజ్జనోత్తారిణీ
పారావార విహారిణీ భవభయశ్రేణీ సముత్సారిణీ
శేషాంగైరనుకారిణీ హరశిరోవల్లీ దళాకారిణీ
కాశీ ప్రాంతవిహారిణీ విజయతే గంగా మనోహారిణీ ॥

**కుతో వీచిర్వీచి స్తవయది గతాలోచనపథం**
**త్వ మా పితా పీతాండర పురనివాసం వితరసి**
**త్వదుత్సంగే గంగే పతతి యది కాయ స్తనుభృతాం**
**తదా మాత శ్శాతక్రతవ పదలాభోప్యతి లఘుః ॥**

**భగవతి తవ తీరే నీరమాత్రాశనోహం**
**విగత విషయ తృష్ణః కృష్ణ మారాధయామి**
**సకల కలుష భంగే స్వర్గ సోపాన సంగే**
**తరళ తర తరంగే దేవి గంగే ప్రసీద ॥**

**మాతర్జాహ్నవి శంభు సంగ మిళితే మౌళౌ నిధాయాంజలిం**
**త్వత్తీరే వపుషోవసానసమయే నారాయణాంఘ్రిద్వయమ్**
**సానందం స్మరతో భవిష్యతి మమ ప్రాణ ప్రయాణోత్సవే**
**భూయా ద్భక్తి రవిచ్యుతా హరిహరా ద్వైతాత్మికా శాశ్వతీ॥**

గంగా దేవిని స్తుతించి స్నానం చేసి మెల్లిగా కాశీ పట్టణం చేరుకొన్నాడు శంకరాచార్యుడు. శంకరాచార్యుడు కాశీ పట్టణంలో అడుగు పెట్టగానే పురజనులు చాల అబ్బురంతో ఆ మహా తేజస్విని చూస్తూ చూస్తూ ఆయనను వెంటాడి వస్తున్నారు. బాలయతీంద్రుడు విశ్వేశ్వరుని ఆలయం ప్రవేశించాడు. పురవాసులకు బాలశంకరుని వలె గోచరించి సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నారు. అందులకు శంకరాచార్యుడు నారాయణ స్మరణ చేస్తున్నారు. శంకరాచార్యుడు విశ్వేశ్వరుని కడకు వెళ్ళి అంజలి ఘటించి స్వామిని శివభుజంగ ప్రయాత స్తోత్రముతో స్తవం చేసాడు.

## 3.19 సనందుడు శిష్యు డగుట

కాశీవాసులే కాక చుట్టుప్రక్కల నివసించే వారెందరో శంకరాచార్యుని దర్శనం చేసికొని వెళ్ళుతున్నారు. ఒకరోజు ఒక బ్రాహ్మణ బాలుడు వచ్చి శంకరాచార్యుల దగ్గఱకు వచ్చి సాష్టాంగ వందనం చేసి స్వామి కాళ్ళు

రెండూ గట్టిగా పట్టుకొని వదల లేదు అభయం ఇచ్చేదాక. నెమ్మదిగా బాలకుడిని లేవ నెత్తి ఇలా పలకరించారు:

" బాలకా! నీ వెవ్వరు? ఎక్కడి నుండి వచ్చావు? నీకు ఏమి కావాలి? దేనికి అభయం అర్థిస్తున్నావు? వివరంగా చెప్పు."

" గురువర్యా! నేను కావేరీతీరంలోని చోళ దేశస్థుణ్ణి. పెద్ద రోగంతో వ్యథ పడుతున్న వాడిని. మీ ప్రభావము ఆసేతు హిమాచలం వ్యాపించిన మీ కీర్తిని విని ఇప్పుడు మీరు ఈ కాశీ పురంలో ఉన్నారని తెలిసి మిమ్మల్ని వెదుక్కుంటూ మీ పాదపద్మాలకు సేవ చేసి తరిద్దా మని వచ్చాను. మీరే నాకు దిక్కు. మీ శరణు కోరి వచ్చిన వాణ్ణి కాదనక ఆశ్రయం ఇవ్వండి. లేకున్న నాకు విముక్తి లేదు" అని మొఱ పెట్టుకొన్నాడా బాలవిప్రుడు దీనాతి దీనంగా. ఆ విశిష్ట బాలుణ్ణి గమనించిన శంకరాచార్యుడు ఆదరంగా అతనిని చేరదీసి "నీ కేమీ భయం లేదు. నిశ్చింతగా ఉండు. నా అండదండలు నీకు ఎప్పుడూ ఉంటాయి. నీ ఆవేదనలు, నీ మనోవేదనలు బాధలు విశదీకరించు. భగవదనుగ్రహంతో తీరని రుజలున్నాయా?" అని అడిగారు శంకరయతి.

"స్వామీ! లోకంలో పలురకాల కర్మలాచరిస్తున్నారు జనులు. పుణ్యకర్మ లాచరించి పుణ్యమూ, పాపకర్మ లాచరించి పాపమూ గడిస్తాడు జీవి. కర్మఫలాల అనుభవానికి తిరిగి తిరిగి జన్మ లెత్తుతూంటాడు. మరి ఏ కర్మలు చేస్తే చావు పుట్టుకలు లేకుండా పోతాయో తెలియదు. ఆ సత్యం తమ వంటి మహాజ్ఞానులకు తెలియాలి. నన్ను ఈ భవ రోగమే తీవ్రంగా వేధిస్తోంది. ఈ రోగం నుండి విముక్తి ఒక్క మీ కరుణా కటాక్షం వల్లనే సాధ్యమగుతుంది. నన్ను ఈ పరమబాధాకరమైన భవరోగం నుండి తప్పించండి. తమ కృపా కిరణాలను నాపై కొంచెం ప్రసరింపజేసి నన్ను అజ్ఞానాంధం నుండి తప్పించండి. వెలుతురు ప్రసాదించండి. నా భవరోగ చికిత్స మీ ఒక్కరి

వల్లే సాధ్యం. మీరే దానికి భిషగ్వరులు. దయ చూపండి. నేను మీకు ఈ క్షణం నుండి అధీనుడను. నన్ను శాసించండి” అంటూ ప్రాధేయపడ్డాడు ఆ చిఱుత ద్విజుడు. అంతా విన్న శంకరాచార్యుడు నిశ్చయించుకున్నాడు ఇతడు తనకు ముఖ్యశిష్యుడు కాదగిన వాడని. హస్తమస్తకయోగం ద్వారా విప్రకుమారుని మనస్సును కప్పిన అజ్ఞానపు తెరను తొలగించి క్రమ సన్న్యాసాన్ని ప్రసాదించాడు. మహావాక్యోపదేశం కావించి దండకమండలాలు చేతికి ఇచ్చాడు. ఆ విధంగా శంకరుని హృదయసీమలో సుస్థిరనివాస మేర్పరచుకొన్నాడు. అప్పటి నుండి నిశ్చింతుడై ఉంటున్న అతనికి సనందుడు అనే పేరు స్థిరపడింది. ఆ తరువాత వరుసగా ఆనందగిరి, చిత్సుకుడు శంకరాచార్యుని శిష్యులయ్యారు.

## 3.20 కాశీలో ప్రచారము

కాశీపురంలో శంకరాచార్యుడు అనుదినమూ వేదాంతబోధలతో తత్త్వ బోధలతో భక్తులకు, విద్వాంసులకు, ముముక్షు మార్గ గాములకు ధర్మసత్య పథాల లోతుపాతులను వివరిస్తూ వారి సంశయాలను పటాపంచలు చేస్తున్నాడు. కమనీయమైన గళంతో గంభీరమైన వాక్కులతో ఎంతో మంది మానసాలను రంజింపజేస్తున్నాడు. పతంజలి వ్రాసిన వ్యాకరణ భాష్యాన్ని విపులపరుస్తూ శబ్దశాస్త్రావగాహన కల్పిస్తున్నాడు. వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణంలో గల రసామృతాన్ని శ్రోతలకు పంచి పెడుతున్నాడు వీనుల విందుగా. అలాగే యోగశాస్త్రరహస్యాలు వివరిస్తున్నాడు. అలంకారశాస్త్రం లోని అందాలు చూపి అలరిస్తున్నాడు. అష్టాదశ పురాణాలనూ, ఉపనిషత్సారాన్ని, వేదవిజ్ఞానాన్ని మధురమైన కదళీపాకంగా అందించుచున్నాడు ఆ శంకరయతీంద్రుడు. పతంజలి, ప్రాచేతసుడు, కృష్ణద్వైపాయనుడు ఏకమై ఈ రూపంలో అవతరించారా అని ప్రఖ్యాతి గాంచాడు.

## 3.21 చండాలోపాఖ్యానము

మిట్ట మధ్యాహ్నపు వేళ.అప్పుడే కోసిన పచ్చిమాంసం మూట కట్టుక నెత్తిన వేసుకొని, మరి కొన్ని పచ్చి తోళ్ళు బుజాన వ్రేళ్ళాడదీసుకొని వస్తున్నాడు ఆజానుబాహువు మార్గంలో. తల మీది మూట నుండి ఇంకా నెత్తురు కారుతోంది. ఒక ఆనపకాయ బుఱ్ఱలో కల్లు నింపిన కుండ చంక నుండి వ్రేలాడుతోంది. ఒక చేత దుడ్డు కఱ్ఱ. మద్యం మత్తెక్కేలా సేవించాడేమో త్రేనుపులు విపరీతంగా వస్తున్నాయి. మధ్య మధ్య కుండ లోని కల్లు కొద్దిగా త్రాగుతున్నాడు. బలిసిన కుక్కలు నాలుగు అతని వెంట వస్తున్నాయి. ప్రచండ భాస్కరునికి జడిసి వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. మాధ్యాహ్నిక కృత్యాలు నిర్వర్తించడానికై శిష్యసహితుడై గంగానదికి వెడుతున్న శంకరాచార్యునికి ఎదురయ్యాడు ఆ చండాలవేషధారి. అల్లంత దూరాన ఆ వ్యక్తిని చూచారు శంకరుని శిష్యులు. తమలో తాము కూడ బలుక్కుంటున్నారు వచ్చేవాడు చండాలుడా కాదా అని. సమీపానికి రాగానే తేల్చుకొన్నారు ఔనని. శిష్యులు ముందూ, వెనుక శంకరాచార్యుడూ వస్తున్నారు. గురువు మీది భక్తితో "దూరం గచ్ఛ! దూరం గచ్ఛ!"అన్నారా వ్యక్తితో. అపుడా వ్యక్తి శిష్యులతో "బాబూ! తా మన్న మాట తెలిసింది లెండి. ముందు నా మాట ఇని మరీ యెల్లండి! మీ రన్న మాట మీరు తెలిసే అంటున్నారా? నేను మాదిగోణ్ణి అని 'దూరం గచ్ఛ' అంటున్నారా? అలాగయితే మీ మాట కట్టి పెట్టి నా మాట ఇనండి. మీరు పొమ్మంటున్నది ఈ కనిపించే బొందినా? లేక ఇందులో ఏదో ఆత్మ ఉందట దాన్నా? శరీరాన్ని పొమ్మంటే అర్థం లేదు. మీదీ మట్టి కాయమే నాదీ మట్టి కాయమే. మీది బంగారం నాది మట్టీ కాదు కదా! మీ శరీరం పవిత్రం అయితే నాదీ పవిత్రమే. ఆత్మ అంటారా. మీలో ఉండేదీ నాలోపల ఉండేదీ అదెక్కడ ఉన్నా ఒకటేనట! ఆ ముక్క కూడా మీ బాపనోరు చెప్పిందే. అశుద్ధం అంటారా! సూరిభగవానుడు మంచి నీళ్ళల్లోనూ కల్లులోనూ కనిపిస్తాడు గదా చూస్తే. రెండు చోట్లా కనిపించే సూరీడుకు ఒకచోట అశుద్ధం ఒకచోట శుద్ధం కాదు కదా! ఏమంటారు? చూస్తే

మీరు బాపనోళ్ళులా లేరే! జందాలు లేవు. సన్నాసులా! అయినా ఈవిసయాలు మీకు తెలవక పోతే మీ గురువు నడగండి” అని నిష్కర్షగా అడిగాడు పుల్కసుడు. శంకరాచార్యునికీ సనందునికీ సంభాషణ:

**శంకరుడు :** సనందనా! ఇతడు శివుడు కాడు కదా!

**సనందనుడు :** స్వామీ! నాకు ఆ అనుమానం మొదటే తోచింది.

**వ్యక్తి :** ఏంటి గుస గుసలు మహా సెప్పుకొంటన్నారు?

**శంకరాచార్యుడు :** స్వామీ! బ్రహ్మజ్ఞానులకు నమస్కారము!

**వ్యక్తి :** సన్నాసులు మాకు దండాలు పెట్టడమా!

**శంకరుడు :** పుల్కసా! నీ వెవ్వరవు? నీ ఊరేది?

**వ్యక్తి :** సామీ! నేనొక మంత్రగాణ్ణి. లింగడంటారు కొందరు. కొందరు ముండడనీ అంటారు. నా పేరుకేం గానీ మా ఊరు మంత్రాలపల్లి. రాతురులు వల్లకాడే మకాం. నన్ను ఎప్పుడూ విడవని పెళ్ళాం ఉంది. నా బిడ్డడు బొజ్జడు. ఇవీ నా కొన్ని గుట్టు మట్లు.

**శంకరుడు :** మీ రెవ్వరైతే నేమి బ్రహ్మజ్ఞానికి నమస్కారం చేశాను. అది మీకు చెందుతుంది మీరు బ్రహ్మవేత్త లవడం చేత.

**వ్యక్తి :** అయితే మాల డన్నా బాపడన్నా ఒకటే అంటావు?

ఆ ప్రశ్నకు సమాధానంగా శంకరాచార్యుడు మనీషపంచకం ఈ క్రిందివిధంగా చదువుతారు:

**జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే**
**యా బ్రహ్మాది పిపీలికాన్త తనుషు ప్రోతా జగత్సాక్షిణీ**
**సై వాహం న చ దృశ్యవస్త్వితి దృఢప్రజ్ఞాపి యస్యాస్తి చేత్**
**చణ్డాలోస్తు సతు ద్విజోస్తు గురు రిత్యేషా మనీషా మమ॥**

**బ్రహ్మైవాహమిదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం**
**సర్వం చై తదవిద్యయా త్రిగుణయా శేషం మయా కల్పితం**
**ఇత్థం యస్య దృఢా మతి: సుఖతరే నిత్యే పరే నిర్మలే । చణ్డాలోస్తు... ॥**
**శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచా గురో**
**నిత్యం బ్రహ్మ నిరన్తరం విమృశతా నిర్వ్యాజ శాన్తాత్మనా**
**భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే**
**ప్రారబ్ధాయ సమర్పితం స్వవపురిత్యేషా మనీషా మమ.**
**యా తిర్యజ్ నరదేవతాభిరహమిత్యన్త: స్ఫుటా గృహ్యతే**
**యద్భాసా హృదయాక్ష దేహవిషయా భాన్తి స్వతోఽచేతనాః**
**తాం భాస్యై: పిహితార్కమణ్డల నిభాం స్ఫూర్తిం సదాభావయన్**
**యోగీ నిర్వృత మానసో హి గురురిత్యేషా మనీషా మమ.**
**యత్ సౌఖ్యాంబుధి లేశ లేశత ఇమే శక్రాదయా నిర్వృతా**
**యచ్చిత్తే నితరాం ప్రశాన్తకలనే లబ్ధ్వా మునిర్నివృతః**
**యస్మిన్నిత్య సుధామ్బుధౌ గలిత ధీర్బ్రహ్మైవ న బ్రహ్మవిద్**
**యః కశ్చిత్ స సురేన్ద్ర వన్దితవదో నూనం మనీషా మమ.**

పుల్కసునకు సమాధానంగా శంకరాచార్యుడు చెప్పిన మనీషాపంచకం యొక్క అర్థం ఇది:“చైతన్యస్వరూపం మెళకువలోను, నిద్రలోను, స్ఫుటంగా ప్రకాశిస్తుంది. అట్టి అఖండరూపం పిపీలికాది బ్రహ్మపర్యంతం సాక్షీమాత్రంగా ఉంటుంది. అలాటి చైతన్యరూపాన్ని నేను” అనే గట్టి నమ్మకం గలవాడు మాలడైనా బ్రాహ్మడైనా నాకు గురువు. ఇది నా నిశ్చయం. “నేను బ్రహ్మనై ఉన్నాను. లోకాలన్నీ చైతన్యంతో నిండియున్నవి. సర్వమూ త్రిగుణాత్మకమైన అవిద్య వలన నా చే కల్పింపబడినది” అనే గట్టి నమ్మకం ఎవ్వానికి సుఖతరమూ, నిత్యమూ, పరమూ, నిర్మలమూ అయిన పరమాత్మ యందు గట్టిగా నిలచునో అతడు మాలడైనా ద్విజుడైనా నా గురువు. ఇది నా నిశ్చయము. గురువునందు అత్యంత భక్తిశ్రద్ధలతో విశ్వమంతా నిశ్చితం

గాదని నమ్మిన మనస్సుతో ఇదివరకు చేసినవి, ఇపుడు చేస్తున్నవి, చేయబోయేవి పాపకర్మలను దగ్ధం చేశాను. ప్రారబ్ధ భోగాలను సంవిన్మయాగ్నిలో హెూమం చేయడానికి ఈ శరీరాన్ని అర్పించితిని. ఇదే నా నిశ్చయం. మృగాలు, నరులూ, దేవతలూ, 'నేను, నేను' అని దృఢంగానూ, స్పష్టంగానూ నమ్ముటకు ఏ చైతన్యం వలన అట్టి భావన కలుగుచున్నదో ఏ చైతన్యం వల్ల ఇంద్రియాలు ప్రకాశిస్తున్నవో, మేఘావృతమయిన సూర్యమండలం దేని వలన ప్రకాశిస్తున్నదో, అలాటి చైతన్యాన్ని ఏ మహానుభావుడు ఎల్లపుడు భావిస్తూ శాంతుడై ఉంటాడో అతడే నా గురువు. ఇది నా నిశ్చయం. ఏ సుఖ సముద్ర కణలేశాన్ని పొంది ఇంద్రుడు మొదలగువారు ఆనందాన్ని పొందుచున్నారో ప్రశాంతచిత్తులైన తాపసులు దేన్ని పొంది ఆనందిస్తున్నారో అట్టి వాడు బ్రహ్మవేత్త కాదు. బ్రహ్మమే. అట్టివాని పాదాలకు దేవేంద్రుడు కూడ నమస్కరిస్తాడు.

**శంకరుడు:** సనందనా! ఈతడు చండాలుడు కాదంటావా? పుల్కసా! నీవేదియో మాయ చేస్తున్నట్లు ఊహించవచ్చా? మర్యాదలన్నీఎఱిగినవానిలా ఉన్నావు. మేము ధర్మాన్ని నిలబెట్టేవాళ్ళం. అంతలో చండాలరూపధారి అదృశ్యమయ్యాడు.

**శంకరుడు:** సనందనా! ఈతడు ఈశ్వరుడే. మనలను మోసం చేస్తున్నాడు. ఇక్కడ ఎవ్వరూ లేరే?

**సనందనుడు:** స్వామీ! ఈ కాశీ పట్టణంలో విశ్వేశ్వరుడు ప్రచ్ఛన్నవేషధారియై సంచరిస్తాడని ప్రతీతి.

**శంకరుడు:** అట్లనా! ఈశ్వరా! పరీక్షకా! మాయ నీ అధీనం. మాయావీ! మంత్రాయా! సోమాయా! గిరీశా! మహేశా! ముండాయా! శంకరా! గంగాధరా! దేహబుద్ధితో దాసుడను. తత్త్వశాస్త్రరీత్యా మీరే నేను. నేనే మీరు.

ఆ ప్రార్థనకు సంతోషించి పశుపతి నిజరూపంలో దర్శన మిచ్చాడు.

**శివుడు:** పరీక్ష ముగిసినది. సర్వజ్ఞుడ వయ్యావు. లోకోద్ధారకుడవు కమ్ము. వత్సా! వేదవ్యాసుడు అద్వైతమతప్రబోధనకై బ్రహ్మసూత్రాలు రచించాడు. అందు అద్వైతమే పరమ మతమని ఇతరములు కాదని వెల్లడించాడు. అయినా ఆ బ్రహ్మసూత్రాల నిజమైన భావం తెలియక తప్పటడుగులు వేస్తున్నారు కొందరు. అందు చేత తగిన ఆధారాలతో ఆ సూత్రాలకు సరియైన భాష్యం అందించ వలసిన తరుణం ఇది. అందుకు తగ్గవాడవు నీవు ఒక్కడవే. శాస్త్రాలన్నీ క్షుణ్ణంగా ఆకళించుకొని గోవిందభగవత్పాదాచార్యుల కడ మహావాక్యోపదేశం పొంది బహుముఖాల తీర్చి దిద్దబడిన మనీషివి. భాస్కరుడు, భట్టపాదుడు, మండనమిశ్రుడు, నీలకంఠుడు, అభినవగుప్తుడు మున్నగు వారు అద్వైతమతానికి వ్యతిరేకులై ఉన్నారు. వారిని జయించి చిరకాలం పాదుకొనేలా అద్వైతాన్ని స్థాపించు".

ఆ విధంగా పరమేశ్వరాజ్ఞ శిరసావహించి శంకరాచార్యుడు భాష్యరచన నిమిత్తమై శిష్యసమేతంగా కాశీపురి నుండి బదరికి పయనమయ్యాడు.

## 3.22 బదరీ ప్రయాణము

తపస్సాచరించాలన్నా, ధ్యానంలో నిమగ్నం కావాలన్నా, దేవతల ఉనికికైనా, బ్రహ్మనిష్ఠులకైనా ఉత్తరదిశయే చాలా శ్రేష్ఠం. ఇది తెలిసిన శంకరాచార్యుడు భాష్యరచనకై బదరీవనానికి బయలుదేరారు శిష్యులతో. తాపసు లనేకులు తపస్సు చేసి ధన్యులైన వనము బదరికావనము. ఒకప్పుడు సహస్రకవచు డనే రాక్షసుడు లోకాల్ని కంటకావృతం చేస్తూంటే, వాణ్ణి సంహరించడానికి నరనారాయణులు దుర్భర తపస్సు ఆచరించిన వనం అది. ఆ వనం నిర్మలంగాను, మనోహరంగాను, సకలశ్రేయస్సుల నిచ్చేది, మనోవాంఛలను సమకూర్చేదిగాను ఉంటుంది. దారిలో ఉన్న ఎన్నో పుణ్యస్థలాలు చూస్తూ, పుణ్యతీర్థాలలో గ్రుంకు లిడుతూ మధ్య మధ్య గల ఋషిపుంగవులను దర్శిస్తూ ముందుకు పోతున్నారు శంకరాచార్యులు శిష్యబృందంతో.

ఆ మార్గం తిన్నగా లేదు. ఒకచో ఎగుడు దిగుడు, ఒకచో బురద, మరొకచో భరించరాని తాపము. పిమ్మట తట్టుకోలేని శీతము. చాల చోట్ల కంటకావృతము. పాము మెలికల్లా వంకర టింకరగా మెలికలు తిరిగిన దారి. ద్వంద్వాల కతీతు డైన ఆయనకు ఆ మార్గము దుర్గమము కాదు. మధ్య మధ్యలో క్షుత్తు కలిగినపుడు మంచి మంచి ఫలాలు, చక్కటి నీరూ లభ్య మయ్యేవి. మార్గాయాసం కలుగకుండా మంచి మంచి మాటలు చెప్పుకొంటూ అక్కడ చెట్ల నీడలలో విశ్రమించేవారు.

అలా చని చని కొన్ని వారాల తర్వాత బదరికావనం చేరేటప్పటికి రాత్రి పోయి పగలు వచ్చినంత సంతోషాన్ని పొందారు శంకరశిష్యులు. అక్కడ ఒక పెద్ద దైన వృక్షాన్ని చూచుకొని దాని క్రింద ఆశ్రమాన్ని నిర్మించారు. దగ్గఱలో తల ఒక పర్ణకుటీరం ఏర్పఱచుకొన్నారు.

## 3.23 బ్రహ్మసూత్ర భాష్య రచన యొక్క ఆవశ్యకత

కవులు వ్రాసే కావ్యాలు కొన్ని గుంభనంగా ఉండి అందరికీ వాటి లోని భావాలు తెలియవు. మరి కొన్ని శాస్త్రాలు సూత్రరూపంలో ఉండడంతో ఇంకా కష్టం వాటిని అర్థం చేసికోవడం. సూత్రం చిన్నదిగా భావం బ్రహ్మాండంగా ఉంటుంది. సూత్రాలకు ఎన్నో ముళ్ళు వేస్తారు. నేర్పుతో ఆ ముళ్లు విప్పితే భావం బయట పడుతుంది. సూత్రాలు ముందు వెనుకలతో సంబంధం కలిగి ఉంటాయి. జైమిని జ్యోతిషశాస్త్రాన్ని సూత్రాలలో ఇమిడ్చి వ్రాసాడు. ఒక్కొక్క సూత్రానికి భాష్యం వ్రాయాలనిన చాల పుటలు పడుతుంది.

వేదాంతం లోని పరమార్థం కంటి కగపడే దాన్ని గురించి చెప్పునది కాదు. అందరికీ అవగాహన అయ్యేదీ కాదు. కొన్ని అర్హతలు సంపాదించుకొని ఉండాలి. వ్యాసరచితమైన బ్రహ్మసూత్రాలను కొందరు మహనీయులు వేదాంత సౌధంగా వర్ణించారు. దాన్ని అధిరోహించడానికి ఒకదాని తరువాత ఒకటి ఎక్కేలా మెట్లు కట్టాలి. అమాంతం ఎక్కబోతే

అంధకారబంధురమే. క్రమం తప్పకుండా ఎక్కిన వారు ఆ ప్రాసాదం లోని జ్ఞాన కవాటం తెరవ వచ్చు. వ్యాసుడు వ్రాసిన ఆ గ్రంథం వేదాంతమూ, ఉపనిషత్తులూ గుచ్చెత్తి తయారుచేసిన తత్త్వపిండము. దాన్ని సరిగా అవగాహన చేసికొన లేక కొందరు చేసిన ధర్మవిరుద్ధమైన వ్యాఖ్యలు ప్రబలి దేశంలో ధర్మగ్లాని విస్తృతమై నాస్తికమతం చోటు చేసికొంది. పరిస్థితిని చక్కదిద్దగల దక్షులు లేక బ్రహ్మసూత్రాలు అందుబాటులో లేకుండా పోయాయి.

## 3.24 బ్రహ్మసూత్ర భాష్య రచన

తా రచించిన బ్రహ్మసూత్రములను తెలిసికొనే దెవ్వరన్న ప్రశ్నతో ప్రారంభించాడు వ్యాసుడు. ద్వారమే బందు చేసినట్లు అందరికీ హక్కు లేదని మొదటే నిష్కర్షగా చెప్పేశాడు "అథాతో బ్రహ్మ జిజ్ఞాస" అన్న తొలి సూత్రంలోనే. ఆనాడు ఈ సూత్రాన్ని ఎవరికి తోచినట్లు వాళ్ళు అర్థం చెప్పారు.

'మంగళాచరణం చేసిన తర్వాత' అని కొందరు, 'సంపూర్ణ వేదాధ్యయనం తర్వాత' అని కొందరు, 'కర్మాచరణ ద్వారా జ్ఞానం కలిగిన తర్వాత' అని వేరొకరు అని వివరణ ఇచ్చారు. శంకరులు భావించినదిలా ఉంది: బ్రహ్మజ్ఞానార్జనకు పై చూపులుపయోగించవు. లోపలి చూపులున్నవాడే అర్హుడు. లోపలి చూపులు సామాన్యంగా ప్రాప్తించేవి కావు. లోకము అనిత్యమన్న సత్యం గ్రహించ గలగాలి. అప్పుడే పైచూపు నశిస్తుంది. చిత్తం పరిశుద్ధం అవుతుంది. చిత్తశుద్ధి మోక్షాపేక్షకు దారి ఇస్తుంది. అప్పుడు బ్రహ్మవిచార మవశ్య కర్తవ్యమవుతుంది.

బ్రహ్మపదార్థమున్నదని తెలిసినా ఏది బ్రహ్మ మనే విషయానికి వచ్చేటప్పుడు తప్పటడుగులు పడతాయి. శరీరాన్నే దేవుడనీ, ఇంద్రియాలనే పరమాత్మ యనీ, విజ్ఞానమునే పరమాత్మ అనీ పలు తెఱగుల వాదాలు ఉన్నాయి. ఎట్టిది పరబ్రహ్మము? ఏది కాదు? ఈ ప్రశ్నలు విచారణ చేసి వ్యాస మహర్షి తన సూత్రముల ద్వారా సందేహ నివృత్తి చేశాడు. వ్యాసుని

అభిమతమే సరియైన దని విజ్ఞుల నిర్ణయం. ఆ విషయం బహిర్గతం చేయడానికి వ్యాసుని మించిన వాడుండాలి.

అందుకు నియమితుడైనవాడే శంకరాచార్యుడు. భాష్యం వ్రాస్తూ శంకరుడు ఏ రోజు భాష్యం ఆ రోజే శిష్యులకు బోధించేవాడు. ఈ వార్తలు విన్న దగ్గఱలో ఉన్న మహర్షులు భాష్యపాఠాన్ని వినడానికి వచ్చేవారు. మూడు వారాల పాటు ఏకధాటిగా సాగి పూర్తయిన ఆ భాష్యం మునుల అనుమానాలను పటాపంచలు చేసింది.

## 3.25 ఉపనిషత్తులకు భాష్యరచన

ఋషులు వేదాంత రహస్యాలను లోకం ముందు ఉంచాలన్న ఉద్దేశంతో ఉపనిషద్రూపంలో చెప్పారు. పేరు బడిన ఉపనిషత్తులు నూట యెనిమిది. అందులో పదింటికి భాష్యం వ్రాస్తే చాలు నని భావించాడు శంకరాచార్యుడు:

**“ఈశ కేన కఠ ప్రశ్న ముండక మండూక్య తిత్తిరి:**
**ఐతరేయంచ ఛాన్దోగ్యం బృహదారణ్యకం తథా”**

ఈశోపనిషత్తు, కేనోపసిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నకోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తిత్తిరికోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు వీటినే ఎన్నుకొన్నాడు తన భాష్యరచనకు. సంశయాలకు తావు లేకుండా క్రొత్త పోకడలను పొందుపరచి ఆ దశోపనిషత్తులకూ అందమైన భాష్యాన్ని రచించి అందించాడు. అద్వైతులకు శిరోధార్యమై వెలయుచున్నాయి ఆ భాష్యాలు. పైన చెప్పిన భాష్యములు రెండు ముగించిన పిమ్మట శంకరాచార్యులవారు భగవద్గీతకు భాష్యము వ్రాయడానికి ఉపక్రమించారు. కురుక్షేత్రంలో కౌరవ పాండవ యుద్ధ మారంభ మయ్యే సమయానికి అర్జునునకు జ్ఞానం లోపించి యుద్ధం చేయడానికి మనసొప్పక అస్త్రసన్న్యాసం చేశాడు. అది లోకానికి అపూర్వ మైన సందేశం ఇవ్వడానికి మంచి తరుణ మని యెంచి శ్రీకృష్ణుడు

సంపూర్ణమైన జ్ఞానబోధ చేశాడు అర్జునునకు. బాదరాయణుడు భారతాన్ని రచించే టప్పుడు ఈ భాగాన్ని అక్కడి నుండి తీసి ప్రస్థానంలో చేర్చి భగవద్గీత అని పేరు పెట్టి యున్నాడు. బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత : ఈ మూడింటిని కలిపి ప్రస్థానత్రయము అంటారు.

బ్రహ్మసూత్రాలు నూరిన గాని పాకాన పడ వంటారు. ఉపనిషత్తులు వినిన సరిపడు నందురు. గీతను ఆచరణగ్రంథ మంటారు. అగాధ భావములు కలిగి గీత ముముక్షువులకు పెన్నిధిగా భాసిస్తున్నది. గీత తేలికయైన భాషలో ఉన్నా దాని భావాలను బహిర్గతం చేయడం అంత సుళువు కాదు. అప్పట్లో గీత లోని సత్యాన్ని గ్రహించుటకు పాఠకులు తికమక పడడం చూచి భగవద్గీతకు భాష్యం వ్రాయడానికి శంకరాచార్యులు పూనుకోవలసి వచ్చింది. ఇవి కాక, మరి రెండు ఉపనిషత్తులు నృసింహతాపనీయోపనిషత్తు, శ్వేతాశ్వతరోపనిషత్తులకు కొందరి కోరికపై వ్యాఖ్య వ్రాశారు. పంద్రెండు మంత్రములతో కూడి మకుట మనిన మాండూక్యోపనిషత్తుకు గౌడపాదులు రెండు వందల పదిహేను కారికలు వ్రాసినా సుబోధకములు కాలేదని వారి కోరికతో శంకరులు భాష్యం వ్రాశారు. ఇది దశోపనిషత్తులలో చేరి యున్నది. భాష్యత్రయ రచన ముగియడంతో బదరికావనం వీడి శంకరాచార్యులు వారి శిష్యులు కాశిపురి చేరుకున్నారు.

## 3.26 సనందనుడు పద్మపాదు డగుట

సనందనుడు ఎటువంటి శిష్యుడు? వేకువనే లేచి గొంతెత్తి గురుస్మరణ చేయడంతో సహశిష్యులు మేలుకొనేవారు. గురువనగా క్రిందటి జన్మకర్మలను నివారించి జ్ఞానవైరాగ్యాలను ప్రసాదించేవాడని త్రికరణ శుద్ధిగా నమ్మి గురుపాదపద్మములను కండ్లకు అద్దుకొనేవాడు. సర్వకాల సర్వావస్థల యందు గురువు రూపాన్ని మనసులో స్థిరంగా ఉంచుకొని గురుపాదధూళి శిరమున దాల్చెడివాడు. గురుసన్నిధానమునకు వెళ్ళినప్పుడు

సాష్టాంగవందనము ఆచరించేవాడు. గురువుల నివాసాన్ని ఎల్లప్పుడూ పరిశు భ్రంగా ఉంచేవాడు. వేకువనే తన కాలకృత్యములు నిర్వర్తించుకొని వేళ తప్పకుండా గురువులకు తానే స్నానం చేయించేవాడు. గురుదేవు డుపదేశించిన మంత్రాన్ని దీక్షగా జపించుకొంటూ గురుకార్యాలను అడగక ముందే పూర్తి చేసేవాడు. గురువు కడ స్వేచ్ఛగా సంచరించి ఎఱుగడు. గురువుల శాఠీలు, కౌపీనాలు శుభ్రపఱచి ఆరబెట్టేవాడు. అన్ని విధములా సద్భావంతో సత్ప్రవర్తనుడైన సనందనుడిపై వాత్సల్యభావం కలిగి అతనికి ముమ్మారు సూత్రభాష్యం చెప్పారు శంకరస్వామి. అది చూచిన తోడి శిష్యుల మనస్సులలో అసూయాభావం మొలకెత్తింది. వాళ్ళ ప్రవర్తనలలో వస్తున్న మార్పులను కనిపెట్టి ఆ మాలిన్యాన్ని మొదటలోనే త్రుంచివేయాలని సమకట్టారు.

ఒకనాడు గంగాతీర సైకత స్థలులలో శిష్యులతో కలిసి విశ్రమిస్తున్నారు శంకరులు. ఇంతలో పాఠం చెప్పే వేళ అయింది. సనందనుడు అక్కడ లేడు. కార్యార్థియై గంగకు ఆవలి ఒడ్డుకు వెళ్ళాడని అందరికి తెలుసును. పాఠం చెప్పమని వేడుకొన్నారు శిష్యులు. సనందనుడు రావాలన్నారు గురువుగారు. ఏఱు దాటటానికి పడవ గాని, తెప్ప గాని లేదు ఇప్పుడప్పుడే సనందనుడు రాడు అన్నారు శిష్యులు. అపుడు శంకరాచార్యుడు గొంతెత్తి "సనందనా! తిరిగి రా!" అని పిలిచారు. ఆ కేక సనందనుని మనస్సును కప్పిన మాయను తొలగించే కేక! వెంటనే సనందనుడు తిరుగు ముఖం పట్టి గంగలో పాదం పెట్టాడు. తన తనయుని కాపాడ నెంచిన గంగమ్మ తల్లి బిడ్డ పాదం క్రింద పెద్ద పద్మం అమర్చింది. రెండో పాదం క్రింద ఇంకొక పద్మం అమర్చింది. ఇట్లా అడుగడుగునకూ పద్మాలు అమరి వాటిపై తన పాదాలు మోపి నడచి వస్తున్నాడు సనందనుడు. ఆ అద్భుత దృశ్యాన్ని చూచిన శిష్యులు సంభ్రాంతులై తమ తప్పిదాన్ని తెలుసుకొన్నారు.

"పద్మపాదా!" అని సంబోధిస్తూ సనందనుని శంకరాచార్యస్వామి కౌగిలించుకొన్నారు. ఆ విధంగా సార్థకనామం వచ్చింది శిష్యునికి.

## 3.27 వ్యాసమహర్షి రాక

మొదట్లో పతంజలి వ్రాసిన సూత్ర భాష్యాన్ని ఆ నాడు పొగడని ద్వైతుడు లేడు. అద్వైతులు మాత్రం వ్యాసుడు ద్వైతాన్ని ఆదరిస్తా డనుకో లేదు. ఆఖరికి పతంజలికే తన భాష్యంపై నమ్మకం కనుమరుగైంది. అనుమానాస్పదా లైన భాష్యా లచ్చటచట కలవని వ్యాసునకు తెలుసును. శ్రీ శంకరాచార్యులు అద్వైతపరంగా సూత్రభాష్యం వ్రాశా రన్న సంగతి దశదిశలా వ్యాపించడంతో కృష్ణద్వైపాయనుడు సంతోషించి ఆ విషయం ఏమిటో కనుగొనే ఉద్దేశంతో ప్రచ్ఛన్నరూపధారియై వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడు.

ఒక నాడు శ్రీ శంకరాచార్యుడు శిష్యులకు సూత్రభాష్యం చెప్పుతున్నాడు. శిష్యుల సందేహాలను గురువు గారు తీరుస్తున్నారు. ఆ బ్రహ్మవిచారణలో నిమగ్ను లైన వారికి ఎంత ప్రొద్దెక్కిందో తెలియలేదు. అంతరిక్షంలో నున్న ఆదిత్యుడు ఈ పాఠాలను ఆసక్తిగా వినడానికి కాబోలు దగ్గఱగా రావడంతో ఆ ప్రచండతకు శిష్యులు తాళ లేక పోయారు. కాలాతీతం కావడంతో పాఠం ముగిద్దా మనుకొనే సమయానికి ఒక ముదుసలి బ్రాహ్మణుడు వచ్చి నిలబడ్డాడు వారి ముందట. ఆయన ఆ శిష్యులను ఉద్దేశించి ఇలా అడిగాడు: "మీ రెవ్వరు? ఏ విషయం చెప్పుకుంటున్నారో వివరంగా చెబుతారా". అప్పుడు శిష్యులు ఆ వృద్ధవిప్రునితో "బ్రాహ్మణోత్తమా! వ్యాసవిరచితమైన బ్రహ్మసూత్రాలకు, ఉపనిషత్తులకు, భగవద్గీతకు ఈ మహితాత్ములైన మా గురువు గారు చక్కని భాష్యాలు వ్రాసిన వారు. మాకు బోధిస్తున్నారు. అప్పుడు ఆ కపట విప్రుడు శంకరాచార్యుని వైపు తిరిగి ఇలా అడిగాడు: "బుద్ధిమంతుడా! ఈ సరి కెవ్వరూ చేయజాలని భాష్యరచన చేసావంటే మెచ్చదగినదే! అందులో ఒక సూత్రానికి ఎలాంటి భాష్యం వ్రాశావో

వివరిస్తావా?". అందుకు ముద మందిన శంకరుడు "ద్విజోత్తమా! నేను ఇవి వ్రాశా నని నాకేమీ గర్వం లేదు. ఏ సూత్రానికి అర్థం కావాలని మీరు కోరుతున్నారో చెప్పండి."అప్పుడు మొదలైంది చర్చ.

## 3.28 వ్యాస శంకర వాదోపవాదములు

ముసలివాని రూపంలో ఉన్న వ్యాసు డడిగాడు: "యతివర్యా! బ్రహ్మసూత్రాలలోని మూడవ అధ్యాయం లోని మొదటి సూత్రం 'తదంతర ప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్త: ప్రశ్న నిరూపణాభ్యాం' దీని గుఱించి నీకేదైనా తెలుస్తే చెప్పు". ఆ సూత్రాన్ని వివరించడం అంత సుళువు కాదు. తీగ లాగితే డొంకంతా కదుల్తుంది కదా! అందులో భాష్యకారుని పస బయటపడుతుందని అడిగాడు వ్యాసమహర్షి. సమాధానంగా శంకరుడు "స్వామీ! శ్రుతిలో తెలిపినట్లు ప్రశ్నోత్తరాల వల్ల తేలిన నిగ్గు ననుసరించి జీవుడు వేరొక శరీరంలో ప్రవేశించి నపుడు సూక్ష్మభూతాలను వెంటబెట్టుకొని పోవును. ఎన్నో తర్జన భర్జనలు చేసి వ్యాసుడు ఈ సూత్రాన్ని చిత్రించాడు" అని సూత్రభావం చెప్పాడు. "అయితే స్వామీ! ఆ తర్జన భర్జన లేమిటో వివరించగలవా?" అని మరల ప్రశ్నించాడు వృద్ధవిప్రుడు. శంకరుని వివరణను వ్యాసుడు కాదనటం శంకరుడు సమర్థించుకొనడం. వ్యాసుని ప్రశ్నపరంపరలకు ఓపికగా శ్రుతి స్మృతి ప్రమాణాలతో సమర్థంగా చాకచక్యంగా విజ్ఞానాన్ని వైదుష్యాన్నీ చూపిస్తూ అపూర్వంగా సాగిన శంకరుని వివరణలు శిష్యుల్ని దిగ్భ్రాంతుల్ని చేశాయి. ఆ విధంగా ఎనిమిది దినములు ధారాళంగా సాగిన వాదప్రతివాదాలలో ఇసుమంతయినా క్రుంగ లేదు శంకరస్వామి. తన వాదాన్ని ఆ విప్రుడు వే విధాల ఖండిస్తున్నాడు. అన్నిటికీ తొణకక బెణకక సరియైన సప్రమాణ మయిన ఉపపత్తులు చూపిస్తున్నాడు శ్రీశంకరాచార్యస్వామి. ఈ ముసలి వాడు వ్యాసుడే అని గ్రహించాడు పద్మపాదుడు. శంకరుని చెవిలో ఆ రహస్యాన్ని ఊదాడు. అప్పుడు విప్రునితో "ఆచార్యదేవా! జ్ఞానదాతా! అద్వైతమతస్థాపనాచార్యా! మీ శరీరాన్ని

ఆశ్రయించుకొని ఉన్నవన్నీ లోకాలకు వెలుగు నిస్తున్నాయి. కలి మీ కడకు రానోపదు. మిమ్ములను చూస్తే విష్ణుమయంగా ఉంది. మీది విశ్వప్రేమ. విశ్వమే మీ బిడ్డ. మీ ప్రేమకు నా భాష్యరచన ఏమైనా అవరోధం కలిగించు నేమో యని పరిశీలన కొఱకై వచ్చి ఉంటారు. లోపా లున్న సవరించు కొంటాను. కరుణించండి. మీ నిజరూపం చూపించి నన్ను కృతార్థుణ్ణి చేయండి!" అని అర్థించారు శంకరులు.

## 3.29 వ్యాస దర్శనం

శంకరాచార్యునితో జరిపిన వేదాంతచర్చతో వ్యాసమహర్షి ఆనందసాగరంలో మునిగి తేలాడు. శంకరుల ప్రార్థనతో నిజరూపంలో ప్రత్యక్ష మయ్యాడు జలతారు పుంజాల వలె జటలు ప్రకాశిస్తుండగా. ఆ పరమ మౌనిని చూడగానే శిష్యసమేతంగా లేచి నమ్రులై సాష్టాంగవందనాలు అర్పించాడు శంకరస్వామి. "పుణ్యచరితా! కృష్ణద్వైపాయన మహర్షి సత్తమా! కరుణాసాగరా! వందనశతానేకములు! నా జన్మ పావన మైనది. లోక కల్యాణార్థం పెక్కు మహాకార్యాలను పరిపూర్తి చేశావు. పరాత్పరుని వేవిధాల చిత్రించి జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేసి పామరుల అజ్ఞానాన్ని తొలగించిన దివాకరస్వరూపుడవు. కలగాపులగంగా ఉన్న వేదాలను నాలుగింటిగా ఏర్పఱచి వేదవ్యాసుడ వని కొనియాడబడ్డావు. వేదార్థాలు సామాన్యులకు తెలిసి రావని కరుణామూర్తివై పదునెనిమిది పురాణాలుగా వ్రాశావు. దానితో తృప్తి పొందక పదునెనిమిది పర్వాల మహాభారతాన్ని అనితర సాధ్యంగా అపూర్వసంవిధానంగా మలచి మున్నెన్నడు ఎవ్వరు చేయని, చేయలేని 'పంచమవేదము' అని ప్రణుతి కెక్కిన మహామహితమైన గ్రంథరాజాన్ని ప్రపంచానికి ప్రసాదించావు. బ్రహ్మసూత్రాలు 550 సూత్రీకరించి జగాలకు హారతిగా ఇచ్చావు. పరాత్పరుడే ఆ సూత్రాలలో స్థిరనివాస మేర్పఱచుకొన్నాడు. వాటిని నిండుగా అవగాహన పొందినవాడు జీవన్ముక్తుడే" అని పరి పరి విధాల స్తుతించి ఆసనము స్వీకరించు డని నమ్రుడై అర్థించాడు

శంకరుడు. మారు పల్కక వ్యాసుడు సుఖాసీను డయ్యాడు. పిమ్మట శంకరుని వైపు తిరిగి వ్యాసుడు ఇలా అన్నాడు: "నాయనా! శంకరా! నీవు సూత్రభాష్యం వ్రాయడమే కాక శిష్యులకూ, మునులకూ అందరికీ చక్కగా బోధిస్తున్నావు. నీ మూలంగా తత్త్వవిద్య విస్తృతంగా వ్యాపించి దేశప్రజలు తరిస్తారు."

మరల ఈ విధంగా మాట్లాడాడు వ్యాసభగవానుడు: "శంకరా! నీకు నీవే సాటి! నీ భాష్యంలోని కొన్ని ఘట్టాలను తడిమి చూచాను. అనుమానాలకు అవకాశ మివ్వకుండా స్వప్రజ్ఞతో నీవు తెలివిగా తీర్చిదిద్దిన రీతులు అమోఘములు. శ్రీ గోవింద భగవత్పాదుల అడుగుజాడలలో మెలగి వారి ఆజ్ఞను శిరసావహించి చేస్తున్న ఈ కృషి అద్వితీయము అలౌకికము. సాక్షాత్తు శంకరుడవే నీవు! చావు పుట్టుకలు లేకుండా చేసికొన నెంచే వారికి రాచబాట నిర్మించావు గదా! బ్రహ్మతత్త్వాన్ని బహుళంగాను, స్థిరంగాను దేశమందు పాతుకొనేలా చేయి. అది నీ అవతార కర్తవ్యము".

ఆ మాటలు విన్న శంకరాచార్యుడు 'తాపసోత్తమా! తమ దయ వలన నా భాష్యరచనలు పూర్తి అయినవి. దేశమందున్న దుష్టమతాలను ఖండించాను. నా జన్మ సార్థక మైంది. నా ప్రార్థన ఆలకించండి. ఈ మణికర్ణికా ఘట్ట మందు నా కోసమై కొంచెము సేపు ఉండండి. మీ పవిత్రసన్నిధానమందు ఈ శరీరాన్ని విడిచిపెట్టెదను" అని శంకరు డర్థించగా ఆ పలుకులు ములుకులు వలె తగిలిన ఆ మహాముని పరితపించి శంకరుని చూచి ఇట్లా అన్నాడు: "నాయనా! నీ కార్యభారం ఇంకా పరిపూర్తి కాలేదు. దేశంలో అపరిణత బుద్ధితో వక్రమార్గావలంబు లైన అప్రబుద్ధులు ఇంకా ఉన్నారు. వారి వలన హాని ఎక్కువ జరుగుతోంది. అట్టి వారిని నీ ప్రతిభాపాటవాలతో సరియైన దారికి మళ్ళించి అద్వైతమతవ్యాప్తికి సుస్థిర సంస్థానిర్మాణం కావించవలసిన గురుభారం నీ భుజస్కంధాల పై ఉండగా నీవు తొందర పడకు" అని బోధించి మరల అంటాడు ఆ మహాత్ముడు. "శంకరా! నీవు ఎనిమిది ఏళ్ల ఆయుష్షుతో పుట్టావు. నీ మహిమతో అది

రెట్టింపయింది. ఇంకా నీ పని ముగియలేదు. అందుకని నీకో వరమిస్తున్నాను. మరి పదారేడుల ఆయువు ఆ పరమేశ్వరుని అనుగ్రహపూర్వకంగా నీకు లభిస్తోంది. నీ చరిత్ర ఆచంద్రతారార్కమూ ప్రసిద్ధమగు గాక!" ఈవిధంగా దీవన ఇచ్చి అంతర్ధాన మయ్యాడు కృష్ణద్వైపాయనుడు.

**ఇది శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక శేఖర ముముక్షు జన నిధాన**
**శ్రీ దేవకీనందన స్వామి గురుప్రసాద లబ్ధ విజ్ఞానవితాన**
**యల్లాప్రగడ వెంకట సూర్యనారాయణమూర్త్యభిధాన విరచిత**
**శ్రీ శంకరావతార చరితమునందు సన్న్యాస కాండ సమాప్తము**

# 4. విజయ కాండ

## 4.1 విజయ యాత్ర

వాదోపవాదములు చేసి శత్రువులను జయించమని ఈశ్వరాజ్ఞ, విష్ణుసన్నిభుడైన వ్యాసభగవానుని బోధ. ఇక జ్ఞానయుద్ధమే తరువాయి. ధర్మయుద్ధమైన కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణపరమాత్మ అండ పాండవులకు లభించినట్లుగనే శివకేశవుల కరుణ శ్రీశంకరాచార్యులకు లభ్యమైంది. అర్జునుని అక్షయతూణీరాల వంటివి శంకరుని సూత్రభాష్యాలు. పార్థునకు దివ్యరథాలు ప్రాప్తించినట్లు శంకరునికి ఉపనిషత్తులు చాలు. పదునెనిమిది అక్షౌహిణుల సేనల పోరాట మది పదునెనిమిది రోజులుగా సాగినది. పదునెనిమిది అధ్యాయాల భగవద్గీత శంకరుని హృదయంలో చేరింది. ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు పాండవ సేనకు అధ్యక్షుడైనాడు.

ఇక్కడ 'స్వయం మంత్రీ స్వయం రాజా' అన్నట్లుగా శ్రీశంకరుడే అన్నీ నిర్వహిస్తాడు. అర్జుననకు తోడుగా నలుగురు సోదరులుండగా ఇక్కడ దిగ్గజాల లాంటి పద్మపాదాది శిష్యప్రకాండు లున్నారు. పాండవుల పక్షాన ధర్మమున్నట్లే శంకరుని పక్షాన ధర్మముతో కూడిన ఆత్మవిశ్వాసశక్తి ప్రబలంగా ఉన్నాయి.

పాంచజన్యాన్ని మధుసూదనుడు, దేవదత్తాన్ని విజయుడు పూరించినట్లు ఒక సుముహూర్తాన శ్రీశంకరాచార్యుడు తత్త్వశంఖారవం చేశారు. ఆ శంఖారావము కాశీలోనే కాదు యావద్భారతదేశము లోని ధర్మశత్రువుల గుండెలు దద్దరిల్లేలా వినిపించింది. విన్న యతులు, యోగులు, ముముక్షువులు, సాధుజనులు కర్ణానందంగా విన్నారు. ఆ అవతార మూర్తి రాకకై రాకాచంద్రునికి సముద్రునిలా ఎదురుచూస్తున్నారు.

గంగాస్తవాలు చేసికొంటూ, గంగాస్మరణలతో తనకు దగ్గఱలోనే మెలగుచున్న శంకరసేనను చూచి గంగ ఉత్తుంగ తరంగాలతో

ఉప్పొంగిపోతోంది. హరిహరులకు భేదము లేదని ఆచార్యులవారు బోధించేవారు. శంకరాచార్యుని వైష్ణవులు సాక్షాద్విష్ణువుగాను, శైవులు సాక్షాత్తు శివునిగాను భావించి నమస్కరించే వారు.

శివుడు, విష్ణువు, సూర్యుడు, గణపతి, అంబిక అనే పంచాయతనాన్ని పూజించమని ఆదేశించేవారు. అందు ఎవరికి ఏది అభిమతమో దానిని ప్రధానంగా ఎంచి అర్చించుకొమ్మన్నారు. ఆనాడు శంకరుని వాక్కు వేదవాక్కు. శంకరాచార్యుల బోధాసుధారసం హృదయాంతరాళాలలో స్థిరీకరించని వారు లేరు. ఎండ మిక్కుటంగా ఉన్నపుడు చెట్లనీడల నాశ్రయించి విశ్రమించేవారు. సూర్యు డస్తమించు వరకు ప్రయాణము సాగిస్తూ సంధ్య నుపాసిస్తూ, రాత్రి వేళల గంగాతీరమందే ఉండి నిద్రించు వరకు ధర్మప్రవచనాలతో కాలక్షేపం చేసేవారు. సర్వభూతాలు ఆ వైదిక వాక్కులకు పరవశ మయ్యేవి. దారిలో ఆచార్యుల బోధలు విన్న వారు ఈ శిష్యపరివారంలో చేరి వీరి వెంట వచ్చేవారు. శంకరపరివారం అలా దినదినాభివృద్ధి చెందింది. వారు వెళ్ళే దారిలో చరణాద్రి, తరువాత వింధ్యాద్రి కనిపించాయి. ఆచార్యులవారు శిష్యులకు చెప్పారు వింధ్యాద్రి కథ. అగస్త్యుడు ఎలా ఆ నగాన్ని అణచివుంచాడో.

## 4.2 ప్రయాగ మహిమము

ప్రజాపతి బ్రహ్మ యాగా లనేకం చేసిన చోటవడం చేత దానికి ప్రయాగ అనే సార్థకనామం ఏర్పడింది. 'ప్రజాపతి అగ్ని వేది' అని కూడా దానికి నామాంతరం ఉన్నది. ఏ అంతరాయం లేకుండా అక్కడ నిరంతరం అగ్నికుండాలు వెలుగుతుండేవి. నూరు యాగాల ఫలితాన్ని మించిన ఫలం ప్రయాగలో నివసించినవారికి లభిస్తుంది. ఈ రహస్యం తెలిసిన మునులు మున్నగు వారెందరో అక్కడే నివాసం ఏర్పరచుకొని ఉంటారు. చతుర్వేదాధ్యయనం, రాజసూయ యాగం, నిత్యసత్యవ్రతం ఆచరించిన ఫలం ప్రయాగ తీర్థాన్ని దర్శించి సేవిస్తే వస్తుంది. భరతునికి భరద్వాజ

మహర్షి విందు చేసినదీ చోటే. శ్రీరామచంద్రుడు తన పాదధూళితో పావనం చేసిన భరద్వాజాశ్రమం ఉన్న చోటు ఇదే. బ్రహ్మ చతుర్వేదాలనూ వెలువరించిన దిచ్చోటనే. అట్టి పరమ పవిత్ర మైన ప్రయాగను శంకరాచార్యుడు శిష్యగణంతో దర్శించుకొన్నాడు.

## 4.3 అక్షయ వట వృక్షము

కల్పాంతంలో సకలమూ నశించగా శ్రీమహావిష్ణుని దయచేత మార్కండేయమహర్షి మాత్రం సజీవుడై ఉంటాడు. అలా ఉండడానికి ఆశ్రయమిచ్చి నశ్వరం కానిదా మహావటవృక్షం. ఆ వటవిటపి కథ అపూర్వం. మొగలాయిల ప్రభుత్వకాలంలో హైందవ మతాన్ని కూలద్రోసి వారి మతాన్ని మాత్రమే భారతదేశంలో నిలబెట్టడానికి వారు చేసిన యత్నాలు ఇంతా అంతా కాదు. అగ్బరు పాలనలో జరిగిందిది. ఈ వటవృక్ష మహిమ విని తమ మత వ్యాప్తికి పెద్ద అంతరాయంగా ఇది ఉందనుకొన్నారు. “అగ్బరు ది గ్రేట్!” అనే బిరుదు అంటించారు అగ్బరుకు పాశ్చాత్యచారిత్రకులు. సర్వమత సహనం కల వాడన్న పొల్లు గుణం కూడా ఆ మహావ్యక్తికి ఆపాదించారు. ఆయన చేసిన మతసహన మహాకార్యం ఏమిటి? ఆ వృక్షం ఆర్షమతానికి ఆలంబనంగా ఉందన్న భావనతో దాని కొమ్మలు నతికించి మోడుగా చేశాడు! మట్టి చావలేదు సరిగదా సహస్రముఖాలుగా చిగిర్చి ఇతోధిక ప్రాబల్యం సంతరించుకొంది. అగ్బరు గతించినా ఆ తురుష్కుల ‘మతాసహనగుణం’ మాత్రం అంతరించ లేదు! తండ్రికి పట్టిన పిచ్చి వదలని జహంగీరు చెట్టు మొదల్నే నరకించాడు! ఔరా! మన మహావిటపి మాత్రం మరింత చైతన్యం శోభతో విస్తరిల్లింది. పట్టు వదలని ఆ రాజు మరగ కాచిన నూనెను పోయించాడా తరువు మొదట్లో! అయినా చెక్కు చెదరక నేటికీ కోటలా ఉన్న ఆ చెట్టు అక్షయవృక్ష మనే సార్థకనామంతో విరాజిల్లుతోంది. గంగా యమునా సరస్వతులు ప్రయాగలో కలిసి త్రివేణీసంగమ మయ్యింది. ఈ తీర్థంలో స్నానమాడిన వారికి

పరమకైవల్యపదం లభిస్తుంది. కోరికలతో స్నానమాడితే సఫలీకృతు లవుతారు. లక్షలాది జనాలు నిరంతరమూ వచ్చి ఆ ప్రయాగ గంగలో మునిగి అనంతమైన పుణ్యాలు మూట కట్టుకొని పోతుంటారు. 'కుంభమేలా' జరిగే దిక్కడే. యాత్రికులు హిరణ్యాలు పెట్టి పితృతర్పణా లర్పిస్తారు. అమావాస్య నాటికి ప్రయాగ చేరుకొన్న శంకరబృందం త్రివేణీ సంగమ స్నాన మాచరించారు.

## 4.4 కుష్ఠరోగి బాగుపడుట

శిష్యు డొకడు అక్షయ వటవృక్షాన్ని చూద్దామని వెళ్ళాడు. అక్కడ ఒక కుష్ఠరోగి ఆత్మహత్యాప్రయత్నంలో ఉన్నాడు. కాళ్ళు, చేతులు, శరీరమంతా పుండ్లు పడి రక్తహీనమైన శరీరం తెల్లబడి చెప్పరాని బాధ పడుచున్నాడు. ఎందులకీ పాడు జన్మ అని విరక్తుడై ప్రాణత్యాగానికి సిద్ధపడిన వానిని చూచి బ్రతికించాలన్న బీజాంకురం శిష్యుని హృదయంలో మొలకెత్తింది. ఎలాగో గురువుగారి కడకు చేర్చాడా దీనుణ్ణి. శంకరాచార్యుని సన్నిధానంలో ఉన్న వారంతా కుష్ఠరోగిని చూచి దూరంగా తొలగి వెళ్ళారు. శంకరుడు ద్వంద్వాతీతుడు. సుఖము గలిగించే సార్థకనాముడు. దగ్గఱకు రమ్మని పిలచాడు. ఏవేవో చికిత్సలు చేశాడు. ఆ చికిత్సల వలననో, శంకరుని అమృతహస్తమో యోగ మహిమయో గాని ఆ రోగి పుండ్లు ఊడి మచ్చలు మటుమాయమై శరీరం కరివేర పువ్వు రంగుతో వెలుగుతూ ఆతడు అనారోగ్యం వీడి తేజోవంతు డయ్యాడు. చూచిన వారందరు విభ్రాంతు లయ్యారు. ఉదంకుడు అనే పేరు పెట్టి అతణ్ణి సంఘం లోనికి పంపించారు శంకరులు.

## 4.5 కుమారిలభట్టు

గౌతమ బుద్ధు డవతరించి మతప్రచార మొనరించిన కొంతకాలానికి ఆయన శిష్యులు భిన్నవిధాలుగా శుష్కతర్కాలతో పలు రకముల పోకడలు

పోయారు. కడకు దేవుడు లేడనీ, వేదాలనూ ఉపనిషత్తులనూ నిరసించ నారంభించారు. ఆ విధంగా బౌద్ధమత స్వరూపం మారింది. జైనులు బౌద్ధమతాన్ని ఆదరించడంతో అగ్నిలో ఆజ్యం పోసినట్లైంది. నేర్పూ, చురుకుదనంతో వారి భావాలను బహుళంగా ప్రచారం చేసి ఆ మతవ్యాప్తికి చాలా శ్రమపడ్డారు. బౌద్ధగురువులు పాండిత్యం కలవారు కావడంతో వారు భావించినవే సత్యంగా గ్రంథస్థం చేశారు. అదీ ఆ నాటి పరిస్థితి.

సుమారు 2575 సంవత్సరాల క్రిందటి మాట. మహానదీతీరంలో జయమంగళము అనే గ్రామం ఉండేది. అందులో చంద్రగుణ యజ్ఞేశ్వరులనే పుణ్యదంపతులకు కుమారిలభట్టు ఉదయించాడు. వేదాలు, శాస్త్రాలు క్షుణ్ణంగా అభ్యసించాడు. జైమిని మహర్షి అడుగుజాడలలో మెలగుతూ వేద విహిత కర్మ కాండలను తానాచరిస్తూ ఇతరుల చేత చేయించు చుండే వాడు. బౌద్ధ జైన మతాలకు రాజాశ్రయం లభించడంతో ఆ మతస్థులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. వైదిక మతం ఆదరణను కోల్పోతోంది ప్రజలలో. ఇది సహించ లేక పోయాడు కుమారిలభట్టు. రాజాశ్రయం పొంది ఉన్న ఆ మతాలను వెడలగొట్టాలి. అందుకు ముందుగా ఆ మతంలో ఏముందో కూలంకషంగా తెలిసికొనాలి. అందుకని కుమారిలభట్టు బౌద్ధభిక్షు వేషం దాల్చి తక్షశిల లోని విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా చేరాడు. అందరితో బాటు విద్య నభ్యసిస్తూ ఆ మతం లోని గుట్టుమట్టులు కనిపెట్ట గలిగాడు. వాళ్ళు చేసే వేదనిందలు దుర్భరంగా ఉన్నా కార్యసాధకదీక్షతో వాటిని అన్నిటిని భరించాడు. విద్యాభ్యాసం చివరికి వచ్చేసరికి సహశిష్యులు ఇష్టాగోష్టిలో శ్రుతి స్మృతులను కర్మకాండలను దుయ్యబట్టుతున్నారు. ఘోరాతిఘోరంగా సాగుచున్న వారి మాటలకు సహించి మౌనంగా ఉండలేకపోయాడు. సహేతుకంగా వారి వాదనలు త్రోసిపుచ్చి వారి నోళ్ళు మూతపడేలా తెలియజేసాడు. సహశిష్యులందరు కలిసి కుమారిలుని ద్రోహిగా నిశ్చయించి గురువులకు నివేదించారు. అది విన్న గురువు

అట్టివాడుండ కూడ దనుకొని నిద్రించే సమయంలో అతనిని మేడపై నుండి క్రిందకు పడద్రోయ'మని ఆదేశించాడు. చూచారా! 'అహింస'కు పెద్ద పీట వేసిన మతస్థాపకుని శిష్యపరంపర! గురువు చెప్పినంత పనీ శిష్యులు చేశారు. అలా పడుతున్న కుమారిలభట్టుకు స్పృహ వచ్చి 'వేదములే మహత్తు కలవైనచో నాకెట్టి అపాయము రాకుండు గాక' అని తన కున్న నమ్మకాన్ని ఒడ్డుకొన్నాడు. దూదిలో పడ్డట్టు పడినా చావు తప్పి ఒక కన్ను పోయింది. దానితో అక్కడి నుండి తప్పించుకొన నిశ్చయించాడు.

నూలు పోగుతో బిగించుకొన్న తన కంకణాన్ని ఈ మారు ఉక్కు తీగతో బిగించాడు. అమరావతీ పట్టణం చేరుకొని భట్టపాదుడు అనే మారు పేరు పెట్టుకొన్నాడు.

## 4.6 అమరావతిలో కుమారిలభట్టు

అమరావతీ పట్టణాన్ని అప్పుడు సుధన్వుడు అనే మహారాజు పాలిస్తున్నాడు. అతడు ధర్మిష్ఠి, సజ్జనసమ్మతుడు. భట్టపాదు డన్న పేరుతో రాజ దర్శనం కోసం వేచి ఉన్నాడు కుమారిభట్టు. మాసిన బట్టలతో ఉన్నా అతని ముఖం బ్రహ్మవర్చస్సుతో ప్రకాశిస్తోంది. రాజు వెంటనే స్వాగతం పలికాడు. భట్టపాదుడు రాజును వేదోక్తంగా ఆశీర్వదించాడు. ఆ రాజు కొలువులో చార్వాకులు చర్చలు చేస్తుంటారు. భట్టపాదుడు వారితో వాదించి శాస్త్రాధారాలను ఎత్తి చూపుతూ వేద మత ప్రామాణ్యాన్ని నిరూపించాడు. బౌద్ధులకూ వేదాలు సరిపడవు. కుమారిలభట్టు రాజాస్థానచర్చలలో పాల్గొని సభకు ఒక విలువ తెచ్చాడు. అది గమనించినా రాజు ఏ పక్షమూ చేరకుండా మౌనం వహించే వాడు.

సుధన్వుని రాణి పూర్వాచారపరాయణురాలు. దైవభక్తితో ఉండే ఆమెకు మహారాజు నాస్తికు డగుతాడేమో నన్న భయం ఉంది. భర్తతో మాటాడగా మహారాజు 'నాస్తిక్యానిదే పైచేయిగా ఉంది కాబట్టి నే నేమీ చేయలేను' అని చెప్పాడు. ఈ రహస్యం తెలిసికొన్న భట్టపాదుడు పట్టపుదేవిని ఆశ్రయించాడు.

భట్టపాదుని మహానుభావత్వం మీద సుముఖంగా ఉంది మహారాణి. రాజ సభలో మతాలను గురించి కఠోర పరీక్ష పెట్టేటట్లుగా సుధన్వుని ఒప్పించ మని వేడుకొన్నాడు భట్టపాదుడు. రాజు అంగీకరించి మరునాటి సభలో మతపరీక్ష జరగాలని ప్రకటించాడు. భట్టపాదుడు లేచి "మహారాజా! ఎవరైతే పర్వత శిఖరాగ్రం నుండి క్రిందబడి బ్రతుకుతారో వారి మతమే శ్రేష్ఠ మని ప్రభువులు నిర్ణయించాలి" అని కోరాడు. ముందుగా భట్టపాదుణ్ణే దింపుదామన్న భావంతో చార్వాకులు ఒప్పుకొన్నారు ఆ పరీక్షకు. ఈ సంగతి తెలిసిన మహారాణి భట్టపాదుని పిలిపించి అతనితో ఇలా అంది. "మహాశయా! ఏమిటీ ఘోర పరీక్ష? శాస్త్రాధారములు చాలవా? యుక్తి యుక్తమైన వాదనలతో వేదముల ఆధిక్యాన్ని నిరూపించవచ్చు గదా! తొందర పడకండి భట్టూ!" అని ప్రార్థించింది. దానికి సమాధానంగా "అమ్మా! సకల శాస్త్రాలు వేదము అభ్యసించిన పిమ్మట జైన మతం లోని రహస్యాలను క్షుణ్ణంగా తెలిసికొన్నాను. వేదములు పురుషులు సృష్టించినవి కావు. పరాత్పరుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అవి. వాటికీ భగవంతునకూ అభేదము. ఈ విషయాలు నిరూపించాలంటే మాటలతో అయ్యేటట్లు లేదు. మాటకు మాట, యుక్తికి యుక్తి కలిగి తెలివి గల వాళ్ళు ఆ శుష్కపద్ధతులకే తల ఒగ్గుతారు. అందుచేత నాకు ఇప్పుడు ప్రత్యక్ష ప్రమాణము కన్న వేరు గతి కనిపించడం లేదు. తల్లీ! పరాత్పరుడు సత్యరూపుడు. ఆ సత్యాన్ని నమ్మిన నాకు భయమేల?" అని బదులు పలికాడు.

మరునాడు పరీక్ష. పరీక్షకు మొదటి అవకాశం తాను తీసుకొంటా నని అభిప్రాయం వెలిబుచ్చాడు భట్టపాదుడు. చార్వాకులకు అది ఆనందదాయక మైంది. దీనితో తమ కొక పీడ విరగడ అవుతుందనుకొన్నారు జైనులు, బౌద్ధులు, చార్వాకులు! భట్టపాదుడు ఒక ఎత్తైన పెద్ద పర్వతం ఎక్కి అమాంతం క్రిందికి దూకివేసాడు. చెక్కుచెదరకుండా నిక్షేపంగా ఉన్న భట్టపాదుని చూచి ఆ క్షణంలోనే జయ జయ ధ్వానాలతో ఆయనకు

నీరాజనాలు సమర్పించారు. భట్టపాదునికి మహారాజసభలో అగ్రస్థానంలో వేదఘోషల మధ్య సత్కారం చేశారు. సుధన్వ మహారాజు వేదమతమే సర్వశ్రేష్ఠమనీ, సర్వోన్నతమనీ ప్రకటించాడు.

చార్వాకులు అంతటితో వదలి పెట్టలేదు. ఇంద్రజాలం, మంత్ర తంత్ర విద్యలతో భట్టపాదుడు మనల్ని మభ్యపెడుతున్నాడు అన్న వాదన లేవదీశారు. రాజు ఆ వాదనలను అంగీకరించలేదు. అయినా మరొక పరీక్ష పెడదా మని నిర్ణయించాడు. మూతి గట్టిగా బిగించిన ఒక భాండాన్ని తెప్పించి 'ఈ భాండంలో ఏముందో' రహస్యంగా పత్రాలపై లిఖించండి. సరిగా చెప్పగల వారి మతమే గొప్ప దని నిర్ణయిస్తాము. తక్కిన వారికి మరణ శిక్ష.' అని ప్రకటించాడు. చార్వాకులకు అది ఒక గడ్డు సమస్యగా ఉండి వ్యవధి కోరారు. రాత్రంతా కలిసి ఒకచోట మీన మేషాలు లెక్కలు కట్టారు. భట్టపాదుడు కుత్తుక బంటి నీటిలో నిలబడి రాత్రంతా పరమేశ్వరుణ్ణి ధ్యానం చేశాడు. తెల్లవారింది. రాజ్యసభ కిటకిట లాడుతుండగా రాజు పత్రాలు తెమ్మన్నాడు. భాండం లోపల పాము ఉందని చార్వాకులు వ్రాసి ఇచ్చారు.

భట్టపాదుడు అందు శేషశాయి ఉన్నాడు అని వ్రాశాడు. ఇంతలో 'భట్టపాదునిదే సరియైనది' అన్న ఆకాశవాణి వినిపించింది. సందేహ నివృత్తి కొఱకు భాండము తెఱచి చూచారు. రాజు ఆశ్చర్యచకితు డైనాడు. శేషశాయియే కన్పడ్డాడు. నిజానికి రాజు లోన పెట్టినది పామునే. చార్వాకులు ఈ రహస్యాన్ని ఎవరి ద్వారానో సేకరించి ఉంటారు. ఈ పరీక్షలో కూడ భట్టపాదుడే నిర్ద్వందంగా నెగ్గినట్లు ప్రకటించి నాటి నుండి వేదాలే ఆదరణీయాలు అన్న రాజాజ్ఞ వెలువడింది.

అప్పుడు జైన బౌద్ధమతవాదులు రాజుతో ఇలా విన్నవించారు: "రాజా! మేము ఇన్నాళ్ళూ ప్రత్యక్ష ప్రమాణం కల వేదమతాన్ని దూషించి మహాపాతకం చేశాము. అవతార పురుషుడైన ఈ మహాత్మునితో పోటీ పడ్డాము. మేము శిక్షార్హులం. శిక్ష త్వరలో అమలు చెయ్యండి" అని వేడుకొన్నారు. వారు

అంతా కూడి ఇరువది ఒక్కరు. వరుసగా నిలబడి ఉన్నారు. ఖడ్గం పుచ్చుకొని శిరచ్ఛేదం చేద్దామని వధ కారుడు సిద్ధమవుతున్నాడు. ఇంతలో అటు నుండి నరక మని కేక వినబడింది. సరే నని ఆ పని చేస్తుంటే చివర నున్న వాడు అమరసింహడు. తాను భట్టపాదునితో మాట్లాడగోరాడు. ఆ వార్త విన్న మహారాజు భట్టపాదుని తోడ్కొని వచ్చాడు. వారికి నమస్కరించి అమరసింహుడు తన కోరికను ఈ విధంగా విన్నవించాడు: "స్వామీ! లోకోపకార దృష్ట్యా ఒక ఉద్గ్రంధాన్ని రచిస్తున్నాను. అది పూర్తి కావచ్చింది. అది సంస్కృత భాషాధ్యయనానికి మకుటాయమాన మైనది. నా గ్రంథం పూర్తి అయ్యే వరకు నేను బ్రదికి ఉండడం అవసరం అనిపించి ఈ నా ప్రార్థన మన్నిస్తారని వేడుకొంటున్నాను. ఇది జీవితాశతో కోరుకొంటున్నది కాదు". తరువాత తన గ్రంథము లోని కొన్ని శ్లోకాలను వినిపించాడు. వెంటనే భట్టపాదుడు అది అత్యంత విశిష్టమైన గ్రంథము. అట్టి గ్రంథ రచయితను లేకుండా చేసి లోకానికి లోటు కలిగించ కూడ దని చెబుతాడు. వధ మానిపించాడు. ఆ గ్రంథమే 'అమరకోశము' అనే పేరుతో ప్రఖ్యాతి గాంచినది.

## 4.7 తుషానల ప్రవేశము

'కర్మాచరణము కన్న మానవునకు కావలసినది వేరొండు లేదనే దృఢసంకల్పంతో చేసిన కృషిలో సఫలీకృతుడ నయ్యాను. ఈ యత్నంలో కపటవేషం ధరించి గురుద్రోహం చేశాను. ఈ పాపానికి నిష్కృతిగా నాకు నేనే శిక్ష విధించుకోవాలి' అని నిశ్చయించు కొన్నాడు కుమారిలభట్టు! ఊకను రాశిగా పోయించి అందులో తాను పరుండి నిప్పును తానే ముట్టించుకొన్నాడు. ఇలా చేస్తున్నాడన్న వార్త తృటిలో దేశ మంతా వ్యాపించి శంకరాచార్యుడు కుమారిలభట్టును దర్శించడానికి బయలుదేరాడు. "కుమారిలా! ఏమిటీ ఘోరము? నీవు అపరాధాలు చేసేవాడవా? ఎందుకీ క్రూర కార్యం చేపట్టావు?" అని శంకరుడు అడుగగా

"శంకరానందస్వామీ! మీరు ఇచ్చటికి వచ్చి నాకు తమ దర్శన భాగ్యం కల్పించారు. ధన్యుణ్ణి. నేను రెండు అపరాధములు చేసినవాడను. ఒకటి శిష్యరికం కపటంగా చేసి ఆ గురువు మతాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకొన్న గురుద్రోహిని. రెండవది ఆత్మతత్త్వాన్ని మరుగు పరచి కర్మవాదాన్ని ఒక్కటీ అమలు పరచిన వాడను. అందు వలన ఆత్మద్రోహం చేశాను. దీనికి శాస్త్రరీత్యా తుషానలప్రవేశం చేసి సజీవదహనమే ప్రాయశ్చిత్తము" అని వినయంగా సమాధాన మిచ్చాడు కుమారిలభట్టు. అందుకు శంకరుడు "భట్టాచార్యా! నీవు కర్మమతాన్ని ఉద్ధరించుటకే కదా అవతార మెత్తితివి! నీవు చేయదలచిన దంతా చేశావు. పవిత్రుడవు నీకు ప్రాయశ్చిత్త మెందుకు? లెమ్ము. ఈ శిక్ష మానుకొమ్ము!" అని ఆదరంగా పలికాడు శంకరుడు. "అవతారమూర్తీ! నీకు తెలియనిదేమున్నది? సృష్టి స్థితి సంహారాలు నీ అధీనములు. శాస్త్రాన్ని కాదనజాలను. కాదంటే ప్రపంచమే నన్ను నిందిస్తుంది. ఇది మీకు తెలియనిది కాదు. నన్ను బ్రదికించడం తమ కొక లెక్కా? మీరు కేవలం శివావతారులు. మీకు జయం తప్పదు. మాహిష్మతీపురంలో మండనమిశ్రుడను పేరు కలవాడున్నాడు. అతడు నా శిష్యుడు. నా యంతటి వాడు. అతని భార్య అపర సరస్వతి. సూత్రభాష్యానికి వార్తికాలు వ్రాయగల సమర్థుడతడే. ఆతనిని జయిస్తే మీ అవతారాశయం నెరవేరుతుంది. పరాత్పరా! అవసాన కాలమందు అవతారమూర్తుల సన్నిధానం లభించడం నా పూర్వపుణ్యఫలం. నాకు ఆత్మతత్త్వాన్ని ఉపదేశించి సర్వబంధ విముక్తుణ్ణి చేయండి" అని ప్రార్థించిన కుమారిలుని కోరిక మన్నించి తత్త్వోపదేశం చేయగా మరుక్షణం కుమారిలుడు బంధనాలను త్రెంచుకొని ముక్తుడై మౌనం దాల్చి కన్ను మూశాడు. తుషానలం ఒక్కసారి గుప్పుమన్నది. కుమారిలుడు కైవల్యం చేరుకొన్నాడు.

## 4.8 ప్రభాకరాచార్యుడు

ప్రయాగ కెదురుగా గంగానది కవ్వల ఒడ్డున ఉన్నది ప్రతిష్ఠానపురం. ఒకప్పుడు చంద్రవంశపు రాజులు దాన్ని రాజధానిగా చేసికొని పరిపాలించే

వారు. ఒకప్పుడు అది దగ్ధం కాబడి నేటికీ శిథిలావస్థలో కానవస్తుంది. కుమారిలభట్టు శిష్యులలో ఒకడు ప్రభాకరాచార్యుడు అనే వాడు ఆ పట్టణంలో నివసిస్తున్నాడు.

అతడు మహాపండితుడు. కర్మకాండ యందే నిష్ఠతో యజ్ఞయాగాది క్రతువు లెన్నో చేసి దేవతలను తృప్తి పరచేవాడు. కర్మకాండలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టిన వాడు. తనంతటి వాడు లేడన్న ధైర్యంతో ఎవ్వరినీ లెక్క చేసేవాడు కాడు. అందుచేతనే కాబోలు శంకరాచార్యుల ప్రశస్తి విన్నా శంకరుని దర్శనానికి వచ్చే యత్నం చేయలేదు. ప్రయాగలో ఉండగా శంకరుని కాయన సంగతి తెలిసి ప్రభాకరాచార్యుని చూడడానికి శంకరాచార్యులే బయలుదేరాడు. తన్ను చూడడానికి వస్తున్నాడంటే తానే అధికుడ ననే భావన చోటు చేసికుంది ప్రభాకరాచార్యుని మనస్సులో!

శంకరాచార్యులను కలిసిన తర్వాత ఆ మనోదౌర్బల్యం చెల్లాచెద రయ్యింది. శంకరుని తన మతంలో కలుపుకొనడాని కిది మంచి అదనని కల గన్న ప్రభాకరుడు శంకరుల వాక్పటిమకు తట్టుకోలేక దాసోహ మన్నాడు. ఆ శ్రీశంకరాచార్య వాఙ్మయ మహాసముద్రంలో ఎన్ని ఏఱులు అప్పటికే చేరాయో కదా! ఇదొక లెక్కా! ప్రభాకరాచార్యులకు ఒక మూగగా పుట్టిన కొడుకు ఉన్నాడు. అప్పటికి పదమూడేండ్ల వయస్సు. పేరు పృథివీధరుడు. అయిదేళ్ళ ప్రాయం నుండి మాటామంతీ లేకుండా మౌనంగా ఉండి పోయాడు. అతనికి పైపెచ్చు ప్రాపంచిక దృష్టి లేదు. అమ్మా అని పిలిచి ఎఱుగడు. వైద్యాలు కాని ఏ విధంగాను పిల్లవాడి పరిస్థితి మెఱుగు పడటం లేదు. శ్రీశంకరుల దగ్గఱకు తీసికొని వచ్చి "స్వామీ! ఈ నా పుత్రుని మామూలు మనిషిగా మార్చగల సర్వశక్తి సంపన్నులు మీరు. నా పైన దయతో మమ్ములను కాపాడండి" అని ప్రార్థించాడు ప్రభాకరాచార్యుడు. శంకరాచార్యుడు బాలుని బాగుగా పరిశీలించారు. అంతర్గర్భితమైన గొప్ప భావాలు ఆ బాలునిలో ఉన్నట్లు తెలిసికొన్నారు. తండ్రిది కర్మజీవనం. ఆ

వయస్సులోనే బాలునికి జ్ఞానదృష్టి పెంపొంది తనతో మాటలాడి తన భావాలు వినేవారు ఎవ్వరూ లేరన్న నిర్ధారణతో చిన్నప్పటి నుండే మౌనం వహించి నటుల తెలిసిపోయింది శంకరునికి. ప్రేమ, ఆదరము చూపి బాలుని యథా జీవన ప్రవంతి లోనికి తేవచ్చు నని గ్రహించారు. బాలకుని తలపై చేయి వేసి "బాలకా! నీవెవ్వడవు? నీకు ఎవరితో సంబంధమున్నది? ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చావు? నీ పేరేమిటి? నా ప్రశ్నలకు సమాధానం ఇచ్చి నన్ను సంతోషపెట్టుము" అని అడిగారు శంకరస్వామి.

## 4.9 హస్తామలకుడు

శంకరాచార్యుల వారి ప్రశ్నలకు ఆ బాలకుడు ప్రబుద్ధుడై, వెనువెంటనే అపూర్వమైన వాగ్ధాటితో ఈ క్రింది శ్లోకాలుగా సమాధానాలు చెప్పాడు:

**"నాహం మనుష్యో న చ రేవ యక్షా, న బ్రాహ్మణో నైవచవైశ్య శూద్రాః**
**న బ్రహ్మచారీ న గృహీ వనస్థో, భిక్షు ర్న చాహం నిజబోధ రూపః॥**

**నిమిత్తం మనశ్చక్షురాది ప్రవృత్తౌ, నిరస్తాఖిలోపాధి రాకాశ కల్పః**
**రవి ర్లోక చేష్టా నిమిత్తం యథాయః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**యమగ్న్యుష్ణవ న్నిత్యబోధస్వరూపం, మనశ్చక్షు రాదీన్యబోధాత్మ కాని**
**ప్రవర్తన్త ఆశ్రిత్య నిష్కమ్ప మేకం, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**ముఖా భాసకో దర్పణే దృశ్యమానో, ముఖత్వాత్ పృథక్త్వేన నైవాస్తి వస్తు**
**చిదా భాసకో ధీషు జీవోపి తద్వత్, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**యథా దర్పణాభావ ఆభాసహానౌ, ముఖం విద్యతే కల్పనాహీన మేకం**
**తథా ధీవియోగే నిరాభాసకో యః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**మనశ్చక్షురాదే ర్వియుక్తః స్వయం యో, మనశ్చక్షురాదే ర్మనశ్చక్షురాదిః**
**మనశ్చక్షు రాదే రగమ్య స్వరూపః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**య ఏకో విభూతి స్వతః శుద్ధచేతాః, ప్రకాశస్వరూపోపి నానేవ ధీషుః**
**శరావోదకస్థో యథా భాను రేకః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**యథానేక చక్షుః ప్రకాశో రవిర్న, క్రమేణ ప్రకాశీకరోతి ప్రకాశ్యమ్**
**అనేకాధియో యస్తదైక ప్రబోధ:, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**వివస్వత్ ప్రభాతం యథారూపమక్షం, ప్రగృహ్ణాతి నాభాతమేవం వివస్వాన్**
**యదాభాత ఆభాసయ త్యక్షమేకః , సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**యథా సూర్య మేకో ప్యనేక శ్చలాసు,స్థిరాస్వప్యనన్వగ్నిభావ్యస్వరూపః**
**చలాసు ప్రభిన్నాసు ధీష్వేవ మేకః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**ఘనచ్ఛన్నదృష్టి ర్ఘనచ్ఛన్న మర్కం, యథానిష్ప్రభం మన్యతేచాతి మూఢః**
**తథా బద్ధవద్భాతి యో మూఢదృష్టేః, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**సమస్తేషు వస్తుష్వనుస్యూతమేకం, సమస్తాని వస్తూని యన్న స్పృశన్తి**
**వియద్వత్సదా శుద్ధ మచ్ఛ స్వరూపం, సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా॥**

**ఉపాధౌ యథా భేదతా సన్మణీనాం, తథా భేదతా బుద్ధి భేదేషు తేపి**
**యథా చంద్రికాణాం జలే చఞ్చలత్వం తథా చఞ్చలత్వం తవాపీహ విష్ణో॥**

అట్లు పృథివీధరుడు తన అనుభూతిని శంకరాచార్యస్వామికి విన్నవించుకొన్నాడు. విన్న అందరూ ఆ దృశ్యాన్ని చూచి విభ్రాంతులయ్యారు. శంకరుని మహిమకు జోహారులర్పించారు. ఆమలకం హస్తంలో ఎంత స్పష్టంగా కనిపిస్తుందో ఆత్మతత్త్వం పృథివీధరునిలో వ్యక్తం కావడంతో అతనికి 'హస్తామలకుడు' అని నామకరణంచేశారు శంకరాచార్యులు. అప్పుడు శంకరులవారు ప్రభాకరాచార్యునితో " ప్రభాకరాచార్యా! చూచావు కదా! ఈ నీ పుత్రుడు ఎట్టివాడో! ఈతడు సర్వజ్ఞుడు. ఇటు వంటి వాళ్ళు చూచే వాళ్ళకు పిచ్చివాళ్ళలా కనబడతారు. ఇతడు నీ దగ్గఱ ఉండడం కల్ల. వీని చిత్త మేనాడో పరమేశ్వరాయత్త మయింది. బాహ్యప్రపంచంతో నిమిత్తం

లేనివాడు. మాతో ఉండదగ్గవాడు. కావున నాతో పంపి వేయి" అని చెప్పగా అంగీకరించి సంతోషంతో కుమారుని శంకరుల కప్పగించాడు. ఈ విధంగా పృధివీధరుడు హస్తామలకుడుగా శ్రీశంకరాచార్యుల శిష్యుడయ్యాడు.

## 4.10 మాహిష్మతీ పురము

మాహిష్మతీపురంలోని మండనమిశ్రుని కలవాలని ఆయత్తపడుచున్నారు శంకరాచార్యుడు. అది చాల దూరంలో ఉంది. ఎక్కడికి వెళ్ళాలన్నా కాలినడకే తప్ప వేరు సాధనాలు లేని పరిస్థితి. ఈనాడు యంత్రాలతో జరుగుతున్నవి ఆ నాడు యోగశక్తులతో జరిగేవి. వ్యవధి చాల తక్కువగా ఉండడంతో యోగబలంతో శంకరుడు శిష్యపరివారంతో సహా గగన మార్గాన మాహిష్మతీపురం సమీపించారు. దగ్గఱలో నున్న ఒక చక్కని ఉద్యానవనంలో ఒక చెట్టు నీడను విశ్రాంతి తీసికొన్నారు.

మాహిష్మతీపురం ఆ నాటి మహానగరాలలో ఒకటిగా పేరెన్నిక గన్నది. తారల కెగబ్రాకు సౌధరాజములు, బహుసుందరమైన దివ్యభవనాలు వారికి దర్శన మిచ్చాయి. బిందెలు చంకన పెట్టుకొని వచ్చే పరిచారికలు కనబడి మండనమిశ్రుని నివాసగృహం జాడ అడిగారు శిష్యులు. ద్వారం దగ్గఱ పంజరాలు, అందులో రామచిలుకలు, గోరువంకలు ఉంటాయి. అవి ఈ విధంగా చర్చిస్తుంటాయి:

**"స్వతః ప్రమాణం, పరతః ప్రమాణం**
**ఫలప్రదం కర్మ ఫల ప్రదోషః**
**జగ ద్ధ్రువం స్యా జ్జగ దధ్రువం స్యాత్"**

అని గీర్వాణభాషలో బదులు పలికారా భామలు! చిలుకలు, గోరువంకలు, పరిచారికలు సంస్కృతంలోనే మాటలాడడం చూచిన వారంతా ఆశ్చర్యపడ్డారు ఆమండన మిశ్రుడు ఇంక ఎంత మహా పండితుడో కదా అని. శిష్యులకు ఆ చిలుక పలుకులకు అర్థం తెలియక తికమకపడి

గురువుగారిని అడిగారు. "చిలుకలు మన మాడిన మాటలే విన్నంత మాత్రాన తిరిగి చెప్పుతాయి. వాటికి ఆ నేరుపు ఉండడం సృష్టి విచిత్రం. దేశంలోని పండితులకు అన్నీ సందేహాలే. మండనమిశ్రుని వద్దకు వచ్చి అడుగుతుంటారు. శాస్త్రాధారాలతో వారి సందేహనివృత్తి చేస్తాడు మండనమిశ్ర పండితుడు. ఆ ప్రశ్నలూ జవాబులూ వినిన చిలుకలు వాటినే మననం చేసికొంటూ ఉంటాయి. మనకు చెప్పిన మాటలకు అర్థం ఇది. మీమాంసకులు స్వత: ప్రమాణము అందురు. జ్ఞానులు అపౌరుషేయాలు అంటారు. మిగిలిన వాళ్ళు పరత : ప్రమాణము లంటారు. అంటే పౌరుషేయాలని. తరువాతి దాని కిది మూలం : ఎవడు చేసికొన్న కర్మ ననుసరించి దాని ఫలాన్ని వాడే పొందుతాడు. సత్కర్మ అయితే సత్ఫలితాన్నీ, దుష్కర్మ అయితే చెడ్డ ఫలితాన్నీ పొందుచున్నాడు. దుఃఖ ప్రారబ్ధమయినా, సుఖ ప్రారబ్ధమయినా అనుభవించి తీరాలని శాస్త్రాలు ఎలుగెత్తి చాటుతున్నాయి. ఇందులో పరాత్పరునికి సంబంధం లేదు. అతడు కర్మనూ ఇవ్వడు ఫలితాన్నీ ఇవ్వడు. కేవలం సాక్షీభూతుడు.

ఇంక మూడవ భాగం : జగత్తు నిత్యం కాదని వేదాంతులంటారు. త్రాడును చూచి పాము అనుకొంటారు. అది పాము కాదని తేలే వరకు అది పాము లాగే కనిపిస్తుంది. త్రాడు పాము కాదని తెలిసిన తర్వాత త్రాడు త్రాడుగనే ఉంటుంది. అలాగే జగత్తును తెలిసికొన్న తర్వాత జగత్తు అనిత్యమే అవుతుంది. ఇది ఇట్లుండగా విజ్ఞులు జగత్తును 'మిథ్య' అన్నారు. చూపులకు నిజంలా గోచరిస్తుంది. అట్టిది నిజం కానిది ఎట్లు? ఈ జగత్తు ఒకప్పుడు నాశం కావలసిందే.

అందుకే దీనిని 'మిథ్య' అన్నారు." అని వివరంగా బోధించారు శంకరాచార్యుడు. పరిచారికలు చెప్పిన గుఱుతులు ఆధారంగా తెలిసికొన్నారు వారు మండనమిశ్రుని ఇల్లు. అది మహారాజగృహంలా ఉంది. శంకరబృందాన్ని చూచిన చిలుకలు కిలకిలారావాలు చేశాయి.

## 4.11 మండనమిశ్రు నింట ప్రవేశము

సింహద్వారం గట్టిగా బిగించ బడి ఉంది. అన్ని ద్వారాలు మూసివేయబడి ఉన్నాయి. ఇక మార్గాంతరం లేక శిష్యుల్ని అరుగు మీద కూర్చోబెట్టి శంకరుడు ఒక్కసారిగా గగనాని కెగిరి మండువా లోనుండి ఇంట్లోనికి ప్రవేశించాడు. శంకరుని సమదృష్టి పుట్టుకతో వచ్చినదే. ఇది నా ఇల్లు అది వారిది అన్న భేదం ఆయనకు ఎప్పుడూ లేదు. ఆ రోజు మండనమిశ్రుని తండ్రి తద్దినం. ఏ లోపమూ రాకూడదని గృహద్వారా లన్నిటినీ మూసి వైచాడు. భోక్తలు మరెవ్వరో కాదు. విష్ణుసన్నిభుడైన వ్యాసమహర్షి. ఆయన శిష్యుడు జైమిని మహర్షి! మంత్రపూతంగా వారిద్దరినీ ఉచితాసనాలపై కూర్చుండ బెట్టి కాళ్ళు కడుగుతున్నాడు మండనమిశ్రుడు. ఆ సమయంలో శంకరాచార్యస్వామి ఆ ముగ్గురి ఎదుట ప్రత్యక్ష మయ్యాడు. కర్మభ్రష్టులన్నా యతులన్నా మండనుడు మండిపడతాడు. వాళ్ళను చూస్తేనే సచేల స్నానం చేయాలన్న మత మాయనది. తలుపు లన్నీ బిగించి ఉన్నా ఎలా చొరబడ్డాడీతడు? అని కోపంతో పరవళ్ళు త్రొక్కుచున్నాడు. ఆ నాడు బౌద్ధ భిక్షువుల ప్రాబల్యం మూలాన వేదమతస్థులలో సన్న్యసించే వారు తక్కువ. అందు చేత సన్న్యాసులకు ఆదరణ లేదు. తద్దినం పెట్టే టప్పుడు మౌనంగా ఉండాలన్న నియమాన్ని కూడా త్రోసిపుచ్చి మండనమిశ్రుడు అతి క్రుద్ధుడై చింత నిప్పుల లాంటి కళ్ళతో శంకరుని వైపు మొగమై ఇలా అడిగాడు:

**మండనుడు:** కుతో ముండీ! ( 1. ఓ బోడీ! ఎక్కడ నుండి నీ రాక? 2. ఎక్కడి వరకు ముండనం చేసి కొన్నావు?)

**శంకరుడు :** ఆగళా న్ముండీ! (1. కంఠం వఱకే ముండనం చేయించు కొన్నాను 2. కంఠం వరకే క్షౌరం చేయించుకొనే వాడను)

**మండనుడు :** పన్థా స్తే పృచ్ఛతే మయా. (నీ మార్గము నాచే అడుగబడుచున్నది)

**శంకరుడు :** కిమాహి పంథా: (నిన్ను గూర్చి మార్గ మేమనెను?)

**మండనుడు :** త్వ న్మాతా ముండే త్యాహ! (ముండ అని చెప్పింది మీ యమ్మ!)

**శంకరుడు :** తథైవహి! (బాగు! బాగు! నీవు మార్గం అడిగి నందుకు మీ అమ్మ ముండ అని నీకు తగినదే చెప్పింది!)

**మండనుడు :** సురా పీతా కిము? (1. కల్లు త్రాగావా ఏమిటి? 2. కల్లు పచ్చగా ఉంటుందా?)

**శంకరుడు :** నైవ శ్వేతా యత స్మర! (కల్లు పచ్చగా ఉండదు. తెల్లగ ఉంటుంది. మరచితివా! జ్ఞాపకం తెచ్చుకో!)

**మండనుడు :** త్వం తద్వర్ణం జానాసి కిం? (నీకు అలవాటు కనుక దాని వర్ణం బాగా తెలుసు కాబోలు!)

**శంకరుడు :** అహం వర్ణం, భవా న్రసం! (నాకు రంగు తెలిస్తే నీవు రుచి తెలిసిన వాడవు!)

**మండనుడు :** మత్తో జాత: కలం జాశీ విపరీతాని భాషతే! (1. కలంజ భక్షణంతో విపరీతంగా మాటాడుచుంటివే! 2. నా వలన కుమారుడు కలంజాన్ని తిన్న వాడై విపరీతంగా మాట్లాడుచున్నావు)

**శంకరుడు :** సత్యం బ్రవీతి! పితృవ త్త్వత్తో జాత: కలంజ భుక్! (నా వలన కలంజం తినువాడు పుట్టె నని నిజమే పల్కావు!)

**మండనుడు :** కంథాం సహసి దుర్బుద్ధే! గర్దభే నాపి దుర్వహమ్! శిఖాయజ్ఞోపవీతాభ్యాం కస్తే భారో భవిష్యతి? (దుర్బుద్ధీ! గాడిద మోయలేని బరువును ఎలా మోస్తున్నావు? జుట్టూ జందాలు బరువయ్యాయా?)

**శంకరుడు :** దుర్బుద్ధే! తవ పిత్రాపి దుర్భరామ్ కన్థాం వహామి శిఖా యజ్ఞోపవీతాభ్యాం శ్రుతిర్భారో భవిష్యతి! (మీ తండ్రి మోయలేని బరువును

మోస్తున్నాను. శిఖాయజ్ఞోపవీతాలు శ్రుతికి బరువు కాని నాకు కాదు. శ్రుతులు చదువలేదా? విరాగులైన యతులకు అది ధర్మమే. నా ధర్మం గ్రహించే శక్తి నీకు లేకపోయింది!)

**మండనుడు :** వేదవిహితంగా పెళ్ళాడి పెళ్ళాన్ని పోషించలేక ఆమెను విడచి, శిష్యులంటూ ప్రోగు పెట్టుకొని వాళ్ళచేత మూటా ముల్లె మోయిస్తూ త్రిప్పుకొనే నీ బండారం బయటపడిందిలే! ఇదంతా వేషంగాక మరేమిటి?

**శంకరుడు :** బ్రహ్మచారివై గృహాన్ని విడచి గురువు నాశ్రయించి సకల విద్యలు నేర్చి అందులో ఉన్న రహస్యాన్ని గ్రహించలేక స్త్రీలోలుడైన వానికి బ్రహ్మసాక్షాత్కారం పొందాలంటే ఏం తెలుస్తుంది?

**మండనుడు :** నవమాసాలూ మోసి కని పెంచే తల్లులనే దూషిస్తున్నావు. ఇంత కన్న దారుణ ముందా?

**శంకరుడు :** ఎంత తెలివి లేనివాడవోయి! నేనేమీ తల్లిని దూషించడం లేదు. ఆడుదాని యోని నుండి బయట పడ్డావా! ఆమె స్తన్యం కుడిచితివా! అలాటి ఆడు దాని కుచాలను పట్టి కులుకుతావా! పుట్టిన స్థానాన్నే కామిస్తావా! నీకు పశువులకు తేడా ఏమిటి?

**మండనుడు :** త్రేతాగ్నులను వదలితే వీరహత్యను పొందుచున్నాడని వేదాలే వచిస్తున్నవి. ఇది నీకు ధర్మమే?

**శంకరుడు :** భవబంధనాలను త్రెంచే వేదాంత తత్త్వాన్ని తెలిసికోని వాడు ఆత్మహత్య చేసికొన్నట్లే అని వేదంలోనే ఉన్నది. అన్నిటి కన్న మిన్న కదా ఆత్మ హత్య!

**మండనుడు :** తలుపులు బిగిస్తే లోనికి రాకూడదన్న జ్ఞానం ఉండ నక్కఱ లేదా? దొంగ వలె దూరావు!

**శంకరుడు :** డేగ ఆహారాన్ని తన్నుకొని దూరంగా పోయి మ్రింగుతుంది. ఆ డేగ వలె యతుల కివ్వ దగ్గ దాన్ని ఇవ్వకుండా చేస్తున్నావు. కర్మానుష్ఠానం

చేయడం లేదా? గృహస్థాశ్రమంలో ఉండి ఎవరికీ కనిపించ కుండా అతిథుల్నీ అభ్యాగతుల్నీ పూజించడం మానుకొన్నావా?

**మండనుడు :** కర్మకాలే న సంభాష్య అహమ్! (పవిత్ర మైన శ్రాద్ధకర్మ సమయంలో ఒక మూర్ఖునితో సంభాషించ వలసి వచ్చిందే!)

**శంకరుడు :** పండితుడవే! కవివే! విద్య లేని వాని వలె, సామాన్యుని వలె మాటాడుచున్నావు. నీవు అనవలసినది 'కర్మకాలే న సంభాషాహమ్!' యతి భంగంగా మాటలాడే తెలివి కలవాడివి!

**మండనుడు :** యతిభంగానికై వర్తించే వానికి యతిభంగ దోషం రాదులే!

**శంకరుడు :** యతిని అవమానింప వచ్చున్న మాట?

**మండనుడు :** ఈ కలి లోనా సన్న్యాసం? దురాచారాలు, దుష్టబుద్ధులు చెలరేగుతుంటే బ్రహ్మజ్ఞానమా? పలురకాల రుచుల కోసం కాక యోగి వేషా లెందుకు?

**శంకరుడు :** అవునులే! కలికాలం కాక ఇలాంటి దురాచారాలు, అగ్నిహోత్రాలు ఎందుకు? విషయ వాంఛలు చంపుకోలేక వేసే వేషాలు కాక?

**మండనుడు :** జడుని వలె అయిపోయావు. అందుకే వేదాలకు వ్యతిరేకంగా పలుకుతున్నావు!

**శంకరుడు :** పాంచభౌతిక శరీరమే జడం. చిదాత్మ కాదు.

**మండనుడు :** దరిద్రుడా! పరమ పవిత్రమైన పురుష జన్మ ఎత్తి జడత్వాన్ని పొందితి వేల?

**శంకరుడు :** యతిని పూజింపని వాడే దరిద్ర చక్రవర్తి!

**మండనుడు :** మాటలు మంచిగా రావా?

**శంకరుడు :** పాపం చేస్తే మాటలు పరుషము లవుతాయి.

**మండనుడు :** దొంగవై దొంగలచే ఆశ్రయింప బడ్డావు.

**శంకరుడు :** అరిషడ్వర్గాలచే పీడింపబడ్డవాడే దొంగలచే ఆశ్రయింప బడిన వాడని తెలిసికోలేవా?

**మండనుడు :** నా పిలుపు లేకుండా నా ఇంట్లో ఏల ప్రవేశించావు?

ఆ వాద ప్రతివాదనలు ఇప్పుడప్పుడే ముగిసేలా లేవని ఎంచిన వ్యాసమహర్షి కలుగజేసికొని మండనమిశ్రునితో ఇలా చెప్పాడు: "మండనమిశ్రా! తనంతట తానుగా వచ్చిన యతిని ఆదరింపక ఏవేవో అసందర్భపు మాటలు చెబుతా వెందుకు? వచ్చిన యతి సామాన్యుడు కాదు. విజ్ఞానఖని. స్వయంగా వచ్చిన అభ్యాగతుడు విష్ణువుతో సమానుడై యుండగా పూజించడం మాని దూషిస్తున్నావు. నీ యింటికి నిజంగానే విష్ణువు వచ్చియున్నాడు. ఆలస్యం చేయక యతిని ఆనందంతో యథావిధిగా సత్కరించు." వ్యాసమహర్షి ఆజ్ఞతో మండనమిశ్రుడు కోపం చంపుకొని శాంతం వహించాడు.

## 4.12 వాదభిక్ష

శంకరాచార్యస్వామికి అర్ఘ్యపాద్యాదు లిచ్చి భిక్షావందనం చేసి, శిష్యసమేతంగా తన యింట భిక్ష గైకొనమని ప్రార్థించాడు మండనమిశ్రుడు. మండనుడు ఇంతకు ముందు శంకరుని పేరు వినడమే కాని చూచి ఎఱుగడు. "మండనమిశ్రా! నాకు కావలసిన భిక్ష ఇది కాదు. నీ కడకు వచ్చినది నీ నుండి వాదభిక్ష కోరి. ఇపుడు వేద వేదాంగాలన్నీ విచారణ చేయవలసిన తరుణం. మన ఇద్దరి వాదనలో ఎవరు ఓడితే వారు రెండవ వాని ఆశ్రమం స్వీకరించాలి. ఇది పణంగా కోరుతున్నాను. అది నీకిష్టమయితే సిద్ధపడు. పణం లేని వాదంలో పటుత్వం ఉండదు. ఇది నీకు సమ్మతం కాకపోతే 'ఓడిపోతి' ననుము" అని శంకరుడు మండనునితో

అన్నాడు. మండనుడు దానికి సమాధానంగా "యతివరా! సన్న్యాసులు వివాదాల జోలికి పోకూడదే! ఒకే పక్షానికి చెందకూడదే?" అని ధర్మం ఎత్తి చూపించాడు. "మండనమిశ్ర పండిత వరేణ్యా! లోక క్షేమార్థమై యతులు వాదాలలో పాల్గొనవచ్చును. కేవలం పాండిత్యప్రకర్షకో, వినోదార్థమో యతులు వాదంలోనికి దిగరాదు. ధర్మరక్షణార్థం విద్యా వికసనం కోసం చేయవలసిన కార్యాలు ఎవ్వరైనా చేయాలి. యతులతో సహా. నేటి పరిస్థితి అస్తవ్యస్తమై అపరిణత బుద్ధులతో కేవలకర్మ మార్గమే శరణ్యమని చాటుతూ వరిష్ఠమై పరమపదప్రాప్తికి నిశ్చయంగా కావలసిన జ్ఞానమార్గం బొత్తిగా అడుగంటింది నీ వంటి వారి వలన. ఆ దారిని సంస్కరించ వలసిన అవసరం వచ్చింది. నీవు నిశ్చయంగా బ్రహ్మ అంతటి వాడవు. వైదికకర్మను తు.చ. తప్పకుండా ఆచరిస్తున్నావు. ఇందులో నిన్ను మీరిన వాడు లేనే లేడు. కాని నీ పద్ధతి స్వార్థరహితమైన దైనా అసంపూర్ణమైనది. నా మతమే పరమశ్రేష్ఠ మైన మతం. ఈ విషయం అంగీకరించి నా మతాన్ని స్వీకరించు. లేదా నాతో వాదానికి దిగు" అని నిష్కర్షగా తేల్చి చెప్పాడు శంకరాచార్యుడు మండనునితో.

మండనమిశ్రుడు వాదానికి అంగీకారంగా "నీ మాటలకు బెదరుతానని తలపోయకు. నా పాండిత్య పటిమ తెలియక ఈ పణం కట్టావు. నాతో వాదించి నెగ్గిన వాడు లేడు. వేదచోదితమైన కర్మసిద్ధాంతాన్ని విడనాడి నీ ప్రక్క జేరుతా ననుకొంటున్నావు. అది జరుగుట కల్ల!" అని ఒప్పుకొన్నాడు. వాద యుద్ధంలో గెలుపు నిర్ణయించడానికి వ్యాసమహర్షిని, జైమిని మహర్షిని నిర్ణేతలుగా ఉండమని కోరాడు. అప్పుడు ఈ విధంగా వ్యాసుడు సెలవిచ్చాడు. "మండనమిశ్రా! మీ ఇరువురి వాదాలను విని అందుండే మంచి చెడ్డలు తెలిసికొని పక్షపాతము లేకుండా నిర్వర్తించుటకు తగిన వ్యక్తి నీ భార్య ఉభయభారతి. ఆమె సరస్వతి అవతారము. సర్వజ్ఞురాలు. మీ ఉభయులు ఉభయభారతి మధ్యవర్తినిగా ఉండడానికి అంగీకరించండి".

ఇద్దరూ తమ అంగీకారం తెలిపారు. మండనమిశ్రుడు శంకరాచార్యుని విష్ణుస్థాన మందుంచి పితృకర్మను పూర్తి చేశాడు. ఆరాత్రి శంకరుడు శిష్యులతో కలిసి రేవాతీరాన గల ఒక దేవాలయంలో బస చేశారు.

## 4.13 పరిషత్సభ

శంకరునికీ మండనునికీ మధ్య జరిగే వాద చర్చ కేవలం వారిద్దరికే సంబంధించినది కాదు. దేశానికి కనువిప్పు కలిగించడానికి జ్ఞానపద్ధతిని సుస్థిరం చేయడానికి ముముక్షు జనావళి కందరికీ తెలియ జేయడానికి కంకణం కట్టుకొన్న శ్రీశంకరాచార్య మహాత్ముని 'జ్ఞానయజ్ఞం' లోని ప్రముఖ ఘట్టమది. ఆ మహాసన్నివేశాన్ని దర్శించే పుణ్యభాగ్యం ఎందరికి దొఅకుతుంది? పరిషత్సభ జరుగుననే వార్త వినగానే మాహిష్మతీపురం లోని ప్రముఖ పండితులు, వేదాంతులు సభాభవనానికి ముందుగానే చేరుకున్నారు. శంకరాచార్యులు శిష్యసమేతంగా ప్రవేశించి నపుడు వారందరు ఘనస్వాగతం పలికారు. ఆధ్యక్షస్థానానికి ఎడమ పార్శ్వ మందు శంకరులను ఆసీనులను చేశారు. కుడి వైపు మండనుని స్థానము. దేదీప్యమానమైన దివ్యకాంతులతో రాజిల్లుతూ అపర భారతియా అనిపిస్తూ ప్రవేశించిన ఉభయభారతికి గౌరవంగా సభికు లందరూ లేచి నిలబడ్డారు. కరతాళధ్వనుల మధ్య ఉభయభారతి అధ్యక్ష సింహాసనాన్ని అధిరోహించింది.

శంకరాచార్యులు లేచి 'నారాయణ స్మరణలు' చేసి ఈవిధంగా సెలవిచ్చారు: "నారాయణ స్వరూపులారా! బ్రహ్మజ్ఞానసంపన్నులు, ముముక్షువులు, వేదాంతులు, శాస్త్రజ్ఞులు, సగుణ నిర్గుణోపాసకులు మున్నగు మహామహు లెందరో ఇచ్చట సమావేశ మయ్యారు. మహెూత్కృష్ట మైన నిర్ణయం ఈ సభలో జరుగనున్నది. అద్వైత సిద్ధాంతాన్ని దేశంలో స్థిరపరచడమే నా ఆశయం. మండనమిశ్ర మహాశయుని మతాన్ని ఖండించి అద్వైతమతాన్ని సిద్ధాంతం చేయడానికి ఇక్కడికి వచ్చాను. ఈ సభలో నా ఈ నిశ్చయాన్ని ధ్రువపరచ లేకపోయినచో పరమ పవిత్రమైన ఈ కాషాయ

వస్త్రాలను, దండ కమండలాలను విడనాడి శిఖాయజ్ఞోపవీతధారినై గృహస్థాశ్రమాన్ని స్వీకరిస్తాను" అని ప్రతిజ్ఞ చేశారు. సూచికాపాత శబ్దం లేకుండా గంభీరంగా ఉన్న ఆ సభను మరల ఉద్దేశించి శంకరుడు ఈ వాద రణంలోని జయాపజయాలు తేల్చడానికి ఉన్న మహాసభాధ్యక్షురాలైన ఉభయభారతి చేసే నిర్ణయానికి బద్ధుడ నని పలికారు. శంకరాచార్యుని ప్రతిజ్ఞ విన్న మండనమిశ్రుడు తాను కూడ ప్రతిన చేయవలసి ఉన్నదని యెంచి ఈ విధంగా పలికాడు. "శంకరాచార్యా! కర్మ వలననే పునరావృత్తి రహితమైన ముక్తి సాధ్యం. దీనికి వేదమే పరమప్రమాణము. బ్రతికినంతకాలము జీవి సత్కర్మాచరణము నందే మునిగి యుండాలి. కర్మ చక్కగా పూర్తి కావడంతో ముక్తి లభించి తీరుతుందని శ్రుతులే చెప్పుచున్నవి. పరమాత్ముడున్నా డనుటకు ప్రత్యక్షప్రమాణములు కానరావు. వేదాంత మనేది పరవిద్య. పైగా ప్రమాణ రహితమైనది. ప్రత్యక్ష ప్రమాణం కలది వేదమొక్కటే. ఇయ్యది నా సిద్ధాంతము. దీన్ని నేను ఒప్పించ లేకున్నచో నా తెల్ల వస్త్రాలు విసర్జించి, కాషాయపు గుడ్డలు ధరించి గృహస్థాశ్రమం వర్జిస్తాను. ఈ శంకరాచార్యునికే శిష్యుడనై జుట్టూ జందెమూ తీసి వేదాంత తత్త్వాన్ని ప్రచారం చేస్తాను. ఇందులో గెలుపెవ్వరిదో నిర్ణయించే అధికారం నా సహధర్మచారిణి ఉభయభారతికి ఉందని ఒప్పుకొంటున్నాను". ఇది మండనమిశ్రుని ప్రతిజ్ఞ.

## 4.14 ఉభయభారతి ప్రతిజ్ఞ

సభలో గల వారికి అనేక సందేహాలు, భావాలు పొడసూపాయి ఆ పరిస్థితులను చూచి. 'తన భర్త మండనుడు. ఓడిపోతే ఓడినట్లు ప్రకటించాలి. భర్త నెగ్గుతాడన్న నమ్మకం ఏది? భర్త ఓడితే తానోడినట్లు కాదా? భర్త ఓడిపోతోంటే చూస్తూ ఊరకుండడమేనా సహధర్మచారిణిగా? భర్తకు గౌరవాన్ని సమకూర్చ వద్దా? అలా చేస్తే పక్షపాత బుద్ధి అగుతుంది కదా! ఉభయభారతి సర్వసమర్థురాలు. స్త్రీ ఏం చేసినా చేయగలదు' ఈ విధంగా

కొనసాగుతున్నాయి సభాసదుల మనోభావాలు. కాని మండనమిశ్రుడు బ్రహ్మ అంశలోను, ఉభయభారతి సరస్వతీదేవి అంశలోను జనించారని, చిన్నవాడైనా శంకరుడు సర్వజ్ఞుడనీ వారికి తెలియదు. ముప్పురూ ముప్పురే. వారికి ధర్మమే రాచబాట. అందు వలననే ఉభయభారతి అధ్యక్ష స్థానంలో ఉండడానికి అంగీకరించారు శంకరులు.

తాను గృహిణి. గృహకృత్యాలు యథావిధిగా నిర్వర్తించాలి. భర్తకు, అతిథి అభ్యాగతులకు కావలసిన వంట తానే చేయాలి. ఇటు వాదోపవాదాలు వింటూ కూర్చుంటే సభ ముగిసే వరకూ ఆగాలంటే ప్రొద్దు పోతుంది. మధ్యలో నిష్క్రమించి వాదాల్ని ఆపమనడం సరి కాదు. అందుచేత ఉభయభారతి ఈ విధంగా నిర్ణయం తీసుకొంది. రెండు పూలదండలందుకొని వాది ప్రతివాదుల గళ సీమల నలంకరించి “ఎవరి కంఠాన గల హారం వాడిపోతుందో వారు ఓడిపోయినట్లు నిర్ణయం” అని ప్రతిన చేసి వాదోపవాదములకు అనుమతి ఇచ్చి ఇంటి లోనికి వెళ్ళిపోయింది.

## 4.15 వాదోపవాదములు

బ్రహ్మ అంశమున మండనుడు అవతరించగా సాక్షాత్ శివుడే శంకరాచార్యుడు. కర్మకే ప్రాముఖ్యము ఇస్తూ శాస్త్రాధారాలు చూపుతాడు మండనుడు. కర్మకు అతీత మైనది జ్ఞానార్జన. దానికై యత్నించవలె నని కర్మలో కూరుకుపో కూడదని శంకరుల వాదన. పరాత్పరు డున్నాడనును శంకరుడు. ప్రత్యక్ష ప్రమాణ మున్నదే నమ్మాలని మండనుడు. జీవాత్మకు పరమాత్మకు అభేద మంటాడు శంకరుడు. ఇరువురు శాస్త్రాధారాలు చూపిస్తారు. సత్యాసత్యాలు వినాలనే కౌతుకంతో దేవతలే వచ్చారు ఆ శు భ సభా భవనానికి.

తొందరపాటు గాని కోపతాపాలు గాని లేకుండా గంగాప్రవాహంలా సాగిపోతున్నాయి ఇద్దరి వాగ్ధారలు. అనర్గళమైన పదజాలంతో విస్తృతమైన

శాస్త్రచర్చలతో పండితులకు వీనుల విందే కాక చిత్తాహ్లాదకరంగా సాగుచున్నాయి వాదనలు. వేదములు స్వతఃప్రమాణములు కర్మైకపరములు అని మండనుడు వచించి తగిన శాస్త్రధర్మములు వినిపిస్తున్నారు. వేదవాక్కులు వేయి వినిపించినను కాదంటున్నారు శంకరులు. వేదాల కతీతమైనది వేదాంతమే నని ఉపనిషత్తుల ఆధారంతో నిరూపిస్తున్నారు. కర్మకాండను ఖండిస్తూ జ్ఞానకాండను ప్రతిష్ఠిస్తున్నారు శంకరులు. శ్రోతలకు వారిద్దరు ఒకరిని మించిన వారొకరులా కనిపిస్తున్నారు. జయం ఎవరిని వరిస్తుందో తెలియరానిదిగా ఉంది.

ఆరు రోజులు ఆవిధంగా ఖండనలు, ప్రతిఖండనలతో మారుమ్రోగింది ఆ మహా పరిషత్సభాప్రాంగణం! క్రమంగా శంకరుని వాదాలకు మండనుని దగ్గఱ సముచిత సమాధానము లభించడం తగ్గిపోయి మండనుని మతబలం సన్నగిలింది. ఆయన ముఖ వైఖరి నీరుగారడం చూచి శంకరుడు మండనుని మరల ప్రేరేపిస్తూ "మండనమిశ్ర పండిత వరేణ్యా! పలుకాడవేమి? నీ కర్మ సిద్ధాంతం ఇక మంట గలిసి నట్టేనా?" అని మండనునకు ఒక అవకాశ మిచ్చాడు ఆ యతీంద్రస్వామి. ఆ అదను చూచి ఇక వేదాంతము మీద సాగించాలి చర్చ అనుకొన్నాడు మండనుడు.

## 4.16 జీవేశ్వరాభేదము

"శంకరాచార్యస్వామీ! జీవేశ్వరులకు భేదం లేదందురు అవి ఒకటే కాని రెండు కావందురు. జీవాత్మ, పరమాత్మ ఒకటే అనుట శుద్ధ అబద్ధము. కంచు కాగడా వేసినా ఈ మాట వేదాలలో ఎక్కడా కానరాదు. పైగా అది గొప్ప తత్త్వ మని, జనన మరణ రాహిత్య మని ప్రమాణములు లేకుండా వేదాంతులు వింతగా వల్లిస్తారు. ఉపనిషత్తులు పురుషార్థాన్ని వెలిబుచ్చ నందున ప్రయోజనం శూన్య మైంది. గడుసుగా చెప్పే ఉపమానాలు కాదు ప్రత్యక్షప్రమాణములు లేనందున మేమంగీకరించ లేము. వేదములే

స్వత:ప్రమాణములు. కనుక మీరు చెప్పే జీవేశ్వరాభేదము నిరాధారమైనది. ప్రత్యక్షప్రమాణములు ఉన్న చూచెదము గాక!" అని తీవ్ర ధోరణిలో హుంకరించాడు మండనమిశ్రుడు.

శంకరుడు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన వారి అనుభవములను ఎత్తి చూపారు. అవి నమ్మ లేదు మండనుడు. పంచమహాభూతములు ఎలా ఉ త్పత్తి అయ్యాయో వాటి కలయిక వలన ఏయే వస్తువులు జనించినవో, మానవుని లోని జ్ఞానేంద్రియాలు ఎట్లు సమీకరణ గావింపబడినవో, జడములకు అజడములకు గల తారతమ్యము వివరించి, శరీరాంతర్గతమై యున్న జ్ఞానము యొక్క విశిష్టతను వివరించి, ఆత్మస్థితిని, ఆ రెండింటికి గల సామ్యమును తెలిపారు. మహావాక్య విచారణ గూర్చి చెప్పినా అవి మంత్రము లనీ, విధి వాక్యము లనీ త్రోసిపుచ్చాడు మండనుడు. శంకరు లంత మోక్ష మన నేమో తెలియజెప్పారు. తత్త్వజ్ఞానం కలిగి సంకల్పములు నశిస్తే గాని మోక్షం సిద్ధించ దని చెప్పారు. శ్రుతి స్మృతి ప్రమాణాల ఆధారంగా మండన వాదాన్ని శతవిధాల ఖండించారు. శంకరుడన్న దాన్ని కాదన లేని స్థితికి వచ్చాడు మండనమిశ్రుడు. అప్పుడు అధ్యక్షురాలైన ఉభయభారతి సంతోషభరితురాలవడం అందరూ గమనించారు. శంకరుని మెడలోని మాల దేదీప్యమానంగా వెలుగొందడం మండనుని మెడ నున్న మాల వాడిపోవడం సభలో నున్న వారందరు చూచారు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. శంకరుని ప్రతిజ్ఞ సఫలమై ప్రకాశించింది.

శంకరాచార్యుని శిష్యవర్గంతో సహా సాదరంగా భిక్ష కాహ్వానించి మండనమిశ్రుడు లోనికి తీసుకొని వెళ్ళాడు. భిక్షానంతరం ఉభయభారతి శంకరుని ఉద్దేశించి ఇలా చెప్పింది: "యతివర్యా! సత్యలోకంలో ఒకనాడు నిండు సభలో దూర్వాసుడు కమలభవుని సమక్షంలో నన్ను భూలోకంలో మానవశరీరాన్ని ధరించమని శపించాడు. నీ దర్శన భాగ్యంతో శాపవిముక్తి కలుగుతుందని చెప్పాడు. నాకు శాపవిముక్తిగా నా లోకానికి వెళ్ళాలి.

సెలవు ఇవ్వండి పరాత్పరా!" అని వేడుకొన్నది. అందుకు సమాధానంగా శంకరులు "అమ్మా! సత్యలోకానికి నేను అంగీకరించి నపుడే వెడుదువు గాని. అనుగ్రహింపుము" ఉభయభారతిని కోరగా ముదంగా సమ్మతించింది ఆ అవతారమూర్తి.

## 4.17 మండనమిశ్రుని సంశయములు

పరాజయము పొందినా మండనమిశ్రుని కొన్ని సంశయాలు పీడిస్తున్నాయి. శంకరునితో ఇలా విన్నవించుకొన్నాడు: "శంకరాచార్యా! మహానుభావుడైన జైమిని మహర్షి జగద్గురు వని పేరు పడ్డవాడు. నిష్ఠతో కర్మ ననుష్ఠించ మని స్పష్టంగా చెప్పిన వారి వచనాలను నిర్వీర్యం చేశావు. పైగా నీ మతాన్నే సిద్ధాంతం చేశావు. ఇది నాకు దుర్భరంగా ఉంది" అని దీనాననుడై మండన పండితుడు అడగ్గా శంకరు డిట్లా పలికారు: "మండనమిశ్రా! నీవన్నట్లు జైమిని మహావిజ్ఞాని. సర్వజ్ఞుడు. అతడు చెప్పిన దేదీ ధర్మవిరుద్ధం కాదు. వారి సూత్రాలు అర్థం చేసికోవడం దుష్కరం. కర్మిష్ఠులకు కర్మయే శరణ్యమని, వేదాంతులకు కర్మ చేయుట వలన చిత్తశుద్ధి కలుగునని తోపిస్తుంది. జ్ఞానాన్ని కోరుకొనే వారికి జ్ఞానమార్గమును చూపును".

మరల ఇంకా ఇలా వివరించారు. "మండనమిశ్రా! ఈ సంసార మొక మహాసాగరము. దీనిని ఈది దరి గానడం సామాన్యం కాదు. పామరులకు ఎలాగూ సాధ్యం కానిది. వారికై వారి లోని మాలిన్యాన్ని తొలగించడానికి కర్మమార్గం విధి విహితమై యున్నది. ఇహసుఖాల కంటె గొప్పవైన స్వర్లోక సుఖాలను పొందవచ్చు నన్న ఆశ చూపించిన పద్ధతి అది. తత్త్వోపదేశం పొందడం అందరికి సాధ్యం కానిది. అధికారం లేనివానికి తత్త్వబోధ నిరుపయుక్తము. మొదటగా చిత్తశుద్ధి కలగాలి. అందుకు పనికి వస్తుంది కర్మాచరణ. తత్త్వజ్ఞానార్జనలో విధిగా బ్రహ్మచర్యాది వ్రతములు పాటించాలి.

అట్లాచరించినను మోక్షప్రాప్తి కలుగు నని రూఢిగా చెప్పలేదు జైమిని. ఈ కర్మకాండ విషయమంతా వేదం మొదటి భాగమందు చెప్పబడింది. పిమ్మట జగత్తును తెలిసికొనుచూ, తానెవరో శాశ్వతమైన ఆనందమును పొందు టెట్లో జన్మ లేకుండే విధానము మొదలగు పెక్కు విషయాలు తరువాతి భాగమందు క్రోడీకరింపబడ్డాయి. జైమిని తత్త్వవేత్త కాదని నిరీశ్వరవాది యని కొందరు తలపోశారు. 'వేదాల నెఱిగిన వారు పరమేశ్వరుని తెలిసికొందురు' అను ప్రమాణములను మహర్షులు నిష్కర్షగా త్రోసిపుచ్చారు. 'కర్మరుడు నిరీశ్వరవాది' అనుట బుద్ధిహీనత" అన్న మాటలతో జైమిని హృదయాన్ని విప్పి చూపించారు.

## 4.18 జైమిని ప్రత్యక్ష మగుట

ఇంత జరిగినా మండనమిశ్రుని మనశ్శంకలు తీరలేదు. కాదా మరి! ఇన్నాళ్ళు అవిచ్ఛిన్నంగా అద్వితీయంగా ఎదురు లేకుండా కర్మిష్ఠి శ్రేష్ఠునిగా బ్రదికినవాడు. జైమిని ముని అడుగు జాడలలో నడచిన వాడు. ఈ నాడు తనకు ఎదురు దెబ్బగా తన మతాన్ని తన ఆచారాల్ని త్రోసిరాజని శంకరాచార్యుడు నిలబడ్డాడు. ఎట్లా ఈ సందిగ్ధ పరిస్థితిని భరించడం? తీవ్రమైన మనో వ్యథతో గత్యంతరం లేక ఆ జైమిని మహర్షినే ప్రార్థించాడు మండనమిశ్రుడు: "జగద్గురో! మిమ్ములనే నమ్మి మీ పవిత్రమార్గం పట్టి ఇన్నాళ్ళు వ్యవహరించిన వాడను. ఈనాడు శంకరాచార్యుడు అలా కాదని 'తత్త్వ మసి' వాక్యాన్ని సమర్థించి నన్ను పూర్తిగా నిరుత్తరుణ్ణి చేశారు. పైగా ఈ శంకరుడు మిమ్ము కాదనడం లేదు సరి కదా మిమ్ము అత్యంత గౌరవంతో చూస్తున్నారు. నాకు ఏమీ పాలుపోవడం లేదు. తమరే నా మొఱ ఆలించి నా సందేహ నివర్తి చేయాలి ప్రభో!". ఆర్తితో పిలచిన మండనమిశ్రుని ఆవేదన తెలిసిన జైమిని మహర్షి సంతోషంగా ప్రత్యక్షమయ్యాడు మండనుని ముందు. జైమిని ఈ విధంగా అన్నాడు: "మండనమిశ్రా! ఈ ఆచార్యుడు సాక్షాత్తు ఆ పరమేశ్వరుడైన శంకరుడే. సందేహము లేదు. వేద వేదాంగములు

సమస్తం వేదాంతము, అన్ని శాస్త్రములు క్షుణ్ణంగా అవగాహన చేసికొన్న లోకోత్తర పురుషుడు. ఎవరికీ కొరకబడని బ్రహ్మసూత్రములను అరటి పండు ఒలిచి చేత బెట్టి నట్లు తెలియ జేస్తూ భాష్యం వ్రాసిన బ్రహ్మజ్ఞాని. ఆతడి కతడే సాటి. ఈయన వాక్కు నుండి వచ్చినది అంతా యథార్థము. నేను పలికినా వ్యాసుడు పలికినా ఇంతే. మేము ముగ్గురము ఒకటే అని తెలిసికో. కృతయుగంలో కపిలుడు జ్ఞానమును, త్రేతాయుగంలో దత్తాత్రేయుడు వేదాంతమును, కలియుగంలో శంకరుడు పరతత్త్వజ్ఞానమును ఉపదేశించడానికి వెలసిన అవతారమూర్తులు. ఈ సంగతి శివపురాణంలో చెప్పియే యున్నారు. ఈ స్వామి ప్రబోధములను మన్నించి సంసార సాగరము దాటుము" అని చెప్పి జైమిని అంతర్ధాన మయ్యాడు.

## 4.19 మండనుడు శంకరుని స్తుతించుట

జైమిని పలుకులతో మండనునికి తగిన ఊరట లభించి మనస్సు పరిపక్వమై శంకరాచార్యుని దిక్కు మొగమై ఆచార్యులను ఈ విధంగా స్తోత్రం చేశాడు: "స్వామీ! మీ ప్రతిభ అపురూపము. నీవు ద్వంద్వాతీతుడవు. మీ మహిమ ఎఱుగక మిమ్మెదిరించి మీతో వాదనకు దిగిన ఈ అజ్ఞుని క్షమించండి. నా పూర్వ జన్మ పుణ్య వశాత్తూ మీ దర్శన భాగ్యం మీతో సంభాషించే అవకాశం ఈ దీనునికి దొఱకింది. కరుణామూర్తివి. లోకంలోని అజ్ఞానాంధకారాన్ని రూపు మాపుటకు అవతరించిన చిత్స్వరూపుడవు. అటు సాంఖ్యతత్త్వ కర్త కపిలుడు, న్యాయదర్శన కర్త గౌతముడు, వైశేషిక దర్శనకర్త కణాదుడు, యోగశాస్త్ర నిర్మాత పతంజలి వీరు అందరూ కీర్తి గడించిన వారే. శ్రుతి రహస్యాలు బోధ పడక ద్వైతకూపాంధకారంలో పడి నాస్తికత్వాన్నే ప్రచారం చేశారు. తమ రాకతో అద్వైతమత ప్రాముఖ్యాన్ని స్థాపించి నా వంటి వారిని తరింపజేస్తున్నారు. పరమేశ్వరా! నేను ఇంత వరకూ అజ్ఞానంతో కర్మే అన్నింటికి గతి అని నమ్మి ఆలుబిడ్డలు, భోగభాగ్యములు స్థిరమని సమస్తశాస్త్రాలూ చదివి కూడా తెలివి లేని వాడనై విఱ్ఱవీగితిని. మీ

సాన్నిధ్యంతో నాకు జ్ఞానోదయమైంది. జననమరణములు లేనిది శాశ్వతానందము ఇచ్చునది మీరు ప్రసాదించిన అద్వైతతత్త్వ జ్ఞానమే. మీ పాదాల నాశ్రయించ గల సేవాభాగ్యం కలిగితే ధన్యుడను. మిమ్ములను శరణు వేడుకొంటున్నాను. నాకు మీ పాదసన్నిధిని కొంత ఆశ్రయ మివ్వండి. తమ ఆజ్ఞకు సదా బద్ధుడనై ఉంటాను". శంకరాచార్యుడు ఆదరంగా మండనమిశ్రుని దగ్గఱగా చేర్చుకొన్నారు.

## 4.20 ఉభయభారతి కథ

నిండు సభలో నున్నపుడు ఉభయభారతి శంకరస్వామితో తన చిన్న నాటి వృత్తాంత మొకటి తెలియ జేసింది. మా తల్లి కడ నేనుండగా ఒకనాడు జడదారి ఒకడు మా ఇంటికి విచ్చేయగా మా అమ్మ వారికి అర్ఘ్యపాద్యాదు లిచ్చి నా భవిష్యత్తు గూర్చి అడిగింది. ఇది ఏ ఇంటికి జేరుతుంది? దీని భవిష్యజ్జీవనం ఏ గతిలో ఉన్నదని. ఆ ముని మా అమ్మతో అన్న మాట ఇది: "అమ్మా! నీవు ఏమీ చింతిల వలసిన పని లేదు. దేశంలో నాస్తికత తాండవిస్తోంది. కర్మమార్గాన్ని పునరుద్ధరించడానికి చతురాననుడు మండనమిశ్రునిగా ఉదయిస్తాడు. అతనికి పత్ని కాబోతోంది నీ కుమారిత. చిరకాలం దోసపంటగా ఆ కుటుంబం పేరు ప్రఖ్యాతులతో వర్ధిల్లుతుంది. మరి కొంత కాలానికి వేదాంతమార్గాన్ని ప్రతిష్ఠించడానికి పరమేశ్వరుడు శంకరాచార్యుడై మండనమిశ్రునితో వాదయుద్ధం చేయుగా మండనమిశ్రుడు విరాగియై శంకరుని శిష్యుడవుతాడు" . ఆ మాటలు నేడు తథ్య మయ్యాయి. ఈ విశేషము విన్న అందరూ ఆశ్చర్యపడ్డారు.

## 4.21 ఉభయభారతి శంకరుల మధ్య వాదము

శంకరాచార్యుల నుద్దేశించి ఉభయభారతి "శంకరాచార్యా! నా భర్త మీతో వాదించి ఓడిపోయెను. అంత మాత్రాన తమ జయము పూర్తి కాదు. భార్యగా నేను వారిలో సగము భాగాన్ని కాబట్టి మీరు నాతో వాదించి నెగ్గితే

గాని మీ జయము నిశ్చయము కాదు” అని ప్రస్ఫుటంగా పలికిన మాటలు విన్నవారు విభ్రాంతు లయ్యారు. “దేవీ! నీ కోరిక సమంజసము కాదు. స్త్రీల తోడి వాదము నిషిద్ధము. పైగా అది అపకీర్తి దాయకము” అని శంకరు డన్నారు. ఆ మాటను అంగీకరించకుండా ఉభయభారతి ఇలా బదులు పలికింది: “మహనీయా! మీకు తెలియని దేమున్నది? శాస్త్రములలో అట్టి నిబంధనలు లేవే! పైగా ఇది శాస్త్ర విషయికమైన చర్చ. జనకమహారాజు కొలువులో గార్గి యాజ్ఞవల్క్య మహర్షితో వాదించలేదా? బృహదారణ్యకోపనిషత్తు లోని మాట ఇది. ఆ జనకునితోనే సులభ వాదించ లేదా? ఇవేమియు మీకు తెలియనివి కావు. మీతో తత్త్వ చర్చ చేసే అవకాశం నాకు ప్రసాదించండి స్వామీ!” అని నిర్ధారణగా ఉభయభారతి మాట్లాడడంతో శంకరు డింక ఏమీ అనలేకపోయాడు. ఆ విధంగా మొదలయిన వారి మధ్య వాదప్రసంగాలు పదునేడు దినముల వరకు సాగాయి. మధ్యమధ్య కర్మకాండ నిమిత్తమై కొంత కాలాన్ని వినియోగించు కొనగా. వారిరువురి వాదం కేవలం వాదం కోసం కాక విన్నవారికి జ్ఞానం పంచి పెట్టడానికే జరిగిన చర్చ. పేరుపడిన శాస్త్రజ్ఞులు హనుమంతుడు, ఆదిత్యుడు, శుక్రుడు దిగి వచ్చారా అనిపించింది. మండనునకు గగుర్పాటు కలిగిన దా వాదప్రతిభలతో. ఎన్నివిధాల యత్నించినా శంకరుని జయించడం కష్టమే అని గ్రహించిన ఉభయభారతికి ఒక ఉపాయము తట్టింది. బాల్యం నుండి బ్రహ్మచారి ఇతడు. ఇతడు కామశాస్త్రము చదివే అవకాశము లేదు. అందుచేత చర్చ ఆ శాస్త్రం వైపు మళ్ళించాలని నిశ్చయించింది ఆ మహాతల్లి.

## 4.22 పరకాయప్రవేశము: శంకరుల వివరణ

ఆ నిర్ణయం తీసికోవడమే తడవు ఉభయభారతి శంకరునిపై ఈ విధంగా ప్రశ్నల వర్షం కురిపించింది: “శంకరాచార్యా! స్త్రీపురుషుల మధ్య కామకళ శుక్ల పక్ష మందెట్లుండును? కృష్ణపక్షమం దెట్లుండును? అట్టి కళ లెన్ని? వాని స్వరూప మేమి నీకు తెలిసిన వివరించెదవా?”. చటుక్కున

వచ్చిన ప్రశ్నలకు సమాధానము చెప్పిన ఒక చిక్కు. చెప్పకున్న మరొక చిక్కు. ఇది ఒక కుయుక్తితో చేసిన పన్నాగము. ప్రత్యుత్తర సమయంలో నీ అనుభవ మేమి అనే ప్రశ్న వస్తుంది. అందు వలన ఈ యుక్తికి పై యుక్తియే సమాధానము కాగలదని తలచాడు శంకరుడు. “దేవీ! నాకు మూడు మాసముల వ్యవధి కావలెను. వాద మధ్యమున ఇట్లు వ్యవధి తీసికొనుట సనాతన సంప్రదాయ బద్ధము కదా! ఈ గడువు గడచిన పిమ్మట మన వాదము తిరిగి నడచును గాక!” అని పలికారు శంకరులు. ఉభయభారతి అంగీకరించడంతో నాటి పరిషత్సభ వాయిదా పడింది.

సభ ముగిసిన తరువాత శంకరులు శిష్యగణముతో కూడి నదీతీరాన ఉన్న ఉద్యానవనం చేరుకున్నారు. వేకువనే లేచి కాలకృత్యములు చేసికొని తెల్లవారగనే శంకరాచార్యుడు గగన మార్గాన పయనమై పోతున్నారు. ఒక అరణ్యంలో ఆ ప్రాంతాన్ని పాలించే అమరకు డనే మహారాజు వేటకు వెళ్ళి మరణించగా రాజు మృతదేహము చుట్టూ చేరి రాజు భార్యలు నూర్గురు రోదనము చేయడం చూచారు శంకరుడు. ఆ దృశ్యాన్ని తన శిష్యుడైన పద్మపాదునకు చూపించి “పద్మపాదా! పతి వియోగం భరించలేక ఆ రాణులు విలపిస్తున్నారు. నేను ఆ రాజు శరీరంలో ప్రవేశిస్తే వారి దు:ఖం పోతుంది. పాప మా రాజు తన పుత్రునికి యువ రాజ పట్టాభిషేకం కూడ చేయలేదు. నేనా రాజు శరీరంలో ప్రవేశిస్తే ఆ పని కూడా పూర్తి చేసినవాడనవుతాను. నేను ఆ కాంతామణులతో విహరించి ఆ కళల విశేషాల్ని తెలిసికొన వచ్చును గదా? నేను కేవల సాక్షీభూతుడనై వ్యవహరిస్తాను కాబట్టి నాకు ఎట్టి దోషమూ ఉండదు” .

గురువు గారి మాటలను విన్న పద్మపాదుడు నిశ్చేష్టు డయ్యాడు. వెంటనే తేరుకొని గురువుతో ఇలా అంటాడు: “స్వామీ! మీకు చెప్పదగ్గ వాడను కాను. పరకాయప్రవేశము కాని దని విన్నాను. దీనికి అనేక దృష్టాంతా లున్నాయి. ఒకానొకపుడు మత్స్యేంద్రుడనే మహానుభావుడు తన శరీరమును

భద్రంగా కాపాడమని తన శిష్యుడు గోరక్షకుని కడ పెట్టి మృతు డైన రాజు శరీరంలో ప్రవేశించి ఆ రాజ్యాన్ని వైభవంగా పాలించడం మొదలు పెట్టాడు. ఆతని పాలనలో మున్నెన్నడు చూడని మహావైభవం ప్రాప్తించిందా దేశానికి. ప్రతిభావంతులైన మంత్రులకు అనుమానం వచ్చింది. మరణించి బ్రదికిన రాజుకు అంతకు తమకు తెలిసిన రాజుకు శరీరంలో తక్క ఏ విధమైన సామ్యమూ కానరావడం లేదు. ఇదివరకు రాజు ఒక లాగున ఇప్పుడు వేరొక లాగున ఉన్నారు. ప్రతిభాపాటవాలతో బహుధర్మా లెఱిగిన వాడి లాగున ధర్మపరిపాలన చేస్తున్న ఈతడు మన అసలు రాజు కాదు. ఎవరో సమర్థుడు రాజు శరీరంలో ప్రవేశించి ఉంటాడని నిశ్చయించుకొన్నారు మంత్రులు కలిసి. ఈ వార్త తెలిసిన రాణులు అతనిని ఇతోధికంగా సంతోషపెట్టే లాగున వర్తించడంతో, మత్స్యేంద్రుడు భోగలాలసు డైపోయాడు. ఇది చూచిన గోరక్షకుడు తన గురువు మహాత్ముడు ఇలా అయిపోయాడని చింతించి ఉపాయంతో రాజాంత:పురం చేరి మెల మెల్లగా గురువుకు పూర్వస్మృతి కలిగించాడు. తన శరీరాన్ని శిష్యుడు భద్రంగా దాచి ఉన్నాడు కాబట్టి తిరిగి మత్స్యేంద్రుడు స్వశరీరంలో చేరగలిగాడు. గురుదేవా! విషయానురాగం ఎంతటి వారి నైనా లొంగదీయును. జ్ఞానాన్ని నాశనం చేసి మూర్ఖుణ్ణి చేయును. మీకు చెప్పదగిన వాడను కాను. కాని చెప్పకుండా ఉండలేకున్నాను. లోకోద్ధరణార్థం పరమ పావన మైన బ్రహ్మచర్యవ్రతం చేపట్టిన మీకు ఇదేమి వైపరీత్యము? ఈ మాటలు మీతో అనుటకు తమరు నాయందు చూపిన అవ్యాజమైన కరుణ, వాత్సల్యమే బలాన్నిచ్చింది. ధర్మసంస్థాపకా! ఆలోచించుడు" అని దీనంగా వేడుకొన్నాడు పద్మపాదుడు శంకరస్వామిని.

ప్రియశిష్యుని భయం పోగొట్టడానికి శంకరులు ఇలా చెప్పారు: "పద్మపాదా! నీవు చెప్పిన దానిలో పొరపాటు ఇసుమంత కూడా లేదు. ధర్మాసక్తి కలవారు ధర్మరక్షణకే ఎప్పుడూ పాటు పడతారు. శాస్త్రములలో

ఈ విషయమై విధినిషేధము లున్న మాట వాస్తవమే. ఆ నిషేధములు ముక్తి పొంద వలసిన వారికే వర్తిస్తాయి. ముక్తులైన వారికి ఆ నిషేధములతో పని లేదు. సంకల్ప రహితులకు విషయాసక్తు లుండవు. కోరికలు లేని మనస్సు సర్వదా పరిశుద్ధమే. సంకల్పములే లేని వారికి కోరికలు మొలకెత్తవు. ముక్తి నొందిన వానిని ఎవరూ ఏమీ చేయలేరు. శ్రీకృష్ణుడు అనేక వేల గోపకాంతలతో శృంగారలీలలు సల్పినా ఆయన సదా బ్రహ్మచారిగా కొనియాడబడుతున్నాడు. విధినిషేధాలకు అతీతమైన పరతత్త్వమున్నది. ఉపనిషత్తులలో వజ్రయోలియోగ మనునది ఉన్నది. అది పరకాయప్రవేశము వంటిది. ఆ యోగము నొందినవాడు యోగభ్రష్టుడు కాడు సరి కదా మహాతేజస్సుతో విరాజిల్లుతుంటాడు. పరకాయప్రవేశములోని అనుభూతులు ఏమియు సత్యములు కావు. అవి కేవలము లీలలు. శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి. సంకల్పరహితుడు. నేనూ అంతే. సందేహము విడనాడుము".

మరల వివరిస్తున్నాడు శంకరుడు శిష్యునికి: "పద్మపాదా! అవతారపురుషుడు సర్వాతీతుడు. వర్ణాశ్రమధర్మములు, కర్మవిధులు అన్నీ పరిత్యజించి పరమాత్మే తానన్న నిశ్చయంతో పరిపూర్ణుడై, మాయాతీతుడై శాశ్వతానందంలో తేలియుండును. కంటికి కనిపించు చరాచరజగత్తు సర్వమూ ఒకటిగనే కన్పట్టును. వస్తుజాలము వివిధాకృతులలో ఉన్నను, అవి మట్టి, ఇనుము, బంగారము వంటి వాటితో తయారయినవి. నిజానికి ఆ వస్తువులు మట్టి, ఇనుము, బంగారము కంటె వేరు కావు. అదే విధంగా ఈ లోకమంతా పరమాత్మ నుండి పుట్టినా అది పరమాత్మ కంటె వేరు కాదు. భ్రాంతితో వేరుగా తోచినా, భ్రాంతికి ముందు, భ్రాంతి ఉన్నపుడు, భ్రాంతి పోయినపుడు ఈ వస్తువు ఒకటే. దానికి ఆకారం గాని, గుణం గాని లేదు. ఆ పరమాత్మ దేనికీ కారణం కాదు. ఆయనకు ఏదీ అక్కఱ లేదు. ఆయన్ను ఏవీ అంటవు. కాని ఆత డన్నిటికీ ఆధారభూతుడు. ఈ

పరమ రహస్యాన్ని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతావతరణ మందు వెల్లడించి యున్నాడు.

ఇంద్రియవ్యాపార మంతయు శబ్దాది విషయములపై నుండును. తత్త్వజ్ఞునకు వీటితో సంబంధము లేక తామరాకుపై నీటిబొట్టు వలె ఉండును. కర్మ యందు బంధింప బడక అతడు ఆత్మలోనే క్రీడించుచుండును. త్రికాలములలోను చేయునది, పొందబడినది, పొంద వలసినది తత్త్వజ్ఞానికి ఉండదు. ఎల్లవేళలా వానికి అన్ని కర్మలలోను పరమాత్మ మసలుచుంటాడు.

పద్మపాదా! అజ్ఞాన మున్నంతవరకు ప్రకృతి సత్యమనీ, కర్మఫలములు నిజమనీ తోస్తుంది. జ్ఞానము కలుగగానే అవి యెల్ల మిథ్య యనీ స్వప్నతుల్యము లనీ తెలుస్తుంది. దీనిని నేను చేస్తున్నాను, దీన్ని నేను అనుభవిస్తున్నాను అనే భావన లేని వానికి ఏదియు అంటదు. తత్త్వవేత్త సుకృత దుష్కృతములకు లోబడడు. అట్టివానికి విశ్వప్రేమ ఉండును. ఏ జీవిని అతడు హింసించడు. ఒకవేళ అలా చేసినా దానికి అంతర్భాగమైన కారణ ముంటుంది. ఇందులకు ఒక దృష్టాంత ముమున్నది. వినుము. త్వష్ట కుమారుడు విశ్వరూపుడనే వాడు ద్వాదశాదిత్యులలో ఒకడు. ఆతడు మహాగర్వంతో లోకాలను పీడించడం మొదలు పెట్టాడు. అది చూచి దేవేంద్రుడు తన వజ్రాయుధంతో అతణ్ణి చీల్చి చెండాడి ముక్కలు ముక్కలుగా చేసి కాకులకు గ్రద్దలకు ఆహారంగా పారవేశాడు. అంత చేసినా దేవేంద్రునికి ఏమీ కాలేదు. జనకమహారాజు అనేక యజ్ఞయాగాదులు, దానధర్మాలు చేసినవాడు. కాని అనునిత్యం తత్త్వజ్ఞానియై కర్మ ఫలితాలను పొందక పరమ నిత్యమైన మోక్షానందమే పొందాడు" అని బోధించాడు శిష్యుని సందేహ నివృత్తి కోసం.

## 4.23 శంకరుని పరకాయ ప్రవేశము

గగన వీధిలో శిష్యసమేతంగా ప్రయాణించి ఒకచోట పర్వతశిఖరం మీదకు చేరిన తర్వాత ఒక గుహను సమీపించి దానిని మూయడానికి

అనువైన ఊతి పలక నొకటి సంపాదించుకొన్నారు. శంకరాచార్యుడు తన శరీరాన్ని ఆ గుహలో భద్రపరచి జాగరూకతతో కాపాడమని శిష్యులకు ఆదేశించారు. తాను తిరిగి వచ్చేవరకు ఏమరుపాటు లేకుండా ఉండమని చెప్పి యోగశక్తితో స్వశరీరాన్ని విడిచి అమరకమహారాజు మృతశరీరంలో బ్రహ్మరంధ్రం గుండా ప్రవేశించాడు. వెను వెంటనే ప్రాణవాయువును ప్రవేశపెట్టి ఆపాదమస్తకము సంచరించున ట్లొనరించారు. ప్రాణము రాగానే రాజు శరీరం కదలడం మొదలు పెట్టింది. కండ్లు తెరచి కూర్చొన్నాడు రాజు. రాజకాంతలు, పరివారము సంతోషసంభ్రమాలతో కోలాహలంగా అయింది. పురములోనికావార్త తెలిసి దివ్యమంగళధ్వనుల మధ్య వేదపారగులు స్వస్తి వచనములు చెప్పుచుండగా దివ్యవాహనంపై రాజును పురప్రవేశము చేయించారు మంత్రి సైన్యాధ్యక్ష ప్రముఖులు.

కొలది రోజుల తరువాత అమరకమహారాజు మంత్రులు, దండనాయకులు, సేనాధిపతులు, సామంతులు, న్యాయాధీశులు, కవి పండిత గాయక ముఖ విద్యాధికులు, వివిధకళాప్రపూర్ణులు, ఉన్న నిండు కొలువును ఏర్పరచి అందరికీ ఆదేశ మిచ్చాడు: "ఈ రోజు నుండి మనము క్రొత్త దీక్షతో రాజ్యాన్ని అన్ని విధాల ఉత్తమరాజ్యంగా నడపుతుండాలి. రాజశాసనాన్ని ప్రజలందరూ విధిగా గౌరవించి పాటించాలి. దేశంలోనికి శత్రువులు చొరకుండా అప్రమత్తులమై మెలగాలి. రాజోద్యోగు లందరు ప్రజాసేవయే పరమావధిగా రాచకార్యములు చక్కబెట్టాలి. ఎవరి వృత్తులు వారు సవ్యంగా నిర్వర్తిస్తూ ఒకరి కొకరు ఐకమత్యము, ప్రేమ, సద్భావము కలిగి కృషి చేస్తుండాలి. శాసనములను ఉల్లంఘించిన వారు, దుష్టవర్తనులు నిర్దయగా శిక్షకు గురి అవుతారు. ఈ విషయాలను మదిలో నుంచు కొని ఎవరి విధులు వారు సక్రమంగా దృఢబుద్ధితో అమలు పరచాలి. ఇలా జరిగేలా ప్రధానామాత్యులు నా ప్రతినిధిగా నిర్వహిస్తారు ఇక్కడి నుండి" అని ఆజ్ఞాపించినాడు.

ఒక క్రొత్త శకం ఆరంభమైనట్లు రాజ్యం సుభిక్షమై నెలకు మూడు వానలు పడి దేశం సస్యశ్యామలముగా అలరారుతోంది. గోవులు కుంభవృష్టిగా క్షీరము లిస్తున్నాయి. బ్రాహ్మణులు యజ్ఞయాగాది క్రతువులతో దేవగణాన్ని తృప్తి పరుస్తున్నారు. వస్త్రోత్పత్తి మెండుగా ఉండి ఆహారవస్తువులు సమృద్ధిగా న్యాయపద్ధతిలో వస్తువిక్రయాలు జరుగుతున్నాయి. ప్రధానామాత్యుడు రాజు ప్రతినిధిగా ఎంతో సమర్థనీయంగా నడపుతున్నాడు. రామ రాజ్యము అంటే ఇదే నన్న గాఢమైన నమ్మకం కలిగిస్తోంది.

రాజ్య భారాన్ని మొత్తమంతా ప్రధానామాత్యునిపై మోపిన రాజు ఏం చేస్తున్నాడు? తానెందులకీ వేషం వేయవలసిందో తన్నిమిత్తమై శృంగారకళావిశేషాలు ఆ రాణులందరి సహవాసంతో ప్రత్యక్షసాక్షిగా తత్సంబంధమైన శాస్త్రవిద్య నేర్వకపోయినా విద్యార్థిగా క్షుణ్ణంగా నేర్చుకొనే ధార్మిక యత్నంలో నిమగ్నుడై ఉన్నాడు. ఆ యత్న మెలాంటిది? తాను పూనుకొన్న అద్వైతమత స్థాపనా యజ్ఞం సంపూర్ణ సాఫల్యాన్ని చేరుకొంటే గాని తన అవతారలక్ష్యం సిద్ధించదు. ఆ లక్ష్యసాధనకు ఏ ప్రాపంచికమైన అవరోధమూ కలుగకూడదు. ప్రియశిష్యుడైన పద్మపాదునకు వివరించినట్లుగానే సాక్షీభూతభావంతో లీలా సదృశమైన ప్రవృత్తి చేపట్టినాడు. సాక్షాత్తు పరమాత్మకు ఏ భేదము ఉంటుంది? అన్నీ ఎఱుక లేని మనుజుల ఇఱుకు మనములలో తప్ప? ఈ సర్వ జగత్తూ ఆయన లోనుండి వచ్చింది. ఆ జగత్తే ఆతడు. చరాచర జంగమ స్థావర పదార్థ జీవ నిర్జీవ వస్తు చైతన్య సంభృతమైన మనకు గోచరమైనదీ, అగోచరమైనదీ అయిన యావత్తు విశ్వానికి అభేదమే కాని అవి వేరు వేరు కావు గదా! ఇక మన దృష్టికి కనిపించేదే వారి జగల్లీల.

ఈలోగా ఒకనాడు మంత్రులందరు కలసి సమావేశమై రహస్యంగా ఇలా మాట్లాడుకొంటున్నారు. 'చనిపోయి రాజు తిరిగి బ్రతికి వచ్చిన పిమ్మటా అంతకు ముందూ ఉన్న పరిస్థితులలో హస్తి మశకాంతర భేదం కనిపిస్తోంది.

ఇత: పూర్వము ఎన్ని యత్నాలు చేశాము దేశంలోని సమస్యలను సరిదిద్దడానికి? ఏ ఒక్కటీ కించిత్తు కూడ ఫలించ లేదు. ఇప్పుడు ఏ శ్రమా లేకుండా అన్నీ చక్కగా జరిగి పోతున్నాయి మహావైభవంగా! అప్పుడు శత్రుబాధ లేని రోజు లేదు. ఈ నాడు దేశంలో ఏ విధమైన వివాదాలే లేవే! ఆనాటి ఉద్యోగులమే ఈనాడు కూడా చేస్తున్నవారము. ఈ అతి విచిత్రమైన మార్పుకు కారణ ముండాలి. మన రాజు చచ్చి బ్రతికిన తర్వాత వచ్చిన మార్పులివి. అమరక మహారాజు యొక్క పాలన మనకు తెలిసినదే కదా! ఏ మానవాతీతుడో మన రాజు మృతకళేబరంలో పరకాయ విద్యతో ప్రవేశించి ఈ మార్పులకు కారణభూతు డై యుండవలెను'. ఏది ఏమయినా ప్రజాక్షేమహితమైన ఈ మార్పును మెచ్చకుండ ఉండగలమా?'

## 4.24 పట్టమహిషి అనుమానము

వివేకి, బుద్ధి కౌశలములు కలది పట్టపు రాణి. తానెఱిగిన అమరకునికీ చచ్చి బ్రదికిన ఇప్పటి రాజుకీ ఏ విధమైన సామ్యం లేకపోవడం. ప్రతిభలో గాని, శాస్త్ర వైదుష్యంలో కాని, వచనా చాతుర్యములో గాని, నడవడిక సొబగులో గాని, తేజ స్సంపదలో గాని నేటి రాజుకు పూర్వపు రాజుకు అణుమాత్రం పోలిక లేదు. పైగా ఇతడు చూడగా చూడగా ఏ మహా మహితాత్ముడో జగద్బాంధవు డన దగ్గ కారుణ్య నిధియో అనిపిస్తోంది. తన అనుమానమును ప్రధానమంత్రితో విచారించ దలచు కొన్నది ఆ నిపుణురాలు. పిలిపించింది. మహారాణి ఆజ్ఞ అందిన అమాత్యశేఖరుడు వచ్చి నమస్కరించి నిలబడి వేచియున్నాడు. మహారాణి అడుగుతోంది అతడిని: "అమాత్య వర్యా! దేశంలోని విశేషాలు ఏమిటి? మన రాజ్యపాలన గురించి ప్రజలు ఏమని తలపోస్తున్నారు?" "మహారాణీ! దేశం ఎల్లవిధాలా పరమశోభాయమానంగా మున్నెన్నడు జరుగని రీతిలో సుఖసంపదలకు ఆకరమై ఉన్నది. ఈ మధ్యనే మంత్రి మండలిలో సమీక్ష చేసినాము. ఒక వంక అత్యంత సమ్మోదము కలిగి ఉన్నా వేరొక వంక మమ్ములను అనుమాన

భావము పీడిస్తున్నది. మన తేడు ఆనాడు పునర్జీవితుడైన పిదపనే ఈ ఆనందకరమైన మార్పులు సంభవించినవి కదా!" మహారాణి: "ఆ భావము మిమ్ములను ఎందుకు పీడించాలి? మార్పుల వలన మేలు కలుగుతోంది కదా?"

**మహామంత్రి :** " అమ్మా! మహారాజు చనిపోయి మరల జీవించిన తరుణంలో ఏ మహనీయుని దివ్యతేజమో రాజులో ప్రవేశించిన దని మా ఊహ.

**మహారాణి :** "అగు గాక! దానికి చింతించ నేల?"

**మహామంత్రి :** "మహారాణీ! మీరన్నట్లు మేలైన ఈ పరిణామం ఎప్పుడు మన చేయి జారి పోతుందో నన్న భీతియే మా బాధకు హేతువు"

**మహారాణి :** "మీ అభిప్రాయము శ్రేయోదాయక మైనది. పరిస్థితులను కనిపెట్టి రాజ్య క్షేమం కోసం పాటుపడడం మీ బాధ్యత. అందుకు తాము సర్వ సమర్థులని మాకు విదితము. ఈ విషయములు పరమ రాజ రహస్యము లని మీకు నేను వేరుగా చెప్ప నక్కఱ లేదు"

**మహామంత్రి :** "ముమ్మాటికీ ఇది పరమ రహస్యము. మహారాణి వారి ఆజ్ఞ శిరోధార్యము. నేను సదా ఆ యత్నం లోనే ఉండి నా విధి నిర్వహిస్తాను". పట్టపు రాణితో మాట్లాడిన తర్వాత ప్రధానామాత్యుడు సెలవు తీసికొని వెళ్ళాడు. వెను వెంటనే కార్యాచరణకు ఉపక్రమించాడు. అమరకుని దేహంలోనికి పరకాయ ప్రవేశము చేసిన మహా వ్యక్తి తిరిగి తన దేహంలోనికి ప్రవేశించ గల అవకాశాన్ని అరికట్టాలి. అందుకు చేయవలసినది ఆ వ్యక్తి యొక్క పూర్వకాయాన్ని లేకుండా చేయడమే. అందుకై ఆజ్ఞలు జారీ చేశాడు. 'రాజ్యము లో నున్న మృతదేహాల నన్నిటినీ స్వాధీనం చేసికొని ప్రభుత్వపు ఖర్చుతో వాటిని దహనం చేయండి' అని సమర్థులయిన సేవక బృందాన్ని ఈ పనిలో పెట్టాడు. 'ఈ మీ కర్తవ్యంలో ఏ అవరోధము వచ్చినా లెక్కచేయ వద్దు. రహస్యముగా నున్న శవములను కనిపెట్టి వాటిని కూడా ఆలస్యం లేకుండా దగ్ధం చేయండి' అని వారికి స్పష్టమైన నిర్దుష్టమైన ఆజ్ఞ లిచ్చాడు.

జనులీ వార్తలు విని మన రాజు ఎంత దయామయుడు! అనాథ ప్రేత సంస్కారం చేస్తున్నాడని మురిసిపోతున్నారు జనులు అసలు రహస్యం ఎఱుగక.

## 4.25 శంకర శిష్యుల అన్వేషణ

గుహలో భద్రపరచిన గురువు గారి శరీరాన్ని జాగరూకతతో కాపాడుతున్న శంకరాచార్యుల శిష్యులు 'రావలసిన గడువు దాటిపోతోంది. వచ్చే జాడలు కానరావు. ఏమయింది? ఎందులకీ విలంబనము?' అని పరి పరి విధాల ఆవేదన పడుతున్నారు. 'మన గురుడు మనకు తిరిగి ప్రాప్తించునా లేదా? మహోత్తముడైన గురుసాన్నిధ్యం దొఱకిన దని సంబరపడ్డాము. ఇప్పుడు మనకు ఏమి గతి?' 'స్వామీ! మా అవస్థ చూచి యైనా తిరిగి వచ్చి మమ్ము కాపాడు. నీ కన్న కరుణాహృదయుడు ఎవరున్నారు? నీవే రక్ష!'. ఈ రీతిగా వేదన పడుతున్న సహశిష్యులను చూచి పద్మపాదుడు వారిని చూచి "మిత్రులారా! ఎందులకీ విలాపములు? మన గురుదేవుల ఉనికిని కనుగొని మన వంతు మన విధిని చేసే ప్రయత్నం చేద్దాము. హనుమంతుడు సీతాదేవి కోసం వెదకి నట్లు మన గురువును మనము కనుగొనే యత్నం చేద్దాము. యత్నంతో సమకూడని పనులుండవు. నా భావము ప్రకారము మనం గురుదేవుని ఉనికి తెలుసుకొనడానికి ఎక్కువ శ్రమపడ నవసర ముండదు. అజ్ఞాతవాసంలో నున్న పాండవులను ఎలా తెలిసికొన గలం అన్న ప్రశ్నకు భీష్ముడు చెప్పిన రీతిగానే మనం మన గురుదేవుని సులువుగా తెలిసికోవచ్చు నని నా అభిప్రాయం. గురువుల రూపు రేఖలు కనిపించకపోయినా వారున్న ప్రదేశం వారు తేజోవైభవాలతో ప్రభావితం కాక మానదు. అదే మనకు కావలసిన సంకేతం" అని చెప్పి మిగతా శిష్యులకు ధైర్యం నూరిపోశాడు.

అప్పుడు పద్మపాదుడు కొందరు శిష్యులను శంకరుని శరీరాన్ని కాపాడడానికి నియమించి, మరి కొందరు సహాధ్యాయులతో కలిసి శంకరుల

అన్వేషణలో బయలుదేరాడు. కొండ దిగి దగ్గఱ నున్న గ్రామాలు చూస్తూ వెదకడం మొదలు పెట్టారు. క్రమంగా అమరక మహారాజు నగరం చేరారు.

వేళ అతిక్రమించకుండా ఒక బ్రాహ్మణుని ఇంట అతిథులుగా వెళ్ళారు. ఆ గృహస్థుడు ఈ శంకర శిష్యులను చూచి "అయ్యలారా! మీరెవ్వరు? ఏ ఊరి నుండి వచ్చారు? మీ రాకకు కారణ మేమిటి? మీరు చూడగా విశిష్టవిప్రులులా ఉన్నారు" అని అడిగిన ప్రశ్నకు పద్మపాదుడు ఈ విధంగా సమాధాన మిచ్చాడు: "మహాత్మా! మా నివాసం కాశి. గురుధనం కోసం వచ్చి ఉన్నాము. ఈ దేశాన్ని పాలించే రాజు ఎవరు? ఆయన ఎట్టివాడు? పండితులను సన్మానించునా? ఆయన ఏయే విద్యలలో నిష్ణాతుడు? ఏ విద్య యందు ఆయనకు అభిరుచి మెండు?" అని తిరుగు ప్రశ్నలు వేసెను.

అందులకు సమాధానంగా ఆ ఇంటి యజమాని ఇలా అన్నాడు: "మహాత్ములారా! మా రాజు మంచి వాడనే అనాలి. ఆయన పేరు అమరకమహారాజు. సకల విద్యలలోను ఆరితేరిన వాడు. రామరాజ్యమునే మైమఱపించు పరిపాలనము. ఇప్పుడు మా కెవరికీ ఏ కొఱతా లేకుండా బ్రదుకుతున్నాము".

"మీ రాజునకు వయస్సు ఎంత?" అని అడిగిన ప్రశ్నకు "వయస్సుచే పెద్దవా డైనను చూపరులకు చిన్నవాడి లాగునే కన్పట్టును" అని బదులు చెప్పాడు గృహస్థుడు. అప్పుడు పద్మపాదుని అనుమానము బలమై, మరల ఇలా అడిగాడు: "విప్రోత్తమా! మీ మాటలు కొంచెము సంశయాత్మకంగా ఉన్నాయి. మీ రాజు పాలన ఇదివరకు సరిగా లేదా?ముసలివాడై ఉండి యౌవనవంతుడిలా కనబడడ మేమిటి? దయతో నా అనుమానం నివర్తి చేయండి స్వామీ!"

అందుకు గృహస్థుడు ఇలా అన్నాడు. "తేజోనిధీ! నీ అనుమానానికి కారణము లేకపోలేదు. మా రాజుకు వేట అన్న పిచ్చి. క్రూరమృగాలను

వేటాడడం రాజధర్మమే కదా! ఒకప్పుడు వేటకు వెళ్ళి పగలంతా వేటాడి రాత్రి అయ్యేసరికి అలసి ఒక చెట్టుమొదట జేర్లబడి కన్ను మూసాడు. తెల్లవారిన తర్వాత వచ్చిన పరిజనం నిద్రలో ఉన్నా డనుకొని వేచి వేచి చివరకు తెలుసుకొన్నారు అది శాశ్వతనిద్ర యని. అందరూ దు:ఖంతో పరితపించినవారే. కడకు చితి పేర్చి కళేబరాన్ని దానిపై ఉంచారు దహనక్రియకు. ఇంతలో అందరూ చూస్తుండగనే ఆ దేహము కదలి లేచి కూర్చున్నాడు రాజు. నేనూ చూశాను ఆ దృశ్యం. పరమాద్భుతంగా మా రాజు పునర్జీవితుడయ్యాడు. ఈ సంగతి రాజుకు విన్నవించగా సకల మర్యాదలతో పురికి వచ్చి తిరిగి తన కోరిక మేరకు పట్టాభిషిక్తు డయ్యాడు. అప్పటి నుండి పరిపాలనా విధానమే మారిపోయింది. రాజ్యపాలనాభారం అంతా ప్రధానామాత్యునిపై పెట్టి రాజు అంత:పుర రాణులతో శృంగారలీలలు సలుపుతూ ఉంటాడు. అందు వలన మీ వంటి వారికి రాజ దర్శనం దొరకడం బహుదుర్లభం. సంగీత విద్వాంసులకు మాత్రం దర్శనం సులభ మని ప్రతీతి". ఈ కథను విన్న పద్మపాదాదులకు సందేహం పోయింది. రా వలసిన చోటికే వచ్చామని తెలిసింది.

## 4.26 గాయక వేషధారులు

పద్మపాదుడు, కూడా వచ్చిన శిష్యులు, గాయకుల్లా వేషాలు వేసికొని వీధిన బడి శ్రోత్రమధురంగా పాటలు పాడుకొంటూ రాజవీధులలో వెడలడం చూచిన కొందరు అంతఃపురకాంతలు ఆ విషయం రాజు చెవిన వేసి ఆ గాయకులను రాజభవనంలోనికి తీసికొని వచ్చారు. సింహాసనంపై కూర్చున్న మహారాజు చుట్టూ రాణులు పరివేష్టించగా తారల మధ్య నున్న రాకా చంద్రుడిలా వెలిగిపోతున్నాడు. నవరత్నఖచిత కిరీటము ధరించి శ్వేతచ్ఛత్రము క్రింద సుందరీమణులు వింజామరలు వీస్తుండగా మధురగానాలు వింటూ తన్మయుడై దివ్యకాంతులతో ప్రకాశిస్తున్నాడు. చూచీ చూడగనే నమ్రులై నమస్కరించారు మన కపటగాయకులు. ఉచితాసనాలపై

కూర్చుండ బెట్టిన తరువాత గానము వినిపించుటకు అనుమతి ఇచ్చాడు రాజు.

మొదటగా గురుప్రార్ధన చేశాక గానం ప్రారంభం చేశారు. ఒక మిథ్యాఘట్టాన్ని ఈ విధంగా సృష్టించారు. పరివారమును విడచిపోయిన భ్రమరరాజము తోడి ఎడబాటు భరించలేక చిన్న భ్రమరములు మొఱ పెట్టుకొను ఘట్టము. “ఓ భ్రమరరాజమా! మన మధువనంలో ఉండి మనందరికి విందు చేస్తూ మాతో బాటు అద్భుత సుఖాన్ని పంచుకొనే సమయాలు గుర్తు తెచ్చుకో. నీ ఎడబాటు సహించక వెదక రాని పొదలన్నీ వెదకి వెదకి కడకు నిన్ను కనుగొన్నాము. మాతో ఇదివరకు పంచిన సౌఖ్యాన్ని మరచి ఈ క్రీకారణ్యంలో చెట్ల చిటారున నీ వాసం ఎన్నుకొన్నావు. మత్తెక్కించు మధువు గ్రోలుతూ ఝుంకారాలు చేస్తూ ఇక్కడ స్థిరనివాసం చేసికొంటివా! నీవే కారణంగా ఈ చోటుకు వచ్చావో నీకే తెలుసును. వచ్చిన పని ముగియలేదా? గడువు దాటు నన్న ధ్యాస లేదా! ఓ భ్రమరాగ్రణీ! నీ రాక కోసం నీ వారు ఎదురుతెన్నులు చూస్తున్నారని తెలిసికో. నీకు నిజానికి తెలియని వేమీ లేవు!”.

గాయకులు వినిపించిన భ్రమరగీతం విని శంకరుడు పూర్వస్మృతి తెచ్చుకొన్నాడు. అంతలో సింహాసనంపై ఒరిగి కన్ను మూసాడు. గాన మాధుర్యంలో మైమరచి పడ్డాడను కొన్నారు మొదట. తర్వాత తెలిసింది ఇక మహారాజు లేడని. శంకరుడు ఆ శరీరాన్ని విడచిపెట్టేశాడు.

దేశమంతా గాలించి దొరకిన శవాలనెల్లా దహనం చేసి వస్తున్నారు రాజ భటులు. తిరుగు యానంలో వారి కంటబడింది శంకరుని శరీరం. శిష్యులెంత అడ్డపడినా ప్రయోజనము లేకపోయింది. శంకరుని శరీరాన్ని పట్టి చితి పేర్చి నిప్పు ముట్టించే తరుణానికి ఆకాశం నుండి దివ్య తేజస్సు ఆ శరీరంలో ప్రవేశించింది. లేచి కూర్చున్నారు గురులు! ఒక్క ఉరకలో

వెళ్ళి గురువులను దింపుకొన్నారు శిష్యులు. ఆ సమయంలో శంకరాచార్యులు సంకట నాశన లక్ష్మీనృసింహస్తోత్రం చెప్పారు.

## 4.27 గాయకులు బందీకృతులగుట

రాజు హఠాత్తుగా ఏ హేతువు లేకుండా మృతి చెందడం చాలా అనుమానాలకు దారి తీసి మంత్రులు గాయకులను బంధించి తెమ్మని ఆనతిచ్చారు.

ఆ బందీకృతులైన గాయకుల నిలా ప్రశ్నించాడు మంత్రి:

**మంత్రి :** మీరు లోనికి పోవుటకు ఎవరి అనుమతి పొందారు?

**గాయకులు :** అయ్యా! మహారాజు గారే మమ్మల్ని పిలిపించుకొన్నారు.

**మంత్రి :** మీరు పాడిన పాట లేమి?

**గాయకులు :** భ్రమరగీతలండి.

**మంత్రి :** ఈ పాట లోని భావ మేమిటి?

**గాయకులు :** మాకు తెలియదండి. మేము తెలివి గల వాళ్ళం కామండి.

**మంత్రి :** మీరు నిజంగానే తెలివి లేని వారే! నిజం చెప్పండి.

**గాయకులు :** ప్రభో! లోకమే నిజం కాదు. ఇంక మా మాటలు నిజమని ఎలా చెప్పగలం?

**మంత్రి :** గాయకులారా! ఒకటి మాత్రం నిశ్చయం. పాటలు పాడి మా రాజు ప్రాణాలు తీశారు.

**గాయకులు :** స్వామీ! మేము పాటలు పాడినపుడు రాజుగారికి చాలా దూరంలో ఉన్నామే! రాజుగారి ప్రాణాలు తీయడం ఎలా సాధ్యం?

భటులతో గాయకులను కట్టడిలోనే ఉంచి జాగ్రత్తగా చూడమని చెప్పి మంత్రి నిస్పృహతో నిష్క్రమించాడు. ఇంతలో రాజభటులు వచ్చి

శంకరాచార్యుడు తమకు దొరకిన మృతదేహంలో ప్రవేశించిన ఉదంతం భయకంపితగాత్రులై మంత్రులకు తెలిపారు. మంత్రి కూడ భయంతో తిరిగి గాయకుల దగ్గరకు వచ్చి క్షమించుడని ప్రార్థించాడు. పద్మపాదాదులు కడచిన వృత్తాంతం మిగిలిన శిష్యులు వచ్చి చెప్పగా విని ఆనందంతో పరుగు పరుగున గురు సన్నిధి చేరుకున్నారు.

## 4.28 'జితాస్మి'

శంకరాచార్యస్వామి గగనమార్గంలో మండనమిశ్రుని గృహం చేరుకొన్నారు గడువు పూర్తి అయ్యేసరికి. మండనమిశ్రుడు అత్యంత గౌరవంతో శంకరునికి ఎదురేగి వందనములు ఆచరించి షోడషోపచారములతో పూజించి గురువులను ఉద్దేశించి "జగద్గురుదేవా! తమ కరుణా కటాక్షము వలన పరమేశ్వర తత్త్వం తెలిసికో గలిగాను. నా ఇల్లూ, వాకిలీ, నా ధనమూ, నా సర్వస్వం మీ అధీనం. తమరే నా గతి. వేరొండు గతి లేదు. ఈ దీనుని శాసించుడు. తమ ఆజ్ఞకు సర్వదా బద్ధుణ్ణి" అని వేడుకొన్నాడు మండనుడు. నగరంలోని వారందరూ శంకరుడు వచ్చిన వార్త విని ఒకరొకరే వచ్చి పాదాభివందనం చేసికొంటున్నారు.

ఇంతలో ఉభయభారతి వచ్చి "సకల విద్యలకు ఆలవాలమైన శ్రీభగవానుడా! సర్వభూతములకు ఆధారమైన పరబ్రహ్మస్వరూపా! ఆచార్యదేవా! అనుకొన్నటుల నాతో వాదించ వలదు. సర్వశాస్త్రములలో పూర్ణుడవై యున్న నీతో మానవులు వాదించ నుద్యుక్తు లగుట వెఱ్ఱితనము! మీ తోటి వాదము మీ కొఱకు నా కొఱకు కాదు గదా! భాస్కరప్రభ ముందు దివటీల వలె మా ప్రతిభ వెలవెలబోతుంది. మీతో అపజయమే మాకు ధన్యత నిస్తుంది. జితాస్మి!" అని పలికెను. దానికి బదులుగా శంకరుడు ఉభయభారతితో "తల్లీ! నీవు ఆదిజుడైన బ్రహ్మ ఇల్లాలివి. విద్యలకు సామ్రాజ్ఞివి. నీకు తెలియనిది విశ్వంలో లేదు. నీ కరుణతోనే ఎవరైనా తెలివి నార్జించేది. నీవు బ్రహ్మలోకానికి తిరిగి వెళ్ళినా ఈ లోకంలో

జ్ఞానరూపంలో ఉండాలని నా ప్రార్థన.” అని అడగగా ఉభయభారతి సరేనని వర మిచ్చి బ్రహ్మలోకానికి చేరుకొంది.

## 4.29 మండనమిశ్రుని సన్న్యాసాశ్రమము

అటు ఉభయభారతి నిజలోకానికి తిరిగి వెడలగానే మండనమిశ్రుడు తన చేయవలసిన కర్మలను ముగించుకొని, నిత్యకర్మాచరణలను మనస్సులో విడనాడి అగ్నిని తనలో ఐక్యం చేసికొని, తనకున్న ధన భాగ్యాలను బ్రాహ్మణులకు, పేదలకు పంచిపెట్టివేశాడు. ఇంక తన కనే దేదీ ప్రాపంచికపర మైన వస్తువులు లేకుండా త్యజించాడు. ఒకప్పుడు తాను నిరసించిన సన్న్యాసధర్మాన్ని శంకరుల కరుణతో చేపట్ట నున్నాడు. ముందుగా ఆ తురీయాశ్రమ ధర్మాలను పరిశీలించు కొన్నాడు. వాటిని నిరవశేషంగా ఆకళించుకొని, శంకరాచార్యస్వామిని మన:పూర్వకముగా వేడుకొన్నాడు సన్న్యాసాశ్రమము నిప్పించమని. ఆచార్యస్వామి ముందు శాస్త్రీయము గా శిఖా యజ్ఞోపవీతములు విసర్జించి, కాషాయాంబరధారియై, దండ కమండలములు చేకొని గురుదేవునికి సాష్టాంగప్రణామము చేసి శిష్యుడయ్యాడు. ఈ పరిణామము కేవలము వాదపరీక్షలో ఏర్పరచుకొన్న కట్టడి ననుసరించి కాక నిష్కల్మష బుద్ధితో మనశ్శుద్ధితో కోరుకొని నిశ్చయించుకొన్న నిర్ణయం. ఆ క్షణంలో ఆయనకు పూర్వాశ్రమం ఒక కలలా అనిపించింది. ఇన్నాళ్ళు అంధకారంలో ఉండి నేడు ఆచార్యుల తేజస్సులో వెలుగు లోనికి వచ్చినట్లయింది. మండనుని పూర్వపు శిష్యులు కూడా శంకరుని శరణు జొచ్చారు. క్రొత్త ఆశ్రమంలో మండనమిశ్రుడు ‘సురేశ్వరాచార్యుడు’ అయ్యాడు.

## 4.30 మహావాక్యోపదేశము

శిష్యుని తనంత వానిగా చేయాలని గురువు లనుకుంటారు. మోక్షమార్గమును చూపువాడు గురువు. సురేశ్వరాచార్యునితో శంకరులు

ఈ విధంగా బోధించారు. “నాయనా! మనం నిద్రలో కలలు కంటాము. మెలకువ రానంతవరకు అవి నిజముగానే తోచును. మెలకువ రాగానే అవి అసత్యములని తెలుస్తుంది. ఈ సంసారం కూడా ఒక పెద్ద కల. తెరపై బొమ్మలు వస్తాయి. అవి రకరకాలుగా ఆడుతాయి. నిన్ను నవ్విస్తాయి. ఏడిపిస్తాయి. అంతా అయిన పిమ్మట ఏమీ ఉండదు. బొమ్మలను ఆడించే వాడు మనకు కనబడడు. తెరవెనుక ఉంటాడు. మొదట గాని, మధ్యలో గాని, చివర గాని నీకు కన్పట్టడు.

అట్టిదే ఈ జనన మరణ క్రీడ. ఇదంతా ఉన్నది ఉన్నట్లు తెలిసికొనడమే తెలివికి సార్థక్యం. ఈ చూచు చున్నదీ లేదు. ఈ శరీరమూ లేదు. జననమూ లేదు. మరణమూ లేదు. అన్ని కాలములలో ఉన్నది ఒకటే. అది సద్వస్తువు. అదే నీవు. దానినే ఆత్మ అంటారు. అది అంతటా నిండి ఉంటుంది. జీవుడు వేరు, ఆత్మ వేరు అనుకోవడం అవివేకం. అజ్ఞానంతో ఈ శరీరాన్ని ‘నేను’ అని తలుస్తున్నావు. వస్త్రం చిరిగినపుడు పారవేసి క్రొత్త బట్ట కట్టుకొన్నట్లుగానే ఈ శరీరం నశించిన తర్వాత మరో శరీరాన్ని ఆశ్రయిస్తావు. కనిపించే వన్నీ నశ్వరాలే. శరీరం కూడా కనిపించేదే కాబట్టి అది కూడ నశ్వరమే. ‘నేను చిక్కాను, బలిశాను, మగవాణ్ణి, ఆడదాన్ని, ముసలివాడనయ్యాను...’ ఇత్యాదులు అన్నీ శారీరకములే కాని, ‘నీకు’ చెందవు. ఆత్మకు ఆదిమధ్యాంతములు లేవు. ‘దేహమే ఆత్మ, ఇంద్రియాలే ఆత్మ, ప్రాణమే ఆత్మ, మనస్సే ఆత్మ, బుద్ధియే ఆత్మ,.’ ఈ విధంగా ఆత్మను ఎన్నిటి యందో ఆరోపించే మతము లున్నవి. దేహము, ఇంద్రియములు, బుద్ధి, ప్రాణము, మనస్సు, ఇవి జడపదార్థములు. అందు వల్ల ఇవి ఏవీ ఆత్మ కానేరవు. ఆత్మ వీటికి అన్నింటికీ అతీతముగా సాక్షీభూతముగా ఉంటుంది. ఆత్మకు వికారములు ఉండవు. చైతన్యముతో స్వయంప్రకాశముగా ఉంటుంది. అదియే ‘నీవు’. సర్వజగత్తుకూ ఆత్మయే కారణమై ఉన్నది. అది పరిపూర్ణము. పరిపూర్ణమైన వస్తువు ఒకటియే గాని రెండుగా ఉండదు. ఈ సంగతులు

ఉపనిషత్తులలో కలవు. తెలియని వారు వేర్వేరు విధములుగా వచిస్తారు. ఆ పలుకులు నమ్మిన మూలాననే నాస్తికభావనలు మొలకెత్తాయి. పరమాత్మకు నిర్దిష్టమైన గుణములు లేవు. అందువలననే నిర్గుణు డన్నారు. సురేశ్వరా! నీకు అనుమానములు మెండుగా ఉన్నవి. 'సంశయాత్మా వినశ్యతి' అన్నట్లు సంశయం గలవానికి నాశనం తప్పదు. కాబట్టి నీ సంశయాల నన్నిటినీ తత్క్షణమే విడనాడుము. తెలిసికొనే తెలివే ఆత్మ. ఆత్మవస్తువును నేనే అని నమ్మినవారలు అరుదు. శ్రీకృష్ణభగవానుడు తానే ఆత్మగా లోకానికి వెల్లడి చేశాడు. ముత్యాలహారంలో సూత్రమున్నది. సూత్రములో ముత్యాలు ఉండవు. సూత్రం తెగినచో ముత్యాలు వేరవుతాయి. జగత్తు ముత్యాల వంటిది. ఆత్మ సూత్రము. 'తత్ – త్వం' అనే ఈ రెండు పదములే జీవేశ్వరులు. పదములు వేరయినా అందులో నున్న చైతన్య మొక్కటే! ఉపాధులకు అదిష్ఠానంలో ఏకత్వాన్ని చూచుకోవాలి. కుండకూ మట్టికీ అధిష్ఠానం ఒక్కటే. అట్లుగానే 'తత్ – త్వం' లోని వాచ్యార్థాన్ని విడచి లక్ష్యార్థాన్నే గ్రహించవలెను".

అప్పుడు సురేశ్వరునికి ఒక సందేహం పొడచూపింది: "గురుదేవా! బ్రహ్మపదార్థం ఉంది కాని మనకందరికీ కనిపించే ఈ జగత్తే లేదంటున్నారు. అది ఎట్లా? ఉన్నది తెలియబడుచున్న దానిని లేదు అంటున్నారు. కనిపించని ఆత్మపదార్థమే ఉన్నదంటున్నారు. ఇది ఎలాగ? దయతో సెలవిస్తారా?"

శంకరాచార్యులు ఈ విధంగా ఆ శంకకు ఉత్తర మిస్తారు: "సురేశ్వరా! భావాభావాలు, ఉనికి లేములు వ్యవహారదశ లోనివి మాత్రమే. పరమార్థంలో ఇది వర్తించదు. లేనిది అనుకొన్నది తెలియబడవచ్చును. ఉన్నది తెలియబడాలనే నియమం లేదు. జగత్తు లేకపోయినా తోచవచ్చు చున్నది. ఈ తోచబడేది అంతా ఆత్మయే. 'రజ్జు సర్ప భ్రాంతి' వలె సర్పభ్రాంతికి కారణము త్రాడే. ఈ మాట చాలా చోట్ల విశదంగా కనిపిస్తుంది. బంగారంతో తయారైనది ఉంగరం. మట్టితో తయారయినది కుండ. నీటి స్వరూపమే

మంచు గడ్డ. ఇలాంటి వస్తువులలో నీకు పూర్వరూపం కనిపిస్తుందా? కాని వాటికి వీటికి తేడా మృగ్యం.

ఆ పూర్వావస్థ ప్రచ్ఛన్నంగానే ఉంటున్నది. 'సర్వభూతేషు ఆత్మని' అని శ్రుతి. ఆత్మ యందు జగత్తు ఉన్నది. సర్వశరీరాలలో ఉన్న ఆత్మ ఒక్కటే! ఇన్ని శరీరాలలో పెక్కు ఆత్మలు లేవు. సూర్యుని ప్రతిబింబం జలాలలో చూచినపుడు అనేకంగా గోచరించినా సూర్యు డొక్కడే కదా! జీవులను ప్రకాశింప జేసేది ఆత్మ ఒక్కటే. అది బుద్ధినీ, ఆ బుద్ధి ఇంద్రియాలనూ ప్రకాశింపజేస్తున్నాయి. ఈ మూడింటికీ సాక్షి ఆత్మ ఒక్కటే. ఇంకొక మాట. ఆత్మతత్త్వం తెలిసికొనాలనే సంకల్పం అందరికీ కలగదు. బహు పుణ్యం చేసికొన్నవానికి గాని కలుగదు. 'సర్వం బ్రహ్మ' అని ప్రతి వానికి చెప్పరాదు" మరొక సంశయం లేవనెత్తాడు సురేశ్వరుడు: "స్వామీ! బ్రహ్మము మారి జగత్తు అయిందా?"

శంకరాచార్యుడు: "నీ వన్నట్లు అట్లనే వారు లేకపోలేదు. కాని నిజం వేరుగా నున్నది. పెరుగు వెను తిరిగి పాలు అవుతుందా? ఎన్నటికీ కాదు. ఇది సాంఖ్యుల మతం. మట్టి కుండ అయినట్టు, నూలుపోగులు వస్త్రమయినట్లు, బంగారం నగ అయినట్లు ఆత్మ జగత్తుగా అయినది. కాని జగత్తు వలె కన్పట్టును. కాని జగత్తుగా పరిణామం పొందలేదు. జగత్తు రూపంలో మిథ్య, ఆత్మరూపంలో సత్యము. త్రాడు రూపం సత్యం. సర్పరూపం మిథ్య. బ్రహ్మం ఉన్నదని, తానే ఆత్మ అని గ్రహించడం పరోక్షజ్ఞానం. 'తానే పరమాత్మ' అనుకోవడం అపరోక్షజ్ఞానం. దీనినే పరమానందస్థితి లేక స్వస్వరూపస్థితి అంటారు. జగద్భావన విడచి బ్రహ్మభావననే చేయుము"

## 4.31 దక్షిణ యాత్ర

మండనమిశ్రుని, ఆతని భార్య ఉభయభారతిని ఓడించి మండనమిశ్రనికి సన్న్యాస మిప్పించిన వార్త దేశం నలుమూలలా

వ్యాపించింది. శంకరాచార్యులను ఎందరెందరో కలిసి జోహారులర్పించి వారికి శిష్యు లయ్యారు. శంకరుల లక్ష్యసాధన ఇంతటితో పూర్తి కాలేదు. ఇది మొదలు మాత్రమే. అందుకు శిష్యసమేతంగా మాహిష్మతీపురం నుండి బయలుదేరారు దక్షిణ దిశగా. దారిలో అనేక ప్రాంతాలు దర్శించుచూ, వాటి స్థలమాహాత్మ్యాలను చెప్పుకొంటూ శాస్త్ర చర్చలతో నడుస్తూ, మధ్యమధ్య కనిపించిన పర్వతాలను, సెలయేళ్ళను, అరణ్యాలను చూస్తూ ఆ ప్రకృతి సౌందర్యాలను తిలకించుచూ మధ్య మధ్య గ్రామాలలో ఆగి ఆ జనులకు దర్శనము ఇస్తూ సాగిపోతోంది వారి కాలి నడక ప్రయాణము. మొదట తగిలినది మహారాష్ట్రము. ఎందరో మహాభక్తులూ, మహావ్యక్తులూ ప్రభవించిన రాష్ట్రమది. మహా యతీశ్వరుడు వచ్చాడని తెలిసి శంకరుని కలిసి వారికి శిష్యులయిన వారు ఎందరో! మహారాష్ట్ర మంతటా పర్యటించక ముందుకు వెళ్ళారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చారు.

## 4.32 శ్రీశైలక్షేత్ర దర్శనము

అక్కడికి చేరుకొనే ముందు కుతూహలంతో శిష్యులు అడుగగా శ్రీశైలమాహాత్మ్యము గురించి శంకరులవారు ఇట్లా సెలవిచ్చారు: “ద్వాదశ మహాలింగములు ప్రసిద్ధి కెక్కి యున్నవి. అందు బహుప్రఖ్యాతి గాంచిన త్రిలింగములలోను శ్రీశైలమందున్న దొకటి. క్షేత్రమందున్న దేవుడు శ్రీమల్లికార్జునస్వామి.

శ్రీ భ్రమరాంబిక అమ్మవారు. ఈ క్షేత్రమహిమ వర్ణించుటకు అపూర్వమై వినుటకు తనివి తీరనిది. ‘శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే’ అని పురాణ వాక్కు. అంటే శ్రీశైలశిఖరం చూచినంత మాత్రాన జన్మరాహిత్యం లభిస్తుందని. మన దేశం లోని పుణ్యక్షేత్రాలలో సాధారణంగా దేవునికో దేవికో లేదా క్షేత్రానికో మహిమ లుంటాయి. రెండింటికి మహిమలు గలవి అక్కడక్కడ కలవు గాని మూడింటికి మహత్తు గల పుణ్యక్షేత్రము ఇదొక్కటే.

ఈ క్షేత్రము ముప్పది ఆమడల పొడవు, వెడల్పు కలిగి నాలుగు ద్వారములున్నవి. తూర్పున ఉన్న ద్వారము త్రిపురాంతకము, దక్షిణమున నున్నది సిద్ధవటము, పశ్చిమాన అలంపురము, ఉత్తర దిక్కున ఉమామహేశ్వరము అనే ద్వారము. ఒకానొకప్పుడు ఈ క్షేత్రములో మూడువేల ఎనిమిది వందల నివాస మందిరములు, విశాలమైన వీధులు కలిగి ఉండెడి దని ఇటీవల ఆధారములతో తెలిసిన విషయము.

క్షేత్రములోని ఱాళ్ళు, మట్టి, చెట్లు, దుంపలు, తీగలు, ఓషధులు, నీరు, గాలి మున్నగు సకల జడపదార్థములు మహామహిమ కలిగి యున్నవి. సిద్ధులు, యోగులు మొదలగు వారు ఆకాశగమనము, స్వేచ్ఛాగమనము, అదృశ్యగమనము, భూగర్భదృశ్యము వంటి అద్భుతముల నెన్నో సాధించు చుంటారు. తప మాచరించుటకు బహు యోగ్యమైన తావిది. జ్యోతిర్లింగము నాశ్రయించుకొన్న శక్తి ఉండవలెను కదా! అష్టాదశ మహాశక్తులలో ప్రధానమైన భ్రమరాంబికాశక్తి ఇచటనే వెలసినది'' అని ఆ పవిత్రక్షేత్రమహిమను వెల్లడించారు.

"గురుదేవా! ఈ క్షేత్రమునకు శ్రీశైలమనే పేరు ఎలా వచ్చింది?" శిష్యులు అడిగారు. శంకరులు ఇట్లా వివరించారు: "పూర్వకాలమందు వసుమతి అను పేరు కల ముని కన్య పరాత్పరుని గూర్చి తపస్సు చేసి తన పేరు స్థిరంగా ఉండవలె నని, తన పేరుకు బదులుగా శివుడు వేంచేసి యున్న శైలమునకు మొదట 'శ్రీ' చేర్చుమని ప్రార్థించినది. ఇది కృతయుగము నాటి కథ. మరియొక గాథ – కొన్ని యుగాల క్రితం శిలాదుడనే మహర్షికి పర్వతు డనే పుత్రుడు శ్రీదేవి అనే కుమార్తె ఉన్నారు. ఈ యిరువురూ ఈశ్వరుని గూర్చి తపస్సు చేయగా పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. పర్వతుడు తానొక పర్వతాకారములో నుండగా ఆ పర్వతంపై లింగాకారముగా పరమేశ్వరుడుండాలనీ అర్థించాడు. ఆ పర్వతం పేరులో ముందు 'శ్రీ' చేర్చుమని అర్థించింది శ్రీదేవి.

“ భూమి పుట్టినప్పుడే ఈ క్షేత్రంలో మల్లికార్జునుడు వెలసె నని భక్తుల విశ్వాసం. హిరణ్యకశిపుడు, శ్రీరామచంద్రుడు, పాండవులు ఈ క్షేత్రాన్ని దర్శించి స్వామివారిని అర్చించినట్లు పురాణగాథ. వ్యాసభగవానుడు, ఘంటాకర్ణ శివాచార్యుడు ఇచ్చటనే తపమాచరించినట్లు ప్రతీతి.” స్నానం చేసినంత మాత్రాన సర్వపాపాలు హరించి శాంతిని చేకూర్చే పాతాళగంగలో శిష్యులతో సహా స్నానాలాచరించి మల్లికార్జునస్వామి ఆలయంలోనికి ప్రవేశించారు. అప్పుడు శంకరాచార్యుడు ఈ విధంగా స్తోత్రం చేశారు స్వామిని:

**సన్ధ్యారంభ విజృంభితం శ్రుతి శిరస్థానాన్తరాధిష్ఠితం**
**సప్రేమ భ్రమరాభిరామ మసకృత్సద్వాసనా శోభితం**
**భోగీంద్రాభరణం సమస్త సుమన: పూజ్యం గుణావిష్కృతం**
**సేవే శ్రీగిరి మల్లికార్జునమహాలింగం శివాలింగితమ్ ॥**

**భృంగీచ్ఛానటనోత్కట: కరి మద గ్రాహీ స్ఫురన్మాధవా**
**హ్లాదో నాద యుతో మహా సిత వపు: పంచేషుణాచాదృత:**
**సత్పక్ష స్సుమనో వనేషు సపున స్సాక్షాన్మదీయే మనో**
**రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైల వాసీ విభు: ॥**

ఈ క్షేత్రంలో కొన్ని నాళ్ళు ఉన్నారు శంకరాచార్యులు. ఆగమశాస్త్రానుసారము భ్రమరాంబికా దేవిని మహాశక్తిగా స్థాపన చేశారు. ప్రతిదినము పాతాళగంగా తీరానికి పోయి గంగలో స్నానం చేసి, జపతపాదులు ముగించుకొని తత్తీరమందే శిష్యులకు పాఠాలు చెప్పేవారు. చుట్టు ప్రక్కల గల పండితులు వచ్చి అప్పుడప్పుడు శంకరుని అద్వైత మార్గాన్ని బోధింపజేసుకొని వెళ్ళేవారు. పాశుపతాది మతస్థులు వచ్చి అద్వైతమతాన్ని అంగీకరించక వాదాలకు దిగే వారు. అట్టివారితో పద్మపాదాది శిష్యులే ఎదుర్కొని ఓడించి పంపించే వారు. ఇలాంటి వారిలో తార్కికులు, సాంఖ్యులు, వీరశైవులు, వీరవైష్ణవులు, నాస్తికులు, న్యాయవాదులు,

మీమాంసాదర్శకులు, జైనులు ఉన్నారు. వారందరు తుదకు శంకరతత్త్వం ముందు నిలబడలేక నిర్జితులై వెడలే వారు.

## 4.33 కాపాలికుల కుట్ర

శంకరుని ప్రతిభాపాటవాలు, తేజో వైభవాలు అనన్యసామాన్యమైన శాస్త్ర వైదుష్యం అపార జ్ఞానసంపద చూచిన ఇతరమతవాదు లందరూ ఆ ధాటికి నిలువ లేక పాదాక్రాంతు లైన వారే. కాని కొందరు వివేకహీనులు కూడా ఉన్నారు ఆ పరిస్థితిని సహించక అపమార్గంలో అద్వైతవ్యాప్తిని అడ్డుకోకపోతే తమ మనుగడకే ముప్పు వస్తుందనే దురభిప్రాయంతో. అందులో కాపాలికులు అనబడేవారు ప్రముఖులు. ఒక కాపాలికుని పంపించారు శంకరుని వద్దకు. అతడు అవధూతవేషంలో శంకరుని చేరాడు వారు పాతాళ గంగాతీరంలో ఒంటరిగా ఉన్న సమయం చూచి. అతి వినయ విధేయతలు ఉట్టిపడుతుండగా బహు నమ్రభావంతో నిలబడి ఈ విధమైన వింత కోరికను వెలిబుచ్చాడు:

"స్వామీ! పరమపావనమూర్తీ! కృపాసాగరా! తమ దర్శనం కోసం నేను ఎప్పటి నుండియో ఎదురు చూస్తున్నాను. నేటికి సిద్ధించింది నా పుణ్యఫలంగా. మీరు సర్వశాస్త్రవిద్యావిజ్ఞానస్వరూపులు. అపార కరుణా సముద్రులు. అహంకార మమకారాలు ఏనాడో మీచే హతమైనవి. సర్వజ్ఞత్వంతో లీలామానుషమైన ఈ శరీరాన్ని ధరించి లోకోపకారం చేస్తున్నవారు. మీ దయ ఉండాలే కాని అసాధ్యములు సాధ్యము కాకపోవు. నాకొక కోరిక ఉన్నది.

అది సిద్ధించడానికి మీ సహాయం తప్ప వేరు దారి లేదు. నేను కాలభైరవస్వామి అనుగ్రహం కోసం బహు భంగులుగా ప్రయత్నించి విఫలుడ నయ్యాను. ఇప్పుడు ఆ కోరిక మీ కరుణతో సిద్ధించవచ్చు. ఘోరతపస్సు చేయగా కాలభైరవుడు ప్రత్యక్షమై నాతో ఈ విధంగా సెలవిచ్చాడు: 'నీ

కోరిక సఫలం అవ్వాలంటే ఒక సార్వభౌముని శిరమును గాని, ఒక యతీంద్రుని శిరస్సు గాని అగ్నిలో హెూమం చేయి' అని చెప్పి అంతర్ధాన మయ్యాడు. మహాత్మా! నాకు భూమండలంలో సార్వభౌముడన దగిన వాడు కాన రాడయ్యె. ఇక యతీంద్రుని కొరకే నా అన్వేషణ. కాని ఏ యతి నాకు శిరోదానం ఇవ్వడానికి సిద్ధపడతాడు? అలా చేయడానికి తగిన విజ్ఞాన పరిణతి, వైరాగ్యపరిపక్వత, మహాదానసంకల్పం ఎవరికి ఉంటుంది? మీరు ఒకరే నాకు కనబడ్డారు ఇంద్రియములమీద, దేహం మీద పూర్తిగా స్పృహ విడచిన వారు. మీ ఒక్కరికే నిజంగా అవగతమయింది ఈ జగత్తు అంతా అసత్యమని. సత్యమైనది వేరేదో ఉన్నదని. ఆ ఆత్మజ్ఞానపరిపూర్ణులైన మీరు నా ప్రార్థనను మన్నించి నన్ను ధన్యుణ్ణి చేయాలి. గతంలో దధీచి దేవతలకు తన ఎముకలను దానం చేసి అజరామరమైన కీర్తి సంపాదించాడు. అలాగే శిబి తన తొడనో కడకు శరీరాన్నే ఇచ్చాడు డేగ ఆకలి తీర్చడానికి. మీ కరుణాకటాక్షం కోసం నిలబడ్డాను" ఆ కపట సన్న్యాసి కోరికకు తలయూపి శంకరుడు ఇలా అన్నాడు: "ఓయి సిద్ధపురుషుడా! ఎప్పటి కయినా విడువ దగినదే ఈ శరీరం. నా తల తీసికొని నీ పని కానిమ్ము. కాని ఒకటి గుర్తుంచుకో. ఇది చాల రహస్యంగా కావలసిన పని. కాబట్టి ఒక రహస్యప్రదేశం చూసుకో. నా శిష్యు లెవరి కయినా తెలిస్తే నీ పనికి అంతరాయం కలుగుతుంది" అని శంకరుడు కపాలదానానికి సిద్ధపడ్డాడు.

అనుకొన్న రహస్యప్రదేశం చేరి శంకరాచార్యుడు సుఖాసీనుడై, గెడ్డాన్ని కంఠం కుతుకున ఆన్చి, రెండు చేతులూ, మోకాళ్ళనూ తాకి, నిమీలిత నేత్రుడై, భ్రూమధ్యాన్ని చూస్తూ, సంకల్ప వికల్పములు లేనివాడై ఇంద్రియవ్యాపారాన్ని అరికట్టి పరమాత్మను తానుగా భావిస్తూ అలా యోగసమాధి లోనికి వెళ్ళాడు. ఇక కాపాలికుడు తన మనోరథం పూర్తి కానున్నదన్న ఆనందంతో ఒడలంతా ఎముకల బూడిదను పూసుకొని, మత్తుగా మద్యపానం చేసి, ఒకచేత కరవాలం వేరొక చేత త్రిశూలంతో

కాలభైరవ వేషధారిగా వచ్చాడా చోటికి. వస్తూనే దూరాన నుండి కనబడినదా కండ్లు మిరుమిట్లు గొలిపే దివ్య దృశ్యం. ఏనాడో సుకృతం చేసికొని ఉండాలి ఆతడు. లేకపోతే ఎలా లభ్యమవుతుంది యోగ సమాధిస్థితుడై ఉన్న పరమేశ్వరుని దర్శనం!

## 4.34 పద్మపాదుని నృసింహావతరణ

కాలకృత్యాలకు వెడలిన శిష్యులు స్నానాలు చేసి, సంధ్య నుపాసించి ధ్యానంలో ఉన్నారు. పద్మపాదుడు కూడా ధ్యాననిమగ్నుడై ఉండగా అతనికి గోచరించింది కరవాలము ధరించి జగద్గురువుల శిరమును ఖండించడానికి ఉద్యుక్తుడై ఉన్న కాపాలికుని దృశ్యం. వెంటనే పద్మపాదుడు తన ఇష్ట దైవాన్ని తలచుకొన్నాడు. తలచిన మరు క్షణమే పద్మపాదునికి నృసింహస్వామి రూపు వచ్చింది. కాపాలికుడు గురుదేవుడు ఉన్న రహస్య స్థలంలో అదే క్షణంలో ప్రత్యక్ష మయ్యాడు. అగ్నిజ్వాలలు కక్కుతున్న ముఖంతో, వాడి కోరలతో, చీల్చి చెండాడే కత్తుల వంటి గోళ్ళతో చింత నిప్పు వంటి నాలుకతో భీకర రూపం దాల్చి సింహగర్జనను మించిన గర్జనతో ఒక్క ఉరకలో కాపాలికుని మీదికి లంఘించినాడు పద్మపాదుడు. పృథివి దద్దరిల్లింది. సకలభూతములు భీతిల్లాయి. దేవతలు అడలి అవనికి దిగి వచ్చారు. హిరణ్యకశిపుని బారి నుండి ప్రహ్లాదుని కాపాడినట్లు కాపాలికుని సంహరించి శంకరుని రక్షించు కొన్నాడు. ఇంతలో శంకరుడు యోగసమాధి నుండి వెలువడి జరిగినది గ్రహించాడు. ఆకాశం విరిగి మీద పడినట్లు అట్టహాసంతో ప్రత్యక్ష మయిన ఆ ఉగ్ర నరసింహ స్వామిని చూచి ఇలా ప్రార్థించాడు:

> **“కల్పంతో జృంభమాణ ప్రమథ పరివృఢ ప్రౌఢ లాలాట వహ్ని**
> **జ్వాలాలీఢ త్రిలోకే జనిత చటచటధ్వాన ధిక్కార ధుర్య: ।**
>
> **మధ్యే బ్రహ్మాండభాండోదర కుహర, మనైకాంత్య దుస్థా మనస్థాం**
> **ప్రాప్తస్త్యానో మమాయం దళయతు దురితం శ్రీనృసింహాట్టహాస: ॥**

ఉగ్రరూపాన్ని ఉపసంహరించ మని శంకరులు అర్థించగా ఆ రూపం అదృశ్యమై పద్మపాదాచార్యుడు గోచరించాడు. పద్మపాదుడు ఆనందాశ్రు వులతో గురువు పాదాలకు అభిషేకం చేశాడు.

## 4.35 పద్మపాదుని కథ

పద్మపాదుడు గురువులను రక్షించిన తెఅగు చూచి అద్భుతపడిన శిష్యులు శ్రీనృసింహస్వామి పద్మపాదునకు ఎలా ప్రసన్ను డయ్యాడో తెలుపమని కోరగా పద్మపాదుడు వారికి ఈ కథ చెప్పాడు. "అహోబిలమనే పర్వతం మీద మహారణ్యముంది. ఆ అడవిలో చాల కాలం తపస్సు చేస్తున్నాను. అప్పుడు ఒక కిరాతుడు వచ్చి 'ఎందుకు ఇలా తపస్సు చేస్తున్నా'వని అడిగాడు నన్ను. 'ఈ అడవిలో ఒక విచిత్రమృగ ముంది. ఎప్పటి నుండో వెదకుతున్నాను. ఇప్పటి దాకా కనిపించలేదు. అందు చేతనే ఎప్పుడయినా కనిపించకపోదా అనే నమ్మకంతో ఇక్కడే తపస్సు చేస్తున్నాను'. అప్పుడు కిరాతునికి నాపై జాలి కలిగి నా కోసం ఆ అడవి అంతా వెదకి ఆ మృగాన్ని లతలతో బంధించి నా యెదుట నిలబెట్టాడు. నీకెలా దొఱకింది అడిగే లోపలే నేను చూస్తున్నది సాక్షాత్తు శ్రీనరసింహస్వామినే అని తెలిసి సాష్టాంగవందనం చేశాను ఆ అపురూపమైన అవతారికి. అప్పుడు ఆ స్వామికి నమస్కరించి ఇలా అడిగాను: "పరమాత్మా! ఘోరమైన తపస్సు లాచరించే మహర్షులకు కూడ తమ దర్శన భాగ్యం దొరకదే! ఈ కిరాతునకు ఎలా వశమయ్యావో సెలవియ్యండి" అందుకు స్వామి మందహాసంతో "సనందనా! మునులు గాని, బ్రహ్మర్షులు గాని ఈ కిరాతుని వలె నా రూపమును నిశ్చలులై ధ్యానం చేసిన వారు లేరు. అందు చేత ఇతని నిర్మలచిత్తానికి మెచ్చి పట్టుబడ్డాను. ఇంక ఇతని గురించిన సంశయము వీడుము" అని చెప్పి అంతర్హితుడయ్యారు. పరమానందభరితులైన శిష్య గణం ఈ కథకు ఫలశ్రుతి చెప్పమని కోరగా పద్మపాదుడు చెప్పాడు: "ఈ నృసింహస్వామి కథ చదివినా, విన్నా, చెప్పినా, వ్రాసినా స్వామివారి

అనుగ్రహానికి పాత్రులగుతారు. అట్టివారికి అసాధ్యమైన రోగములు, బ్రహ్మరాక్షస, భూతప్రేత, పిశాచ, శాకినీ, ఢాకిన్యాది సర్వ దుష్ట గ్రహబాధలు, ప్రయోగాది బాధలు తొలగి, సుపుత్ర ప్రాప్తి పొంది, కోరికలు సిద్ధించును. భక్తి జ్ఞాన వైరాగ్యములు కలిగి ముక్తిని బడయుదురు.”

శంకరాచార్యులు శిష్యులతో కొన్ని దినములు శ్రీశైలములో గడపి పశ్చిమతీరాన గల గోకర్ణక్షేత్రమునకు బయలు దేరారు.

## 4.36 గోకర్ణక్షేత్రము

గోకర్ణం ఆకారంలో సముద్రుడు భూభాగంలోనికి చొచ్చుకు వచ్చినందు వలన ఈ క్షేత్రానికి ఈ నామం కలిగింది, ఆ పేరు శివుడే పెట్టాడంటారు. పంద్రెండు తేజోలింగములలోని దైన మహాబలేశ్వరలింగం ఇక్కడ ఉన్నది. ఈశ్వరుడు రావణాసురునికి ఇచ్చిన లింగములలోని భాగమే ఇది అంటారు. కాశీ క్షేత్రము కన్న ఈ క్షేత్రం చాలా ప్రసిద్ధమని అచ్చోట గల చిహ్నములను బట్టి యందురు. రావణ సంహారానంతరం శ్రీరాముడు ఈ క్షేత్రంలో కొన్ని నాళ్ళు ఇక్కడ ఉండి ఆత్మలింగాన్ని అర్చించినట్లు అందుచేత కొండ దరిని గల స్థలాన్ని ‘రామతీర్థము’ అని స్థలపురాణము. శ్రీశంకరాచార్యులు ఈ పవిత్ర క్షేత్రాన్ని సందర్శించి అందు వేంచేసి ఉన్న పార్వతీ పరమేశ్వరులను స్తుతించారు. తరువాత హరిహర దివ్యక్షేత్రానికి బయలుదేరారు.

## 4.37 హరిహర క్షేత్రము

ఈ క్షేత్రము చాల విశిష్టమైన పుణ్యస్థలం. ఒకప్పుడు ఈ ప్రాంతంలో వీరశైవమని ఒక తెగ, వీరవైష్ణవ మని మరొక తెగ – రెండు తెగల ‘భక్తులు’ పరస్పరం స్పర్ధలతో ఒకరి నొకరు ద్వేషిస్తూ, దూషించుకొంటూ మితిమీరిన వైరాలతో చెలరేగుతూ ఉండే వారు. ఒకరి పొడ ఒకరికి కిట్టేది కాదు. బొట్టూ, కట్టూ వేరు వేరు. దేవుళ్ళు వేరు. ఆచారాలు వేరు. ఆగమాలు వేరు. పద్ధతులు వేరు. పేళ్ళు వేరు. మా దేవుడు అధికుడు, మా దేవుడే

అధికుడు అని ఇరు తెగల వారూ తెగని తగని శత్రుత్వాలు పెంచి పోషించుకొనే వారు. ఇది చూచిన పరమాత్మ దయామయుడై శివుడు, విష్ణువు కలిసి ఉన్న రూపంలో ప్రత్యక్ష మయ్యాడు. ఈ విషయం వేదం లోనే ఉందని అజ్ఞప్రపంచాన్ని రక్షించడానికి వచ్చినదీ హరిహరనాథ రూపం. స్వామిని దర్శించుకొని అప్పుడు శంకరాచార్యుడు దశావతారస్తోత్రం చేశారు. మొదటిగా మత్స్యావతారాన్ని, తరువాత వరుసగా కూర్మావతారాన్ని, వరాహావతారాన్ని, నరసింహావతారాన్ని, వామనావతారాన్ని, పరశు రామావతారాన్ని, రామావతారాన్ని, బలరామ కృష్ణావతారాలను, బుద్ధావతారము, కల్క్యవతారమును స్తోత్రము చేశారు. ఈ విధంగా శంకరస్వామి శివకేశవుల అభేదత్వాన్ని నిరూపించినారు. అక్కడి నుండి ప్రయాణము మూకాంబికా క్షేత్రమునకు.

## 4.38 మూకాంబికా క్షేత్రము

ఏ క్షేత్రాన్ని దర్శించినా శంకరాచార్యులు మొదటగా ఆ క్షేత్రం లోని ఆలయం ప్రవేశించి తరువాత మిగతా విషయాలను చూచుకొనే వారు. ఆ ఆచారాన్ని వీడకుండా మూకాంబికా క్షేత్రం వచ్చాక తిన్నగా ఆలయం లోనికి వెడలుచుండగా వారి కొక విషాద దృశ్యం కనిపించింది. దేవాలయానికి ఎదురుగా చచ్చిన బిడ్డను ఒడిలో ఉంచుకొని తల్లిదండ్రులు రోదన చేయుచున్న దృశ్య మది. శంకరులు అది చూచి జాలినొందారు.

“వీరలను రక్షించుటకు ఎవడు సమర్థుడు కాడో వాడున్నూ ఏడ్చిన వాడగుచున్నాడు” అన్న ఆకాశవాణి వినిపించింది గట్టిగా. ఆ పలుకులు విన్న శంకరుడు అవి దేవి పలుకులుగా గుర్తించారు.

“పరమేశ్వరీ! దయామయీ! తమ దయయే ఈ లోకాన్ని పాలిస్తున్నది. ఆ దయయే లోకాన్ని రక్షిస్తోంది. కనుక ‘కటాక్షించు’ అని శంకరుడు ఆ దేవికి బదులుగా పలికాడు. వెంటనే ఆ బాల శిశువు బ్రతికి లేచి

కూర్చున్నాడు. తల్లిదండ్రుల ఆనందమునకు అవధి లేదు. ఆ దృశ్యం చూచిన వారందరూ చకితులై శంకరస్వామిని వేనోళ్ళ కొనియాడి నమస్కరించారు. సాక్షాత్తు శంకరుడే అని భావించారు. శంకరాచార్యుడు ఆలయ ప్రవేశము చేసి, మూకాంబికాదేవిని స్తుతించారు. "అమ్మా! నీ మహిమలు కొనియాడడానికి మాటలు చాలవు. నిన్ను నుతించినా, దర్శించినా, స్మరించినా మూగవాళ్ళు వాగ్ధారలతో వెలుగొందుతున్నారు. సృష్టి స్థితి లయములకు కారకురాలివి. జగదంబా! బ్రహ్మాది దేవతలు నిన్ను తెలిసికొనజాలరు. పరిపూర్ణంగా నిన్ను తెలిసికొన్నవారు జీవన్ముక్తులే గదా!" అని స్తోత్రం చేశారు. ఈ క్షేత్రంలో కొన్నాళులుండి తత్త్వప్రచారం చేస్తూ తరువాత బల్యాగ్రహారానికి బయలుదేరారు.

## 4.39 బల్యాగ్రహారము

రెండు వేల బ్రాహ్మణుల కుటుంబములు కలది బల్యాగ్రహారము. అందున్నవారికి సత్కర్మలు చేయుటే గాని దుష్కర్మల జోలికి ఎన్నడూ పోరు. అకుంఠితదైవభక్తితో, శ్రద్ధతో దీక్షతో ఎల్లపుడూ సత్కర్మాచరణల లోనే కాలం గడిపే వారు ఆ అగ్రహారవాసులు. యధావిధిగా ప్రతి యింట అగ్నిని ఆరాధించే వారే. ఎక్కడ చూచినా వేదఘోష. అట్టి పరమపవిత్రమైన ఆ అగ్రహారంలో మృత్యువు ప్రవేశించడానికి భయపడి చుట్టూ తిరిగి వెళ్ళిపోవలసిందే! ఆ విప్రులను దర్శించి శంకరులు వారికి తత్త్వబోధ గావించి వారిని సంతుష్టులను చేశారు.

## 4.40 శృంగగిరిలో శారదా పీఠము

ఇంక మధ్యలో ఎక్కడా ఆగక శంకరాచార్యస్వామి తిన్నగా శృంగ గిరి చేరుకొన్నారు. శృంగగిరి అతి విశిష్ట మైన చరిత్ర కలది. పూర్వము ఋశ్యశృంగుడు అనే మహర్షి తపస్సు చేసిన పావన భూమి అది. తుంగభద్రా నదీతీరాన ఉన్నది ఈ గిరి. ఇది పండితులకు తపోధనులకు నిత్యావాసము.

సర్వకాల సర్వావస్థల యందు వేదఘోష వినబడుతూనే ఉంటుంది. ఈ ప్రాంతమందున్న వారు యజ్ఞయాగాది క్రతువు లాచరించిన వారు. వైదిక కర్మనిరతులై శాంతము, దయ, శమము, దమము కలిగి కరుణాంత:కరణలతో అతిథి అభ్యాగతులను ఆదరిస్తూంటారు. వితరణబుద్ధిలో కల్పతరువు, కామధేనువును మించినవారు. దేవతలు కూడ అచ్చోట ప్రీతిగా వసింప నెంచేవారు. శృంగగిరి వాసులు విఘ్నాలు వచ్చి యెఱుగరు. ఇటువంటి మేటి సజ్జనులకు నివాసమైన శృంగగిరిలో శంకరాచార్యస్వామి ఎక్కువ కాలము గడుపుతూ ఆ పండితజనులకు ప్రస్థానత్రయభాష్యమును బోధిస్తూ ఉపనిషత్తుల సారాంశాన్నీ వేదాల సారాంశాన్ని పవిత్రులు, పాత్రులూ అయిన విద్వజ్జన సమాజాన్ని ఆకట్టుకొని అధ్యాపకు లయ్యారు. తృటికాలంలో ఆ కుశాగ్రబుద్ధులు శంకరునికి శిష్యులైపోయారు.

శంకరాచార్యులకు ఆ చోట శారదాపీఠంగా నెలకొల్పాలన్న సంకల్పము వచ్చి అనువయిన స్థలాన్ని ఎన్నుకొన్నారు. శుభముహూర్తాన శంకుస్థాపన గావించి ఆగమశాస్త్రరీత్యా అన్ని ఏర్పాట్లు చేసి ప్రవీణులయిన శిల్పులతో మనోహరమైన మఠనిర్మాణం చేయించారు. ఇంద్రాది దేవతలు సర్వదా పూజించే శారదాదేవిని అందు ప్రతిష్ఠించారు. వేదవిహితంగా సకలోపచారాలు శాశ్వతంగా జరిగే విధంగా అమలుపరచారు. శ్రీసురేశ్వరాచార్యులను ఆ పీఠమునకు అధిపతిగా నియమించారు. నేటికిని ఆ పీఠము అద్వితీయముగా అలరారుచున్నది. చతురామ్నాయ పీఠములలో మిన్నగా ప్రతిభ కెక్కి యున్నది.

## 4.41 తోటకాచార్యుడు

ఆనందగిరి అనే పేరు గల ఒక బ్రహ్మచారి శృంగగిరికి వచ్చి శ్రీశంకరాచార్యుల పాదపద్మములకు మ్రొక్కి క్రింది విధంగా ప్రార్థించాడు:

"మహాత్మా! ఏమియు తెలియని వాడిని. చదువుకొన్న వాడిని కాను. మీ శిష్యుడనై మీ సేవ చేసికోవాలని వచ్చాను. తాము ఎందరినో చదువు లేనివారిని జేర దీసి విద్వాంసులను చేశారని విని పేరాసతో వచ్చాను. నాకు మీ సేవాభాగ్యం ఇప్పించండి. మీ సేవలు చేసికుంటూ ధన్యుడి నగుతాను".

అతడి వైఖరి, మాట పొందిక శ్రీశంకరులకు నచ్చి ఆ బ్రహ్మచారిని శిష్యునిగా తీసుకొన్నారు.

ఆనందగిరి శాస్త్రాలు చదువక పోయినా, వేదాధ్యయనం చేయక పోయినా వేదాల్లో చెప్పినట్లే నడచుకొంటున్నాడు. వినయవిధేయతలతో, మృదు మధురమైన మితభాషణలతో చక్కగా గురుసేవ చేస్తున్నాడు. వేకువనే గురువులు లేవక ముందే లేచి తన కాలకృత్యములు, అనుష్ఠానములు ముగించుకొని సిద్ధంగా ఉంటాడు. గురువులకు ఆసనం అమర్చడం, కాలకృత్యాదులకు అన్నీ సిద్ధం చేయడం, తానే గురువులకు స్నానం చేయించడం, వారికి శుభ్రమైన కాషాయవస్త్రం ఇవ్వడం వంటివి అతని దినకృత్యాలు. గురువులు విడచిన కౌపీనము, శాఠీలను ఉతికి ఆరవేసి భద్రపరచడం ఇవన్నీ తానే ఆనందంగా శ్రద్ధగా చేసే చర్యలు. తిరిగి పాఠము వినే వేళకు తన కార్యక్రమాలు ముగించుకొని వస్తాడు. గురువులను నీడ వలె వెంటాడుతూ, పరుండినపుడు పాదములు ఒత్తుతాడు. ఈ విధంగా గురుసేవలో తనను తానే మరచి ఉండే వాడు.

ఒకనాడు గురువుల కౌపీనములు, శాఠీలు శుభ్రపరచుటకు తుంగాతీరానికి వెళ్ళాడు. పని పూర్తి కాలేదు. ఈ లోగా కూడా వచ్చిన సహశిష్యుడు ఆనందగిరిని తొందర చేశాడు పాఠానికి వేళ అవుతోందని. తన పని అయ్యే దాకా వేచి ఉండమని ఆనందగిరి కోరినా ఆ శిష్యుడు ఉండక విడచి వెళ్ళాడు. అక్కడ భాష్య పాఠాన్ని ఆరంభించడానికి శంకరుడు

శిష్యులు ఆసీనులై ఉన్నారు. గురువులు ఆనందగిరి లేకపోవడం చూచి అతని కోసం వేచి ఉందా మని పాఠం మొదలు పెట్టలేదు. “ఆనందగిరి తుంగభద్రానదికి శాఠీలు శుభ్రపరచడానికి వెళ్ళాడు. అతడు వచ్చుటకు ఆలస్య మగుతుంది” అని శిష్యులు గురువు గారిని పాఠం ప్రారంభించమని కోరారు. పద్మపాదుడు తన మాట గురువు మన్నించు నని ఎంచి “గురుదేవా! ఆనందగిరికి ఈ పాఠములు అత్యంత అవసరమా? ఈ గోడ ఎంతో అతడంత. మీకు తెలియని విషయమా!” అని విన్నవించాడు. వారి అందరి అజ్ఞానము, అహంకారము చూచిన శంకరాచార్యునకు వారికి కనువిప్పు కలిగించాలని నిశ్చయించారు. వారి అపార కరుణా సంపత్తితో ఆనందగిరిని ఆ క్షణంలో మార్చివేశారు. అతని లోని అంధకారము మటుమాయ మయ్యింది. పదునాలుగు విద్యలలో ఒక్క క్షణంలో నిష్ణాతు డయ్యాడు! తత్త్వవిచారము కరతలామలక మయింది. గురుదేవుని స్మరిస్తూ తొందరగా అడుగులు వేస్తూ ఆశ్రమం చేరుకొన్నాడు. వచ్చీ రాగానే ఈ శ్లోకాలు వినిపించాడు:

**“భగవన్ను దధౌ మృతి జన్మ జలే, సుఖదుఃఖ ఝషే పతితం వ్యథితమ్**
**కృపయా శరణాగత ముద్ధర మా, మనుశాధ్యుపసన్న మనన్యగతిమ్॥”**

**“వినివర్త్య రతిం విషయే విషయాం, పరిముచ్య శరీర విబద్ధ మతిమ్**
**పరామాత్మ పదే భవనిత్వరతో జహి, మోహమయాం భ్రమమాత్మ మతే॥”**

**“విసృజాన్న మయదిషుపంచసుతా, మహ మస్మి మమేతి మతిం సతతమ్**
**దృశిరూప మనంత మజం విగుణం, హృదయస్థ మవేహి సదాహ మితి॥”**

**“బలభేదకృతా బహుతేవ రవేర్ఘటికాదికృతా నభసోపి యథా**
**మతి భేద కృతా తు తథా బహుతా తవ బుద్ధి దృశో వికృతస్య సదా॥”**

**“దినకృత్ప్రభయా సదృశేన సదా జనచిత్తగతం సకలం స్వచితా**
**విదితం భవతావికృతేన సదాయత యేవ మతోసి సదేవ సదా॥”**

ఈ విధంగా పలికి గురువు సన్నిధానంలో నిలబడి తనకు తెలిసిన తత్త్వ రహస్యాన్ని నివేదించాడు. అది విని నిర్విణ్ణులయిన శిష్యగణం తాము ఎంత తక్కువ శ్రేణిలో ఉన్నారో అర్థం చేసి కొని గురుకరుణకు దీటు లేనిదని ఆనందగిరిని గౌరవాదరదృష్టితో చూశారు. తోటక వృత్తములతో వేద తత్త్వాన్ని అంత చక్కగా విశ్లేషించిన ఆనందగిరికి 'తోటకాచార్యుడు'గా నామకరణం చేశారు శంకరస్వామి! శ్రీ శంకరాచార్యుల శిష్యులు నలుగురు: పద్మపాదుడు, హస్తామలకుడు, సురేశ్వరాచార్యుడు, తోటకాచార్యుడు. ఒకరిని మించిన వారొకరు. శ్రీమహావిష్ణువు చతుర్భుజాలతో ధర్మార్థకామమోక్షములనే నాలుగు పురుషార్థాలను ధరిస్తాడంటారు. శ్రీశంకరాచార్యుడు నాలుగు వేదాలను నాలుగు భుజాలుగా ధరించాడు. నిష్కామకర్మయోగము, ధ్యానయోగము, భక్తియోగము, జ్ఞానయోగము అనునవి సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యము లనే నాల్గు మోక్షాలను ఇచ్చేవి. చతురాననునకు సనక, సనందన. సనత్కుమార, సనత్సుజాతులనే నలుగురు కుమారులు. శంకరులకు నాలుగు మహావాక్యాలను పాలించే నలుగురు శిష్యులు నాలుగు బాహువులుగా భాసిల్లారు.

## 4.42 'నైష్కర్మ్యసిద్ధి'

శృంగగిరిలో ఉండగా సురేశ్వరాచార్యుడు శంకరాచార్యస్వామి దగ్గఱకు చేరి పాదాభివందనము చేసి "స్వామీ! నాకొక ఉద్గ్రంథమును వ్రాయాలని కోరిక ఉన్నది. మీ ఆజ్ఞ సెలవియ్యండి" అని చెప్పాడు. శంకరుని హృదయము ద్రవించి తాను రచించిన సూత్రభాష్యములకు వార్తికములు వ్రాయమన్నాడు. దానితో సురేశ్వరాచార్యుని ఆనందానికి పట్టపగ్గములు లేవు. ఈ వార్త విన్న శిష్యులు ఆ నిర్ణయానికి సుముఖులుగా లేరు. సూత్రభాష్యాలకు వార్తికాలు వ్రాయడ మంటే మాటలా? అసలు ఆ భాష్యాలను అర్థం చేసికొనడమే అసాధ్యం. ఇక వార్తికాలు రచించగల సామర్థ్యము మాటలతో వస్తుందా? తమలో తాము చర్చించుకొని శంకరులను చేరి ఈ విధంగా

విన్నవించారు: “స్వామీ! సురేశ్వరాచార్యుడు నిన్న మొన్నటి వరకు కర్మలో మునిగి యుండి పరమాత్మతత్త్వాన్ని కాదన్నవాడు. వాదసమరంలో మీచే విజితుడై మార్గాంతరము లేక విధిగా సన్న్యాసస్వీకారము చేసినవాడు. పూర్వ వాసనలు ఊరక పోగలవా? మా అందరి అభిప్రాయము సురేశ్వరుని పాల బడిన అధ్యాత్మతత్త్వమునకు ముప్పే గాని మేలు జరగదని భావిస్తున్నాము. తరువాత మీ దయ” అని వినయంగా విన్నవించుకొన్నారు. శంకరులు ఆలోచనలో పడ్డారు. ఈలోగా హస్తామలకాచార్యుడు వచ్చి గురువులకు వందనము చేసి ఇట్లా చెప్పాడు:‘‘జగద్గురో! పద్మపాదుడు బ్రహ్మచర్యాశ్రమములో నుండి నేరుగా మీ దగ్గరకు వచ్చి శిష్యుడై వేదవేదాంగాలను క్షుణ్ణంగా ఆకళించుకొని సర్వమూ తెలిసిన వాడు. వార్తిక రచన అతని చేతిలో కడు సమర్థంగా జరుగగలదు. మీకు ఎఱుగనిది లేదు. ఒకవేళ అతడు కాదనుకుంటే తోటకాచార్యుడే ఇందుకు సర్వ సమర్థుడు” అని విన్నవించి వెళ్ళిపోయాడు. తరువాత వచ్చిన పద్మపాదుడు శంకరులను కలసి వందనము చేసి, వార్తిక రచనకు హస్తామలకుని పేరు సూచించి అతడు వ్రాస్తే ‘బంగారమునకు పరిమళం అబ్బినట్లుంటుంది’ అన్నాడు. శంకరాచార్యుడు ఆ మాట విని “పద్మపాదా! నీవన్నది నిజం. నీకు తెలుసును. అతడు బాహ్యప్రపంచంతో సంబంధం లేని వాడు. పుట్టిననాటి నుండి జడుడై యున్నపుడు అతని తండ్రి నా కడకు వచ్చి వానికి జ్ఞానభిక్ష ప్రసాదించ మని అర్థించాడు” అనగా పద్మపాదుడు “గురువర్యా! అంతటిలో అతనికి అంత జ్ఞానం ఎలా లభించింది? ఆశ్చర్యంగా ఉంది.” అని శంకరుని ప్రశ్నించాడు. అప్పుడు శంకరాచార్య స్వామి హస్తామలకుని పూర్వగాథ పద్మపాదునికి ఈ విధంగా తెలియజేశారు.

“ఒకప్పుడు యమునా నదీ తీరాన సిద్ధు డొకడు పరమాత్మతత్త్వమందే విహరించే వాడు ఉండగా రెండేండ్ల ప్రాయము కల తన కొడుకుని తీసికొని ఒకామె నదీతీరానికి వచ్చింది. చంకలో నున్న బిడ్డను సిద్ధుని దగ్గఱ ఉంచి

బిడ్డను చూస్తుండమని సిద్ధునికి చెప్పి నదిలోనికి స్నానానికి దిగింది. సిద్ధునకు ప్రాపంచిక స్పృహ లేదు కాబట్టి ఆమె మాటలు చెవికి వినబడ్డా సిద్ధుని మనస్సుకు అందలేదు. తప్పటడుగులు వేసుకొంటూ పిల్లవాడు మెలమెల్లగా నీటి లోనికి జారి మునిగిపోయాడు. ప్రాణాలు పోయిన తరువాత నీళ్ళపై తేలింది పిల్లవాని శవం. తల్లి స్నానం చేసి వచ్చేలోగా జరిగిపోయిన ఘోరం చూసి తల్లి లబో దిబో అని ఏడ్వడం మొదలు పెట్టింది. సిద్ధుని ముందు శవాన్ని ఉంచి ఎలాగైనా బ్రదికించమని దీనంగా వేడుకొంది. ఈ లోగా సిద్ధునికి తెలివి వచ్చింది. చూచి జాలి పడ్డాడు. కాని ఏమి చేయగలడు? చచ్చిన బిడ్డను బ్రదికించడం సాధ్యమైన పనియేనా! ఏమీ చేయలేక తల్లి దు:ఖం పోగొట్టుదామన్న సంకల్పంతో ఒక నిర్ణయానికి వచ్చాడు. యోగశక్తితో బాలుని మృతకళేబరంలో ప్రవేశించాడు. పిల్లవానికి ప్రాణం వచ్చి లేచి కూర్చున్నాడు. ఆ బాలుడే మన హస్తామలకుడు" అని చెప్పి మరల ఇలా అన్నారు శంకరులు: "అలాంటి వాడు హస్తామలకుడు. అతడికి లోకంతో పరిచయం పూర్తిగా మృగ్యమే! వార్తికాలు వ్రాయడానికి పనికి రాడే! పైగా మండనమిశ్రుడు సామాన్యపండితుడు కాడే! ఇక వేరొకడు కానరాడయ్యెనే!" అప్పుడు శిష్యులు శంకరునితో "స్వామీ! ఇది మహా కార్యము. మీరు తొందర పడకండి" అని వేడుకొన్నారు. సరే నన్నారు గురువు. ఆ తరువాత సురేశ్వరుని కలిసికొని శంకరుడు 'సూత్రభాష్యాన్ని వ్రాయడం మానుకో. దానికి బదులు నీ స్వతంత్రరచనగా ప్రపంచానికి పనికివచ్చే ఒక ఉద్గ్రంథాన్ని వ్రాయి' అని ఆదేశించారు. వార్తికరచనకు అవరోధం కలిగినా ఒక మహాగ్రంథాన్ని రచించమన్న గురుదేవుని ఆజ్ఞ శిరసావహించి ఆ పనికి ఉపక్రమించాడు సురేశ్వరుడు. అనతికాలంలో పూర్తి చేసి గురుదేవునికి చూపాడు. శంకరుడు ఆ రచనను ఆమూలాగ్రం పరిశీలించి మెచ్చి శిష్యులకు చూడమని ఇచ్చారు. ఆ గ్రంథం సామాన్యమైనది కాదని, ఆధ్యాత్మికతత్త్వాన్ని విపులీకరిస్తూ ముక్తిపథానికి యుక్తియుక్తముగా

చక్కని బాట వేసిన గ్రంథమని కొనియాడబడుచున్న ఆ గ్రంథమే 'నైష్కర్మ్యసిద్ధి' అన్న సార్థక నామంతో ఈ నాటికీ యతిలోకానికి శిరోధార్యమై ఉన్నది. ఈ గ్రంథం తరువాత సురేశ్వరాచార్యుడు తనకు సూత్రభాష్యాలకు వార్తికాలు రచించే అవకాశం దక్క నీయ లేదన్న కోపంతో 'ఎంతటివాడైనా బ్రహ్మసూత్రాలకు వార్తిక గ్రంథరచన చేసినచో అది నశించు గాక!' అని శపించాడు. తర్వాతి కాలంలో శంకరుని ఆదేశానుసారవే బృహదారణ్యకోపనిషత్తుకు, తైత్తిరీయోపనిషత్తుకు శంకరులు వ్రాసిన భాష్యాలకు వార్తికాలు వ్రాశాడు.

పద్మపాదుడు సూత్రభాష్య టీకా గ్రంథాన్ని వ్రాసి శంకరాచార్యులకు సమర్పించాడు. మొదటి భాగానికి 'పంచపాదిక' అని, రెండవ భాగానికి 'వృత్తము' అని పేరు పెట్టాడు. పంచపాదికను ఆమూలాగ్రం గురువుకు చదివి వినిపించాడు. ఈ భాగానికి చిరతరకీర్తి కలుగుతుందని శంకరుడు అనుగ్రహించారు. దానితో ఆ విధంగా సురేశ్వరుని శాపం పరిహరింపబడింది. శంకరుడు హస్తామలకాచార్యుని పిలిచి అతనిని కూడా అద్వైతప్రచారమునకు అనువైన గ్రంథాలను వ్రాయమని ప్రోత్సహించారు. ఒకనాడు సురేశ్వరుని పిలిచి "సురేశ్వరా! నీవు మరల ఈ లోకంలో 'వాచస్పతి' అనే పేర జన్మించి భామతీవ్యాఖ్యానము అను పేర సూత్రభాష్యమునకు వార్తిక గ్రంథమును వ్రాస్తావు. అది వేదాంతులకు చాలా ఆదరణీయ మవుతుంది".

## 4.43 ఆర్యాంబ అవసానదశ

శ్రీశంకరుని తల్లికి వృద్ధాప్యం వచ్చింది. శరీరపాటవం తప్పుకొన్నది. నిత్యకృత్యములు స్వయంగా చేసుకోలేకపోతోంది. జ్ఞాతులు ఆమెను ఎంతో భక్తితో చూచుకొంటున్నారు. వేళకు తప్పకుండా స్నానం చేయించి మంచి బట్ట కట్టి భోజనం తినిపిస్తున్నారు. పుణ్యకథలు వినిపిస్తున్నారు. మలమూత్ర

విసర్జనలు మంచం దగ్గరే జరుగుచున్నవి. తన స్థితి తెలిసికొని ఇక ఎక్కువ రోజులు జీవించ నని ఒకనాడు మనస్సులో తలచుకొంది తనయుడు ఇచ్చిన మాట. 'నన్ను తలచిన మరు క్షణం నీ దగ్గర ఉంటా నమ్మా! అని శంకరుడు చెప్పిన సంగతి. నాకు ఏ కొరతా లేకుండా అన్నీ అమరుస్తున్నారు నాయనా! నీ చేతులలో వెళ్ళిపోవా లన్న కోరిక తప్ప నాకే కోరికా లేదు' ఇలా మంచం మీదనే ఉండి చీకటి పడిన తరువాత తలపోసింది. అదే తలపుతో ఆ రాత్రి చాలా సేపు నిద్ర పట్టక తెల్లవారు ఝామున కునుకు పట్టింది. ఆ రాత్రి శృంగగిరి లోనున్న శంకరాచార్యునికి నిద్ర రాలేదు. కోడి కూసిన సమయంలో తల్లికి ఇచ్చిన మాట స్ఫ్రుహకు వచ్చింది. తన తల్లికి అవసాన సమయం వచ్చిందని గ్రహించాడు. ఆలస్యం చేయకూడ దనుకొన్నాడు. ఒక్కసారిగా యోగశక్తితో వాయుమార్గాన వచ్చి తల్లి పాదాల దగ్గర వాలాడు. కళ్ళు తెరచి చూడగానే కనిపించిన శంకరుని చేరదీసికొని ఆ మాత కౌగలించుకొన్నది. "అమ్మా! నీ కోరిక ప్రకారం నేను వచ్చాను. నీకు కావలసిన వన్నీ తీరుస్తాను. బెంగ వలదు" అని తల్లికి ధైర్యం చెప్పాడు శంకరుడు. అతని మాటలలోని ఆంతర్యం ఎరిగిన ఆర్యాంబ " నాయనా! ఎన్నాళ్ళకు నిన్ను చూస్తున్నాను! నిన్ను చూడా లన్నదే నా కోరిక. తండ్రీ! ఈ శరీరం పని చేయడం లేదు. శక్తి ఉడిగింది. లేవలేకున్నాను. ఈ కాయం ఎన్నాళ్ళు మన్నుతుంది? ఇంక విడిచి వేయాలి. నీ చేతులతో దీనిని బూడిద చేయి. జ్ఞానబోధ చేసి అందర్నీతరింప జేస్తున్నా వట. నాకు కూడ పుణ్యలోకాలకు పోవాలని ఉన్నది. ఆ భాగ్యం నీ వల్లనే చేకూరుతుంది" అని పలికింది ఆర్యాంబ.

శంకరుడు సంగాన్ని వీడినా సత్యాన్ని వీడ లేదు. లోకంలోని వారందరినీ తల్లులుగా భావించిన శంకరుడు ఆర్యాంబను జగన్మాతగా భావించాడు. తన తల్లికి పునరావృత్తి రహితమైన పరమపద సిద్ధి కలిగించడం తన ధర్మం. అప్పుడు పరాత్పరుని గూర్చి ధ్యానం చేశారు. అపుడు పరమేశ్వరుడు

సపరివారుడై వచ్చాడు ఆమెను తీసికొనే సంకల్పంతో. అప్పుడు ఆర్యాంబ "నాయనా! వీళ్ళు మరోలా ఉన్నారు. నాకు విష్ణులోకానికి వెళ్ళాలని ఉంది" అని కోరుతుంది. వెంటనే శంకరుడు శ్రీకృష్ణుని మదిలో నిల్పుకొని ప్రార్థించాడు ఆర్యాంబకు అప్పుడు లభించింది శ్రీ మహావిష్ణుదర్శనం. చతుర్భుజుడై శంఖ చక్ర గదా శార్ఙ ఖడ్గ ధారియై వైజయంతీమాల కంఠాన మెఱయగా శేషతల్పుడై మహాలక్ష్మీసహితుడైన శ్రీహరి! పార్శ్వముల నుండి భూదేవి, నీలాదేవి వింజామరలు వీస్తున్నారు. ఆర్యాంబ తన అభీష్టసిద్ధిగా వైకుంఠవాసురాలైంది. జగజ్జననికి చేసిన వాగ్దానములో మిగిలినది దహన సంస్కారము. "శంకరా! నీవు యతివి. నీకు కర్మ చేయ నర్హత లేదు. కావలసిన వారము మేము ఉన్నాము కదా! విధ్యుక్తంగా మేమే ఆ కార్యం నిర్వహిస్తాము. నీవు తొలగు " అని జ్ఞాతులు, బంధువులు నివారించ ప్రయత్నించారు. వారికి సమాధానంగా "నారాయణ స్వరూపులారా! సన్న్యసించుటకు ముందే నేను ఈమెకు వాగ్దానము చేసి యున్నాను. అది నా ధర్మము. పైగా ఈ జగన్మాత కోరిక కూడా. లేకున్నచో జరిగే ధర్మ అతిక్రమణమే నివారింపదగినది. నన్ను నమ్మి ఈ నా విధి నిర్వహణధర్మానికి తోడవ్వండి" అని వారందరికీ నచ్చజెప్పాడు. కాలడి లోని ఇంటి వెనుక దొడ్డి భాగములో చితి పేర్చి, దానిపై తల్లి భౌతిక కాయాన్ని అమర్చి, తల్లి కుడి భుజమును మథించాడు. అందు నుండి అగ్ని పుట్టు కొచ్చినది. యథావిధిగా అగ్ని సంస్కారము పూర్తి అయింది. కాలడి వాసులు మొదటిలో వైరుధ్యం చూపినా తరువాత నేటికీ ఈ పద్ధతినే పాటిస్తున్నారు.

## 4.44 పద్మపాదుని తీర్థయాత్రలు

పద్మపాదాచార్యునికి శృంగగిరిలో ఉండగా తీర్థయాత్రలు చేయాలనే అభిలాష కలిగింది. శ్రీశంకరాచార్యుని అనుమతి కోసం వారిని అడిగాడు. శంకరుడు యాత్రలో అనుసరించ వలసిన పద్ధతులు, జాగ్రతలు వివరంగా బోధించారు పద్మపాదునికి. ఉత్తర దిశగా పయనిస్తూ మధ్య మధ్య గల

పుణ్యతీర్థములలో గ్రుంకు లిడుతూ దేవుళ్ళను, మహాత్ములనూ దర్శించు కొంటూ సాగుతోంది పద్మపాదుడు, కూడా వచ్చిన సహశిష్యుల ప్రయాణం.

శ్రీకాళహస్తికి చేరుకొన్నారు. శ్రీ (సాలె పురుగు), కాళ (పాము), హస్తి (ఏనుగు) ఈశ్వరుని అర్చించి ముక్తిని పడసిన మహాక్షేత్ర మది. పంచమహాభూతములు, పంచలింగములుగా మారినవి. జలలింగము జంబుకేశ్వరములోను, అగ్నిలింగము అరుణాచలము లోను, ఆకాశలింగము చిదంబరమున, వాయులింగము శ్రీకాళహస్తిలోను, పృథివీలింగము కంచి లోను వెలసి యున్నవి. ఈ క్షేత్రంలో అగస్త్యముని తపస్సు చేయగా బ్రహ్మ మెచ్చి, స్నాన పాన యోగ్య మైన సువర్ణముఖరీ నదిని ప్రసాదించి రని ప్రతీతి. ఆ నది నగరం ప్రక్కగా ప్రవహిస్తుంది. గర్భగుడిలోనికి గాలి చొరదు. మూలవిరాట్టుకు పైభాగమున ఒక జ్యోతి వెలిగించబడి ఉంటుంది. అది సదా కదలుతోనే ఉంటుంది. అది వాయులింగ మనుటకు చిహ్నాము. అచ్చట ఈశ్వరునికి, జ్ఞానప్రసూనాంబకు మ్రొక్కి కాంచీ క్షేత్ర దర్శనానికి బయలుదేరారు. పృథివీలింగము వెలసిన పుణ్యక్షేత్రము కంచి. ఇందున్న ఈశ్వరుని ఆమ్రాధీశ్వరుడని, ఏకాంబరేశ్వరుడని పిలుస్తారు. మామిడి చెట్టు క్రింద వెలసిన లింగం కావున ఆమ్రాధీశ్వరుడను పేరు వచ్చింది. ఆ చెట్టు నీడనే పార్వతీదేవి తపస్సు చేసిందట. అమ్మవారిని కామాక్షి అంటారు. ఈ చోట నూట ఎనిమిది శివక్షేత్రములు, పదునెనిమిది విష్ణుక్షేత్రములు కలవట. కామాక్షి అమ్మవారికి మూడు కన్నులుండుటచే త్రినేత్రిణి అని పిలుస్తారు. మధ్య కన్ను అగ్ని, మిగిలిన రెండు కళ్ళూ సూర్యచంద్రులు.

కంచి నుండి బయలుదేరి పుండరీకక్షేత్రము వెళ్ళారు. శివుడు నాట్యమాడుతున్నపుడు జటా జూటము విరగగా అందుండి గంగ హద్దు మీరి క్రింద పడిం దని దానిని 'శివగంగ' అంటారు. పద్మపాదుడు ఆ పవిత్రమైన శివగంగలో స్నానం చేసి నటరాజస్వామిని దర్శించుకొన్నాడు. తరువాతి క్షేత్రము కావేరీ తీరమున గల శ్రీరంగము. శ్రీరంగనాథస్వామిని

దర్శించుకొని వెళ్ళుతుండగా దారిలో వారికి పద్మపాదుని మేనమామ ఉన్న ఊరు తగిలింది. పద్మపాదుడు వస్తున్నాడని మేనమామ బంధుమిత్రులతో సహా అమితానందభరితుడై చూడవచ్చెను. చాల కాల మయింది పద్మపాదుని చూచి వారు చాలా సంతోషంతో "యతి వర్యా! మిమ్ములను ఇంతకాలానికి చూడగలిగాము. మీరు సన్న్యాసము స్వీకరించారని మాకు తెలిసింది. మీ ఆశ్రమమే గొప్పది. మీరు సదా విరాగులై దైవచింతనతో ఇహదు:ఖాలకు దూరంగా స్వేచ్ఛగా ఉంటారు. మేము ఆలుబిడ్డల పోషణతో ఈ జంఝాటంలో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటాము. మా పాపముల నుండి కాపాడి మాకు జ్ఞానము ప్రసాదించ గల దిట్టలు మీరు. మమ్మ్మ కరుణించండి. మాకు జ్ఞానం ప్రసాదించండి" అని వేడుకొన్నారు.

## 4.45 టీకాగ్రంథము

మేనమామ పద్మపాదుని తన ఇంటికి భిక్ష ఇవ్వడానికి తీసికొని వెళ్ళాడు. శిష్యులతో సహా భిక్ష ముగించుకొన్న తర్వాత మేనమామ పద్మపాదుని వద్ద నున్న గ్రంథాన్ని చూచి అది యేమి గ్రంథమని అడిగాడు. పద్మపాదుని మేనమామ మహావిద్వాంసుడు. కర్మిష్ఠి. మీమాంసామతస్థుడు. ఆ పుస్తకాన్ని చూడగానే అది చాలా ప్రభావవంతమైన అద్వైత తత్త్వ ప్రతిపాదక మని గ్రహించాడు. అది శ్రీశంకరాచార్యులు వ్రాసిన భాష్యమునకు పద్మపాదుడు వ్రాసిన టీకాగ్రంథము. మేనమామకు అప్పుడు ఒక దుర్బుద్ధి పుట్టినది. ఈ గ్రంథము వ్యాప్తి చెందితే తమ మతానికి తీరని దెబ్బ తగులుతుంది. దీనిని వెలుగు లోనికి రానీయకుండా అంతం చేయాలి. లేని సంతోషము ఉత్సాహము తెచ్చుకొని తానా గ్రంథం చదవాలని ఆసక్తిగా ఉందని తనకు ఇవ్వమని అడిగాడు మేనమామ. సరే నని సేతుయాత్ర ముగించుకొని వచ్చేవరకు భద్రంగా కాపాడమనీ మరీ మరీ మేనమామను హెచ్చరించి వెళ్ళాడు పద్మపాదుడు. పద్మపాదుడు అక్కడినుండి సేతుక్షేత్రం దర్శించడానికి బయలుదేరాడు. లంకాపట్టణాన్ని ముట్టడించి రావణ సంహార నిమిత్తమై

శ్రీరామచంద్రుడు వారిధిపై వారధి నిర్మించిన పుణ్యభూమి అది. సేతు నిర్మాణం అయ్యాక వానరసేనతో లంకపై దండెత్తి వెళ్ళిన స్థల మది. అచ్చట రామలింగేశ్వరాలయము, దర్భశయనం చూడవలసినవి. సముద్రాన్ని ఎట్లు దాటాలని ఆలోచన చేసిన చోటది. శ్రీరాముడు దర్భలపై శయనించిన చోటు. తిరిగి వెనుకకు ప్రయాణ మయ్యాడు పద్మపాదుడు శిష్యులతో కూడి. తన మేనమామ ఊరు చేరుకొన్నాడు. అనుకొన్న కుట్ర ప్రకారం ఆ గ్రంథాన్ని దగ్ధం చేసేశాడు. అనుమానం రాకుండా ఆ గ్రంథం ఉంచిన ఇల్లును కూడా గ్రంథంతోబాటు దగ్ధం చేశాడు. ఎంతో శ్రమపడి వ్రాసిన గ్రంథమది. దానికి చింతించడం గతజలసేతుబంధనం కదా మరల వ్రాయవచ్చు ననుకొన్నాడు. కపట భావాలతో గ్రంథం కాలిపోయినందుకు విచారం నటిస్తున్న మేనమామతో ఇలా అన్నాడు: “నారాయణా! చింతించకు. నీవేమి చేయగలవు? దైవవిధి అలా ఉంది. మరల వ్రాసుకొందునులే” అని ఊరుకో బెట్టాడు. మళ్ళీ గ్రంథాన్ని యధా తథంగా వ్రాయడం మొదలు పెట్టాడు. అది చూచిన మేనమామ అచ్చెరువంది మరింత క్రూరంగా ఆలోచించాడు. ఇంటికి భిక్షకు పిలిచి మందులు కలిపిన భోజనం పెట్టాడు. ఆ భిక్ష తర్వాత పద్మపాదుని మేధ దెబ్బ తిన్నది. గ్రంథరచన ఆగిపోయింది.

## 4.46 పద్మపాదుడు గురువు కడకు రాక

శ్రీశంకరాచార్యుడు కేరళదేశములో ఉన్నాడని తెలిసిన పద్మపాదుడు హుటాహుటిని వారి కడకు శిష్యసమేతంగా చేరాడు. శంకరాచార్యుడు కూడ తన ప్రియశిష్యుని రాకకు ఎదురు చూస్తున్న వారు పద్మపాదుని చూడగానే ఆనందపడ్డారు. యాత్రావిశేషాలు గురువు గారికి విన్నవించాడు: ‘‘గురుదేవా! వివిధమైన పుణ్యతీర్థాలలో స్నానమాడి, ఆయా పవిత్రక్షేత్రములలోని దేవతామూర్తులను దర్శించి పులకితుడ నైనాను. మీ కరుణాకటాక్షములే నన్ను ఈ యాత్రలను ఎంతో సఫలీకృతం చేశాయి. ఎందరో ద్వైతవాదులతోను, వైష్ణవ శైవ తీవ్ర మతస్థులతోను తలపడ వలసిన

సమయాలలో మీ శుభాశీస్సులే నన్ను సరియైన దారిలో నడిపించాయి. నాపై మీకు గల అపారదయతో నాకు ముమ్మారు సూత్రభాష్యం పాఠం చెప్పారు. ఆ భాష్యపాఠాలే నాకు పరమతవాదుల తోడి చర్చా యుద్ధాలలో శార్ఙ్గకోదండము వలె ఉపయుక్తమైంది. కాణాదులతోను, వైశేషిక దార్శనికులతోను బాహాబాహీ పోరు తటస్థించింది. కాపిలులతో కలియబడవలసి వచ్చింది. ఇక సాంఖ్యులు ప్రశ్నపరంపరలు కురిపించారు. ఆ విధమైన చతుర్ముఖబంధనం నిర్మించినా, మీ కరుణతో ప్రస్థానత్రయమనే వజ్రాయుధంతో నిర్భయంగా పోరు సలిపి జయశ్రీని చేపట్టితిని. ఇది యంతయు మీ సేవా ఫలము. మీ దివ్యానుగ్రహము. ఈ విజయ పరంపర అంతయు మీదే. ఇదే మీకు వినమ్రుడనై మీకు పాదాక్రాంతుడనై అర్పిస్తున్నాను" అని విన్నవించాడు పద్మపాదుడు. మరల మాట్లాడుతూ "దారిలో నా మేనమామ ఊరు చేరినపుడు వానితోను, ఆ పురవాసులతోను సంభాషించాను. మా మేనమామ కర్మమార్గ గామి. ప్రసిద్ధుడైన ప్రభాకరుని శిష్యుడు. అతనిని కూడ ఒప్పించి అద్వైతమతస్థుణ్ణి చేశాననిపించింది. దురదృష్టవశమున నేను తమ దయతో వ్రాసిన టీకాగ్రంథము వాని ఇంటితో బాటు దగ్ధమైపోయింది. తరువాత అతని వైఖరి మాటలను బట్టి నాకు అనుమానము కలిగింది. గ్రంథం దగ్ధం అవ్వడం అతడు కావాలని చేసిన దుశ్చర్యయే అని తట్టింది. తరువాత ఆతడు నాకు ఇచ్చిన భిక్ష తీసికొనిన వెంటనే నాకు జడత్వము కలిగి రచనకు భంగ మేర్పడింది. నా లోప మేమైనా చేసిన పాపమో దీనికి హేతువు కావచ్చు. అవతారమూర్తీ! శరణు!" అని గురువులకు జరిగిన ఉదంతాన్ని నివేదించాడు.

శ్రీపద్మపాదాచార్యులు చెప్పినది విన్న శ్రీశంకరస్వామి అతనితో ఈ విధంగా పలికారు: "పద్మపాదా! దైవవిధి దాట నెవ్వరి తరము? అందు వలననే కర్మలు జాగ్రత్తతో ఆచరించమన్నారు. వానియం దెట్టి లోపమున్నను తత్ఫలితము అనుభవించక తప్పదు. ఇదంతయు మనస్సులో నిడుకొనియే

సురేశ్వరుని అందుకు నియమించితిని. ఎవరి కర్మ ఎవరి కెఱుక? బుద్ధిమంతుడు కడచిన కష్టపరిస్థితికి వగవడు. నీవు దిగులు పడకు. ఇదివరలో నాకు ఐదు పాదాలు చదివి వినిపించావు. జ్ఞాపకమున్నది. నేను చెబుతా వ్రాసుకో!" అని స్వామి అద్భుత మేధాశక్తితో ఉన్నది ఉన్నట్లుగా ఒక్క అక్షరం విడువకుండా టీకాగ్రంథము లోని పంచపాదుకలను తిరిగి వ్రాయించారు.

## 4.47 కేరళ రాజు

శంకరుడు పూర్వాశ్రమంలో పిన్న వయస్సులో ఉండగా కేరళదేశపు రాజు స్వామిని దర్శించుటకు వచ్చాడు. ఆ తరుణంలో శంకరునికి రాజు తాను వ్రాసిన మూడు నాటకములను చదివి వినిపించాడు. ఈ విషయం మనం మొదట్లో ముచ్చటించుకొన్నదే. రాజు రచించిన నాటకాలు శంకరునకు నచ్చాయి. ఆ నాటకాలు కారణాంతరముల వల్ల దగ్ధమై పోయాయి. శ్రీ పద్మపాదుని దగ్ధమైపోయిన గ్రంథాన్ని స్వామి తిరిగి తన జ్ఞాపకశక్తితో వ్రాయించారన్న వార్త విని కేరళ రాజు కూడ ఆశతో స్వామిని దర్శించాడు. రాజశేఖరుడు వందనములు అర్పించి నిలబడి యుండెను. శంకరుడు కుశలప్రశ్నలు తర్వాత 'నీ నాటకములు బాగా ప్రచారములో ఉన్నవా?' అని రాజును అడిగారు. రాజశేఖరుడు ఖిన్నుడై అంజలి ఘటించి, "స్వామీ! దైవవిధి అటులున్నది కాబోలు. అగ్నిలో బడి నా నాటకములు కాలిపోయాయి. తమ అనుగ్రహం ఉంటే తిరిగి అవి దక్కునేమో!" అని ప్రార్థించాడు.

ఒకసారి ఎన్ని ఏండ్ల పూర్వమో విన్న ఆ రాజు రచించిన మూడు నాటకాలను తన అపూర్వమైన జ్ఞాపకబలంతో జ్ఞప్తికి తెచ్చుకొని రాజుతో తిరిగి వ్రాయించారు. అచ్చెరువుతో శంకరులకు వందనములు అర్పించి 'తమ దాసుణ్ణి నన్ను శాసించండి' అని వేడుకొన్నాడు రాజశేఖరుడు. జనానురంజకంగా ధర్మపాలన చేయమని రాజుకు చెప్పారు యతీంద్రులు.

## 4.48 మధ్యార్జునేశ్వరము

శ్రీ ఆచార్యస్వామి కేరళదేశములో ఉన్నారు. దక్షిణదేశమందున్న కార్యక్రమం వెనుకబడి యున్నది. ఎంతో మంది శిష్యులు చేరుకున్నారు. పద్మపాదుడు హస్తామలకుడు, తోటకాచార్యుడు కాక శాస్త్రనిష్ణాతులైన వారెందరో శిష్యులయ్యారు. వారిలో చిద్విలాసుడు, బుద్ధివృద్ధుడు, భానుమరీచి, విరించిపాదుడు, విష్ణుగుప్తుడు, శుద్ధకీర్తుడు, శుద్ధానందుడు, నమిత్రానుడు మున్నగు వారున్నారు. సుధన్వమహారాజు పరివారం వెంటబెట్టుకొని యున్నాడు. రామేశ్వరయాత్రకై బయలువెడలి మార్గమధ్యమందున్న మధ్యాక్షరమనే శివక్షేత్రము చేరుకున్నారు. ఈ క్షేత్రము మహామహిమతో గొప్ప పుణ్యస్థలమై విరాజిల్లుతోంది. అచ్చోట గల స్వామి వారిని దర్శించిన మాత్రాన సమస్తవిద్యలు లభించును. సమస్త పాపములు హరించును. అన్ని కోరికలు నెరవేరును. అట్టి మహేశ్వరుని శ్రీశంకరులు దర్శించుకొన్నారు. అక్కడి భక్తులందరూ ద్వైతమతావలంబులు. ద్వైతమే సరియైన తత్త్వమని గట్టిగా నమ్మిన వారు. అద్వైతమతవ్యాప్తి వారికి సుతరామూ కిట్టదు. అందుచే మంచి పట్టుదలతో ఉన్నారు ఈ శంకరుని వాదాన్ని పూర్తిగా త్రోసిపుచ్చి తమ భావాన్నే స్థిరంగా నిలబెట్టాలన్న గట్టి పట్టుదలతో ఉన్నారు అక్కడి పండితులు. శ్రీశంకరాచార్యస్వామి రాగానే వారితో తీవ్రమైన వాదాలకు దిగారు. శ్రీశంకరాచార్యస్వామి ఆ వాద ప్రక్రియను క్రమబద్ధం చేసి క్రమంగా వారి సందేహాలకు అన్నిటికి తగిన సమాధానాలు ఇచ్చి, వారు లేవదీసిన అభ్యంతరాలను త్రోసిపుచ్చి, సప్రమాణంగా, సహేతుకంగా, నిర్ద్వంద్వంగా అద్వైత తత్త్వ పరమార్థాన్ని నచ్చ జెప్పారు. దానితో సరిపుచ్చక ప్రత్యక్ష ప్రమాణము కన్న మిన్న లేదన్న భావంతో స్థానిక దేవతామూర్తి దిక్కు మొగమై, ఇలా అర్థించారు:

“పరమేశ్వరా! జ్ఞానస్వరూపా! జ్ఞానదాతా! ఈ వచ్చిన విద్వన్ముఖ్యులు ఇంకా సంశయాత్ములై ఉన్నారు. ద్వైతమో అద్వైతమో ఏది నిజమో

పోల్చుకోలేక. ఏది సత్యమో భగవన్వాక్కుగా వినాలని ఉంది. అనుగ్రహించు తండ్రీ!" .వెను వెంటనే ఆ దేవాలయములో నున్న లింగముపై ఒక దివ్యకాంతి పుంజము ఉద్భవించి, అందున్న పరమేశ్వరుడు చిద్విలాసవదనుడై. కుడి చేయి పైకెత్తి "అద్వైతమే సత్యము! అద్వైతమే సత్యము! అద్వైతమే సత్యము!": ముమ్మారు గర్జించి అదృశ్యుడయ్యాడు. కని విని ఎఱుగని ఆ అనుభూతి వారందరిని విభ్రాంతుల్ని చేసింది. శంకరాచార్యునికి జోహారు లర్పించి వారి అనుగ్రహం కోరారు. శిష్యగణంతో శ్రీశంకరాచార్యులు బయలుదేరి కొన్ని రోజులకు రామేశ్వరం చేరుకొన్నారు.

**ఇది శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక శేఖర ముముక్షు జన నిధాన**
**శ్రీదేవకీనందన స్వామి కరుణావిశేష లబ్ధ విజ్ఞాన వితాన**
**యల్లాప్రగడ వెంకటసూర్యనారాయణమూర్త్యభిధాన విరచిత**
**శంకరావతారచరితము నందు విజయకాండ సమాప్తము**

# 5. ఉద్ధార కాండ

## 5.1 రామేశ్వరములో శాక్తేయులు

శక్తి నుపాసించు వారిని శాక్తేయులందురు. వీరిలో వామాచారులని ఒక తెగయున్నది. వారి ఉపాసనలో మద్యము, మాంసము, ముద్ర, మైధునము అను మకారపంచకము నుపయోగిస్తారు. శాక్తేయులలో కొందరు వామాచారులు కాని వారున్నారు. లక్ష్మీ ఉపాసకులు, సరస్వతీ ఉపాసకులు, భవానీ ఉపాసకులు, సారస్వతులు అను పలు తెరంగులుగా నున్నారు శాక్తేయులు. వీరందరూవారి ఇష్టదేవిని పరాశక్తిగా భావించెదరు. రామేశ్వరప్రాంతమందు శాక్తేయులు కొల్లలుగా నుండిరి. వారందరు శ్రీశంకరాచార్యులు వచ్చారన్న వార్త విని ఒక చోట సమావేశమైనారు. ఆ సమావేశమందు.'శంకరాచార్యులు, ఎన్నెన్నిమతాలనో కాదనుచున్నారట! ప్రతీ మతమందును తప్పులున్నాయని పలుకుచున్నారట! మన మతాన్ని కూడ నిర్మూలనం చేయా లనిన సంకల్పంతోనే మన తావుకు వచ్చారట! ఆయన మతమే గొప్పదట! ఆతడు మన మతాన్ని జయించడంకాదు, మనమే ఆయన కడ కేగి జయించాలి. లేనిచో అడవిలో కాచిన వెన్నెల వలె మన మతం నిరర్ధకం కాగలదు. మనలో మనకున్న మనస్పర్ధలు కట్టిపెట్టి శత్రువును జయించడంలో ఐకమత్యం వహించాలి. ఆయన కూడ సరస్వతిని ఆరాధించేవాడట. కనుక యతికి అన్యమార్గం లేదు. చూడగా మన మతమును కాదన జాలడు.' అని తీర్మానించుకొన్నారు.

అంతట శాక్తేయులు ధీమాతో బయలుదేరి రామేశ్వరములో శ్రీశంకరాచార్యులను దర్శించి సాష్టాంగ వందనాలర్పించారు. శంకరాచార్యస్వామి నారాయణ స్మరణలు పలికి కుశలప్రశ్నలు వేశారు. అంతట వారలలో నొకడు లేచి,

'యతివర్యా! లోకంలో బహుమతాలను మీరు కాదనుచున్నారట. మా కందులకు సంతోషమైంది. అట్టిది మా మతమేకాదు. ప్రతీవారు ఆచరించి

గౌరవించ తగ్గ మా మత మందు మోక్షోపాయ మున్నది.'అని విన్నివించిన తరువాత,

'స్వామీ! సకలభూతములకు తల్లియనునది గలదు. ఆ తల్లిని ఆదిశక్తి యందురు. ఆమె పరమేశ్వరుని కంటె అతీతమైనది లోకాలన్నీ ఆదిశక్తి వల్లనే ఉత్పన్న మగుచున్నవి. ఆమె శక్తిని వర్ణించ ఎవరి తరము గాదు. సర్వాధారభూతురాలై అందరి చేతను పూజింప తగి యున్నది. అట్టి పరాశక్తి అంశనే భవానీదేవి యందురు. భవానీ సేవాతత్పరులమై ఆమె అనుగ్రహానికి పాత్రులమై బంగారంతో చేయబడిన ఆమె పాద చిహ్నాలను కంఠమున, భుజముల యందు ధరించుచున్నాము. ఆమెను ఉపాసించిన వారు జీవన్ముక్తు లగుచున్నారు.' అని మరి యొక శాక్తేయుడు శ్రీశంకరులకు వివరించాడు. అంతలో వేరొకడు లేచి.

'పరాత్పరా! విద్య–అవిద్య ఈ రెండును తెలిసిన వాడే జ్ఞాని. అట్టి వాడు మరణము నొందక మోక్షమునే బడయుచున్నాడు. ఆదిశక్తి యొక్క కటాక్షంతో ముక్తి కలుగుచున్నది. కోరిన వారికి ఆమె మోక్షము నిచ్చును. ఓంకారము నుండి అకార, మకార, ఉకారము లుద్భవించినట్లే లక్ష్మి, భవానీ, సరస్వతులు ముప్పురు ఆదిశక్తి నుండి ఉద్భవించారు. ప్రకృతి, పురుషుడు వేరు గారు. వారిరువురు ఒక్కటే. సదేవ సౌమ్యాది వేద వాక్యాలు ఇందుకు ప్రమాణములే కదా! ఈ సకల చరాచర ప్రపంచమునకు సర్వదేవతలకు ప్రభువైన పరాత్పరునకు పరాపరమై జ్ఞానస్వరూపిణియై చంద్రకాంతివలె వెలుగు నిస్తూంది. యతివర్యా! ఆమహాశక్తి భర్తను తన స్వాధీనమం దుంచుకొన్నది. ఆమెయే భవానియై వెలసింది. తాము చాల గొప్పవారే! కావున మాదేవి చిహ్నాలనే ధరించి ఆమెనే ఉపాసించుడు!' అని వచించాడు. శ్రీశంకరాచార్యులు వారల విధానము నాలకించి వారల లోపాలను సరిదిద్ద నుద్యుక్తులయ్యారు.

## 5.2 భవానీ ఉపాసకులు

చిన్నచిన్న లోపములు జ్ఞానాన్ని మరుగుపరచి అంధకారంలో బడద్రోయును. చిన్న తప్పునకు పెద్దశిక్ష కూడదని శ్రీశంకరాచార్యులకు కరుణ కలిగి శాక్తేయుల లోపాలను సరిదిద్దుటకు తలంచి భవానీ ఉపాసకుల నుద్దేశించి.

"మీరు పలికిన పలుకులు నిజమే! కాని, సకలశాస్త్రములలోను ప్రకృతికి పరాపరమైన పరమాత్మ యొక్క బోధనల వలన ముక్తి కలుగుచున్నదని నిశ్శంకగా నిర్వచించబడినది. మోక్ష మనగా మరేమీ కాదు, అజ్ఞానము నుండి బయట పడుటయే. అనగా ఆత్మను తెలిసికొనుటయే. ఆత్మను పరమాత్మగా భావించమని శ్రుతి స్మృతులు ప్రమాణములై యున్నవి. అజామిత్యాది మంత్రములలో ఉత్పత్తి లేని మాయాస్వరూపమును వివరించి ఆత్మతత్త్వాన్ని మోక్షం కొరకు విపులముగ తెలియ జేసిరి. కనుక ప్రకృతి కంటె విలక్షణ మైనది పరమాత్మ యని తెలిసికోవలెను. అట్టి పరమాత్మను ఆత్మగా తెలిసికొనుటయే స్థిరమైన ముక్తి యని శ్రుతులు ఘోషించుచున్నవి. ప్రకృతిపరమైన పురుషుని చక్కగా తెలిసికొన్నచో ముక్తి కలుగునని సాంఖ్యులు నిర్వచించారు. కనుక ఆలాటి పరమాత్మ జ్ఞానంవల్ల ఈ ప్రకృతిలో నున్న అంటు ఊడిపోయి స్థిరమైన ఆనందమును పొంది ముక్తులగుచున్నారు. ఇదియే యదార్థమైన మార్గము.

పరమాత్మకు, పరమాత్మ జ్ఞానం కలవారికి భేదం లేదని 'బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి' శ్రుతివాక్యము. పరమాత్మ తత్త్వము నెరుగని వాడు ఎన్నటికీ పరమాత్మ కాజాలడు. కనుక మీరందరు ఆత్మతత్త్వాన్ని ఆకళింపు జేసికొనుడు. భవానీదేవి నారాధించుటవలన చిత్తశుద్ధి మాత్రమే కలుగును. ఆ యమ్మ అద్వైతమునే బోధించును. భవానీదేవి నుపాసించుట వలన ముక్తి కలుగదు. కనుక భవానీదేవి చిహ్నాలను విడనాడి ముముక్షువులు కండు' అని భవానీ ఉపాసకుల లోపాలను సరిదిద్దిరి.

శాక్తేయులు, శంకరులు వెలువరించిన తత్త్వమును సావధానంగా విని తమ లోపాలను తెలిసికొని ఆశ్యర్యపడి తమతమ బాహ్యాచిహ్నాలను విసర్జించారు. పిమ్మట లక్ష్మీఉపాసకుడు శ్రీఆచార్యస్వామి తమ మతప్రభావమును వినిపించుటకై లేచాడు.

## 5.3 లక్ష్మీ ఉపాసకులు

భవానీ ఉపాసకులు తమ లోపాలను సరిదిద్దుకొను విధానము లక్ష్మీ ఉపాసకులు విన్నారు. తమ మతధర్మములను వినవలసిన దని కోరగా శంకరు లంగీకరించిరి.

శంకరస్వామీ! మహాలక్ష్మియే జగజ్జనని. ఆమెయే మొదటి వేదములో చెప్పబడినది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మొదలయిన వారందరు ఆమెలో పుట్టి ఆమె యందు లయ మగుచున్నారు. ఆమె సృష్టి, స్థితి, లయాలకు కారకురాలు. కనుక మోక్షం కావాలని కోరు వారందరు ఆ జగజ్జననినే ఆరాధించాలి.

యతీశ్వరా! పద్మబీజమాలను, తులసిమాలను కంఠాన ధరించి, బాహువుల యందు పద్మచిహ్నాలను, తలను, ముఖమున మంగళకరమైన కుంకుమను అలకరించుకొని ఎవరు ఆ మహాలక్ష్మిని ఉపాసించెదరో వాళ్ళకు మోక్షం హస్తామలకం వలె నుండును. తామున్ను మహాలక్ష్మినే ఉపాసించుడు.' అని యొక లక్ష్మిఉపాసకుడు తెలియజేసెను.

శ్రీశంకరులు లక్ష్మిఉపాసనా విధానము విని, మీ మతంలో ఎంతో గొప్పతనము లేకపోలేదు. కాని అందొక సత్యాన్ని మాత్రం గ్రహించవలసి ఉన్నది. వినండి! లక్ష్మి ప్రధానమైన పరమాత్మ కానేరదు. సర్వం సృష్టించినవాడు, అద్వితీయుడు, తనకు తానే పుట్టినవాడు, స్వయంప్రకాశం గల వాడు అయిన పరమాత్మ నిర్వికారుడై, నిరంజనుడై, సర్వాంతర్యామియై వెలుగొందుచున్నాడు. ఆ పరమాత్మే నీవై యున్నావు. ఆ పరమాత్మ సదా

ఆనందస్వరూపుడు. జడవస్తువైన ప్రకృతికి ముక్తి నిచ్చుటకు సామర్థ్యం ఎన్నడూ ఉండదు. ఈ ప్రకృతికి లోనుకాకుండ, ఆ పరమాత్మను నేనే అని ధ్యానం చేస్తూ మననం చేస్తూంటే, అట్టి సంకల్పం దృఢమైనప్పుడు ముక్తి తేలికగా లభిస్తుంది. అనిత్యమైన దేవతలను ఆరాధించిన ఊరకపోదు. వారివారి యధీనమం దుండే లోకాలను పొందగలరు. కాని ఆ లోకమందు నివాసం మాత్రం శాశ్వతం కానేరదు. చేసికొనిన పుణ్యం క్షీణించుటతో పుణ్యలోక నివాసం సంపూర్తి యగును. అప్పుడు ఒక్క క్షణ మచట నుండ వీలుండదు. అంతట మరల మనుజుడై పుట్టవలసినదే. కనుక అశాశ్వతమైన పదవుల కొరకు ప్రాకులాడక లక్ష్మీదేవీ చిహ్నాలను విడనాడి పరమాత్మ తత్త్వాన్ని విచారణ చేసి జ్ఞానము నార్జించుకొనుడు!' అని శ్రీ శంకరాచార్యులు తత్త్వరహస్యాన్ని వెలువరించారు.

శ్రీశంకరాచార్యులు వెలిబుచ్చిన తత్త్వవిచారణ లక్ష్మీ ఉపాసకులు విని.

'జగద్గురో! మా లోపాలను తెలిసికొని మమ్ములను పునీతులు చేశారు. మేమంతా ధన్యులం! మాలోపం చిన్నదైనా అది మాకు పెద్ద అడ్డమై ఇంతవరకు అంధకారంలో ముంచింది. మాపాలిట అవతారమూర్తివై ప్రత్యక్షమైనారు. మీ యెదుటనే మా బాహ్యచిహ్నాలను విడనాడుచున్నాము. మమ్ము శిష్యులుగా స్వీకరించుడు.' అని వేడుకొన్నారు. అంతలో సారస్వతులు లేచి వారి గొప్పలను వెల్లడించ నుద్యుక్తులైరి.

## 5.4 సారస్వతులు

భవానీ ఉపాసకులు, లక్ష్మీఉపాసకులు శ్రీశంకరాచార్యస్వామికి శిష్యులగుట జూచి జంకు గొంకు లేకుండ సారస్వతులలో ఒక దిట్ట లేచి శ్రీశంకరుల నుద్దేశించి,

'శంకరాచార్యవర్యా! వేదా లెటుల స్థిరమైనవో మా ఉపాసనా దేవత యగు శారదయు అంత శాశ్వతమైనది. లోకాల కామె కారణ భూతురాలైనది.

అందువల్ల పరాపర మైనది. ఆత్మ, బ్రహ్మ, విష్ణువు ఈ మొదలయిన పేర్లతో పిలవబడుచున్నది. అట్టి పరదేవత మోక్ష మిచ్చుననుటకు సందియం లేదు. కావున తాముసు మావలెనే శారదాదేవిని ఉపాసించి మోక్షము నొందుడు!

వేదమే శారద. శారదే వేదరూపము. అట్టి శారదను క్షుణ్ణంగా తెలిసికొనవలెను. వేదార్థం తెలియని వాడజ్ఞుడు. అట్టి వాడు శారద నెట్లు తెలిసికొన గలడు? మోక్షం కావాలన్నవారు వేదార్థం తెలిసికొని మా శారదను సర్వదా ఆత్మానుసంధానం చేసికోవలెను. అప్పుడు మోక్ష మఱచేత నుండును.' అని వివరించాడు. శంకరాచార్యులు సారస్వతుల పలుకులు విని.

'సారస్వతులారా! మీ పలుకులలో ఎంత సత్యమున్నదో యోచించుకొనుడు. వేదమెట్లు ఉత్పన్న మగుచున్నదో చూడుడు. కంఠము, నాలుక, పెదవులు మొదలయిన వాని కదలికవలన గదా వేద ముచ్చరింపబడు చున్నది. అట్టిది ఎట్లు నిత్యమగును? ప్రళయం వచ్చినపుడు సర్వం నశించునదే గదా! వేదము పరమేశ్వరుని ఉచ్ఛ్వాస నిశ్వాసలలో నుండి పుట్టుచున్న దని శ్రుతి తెలుపుచున్నది. పుట్టినది నిత్య మెట్లగును? వేదాలు నశించినపుడు సూర్యుడు మహర్షులకు ఉపదేశించునది సూర్య సిద్ధాంతమం దున్నది. అందు వలన వేదాలు నిత్యమను అస్కారము లేదు. శారద వేదస్వరూప మనుచున్నారు. అందు శారదను వేదస్వరూపిణి యనుట కాస్కారము లేదు. బ్రహ్మ కానప్పుడు సరస్వతి నిత్య మెట్లగును? జ్ఞానులు బ్రహ్మను, సర్వ వేదమును నిత్యమని పలుకరు. నిత్యమైన దొక్క పరబ్రహ్మమే. అదియే శాశ్వతానంద స్వరూపము. ఆయన కన్యమైన దంతయు అశాశ్వత మగుచున్నది. ముక్తి కావలెనన్న వారు జ్ఞానము నార్జించు కొన వలయును. అట్లు శ్రుతులు తెలుపుచున్నవి. ఈ ఉపాసనలు మంచి మార్గము కాదు. సత్కర్మ లాచరించిన చిత్తశుద్ధి కలుగును. తద్వారా జ్ఞానార్జన చేసికొనవచ్చును. ఆ ప్రకార మాచరించుడు.' అని తత్త్వమును

వెలువరించుటతో వేరు గత్యంతరం గానక సారస్వతు లందరు శ్రీశంకరాచార్యస్వామి వారి శిష్యగణ మందు చేరిపోయారు. అంతట వామాచార్యులు శంకరాచార్యుల విధానము నచ్చక అందొకడు లేచి శంకరుల నోడించవలెనన్న పట్టుదలతో విజృంభించి శంకరులను సమీపించెను.

## 5.5 వామాచారులు

అంత వరకు శాక్తేయులలో సదాచారము ననుసరించిన వారు శ్రీఆచార్యస్వామితో తలబడుట జరిగినది. వామాచారు డొకడు తన ప్రతిష్ఠ నెలకొల్పుకొనుట కుద్యుక్తుడై నిలబడి.

'శంకరా! చిద్రూపంలో నున్న భగవంతుని తెలిసికొన జాలక ఏదో వేషం తగుల్చుకొని వృథా ప్రలాపము లాడుచున్నావు! నీ కేమియు తెలియదు. అంతే. నాలుగు ముక్కలు నాల్కకు తగిలించుకొని నానా చోట్లకు పోయి నవ్వులాట పాలగుచున్నావు! నీప్రయాస వృథా. ప్రలాపము లాడుచున్నావు! అద్వైతుణ్ణి అంటూ ఏదో జెండా తగిలించావు. ఇదిగో నీజెండా ఈనాటితో దింపవలసిందే చూడు నీ బండార మేమగునో!

ప్రళయ మందు ప్రకృతి పురుషుడు, వీరిద్దరు ఎన్నడు నశించరు. అప్పుడు నీ అద్వైత మేమగును?పరాశక్తి లేనిది ఈశ్వరు డేమి చేయగలడు? పురుషుడెప్పుడు శక్తి నాశ్రయించి యుండవలెను. ఆ శక్తినే ఆదిశక్తి యందురు. సర్వస్వతంత్రం గల దామె. లోకాలను సృష్టించుచున్నది. పరమేశ్వరునకు మూలకారకురాలామె. కావున అట్టిశక్తి నుపాసించు వారలకే మోక్షము లభించేది. ఆమె వలననే త్రిమూర్తు లుద్భవించారు. వారొక్కరి కొక్కరు ఒక్కొక్క గుణమున కధిపతియై లోకాలను పాలిస్తూన్నారు. అంతే! మేమందరం జ్ఞానపూర్ణులం! ఈ పని చేయవచ్చు, ఆ పని చేయకూడదు, అనే విధి నిషేధములతో నిమిత్తం లేనివారలం! త్రిగుణాల కతీతులమై

యున్నవారం! భృగుమహర్షి శక్తి నుపాసించారు. ఆయన ఎంతో సిద్ధుడు! ఆయన అడుగు నీడ ల్లోని వారం. ఆయనే మాకు పరమప్రమాణుడు. మిగిలిన దేమి మా కవసరం లేదు. శంకరాచార్యా! మా వలెనే ఆ పరాశక్తి నారాధించి ముక్తిని పొందుడు!' అని హుంకరించాడు.

వామాచారుని ఉరకలు చూచి శ్రీశంకరాచార్యులు జాలి నొందిరి. వామాచారం నీచమన్న దాయనకు తెలుసును. విశ్వప్రేమ వారికి ఒకరియెడ ద్వేషము, మరి యొకరిపై ప్రేమ జనించదు. అందరిని మంచి మార్గమం దుంచి ఉద్ధరించా లన్నదే ఆయన కంకణం.

'వామాచారుడా! ఏది సత్యమో తెలిసికొని దానినే పరమాత్మగా నిశ్చయించుకోవాలి. సత్యేతరమైన వన్నియు అనిత్యము లన్నది లోకవిదితమే. మూలప్రకృతి మాత్రం సత్యమనుటకు ఆధార మెందున్నది? సత్యం కాని దాన్ని ఉపాసిస్తే ముక్తి ఎట్లు ప్రాప్తించును? సత్య వస్తువు నుపాసించిన నాడే ముక్తి విధిగా ప్రాప్తించును. పరమాత్మ ప్రకృతికి అతీతుడై, నిత్యుడై, స్వతంత్రుడై, స్వప్రకాశకుడై వెలుగొందుచున్నాడు. అట్టి పరమాత్మ మోక్షమిచ్చుటకు అడ్డు గలదా? పరమాత్మను తెలిసికొన లేని వారు మూర్ఖులై ఇతరమును ఉపాసిస్తూ మోక్షాన్ని పొందలేకున్నారు. మీరందరు పవిత్రమైన బ్రాహ్మణ కులంలో జన్మించి శాస్త్రాల నతిక్రమించి కళంజాన్ని సేవిస్తూ మద్యపానం చేస్తూ ఒళ్ళు తెలియని స్థితిలో పడి పాపులై పోవుచున్నారు. మీకింక ప్రాయశ్చిత్తమే గత్యంతరము. మీ బ్రాహ్మణీకమును నాశనం చేసికొన్నారు. శాస్త్రవిధి ననుసరించి బ్రాహ్మణీకమును మరల పొందుటకు ప్రయత్నం చేసికొనుడు.

భృగుమహర్షి విష్ణువును తన్నుటకు గల శక్తి, అగస్త్యునకు సముద్రాన్నంతను ఆచమించిన శక్తి మీకు రాదేల? వారిరువురి మహిమలు వర్ణించడం ఎవరి తర మగును? అని ఆచార్యస్వామి యుక్తి యుక్తంగా

బుద్ధి చెప్పారు. శ్రీశంకరాచార్యుల హితోపదేశములను విని తమ అవినీతిని గ్రహించి లజ్జించి, వామాచారానికి నీళ్ళు వదలి, ప్రాయశ్చిత్తాలను యధావిధిగా చేసికొని, శ్రీశంకరాచార్యుల మతము నవలంబించి శిష్యులయ్యారు.

శ్రీశంకరాచార్యస్వామి రామేశ్వరయాత్ర ముగించుకొని కాంచీపురమునకు శిష్యగణంతో బయలు వెడలారు.

## 5.6 పాశుపతులు

రామేశ్వరమునుండి బయలుదేరి మార్గమధ్యమం దనేక పుణ్యస్థలములను దర్శించుచు శ్రీశంకరాచార్యస్వామి కాంచీపురం చేరుకొన్నారు.

శ్రీరామచంద్రమూర్తి కాంచీపురమందు రామేశ్వర ప్రతిష్ఠ స్వయంగా చేసియున్నారు. రామేశ్వరుని దర్శించి గంగాజలాలతో అభిషేకంగావించి, మారేడు దళములతోను, కుంకుమతోను, చక్కగా అర్చించారు. శ్రీఆచార్యస్వామి వచ్చారన్న వార్త విని చుట్టుపట్ల వారనేకమంది చూడవచ్చి దర్శనం చేసికొన్నారు. శివమతస్థులు కట్ట కట్టుకొని శంకరునితో వాదించుటకు వచ్చారు. శిరస్సున శూలం, మెడలో లింగం ధరించి, వారందరు నుదుటను, వక్షస్థలమున, నాభీస్థాన మందు, బాహువుల యందు కాల్చిన శూలచిహ్నములను ధరించి యున్నారు. అందు కొందరు బాహువుల యందు డమరుక చిహ్నములను ధరించి యండిరి. శైవులలో వీరశైవులను నొక శాఖవారున్నారు. పశుపతి భక్తులగుటచే వారిని పాశుపతులని యందురు. అందొకడు విచ్చుకత్తిలా లేచి శ్రీశంకరాచార్యస్వామికి నమస్కరించి,

'స్వామీ! లోకాలకు ప్రభువు, సర్వాధికారి, పరమశివు డొక్కడే అయియున్నాడు. అట్టివారి చిహ్నాలను ధరించి సేవిస్తే సర్వ శుభములు

చేకూరును. కావున తామ ట్లాచరించుడు! 'సత్యం, శివం, సుందరం' అయిన పరమాత్మకు వందనములు ! అట్టి పరమాత్మకు స్వర్గము శిరముగను, ఆకాశము నాభిగను, సూర్యచంద్రులు నేత్రములుగను, దిక్కులే మొగముగను, వేదములే వాక్కుగను ఉన్నవని వేదమే వచించుచున్నది. అట్టి వేదమయుణ్ని మోక్షం కొరకు వేడుచున్నాను. అలాటి వేదవాక్కుతో తెలుపబడుచున్న పరాత్పరుని ఆ యా స్థానములలో లింగము, శూలము మొదలయిన చిహ్నములను ధరించి పరమభక్తితో నుండువానికి శివలోక నివాసం ప్రాప్తించి తీరును.

యతివర్యా! ఒకానొకప్పుడీ లోకాలన్నింటికి పరమకారణమైన వాడెవడని దేవతలందరు ఆలోచిస్తున్న సమయంలో ఆకసంలో పరమ శివుడు ఆవిర్భవించి మొట్ట మొదటి వాడు తానే అని చెప్పుకొన్నాడు. తన కంటె గొప్పవాడు వేరొకడు లేడని వక్కాణించాడు. ఎప్పుడు తానే ఉన్నానని అదంతా సత్యమని వచించాడు. అందు వల్లనే పరమశివుడు సర్వలోకాలకు ప్రభువై ప్రకాశిస్తున్నాడు. ఆత్మ, సత్తు, బ్రహ్మ అను మాటలతో తెలియబడుచున్నాడు. ఈజగత్తే ఆయన. ఆయనే ఈ జగత్తు.

సృష్టి పూర్వమందు వాసుదేవు డున్నాడు. బ్రహ్మ లేడు శంకరుడునూ లేడు పరాత్పరుని యందు లోకము లన్నియు ఉన్నవి. అట్లు సర్వలోకాలకు ఆధారభూతుడై యున్నాడు. లోకాలకు సుఖాన్ని కలుగజేయు వాడగుటచే అతడు శంకరుడని పిలుపబడుచున్నాడు. విష్ణువు రక్షించే వాడైనా సర్వం లయ మగునపుడు ఉండడు. పరమశివు డొక్కడే నిత్యమైనవాడు.

శంకరా! దూర్వాసునితో శంకరు డాడిన మాటలు చెప్పెద నాలకించుడు.

'క్షరం కాని వాడను లోకాలన్నింటికి కర్తను. అన్నిటికి పరమ మైన వాడను, సత్తును, ఆత్మను, పురాణ పురుషుణ్ని నేనే. అన్నిటికి

ముందున్నవాడను నేనే. జ్యేష్ఠుడును నేనొక్కణ్ణే. నాపైని ఏ దేవుడు లేడు. లోకాలను సంహరించే శక్తి నా ఇష్టరూప మందున్నది. నా ఇచ్ఛాశక్తి నాలోనే లయిస్తుంది. సృష్టించ వలసిన సమయ మాసన్నమైనపుడు నా ఇచ్ఛాశక్తిని సృష్టించెదను. తలచుకొన్నంత మాత్రాన సృష్టి స్థితి లయాలను చేయుచున్నాను. ఆ విధానమంతా వివరించెద నాలకించుము. త్రిగుణములకు కారణమైన మహత్తత్త్వాన్ని ఉత్పత్తి చేయును. నా ఇచ్ఛాశక్తి, తద్వారా అహంకారం పుట్టును. ఆహంకారం త్రిగుణరూపకమైన పదకొండుగురు రుద్రుల నుత్పత్తి చేయును. ఈ పదకొండుగురును పాలకు లగుదురు. రాజస రుద్రులు సృష్టినిమిత్తము, సాత్త్విక రుద్రులు పాలన నిమిత్తము. తామస రుద్రులు లోక సంహారార్థము ఏర్పాటగుదురు. ఈ మూడు ప్రకృతులు అ కార ఉ కార మకారముల నుండి ఉద్భవించినవి. అ వర్ణము నుండి రజోగుణముతో బ్రహ్మ, ఉ వర్ణమునుండి సత్త్వగుణ ప్రధానుడైన విష్ణువు, మ వర్ణమందుండి తమోగుణములో రుద్రుడు ఉద్భవించారు. పిమ్మట లోక ముత్పన్న మయ్యెను. అ+ఉ+మ్ (ఓంకారము) నుండి సర్వం జనించిన దన్నమాట. ఏకాదశరుద్రులు త్రిమూర్తులకు అనువర్తనులై ప్రవర్తించెదరు. సమస్త దేవతలు, చరాచర లోకము ఏకాదశ రుద్రుల యొక్క విభూతులైయున్నవి. వారందరు ఒక్కలాగున పుట్టినను వాళ్ళ వాళ్ళ ఉద్యోగ ధర్మముల ననుసరించి వేరు వేరు పేర్లు పొంది యుండిరి. మహాప్రళయ మందు వాళ్ళందరు నా తేజస్సులో లీన మగుచున్నారు. మొదట బ్రహ్మ విష్ణుదేవునిలో లయమొందెను. పిమ్మట విష్ణువు నాయందు లయమగుచున్నాడు. ఆ రుద్రుడు సాత్త్వికతేజస్సుతో ప్రకృతి యందు తనకు తానుగా లయ మొందును. పరిశుద్ధమైన ప్రకృతి నా సంకల్పంతో నా యందిమిడి యుండును. సర్వాధారభూతుండనైన నన్ను అనంతమైన వేదములు గూడ తెలిసికొన జాలకున్నవి. నామహిమ అంతు లేని దని తెలిసికొని సర్వదా రుద్రుణ్ని భజిస్తూ రుద్రసూక్తాన్ని పఠిస్తూ పంచాక్షరీ

మహామంత్రమును పఠిస్తూ విభూతిని ధరించి, రుద్రాక్షల నలంకరించుకొని సదా ధ్యానిస్తూ ఉపాసించు వారికి ముక్తి అరచేతిలో నుండును. ఇది ముమ్మాటికి నిజం! కావున ఆ ప్రకారం మహాదేవుని భక్తితో పూజించుమా!' అని చెప్పి అదృశ్యుడయ్యాడు.

నారాయణమూర్తి ప్రజలను సృష్టించాలని సంకల్పించాడు. పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము లను పంచభూతములు, బ్రహ్మ, ప్రజాపతి ఉద్భవించారు. పిమ్మట మిగిలినవి పుట్టినవి. నారాయణ శబ్దంలో నార యనగా బ్రహ్మేంద్రాదులు, విష్ణువు మొదలయినవారు, నరులు, వీరల యొక్క సమూహము. అందరు పరమాత్మక స్థానమైన వారు. కావున నారాయణ శబ్దమునకు ఈశ్వరు డనియే అర్థము. సమస్త దేవగణములు శ్రీమన్నారాయణమూర్తి అంశతో నున్నవే. దానికి వేదమే ప్రమాణము. అన్నిటికి ఆధారభూతు డగుటచే జ్యేష్ఠత్వం వచ్చింది. కార్యరూపంలో మాత్రం కనిష్ఠుడై యున్నాడు.

'సత్యం, జ్ఞానం, అనంత' ఈ మూడు రూపములలో ఏ పరమాత్మ ఉన్నాడో మహాప్రభువు అని ఎవడు తెలిసికొనునో' – ఇట్టివి వేదవాక్యాలు.

పూర్వ మొకప్పుడు నిర్గుణు డైనను, ఆ పరమాత్మ చిరకాలముండే సృష్టి చేయుటకు సంకల్పించి తన తేజస్సును సూర్యునిగను, మనసు చేత చంద్రుని, సత్త్వగుణంతో కుజుని, వాఙ్మయముతో బుధుని, సుఖము, జ్ఞానము ఈ రెండింటితో గురుని, శుక్లాన్ని శుక్రుని, క్లేశముతో శనిని సృష్టించాడు. సూర్యచంద్రులు సృష్టించబడినను వారు మాత్రం పరాత్పరుని ప్రకాశింపజాలరు. పరాత్పరుడే అఖండంగా వెలుగుచుండ మిగిలిన వారందరు ఆయన ఆశ్రయాన్ని పొంది యుండ పరాత్పరుని ప్రకాశింప జేయడమంటూ ఉండదు గదా! సర్వం నశించినను పరాత్పరుడు మాత్రం నశించడు. ఆత డెప్పుడూ నిత్యమైనవాడే.

కర్మవల్ల లోకాలు కలుగుచున్నవి. కర్మవల్లనే లోకాలు లయమగుచున్నవి. అట్లైనను పరమేశ్వరుని ధిక్కరించి స్వతంత్రంగా ఫలము నివ్వలేదు.

బ్రహ్మను తెలిసికొన్నందువలన కలుగు గొప్పతనమును, తెలియకున్నందు వలన వచ్చు చిక్కును వేదమందు వివరించబడినది. బ్రహ్మ నెరుగనివాడు లేని వానితో సమము. తెలిసినవాడు సత్పురుషు డని శ్రుతి తెల్పుచున్నది. ఇదంతా విన్నారు! కనుక ఆ పరాత్పరుని భక్తితో భజించుడు. ఇది పరమ మార్గము.' అని శ్రీ శంకరాచార్యస్వామికి వివరించాడు.

పాశుపతుడు చెప్పినదంతా శ్రద్ధగా విని,

'శివభక్తులారా! నే చెప్పునది శ్రద్ధగా వినుడు ! లోకాలకు మూల కారణమైన వా డొక్కడే. ఆయన కన్న గొప్పవాడు వేరొకడు లేడు. వేదమటులనే చెప్పుచున్నది. అంతవరకు నాకు సమ్మతమే. వేదమం దేది యుండిన దానిని విధిగా నమ్మువాడను. నాకు నచ్చని విషయములు మీలో నున్నవి. పరాత్పరుని గూర్చి మీరు పలికిన విషయాలతో నాకేమి విరోధము లేదు. కాని మీరందరు లింగము, శూలము, డమరుక మొదలయిన బాహ్యచిహ్నాలను ధరిస్తూన్నారు. పైగా అట్లు ధరించినందు వలన మోక్షం వస్తుం దనుచున్నారు. అందుకు వేదప్రమాణములు కానరావు. శాస్త్రమెరిగినవా రెవరు వేదంలో లేని విషయాలను, ఆచారాలను అంగీకరించరు. బ్రహ్మణ దేహములను సమస్త దేవతలు ఆశ్రయించుకొని యుండెదరు. అట్టి దేహాలను కాల్చి లింగమని, శూలమని ధరించడం మంచిది కాదు.

పరమశివభక్తులారా! వేద వేదాంగాలు చదివిన బ్రహ్మణుని యందు నాభికి పైన సోమపులు, దిగువను అసోమపులు నివసిస్తూంటారు. శిరస్సు, శిఖ, నుదురు, ముక్కు, చెవులు, కపోలము, నాలుక, గడ్డము, కంఠము, భుజములు, భుజాగ్రములు, అరచేతులు, వక్షము నడుము, లింగము,

వృషణములు, తొడలు, మోకాళ్ళు, మడమలు, పాదములు వీని యందు బ్రహ్మాది దేవతలు, మునీశ్వరులు ఆశ్రయించుకొని యుందురు. స్నాన మాచరించు నప్పుడు, ఆహార పానీయములు సేవించు నప్పుడు వారు సదా సంతుష్టి నొందుచుందురు.' అని బ్రహ్మ అరుణ కేతువునితో చెప్పియున్నాడు. ఇది సత్యమని కూడ వచించాడు. అట్టి పరమ పావనమైన శరీరం కాల్చి ముద్రలు వేయడం ఎంతటి ఘోరాతి ఘోరమో యోచించ లేకున్నారు. అట్లు కాల్చుట వలన ఆయా స్థానాలలో నుండు దేవతలు శపించెదరు. వారాస్థానాల లోపల ఉండ వీలుండదుగదా! అట్టివాడు శూద్రుడై పోవును. అగ్నిలో నున్న కాష్ఠము వలె కాలిపోవుచున్నాడు. కాల్చుకొన్న వానిని చూచినచో సచేలస్నాన మాచరించాలి. లేదా సూర్యదర్శనం చేసికొవలెను. అప్పుడు గాని పాపంపోదు.

భక్తులారా! బ్రహ్మము అనే వేదాన్ని రక్షించే వాడు గనుక వాణ్ని బ్రహ్మణు డన్నారు. అలాటి వేదాన్ని దేవత లందరు ఆశ్రయించుకొని యున్నారు. అట్టి బ్రహ్మణుడు నాశనమైనచో లోకాలు సర్వనాశనం కాకుండ నుండగలవా? తాను వేరు, పరమాత్మ వేరు, అనే భావంతో చేసే ఉపాసన దూష్య మైనది. అట్టిమార్గంలో ముక్తిలేదు. దానికి శ్రుతి ప్రమాణము నున్నది.

కర్మ నాచరించుచు, అశాశ్వతమైన జగత్తును తెలిసికొని, విరక్తుడై, ఆత్మయం దభిలాషగలవాడై యుండవలెను, కర్మ నొక్క దాన్ని చేసినంత మాత్రాన మోక్షమెన్నటికి రాదు. విరాగియై వేదాలను తెలుసుకొని, ఇతర చింతనలను పూర్తిగ విడనాడి తత్త్వజ్ఞానము నార్జించుటకు పరమ గురువు నాశ్రయించ వలయునని శ్రుతి నిష్కర్షగా తెల్పుచున్నది కావున మీరు ధరించే చిహ్నాలను తక్షణం విడనాడి కేవలం జ్ఞానం కోసం పాటుపడండి. తద్వారా ముక్తి లభించును. ముక్తి సులువుగా లభ్య మయ్యేది కాదు. తత్త్వ విచారణ చేయుట వలన యోగము కలుగును. దాని వలన శోకమోహములు నశించును. అప్పు డాతడు స్థిరమైన ఆనందమును

పొందుచున్నాడు. వేదాలు వల్లించినను, దాని అర్థమును గ్రహించినను. బుద్ధిచేత గాని, శాస్త్రాలు చదువుటచేత గాని, మోక్షం లభ్య మయ్యేది కాదు. పరాత్పరుని అనుగ్రహం సంపాదించుకొనవలెను. ఆట్టివాడు పరమాత్మను తెలిసికొని ముక్తుడు కాగలడు. సర్వాంతర్యామిని తెలిసికొనిన ధీరుడు ముక్తిని బడయగలడు. అతనికి దు:ఖము లేవీ అంటవు. అతడే నిత్యమైన ఆనందమును పొందగలడు. ఆకసాన్ని చాపచుట్ట వలె చుట్టపెట్ట గలవాడు దుఃఖాన్ని పొందలేడు. ఇది అట్లున్నప్పుడు అజ్ఞానికి దుఃఖం ఎట్లు తొలగును? ఎటు చూచినా మోక్షం కావలయు నన్న జ్ఞానం కలిగి తీరవలయును. అందులకు గురుకృపా కటాక్షం కావలెను.' అని శ్రీశంకారాచార్యస్వామి పాశుపతుల లోపాలను సవరించారు.

అట్టి సమయమందు వీరనాయకుడను శివభక్తు డొకడు లేచి శ్రీఆచార్యస్వామిని సమీపించి అంజలి ఘటించి వినమ్రుడై,

"స్వామి! నీవే శరణ్యం! వేరొక దారి కానరాదు. కరుణించు పరాత్పరా! ఇంత దనుక కూపాంధకారంలో బడి జ్ఞానమార్గం తెలియక కొట్టుమిట్టాడుచున్నాము. తమ వాక్సుధారసమును ప్రసాదించుడు. భేదభావం నశించి అద్వైతజ్ఞాన ముదయించినది. నేనే ఆ పరమశివుడను! నా పూర్వపుణ్య పరిపాకంతో తమ దర్శనభాగ్యం లభ్యమైంది. తాము శివునికన్న పరమైన పరమాత్మస్వరూపం కలిగియున్నారు." అని బహువిధముల స్తోత్రం చేశాడు. అంతట ఆ పరమభక్తునకు శ్రీశంకరాచార్యస్వామి అభయప్రదానం చేశారు. వీరనాయకుని బంధుజనులు, మిత్రులు అద్వైతమందు ప్రవేశపెట్టబడినారు. అంతలో లింగధారి యొకడు శ్రీశంకరులను ఎదుర్కొనుట కుద్యుక్తుడైనాడు.

## 5.7 లింగధారులకు తత్త్వ బోధ

పాశుపతుడైన వీరనాయకుడు శ్రీ శంకరాచార్యస్వామికి పాదాక్రాంతు డగుట లింగధారులు సహించ లేకపోయారు. (శైవులలో లింగధారు లొక

అంతశ్శాఖ) వాళ్ళలో నుండి తేజోవంతు డొకడు కోపమాపుకో లేక లేచాడు. అతని మెడలో లింగం వ్రేలాడుచున్నది. రుద్రాక్షమాలలు చాలా అలంకరించుకొన్నాడు. విభూతి రేఖలు మెండుగా ధరించుకొన్నాడు. మీద పడునట్లు ఉరకలు వైచు కొనుచు శ్రీశంకరాచార్యస్వామిని సమీపించాడు. చూపరుల కాతడు రుద్రుని బోలి యున్నాడు.

'వంచకుడా! ఎంత పని చేస్తున్నావు! లోకాన్ని మోసం చేయుటకై మాయ వేషం వేసికొని పరమ పవిత్రము, పరమ ప్రమాణము అయిన మా శివమతస్థుని నాశనం చేయుటకు పూనుకొంటివా? ఎవ్వడవు నీవు చెప్పు? ఎంతటి మోసగాడివి! నీకంటె వంచకుడు వేరొకడు లేడే! ఎంత పని చేస్తున్నావు!'

'విను! బ్రాహ్మణ్యం కంటె వైష్ణవ మతం గొప్పది. అంత కన్న శైవ మతం గొప్పది. ఇది నారద మహర్షికి బ్రహ్మ వెలువరించిన విషయము. ఇది నీ వెరుగవా? ఇట్టి పరమప్రమాణ ముండగా వీరనాయకుణ్ని గంగలో కలిపివేశావే! ఇంత కన్న ఘోరం మరి యొకటి గలదా! వీరనాయకు డనిన సామాన్యుడు కాడే! సర్వజ్ఞుడు! నీ కేమైన మతి మందగించిందా? 'నమస్తే' అని వేదమే. మహేశ్వరుడే పరమాత్ముడు సుమా! పరమశివు డందరి ముఖాల్లోను, శిరస్సుల లోను, కంఠముల లోను, హృదయముల లోను నివసిస్తూ సర్వాంతర్యామియై వెలయుచున్నాడే! 'సహస్రశీర్షాపురుష: సహస్రాక్ష స్సహస్రపాత్' అని పురుషసూక్త మంటున్నది. ఉపనిషత్తులలో గూడ పరమాత్మ పరమేశ్వరు డనియే స్పష్టం చేయబడింది. 'నిత్యానిత్యోహమ్' (నిత్యము, అనిత్యమ్మునేనై యున్నాను) అని వేద ముచ్చరించుచున్నది. పరమాత్మ నిత్యము. జగత్తు అనిత్యము. ఈ రెండు ఆయనే గనుక నిత్యా నిత్యుడయ్యాడు, ఇది అథర్వవేద మందు స్పష్టంగా పలుకబడు చున్నది. 'గురైర్గురుమా!'

మహర్షులు పరమశివుణ్ని అనేకవిధాల ధ్యానించి పరమశివుడే ధ్యానింపదగిన వాడని నిర్ణయించినట్లు శివరహస్యమం దున్నది. కావున మహర్షులు సాక్షులైనారు. శుకమహర్షికి పరమశివుడు జ్ఞానోపదేశం చేసియుండుటచే శుకమహర్షి మరి యొక సాక్షి. మార్కండేయుని తీసికొనిపోవుచున్న యమదూతలను పరమశివుడు శిక్షించగా యమధర్మరాజు స్వయంగా వచ్చియుండెను. అప్పుడు పరమశివుడు మార్కండేయుని రక్షించాడు. అందువలన యమధర్మరాజు, మార్కండేయుడు సాక్షులు, విష్ణుమూర్తి వరాహరూపం దాల్చి పరమశివుని పాదముల అంతును, బ్రహ్మ హంసరూపుడై శిరస్సు అంతమును కనిపెట్ట దరి గానరైరి. వారిరువురు సాక్షులే గదా! కనుక 'ధ్యానింపతగినవా' డని మహర్షులు, 'జ్ఞానదాత' అని శుకమహర్షి, 'భక్తరక్షకు' డని మార్కండేయ యమధర్మరాజులు, 'ఆది మధ్యాంత రహితు' డని బృహ్మవిష్ణువులు తేల్చి యున్నారు. అట్టి గొప్పగొప్ప సాక్ష్యాధారము లుండగా పరమశివుడు కేవలం పరమాత్మ అనుట కనుమానమేల?

శంకరాచార్యా! ముద్రలు కూడదంటావు! తప్తలింగాది ముద్రలు ధరించుకొని, రుద్రాక్షమాలలు అలంకరించుకొని, విభూతి పూసికొని, కృష్ణాజినాన్నిధరించి, రుద్రపూజ చేస్తూ రుద్రాధ్యాయాన్ని జపంచేస్తూన్న వానికి సర్వపాపాలు పటాపంచలై, పరమపవిత్రుడై పరమశివస్వరూపమునే పొందుచున్నాడు. రుద్రకాండలో ఈ విషయ మంతయు గలదు చూడుమా! కావున శివచిహ్నాలను ధరించడం కూడునయ్యా! పైగా ఇవి ముక్తికి హేతువులని చెప్పబడింది. అనంతమైన ధర్మార్థకామ మోక్షాలు పొందవలె నన్న పాశుపతి వ్రతమును ఆచరించాలి."

లింగధారి వెలిబుచ్చిన ధర్మాలన్నీ శ్రీ శంకరపాదులు ఆకర్ణించారు. దూషణ భూషణలతో నిమిత్తం లేని వారాయన. తప్పులను సరిదిద్దడమే వారి ధ్యేయం. కఠినంగా పలికిన లింగధారి యెడ ప్రేమ కలిగి,

'శివభక్తులారా! తత్త్వాన్ని యథాతథంగా తెలిసికొనుడు. మీరు చెప్పిన విషయాలలో 'తప్త చిహ్నధారణ' అనుదానికి ప్రమాణం కానరాదు. తప్త తను వనగా కాల్చబడిన శరీరమని మీ యభిప్రాయము. అది సరిగాదు. "తప్త:" అనగా తపింపబడిన 'తను' వనగా శరీరం గలవాడు. అని చెప్పుకోవలెను. అతప్తతనువు' అనగా కృచ్ఛచాంద్రాయణాది వ్రతాలు చేయడం వలన శరీరం కృశిస్తుంది. అలా కృశించని శరీరం గలవానికి పరమపదం ప్రాప్తించ' దని అర్థం చెప్పు కొనవలయును. మీ రనుకొన్నట్లు అర్థం చెప్పుకొన్నచో బృహన్నారదీయ గ్రంథానికి వైరం వస్తుంది. పైకి కనుపించే వేషాలన్నీ డంబాచారము లనబడును. అని కేవలము భ్రాంతివంతములై యున్నవి.

'శరీరం కాల్చుకొనుటవలన మహాపాపు డగును. ఎట్టి పుణ్యకార్యా లాచరించిన వాడైనను పాపాన్ని పోగొట్టుకొనలేడు. కాల్చుకొనిన చిహ్నాలను ధరించినవాడు అధము డగుచున్నాడు. ఎట్టి ఆచారవంతుడైనను వేదవేదాంగాలు క్షుణ్ణంగా వచ్చినవాడైనను కాల్చిన లింగము శూలము మొదలయిన చిహ్నములను ధరించిన పతనాన్ని పొందవలసిందే. అని బ్రహ్మ నారదున కుపదేశం చేసి యున్నాడు.

ఒకప్పుడు గాయత్రీ దేవికిని బ్రహ్మణులకును గొప్ప తగవులాట కలుగగా, అందు మహాదేవికి తీవ్రమైన కోపం కలిగి మీరందరు పాషండు లగుదురు గాక! వైదికాచార భ్రష్టులగుదురు గాక! తంత్ర శాస్త్రాన్ని ఆచరింతురు గాక! నీచులై జన్మింతురు గాక ! కలియుగ ప్రవేశంతో కర్మభ్రష్టు లగుదురు గాక! వివేకహీను లగుదురు గాక!' అని శపించి, కలియుగం ముప్పదివేల ఏండ్లు గడచిన తర్వాత మీరంతా సర్వనాశనమై మరల జన్మించి సత్యవ్రతులై తత్త్వజ్ఞాను లగుదురు గాక' యని శాపవిమోచన మనుగ్రహించినది. కావున మీరలు తప్తతనువు అంటూ శరీరాలను కాల్చుకోకండి.

పరమేశ్వరుని తెలియజేయుటకు మాటలు చాలవు, మనసున భావించుటకు శక్యం కాదు. అట్టి పరమాత్మ సచ్చిదానంద స్వరూపమై ప్రకాశించుచున్నది. శివుణ్ని ఉపాసించుటకు యోగ్యమైన విభూతి రుద్రాక్షలను ధరించ వచ్చును. ప్రమాణ రహితములైనవి విడనాడండి.' అని ఉపదేశించారు.

అంతలో మరియెక లింగధారి లేచి, 'స్వామీ! లింగధారణ నిషేధ మనుచున్నారు. అద్దానిని మే మెన్నటికీ సహించజాలం. తామ ట్లనవలదు. ధారణ కాధారములు ప్రబలంగా నున్నవి. ఒకప్పుడు దేవతలకు త్రిపురాసురులకు గొప్ప పోరు సంభవించినది. అందు దేవత లసమర్థు లయ్యారు. అప్పుడు వాళ్ళందరు సమావేశమై త్రిపురాసురులను సంహరించుటకు ఉపాయ మాలోచించారు. అగ్ని, చంద్ర, విష్ణువులను ప్రతిష్ఠించారు. ఆ ముగ్గురిచేత ఒక బాణాన్ని సృష్టింపజేశారు. అది బహు బరువుగును, బలముగను తయారైంది. అట్టి దాన్ని ఎత్తడం వాళ్ళ కసాధ్యమైంది. దాన్ని ఎత్తే వారెవరా యని ఆలోచించగా రుద్రు డందులకు సమర్థుడని నిర్ణయించి వారందరు పరమశివుని ప్రార్థించారు. వారి మొరాలకించి రుద్రుడు ప్రత్యక్షమై తానొక వరమును కోరుకొందు ననగా దేవత లంగీకరించారు. 'పశువులకు పతిని కావాలి' అని రుద్రుడు వ్యక్తం చేశాడు. అప్పుడు దేవతలందరు పశువులైనారు. రుద్రుడు పశుపతి యైనాడు. దేవత లప్పుడు భక్తితో పశుపతి చిహ్నాలను ధరించారు. అంతట పరమశివుడు మేరువును విల్లుగను, వాసుకిని నారిగను, భూమిని రథముగను, సూర్యచంద్రులను చక్రములుగను వేదాలను గుఱ్ఱములుగను, బ్రహ్మను రథసారథిగను నియమించాడు. అట్టి సమయ మందు దేవతలు స్తోత్రం చేయుచుండ పరమశివుడు రాక్షసులను సంహరించాడు. కనుక లింగం మొదలైనవి ధరించడం భావ్యమే కదా! పరమశివుని సేవకులగుట చేత వారి యందు మాకుండే భక్తిని పురస్కరించుకొని వారిని గౌరవించుటకు

శివచిహ్నాలను ధరించి యున్నాము. ఇది తప్పా? ప్రభువులు ధరించే ఆయుధాలు వారి యెడ నుండే భక్తికొలది సేవకులు ధరించడం లోకాచారమై యున్నది కదా!' అని శ్రీ శంకరాచార్యులకు వివరించాడు.

లింగధారి చెప్పిన దంతయు శ్రీశంకరపాదులు చక్కగా విని,

'భక్తాగ్రగణ్యా! నీ వాడు మాటలకు విలువ లేదు. త్రిపురాసుర వధలో దేవతలు లింగధారు లయ్యారన్న విషయం ఏ గ్రంథ మందును కానరాదు. అది ఎంత మాత్రము నిజం కాదు. విభూతి, రుద్రాక్షలు ధరించా రంటివి. అది సమంజసముగ నున్నది. ప్రమాణ రహితమైనది సత్యమనుటకు ఆస్కారమేది? కనుక లింగధారణ నిరాధారము, నిష్ప్రయోజనమును.

భక్తి, శ్రద్ధ, ధ్యానం మొదలైనవాని వల్ల ఆత్మను తెలిసికోమని సత్యోపనిషత్తు తెలుపుచున్నది. శూలం మొదలైన చిహ్నాధారణ జ్ఞానార్జనకు హేతువని ఎక్కడా చెప్పియుండ లేదు. ముక్తికి మార్గం జ్ఞానార్జన పరమశరణ్యం. చిహ్నాధారణ శరీరమునకు బాధ కలుగడం తప్ప వేరుప్రయోజనం కాన రాదు.

రాజచిహ్నములను సేవకులు ధరించడం లోకాచారమైనచో మాత్రం చామరం మొదలైనవి ధరించుట లేదే! అట్టివి సేవకులు ధరించ వచ్చునా? కనుక పరాత్పరుని చిహ్నాలను ధరించడం బరువు చేటు! భక్తాగ్రగణ్యా! పరమశివునకు పన్నగములు భూషణములుగా నున్నవి కదా! భక్తులు పాములను ధరించ రేల? త్రాటిని జూచి పామనుకొని భయపడే మానవులు నాగధరు లగుదురా! కావున పరమేశ్వర చిహ్నాలను ధరించడం భక్తులకు పాడి గాదు. ఇవి పామర చేష్టలు! అవి విడనాడి వేదోక్తమైన కర్మ నాచరించుడు! మీ మీ చిహ్నములను పరమేశ్వరున కర్పణ చేయుడు. 'నేనే ఇదంతా చేస్తున్నాను' అను బుద్ధిని వీడి ఆత్మసంయమనం అలవాటు పరచుకొనుడు. దానివలన కలిగే జ్ఞానంతో ముక్తిని బడయగలరు!' అని శ్రీఆచార్యస్వామి వివరించారు.

అంతట విపక్ష శూలు డను లింగధారి శ్రీ శంకరాచార్యస్వామి వచించినది సత్యమని నమ్మి నిష్కల్మష హృదయుడై వారి పాదములపై బడి శరణు వేడుకొన్నాడు. బంధుమిత్రులతో అద్వైతము నవలంబించుటకు విపక్షశూలుడు కృతనిశ్చయుడైనాడు.

ఆవిధంగా శ్రీశంకరాచార్యస్వామి కాంచీపురమందు శివమతస్థుల నందరినీ అద్వైతులను గావించి అచ్చోటు వీడి కొలది దినములలో అనంతశయన క్షేత్రం చేరుకొన్నారు.

## 5.8 అనంతశయన క్షేత్రము

శ్రీశంకరాచార్య స్వామి అనంతశయనక్షేత్రం ప్రవేశించి అందు వేంచేసి యున్న అనంతపద్మనాభస్వామిని దర్శించుచు విష్ణుభక్తుల లోపాలను సవరించుచు ఒక నెలరోజులపాటు నివసించారు. తిరువనంతపురము, త్రివేంద్రము అని అనంతశయన క్షేత్రమునకు పేరులు. ఈనాడది కేరళ రాష్ట్రమునకు రాజధానీ నగరమై ప్రకాశించుచున్నది.

ఆనాడచ్చట నున్నవారందరు విష్ణుభక్తులు. వారలు ఆచార వ్యవహారములను బట్టి ఆరు రకములుగా నున్నారు. వైష్ణవులు, భక్తులు, భాగవతులు, పాంచరాత్రులు, వైఖానసులు, కర్మహీనులు అనునవి వైష్ణవ శాఖలు. శ్రీశంకరాచార్యస్వామి వచ్చారన్న వార్త వినుటతో వారందరు చూడ వచ్చిరి. శ్రీ ఆచార్యపాదులు వారలతో కుశల ప్రశ్నలు గావించారు. వారలలో విష్ణుశర్మ లేచి శంకరాచార్యులతో,

'స్వామీ! వాసుదేవుడు శ్రీ రామావతారము, కృష్ణావతారము ఎత్తియున్నారు. మే మందరం మూఢులమైనను వాసుదేవుని ఉపాసించుట వలన పవిత్రులమై విష్ణు సాలోక్యాన్ని పొందుచున్నారము. పూర్వమందు కౌండిన్య మహర్షికి సాక్షాత్కరించిన అనంతపద్మనాభుని మిగుల భక్తితో సేవించుచుంటిమి. ప్రతి నిత్యము మేము చేయుచున్న పని అదియే. మాలో

కర్మరులు, బృహ్మగుప్తులు, జ్ఞానులు మొదలయిన వారందరం ఇచ్చోటనే ఉండి కర్మలు చేస్తూ జ్ఞానార్జన చేయుచున్నాము.' అని విన్నవించాడు.

శ్రీఆచార్యస్వామి విష్ణుశర్మ పలుకులు విని జ్ఞానలక్షణ మెట్టిదో వివరించమన్నారు.

"స్వామీ! పరాత్పరుని ప్రమేయం లేనిదే గడ్డి పరకైనను కదల లేదు. అట్టి పరాత్పరుని పాదపద్మములే శరణని విశ్వసించి మౌనం వహించి యుండడమే స్థిరమైన జ్ఞాన" మని విష్ణుశర్మ శంకరులకు జవాబిచ్చాడు.

శ్రీ ఆచార్యపాదులు వాని అజ్ఞానమునకు జాలినొంది. 'నాయనా! బ్రాహ్మణుడు జన్మచేత శూద్రుడు. కర్మ చేత ద్విజు డగుచున్నాడు. ద్విజుడు మూడువేళలా సంధ్యావందన మాచరించవలెను. త్రికాలముల యందు అగ్నిని పూజించాలి. ఇట్టి కర్మలు బ్రాహ్మణుడు విధిగా చేయవలెనని శ్రుతి ఘోషించుచున్నది. సంధ్యావందనం చేయనిచో ప్రత్యవాయ దోషం సంభవిస్తుంది. వేదవిహితములైన కర్మల నాచరించిన సకలశుభములు పొందుచున్నాడు. అట్లాచరించని వాడు సకల దుఃఖములకు లోనగుచున్నాడు. ఇది మనువు శాసించినది. మనువు శాసించిన నిత్యకర్మల నాచరించని వాడు జీవకోటి యున్నంత వరకు నరకమును పొందుచున్నాడు. యతులు కర్మలు చేయ నక్కర లేదని తలంచకు. స్నానం, జపం, తపం, దేవతార్చన వారలకు విహితములు, సర్వ సంగ పరిత్యాగులయిన సన్న్యాసులకే కర్మలు విధించబడినప్పుడు ఇతరుల విషయం వేరుగ వచించ వలెనా? బ్రాహ్మణుడు విధికర్మల నాచరించని నాడు వాని బ్రాహ్మణ్యం మంట గలసిపోతుంది. ఏ కొంతకాలమైనను కర్మను విడనాడినచో భ్రష్టుడై యమయాతనలకులోను గావలసినదే.' అని విష్ణుశర్మాదుల కుపదేశం చేశారు.

## 5.9 పంచాయతన పూజ

శ్రీశంకరపాదులు విష్ణుభక్తులను మంచి మార్గమందు ఉంచ నెంచి, 'మానవులై జన్మించి నందుకు జ్ఞానము నార్జించుకొని ముక్తి నొందుటయే

పరమావధి. దాని నెట్లు పొందవలెనో తెలిసికొనుడు. పరమేశ్వరుడు, విష్ణువు, ఆదిత్యుడు, పార్వతి, గణపతి అనువా రైదుగురు దేవతలు, వీరందరు ఉత్తమోత్తములు. మీరందరు ఈ పంచదేవతా పూజను ప్రారంభించుడు. ఏ కోరికలు మనసు నందు తలంచక బ్రహ్మార్పణ బుద్ధితో అర్చించుకొనుడు. తద్వారా మీ మీ అంత:కరణలు పరిశుద్ధమై మీకును, పరాత్పరునకును అభేద ముదయించును. అందులో మీకున్న అజ్ఞానం మాయమై 'నేనే పరమాత్మను' అనే నిశ్చయజ్ఞానం కలుగును. అదియే మోక్షము. అట్టి ముక్తి కలుగుట కనేక కారణము లున్నవి. చెప్పెద నాలకించుడు. జీవేశ్వరాభేదం దృఢంగా నమ్మినప్పుడే లింగదేహం నశించును. ఆ స్థితిలో సంకల్పములు మొలకలెత్తుట కాస్కారం కానరాదు. అట్టి నిస్సంకల్పస్థితిలో మాయావరణలు తొలగుటతో ఆత్మ దేదీప్యమానంగా ప్రకాశించును. దానినే శాశ్వతానందస్థితి లేక శాశ్వతమైన ముక్తి యందురు.' అని తత్త్వము నొకించుక ఉపదేశించారు.

శ్రీఆచార్యస్వామి వెదజల్లిన తత్త్వరహస్యబీజములు విష్ణుశర్మాదులలో నాటుకొని మొలకలెత్తినవి. నాటినుండి వారందరు పంచాయతన పూజ ప్రారంభించి, ఆయన శిష్యవర్గమంతా శంకరులు చెప్పిన చొప్పున చేయుచు, నిత్యం మృత్తికాస్నానము లాచరించుచు, భస్మ చందనములతో త్రిపుండ్రములను ధరించుచు, నియమనిష్ఠలు గలిగి ప్రవర్తించుచు జ్ఞానార్జన చేసికొనిరి.

బృహ్మగుప్తుడను వైష్ణవమతకర్మఠుడు పేరొందిన భక్తుడు. విష్ణుభక్తులకు శంకరులు బోధించిన దంతయు శ్రద్ధగా నాలకించి శ్రీశంకరపాదులను సమీపించి, 'యతిశ్రేష్ఠా! నమస్కారములు! మేమందరము స్మృతులలో తెలిపిన ప్రకారము కర్మల నాచరించుచున్నాము. అట్లు సత్కర్మల నాచరించుచు పద్మనాభస్వామి వారి క్షేత్ర మందు నివసించుచున్నాము' అని నివేదించుకొన్నాడు. శ్రీశంకరాచార్యులు బృహ్మగుప్తుని విధానమును విని,

మీరందరు నిర్మలమైన మనసుతో పరమేశ్వరార్పణ భావంతో భక్తిశ్రద్ధలు గలిగి పంచాయతనపూజ సల్పుకొనుడు. జీవుడు, ఈశ్వరుడు అను భేద భావం లేకుండ జేసికొనుచు, సూక్ష్మదేహానికి లోను గాక, అజ్ఞానమును పారద్రోలి శాశ్వతానందమును పొందుడు! అని వెలువరించుటతో బ్రహ్మగుప్తాదులు సంతసించి, అనేక నమస్కారము లర్పించి నిర్మల చిత్తు లయ్యారు. ఆ నాటి నుండి వారు అద్వైతులై స్థిరమైన ఆనందమును పొందు మార్గము నవలంబించారు. పిమ్మట భాగవత శాఖకు చెందిన వారు శ్రీఆచార్యపాదునితో ముచ్చటించ నుద్యుక్తు లయ్యారు.

## 5.10 భాగవతులు

భాగవతశాఖకు చెందిన విష్ణుభక్తు డొకడు శంకరులకు నమస్కరించి, 'వేదములలో ఎన్నివిధాల పుణ్య మార్జించుకొను విధానములు తెలుపబడి యున్నవో అవన్నియు విష్ణుమూర్తిని స్తుతించుట వలననే కలుగుచున్నవి. అందువల్లనే మే మందరం విష్ణువును కీర్తించడ మందే నిమగ్నులమై శంఖం, చక్రం మొదలయిన చిహ్నాలను అంకితం చేసికొని కంఠాన తులసిమాలలు అలంకరించుకొని ఊర్ధ్వపుండ్రాలు ధరించుచున్నాము. కావున ముక్తి మా అరచేతులలో నున్నది. ఇంక మాకు చింతా చీకూ అన్నది లేదు.' అని తన మతధర్మములను వివరించాడు.

శ్రీఆచార్యస్వామి భాగవతుని విధానము విని, 'భక్తులారా! విష్ణువు నాలుగు రకముల మూర్తులు గలిగియున్నాడు. అందొకటి గగనము వలె నున్నది. అది చెప్పుటకు గాని, తలంచుటకు గాని శక్యం కానిది. దీనినే పరామూర్తి యందురు. అట్టి మూర్తికి ఏవిధమైన చిహ్నములు లేవే! అతడు కేవలం నిర్గుణుడు, నిర్వికారుడు, సర్వవ్యాపి. అట్టివాని రూపమును ఏ విధముగ ధరించగలరు? రెండవ మూర్తి వ్యూహమను పేరుతో వెలయుచున్నది. ఇది సర్వాత్మస్వరూపముగా నున్నది. అట్టి రూపము నెట్లు ధరించుకొన గలరు? ఒక వేళ సమర్థత గల దందురా, అట్లయిన ఆయన

యొక్క ఒక చిహ్నము చేత శిరస్సు మొదలుకొని పాదాల వరకు కాల్చుకొనుడు! అప్పుడు మీకు తప్పక ఈ శరీరం విడచిన తరువాత వైష్ణవత్వమును పొందగలరు. ఇది దుస్సాధ్యంగదా! మూడవ మూర్తి మీనాది అవతారమూర్తులు. దీనికే విభూతి యని పేరు. ఈ చేప మొదలయినవి లోహంతో తయారు చేసుకొని దానిని కాల్చి శరీరం మీద గుర్తులు పెట్టుకొనుడు. నాల్గవమూర్తి అర్చామూర్తి. ఇవి ఱాళ్ళతో తయారు కాబడును. శిలారూపాన్ని మీ మీ శరీరాలయందు చిహ్నాలుగా ధరించెదరా? శంఖచక్రాలపేరితో కాల్చుకోవడ మేల? లోహాదులతో తయారైనవే ధరించిన సమంజసంగా నుండు నేమొ! భాగవతులారా! శంఖచక్రాంకితాలు పాషండ మతమునకు చెంది యున్నని. పరాత్పరుని ప్రీతికొరకు సత్కర్మల నాచరించుడు. కర్మఫలితాన్ని పరాత్పరునకు అర్పణ చేయండి. అట్లాచరించిన పరిశుద్ధు లగుదురు. అద్వైత తత్త్వ వేత్త యగు పరమగురువు నాశ్రయించి వారి తత్త్వోపదేశాలను పొందుడు. అప్పుడు కర్మబంధములు తొలగి మోక్షమును బడయగల' రని గంభీరోపన్యాస మిచ్చారు. పిమ్మట శార్ఙ్ణపాణి అనే వైష్ణవ శ్రేష్ఠుడు శంకరులతో మాటాడ నెంచెను.

## 5.11 శార్ఙ్ణపాణికి తత్త్వబోధ

తెలియ నంత వరకు ఎవరి మతం వారికి గొప్పదిగా కన్పించుట సహజం. శార్ఙ్గపాణి వైష్ణవమత మందు గొప్పవాడని ప్రసిద్ధి పొందియున్నాడు. ఆయన తన మతవిధానమును శ్రీ శంకరపాదులకు వినుపించ నెంచి లేచి, 'స్వామీ! విష్ణుమూర్తి యొక్క శంఖచక్రాలు ముద్రలుగా ధరించి, సదా "ఓం నమో నారాయణాయ" అనే మహామంత్రాన్ని స్మరణ చేయుచుందుము. విష్ణుభక్తులకు వైకుంఠనివాసము తప్పక ప్రాప్తించును. కనుక ఈ సంసార బంధము నుండి విముక్తి నొంది ఇప్పుడే వైకుంఠమునకు వెడలుచున్నాను. శంఖచక్రాది చిహ్నాధారణలకు పురాణముల యందు ప్రమాణము లున్నవి. ఏ వైష్ణవుడు శంఖచక్రాది చిహ్నాములను ధరించుకొని

కంఠమున తులసి, పద్మబీజమాలలను అలంకరించుకొని ఊర్ధ్వపుండ్రధారణ చేసికొనియుండునో అట్టివానిని చూచినంత మాత్రాన శ్రీ మహావిష్ణువును దర్శించినట్లే యగును' అని తన అభిమతాన్ని వ్యక్తంచేశాడు.

శ్రీ ఆచార్యస్వామి శార్ఙ్గపాణి పలుకు లాలకించి.

'భక్తుడా తగు ప్రమాణం గల మాటలకు విలువ కలుగును. చక్రాంకితములు వేదవిహితములు కావు. అందువలన అది ప్రమాణ రహితము. వ్రతాల నాచరించకుండా శరీరం తప్తం కాదు. తప్తంకాని శరీరం గల వానికి మోక్షం రాదని శ్రుతి తెలుపుచున్నది. పాపాలు పోవలె నన్న శరీరాలు శుష్కించి తీరవలెను. వ్రతాదుల వలన శరీరం తప్తం కానిచో ధ్యానం చేయవలెను. పురాణములు కేవలం ప్రమాణములుగా ఎంచకుడు. శంఖచక్రాంకితములు తక్షణం విడిచి పెట్ట తగి యున్నవి. మోక్షం కావలయు నన్న బ్రహ్మజ్ఞానం కలుగ వలెను, అని శ్రుతి ఎలుగెత్తి చాటుచున్నది. పుణ్యం క్షీణించిన స్వర్గాది పుణ్యలోకవాసం అంతమై తిరిగి మానవుడై జన్మించు నని శ్రుతి తెలుపుచున్నది. చిహ్నాధారణలను శ్రుతిస్మృతులు అంగీకరించుట లేదు. బృహన్నారదీయ మందు గాని, పురాణముల యందు గాని చిహ్నా ధారణ నిషేధ మనియే విధించబడినది. చిహ్నాధారణతో నేను విష్ణువుతో సమాన మనుకొనుట భావనారాజ్యము వంటిది. వేదములు వల్లించక బాహ్మణ చిహ్నములైన శిఖా యజ్ఞోపవీతం మొదలయినవి ధరించినంత మాత్రాన జ్ఞానార్జన చేయనిచో బ్రాహ్మణుడు కాజాలడు. బ్రహ్మజ్ఞానార్జన చేయు వానినే బ్రాహ్మణు డందురు. భ్రష్టుడైన బ్రాహ్మణుడు తిరిగి బ్రాహ్మణుడు కాగలడా! బ్రహ్మజ్ఞానం వల్లనే ముక్తి ప్రాప్తించునని శ్రుతివాక్యములు ఢంకా ధ్వని చేయుచున్నవి. కనుక ప్రతీక్షణం తత్త్వవిచారణ చేయుచుండుడు. అంతట జీవేశ్వరాభేదం దృఢమై జీవుడే శివు డగుచున్నాడు. 'శివోహం' అని నిరంతరం మననం చేసికొను వానిని ఆ శివుడే వానిని శివునిగ చేయును. వాసన క్షయించి భేద బుద్ధి నశిస్తుంది. ఈ విధముగ శివగీత పలుకుచున్న' దని వచించారు.

శార్ఙ్గపాణి శ్రీఆచార్యస్వామి వెలువరించిన తత్త్వబోధ విని సాష్టాంగ వందనము లర్పించి కృతార్థుడ నైతి' నని తన నిశ్చయాన్ని వ్యక్తం చేశాడు.

## 5.12 పాంచరాత్రులు

పాంచరాత్రు లనబడు ఆగమమతస్థులలోని పండితోత్తము డొకరు లేచి శ్రీ శంకరాచార్యులను సమీపించి, 'యతిశ్రేష్ఠా! నమస్కారములు! ముక్తికి మా ఆగమ శాస్త్రమే మూలకారణమై వెలయుచున్నది. దీనిని తెలిసికొనకుండ ముక్తి పొందనేరదు. ఇది అందరికి అందుబాటు గల విధానము గలది. బ్రాహ్మణులన్న వారందరు దీని నాశ్రయించి తీరవలె' నని వచించాడు. శ్రీఆచార్యస్వామి వారి మాట విని,

'పండితోత్తమా! నీ వన్నది బాగున్నది. సందేహ మేల? వేదములకు వ్యతిరేకం కాని పద్ధతి మాత్రం యోగ్యమై ఆచరింపదగినది. వేదమే అన్నిటికి ఆధారభూతమై యున్నది. పాంచరాత్రాగమములో ఇతర మంత్రములను లేకుండ జేసి యున్నందువలన అది వైష్ణవ మతమైనది. ఆగమ విరుద్ధ మంత్రము లన్నియు శరణ్యం కావని గదా దాని ఆంతర్యం? బ్రాహ్మణ్యము నిలబెట్టుకోవలె నన్న గాయత్రీ మహామంత్రోపాసనే శరణ్యం. ఇది లేని వానికి విప్రత్వమే లేదు. మీ ఆగమ మందది కానరాదు. గాయత్రీ మహామంత్రోపాసన లేని లోటును వంద విష్ణుమంత్రాలు భర్తీ చేయజాలవు. బ్రాహ్మణత్వం లేని వైష్ణవత్వం ఉపయోగం లేనిది. గాయత్రి శంఖం మొదలైన ధారణలు గలిగి యున్నదని వైష్ణవం ఉత్తమం అనరాదు. గాయత్రికి పంచముఖత్వా లున్న వని అందురు. చంద్రుని శిరమున ధరించుటచే గాయత్రి రుద్రశక్తి అన వచ్చును. సూర్యుని తేజము ఆమె యందున్నది. విష్ణుమూర్తి భానుమండల మందు ప్రవర్తించు నందురు. ఈ రెండు కారణములచే గాయత్రిని విష్ణుశక్తి అన వచ్చును. అంత మాత్రాన గాయత్రిని కేవలం విష్ణుశక్తిగా తలంచరాదు.

వేదానుకూలమైన ఆచారములు ఆగమశాస్త్రమం దున్నచో ఆచరించ వచ్చు. తద్విరుద్ధములు ఆగమమం దున్నచో ఆచరింప తగవు. వేద విరుద్ధమైనది ఎన్నడును అంగీకరింపబడదు. వెంటనే బ్రాహ్మణత్వ సిద్ధికై వేద విహిత కర్మ నిరతుడువు కమ్ము. అట్లాచరించిన చిత్తశుద్ధి గలిగి తత్త్వజ్ఞానమును బడయగలవు. తద్వారా మోక్షం సిద్ధిస్తుంది. సర్వభూతముల యందు ఆత్మను, ఆత్మయందు సర్వభూతములను జూచువాడే పరబ్రహ్మను పొందుచున్నాడు. ఇందులకు వేరొక మార్గం మృగ్యం. భక్తాగ్రగణ్యా! పాషండచిహ్నములను విడనాడి మోక్షం కొరకై అద్వైతజ్ఞానము నార్జించు కొనుమా!' అని శంకరాచార్యులు బోధించారు.

మాధవు డంత సంతుష్టుడై అద్వైతతత్త్వమును విడనాడక వేదవిహితకర్మల నాచరించుచు తన బంధుమిత్రాదులను అద్వైతనిష్ఠలో ప్రవేశపెట్టి సుఖముగ నుండెను. అంతలో వైఖానస ప్రముఖు డొకడు శంకరులను కాదనుట కుద్యుక్తుడాయెను.

## 5.13 వైఖానసుడు

శ్రీ ఆచార్యస్వామి గావించు మతప్రబోధ మెటులున్నను తాము బహుకాలమునుండి ఆచరించు విధానమును తిరస్కరించుటను సహించ లేక వైఖానసులలో ప్రముఖుడైన వ్యాసదాసుడు శ్రీశంకరపాదులను సమీపించి,

'స్వామీ ! మాకు శీమన్నారాయణమూర్తియే పరమదైవం. కావున మా పక్షమును కాదనుటకు బ్రహ్మతరం కాదు. 'తద్విష్ణోః పరమం పదమ్' మొదలయిన శ్రుతివాక్యములు శ్రీమన్నారాయణమూర్తికే అగ్రస్థాన మిచ్చినట్లుగ తెలుపుచున్నవి. అదియును గాక ఆయనలోనుండి బ్రహ్మ, రుద్రుడు పుట్టుచున్నారని 'నారాయణాద్బ్రహ్మా, జాయతే రుద్ర ఏవ చ' శ్రుతి వెలువరించినది కనుక నారాయణమూర్తినే సేవించ వలసి యున్నది.

ఆయన సర్వాంతర్యామియై వెలయుచున్నాడు. ఉపాసనావిధానములు, విష్ణుభక్తుల లక్షణములు మొదలగునన్ని యు వైఖానస మత మందు విపులంగా తెలుపబడి యున్నవి. శంఖ చక్రాది విష్ణు చిహ్నములను ధరించి ఊర్ధ్వపుండ్రములను పెట్టుకొన్నవాడే విష్ణుభక్తుడని తెలియబడును.' అని వివరించెను.

వ్యాసదాసుడు వివరించిన విధానము నాలకించి అందు గల లోపములను సవరించనెంచి,

'వ్యాసదాసా! ఈ లోకాలను సృష్టించు వాడు బ్రహ్మ? విష్ణువా? నారాయణమూర్తి సృష్టించువా డగుచో పరిపాలించు వాడెవడు? ఇందులో వివాద మెంతేని గలదు. ఇది అటుండ నిమ్ము. సృష్టిస్థితిలయకారకులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అను ముప్వు రున్నారు. వీర లేమగుదురు? ఇది కూడ అటుండ నిమ్ము, నారాయణమూర్తి యనినా విష్ణు వనినా ఒకటే కదా! విష్ణుపద మనగా నిత్యముక్తి. అది కేవలం తత్త్వజ్ఞాన ముండిననే లభ్య మగును. జ్ఞానం వినా ముక్తికి మరియొక మార్గం కానరాదు. నీవు విష్ణుభక్తుడవే యగుచో ఆయన ప్రీతి కొరకు వైదిక కర్మల నాచరించుమా! శంఖచక్రాంకితా లనుచు కాల్చు కొన్నంత మాత్రాన ముక్తి రాదు. ఆగమాచారాలు బ్రాహ్మణత్వమును నాశనం చేయుటకు కారణ మగుచున్నవి. అట్టివి లేకుండిన యోగ్యత కలిగియుండేది.' అని శ్రీశంకరపాదులు తెలియజేశారు.

శ్రీఆచార్యస్వామి చెప్పినది విని సంశయగ్రస్తుడై మరల,

'పూర్వకాలంలో దత్తాత్రేయ యోగీంద్రుల వారు పంచముద్రలు ధరించి యున్నారు కదా! ఆయనది మోక్షమార్గమే కదా! అందు వలననే మేమందరం ఆయన మార్గాన్ని అనుసరించుచున్నాం. పురాణములలో శంఖ చక్రధారణ చెప్పబడి యున్నది. ఇన్నిట చక్రాంకితములు యోగ్యమై యున్నవి. ఇవి

లేనిచో వైష్ణమతమునకే హాని సంభవించును. కావున భగవంతుని చిహ్నములను ధరించడం విధి!' అన్నాడు వ్యాసదాసుడు.

శ్రీశంకరపాదులు వ్యాసదాసుడు తెలిపిన విషయము మరల ఆలకించి,

వ్యాసదాసా! నీ అవివేకము నే మనవలెను! బాలకులు కూడ ఈ చక్రాంకితములు లాభము లేదనుచున్నారు. మహాతత్త్వవేత్త, పరమయోగీంద్రులు అయిన దత్తాత్రేయులు ముద్రాంకితములు పొంది యుండ లేదు. చక్రాంకితములు ధరించి నటుల ఎందున కాన రాదు. పురాణముల యందు గల దనుట ఉచితము కాదు. ఇప్పుడైనను నీమూఢ భక్తిని విడనాడి సుఖముగా నుండుము. భక్తుడా! ప్రహ్లాదుడు, గజరాజు, ధ్రువుడు, హనుమంతుడు, ద్రౌపది, గోపికలు, గోపకులు, వీరందరికీ చక్రాంకితములు చేసిన గురువు ఎవరు? అట్టి ఊహలు విడవాడి 'బ్రహ్మాస్మి' అనే అద్వైతభావమును పొంది సుఖంగా మోక్షమును పొందుమా! చక్రాంకితములు తప్పు కాదందువా, కపోలతలముల యందు శేషుని ముద్రలు, కంఠమున గరుత్మంతుని ముద్ర, భుజముల యందు, జ్ఞానేంద్రియ సమీపమున చక్రాంకితములు ధరించరేల? అచ్చట ప్రమాద మనియా!' అని వ్యక్తం చేశారు.

'యతివర్యా! తమ అనుగ్రహంతో వివేక ముదయించినది. నేనింక చక్రాంకితాలు ధరించబోను. చిన్న తప్పును తెలిసికొన జాలక ముందుకు పోజాల కుంటిని. ఇట్టి పరమరహస్యమును తెలిసికొనలేక పోవడం ఇంత వరకు మాకొక గొప్ప అవరోధమే ఏర్పడింది. దానిని తృణప్రాయంగా తొలగించి నందుకు కృతజ్ఞుడను. మిమ్ములను 'జగద్గురువు' లనియే పిలువ వలెను. కరుణించుడు!' అని వ్యాసదాసుడు కృతజ్ఞతలు శ్రీ శంకరపాదుల కర్పించాడు.

వ్యాసదాసునకు ముక్తిమార్గం చూపనెంచి శ్రీశంకరాచార్యస్వామి,

'వ్యాసదాసా! 'నేనే బ్రహ్మను. బంధములు లేనివాడను.' అని సదా భావన చేయుచుండుమా! అట్లు చేయలేనిచో 'బ్రహ్మైవాహం న సంసారీ ముక్తోహమ్' అని యైనను నిరంతరం మననం చేయచుండుమా! ఇట్లాచరించినచో బంధముల నుండి విడివడి పరమాత్మను తెలిసికొనగలవు. అట్లు తెలిసికొనడమే ముక్తి. ముక్తినొందుట కింకొక దారిలేదు." అని ఉపదేశించారు.

## 5.14 కర్మహీన శాఖీయులు

కర్మహీనులని పిలువబడే శాఖయొకటి వైష్ణవమత మందు గలదు. ఇదివరలో తెలుప బడినది. ఆ శాఖకు చెందిన నామతీర్థుడను ప్రముఖుడు సభలోనుండి లేచి శ్రీశంకరాచార్యులను సమీపించి,

'యతివర్యా! నమస్కారములు! మా మతధర్మములు వినండి! విష్ణుమూర్తి మత మగుటచే దీన్ని కాదనుటకు ఆదిశేషునికి కూడ శక్యం కాదు. కారణ మేమన, జగమంతా విష్ణుమయం. శిష్యునికి ముక్తిని ప్రసాదించు నిమిత్తం గురువు విష్ణుమూర్తిని పార్థించాడు. 'నాశిష్యుని తమ పాదారవిందముల కడకు చేర్చుకొను' దని ఆ ప్రార్థన విని శ్రీపరమేశ్వరు డట్లు తన పాదసన్నిధికి చేర్చుకొన్నాడు.

'యతివర్యా! నాకు తిరుగ జననం లేదు. నేనే జీవన్ముక్తుడను. మీరందరు కర్మలు జేయని వారగుటచే సర్వలోక ప్రభువైన విష్ణువునే పూజించుడు. ముక్తి తప్పక రాగలదు.' అని నివేదించాడు.

శ్రీశంకరాచార్యస్వామి కర్మహీనుని పద్ధతి విని అతనిని బాగుచేయ నెంచి, 'నామతీర్థ! కర్మ చేయని వాడవు! జీవన్ముక్తుడ వైతివా! ఇది ఎంత నింద్యము! ఇది మంచి, అది చెడ్డది అనే తేడా నీకు లేనందున నీది పిశాచవృత్తి! వేద విహితమైన విధికర్మల నాచరిస్తూ తత్ఫలితాన్ని ఈశ్వరార్పణ చేసినచో అయ్యది జ్ఞానమార్గ మగును, ఫలాపేక్షతో కర్మచేసినప్పుడు అది

కర్మమార్గము. అన్ని విధాలా కర్మభ్రష్టుడవే యగుచున్నావు. అందువల్ల శ్రుతిస్మృతులు నీకు శిక్షను విధించుచున్నవి. ఏవిధంగా జూచినను నీవు విష్ణుభక్తుడవు కానేరవు. స్వధర్మము నాచరించువాని లక్షణాలు చెప్పెద వినుమా! విష్ణుభక్తుడు సదా ధర్మమును చలించకుండ ఆచరించవలెను. ఇష్టుడు, అయిష్టుడు అను భేదం లేకుండ సమబుద్ధితో నుండవలెను. అట్లాచరించుచు పరిశుద్ధమైన అంత:కరణబుద్ధితో నుండవలెను. 'శ్రుతులలోను, స్మృతులలోను ఏది చెప్పబడియున్నదో, అదినా ఆజ్ఞ' ఆ శ్రుతిస్మృతులకు వ్యతిరేకముగ ప్రవర్తించువాడు నాకు ద్రోహి. అత డెంతటి భక్తుడైనా నరకమును పొందవలసినదే!' అని పరమేశ్వరుడు వచించినట్లు ప్రబలమైన ప్రమాణము లున్నవి. 'బ్రాహ్మణం కర్మ కుర్వీత' అనే వాక్యము ననుసరించి బ్రాహ్మణు లైన వారందరు కర్మ విధిగా నాచరించ వలసినదే. బ్రాహ్మణుల కెక్కడా కర్మత్యాగం చెప్పబడి యుండ లేదు. పైగా దేవాంతరపూజను విడవగూడదు. 'అగ్నిర్దేవో ద్విజాతీనాం' అని శాసించడంవల్ల బ్రహ్మచారి మొదలయిన వారందరు కర్మత్యాగం చేయరాదని తేలినది. త్రికాలముల యందు సంధ్యావందనం విధిగా నాచరించవలెను. అట్లు చేయనందు వలన వచ్చు దోషం పోగొట్టుకొనవలెనన్న మూడు కృచ్ఛ వ్రతముల నాచరించవలెను. విప్రునకు కర్మ చేయడంతో శూద్రత్వం పోయి ద్విజత్వము వచ్చు నని శాస్త్రము వచించుచున్నది. రెండు పుట్టుకలు అందొకటి శూద్రత్వము, రెండవది బ్రాహ్మణత్వము కలది గనుకనే బ్రాహ్మణులను ద్విజులన్నారు. కర్మ చేయనివాణ్ని ద్విజు డనడం మహాదోషం. 'నకర్మణా సప్రజయా' అను శ్రుతి వాక్యమున్నది గదా యనెద వేమో అది ద్విజుల కొరకు చెప్పబడి యుండలేదు. సన్న్యాసం పొందిన యతుల కొరకై పరిత్యాగం చెప్పబడినది. అని వివరించి చెప్పిరి.

శంకరులు వచించిన ధర్మం బుఱ్ఱ కెక్కి సంతుష్టుడై నామతీర్థుడు జగద్గురువులకు సాష్టాంగ వందనము లర్పించి అప్పటి నుండి కర్మలు

చేయడం ప్రారంభించాడు. మిగిలిన వారందరు ధర్మసూత్రాలను గ్రహించి జ్ఞాన మార్గమందు సంచరించడం ప్రారంభించి అద్వైతు లయ్యారు. శిష్య సమేతంగా అచ్చుట నుండి సుబ్రహ్మణ్య క్షేత్రమునకు శ్రీఆచార్య స్వామి పయనమయ్యారు.

## 5.15 హిరణ్యగర్భమతము

అనంతశయన క్షేత్రము నుండి శ్రీఆచార్యస్వామి శిష్యపరివార సహితంగా బయలుదేరి అయిదు దినములకు సుబ్రహ్మణ్యక్షేత్రం చేరుకొన్నారు. ఆ క్షేత్ర మందు గల కుమారధారా నది మిగుల పవిత్రమై ప్రసిద్ధికెక్కి యున్నది. అచట షణ్ముఖస్వామి వారి ఆలయ మున్నది. అది గొప్ప యాత్రాస్థలము.

శ్రీశంకరావతారమూర్తి కుమారధారానదిలో స్నాన మాచరించి విభూతి నలంకరించుకొని కాషాయాంబరములు ధరించి దండకమండల ధారియై దివ్యమైన తేజస్సుతో బయలుదేరి షణ్ముఖస్వామి వారిని దర్శించుటకు వెడలుచున్నారు. ఆ మహాతేజస్సంపన్నుని జూచి కైలాసవాసుని వలె భావించి అబ్బురపడి వారితో ముచ్చటించు భాగ్యమును పొందుటకై పరితపించారు. తమ మత ప్రభావమును వారికి నివేదించుట కాయత్తపడ్డారు. యాత్రీకులలో నొకడు పట్టజాలక శంకర పాదుల కడకు వచ్చి,

'యతివర్యా! మేమందరం బ్రాహ్మణ కులంబున జన్మించి ద్విజులమై మనుధర్మశాస్త్రానుసారం కర్మలను చేయుచున్నాము. ఆది పురుషుడైన హిరణ్యగర్భుని మనసార సేవిస్తూ నిర్మల హృదయం గల వారలమై ఆ దేవదేవుని అనుగ్రహం వలన ఏచింతా చీకూ లేకుండ సుఖముగ నుంటున్నారము. స్వామీ! సమస్త ప్రాణి కోటి పుట్టులకు ముందుగ హిరణ్యగర్భు డుద్భవించాడు. అర్హుడగుటచే ఆయనకే హవిస్సు నిస్తున్నారు. వేదవాక్యము లందుకు పరమ ప్రమాణములుగ నున్నవి. సృష్టికర్తయై పాలకుడై

లయకారకుడై ఉత్తమోత్తముడై పరమానందధాముడై యున్నాడని తెలుపబడుచున్నది. 'తదైక్షత' ఇత్యాది వాక్యము లాయనను స్తుతించుచున్నవి గదా! ఆ ప్రభువు తన భుజములచే శివకేశవులను సృష్టిస్తున్నాడు. అట్టి సర్వాంతర్యామి అయిన హిరణ్యగర్భుని భక్తులమై యున్నాము. సర్వదా యోగనిష్ఠలో నుండి కూర్చ కమండలులను ధరించువారలము. మహాయశ స్సంపన్నులైన మిమ్ములను దర్శించుటతో నిశ్చయంగా కృతార్థుల మైతిమి. ఒకించుక మా మాట నాలకించుడు.

'యోగీశ్వరేశ్వరా! జీవేశ్వరాభేద తత్త్వముతో నేమి ప్రయోజనము గలదు? సర్వలోకాధిపతి యైన హిరణ్యగర్భుని ఉపాసించుడు. ఆ పరాత్పరుని వలన సర్వప్రాణులు పుట్టుచున్నవి. కర్మఫలం వలన దు:ఖ భూయిష్టమైన సంసారసాగరంలో బడుచున్నారు. హిరణ్యగర్భుడే సర్వ మూలకారణుడై యున్నాడు. ప్రళయకాల మందు జీవకోటి యావత్తు బ్రహ్మలో లయ మగుచున్నది. దీనినే మోక్ష మనుచున్నారు. వారల వాసనాబలంతో సృష్టి జరుగు నప్పుడు మరల జీవులు పుట్టుచున్నారు. ఇది నిజమైన మోక్షం కాదు. ఒక్క బ్రహ్మజ్ఞాన సంపన్నుడే పరమ పదమగు బ్రహ్మజ్ఞాన సంపన్నుడే పరమ పదమగు బ్రహ్మలోక నివాసము నొందుచున్నాడు. వానికి పునర్జన్మ లేదు. కావున హిరణ్యగర్భుడు సేవింపదగివాడై యున్నందున తాము దండకమండలువులను ధరించి యతీశ్వరులై జగద్గురువులై బ్రహ్మజ్ఞానులై యుండుటచే బ్రహ్మలోకమును పొంద తగి యున్నారు. కనుక తామట్లు హిరణ్యగర్భుని ఉపాసించుడు' అని వివరించాడు.

హిరణ్యగర్భ మతస్థుడు చెప్పుకొన్న దంతా చక్కగా విని,

'భక్తులారా! బ్రహ్మాదు లందరు ఎవరి వలన ఉద్భవించారో తెలిసికొనవలెను. పరాత్పరుని గురించి క్షుణ్ణంగా తెలిసికొన్నచో ముక్తి తప్పక లభ్యం కాగలదు. ముక్తి హేతువైన తత్త్వజ్ఞానం కావలె నన్న వేదాంత

శ్రవణాదులు చేయాలి. మీ రనినట్లు లయకాల ముక్తి శాశ్వతంకాదు. అది ఒక దీర్ఘ నిద్ర వంటిది. బ్రహ్మను ఆశ్రయిస్తే జ్ఞానం రాదు. తత్త్వ జ్ఞానార్జనతోనే బ్రహ్మత్వాన్ని పొందేది. ఈ విధాన మంతయు వివరంగా శ్రుతులు తెల్పుచున్నవి.' అని శ్రీఆచార్యస్వామి తెలియచెప్పారు.

శ్రీశంకరపాదులు తెల్పిన తత్త్వరహస్యమును గ్రహించి హిరణ్యగర్భ మతస్థులు బ్రహ్మానంద భరితులై శ్రీ ఆచార్యస్వామికి శిష్యు లయ్యారు. పిమ్మట అగ్ని దేవోపాసకులు శంకరులతో ముచ్చటించ నెంచిరి.

## 5.16 అగ్ని దేవోపాసకులు

అగ్నిని ఆరాధించే మతములోని వారొకరు లేచి శంకరులను సమీపించి,

"స్వామీ! నమస్కారములు! మేము అగ్నిహోత్రుని యథావిధిగా పూజించువారలము. ఆయన మాకు పరమదైవం. సృష్టికి పూర్వం ఒక్క అగ్నిదేవుడే ఉన్నాడు. దేవత లందరు అగ్నినుండి జనించారు. ఆ దేవగణమందు గల అగ్ని దేవుడే విష్ణుమూర్తి అయ్యాడు అగ్నిదేవుడే మొదట హవిస్సును గైకొనుచున్నాడు. పిమ్మట దేవతల కిచ్చుచున్నాడు. వేదము అగ్నికి ప్రముఖస్థానమును కల్పించి బ్రాహ్మణులను పూజించు మనుచున్నది. వారు దానిని అత్యంత భక్తితో భద్రపరచుకొని నిత్యము ఉపాసిస్తూ ముక్తు లగుచున్నారు. కావున మోక్ష హేతువునకు అగ్నిని పూజించుట మూలకారణ మగుచున్నది. సర్వపాప హరుడని, ఉపాస్యుడని, అగ్ని దేవుడని వేదములు తెలియజేయ చున్నవి. తామును మా వలెనే అగ్ని దేవుని ఆరాధించి ముక్తినొందుడు. మీ మతం వలన ప్రయోజనం శూన్యం.' అని వెల్లడించారు.

శ్రీ శంకరపాదులు వహ్ని మత పద్ధతిని విని,

'అగ్ని దేవోపాసకులారా! అగ్ని దేవతలందరి కంటె తక్కువవాడు దేవతలు మధ్యమముగను, విష్ణువు అందరి కంటె గొప్పవాడుగను చెప్పబడినది.

పైగా అగ్ని దేవతలందరకు హవిస్సు తెచ్చి ఎవరి భాగం వాళ్ళకు అందిచ్చేవాడుగను కర్మదేవతగను ఉన్నాడు. అగ్నిదేవుని గురించి చెప్పబడే వాక్యము లన్నియు ఆత్మకు సంబంధించిన వని తెలిసికొనుడు. కావున ఇంతటి నుంచి తత్త్వమును గ్రహించి అగ్నిహోత్రాది సత్కర్మలు చేస్తూ విష్ణుదేవుని ఉపాసించుడు. అప్పుడు జ్ఞానార్జనకు అవకాశం లభించి తద్వారా ముక్తిని బడయగలరు.' అని నిజస్థితిని తెలిపిరి.

అంతట అగ్నిమతస్థులు శ్రీశంకరుల సుభాషితముల ఆంతర్యం గృహించి అద్వైతమతము నవలంబించి శ్రీఆచార్యస్వామివారికి శిష్యులయ్యారు. పిమ్మట సౌరమతస్థులు శంకరులకు తమ మతప్రభావమును వ్యక్తం చేయ నుద్యుక్తులయ్యారు.

## 5.17 సౌరమతస్థులు

సూర్యుని ఉపాసించువారిని సౌరమతస్థు లందురు. సూర్యునకు ప్రీతికరమైన రక్త పుష్పమాలికలను ధరించుకొని భాస్కరచక్రాంకితములను వేసికొన్నవారు వచ్చియున్నారు. అందు భాస్కరు డనుపేరు గలవాడు లేచి,

“ఆచార్యస్వామీ! నమస్కారములు! అన్ని మతముల కంటె బహు శ్రేష్ఠమైన మా మత మెట్టిదో వినండి. ఎవరి మట్టుకు వారు, వారి మతమే గొప్పదని చెప్పుకొన్నను, అందున్న రహస్యమును తెలిసికొనిన గాని నిజం తేలదు.

శ్రుతిలో సర్వలోకములకు సూర్యుడు నేత్రమై ప్రకాశించుచున్నాడని తెలుపబడి యున్నది కదా. ఆతడే త్రిమూర్త్యాత్మకమై సృష్టి స్థితి లయములకు కారకుడై యున్నాడు. ఆదిత్యుడే పరబ్రహ్మమని వేదములు పల్కుచున్నాయి. సూర్యోపాసకు లందరు వేదమందున్న సూర్యమహామంత్రాన్ని (శ్రీఘృణి సూర్య ఆదిత్య) జపిస్తూంటారు. రక్తచందనం తిలకముగ ధరించి, ఎఱ్ఱటి పుష్పమాలికలను అలంకరించుకొనెదము. మా సూర్యోపాసకులు ఆరు

రకములుగా నున్నారు. (1) ఉదయభాస్కరుని బ్రహ్మగా భావించి ఉపాసించువారు, (2) మిట్టమధ్యాహ్నపు సూర్యుని ఈశ్వరునిగను లయకారునిగను భావించి పూజించువారు, (3) సూర్యాస్తమయ భాస్కరుని సర్వరక్షకుడైన విష్ణుమూర్తిగ ఉపాసించువారు, (4) త్రిసంధ్యల యందున్న భానుని త్రిమూర్తిగా భావించి అర్చించువారు,(5) సూర్యుని గగన మండలంలో ఎచ్చోటనైనను చూచుటే ప్రధానంగా గలవారు, వీరలు సూర్యదర్శనం చేయకుండ భోజనం చేయరు. ఎప్పుడు కన్పించిన అప్పుడే భుజించువారు. కన్పించు వరకు ఉపవసించెదరు, (6) నుదుటను భుజములయందు వక్షస్థల మందు, సూర్యమండల చిహ్నములను అంకితం చేసికొన్నవారు, అను ఆరు శాఖలవారు అనుక్షణము సూర్యమంత్రమును జపించుకొందురు. ఇది మావిధి విధానము, ఇందులకు శ్రుతి ప్రమాణము లనేకము లున్నవి. పురుషసూక్తమందు భానుని గురించియే స్తుతించబడి యున్నది. 'పురుషం కృష్ణపింగళమ్' అని రుద్రమంత్ర మందు ఆదిత్యుని తెలియజేయుచున్నది. ఇట్లనేక ప్రకారముల శ్రీసూర్యదేవుని తెలియ జేయుచున్నందున మా కారాధ్య దైవ మయ్యాడు.

అరుణ, సూర్య, భాను, చంద్ర, తపన, మిత్ర, హిరణ్యరేత, రవి, అర్యమ, గభస్తి, విష్ణు, దివాకర అను పంద్రెండు పదములతో విరాజిల్లుచుండుటచే ద్వాదశా దిత్యుడను బిరుదు పొంది యున్నాడు ఆ నామములలో విష్ణునామ ముండుటచే సూర్యుడే విష్ణువై యున్నాడనుట నిర్వివాదము. శ్రీకృష్ణపరమాత్మ పంద్రెండుగురు ఆదిత్యులలో విష్ణువును నేనే యని యనుటకు కారణమైనది. జ్యోతులలో కెల్ల కిరణా (దాతా, అర్యమా, మిత్రుః వరుణః ఇన్ద్రః వివస్వాన్, పూషా, పర్జన్యః అంశుః భగః త్వష్టా, విష్ణుః అనునది మరియొక పాఠము)లతో కూడిన రవిని నేనే (ఆదిత్యానా మహం విష్ణుర్జ్యోతిషాం రవి రంశుమాన్) అని యుండుటచే రవిని శ్రీకృష్ణపరమాత్మగా తెలిపియున్నారు. కనుక బ్రహ్మాది దేవతలందరు

రవి నుండి ఉద్భవించారు. సమస్త విషయములకు కారణభూతుడగుట వలన మోక్షకాములందరు సూర్యభగవానుని ఆరాధించితీరవలెను’ అని వ్యక్తం.

శ్రీశంకరాచార్యస్వామి సౌరమతభావములను పూర్తిగా విన్నారు. సౌరమత మందు గల లోపాలను సవరించ నెంచి,

‘దివాకరా! మీ రందరు ఒక చిన్న విషయమును తెలిసికొన లేక చిక్కులలో పడియున్నారు. ‘చంద్రమా మనసో జాతః చక్షో స్సూర్యః’ అని యున్నది గదా! అనగా పరాత్పరుని మనస్సునుండి చందురుడును నేత్రమునుండి సూర్యుడును పుట్టియున్నారు. అని వేదవే ప్రమాణమైయున్నది. ‘యజ్జన్యం తన్నశ్యమ్’ పుట్టినది నశించునదే గదా! సూర్యుడు పుట్టిన వాడాయె. కనుక ఆతడును నశించువాడే. నశించు వాని యందు బ్రహ్మత్వ మెట్లుండును?

మరియొక విషయము నాలకించుడు. గాలి వీచుచున్నది. సూర్యుడు నిత్యము ఉదయించుచున్నాడు. అగ్ని వెలుగుచున్నది. దేవేంద్రుడు స్వర్గమును పరిపాలిస్తూన్నాడు. మృత్యువు పరుగులు వారుచున్నది. వీళ్ళందరు పరాత్పరుని ఆజ్ఞకు బద్ధులై వాళ్ళ వాళ్ళకు నియమింపబడిన పనులు నెరవేర్చుచున్నారు. అట్టి పరిస్థితులలో సూర్యుణ్ని భగవంతుడని యనడం మూఢత్వం కాక మరేమున్నది! పరమాత్మకు అపారమైన ప్రకాశమున్నది. ఆ ప్రకాశములో ఇతరు లెట్లు ప్రకాశింప గలరు ? పరమాత్మను అనుసరించి మిగిలిన వన్నియు ప్రకాశించుచున్నవి. అప్పుడు సూర్యుడు పరబ్రహ్మ ఎట్లగును? జ్యోతిషశాస్త్రమందు సూర్యుడు మొదలయిన వారికి నిత్యత్వము లేదని చెప్పబడినది. బ్రహ్మ ఉదయకాల మందు దేవతలందరు పుట్టుచున్నారు. బ్రహ్మ దినాంతమందు వారందరు లయమగుచున్నారు. ఈ రెండు కల్పముల కాలము బ్రహ్మకు ఒక దిన మగుచున్నది. అట్టితరి

అందరికీ మూలకారణత్వం సూర్యునకు అంటకట్టడం న్యాయం కానరాదు. కావున పరమాత్మనే ఉపాసించుడు. మీ పాషండ చిహ్నాలను విడనాడి సదాచారములను అలవరచుకొనండి. పరమ పవిత్రమైన ఆత్మతత్త్వమును తెలిసికొనండి. జ్ఞానము నార్జించుకొని ముక్తిని పొందుడు.' అని ఉపదేశించారు ఆచార్యపాదులు.

శ్రీ శంకరాచార్యస్వామి సౌరమత లోపాలను ఏరివేయుటతో దివాకరాదులందరు సంతోషించిరి. నాటితో సౌరమతమునకు నీళ్ళు వదిలి అద్వైతమతము నవలంబించి శ్రీ శంకరపాదులకు శిష్యులై బహుభంగుల కీర్తించారు.

శ్రీ శంకరపాదులకు అప్పటికి మూడు వేలమంది శిష్యులున్నారు. జగద్గురువులయెడ గాఢమైన భక్తి కలుగ కొందరు శంఖములు పూరించిరి. మరికొందరు దివ్యమంగళ ధ్వనులు గావించారు. కొంద రేకకంఠంతో స్వస్తివాచకములు పలికారు. మరికొందరు కరతాళధ్వనులు చేసారు. శంకరుల కిరు పార్శ్వములం దుండి వింజామరలతో వీచుచున్నారు. మిగిలిన వారు నెమలిపింఛములు ధరించారు ఆనందం పెల్లుబుకునట్లు సకలోపచారము లర్పించేవారు. అట్లు శిష్యకోటి అర్చించుచున్నను కించిత్తైనను భోగములను అనుభవించక తామరాకు మీది నీటిబిందువు పగిది యుండెడివారు శ్రీ ఆచార్యస్వామి. నెలరోజు లయినతోడనే సుబ్రహ్మణ్యక్షేత్రం వీడి శిష్యకోటితో గణవర పురమునకు ప్రయాణమైనారు.

## 5.18 గాణాపత్యులు

సుబ్రహ్మణ్యక్షేత్రమున అద్వైతమతప్రచారము చేసి బహు మతములలో నుండిన లోపములను తెలియజేసి వారల నందరిని సంతుష్టులం జేసి అద్వైతమతము నవలంబింపజేసి ప్రసిద్ధి కెక్కిన గణవరపురము ప్రవేశించారు శంకరాచార్యస్వామి. ఆ పురమందున్న గణపతి ఆశ్రమంలో బసచేశారు.

అచ్చట కౌముది యను పేరు గల నది పారుచున్నది. అందు వారందరు స్నానాదు లాచరించి విఘ్నేశ్వరాలయమునకు జని గణపతిని దర్శించి షోడశోపచారములతో నర్చించారు.

అచట వారంద రొక నెలదినము లుండి ఆ ప్రాంతమందు ఆచరణలో నుండిన మతవిధానములను తెలిసికొని అందుగల లోపములను ప్రేమతో తెలియజేసి సవరించుచు నిజతత్త్వమును బోధించుచు అద్వైతమతస్థాపన చేసారు. పద్మపాదాదు లందరు పంచాయతన పూజా పరాయణులైరి. శిష్యబృంద మంతటికిని ఆహారపదార్థములు తయారు చేయుటకు శంకరశిష్యులలో నొకడైన హరలబలుడను వాడు ఏర్పాటు గావింపబడ్డాడు. పద్మపాదుడు గురువులను యథావిధిగా పూజించుచు భిక్ష నొసగువాడు. ఏ లోపము లేకుండ శిష్యులందరు మృష్టాన్నభోజనముతో తృప్తి పడుచుండెడివారు.

సాయంకాలమందు ప్రతి శిష్యుడు ద్వాదశ సాష్టాంగవందనము లర్పించేవారు. శిష్యులు జగద్గురువులను వే విధాల స్తుతించుచు ఢక్కా మొదలయిన మంగళవాద్యములు మ్రోగించుచు, కరతాళధ్వనులు సల్పుచు లయానుకూలంగా నృత్యములు చేయుచుండెడి వారు. ఆవిధముగ శ్రీశంకరావతారమూర్తిని శ్రద్ధతో, భక్తితో, ఆనందపరవశులై కొలుచుచుండెడివారు. 'సకలలోకములకు కారణభూతుడు, త్రిగుణాతీతుడు, చిదానందుడు, అగమ్యుడు, సత్యస్వరూపుడు, (ప్రపూర్ణాహం, బ్రహ్మోహం) పరిపూర్ణ బ్రహ్మను నేనే, అట్టివాడు సంసార లంపటములో పడిపోక శాశ్వతానందమును పొందుచున్నాడు' ఇట్టి వాక్యములు ఉచ్చరిస్తూ మహానందమును పొందే వారు శిష్యులు ఆ విధానము నంతను గణవరపురవాసులు చూచి వింత పడేవారు, కొందరి కది శంకరుల మీద అనుమానము కలిగించినది.

గణవరంలోనున్న గణపతిమతస్థులు శంకరులశిష్యులు చేయుచున్న నృత్యములు మొదలైనవి చూడగా ఆచార్యపాదులు ప్రబోధచేయుచున్న అద్వైతమతం వారికి నచ్చలేదు. వారందరు శంకరులతో సంభాషించ దలచి యొకనాడు శంకరులను కలిసికొన్నారు. అందొకడు,

'శంకరాచార్యస్వామీ! వందనములు ! మీరందరు అద్వైతమతము నవలంబించి ఈలాటి కోలాహలంలో మునిగి యుండ చూడగా తెలివైన వాళ్ళు మీ మతమును గౌరవించెదరా? వాకునకు, మనస్సునకు అందరాని పరమాత్మను ద్వైతం కాదని, అద్వైతమని మీరింక లోకాని కెట్లు నచ్చ చెప్పగలరు? కనుక వెంటనే మీ మతమును విడనాడి మా మతము నవలంబించుడు. మాది గాణాపత్యమతం. ఇది వేదములకు గౌరవకరమైనది. ఇందు పరమశాంతి లభించును. స్థిరమైన మోక్షము నిచ్చునది. దీని నాచరించుటకు అవరోధము లెందునా కానరావు. గణపతి మహాదేవుని అనన్య చింతన జేయుచు, గణపతి మహామంత్రమును జపించుకొనుచుండిన, తప్పక మోక్షము లభించును, ఆయన గొప్పతనం అనంతమైనది'.

గాణాపత్య మతపద్ధతి శ్రీశంకరపాదులు విని అందుగల లోపాలను ఈ విధంగా చూపించారు:

'గాణాపత్యులారా! మీ మతమందుగల లోపమును గ్రహించ లేకుండుట విచారకరము. విఘ్నేశ్వరుడు ఈశ్వరునికి కుమారుడని లోకానికి సువిదితమే గదా! అప్పట్టున కుమారుడు కారకు డెట్లుగును? మీ విధానము నిరాధారము. ఎన్ని వాక్యములు పలికినా ఎన్నినామము లున్నా అవన్నియు పరబ్రహ్మకే చెందుచున్నవి' అని వివరించారు.

పిమ్మట హరిదా గణపతిమతస్థులు క్రోధంతో తమ మతధర్మాలను ఏకరువు పెట్టసాగారు.

గాణాపత్యులలో హరిద్రాగణపతి మతస్థులు ఒక అంతశ్శాఖ. శ్రీ శంకరులు గాణాపత్యులను కాదనడం, వాళ్ళందరు శంకరుల మతంలో లీనమైపోవడం కండ్లార గాంచి సహించ లేకపోయారు హరిద్రా గణపతి మతస్థులు. తమ శాఖకు అది యొక గొడ్డలిపెట్టుగా భావించి బాధపడి, గణకుమారుడను నాతడు ఆవేశంతో లేచి చరచర నడచి శ్రీ శంకరపాదులను చేరి,

"యతివరా! ఏ కార్యమును తలపెట్టినా ముందుగా గణపతినే పూజించాలి గదా! దేవతలకు గురువైన బృహస్పతి మొదలైన వాళ్ళను ఆదేశిస్తూంటాడు. బ్రహ్మ మొదలయిన దేవతలకు ప్రభువై బ్రహ్మను రక్షించుచుండును. కనుక అతడే జ్యేష్ఠుడు. అట్టి వానిని ఉపాసించవలెనని వేదములు పలుకుచున్నవి. ఆతడే పూజింపదగినవాడు. అందువలన సమస్తమైన దేవతలు, త్రిమూర్తులు, గణపతిదేవుని పూజిస్తూన్నారు. యతీశ్వరా! గణపతిదేవుని ఏవిధంగా ధ్యానించవలెనో స్కాందపురాణమందు వివరించబడి యున్నది'

కరుణామయు డగు శ్రీజగద్గురువులు గణకుమారునితో అన్నారు

'గణకుమారుడా! నీవాడిన మాట లట్లుంచు. పరమేశ్వరుడు అనంతకోటి పేర్లతో పిలువబడుచున్నాడు. గణాధిపతి యనునది సమస్తలోకాలను సృష్టించు పరమాత్మకే చెందవచ్చును. పరమాత్మ కంటె బ్రహ్మాది దేవతలు వేరు గాదు. వారందరు పరమాత్మయొక్క అంశ గలవారలే! రుద్రునికంటె గణపతియు వేరు గాదు. సర్వవిఘ్నములను నిర్విఘ్నంచేసే సర్వాంతర్యామి గణపతి రూపంలో నున్న పరమాత్మను ఉపాసించవలసినదే! బ్రాహ్మణులందరు గణపతి మొదలయిన పంచదేవతలను యథావిధిగా నుపాసించవలసినదే! ఇంక గణ పతిచిహ్నాములైన తుండం, దంతం మొదలైన చిహ్నాములను శరీరములను కాల్చి అంకితములు చేసికోవడం పాషండ

లక్షణ మగును. కనుక అద్దానిని విడనాడి పంచాయతన పూజలు సల్పుకొనుచు అద్వైతతత్త్వజ్ఞానము నార్జించుకొందురేని ముక్తి తప్పక లభించును.' అని వివరముగ బోధించారు.

అంతట గణకుమారుడు మొదలైనవా రందరు శ్రీశంకరపాదుల కరుణారసపూరిత రహస్యబోధలను విని, తమ మతములోని లోపాలను గ్రహించి, శ్రీశంకరులకు జోహారు లర్పించి సాష్టాంగవందనము చేసి శిష్యులై ధన్యులయ్యారు. పిమ్మట ఉచ్ఛిష్టగణపతి మతస్థుల వంతయ్యింది. గణపతిమతములో ఇంకా నాలుగు అంతశ్శాఖలు గలవు. అందు ఉచ్ఛిష్టగణపతి మతము ఒకటి. వారిలో నొకడు లేచి శంకరుల నుద్దేశించి,

'ఆచార్యస్వామీ! వందనములు! శైవాగమ రహస్యమందు ఆరు విధములైన మతములున్నాయి. మహాగణపతి మతము, హరిద్రాగణపతి మతము, ఉచ్ఛిష్టగణపతి మతము, నవనీత గణపతి మతము స్వర్ణగణపతి మతము, సంతానగణపతి మతము అను నారింట మాది ఉచ్ఛిష్టగణపతి శాఖ పేరెన్నిక గన్నది. మాలో తిరిగి వామ, వామే తర మతము లున్నవి. వామమార్గమునే ఉచ్ఛిష్టమార్గ మంటారు'

శ్రీశంకరాచార్యస్వామి ఆ కుమారుడు వ్యక్తం చేసిన భావాన్నంతా విని, వారికి కూడ హితబోధ చేసారు. పిమ్మట మిగిలిన గణపతి మతశాఖలవారు (నవీన, స్వర్ణ, సంతాన శాఖలు) శ్రీశంకరపాదులతో ముచ్చటించి దోషములను తెలిసికొని తరించారు.

## 5.19 కాంచీపురము

గణవరపురము నుండి శ్రీ శంకరపాదుల తరువాతి మజిలీ కాంచీపురము చేరుకొన్నారు.

**"అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా**
**పురీ ద్వారావతీచైవ సప్తైతే మోక్షదాయికాః"**

భూమి ఏనాడు పుట్టినదో ఆనాట నుండీ కంచి పేరొందిన పురం. కంచి మోక్షపురం. భారతభూమి యందు సప్తమోక్షపట్టణా లున్నాయి. ఇవి కీలకస్థానాలుగా వన్నెకెక్కాయి. పురంపేరు స్మరించి నంత మాత్రాన క్షేత్రమహిమతో సర్వపాపములు హరించి పోవును. ఏనాడు పరాత్పరుడు ఏ విశ్వాసంతో, ఎవరి ప్రేరణతో సప్తపురములకు పునాదులు వేసి యుండెనో ఎవరి కెఱుక? మోక్షపురమును దర్శించ నెంచి ప్రవేశించారు. తీరా కంచిలో కాలుపెట్టుసరికి ఆనందం మఱుగై ఆవేదన చోటు చేసికొన్నది.

కాంచీపురము ఆ నాడు వామాచారులతోను తంత్రవిద్యలతోను మునిగి అడుగిడిన ఏమి కీడు మూడునో యను భయము యాత్రికులకు కలుగుచుండెడిది. కొంతకాలం కంచిలో కానవచ్చే భయానకదృశ్యాలకు వెఱగొంది దర్శించడం మానుకొన్నారు. అట్టి మోక్షపురి శంకరపాదులకు యమపురిగా గోచరించుటచే ఆయనలో జనించిన ఆవేదన పోవు మార్గ మాలోచించిరి. కరుణామయుడు తలంచిన ఏ కార్యము కాకుండును! కంచిలో నున్న వామమార్గా న్ననుసరించిన తంత్రజ్ఞులకు శక్తి లేకుండ జేయడమే వారి ఎంచిన ఉపాయము. అందులకై శ్రీదేవీ దేవాలయమును కట్టించిరి. బహురమణీయమగు ఆ ఆలయములో శ్రీదేవిని ప్రతిష్ఠించి కామాక్షి యను నామ మిడి అర్చనాది పూజలు, సమస్త ఉపచారములు ఏర్పాటు చేసి నిత్యధూపదీపనై వేద్యములు కలుగ జేసిరి. శక్తివంతమైన ప్రతిష్ఠయగుటచే తంత్రాది విద్యలకు ఆ ప్రాంతమున ప్రభావం లేకుండపోయెను.

ఆ మహాపవిత్ర మైన కంచిపురమందే ఒక శివాలయమును నిర్మించి, అచ్చట ఒక పట్టణమును కట్టించి దానికి శివకంచి యనుపేరు పెట్టియున్నారు. అచ్చోటనే యున్న శ్రీవరదరాజస్వామి వారిని ఆశ్రయించి మరి యొక పట్టణము నిర్మించి దానికి విష్ణుకంచి యను నామకరణము జేసిరి. నూతన శివాలయమందున్న శివునకు, విష్ణ్వాలయమందున్న

విష్ణువునకు సర్వోపచారములు గావించుటకు బ్రాహ్మణులను, భక్తులను నియమించారు. శంకరపాదులు కాంచీపుర మం దొక నెల దినము లుండి వేదాంత విజ్ఞాన ప్రబోధము చేయుచుండెడి వారు. వేలాది జనులు వచ్చి వారి బోధలను విని వారలలో కరుడుగట్టుకొని యున్న లోపాలను సవరించుకొనుచు పుణ్యమూర్తులై సుఖముగా నుండెడివారు.

అసహ్యకరమైన కాంచీపురం కన్నుల పండువుగా తయారై మరల స్వస్థానమైన మోక్షపుర అర్హతను సంపాదించుకొన్నది. అచ్చోటు వీడి శ్రీశంకరాచార్యస్వామి శిష్యసమేతముగ తామ్రపర్ణీ నదీ తీరమునకు ప్రయాణమైనారు.

## 5.20 తామ్రపర్ణీతీరస్థులు

శ్రీశంకరాచార్యస్వామి కాంచీపురము నుండి తామ్రపర్ణీ నదీ తీరమును జేరికొనిరి. తత్తీరవాసు లందరు శ్రీశంకరపాదులు వచ్చారనిన వార్త విని తమకున్న సంశయములను నివారణ చేసికొనవచ్చు నని తలంచి శ్రీశంకరచార్యస్వామిని దర్శించి వందనము లర్పించి,

'యతీశ్వరా! ప్రతి వాని యందును భేద మనునది విధిగా అంటి యున్నది. మన శరీరమందే భేద మున్నది. ఈ భేదము ఈ లోక మందే కాదు, ఇతర లోకములలో కూడ స్పష్టముగ కానవచ్చుచున్నది. మానవులు చేసికొనిన కర్మల ననుసరించి పుణ్యలోకములు, పాపలోకములు పొందుచున్నారు. ఈ విధముగ ఇహలోక పరలోకముల యందు భేద మను నది సత్యముగ నున్నది. ఇంత స్పష్టముగ నున్నది వేరొకటి కానరాదు.' అని శ్రీశంకరపాదులకు తామ్రపర్ణీ తీరస్థులు తమ సంశయములను నివేదించుకొనిరి.

శ్రీశంకరాచార్యస్వామి 'బ్రాహ్మణోత్తములారా! నిజమైన విషయములు తెలియక తికమకలు పడుచున్నారు. అజ్ఞానికి సదా భేదమే యుండును.

ఇదంతా బ్రహ్మమయ మని కంటికి కనుపించున వన్నియు నశించు ననియు, చూచేవాడు, చూడబడునది కూడ నాశన మగునని జ్ఞాని దృఢంగా నమ్ముచున్నాడు. అట్టి జ్ఞానికి భేద మనునది లేదు. భేద భావన నశించడమే జ్ఞానోదయం. శ్రీ పరాత్పరుడు లోకములను సృష్టించి అందే ప్రవేశించును. అనగా జీవాత్మరూపంలో ప్రాణులయం దున్నాడు. కనుక ప్రాణులన్నీ పరమాత్మే యగుచున్నవి గదా!

దేవత లెందరని ప్రశ్నించి, అనేకమంది దేవతలలో పరమాత్మ ఇమిడి ఉన్నాడని తేల్చింది వేదమే. కడకు భగవంతు డొక్కడే యని నిర్ణయం చేసింది. ప్రాణ మనినా పరబ్రహ్మ మనినా ఆ దేవాదిదేవునకే చెందుచున్నది. ఆయనే అనేకముగ ఉంటున్నాడు. ఇంక ఆయన కంటె మరి యొకడు లేనే లేడు. పరమాత్మతత్త్వం తెలిసికొనిన వానికి భేద మనునది యుండదు. అట్టి జ్ఞానమును సముపార్జించవలె నన్న పరబ్రహ్మను ఉపాసించవలెను.' అని వివరించి వారల అనుమానమును నిర్మూలించారు.

తామ్రపర్ణీ తీరస్థులు శంకరుల ఉపదేశామృతపానం చేసి సంతుష్టులైనారు. వారందరు శ్రీఆచార్యస్వామికి శిష్యులై అద్వైత తత్త్వజ్ఞానము నార్జించుకొనుచు బ్రహ్మానందమును పొందుచుండిరి శ్రీఆచార్యస్వామి తామ్రపర్ణీ నదీతీరమునుండి ఆంధ్రదేశ సంచారమునకై పయన మయ్యారు.

## 5.21 ఆంధ్రదేశ సంచారము

తామ్రపర్ణీతీరమునుండి బయలుదేరి శిష్యకోటితో ఆంధ్రదేశము ప్రవేశించారు. అచ్చటి విజ్ఞానసంపద శ్రీశంకరపాదులకు ఎఱుకయే. అచ్చటి మతములను సరిదిద్దవలయు ననెడి సమస్య లేకున్నను ఆంధ్రదేశమును దర్శించకుండ విడువడం ఆయన కిష్టం లేకపోయింది. ఆంధ్రమందున్న దివ్యక్షేత్రములను దర్శించి పుణ్యతీర్థములలో గ్రుంకు లిడి, అచ్చటచ్చట ఆగుచు వేదాంతతత్త్వ రహస్యములను విపులపరచి ముముక్షువుల

కుపదేశించారు. శంకరాచార్యులకు ఆంధ్రులు పెక్కు తావులలో అఖండమైన స్వాగతము లిచ్చారు. పండితులు, వేదాంతులు విజ్ఞానసంపన్నులు, మహామహులు శ్రీశంకరపాదుల విజ్ఞానమును వేనోళ్ళ పొగడి, వారిని శ్రీ శంకరావతారమూర్తి యని నిశ్చయించి భక్తిప్రపత్తులను ప్రదర్శించారు..

శ్రీఆచార్యస్వామి శేషాచలం వెళ్ళి అచ్చట వేంచేసియున్న కలియుగ భగవానుడు వేంకటేశ్వరస్వామిని దర్శించి నమస్కారము లర్పించి అనేక పూజలు చేసి పరాత్పరుని అనుగ్రహమును పొంది విదర్భరాజధానీ పురమునకు ప్రయాణ మయ్యారు.

## 5.22 విదర్భరాజు స్వాగతము

దారిలో చారిత్రక విషయము లనేకం శిష్యులకు చెప్పుచుండిరి. నల దమయంతుల కథ స్ఫురణకు రాగా అపూర్వమైన ఆ చరిత్రను వినుపించు నంతలో రాజధానీనగరము చేరువైంది. విదర్భరాజైన క్రథకేశ్వర మహారాజునకు శంకరుల రాక తెలిసి బ్రహ్మానందభరితుడై సపరివారంగా ఎదురేగి ఘనమైన స్వాగతము పలికి సగౌంవముగా రాజలాంఛనములతో రాజధానీనగరమునకు వెంటబెట్టుకొని వెళ్ళారు. శ్రీశంకరపాదులవారికి వారి శిష్యగణమునకు తగిన విడుదు లేర్పాటు గావించి అందు ప్రవేశపెట్టారు. మహారాజు భక్తిశ్రద్ధలతో ఆచార్యపాదులకు యథావిధిగా యతిపూజలు చేసారు.

పురజనులే కాకుండ చుట్టుపట్ల అనేక గ్రామవాసులకు శ్రీశంకరుల రాక తెలిసి వచ్చి జగద్గురువులను దర్శించి వందనము లర్పించి వెడలువారు. చూడవచ్చిన వారిలో భైరవతంత్రజ్ఞులున్నారు. పద్మపాదాది శిష్యులు వారలకు నిజతత్త్వబోధ జేసి వారిమతములో గల లొసుగులను సరిదిద్ది అద్వైతులనుగా జేసెడివారు. శ్రీశంకరపాదులు మహోపన్యాసము లిచ్చెడి వారు. జగద్గురువుల ఉపన్యాసములు విని విజ్ఞులయిన వారెందరో.

కొలదిరోజు లట్లు జరిగిన తరువాత, కర్ణాటక దేశమందు కాపాలికుల ప్రభావం మిక్కుటముగా నున్నట్లు తెలిసికొని అచటికి వెడలుటకు సమకట్టారు. విదర్భాధీశున కా సంగతి తెలిసి మనస్సులో దిగులు నొంది శ్రీ ఆచార్యస్వామిని సమీపించి అంజలి ఘటించి,

'స్వామీ! తాము కర్ణాటకదేశమును దర్శించ తలంచారని వినియున్నాము. అచ్చటంతా కాపాలిక మయమై యున్నది. వాళ్ళందరు కడు క్రూరస్వభావంతో సంచరించేవాళ్ళు అచ్చోట మంచికి తావులేదు. వాళ్ళను ఏవిధంగాను కాదనరాదు. వాళ్ళ ముందర బ్రతకడం కడు దుర్లభం. తామచ్చోట అడుగిడరాదని మామనవి చిత్తగింపుడు! వాళ్ళకు వేదములు విషతుల్యములు. తమయట్టి వారిని  సహించ నొల్లరు. తాపసోత్తమా! తామా తావును తలచకుండ నుందు రని మా ఆశ!' అని వినయపూర్వకంగా విదర్భరాజు  వేడుకొన్నాడు.

అచ్చటనే యున్న సుధన్వమహారాజు విదర్భదేశాధీశు దాడిన మాటలు చెవుల బడినంత,

'స్వామీ! తమ పాదముల కడ నేనుండ ఆలాటి శత్రువర్గభయంతో పని యేల? పామరులయిన వారిని గురించి చింతించ నక్కఱ లేదు. నిర్భయముగ మన మచ్చోటునకు పోగలము! ' అని వచించి ప్రయాణము ఆపు చేయవద్దని అర్థించాడు.

శ్రీశంకరుల యెడ గల అపారమైన భక్తి ఒకరిచే కర్ణాటక దేశానికి ప్రయాణమును ఆపుచేయించ నెంచినది. అట్టి భక్తియే వేరొకరిచేత ప్రయాణమును కొనసాగింపఁ జేసినది. ఇంతకు శ్రీశంకరపాదుల శక్తిసామర్థ్యములను భక్తిగూడ కనుగొన జాలదు. మహనీయుల శక్తి, సామర్థ్యములు మనసున కందరానివి.

## 5.23 క్రకచుడు

శ్రీ శంకరాచార్యులు కర్ణాటకదేశం వస్తున్నారన్న వార్తదేశం దశదిశలు వ్యాపించినది. వారి నెదుర్కొను వారు కాపాలికమతస్థులు మాత్రమే. అట్లెదుర్కొనుటకు వాళ్ళ కున్న శక్తి తంత్ర విద్యయే. వారందరికి క్రకచుడనువాడు నాయకుడు మహోద్దండపండితుడు. అతని మాటకు అడ్డులేక సర్వసేనాధిపతి వలె వెలిగిపోతున్నాడు. కాపాలిక ప్రముఖు లందరు ఒకచో గుమిగూడి కర్తవ్య మాలోచించారు. క్రకచుడు శ్రీశంకరాచార్యుల పుట్టుపూర్వోత్తరాలు ఏమియు నెఱుగనివాడు. తెలిసికొను కోరిక గూడ లేనివాడు. నిర్భయంతో స్వైరవిహారంచేసే మనిషి. అట్టివానికి శ్రీశంకరుల ప్రభావంతో పని యండదుగదా! శ్రీశంకరాచార్యస్వామి దేశదేశాలు ప్రచారంచేసి కుమతములను ఖండించి అద్వైతమతమును ప్రతిష్ఠించి జయభేరిని మోగిస్తూ తమ దేశం ప్రవేశించాడన్నవార్త కాపాలికులకు అశనిపాత సన్నిభమైంది.

స్వయంగా శ్రీశంకరాచార్యులను జూచినవాళ్ళు, ఆయన ప్రభావమును కండ్లార గాంచిన వాళ్ళు కాపాలికులలో చాలమంది గలరు. 'మన మాయన కడకు పోవడమా లేక ఆయనను మనకడకు రప్పించడమా' అన్న సమస్య వాళ్ళను పీడించినది. 'శంకరుడే మన కడకు వచ్చుచుండ మన మాయన కడకు పోనేల?' అని హెచ్చరించాడు కాపాలికమత గురువు.

'వాదంలో మనం శ్రీశంకరాచార్యులను ఓడించడం నీచమైన పని అది కేవలం మన గౌరవానికే భంగకరం. నిర్భయంతో మన మాయనతో బాహాబాహీ యుద్ధమునకు తలపడి జయించడమే పౌరుషం! గౌరవం! అన్నాడు క్రకచుడు.

'మనదేశం ఆయన వచ్చాడు కనుక మన పాదాల కడ వ్రాలినట్లే! అందువల్ల మనం ఆయన్ను సమిపించడంలో తప్పులేదు. మన గౌరవానికి

భంగం రాదు. కావున మీరందరు పోయి ఆయుధములతోను, సాధనసామగ్రితోను తయారై తక్షణం మరలి రండు!' అని క్రకచుడు ఆజ్ఞాపించాడు. అంతలో పరివారమంతా గుర్వాజ్ఞను శిరసావహించి ఆయత్తపడ్డారు.

కాపాలికులు అందరు ధరించే భస్మం కాక శ్మశానవాటికలోని శవభస్మాన్ని ధరించడం వారి కెంతో ప్రీతికరం. ఆ యెముకల బూడిదను దేహ మంతటా ధరించి, చూచే వాళ్ళకు భయంకరంగా వేషం మార్చి తయారయ్యారు. అట్లు వేలాది కాపాలికులు ఒకచేత శూలమును మరి యొకచేత మనిషి పుఱ్ఱెను ధరించి క్రకచుణ్ని తృటికాలంలో చేరుకొన్నారు. అప్పుడు శిష్యగణంతో గురువులకు తగ్గవేషంతో క్రకచుడు నిర్భయంగా రణోత్సాహియై నడచుచున్నాడు. వాళ్ళ మద్యపానం పుట్టుకతో వచ్చినదే. వాళ్ళ ఆరాధ్యదైవమునకు కూడ మద్యం నైవేద్యం పెడతారు. వెంటనే మద్యం సేవించి ఒళ్ళు తెలియని వాళ్ళయ్యారు. వాళ్ళ నడకలో అనేక కలలు కనుచున్నారు. నడక తీరుతెన్నులు తారుమారుగ నుండెను.

'ఎన్ని దేశాలు జయిస్తే ఏం వలక పోసికొన్నాడు! ఈ దెబ్బతో వాళ్ళ పని ఆఖరు! మనలను గెల్చిపోవడం అంటే ఏమిటో రగడా సన్న్యాసి! మన ధాటీకి తట్టుకోవడం మాటలా! కాపాలికులు కాల్చేస్తారన్నది తెలియదు కాబోలు! అని ఎవళ్ళకు తోచినట్లు వాళ్ళు అనేస్తున్నారు.

అంతలో కాపాలికులలో ఒకడు క్రకచుణ్ని చేరి, 'గురువర్యా! శంకరాచార్యులు సామాన్యమానవుడు గాడు. నేనాయనను స్వయంగా చూచాను. సభలో కూర్చునపుడు మహాదివ్యతేజంతో వెలిగిపోతాడు. దేవేంద్రుని కంటె, బ్రహ్మ కంటె, విష్ణుమూర్తి కంటె మిన్న ఐన ఆతనిని జయించడం సామాన్యంగాదు. అది మన వలన గాదు. సభలలో వారివారి మతాలకు శ్రీశంకరపాదులయెదుట గ్రుమ్మరించేవారు. వచ్చిన వారి మతాలవారందరు శంకరాచార్యులకు నమస్కారాలర్పించి శిష్యులయ్యే వారు.

ఒక్క కాంచీపురంలో నే జూచినది పదివేలకు పైబడి యున్నారు. అంత మందిని చూడగా నాగుండె గుభేలుమన్నది. వాళ్ళు మనలను జయించడం కష్టంగాదు.' అని తన అనుభవమును వ్యక్తంచేశాడు.

ఆమాటలు క్రకచునకు ములుకులై తోచగా తోకత్రొక్కిన త్రాచు వలె లేచి,

'మీ వంటి పిరికిపంద లున్న సిగ్గుచేటు! మనపాలిట ఆ భైరవు డుండగా, నేనుండగా వాళ్ళ మదమెట్టిదో మీరే చూచెదరుగాక ! మనచేతులలో వాళ్ళ బ్రతుకు లీనాటితో సరి! విద్యావాద మనుకొన్నా రేమో! మనది మేటి తంత్రవిద్య యని వాళ్లకేమి యెఱుక! నేడు మన భైరవస్వామికి తగిన ఆహారం లభ్యం కాగలదు! ఇంతకు మించి మనకు కావలసిన దేమున్నది? మీరు సర్వ సిద్ధంగా ఉండుడు! అని పరివారమును హెచ్చరించాడు.

శ్రీ శంకరపాదులున్న తావు తెలిసికొని క్రకచుడు సేనావాహినితో బయలువెడలి శంకరులను చూచాడు. వారు శిష్యబృందంతో తత్త్వవిచారణ సలువుకొనుచున్న సమయమది. క్రకచుడు శంకరులకు దగ్గరగా నిలబడి, 'నీవేనా! శంకరాచార్యుడవు? కుటిలుడా! చాలా అధముడ వని వినియున్నాం! లోకాలను మాయచేయాలనే తలపుతో దొంగమతము నొక దానిని కల్పించుకొని దేశాలు తిరిగి ఏలుతున్నావట! అదేమిటో వచ్చి చూద్దామని తలచాం మా తలంపు తడవుగా మాకళ్ల పడ్డావ్! నీవేనా ఆ మనిషివి! నీవున్నూ భస్మాన్ని ధరించావు! బాగు! ఈ మట్టి పాత్ర ఏమి? భైరవుని పూజ లేదా నీకు? రక్తసిక్తమైన మానవుని పుఱ్ఱెను ధరించి మద్యంతో మా భైరవుణ్ని పూజించకున్న దేవుడు నీకేలా ప్రత్యక్షమగును? నీకు ముక్తి దొరక నక్కరలేదా? ఈ ఊరు కాదని ఆ ఊరు. ఆ వూరు కాదని ఈ యూరు' ఇట్లా ఎందుకు తిరిగుతావ్? ముక్తి కావాలన్న మామతంలో జేరు! చేరితివా! ముక్తి వచ్చితీరుతుంది! అని మదోన్మత్తుడై ఉపోద్ఘాతం ఇచ్చాడు.

క్రకచుని మదోక్తులు శ్రీశంకరపాదులు విని పరమశాంతులైనారు. కాలుచున్న కట్టె దూరమైన కట్టెను ఏమిచేయ గలదు? క్రకచుని దుర్భాషలు శంకరుని ఏమియు చేయజాలకపోగా కాపాలికుల యెడ కరుణ కలిగింది. సుధన్వమహారాజు క్రకచుని ప్రలాపములు విని వాడా సభలో నుండగూడదని భావించి సభలో నుండి దూరముగ గొనిపోవుటకు ఏర్పాటు చేశారు. వారట్లు చేస్తోంటే క్రకచుని పెదవులు అల్లల్లాడిపోయినవి. నుదురు కత్తినాటు వేసినను రక్తం లేనట్లై పోయినది. అది పరాభవముగా భావించాడు క్రకచుడు. కోపం పుట్టుకొచ్చి ఉగ్రుడైపోయాడు. కండ్లు మూసికొని వెనుకకు వంగి మంత్రపూతంగా భైరవధ్యానం చేశాడు. అంతలో చేతనున్న కపాలంనుండి పుట్టెల దండ బయటకు రాగానే దాన్ని ఇష్టదైవం కంఠాన ధరించి అగ్నిజ్వాలలను బోలు జటలు, శూలం మొదలైన ఆయుధములు ధరించి వికృతాకారంలో మహాట్టహాసం చేస్తూ క్రకచుని యెదట సాక్షాత్కరించాడు కాలభైరవస్వామి. తన స్వామి ప్రత్యక్ష మవడం చూచాడు. తలవంచి నమస్కరించాడు.

'ప్రభో! మీ భక్తుల నందరిని సర్వనాశనం చేయ సమకట్టిన దొంగసన్యాసి ఈతడు! మామతమును మంటగల్ప సిద్ధమైనాడు. మా మా ఆయుధములను నాశనం చేయించిన దుర్మార్గుడీతడు! ఈనాడు మే మెన్నో బుఱ్ఱలు మీ కాహార మొసంగ దలచిన మా ప్రయత్నం వృధాచేసిన ద్రోహి ఈతడు! మీ యండ మాకు లేకున్న మేమందరం ఒక్కక్షణంలో చచ్చిపోయి యుండే వాళ్ళము ! కావున కరుణించక ఈ పాపుణ్ని భస్మంగావింపుడు!' అని క్రకచుడు ప్రార్థించాడు.

కాలభైరవస్వామి క్రకచుని పలుకులు విని ఒక చిరునవ్వు చిందించి,

'క్రకచా! ఈ యతిపుంగవుడు మదీయాంశసంభవుడు! అవతారమూర్తి! అట్టి వాని మీదనా నీ యపకారబుద్ధి! ఎంతటి ఘోరబుద్ధి! నీచుడా! నిన్నిట్టి

స్థితిలో నుంచుటే తప్పు! నేటితో నీశక్తి, తంత్రము, నా అనుగ్రహము ఆఖరు!' అనేసి కాలభైరవుడు నృత్యం చేస్తూ

శ్రీశంకరావతారమూర్తి భక్తితో నమస్కరించి అనేక విధముల కొనియాడి,

'స్వామీ! బ్రాహ్మణులు వేదవిహితమైన కర్మల నాచరించు విధి గలవారలు. అట్లొనరించిన ధర్మం అభివృద్ధినొంది పాపములకు తావుండదు గదా! ఈవిధమైన ఉపదేశములను చేయుచుండ మీ భక్తు డుగ్రుడై, కర్మ చేయరాదని, వేదములను నమ్మరాదని ఇంకను అనేక కఠినోక్తులు పలుకుచుండ సభవారు సహించలేక సభనుండి దూరముగ తీసికొని వెళ్ళిరి. అందులకు మిమ్ములను ఇచ్చటకు రప్పించాడు.' అని అన్నారు.

'యతివర్యా! నీవు ఆవతారపురుషుడవు గదా! దుష్టమతాలను ఖండించి, మంచిమార్గంలో పెట్టుటకు శంకరుడే నీవై యవతరించి నటుల వీళ్ళకెట్లు తెలియును? సర్వజ్ఞుడవై లోకవంద్యుడవై వెలుగొందు నీకసాధ్యమేది! పురుషోత్తమా! తా మనున దంతా ధర్మసమ్మతమే గదా! తా మాచరించున దంతయు నే చేసినట్లే కదా! ఇందులకు సంశయమేల? మంత్రబద్ధుడ నగుటచే ఇచ్చోట ప్రత్యక్షమైతిని, ధర్మం కొఱకు కాదు. ఈ కాపాలికులను కరుణించి బ్రాహ్మణాచారతత్పరులను జేయుమా!' అని వెల్లడించి కాలభైరవు డంతర్ధాను డయ్యెను.

కొందరు కాపాలికులు పారిపోగా మిగిలినవారు బహు కొద్దిమంది మాత్రమే. వారందరు కాలభైరవు డాడిన పలుకులు విన్నారు. తమ ఉపాసనాదైవ మాడిన మాటలు కాదందురా? పైగా వాళ్ళందరు గజగజలాడి మరియొక దిక్కు లేక శంకరుల కాళ్ళపై బడి అనేకవిధముల బ్రతిమాలుకొనిరి.

శ్రీ శంకరాచార్యునిలో ఇముడ్చుకొనగల శక్తి ఎంత ఉన్నదో చెప్పజాలనిదియైనా దాన్ని సముద్రంతో పోలుస్తారు. అందులకే దయా

సముద్రుడన్నారు. పద్మపాదాది శిష్యులను రావించి కాపాలికులకు ప్రాయశ్చిత్తం చేయించి పవిత్రులను జేయమన్నారు జగద్గురువులు. అదంతా పూర్తిగావించి వేదవిహితమైన కర్మకాండను చేయమని ఉపదేశించి పంచపూజావిధానము నాచరించమని చెప్పిరి. వారలట్లొనరించి శ్రీఆచార్యస్వామివారి శిష్యగణంలో జేరిపోయారు. అంతలో ఉన్మత్తభైరవుడు శ్రీశంకరులతో మాటాడ తలంచాడు.

## 5.24 ఉన్మత్తభైరవుడు

కాపాలికుల దురవస్థ చూచాడు. తన మతమును నిలువబెట్టుకొను నుద్దేశం కలిగి ఉన్మత్తభైరవుడు మెల్లగ శ్రీ శంకరాచార్యస్వామిని సమీపించి,

"యతి వరా! నామాటలు తాము వినాలి. వినకుండ నన్ను కాదని గెంటివేయకండి! తామంగీకరించినా తమ శిష్యులు అంగీకరించకపోవచ్చు. అందుకు నా కభయ మిస్తే నాగోడు పూర్తిగా వినిపించెదను. అప్పు డాలకించెదరు గాక !" అని చెప్పగా శ్రీ శంకరాచార్య స్వామి వల్లె యని భైరవుని పలుక మన్నారు. అంతటాతడు,

"యతీశ్వరా! లోకంలో మామతమే నీచమైతే మరి యేమతమునకు గొప్పతన మున్నది? ఇతర మతములలో ఫలిత ముందనెదరా? బ్రాహ్మణమతం చాల గొప్పదని కొందరు తలంచి వాళ్ళ మతం విడచిపెట్టి నాశనం కాలేదా! బాహ్మణ జాతి యనగా మంచిదని భావించకండి. అందు మాకేమి లాభం కన్పించడం లేదు. శరీరములన్నీ పంచభూతములతో తయారు కాబడ్డవే. బ్రాహ్మణ శరీరములు ప్రత్యేకం బంగారంతో తయారు కాలేదే! పక్షపాతబుద్ధితో జాతులు లేవదీసినా డెవడో! ఏనాడూ లోకంలో ఇన్ని జాతులు లేవు. రెండే రెండు జాతులున్నవి. పురుషులని, స్త్రీలని అంతే. ఇవి ఎందులకొరకేర్పడ్డవి? ఆనందమును అనుభవించుటకు మాత్రమే ఏర్పడినవి. స్త్రీపురుషుల సంయోగ క్రీడలో ఆనందం ఉద్భవిస్తుంది.

అందులో స్త్రీలకు ప్రత్యేక ప్రాధాన్యము ఏర్పడింది. ఈ విషయం ఔనా కాదా యని తర్కించనవసరం లేదు. స్త్రీపురుషులకు విధినిషేధము లుండకూడదు. ఉంటే స్వేచ్ఛకు భంగవమే కదా! స్వేచ్ఛ తీసివేసి ప్రతిబంధకములు సృష్టిస్తే మేమందులకు అంగీకరించము. స్వేచ్ఛ లేనినాడు ఆనందము ననుభవించుటకు అంతరాయమే కదా! ఇందులో తప్పు పట్టుకొనుటకు ఏమున్నది? ఒండొరుల చర్మ సంయోగ క్రియే గదా! కావలసినది ఆనందానుభవం. అట్టి ఆనందమును అనుభవించడమే మోక్షమనుచున్నారము. ఈ శరీరం విడచిన వెంటనే కాలభైరవుణ్ని కలిసికొనుచున్నాము. అదే పూర్తి మోక్షం ఇందులో అంతా సత్యమే' అని వివరించాడు.

ఉన్మత్తభైరవు దాడిన మాటలు శ్రీశంకరాచార్యులు విని,

'భైరవ! ఆడతగ్గ మాట లాడితివి. నిజం చెప్పెద నాలకించుమా! ఆడవాళ్ళను గురించి ఏవేవో నోటికి వచ్చిన ట్లెల్ల పేలావు. మీ యమ్మ ఎవరికి పుట్టింది' అని ప్రశ్నించారు.

'మా తల్లి దీక్షితుని కూతురు.' భైరవు డన్నాడు.

'సరే! మీతండ్రికి దీక్షిత్వం ఎట్లా వచ్చింది?' శంకరుల ప్రశ్న.

'మాతండ్రికి మద్యమనగ చాల ప్రీతి. తనంతట తానుగ తాగడు. మంచిరకం తాటికల్లు తెచ్చి అమ్ముచుండును. అట్టి తాటి కల్లు అమ్ముచుండును కనుక దీక్షితుడన్నారు. అతని కూతురే మా తల్లి. మా మతంలో మద్యపానానికి దోషం లేదు. సోమయాగం చేస్తే సోమయాజి అయినట్లు మద్యపానం చేసేవానిని దీక్షితుడని యందురు. ఇదేమి తప్పుగాదు. ఎవరికి వప్పచెప్పినను వాళ్ళందరిని ఆనందసాగరంలో ముంచెత్తిస్తుంది మాయమ్మ. ఇవి తప్పుగా భావించరు నాపేరు ఉన్మత్తభైరవుడు. మాతండ్రి సురాకరుడు. ఆయనకు గొప్ప పేరు గలదు.

మా తండ్రి కడకు జ్ఞానులు వచ్చు చుందురు. మద్యం వాసన వాళ్ళ కేమి అసహ్య ముండదు. మద్యపాన మనగా మిక్కిలి ప్రీతి గల కులములో పుట్టితిని. మీకు పూజనీయుడను. ఇందు ఇసుమంతైనా సంశయం లేదు.' అని తన గొప్పను వెల్లడించాడు.

శ్రీశంకరాచార్యులు ఉన్మత్త భైరవుని కథ నంతను విని, 'ఉన్మత్త భైరవా! నీవిచట నుండతగవు! నీవంటివారలకు ఉపదేశము చేయరాదు. నీ యిచ్చ చొప్పున సంచరించుమా! బయుటకు పొమ్ము!' అని చెప్పి పంపించారు.

## 5.25 చార్వాకుడు

చార్వాకు డొకడు తన దారిని పోతూండగా శ్రీశంకరాచార్యులు ప్రక్క గ్రామంలో నున్నటుల దెలిసి ఈ క్రింది విధముగ తలపోసాడు.

'ప్రత్యక్షముగ కనుపించునవి దేహము, ఇంద్రియములు. వీటికంటె అతీతమైనది ఏదో గలదని, పైగా అది కనబడదని, దానిని గురించి ఏవేవో ఉపన్యాసము లిచ్చువారు కొల్లలుగ బయలుదేరుచున్నారు. అట్టి వాళ్ళ వలలో మూఢులు చిక్కుకొని పోవుచున్నారు. చూడగ మాకు కొంప మునిగే పరిస్థితి దాపురించునా యేమి? ఇక్కడెవరో యతి యున్నాడట! అతడేమైన తెలివిగలవా డేమొ చవి చూచి కాస్సేపచ్చట ఉండి మాటాడెదను. అతడు తెలివి లేనివాడైన నాదారి నాయదియే.' అట్లు తలపోయుచు శ్రీశంకరపాదులున్న నిండు సభలో ప్రవేశించాడు.

ఒకించుక సేపైన తరువాత లేచి శ్రీశంకరపాదులను సమీపించి, నమస్కరించి, మాటాడుట కనుమతి పొంది,

'యతీశ్వరా! నిజమైన తత్త్వమేదైన యున్నచో నాకు తెల్పెదరా? ముక్తి యన నేమియో వివరించుడు. అదెట్లుండునో, ఎట్లు దొరుకునో వివరంగా చెప్పెదరా? మొదట నేను తెలుపునది వినుడు ఆపైని తాము చెప్పునది చెప్పెదరు గాక!' చార్వాకుడు ఉపస్యసించుటకు అనుమతి పొంది ఇలా అంటాడు.

'శంకరా! మొదట ఈ శరీరము పుట్టినది. జీవుడు కూడ ఆ రూపములోనే యున్నాడు. ఇంత కన్న జీవుడు వేరుగ లేడు గదా! ఇది పరమ ప్రత్యక్షమైనది. ఇట్టి ప్రత్యక్షప్రమాణము గల దానిని విడనాడి కనుబడని దానిని పట్టుకొని ప్రాకులాడడం తెలివి తక్కువ గదా! జీవుడు దేహరూపములోనే ఉండి లయమొందడమే మోక్షమనినారు. మరి యొకటి ఎన్నటికి కాదు, లేదు. నదులన్నియు పోయి సముద్రములో కలియుచున్నవి. తిరిగి వచ్చుచున్నవా? ఎన్నటికి రావు. రాబోవు. అట్లే చచ్చిపోయిన జీవుడు తిరిగి రావడం కల్ల. చావు అనగనే ముక్తి. ఈ రహస్యం మూఢులు తెలిసికొనజాలకున్నారు. చచ్చిన వాళ్ళకు శ్రాద్ధాలు ఆచరించడం, తద్దినాలు పెట్టడం ఎంత బుద్ధిహీనతగా నున్నదో యోచించుడు! నిజంగా చచ్చిన వాళ్ళు వచ్చి తింటారా? ఇదంతా వ్యయ ప్రయాసలుగాక మరేమున్నది? వాళ్ల పేరు చెప్పి తినడమే యగుచున్నది. చచ్చినవాళ్ళకు నరక మనుచున్నారు లేదా స్వర్గ మనుచున్నారు. నరకం భయమట! స్వర్గం సుఖమట! ఆ రెండింటి ప్రభావం తగ్గిపోయిన తర్వాత ఆయా లోకాలనుండి మరలి వచ్చి మానవులై పుట్టెదరట! ఇదంతా కండ్లార గాంచిన వా డెనడైన ఉన్నాడా? ఇదంతా వెఱ్ఱి గాక మరేమున్నది! ఈశరీర ముండగనే సుఖమైనను కష్టమైనను అనుభవించేది. ఆ రెండింటినే స్వర్గనరకము లని అనవలెను. అంతేగాని కనుపించని స్వర్గనరకలోకము లున్న వనిన మూఢులు నమ్మాలి. అట్టి లోకము లున్న వనుట కేవలం కల్పితమే. ఈశరీరం నశించిన మిగులున దేమున్నది? వట్టి బూడిద మాత్రమే మిగిలియుండును. అదైనా నీటిలో కలిసిపోవునదే. ఈలాటి కల్పితలోకములకు వెళ్ళేది ఎవరు? ఎట్లా?

ఇంక శరీరం వేరు, జీవుడు వేరు కాదందురా? కుండ బ్రద్దలైంది. అందున్న గాలి ఎక్కడికైనా పోయినదా? అక్కడే యున్నది. అట్లనే శరీరంపోతే జీవుడక్కడే ఉంటాడు. కనుక 'దేహమే ఆత్మ' అనేది ధర్మం మేమనేది అదే.' అని చార్వాకుడు తన మతమును గురించి ఉపన్యసించాడు.

శ్రీశంకరాచార్యస్వామి చార్వాకుని ధోరణి పూర్తిగా విన్నారు. తత్త్వరహస్యము నొకించుక బోధింప దలచి,

'చార్వాకుడా! ఈశరీరం చనిపోయిన తరువాత వేరొక శరీరం లభించును. మరణించగనే జీవుడు ప్రేత శరీరమును పొందుచున్నాడు. ఆ ప్రేతత్వం విడచి పుణ్యలోకములకు పోవలె నన్న కుమారుడు మొదలయిన వారు వాని నిమిత్తం శ్రాద్ధకర్మ లాచరించాలి. గయ మొదలగు పుణ్యక్షేత్రములలో పిండప్రదానములు మొదలగు పెక్కు దానములు చేసి అందుకు ఏర్పడిన కర్మలు యథావిధిగా చేయాలి. అప్పుడు జీవుడు ప్రేతశరీరమును విడనాడి తాజేసికొనిన పుణ్యపాప కర్మల ననుసరించి ఆయా పరలోకములను పొందుచున్నాడు. అంతే గాని శరీరం నశించడంతో పాటు జీవుడు నశించడు. ఇదంతా ధర్మశాస్త్రాలలో చెప్పబడి యున్నది. నీవన్నది యావత్తు శుద్ధ అబద్ధము. నీకు వివేక మన్నది సున్న.' అని వ్యక్తంచేశారు.

శ్రీశంకరాచార్యస్వామి నిర్వచించిన దంతము విని సిగ్గుపడి తానాచరించే దంతయు వట్టి బూటకమని చార్వాకుడు గ్రహించి శ్రీశంకరపాదుల పాదములపైబడి గోలపెట్టేడు. శ్రీశంకరులు కరుణ కలిగి వానిని విడువక గ్రంథములను మోయుటకు నియోగించి తమశిష్యునిగా జేసికొన్నారు.

## 5.26 పీనకాయుడు

పీనకాయుడను పేరుగల సౌగత మతస్థుడు తన మతమును గురించి చెప్పుకొన దలచి సభలోనుండి లేచి శ్రీ శంకరపాదుల కడకు వెళ్ళి,

'శంకరాచార్యవర్యా! నమస్కారములు ! నిజాన్ని గ్రహించలేక కర్మలాచరిస్తున్నారు. ఈ శరీరమునకు స్నానము, ప్రాయశ్చిత్తము మొదలైన అనేక కర్మలు చేసినను మలంతో కూడిన ఈ శరీరం ఎప్పటికైనా పరిశుద్ధ

మగునా? శరీరం మలంతో కూడియున్నను జీవుడు మాత్రం సదా నిర్మలంగానే యుంటున్నాడు గదా! ఇది అటుండనిండు. చనిపోయిన పిమ్మట వాసనాప్రభావంతో జీవుడు మరల పుట్టుచున్నాడని అంటున్నారు. వాడు చేసికొనిన పుణ్యకర్మ ననుసరించి ధనవంతు డగుచున్నాడని పలుకుదురు. చచ్చిపోవు సమయమునకు ఋణము గాని, కర్మ శేషము గాని యుండదు. అప్పు చేసియైనను మృష్టాన్న భోజనములు చేస్తూ శరీరములను చక్కగ పోషించుకొనుచున్నారు. ఆట్లాచరించిన మోక్షము వస్తుంది!' అని వెల్లడి చేశాడు.

పీనకాయు డాడిన మాటలు శ్రీశంకరాచార్యస్వామి విని 'పీనకాయా! నీవన్నది వట్టి బూటకం ! కర్మఫలమును అనుభవించుటకు పరలోకప్రాప్తి కలుగునని శ్రుతులలోను, స్మృతులలోను పురాణములయందును చెప్పబడియున్నది. కర్మశేషమును మాత్రం అనుభవించుటకు మరల జన్మ ఎత్తాలని కూడ చెప్పబడినది. కావున అజ్ఞానం విడనాడి మంచిమార్గము నవలంబించుము!' అని తెలియజెప్పారు.

అంతట పీనకాయుడు, 'స్వామీ! మరొక్క విషయమును జెప్పెద నాలకించుడు. సుగతుడనే ముని యొకడు లోక మంతయు తిరిగి తిరిగి ఆశ్చర్యము నొందెను. అప్పుడాతని కొక ఆలోచన తట్టినది. మానవుడు తరించవలెనన్న ప్రాణులనే ఉపాసించవలెను.' అని. ఆతడట్లుగనే చేసియున్నాడు. అతడు నా కుపదేశించినప్పు డొక్క విషయాన్ని మరువ వద్దని నొక్కి చెప్పాడు 'జీవహింస చేయరాదు' అన్నదే పరమ ధర్మ మన్నాడు. నన్ను కూడ జీవులనే ఉపాసించమని శాసించాడు. ఆట్లాచరించిన కపాలమోక్షము వస్తుందన్నాడు. అప్పటి నుండి ఆమహానుభావుని ఉపదేశములను మనసార నమ్మి ఆ ప్రకార మాచరిస్తున్నవాడను. యతివరా! కనుక ఆలాటి పరమధర్మం లోకమం దెచ్చటను కానరాకున్నది. ఇది అందరూ ఆచరించుటకు యోగ్యమైయున్నది.' అని తన మతమును వివరించాడు.

శ్రీ శంకరాచార్యస్వామి సౌగతుడు తెలిపిన మతవిధానము నంతను విని, 'సౌగతుడా! నీవన్న ధర్మము నొక్కదానినే పట్టుకొని ప్రాకులాడిన లాభంలేదు. మానవు డింకను అనేక ధర్మము లాచరించ తగియున్నవి. వేదార్థం తెలిసినచో నీ వట్లని యుండవు. యజ్ఞములో జంతువును బలి ఇమ్మని ఒక ధర్మ మున్నది. అట్టి యజ్ఞము వేదవిహీన కర్మల నాచరించువారే చేయుదురు. దానివలన స్వర్గాది పుణ్యలోకవాసము ప్రాప్తించును. ఇందులకు పాషండు లిష్టపడరు.

"వేదనిందా పరాయేతా సదాచార వివర్జితా:

తే సర్వే నరకం యాతి యద్యపి బృహ్మవీర్యజా:

సదాచారమును విడిచిపెట్టినవాడు, వేదాలను నిందించువాడు. బ్రాహ్మణకుల మందు జన్మించిన వాడైనను సరే నరకలోకమును పొందుచున్నాడు, అని మనువు సెలవిచ్చియున్నాడు. కావున బాహ్మణులు మొదలైన కులముల వారందరికి వేదములో చెప్పబడిన ధర్మములు పరమ మాన్యములై వెలయుచున్నవి.' అని తెలియజేశారు.

అంతట చెప్పుకొన దగి యున్నది గానక సౌగతుడు శ్రీ ఆచార్యస్వామి వారి పాదములపై బడి శరణు వేడుకొనియెను. అప్పుడు వానిని పద్మపాదాది శిష్యుల పాదుకలు మోయుటకు నియమించిరి. అంతట నుండి ఆతడా ప్రకారం జేయుచు వారి ఉచ్ఛిష్టాన్నమును భుజించుచు మహాభక్తుడై వెలయుచుండెను.

## 5.27 క్షపణకుడు

క్షపణకుడు తన మతమును వినిపించుటకై లేచి శ్రీ శంకరులను అర్థించెను. అంత శ్రీ జగద్గురువులు అంగీకరించగా క్షపణకుడు నమస్కరించి,

'స్వామీ! మా మత మతి విచిత్రమైనది, శుభదాయిని, ఎల్ల కోరికలను సమకూర్చగలట్టిది, ఏ సమయమున కేమి జరుగుచున్నదో కూడ తెలుపగలదు. త్రికాలముల యందు జరిగినది, జరుగుచున్నది, జరుగబోవునది ఉన్నదున్నట్లు తెలియ జేయును కనుక కాలమే మాకు పరమదైవం పరాత్పరుడు గూడ మా మతమును కాదన జాలడు.' అని తెలియజేసెను.

క్షపణకుని మాటలు ఆలకించిన శ్రీశంకరాచార్యులు, 'క్షపణకా! నీ చేత నున్న వేమి?' అని ప్రశ్నించగా.

'స్వామీ! ఒక చేత నున్నది తురియంత్రము. రెండవ చేతిలోనిది గోల యంత్రము.' అని క్షపణకుడు జాబివ్వగా.

'క్షపణకా! నీవన్నట్లు బాగుగనే యున్నది. కాలమును తెలిసికొనుటలో గట్టివాడివే! సంశయం లేదు! కనుక నన్నాశ్రయించి యుండుమా ! నిన్ను పరీక్షించు తరుణ మాసన్న మయ్యే పర్యంతము వేచియుండుము.' అన్నారు శ్రీశంకరపాదులు. అందులకు క్షపణకుడు సమ్మతించి శ్రీఆచార్యశిష్యగణంతో పాటు ఉండి సమయం కొరకు వేచియున్నాడు. అంతలో జైనమతస్థుడు ఒకడు వచ్చి తన మతవిశిష్టతను వెల్లడించ గడగెను.

## 5.28 జైనమతస్థుడు

క్షపణకుని వేచియుండ మనడం విని జైనమతస్థ డొకడు ఒడలంతయు మలము నలదుకొని గోచీని గట్టిగా బిగించుకొని, శిష్యులను వెంట నిడుకొని, 'అర్హ న్నమ:' అనుచు శ్రీ శంకరులను దర్శించి,

'స్వామీ! మాకు జినదేవుడు ముక్తి నిచ్చును. అందుకొరకై మేమాయనను ఉపాసించెదము. ఆయన సర్వాంతర్యామి. కావున తాము కూడ అయననే పూజించుడు. అందరిలో నుండే జీవస్వరూపము మా దైవము. శరీరం నశించుటతో జీవునకు నిర్మలత్వము వచ్చును. శరీరము సర్వకాలముల యందు మల సహితముగనే యుండును. ఎన్ని స్నానములు చేసినను,

ఎటువంటి శుద్ధు లొనర్చినను ఈ శరీరము అపరిశుద్ధమే కదా! అట్టి శరీరములు పట్టుకొని ప్రాకులాడడం నిరుపయోగము. కావున మా జినదేవుణ్ని ఉపాసించుడు’ అని పలికినంత శ్రీశంకరాచార్యస్వామి విని,

‘జీవుని యొక్క నిజస్థితి నీకు తెలియకున్నది. పైకి కనిపించే ఈ శరీర మొక్కటే జీవున కున్నదని తలంచుచున్నావు. సూక్ష్మశరీరము, కారణశరీరము అను మరి రెండు శరీరము లున్నవి. జీవుడు స్వశక్తితో ఆరెండు శరీరములను దాటి పరమాత్మస్వరూపు డగుచున్నాడు. నేను జీవుడును వేరు గాదు అని తలంచుట అజ్ఞానము. అందు వలన ఈ జీవునకు భేదమేర్పడుచున్నది. అట్టి బుద్ధి నశించి నేనే బ్రహ్మను, మరి యొకటి కాదు. అను దృఢమైన జ్ఞానము కలిగిన ముక్తు డగుచున్నాడు. శరీరం నశించినంత మాత్రం చేత ముక్తిరాదు. అని వివరించారు. జైనుడు శ్రీశంకరపాదులు వచించిన సత్యమును నమ్మి తన మూఢత్వమును పారదోలి శ్రీశంకరాచార్యస్వామిని శరణు వేడ అంత దయామయుడు పద్మపాదాదులకు శిష్యునిగా నొనరించిరి.

## 5.29 శబలుడను బౌద్ధుడు

బౌద్ధమతము నవలంబించిన వారు కొందరు శ్రీ శంకరాచార్య సభలో నుండగా తమ మతమును స్థాపింప నెంచి అందు శబలు డనువాడు లేచి జగద్గురువులను సమీపించి,

“యతివర్యా! నమస్కారములు. తాము చేయు బోధలన్నియు నిస్సారములు. జీవేశ్వరుల కభేద మనుచున్నారు. మానవులకు కొమ్ము ఉందనుట యెట్టిదో ఇదియు నట్టిదే ! మీ వంటి వారిట్లు వచించడం విచారకరం. జీవుడు జీవుడే, పరమాత్మ పరమాత్మయే! ఈ ఇద్దరు ఒకటే అనడం ఎన్నటికి సంభవ మయ్యేది గాదు. చూడగా లోకమునకు తాము ప్రబల శత్రువై కనబడుచున్నారు. ప్రత్యక్షంగా కంటికి గోచరించేది కాదనుట మూర్ఖత గాదా? లేనిది ఉన్నదనుట, ఉన్నది లేదనుట మోసము గాక మరేమి?

ఆత్మ ఒక్కటైనను చైతన్యశక్తితో అనేకరూపములు పొందుచున్నది. ఆయన సర్వాంతర్యామియై అందరిని పాలిస్తూ సర్వదా ముక్తుడై యున్నాడు. నేనే కర్తనై యున్నాను, నేనే ఆనందమయ రూపంలో నున్నాను, అని తలచుకొనుచు ఈశరీర మున్నంతవరకు హాయిగా తనకిష్టమున్నంత వరకు ఉంటూ ఆపైని శరీరమును విడచిపోవుచున్నాడు. అదియే ముక్తి. వేరొకటి కాదు." అని తన మతధర్మమును వివరించాడు.

శ్రీశంకరాచార్యులు బౌద్ధుని పలుకులు విని, "బౌద్ధుడా! సత్యకర్మలాచరించుచు పుణ్యమును సంపాదించు కొనిన వాడు పదునాలుగు ఇంద్రప్రళయములు జరుగువరకు బ్రహ్మలోకనివాసం పొందుచున్నాడు. అగ్నిష్టోమం అనే యజ్ఞం చేసిన వానికి ఇంద్రలోక వాసం లభించును. పౌండరీకమను యజ్ఞము చేసిన సత్యలోక నివాసం కలుగును. ఈవిధముగ ఎవరు చేసికొనిన పుణ్యము ననుసరించి వారికి ఆయా పుణ్యలోకములు ప్రాప్తించును. ఎవరు ఏయే దేవతలను శ్రద్ధతో ఉపాసించెదరో అట్టి భక్తులకు అచలమైన భక్తిని కలుగజేయుదు నని శ్రీకృష్ణపరమాత్మ (శ్లో॥ యో యో యాం యాం తనుం భక్త, శ్రద్ధయార్చితు మిచ్ఛతి తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేన విదధామ్యహమ్॥ భ.7అ21 శ్లో॥) వాగ్దానం చేసియున్నారు. ఇందుల కాధారము స్మృతులలోను, పురాణములలోను గలదు. జీవునకు పరలోకమునకు పోవుట అనునది సదా ఉన్నదే. కాని శరీరం నశించుటతో మాత్రం ముక్తి రాదు. నీ వనునది సర్వకల్ల.

ఎవడు ప్రాణు లందరిలోను తనను చూచునో, తనలో ప్రాణు లన్నిటిని చూచునో ఆతడే విజ్ఞాని. వేరొకడు బ్రహ్మమును పొంద నేరడు. ముక్తి నొందుటకు ఆత్మజ్ఞానమే ఆధారము. ఆత్మజ్ఞానము వలన బంధములు విడివడును. బంధవిముక్తుడే ముక్తుడు. నేను జీవుడను అని తలంచుట అనర్థములకు హేతువు. జీవభ్రాంతి. నేను కర్తను, నేను భోక్తను, నేను బద్ధుడను ఇవి అజ్ఞాన కారణములు. కనుక జ్ఞానమును వృద్ధి పొందు మార్గములు తెలిసికొనుమా!" అని తత్త్వమును వ్యక్తంచేశారు.

శ్రీశంకరపాదుల ఉపదేశామృతమును గ్రోలి పునీతుడయ్యాడు బౌద్ధుడు. అప్పు డనేక విధముల స్తోత్రం చేశాడు జగద్గురువులను. పిమ్మట శిష్యుడై భక్తిశ్రద్ధలు గలిగి నిత్యము గురువులను స్తుతించుచు శ్రీశంకరపాదుల కరుణకు పాత్రుడయ్యాడు.

అట్లు శ్రీశంకరాచార్యస్వామి భాస్కర తేజో విరాజమానుడై కర్ణాటక దేశమంతయు తిరిగి అనేకమతములలో నుండు లోపములను సరిదిద్ది అద్వైతమతమును సర్వత్ర ప్రతిష్ఠించి అనంత శిష్యగణాలతో అనుమల్లపురం ప్రయాణ మయ్యారు.

## 5.30 మల్లారి భక్తులు

కర్ణాటక దేశసంచారం ముగించుకొని శ్రీశంకరపాదులు శిష్యగణంతో అనుమల్లపురం ప్రవేశించారు. ఆ పురమందు నిండా మల్లారిభక్తులే. శ్రీశంకరపాదులు తమ పురం ప్రవేశించిన వార్త దెలిసి కడు భక్తితో దర్శించారు. వారందరు బ్రాహ్మణులు. శ్రీశంకరపాదులకు అనేక నమస్కారము లర్పించి వారికి తగు సదుపాయములు సమకూర్చి బహురీతుల గౌరవించి యతీశ్వరుల కరుణకు పాత్రులయ్యారు. తమ మతమందు మంచి అభిమానం గలవార లగుటచే తా మాచరించు విధానమును జగద్గురువులకు నివేదించి మన్ననలను బడయనెంచి శంకరులను సమీపించి వారిలో నొక పెద్ద,

'యతీశ్వరా! అనేక సమస్కారములు! మా పురం మహాను భావులు మీరు ప్రవేశించుటతో పరమ పవిత్రమైంది! మేమందరం ధన్యులము. స్వామీ! మా పుర మందు పూర్వం మల్లాసురు డను రాక్షసు డొక డుండేవాడు. ఆ రక్కసుడు క్రూరుడై ప్రజలను నానా హింసలు పెట్టుచు స్వైరవిహారము చేసేవాడు. పురజనులు తాళ లేక గోల చేశారు. మా వాళ్ళ ఆర్తనాదం విని కరుణామయుడై మా కష్టములు గట్టు నెక్కించ నెంచి పరమేశ్వరుడు

మల్లాసురుని సంహరించాడు. అందువల్ల ఆ మల్లారి మాకు దేవాది దేవుడైనాడు. అప్పటినుండి మేమా మల్లారిదేవుని, ఆయన వాహనములైన కుక్కలను నిత్యం పరమభక్తితో పూజించుచుందుము. వారి వేషమును మేమందరము భక్తిసూచకముగ ధరించుదుము. మాకు మరియొక దేవుడు లేడు. ఆయన మాకు సకలసంపదలు కలుగ జేయుచుండును. మాకు పరమానందము, పరమసుఖము, ఆ దేవాదిదేవుని దయతో కలుగుచున్నవి. లోకములతోను, లోకేశులతోను ఆయన గర్భము నిండి యున్నది. అందుచే ఆయనను, వారి వాహనమైన శునకములను భక్తితో పూజింతుము. అది మా దృఢ విశ్వాసము. మా కితర సుఖము లనగా కిట్టదు' అని అన్నాడు.

శ్రీ శంకరాచార్యులు మల్లారిభక్తుల విధానము నంతయును విని,

'మల్లారి భక్తుడా! దేవు డొక్కడే. తన మాయాశక్తితో పరాత్పరుడు సర్వప్రాణులను సృష్టించుచున్నాడు. ఆయన కంటె వేరొక దేవుడు లేడు. ఆయనలో నుండి బ్రహ్మావిష్ణు మహేశ్వరు లుద్భవించారు. సర్వలోకములకు, సమస్తజీవులకు, పంచ మహాభూతములకు, సృష్టిస్థితిలయములకు పరాత్పరుడే కారణ మగుచున్నాడు. రుద్రాంశ సంభూతులైన వీరభద్రాదులకు లయమున్నది. రుద్రునకు మాత్రం లయం లేదు. అది ఆయన అధీనమం దున్నది. వీరభద్రాదులకు లయం సాధ్యం కాదు. ఈవిధముగ ఈశ్వరోపాసకులు నమ్ముచున్నారు. పరమేశ్వరుని అంశ వలన రుద్రు డుద్భవించాడు. అట్టివాని నుపాసించిన ముక్తి రాదు. పరమేశ్వరునే ఉ పాసించిన ఆయనే ముక్తి నిచ్చును' అని రహస్యమును వివరించెను.

పురమందలి మల్లారి భక్తులందరు శ్రీ శంకరపాదులు వెలువరించిన విషయము లన్నియు నాకర్ణించి తా మాచరించు చుండిన విధాన మంతయు మహాపాప భూయిష్టమైన దని గ్రహించి జగద్గురువుల నాశ్రయించారు.

అంతట శ్రీ శంకరాచార్యులకు వారిపై కరుణ కలిగి మల్లారి భక్తులకు ముండనములు చేయించి ఒక్కొక్కరిచేత పదివేల మృత్తికా స్నానములు

చేయించారు. మరల ముండనములు చేయించి ఒక్కొక్కరి చేత వందేసి మృత్తికాస్నానములు చేయించి పిమ్మట విధిననుసరించి ప్రాయశ్చిత్త కాండ సలిపి పవిత్రులనుగ జేశారు. అంతటితో మల్లారి భక్తులకు బాహ్మణధర్మము లాచరించుటకు అధికార మబ్బెను. శ్రీ శంకరపాదుల ఆదేశానుసారం వారందరికి పంచాయతనపూజ ప్రవేశపెట్టి ధర్మ శాస్త్రములు చదువుకొనుటకు ఏర్పాటు గావించారు. మల్లారి భక్తులందరు అద్వైతమతము నవలంబించి శ్రీ శంకరపాదులకు శిష్యులయ్యారు. శ్రీ జగద్గురువులు వారల నావిధముగ జేయుటకు ఇరువదిరోజులు అనుమల్లపురంలో నుండిపోయారు. పిమ్మట శ్రీ శంకరాచార్యులు మరుంధ నగరానికి ప్రయాణ మయ్యారు.

## 5.31 విష్వక్సేనాలయము

అనుమల్లపురము నుండి పశ్చిమదిశగా బయలుదేరి మంగళ వాద్యములతో, దారి పొడవున గురువులను స్తోత్రములు చేయుచు, ప్రాంతీయ విశేషముల నరయుచు, శ్రీశంకరశిష్యులు ఆహ్లాదముతో వెంటనంట శ్రీశంకరాచార్యస్వామి మరుంధనగరం ప్రవేశించారు. దేవాలయం లేని గ్రామ ముండదని లోకమనును. తీరా ఈ ఊరు దేవాలయం లేని ఊరని తెలిసికొన్నారు. వెంటనే ఆలయ నిర్మాణమునకు గ్రామవాసుల సహాయంతో వలయు నేర్పాట్లుగావించి, శాస్త్రానుగుణముగ, అందచందాలు తీర్చి దిద్ది గోపురాలయములను నిర్మించి అందు విష్వక్సేనుని ప్రతిష్ఠించారు. ఆలయమునకు తూర్పుదిశగా నొక పాకశాలను నిర్మించారు. ఆలయ ఆవరణలో ఇంకను వలయు మందిరాదులు, ప్రాకారములు నిర్మించారు.

ఆ దేవాలయమున నొకచో శ్రీశంకరాచార్యస్వామి దర్భాసనమును పరుచుకొని సుఖాసీనులై, మనోన్మణీ ముద్రను ధరించి తనలో నుండు పరమాత్మను, లోకము నంతను పరమాత్మగను జ్ఞానదృష్టితో చూచుచు బ్రహ్మానందములో మునిగి యున్నారు. ఆ విధమున చాలకాలము మహాయోగసమాధిలో నుండి జ్ఞానామృతమును ఆస్వాదిస్తూ ఉన్నారు.

మహాయోగిపుంగవులు, జ్ఞానస్వరూపులు శ్రీశంకరపాదు లట్లుండుట జూచి అబ్బురపడి యోగనిద్ర నుండి మేల్కాంచువరకు భక్తకోటి వేచియున్నది.

శ్రీజగద్గురువులు సమాధి నుండి మేల్కాంచుట గని పురమందలి విష్వక్సేనభక్తులు చక్రాంకితములతో ప్రకాశించుచు మునికోలలను ధరించి "యతీశ్వరా! మా మతధర్మములు విని అందుగల విశిష్టతను తిలకించండి. మా మతము అన్నిటి కంటె గొప్పది. వైకుంఠవాసుడైన విష్వక్సేనుడు మాకందరికీ ఉపాస్య దేవుడై వెలయుచున్నాడు. మేమా విష్వక్సేనుని పరమభక్తులమై యున్నాము. యము డనిన మాకు నిర్భయము. ఈ శరీర విసర్జన సమయ మందు వైకుంఠము నుండి విష్ణుభటులు వచ్చి మమ్ములను స్వయంగా వైకుంఠమునకు తీసికొనిపోవుచున్నారు. కావున మా మతము సర్వజనాదరణీయమై యొప్పుచున్నది" అని వినిపించారు.

శ్రీశంకపాదులు విష్వక్సేన భక్తు లాడిన పలుకులు వినుటతో వారల యెడ పరమప్రేమ గలిగి,

"విష్వక్సేనభక్తులారా! మీరాడిన మాటలలో నిజం కానరాదు. విష్వక్సేనుడు శ్రీమన్నారాయణమూర్తి భక్తుడైయున్నాడు. ఆ నారాయణమూర్తి వైకుంఠమునకు ప్రభువు. విష్వక్సేనుని వంటి భక్తులు చాలామంది గలదు. ఎవరి కిష్టమైన విష్ణుభక్తులను పరమదైవముగ భావించి కొలుస్తారు. అందులకు శ్రీమన్నారాయణమూర్తి అనుగ్రహించియున్నారు. ఆవిధముగ విష్ణుభక్తు లందరు పూజనీయులైరి. ఈ విష్ణుభక్తులకు స్వాతంత్ర్య మన్నది లేదు. మీ రందరు వారిని స్వతంత్రులని భావించి పూజించుచున్నారు. అందువలన లాభము లేదు మీకు విష్ణులోకము కావలెనను కోరిక ఉన్నచో శ్రీమన్నారాయణమూర్తినే సేవించుడు. ఆయనే ముక్తి నిచ్చును.

"ఆయనే నేను నేనే ఆయన" అని నిరంతరం మననం చేయుడు. భేదభావం మాత్రం ఉండరాదు. అప్పుడది నిర్గుణపూజ యగును. భేదభావం

లేనివారు తత్త్వజ్ఞానులై ముక్తిని పొందుచున్నారు. గురూపదేశమును పొంది, వారి నుండి అద్వైతతత్త్వ బోధలు వినుచు, ప్రయత్నంతో నిర్గుణధ్యానం చేసి ముక్తిని పొందుడు. మీ మీ బాహ్యచిహ్నములు విడనాడండి.” అని బోధించారు.

విష్వక్సేన భక్తులందరు శ్రీ శంకరపాదుల బోధను విని సంతసించి తమతమ బాహ్యచిహ్నములను విడనాడి, శ్రీ శంకరాచార్యస్వామి చెప్పిన విధముగ అద్వైతమార్గము ననుసరించడం మొదలు పెట్టారు. పిమ్మట మన్మథోపాసకులు వచ్చి తమ మతవిధానమును తెలుపుకొన దొడగారు.

## 5.32 మన్మథ మతస్థులు

మన్మథమతస్థులు ఎట్లైనను తమ మతమును నిలబెట్టుకొన తలంపు గలిగి శ్రీ శంకర దేశికేంద్రులను సమీపించి, నమస్కారము లర్పించారు.

“యతీశ్వరా! మా మతము చాల ప్రసిద్ధి కెక్కి యున్నది. మన్మథుడే మాకు పరమదైవం. ఆయన అందరి హృదయములో భావనారూపముగా సర్వదా వెలయుచున్నాడు. మా మతము చాలా అద్భుతమైనది. మన్మథుడు ప్రతిష్ఠించిన దిది. ఆయన సృష్టిస్థితిలయములకు కారకుడై యున్నాడు. అందువలన ఆయన్ని అందరు ఉపాసించవలెను. మన్మథదేవుడు వక్షస్థలమందు రెండు గుండ్రని భూషణములను దాల్చి అందరిని మోహంతో తన వశం చేసికొనుచున్నాడు. మనస్సును హరించే అద్భుతశక్తి గలిగి వెలుగొందు చుండుట వలననే మన్మథుడను గొప్పపేరు కలిగినది. సుందరస్వరూపముతో నొప్పారు కాంతలతో కామక్రీడా సుఖములను పొందడమే మోక్షమొసగు నని మా దృఢనమ్మకం. మన్మథోత్సవములందు తాము గూడ పాల్గొని అనంతమైన సుఖములను పొందుడు!” అని ఒక మన్మథ మతస్థుడు నివేదించాడు.

శ్రీశంకరాచార్యస్వామి అది విని,

"మన్మథభక్తులారా! సృష్టిస్థితి లయములకు బ్రహ్మవిష్ణుమహేశ్వరులే కారకులు గాని ఇతరులు కారు. త్రిమూర్తులా పనికి నియమింపబడినట్లు శాస్త్రములు తెలుపుచున్నవి. సూర్యునకున్న ప్రకాశము రవిపుత్రున కున్నదా? అదియును గాక స్త్రీలతోటి సహవాసము, పొందుపై మక్కువ గలవాళ్ళకు దూరముగ నుండు మని శాస్త్రములు వచిస్తున్నాయి. అందువలన మీ మతము మతిమాలినది. మన్మథుడు మోక్ష మిచ్చు ననుటకు ప్రమాణములు కలవా? జ్ఞానమార్గమే మోక్షహేతువు" అని బోధించారు. అప్పుడు వారు తమ తమ మతధర్మాలను విడనాడి, పంచాయతనపూజలు ప్రారంభించి, ఇతర సత్కర్మలను నిష్ఠతో అచరించుచు, అద్వైతతత్త్వ విచారణ యందు నిమగ్నులై మన్మథభక్తులందరు శ్రీశంకరపాదులకు భక్తులై సుఖముగనున్నారు. అచ్చోటువీడి శ్రీశంకరాచార్యస్వామి శిష్యగణమును వెంటనిడుకొని మాగధపురమునకు ప్రయాణమైనారు.

## 5.33 మగధ పురము

మన్మథభక్తులను అద్వైతభక్తులనుగా జేసి, ఉత్తరముగ ప్రయాణమై శ్రీశంకరపాదులు మగధపురం ప్రవేశించారు.

మాగధపుర సంపద వర్ణించ నలవిగానిది. ఏ యిల్లు జూచిన, ఏ మేడ జూచిన, ఏ గడప జూచిన అంతా బంగారుమయమే. ఏయింటి ప్రాకారపు గోడ చూచినా బంగారు యిటుకలతో నిర్మించినవే. గోడలు నక్షత్రాల నంటుచుండెను. ఆ గోడలకు వింతవింత లతలు చెక్కబడిన బంగారుపు రేకులు అమర్చబడియుండెను. మధ్యమధ్య కాంతులు విరజిమ్మే మేలైన రత్నములు పొదుగబడి యున్నవి. వారి ధనాగారములు అంతులేని విత్తంతో పూర్తిగావింపబడిన వే! ఆ పురమున గల ఏ యమ్మను జూచినను బంగారు ఆభరణములు మోయ లేక అడుగు లిడుటకు గూడ శక్తి హీనమైనదే ! ఆ యమ్మల శరీరకాంతులు అనుపమానములు. అంతా బంగారం పూతగా నుండిన ఎట్లు తెలియును ? మగవాళ్ళు తక్కువా? వేళ్ళకు, ముంజేతులకు

భుజములకు, కంఠములకు, దండలకు, చెవులకు, రకరకాల ఆభరణములు తగిలించెడివారు. వాళ్ళ సంపదను ఒక్కమాటలో చెప్పవలెనన్న కుబేరసంపదను ధిక్కరించినది. వాళ్ళ కంతంత సంపద లెట్లు చేకూరెనో యను చింతన శ్రీ జగద్గురువుల శిష్యగణంలో మెదలకపోలేదు.

శ్రీఆచార్యస్వామి శిష్యగణంతో మాగధపురవీధులలో నుండి కుబేరసంపదలు తిలకించుచు తిన్నగా దేవాలయమునకు జని చూడ గుడిగోపురములు, ప్రాకారములు, ద్వారములు, కిటికీలు సర్వము బంగారుమయమై దివ్యకాంతులు వెదజల్లుచున్నవి. దేవుని దర్శించి ఆలయమందు శ్రీశంకరాచార్యస్వామి విశ్రమించారు. శ్రీ జగద్గురువులు వచ్చిరన్నవార్త విని పురజనులందరు బయలుదేరి దర్శించారు.

వేలాది శిష్యులతో అవతారమూర్తి తమ పురం వచ్చారన్నవార్త చెవుల బడుటతో మాగధపురములోని కుబేరభక్తులు ఆబాలగోపాలం ఉత్సాహంతో వెడలి దర్శించారు. వారికి అనేక సదుపాయాలు సమకూర్చారు. వాళ్ళు సంపదను జూచుకొనుచు కులుకుచుండు వారు. తమకు మహాభాగ్యం కలిగించిన కుబేరుని గురించి శ్రీశంకరపాదులకు నివేదించ దలచి అందొక భక్తుడు జగద్గురువులకు నమస్కరించి,

'స్వామీ ! ఈ జగత్తంతయు ధనం మీద ఆధారపడి యున్నది. ఏ పని చేయవలె నన్న ధనం కావలెను గదా ! కనుక మోక్షమునకును ధనమే మూలము. ధనం కావలె నన్నను, మోక్షం కావలె నన్నను మా పరమదైవం కుబేరునే ఉపాసించవలయును. ఆయన మాకే కాదు, బ్రహ్మాది దేవత లందరికి ధనము నిస్తున్నాడు. గనుక బ్రహ్మ మొదలు మానవుని పర్యంతం, మా దేవాదిదేవుడైన కుబేరుడు సేవింప దగిన వాడయ్యెను. ఆయనను నిత్యం సేవించే ఒక యక్షిణి గలదు. ఆదేవతా స్త్రీని సేవించినను లెక్కలేనంత ఐశ్వర్యం ప్రాప్తించును. అట్టి మహాభాగ్యములు కలుగజేసే కుబేరుణ్ని,

యక్షిణిని సేవించని వాళ్ళు దరిద్రులే కదా! కావున తాము కూడ ఆ ఇరువురిని సేవించి సమస్త సంపదలు బడసి సుఖంగా ఉండండి!' అని తెలియజేసెను.

శ్రీ శంకరాచార్యులు కుబేరభక్తుల ప్రభావాలు ఆలకించి,

'కుబేరభక్తులారా! మీరాడిన మాటలకు ఆధారములు లేవే! ధనమునకు అధిపతి కుబేరుడైనా, మరి యొకడైనా ఆ విషయ మటుండ నిండు. ధనంతో తృప్తిపడు వాడెవడు ? ఆశకు అంత మున్నదా? ఆశ దినదినాభివృద్ధి నొందు స్వభావం గలది. ధనమున్న వానికి లోభత్వము సహజంగా ఉండునదే! అట్టి పిసినిగొట్టు వానికి ధర్మబుద్ధి అసలే ఉండదు కదా! కనుక ధనమునకు మోక్షమునకు దూరము హెచ్చు. పైగా ధనమునకు శాశ్వతమైన చంచలత్వ ముంది. అది ఒకచోట స్థిరంగా ఎప్పుడూ ఉండలేదు. చెప్పకుండ, తెలియకుండ తప్పుకొనును. ధనము అనేక అనర్థములకు హేతువు. పూర్వజన్మలో చేసికొనిన సుకృతం కొలది ధనవంతు లగుచున్నారే గాని, ఈ జన్మలో చేయుచున్న సుకృతం వల్ల ఈ జన్మలో ధనికులు కాలేరు. బ్రహ్మగర్భంలో బంగారమున్నది. అందువలన హిరణ్యగర్భుడన్న సార్థకనామం కలిగిన దాయనకు. లక్ష్మి సకల సంపదలకు పుట్టినిల్లు. ఆమె విష్ణుమూర్తి ఇల్లాలు. బంగారముతో కూడియున్నవాడు ఈశ్వరుడు. బంగారు మేరువు పర్వతం మీదనే ఉన్నవాడు దేవేంద్రుడు. ఆలాటి వాళ్ళందరు కుబేరుని ధనంతో బ్రతుకుచున్నారనడం నింద తప్ప వేరు గాదు. బ్రహ్మాదిదేవత లందరి అనుగ్రహంతో కుబేరుడు కుబేరుడైనా డనిన ఎంతో సమంజసముగ నుండును. కుబేరోపాసనలను విడనాడి బ్రాహ్మణ ధర్మములను ఆచరించుడు' అని తెలియచెప్పారు.

దేశికేంద్రులు వచించిన సత్యమును గ్రహించి కుబేర ఉపాసనలను కట్టిపెట్టి శ్రీ శంకరభక్తులై, పంచపూజాది సత్కర్మ నిరతులై, జ్ఞానార్జన తత్పరులై అద్వైతమతమును స్వీకరించారు.

## 5.34 దేవేంద్ర భక్తులు

ఒక దేవేంద్రభక్తుడు లేచి, 'యతీశ్వరా! నమస్కారములు! లోకాధీశుడు, సృష్టిస్థితి లయకారకుడు. త్రిమూర్త్యాత్మకమైన వాడు, బ్రహ్మాది శబ్దములతో పిలువబడువాడు, దేవతలచేతను, యక్షులచేతను, గంధర్వుల చేతను నిరంతరం సేవింప బడుచుండువాడు మా దేవేంద్రుడై యున్నాడు. అదియును గాక ఆయన సర్వేశ్వరుడని, సర్వదాత యని శ్రుతులు తెలుపుచున్నవి. వామను డాతనికి సోదరు డైయున్నాడు. అమృతపానమే ఆయన కాహారము. అట్టి దేవదేవుడైన దేవేంద్రుడు అమరావతినగరంలో వాసం చేస్తూ సర్వపరిపాలకుడై ప్రకాశించుచున్నాడు. ఆయనే సర్వాంతర్యామి. దుష్టులను శిక్షించుటకు, శిష్టులను రక్షించుటకు సర్వసమర్థుడై యున్నా డాయన. ఆలాటి దేవదేవుడైన దేవేంద్రుని త్రికరణ శుద్ధిగ సేవిస్తున్నాము. కనుక తాము కూడ మాలాగే దేవేంద్రుని ఉపాసించండి!' అని అన్నాడు.

దేవేంద్ర భక్తుడు చెప్పిన దంతయు శ్రద్ధతో శ్రీ శంకరాచార్యులు విని, 'దేవేంద్ర భక్తులారా! బ్రహ్మ, పరబ్రహ్మ మొదలయిన శబ్దముల వలెనే ఇంద్ర శబ్దము గూడ సచ్చిదానంద స్వరూపమునకే చెందుచున్నది. అంతియ గాని వజ్రాయుధధారి యైన దేవేంద్రుడే పరమాత్మ యని చెప్పరాదు. 'సదేవ' మొదలైన వేదవాక్యములు పరమాత్మకే చెందుచున్నవి. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ముగ్గురు పరబ్రహ్మము నుండియే ఉద్భవించారు. బ్రహ్మ నుండి ఇంద్రుడు, యముడు మొదలైన వా రుద్భవించారు. అట్టితరి దేవేంద్రుడు సృష్టికి కారణ మనుట పొసగునది కాదు. దేవేంద్రుణ్ని 'సర్వదాత' అనుచుంటివి. లోకంలో దానంచేయుట యందొకరిని మించినవారు మరి యొకరుందురు. అట్లు మించిన వానిని 'సర్వదాత' అనవచ్చును. దాతృత్వంలో దేవేంద్రునకు గొప్ప ఉంటే ఉండు గాక! అంత మాత్రంచేత అతనిని పరమాత్మ అనుట అవివేక మగును. సర్వదాత పరమాత్మ ఒక్కడే. ఇతరుల కా యోగ్యత లేదు. బ్రహ్మకాలంలో పదియారవ వంతు ఇంద్రునకు

గలదు. కనుక మీరుపాసించు దేవేంద్రుడు బ్రహ్మకన్న ఎన్నిరెట్లు తక్కువగా నుండెనో యోజించుకొనుడు.' అని కచ్చితముగ వక్కాణించారు.

అట్లు శ్రీ ఆచార్యస్వామి బోధించుటతో ఇంద్రభక్తులందరు సంతసించి, తమ మతమునకు స్వస్తి చెప్పుకొని, శ్రీ శంకరులకు సమస్కారములర్పించి, పంచాయతనపూజ ప్రారంభించి, వేదవిహితమైన కర్మలాచరించుచు శ్రీశంకరులయందు భక్తికలిగి శిష్యులయ్యారు. తరువాతి మజిలీ యమప్రస్థపురము.

## 5.35 యమభక్తులు

యమప్రస్థపురం చేరుకొని అందు ముప్పది దినములున్నారు. అందున్న వారందరు యమభక్తులు. వారి మతము జ్ఞానమార్గమైనది కాదని తలంచి, వారి నందరిని అద్వైతమతము నవలంబింపజేయ శ్రీశంకరులు సమకట్టారు. అంతలో శ్రీఆచార్యస్వామి రాక తెలిసి దర్శించ దలచి బాహువుల యందు మహిష చిహ్నములు ధరించి, యమకింకరుల వేషం దాల్చి, తమ ఏలికకు ఆనందం సమకూర్చు తలంపుతో నృత్యము చేయుచు శ్రీశంకరాచార్యులను సమీపించి,

"యతివర్యా! నమస్కారములు. మేమందరము యమభక్తులం. మా దేవాది దేవుడు యముడు. ఆయన సర్వలోకములను లయింప జేయుచున్నాడు. సమస్త జీవకోటిని సృష్టించుచున్నాడు. లోకములన్నింటిని పరిపాలించుచున్నాడు. అట్టి యమధర్మరాజును మేమందరం కడుభక్తితో ఉపాసించుచున్నవారలం. ఆయన మాకందరకు ముక్తినిస్తున్నాడు. యజ్ఞములలో సోమరసమును, హవిస్సును మా యమదేవుని కిస్తారు. అగ్నిదేవుడు మా యమదేవునకు దూతగా పనిచేయుచున్నాడు. యమదేవునకు యజ్ఞభోక్తృత్వ ముండుట వలనను, సృష్టిస్థితిలయములకు కారణభూతుడగుట వలనను, అందరి కన్న మిక్కిలి గొప్పవాడై వెలుగొందుచున్నాడు.

స్వామీ! మాయమ ధర్మరాజు స్వరూపము తెలుపు నలుపు రూపములో నున్నది. అందు తెలుపు పరబ్రహ్మ స్వరూపము. అందుండి మహదహంకారములు పుట్టినవి. వానివలన రుద్రుడు పుట్టెను. అందుండి ఉత్పన్నమైన నలుపు రంగే యముడు. ఆ యమునిలో నుండి విష్ణువు జనించెను. ఆవిష్ణువు యొక్క నాభీకమలము నుండి బ్రహ్మ ఉద్భవించెను. ఆ బ్రహ్మనుండి ఇంద్రాది దేవతలు, నవ గ్రహములు, చరాచరాత్మకమైన జగత్తు పుట్టుకొని వచ్చినది. ఈ విధముగా యముడు సృష్టిగావించి దండధరుడై, దక్షిణదిశాధిపతియై, మహిషవాహనుడై సంచరించుచు లోకపాలకుడాయెను.

ఇంద్రాదిదేవతలలో నివురు గప్పిన నిప్పు చందాన సత్యస్వరూపముతోను, శుద్ధబుద్ధముక్తి స్వరూపంతోను, అన్నింటికి కారణభూతుడై వెలయుచున్నాడు మా యమదేవుడు ఆయన సగుణరూపములోను, నిర్గుణరూపములోను ఉంటూన్నాడు. సగుణరూపమును సేవింపగలము. నిర్గుణస్వరూపుణ్ని ఉపాసించుట కష్టము. ఆకారణం చేత సగుణరూపములో నున్న నీలి రంగు యమదేవుని ఉపాసించుచుందుము. అట్లు ఉపాసించుట వలన దేవాదిదేవుని అనుగ్రహం మాకు లభించుచుండును. కనుక సర్వదేవాత్మకమైన యమదేవుణ్ని ఉపాసించడం చేత మాకు ముక్తి తప్పక కలుగుచున్నది. మీరందరు ముక్తిని కోరువారే గనుక మాయమదేవుని సర్వవిధముల ఉపాసించి ముక్తిని పొందుడు!" అని ఒక యమభక్తుడు నివేదించాడు. అంతయు విని శ్రీ శంకరాచార్యస్వామి,

'యమభక్తుడా! నీపలుకులకు ఆధారములు కానరావు. శ్రుతులలో అట్లెక్కడ చెప్పబడి యుండ లేదు. పూర్వకాలమందొక విప్రకుమారుడు. తండ్రి శపించగా యమ నిలయమున కేతెంచెను. అతడే నచికేతనుడు. అతడచ్చట మూడు దినములు పస్తుండి యముని రాకకై వేచియున్నాడు.

అంతలో యముడు వచ్చాడు. విప్రకుమారుని చూచి భయం కలిగి గడగడలాడిపోయాడు. యముడు నమస్కారము చేసి, 'విప్రోత్తమా! మీరాక నే నెరుగనైతిని. అందులకు మూడు వరముల నిచ్చుకొనెద కోరుకొనుడు. అందువలన నాకు శుభం కలుగును' అని అన్నాడు వినయంతో. 'యమధర్మరాజా! నా తండ్రి నా మీద కోపం లేకుండ నుండవలెను. ఇంతకు పూర్వం వలెనే నా తండ్రి నాతో మాటాడవలెను' అని విప్రుడు కోరగా, 'నచికేతనా! మీ తండ్రి ఔద్దాలకుడు నీయందు ఎప్పటివలె ప్రేమ కలిగి యుండు గాక! అతడు సంకల్పములు లేకుండ సుఖముగ నిద్ర జెందుగాక! మృత్యుముఖము నుండి విడివడిన నిన్ను జూచి నీ తండ్రి కోపరహితు డగు గాక!' అని మొదటి వరము ప్రదానం చేశాడు యముడు. తిరిగి విప్రకుమారుడు, 'అగ్నిని గురించి నీకు పూర్తిగ తెలియును, అద్దానిని నాకు సాంతముగ చెప్పుమా! అగ్నితత్త్వమును తెలిసినవారు స్వర్గమును పొంది అమృతత్త్వమును పొందుచున్నారు. అందులకై ఈ రెండవ వరమును కోరితిని' అని కోరగా అగ్నితత్త్వమును సాంతముగ బోధించాడు యమధర్మరాజు. పిమ్మట నచికేతనుడు, 'యమధర్మరాజా! ఆత్మ ఉన్నదని కొందరు, లేదని కొందరు అనుచుందురు. ఇందు విషయమై సందేహం బహుళంగా నున్నది. ఉన్నదున్నట్లు దానిని నాకు బోధించుమా!' అని మూడవ వరం కోరగా, 'నచికేతనా! ఆత్మతత్త్వం బహు నిగూఢమైనది. సామాన్యంగా అందరికీ అర్థమయ్యేది కాదు. అందరికి బోధించ వీలులేనిది' అని వ్యక్తం చేసి, యోగ్యతను పరీక్షింప మనస్సులో నిశ్చయించాడు యముడు. ధనమందెన్నియో అశలు కొల్పి, ధనయోగము గొప్పదని బోధించాడు. అట్లెన్ని విధముల ప్రయత్నించినను నచికేతనుడు కొంచె మైనను ఒడంబడక, ధైర్యము వహించి ధనము నెడ విరక్తి జూపి, తత్త్వజ్ఞానములో నుండు గొప్పతనమును వ్యక్తం చేశాడు. అంతట నచికేతనునకు గల ధైర్యమునకు, ధన మందు అంకురించిన విరక్తికి, తత్త్వ విచారణ యెడ గల గాఢమైన

విశ్వాసమునకు యమధర్మరాజు మిగుల సంతసించి తత్త్వోపదేశం చేయ సంకల్పించెను.

'నచికేతనా! వేదములన్నిటి యందు ఏది పరమపదమై విరాజిల్లుచున్నదో, ఏ పరమపదమును ఆశ్రయించి బ్రహ్మచర్యము నాచరించుచుండిరో, తపములన్నీ ఏ పరమపదమును బలుకుచున్నవో అట్టి పరమపదమును నీకు బోధించుచున్నాను. బుద్ధిమంతుడా! అదియే ఓంకారము! ఈ శరీరములు శాశ్వతములు గావు. శరీరముల యందు మమకారమును విసర్జించవలెను. శరీరధారణ చేసితినని మరచినవాడు పరమప్రభువైన పరమాత్మను తెలిసికొని ధీరుడై ఎన్నటికిని శోకము నొందదు. లోకమందు శాకాదులను కలిపి అన్నమును భుజించునట్లే ఈ జగత్తంతా పరమేశ్వరునకు అన్నరూపమై యున్నది. మృత్యుదేవత గూడ ఆ పరాత్పరునకు ఆహారమే యగుచున్నది. అట్టి పరమాత్మ నాకు ఆత్మ సాక్షాత్కారం చేయుచున్నా'డని యమధర్మరాజు వివరించాడు. యమభక్తులారా! ఇవన్నియు జూడగ యమధర్మరాజుకు స్వాతంత్ర్యమే యున్నటుల కాన్పించకున్నది. వేయేల! సర్వస్వతంత్రుడైన వాడొక్క పరమాత్మయే. కావున మీమీ వేషాలు మార్చుకొని అద్వైతతత్త్వజ్ఞానము నార్జించుకొనుడు. ఇప్పటికైనా వేదవిహిత కర్మ నాచరించుటకు ప్రారంభించుడు. అట్లు సత్కర్మలాచరించినందు వలన చిత్తశుద్ధి కలిగి జ్ఞానార్జనకు దోహదమగును"అని గొప్ప ఉపన్యాస మిచ్చారు.

అంతట యమభక్తులు తమయందు గల లోపములను తెలిసికొని యమమతము విడనాడి శ్రీశంకరపాదులను శరణుజొచ్చిరి. శ్రీశంకర కరుణతో వారందరు అద్వైతులై జ్ఞానానందములో తేలియాడిరి.

## 5.36 ప్రయాగ

త్రివేణీ సంగమ స్థలమని, పరమపవిత్ర యాత్రాస్థలమని ప్రసిద్ధి బడసిన ప్రయాగ స్థలమును శ్రీశంకరబృందము చేరుకొనిరి. పాశచిహ్నములను

ధరించిన వరుణోపాసకులు, ధ్వజచిహ్నములను ధరించిన వాయుమతస్థులు, గుండ్రని ఆకారము గల చిహ్నములను ధరించిన భూదేవోపాసకులు, నీటిబిందు చిహ్నములు ధరించిన తీర్థోపాసకులు శ్రీశంకరాచార్యులను దర్శించ వచ్చిరి. అందు వరుణదేవోపాసకుల గురువైన తీర్థపతి యను పేరు గలవాడు లేచి,

శ్రీశంకరాచార్యవర్యా! నమస్కారములు! లోకమందు మా మతము పరమ పవిత్రమైనది. చాల గొప్పది. మా వరుణదేవుడు సర్వోత్తముడై దేవాదిదేవతలందరకు పూజనీయుడై యున్నందున లోకములోని వారందరు ఆయననే సేవింపవలసి యున్నది"అని వివరించినంత, ప్రాణనాథుడను పేరుగల వాయుమతస్థుడు లేచి,

'యతివర్యా! వందనములు! సమస్త చరాచర ప్రాణికోటికి ప్రాణాధారమైనవాడు వాయుదేవుడు. అట్టి దేవునందరును ఉపాసించవలయు'నని వచించెను. పిమ్మట అనంతనామకుడను భూదేవి మతస్థుడు లేచి,

'స్వామీ నమస్కారములు! చరాచరాత్మకమైన జీవకోటి యావత్తు భూదేవి నాశ్రయించుకొని యుండును. జీవించుటకు వలయు ఆహారాదులు భూదేవి యందే ఫలించును. భూదేవి పరమపవిత్రమైన నదీనదములు, సరస్సులు, సముద్రములు మొదలైనవి సర్వప్రాణులకు ఉపకరించుటకు ధరించుచున్నది. ఇంతకన్న గొప్పది వేరొకటి లేదు. అందువలన మేమందరము భూదేవి నుపాసించుచున్నాము. తాముకూడ భూదేవి నుపాసించి ధన్యులు కండు!' అని వివరించెను. పిమ్మట జీవనదుడను పేరుగల తీర్థమతస్థుడు లేచి,

"స్వామీ! అనేక నమస్కారములు! మా మతమును వివరించెద నాలకించుడు! మా మతము తీర్థము, త్రివేణి యని ప్రఖ్యాతి బడసినది. అందొక నీటిబిందువు ఎట్టి పాపములనైనను హరించి అనంతమైన

పుణ్యమును ప్రసాదించును. మా తీర్థము జల్లుకొనిన, సేవించిన, స్నానము చేసిన అక్షయపుణ్యమును కలుగజేయును. ఇంతయేల మా తీర్థమును దర్శించినంత మాత్రాన మోక్షమే ప్రాప్తించును. త్రివేణీ సంగమ తీర్థమునకు ఎంత మహిమగలదో ఊహించరానిదని లోకమందు గల భక్తులు వేనోళ్ళ కొనియాడుచున్నారు. నారదులు గూడ పొగడియున్నారు. 'ఆపోవై స్యురిదం సర్వం' ఈ లోకమంతయు నీటితో నిండియున్నదని శ్రుతి తెలుపుచున్నది. కావున ఇది సర్వవ్యాపకత్వము, సర్వాత్మకమునై యున్నది. జలమే పరబ్రహ్మమై యున్నది. మోక్షమును గోరువారు జలపాన, స్నానాదులు జేసి తరించవలయు'నని ఉపన్యసించెను. అప్పుడు స్వామి వారి నందరిని ఉద్దేశించి ఈ విధంగా బోధ చేసారు.

"భక్తులారా! మీరాచరించునవి నిత్యమైనవి గావు. వరుణాదులు కార్యరూపములైనవి. సత్యములు గావు. ముక్తికి హేతువులనుచున్నారు. అట్లనుట సమంజసము గాదు. నిత్యముక్తికి ఇవి సాధనము లెన్నటికి కావు. తత్త్వజ్ఞానవే వెూక్షమునకు నిజవైున దారి. తత్త్వజ్ఞానము వలన పరమసుఖము కలుగును. కావున అట్టి పరమాత్మ తత్త్వమును తెలిసికొని ముక్తిని పొందుడు' అని బోధించుటతో వరుణ, వాయు, భూ, జలోపాసకులు నల్వురు తమ మతములను వీడి, వారి వారి బాహ్య చిహ్నములను విసర్జించి అద్వైత మతము నవలంబించారు.

## 5.37 శూన్యమతస్థుడు

ఎవరిమట్టుకు వారు తా మవలంబించుచున్న మతమును ప్రతిష్ఠించుకొరకే ప్రయత్నించుచున్నారు. ఆయా మతములలోని లోపములను గ్రహించక అవే గొప్పవని తలంచియున్నారు. ప్రయాగ క్షేత్రమందు శ్రీశంకరపాదులుండగనే శూన్యవాది యొకడు విజయమును సాధించనెంచి జగద్గురువుల కడ కేగి,

'శ్రీశంకరాచార్యా! నమస్కారములు! నేను వచ్చుచుండ మార్గమధ్యాన ఒక విశేషము పొడగంటిని. అద్దానిని చెప్పెద నాలకించుడు. ఎండమావులలో స్నానమాచరించి, ఆకాశపుష్పమును తలలో ధరించి, శృంగముతో తయారుకాబడిన ధనుస్సును ధరించిన వంధ్యాపుత్రుడొకడు దారిని పోవుచుండ గాంచితిని. అతడే దేవదేవుడనుకొని శిరము వంచి నమస్కారములర్పించితిని. అంతట మీకడ కరుదెంచితిని' అన్నాడు. అంతట శ్రీశంకరాచార్యులకును శూన్యవాదికిని సంవాద మీక్రింది విధముగ జరిగెను.

**శంకరాచార్యులు** : నీ పేరేమి?

**శూన్యవాది** : నిరాలంబుడనువాడను

**శంకరాచార్యులు** : నీ తండ్రి పేరేమి?

**శూన్యవాది** : క్లుప్తనామం, అతడత్యంతము గొప్పవాడు. ఆయన మూలాన మా మతమునకు గొప్ప కీర్తి కలిగినది.

**శంకరాచార్యులు** : ఓయీ! శూన్యమతం బహు నింద్యమైనది తమేవ భాన్త మనుభాతి సర్వం' అను శ్రుతి ననుసరించి ప్రపంచమంతా భాసించుచున్నది. కనుక నీ శూన్యవాదం కట్టిపెట్టి అద్వైత మతము నాశ్రయించుమా!

**శూన్యవాది** : 'ఖం బ్రహ్మ' ఆకాశమే బ్రహ్మ అన్నప్పుడు అన్నిటికి ఆధారమైనది ఆకాశమే కదా! 'ఆకాశస్తల్లిఙ్గాత్' అని యున్నందున ఆకాశమునకే బ్రహ్మత్వం స్థిరం.

**శంకరాచార్యులు** : ఆకాశమునకు శబ్దగుణమే యున్నది. అంతమాత్రాన బ్రహ్మత్వముందనుట సాహసం. ఆకాశము గాలికి

కారణం. పంచభూతములలోను ఆకాశమొకటి. ఆకాశమునకు కారణం బ్రహ్మ. 'ఖం బ్రహ్మ' అనగా 'ఖ' శబ్దము బ్రహ్మబోధకము. పంచభూతములకు పరమైయున్నది పరబ్రహ్మం అని తెలుసుకొనుమా!

**శూన్యవాది** : స్వామీ! రహస్యం గ్రహించితిని. అందులకే మీకడ కరుదెంచితిని. నాకు ముక్తి కలిగే మార్గమేదో సెలవిండు. దాన్ని అనుసరిస్తాను.

అంతట శ్రీశంకరపాదులు శూన్యవాది మొఱాలకించి, తత్త్వోపదేశం చేసి శూన్యవాదిని అద్వైతునిగా జేసి శిష్యునిగా జేసికొనిరి.

## 5.38 వరాహ మతస్థుడు

లక్ష్మణుడను పేరుగల వరాహ మతస్థుడు లేచి శ్రీ ఆచార్యస్వామిని సమీపించి,

'శ్రీ శంకర దేశికేంద్రా! నమస్కారములు! మా మతమెట్టిదో దెలిపెద నాలకించుడు. ప్రళయకాలమందీ భూమండలము యావత్తు నీట మునిగిపోవుచున్నది. అప్పుడు పరాత్పరుడు దయామయుడై వరాహరూప మెత్తి తన కోర కొనతో భూమిని పైకెత్తి యున్నాడు. అట్టి వరాహస్వామివారి కోరలు చిహ్నములుగా ధరించి ఆ స్వామిని తదేక ధ్యానముతో ఉపాసించుడు. మేమును అటుల జేయుచున్నారము. మాకాయన అనేక విధముల సాయపడుచు ముక్తినిస్తున్నాడు. తప్పక మావలెనే ఉపాసించుడు' అని వివరించాడు.

శ్రీశంకరులు 'లక్ష్మణా! నాయనా! నీవన్న దెన్నటికి సత్యం కానేరదు. బ్రాహ్మణుడైన వాడెవ్వడు అట్లు చేయకూడదు. ద్విజుడెప్పుడు కర్మనాచరించవలెను, తపస్సు చేయవలెను. సగుణారాధన చేయ దలచితివా ఉత్తమోత్తమమైన దేవుని ఆరాధించుమా! సగుణరూపంలో శివునిగాని

విష్ణువును గాని కడుభక్తితో పూజింపుమా! విప్రుడు విధిగా చేయదగు కర్మలు సంధ్యావందనాదులున్నవి. అవి చేయకున్న శిక్షలకు పాత్రుడవు కాగలవు! అట్లు సత్కర్మల నాచరించిన చిత్తం పరిశుద్ధమై మోక్షమునకు హేతువగును' అని బోధించుటతో శంకరుల ఆజ్ఞానుసారం లక్ష్మణుడు శ్రీశంకరపాదులకు ముఖ్యశిష్యుడై జ్ఞానార్జన చేయుచు తపస్సు చేసికొనుచు కడకు జ్ఞానియయ్యెను.

## 5.39 లోకసేవక మతస్థుడు

కామకర్మ్మడను పేరుగల లోకసేవక మతస్థుడొకడు శ్రీశంకరాచార్యస్వామిని జేరి నమస్కారము లర్పించి,

'స్వామీ! మానవసేవయే మాధవసేవయను ధర్మము చాల ప్రసిద్ధికెక్కియున్నది. పరాత్పరునకు రెండు రూపములున్నవి. అందొకటి వ్యష్టిరూపం, రెండవది సమిష్టిరూపం. సమిష్టిరూపమైనది భూతకోటి. అట్టి సమిష్టిరూపమునకు సేవ చేసినచో పరాత్పరునకు సేవచేసినట్లే యగుచున్నది. ఆ ధర్మమును మేమందరం నమ్మి లోకమునకు సేవ చేయుచున్నారము. అట్లు చేయుటవలన మాకు సత్యలోక ప్రాప్తి కలుగుచున్నది. అదియే మాకు ముక్తి. ముక్తి కలుగవలెనన్న ఇదియొక్కటే మార్గము' అని వివరించాడు.

శ్రీశంకరాచార్యులా మార్గమును విని, 'నాయనా! ఇటు వినుము! ఈ కనబడే లోకమంత అసత్యము, అనిత్యము. అట్టిదానిని సేవించిన నిత్యమైన ముక్తి బడయలేము . నిత్యమైన వాడు, సత్యస్వరూపుడు పరాత్పరుడొక్కడే ఉన్నాడు. ఆయన సర్వాంతర్యామి, శాశ్వతానంద స్వరూపుడు. అట్టివానిని తెలిసికొని ఆయన్నే సేవించాలి. పరోపకారమనునది మానవుడాచరించదగి యున్న పెక్కు ధర్మములలో నొకటిగా నున్నది. అట్టి ఒక చిన్న విషయాన్ని పట్టుకొని ప్రాకులాడడంతో మోక్షం రానేరదు. తత్త్వ విచారణ చేయవలెను. తద్వారా జ్ఞానము నార్జించుకొనవలెను. జ్ఞాని కావడమే మోక్షము' అని వివరించారు.

కామకర్ముడు శ్రీ జగద్గురువులు చేసిన బోధ విని, తన బుద్ధిని మార్చుకొని, శ్రీశంకరాచార్యులకు శిష్యుడై జ్ఞానార్జన చేయుచు సుఖముగ నుండెను.

## 5.40 గుణోపాసకులు

గుణోపాసకుల లోనుండి ఒకడు శ్రీశంకరాచార్యుల కడకు జని,

'యతివర్యా! వందనములు! అనేక మతములను తమ మతములో లీనం చేసికొని తమ మతమునే ప్రతిష్ఠించుకొనుచున్నారు. మా మతమట్టిది గాదు వినుడు, వివరించెదను! సత్త్వరజస్తమో గుణములు మూడును లోకమందు ప్రధాన కారణమై వెలయుచున్నవి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు గూడ ఈ మూడు గుణములు గలవారలై యున్నారు. వారీ గుణముల నాధారముగ లోకములను సృష్టించుచు, పరిపాలన చేయుచు, లయం చేస్తూ ప్రకాశించుచున్నారు. అందువల్ల ఈ త్రిగుణములు ప్రధాన కారణమనుటకు ఆస్కారం కలిగినది. అందువలన మేమందరం ఈ త్రిగుణములనే ఆశ్రయించి గౌరవంతో ఉపాసించుచున్నాము. తాముగూడ మా వలెనే గుణోపాసన చేయుడు. అట్లొనరించిన అప్రయత్నముగ సర్వం సిద్ధించును' అని తెలియజేసెను.

గుణోపాసకులు వివరించిన విధానమంతయు శ్రీశంకరపాదులు విని,

'గుణములు ప్రకృతినుండి కలుగుచున్నవి. ప్రకృతి సంబంధమైన ఉపాసన వలన ముక్తి కలుగదు. మీరాచరించునది తగినది కాదు. గుణోపాసన విసర్జించి తత్త్వ విచారణ చేయుడు. సర్వము మీరందు తెలిసికొనగలరు' అని చెప్పుటతో తమ మతమునకు స్వస్తి చెప్పి అద్వైత తత్త్వ విచారణ చేయుటకు ప్రారంభించి శ్రీశంకరపాదులకు శిష్యులై వేదవిహితమైన కర్మలు చేస్తూ సుఖముగ నుండిరి.

## 5.41 సాంఖ్య మతస్థులు

గుణోపాసకులు శ్రీశంకరపాదులకు శిష్యులయిన తరువాత, సాంఖ్యమతస్థులలో నొక పెద్ద లేచి జగద్గురువుల కడ కేగి నమస్కారములర్పించి,

'స్వామీ! జగత్తునకు ఉపాదాన కారణం ప్రధానం. మనుస్మృతులు మొదలైనవి ఉన్నట్లుగనే మా మతమునకు గూడ స్మృతి ప్రమాణమున్నది. త్రిగుణ సామ్యస్థితినే ప్రధానమందురు. అది మహత్తత్త్వములకు కారణం. ప్రధానము లోకమందు అఖండమై, అన్నిటికంటె గొప్పదై అవ్యక్తరూపంలోను, వ్యక్తరూపంలోను గలదు. సూక్ష్మమును, ప్రధానమును అవ్యక్తమందురు. స్థూలము, ప్రపంచమును వ్యక్తమందురు. మాచే ఆచరింపబడు ప్రధానోపాసన వలన ముక్తి మాకు చాల అందుబాటులో గలదు. ఇది స్మృతి ప్రమాణము. కావున మా మతము అందరకు ఆచరణయోగ్యముగ నున్నది. కావున తాము తప్పక మా మతమును స్వీకరించుడు' అని వివరించాడు.

శ్రీశంకరులు సాంఖ్య మతాశయమును విన్నారు. అంతట సాంఖ్యునితో,

'ఓయీ! నీవన్నదంతయు వేద విరుద్ధముగ నున్నది. స్మృతులు వేదములకు విరుద్ధముగ నుండకూడదు. 'ప్రధానము' అనుచుంటివి! అది శబ్దం లేనిది. అందువల్ల అది జగత్కారణము కాదు. వేదమందు సర్వం చూచే శక్తి పరమాత్మకు గలదని చెప్పబడినది. నీవన్న ప్రధానం జడమై యుండి చూచే శక్తి లేనట్టిది. చైతన్యవంతమై పరబ్రహ్మ మొక్కటే జగత్కారణ మగుచున్నది. కావున వివేకంతో శ్రుతి వాక్యమును తెలిసికొనుమా!' అని తెలియజెప్పిరి.

అంతట సాంఖ్యమతస్థుడు, 'నా శబ్దం ప్రధానం' అన్నందువల్ల శబ్దం లేక పోలేదు. అచింత్యము, అవ్యక్తము, అరూపము, అరసము, అగంధము,

అనాది, అనంతము, మహత్తుకంటె పరమైనది, ధ్రువమైనది, నిత్యమైనది, ఇట్టి గుణములు గలదానిని తెలిసికొనినవాడు మృత్యుముఖము నుండి బయటపడుచున్నాడు. ఇది శ్రుతి ప్రమాణము గదా! కనుక ప్రధానము లోకములన్నిటికి కారణమగుటకు సందియమే లేదు’ అని అడ్డు పలికెను. అంతట శ్రీ జగద్గురువులు,

‘బుద్ధిమంతుడా! ప్రధానం ఉపాసించుట వలన జ్ఞానం కలుగదు. జ్ఞానం లేనిదే ముక్తి రాదు. జ్ఞానం కావలె ననెదవా ప్రధానోపాసన కట్టిపెట్టి అద్వైత తత్త్వమును తెలిసికొని శాశ్వతానందమును పొందుమా!’ అని బోధించెను.

అంతట సాంఖ్యుడు తనకున్న అజ్ఞానమును విడనాడి శ్రీశంకరపాదులకు శిష్యుడై తత్త్వజ్ఞానము నార్జించుకొన్నాడు.

## 5.42 కాపిల మతస్థుడు

కాపిలమతము లోని వాడొకడు లేచి శంకరుల కడ కరుదెంచి,

‘యతీశ్వరా! నమస్కారములు! యోగమువల్ల ముక్తి లభించునని మా మతధర్మము. ఇందులకు ప్రమాణము లనేకము లున్నవి. అదెట్లు లభ్యమగునో వచించెద నాలకించుడు. ‘జనులు సంచరించని ప్రశాంత స్థలమందు సుఖాసీనుడై, శుచియై, నడుము వంచక, మెడ నిబ్బరముగ నుంచుకొని ఇంద్రియవ్యాపారము నరికట్టి, అత్యంత భక్తితో గురువులకు నమస్కరించి, తన హృదయమును నిర్మలముగ నుంచుకొని, అట్టి పరిశు ద్ధ హృదయమందు, ద్వంద్వాతీతుడు, కంటికి కన్పించనివాడు, మనస్సున కందరానివాడు, అంతులేని రూపం గలవాడు, మంగళాకారుడు, ప్రశాంతమైనవాడు, అమృతస్వరూపుడు, బ్రహ్మ పుట్టువునకు కారణమైన వాడు, ఆదిమధ్యాంతములు లేనివాడు, చిదానందుడు, నిరాకారుడు, నిర్గుణుడు, అద్భుతమైన రూపం గలవాడు, ఉమాసహితుడు, దేవాదిదేవుడు,

ముక్కంటి, నీలకంఠుడు అయిన పరాత్పరుని నిలుపుకొని ధ్యానం చేయు తపశ్శాలి సకల భూతములకు మూలాధారుడు సాక్షీభూతుడు, పరాత్పరుని పొందుచున్నాడని యున్నది' కావున మా మతం అన్ని మతములకన్న మిక్కిలి ఆదరణీయమై ప్రకాశించుచున్నది. జప విధానమంతయు వేరుగ శాస్త్రమందు చెప్పబడియున్నది. కావున ముక్తిని కోరువారందరు విధిగా మా యోగమతమును స్వీకరించవలయును' అని వివరించెను.

శ్రీ శంకరాచార్యస్వామి యోగమత విధానము కాపిలుడు చెప్పగా విని,

'ఓయీ! దహరోపాసన వేదమందు చెప్పబడియెను. దానిచే ముక్తి కలుగునని యున్నది. కాని యోగోపాసన ముక్తికి హేతువని వేదములో తెలుపబడి యుండలేదు. కావున యోగము ముక్తికి కారణం కానేరదు. జ్ఞానమే ముక్తికి హేతువు. జీవబ్రహ్మైక్య జ్ఞానం లభిస్తే ముక్తి వచ్చినట్లే. యోగమందు జీవబ్రహ్మైక్య జ్ఞానం లేదు. 'సోఽహం,' 'శివోఽహం' మొదలైన అజపా మంత్రములను జపించుట వలన జీవాత్మకు పరమాత్మకు భేదం తొలగిపోవును. 'ఆ పరమాత్మయే నేను' అనునది జీవబ్రహ్మ భేదము. జపములు మోక్షము నియ్య జాలవు. అజపామంత్రం అట్టిది కాదు. ఆత్మను దర్శించవలెనన్న సర్వాత్మభావ ముండవలెను. తనలో సర్వభూతము లున్నట్లు, సర్వభూతములలో తానున్నట్లు చూడవలయును. అట్టి అఖండ జ్ఞాన మెవనికి యుండునో వాడు పరమాత్మను పొందినవా డగుచున్నాడు. షట్చక్ర భేదనాది యోగముల వలన ముక్తి రాదని వేదము స్పష్టముగ పలుకుచుండ అద్దానిని విడనాడి సాధన చతుష్టయ సంపత్తి గలిగి శ్రవణం మననం మొదలైన సాధనలను చేసి పరాత్పరుని తనలో చూడవలెను. అనగా తనను తాను పరమాత్మగా తెలిసికోవలెను. అదే అత్యంత పరమజ్ఞానం. సన్న్యాసులు జ్ఞానం గలిగి సర్వసంగ పరిత్యాగం చేసి శుద్ధ సత్వబుద్ధితో ఉంటూ, ఆత్మతత్త్వ జ్ఞానామృత పానం చేస్తూ పరబ్రహ్మలగుచున్నారు. పరాంతకాలమందు

పరామృతతత్త్వము నొంది సమస్త బంధములనుండి విడివడి మోక్షమును పొందుచున్నారు. శ్రుతులు అట్టి విధముగ వినుపించుచున్నవి' అని బోధించారు. అంతట కాపిల మతస్థుడు,

'యతివరా! పరిజ్ఞానమున్న వారెవరు మీవలె పలుకరు. ఖేచరీముద్ర అననేమో తెలియనివాడు 'నేను బ్రహ్మజ్ఞానిని' అని పలికిన వాని నాలుక తెగగోయవలెను. గంగాయమునా సరస్వతీ నదుల సంయోగస్థానమైన (ఇడ, పింగళ, సుషుమ్న) త్రికూటము (భ్రూమధ్యస్థానము) తెలిసికొనక 'నేను బ్రహ్మనైతిని' అను వాని నాలుకను తుత్తునియలు జేయవలెను. మేరుశృంగమును – సహస్రారమును తెలిసికోకుండ 'నేనే బ్రహ్మను' అను వాని జిహ్వను చీల్చివేయవలెను. పూర్ణమండల మార్గము ద్వారా మనోన్మనీ స్వరూపాన్ని తెలిసికొనకుండ 'నేను బ్రహ్మనైతిని' అని పలుకువాని నాలుకను ముక్కముక్కలు చేయవలెను. హృదయమందు అంగుష్ఠ ప్రమాణములో ప్రకాశించుచున్న పరమాత్మ నెరుగక 'నేను బ్రహ్మనైతిని' అని చెప్పువాని నాలుకను ఖండఖండములుగ జేయవలెను. మహావిజ్ఞానఖని బాలునివలె, పిచ్చివానివలె, పిశాచము పగిది తిరుగాడును. అట్టి స్థితిని తెలిసికొనక 'బ్రహ్మమే నేనని' వచించువాని తల క్రింద పడునట్లు చేయవలసినదే. లయ యోగమును సాధించినవాడు పరమాత్మను పొందుచున్నాడు. ఇంకొక మార్గమేదియు కానరాదు. హఠయోగి కూడ సనాతనుడైన పరబ్రహ్మ స్థానమునే పొందుచున్నాడు. కావున యోగులు సదా ముక్తిని పొందుచున్నారు. ఇంకను ముక్తి హేతువులైన యోగములు మెండుగా నున్నవి. కావున మీరందరు ముక్తిని బడయునెంచి యోగమును స్వీకరించుడు!' అని వివరించినాడు.

శ్రీశంకరాచార్యస్వామి కాపిలుడు వివరించినది అంతయు విని 'ఓయీ! జ్ఞానమనిన ఎట్టిదో యెఱుంగక ఆ విధముగ నుడివితివి. యోగాభ్యాసము వలన చిత్తశుద్ధి, ఏకాగ్రత అలవడును. చిత్తం బహు చంచలమైనది.

దానికున్న గమనవేగం అగణ్యమైనది. వేలకు మించిన రెక్కలు గలది. విచిత్రమైన పరుగులు వారును. అది సామాన్యముగ లోబడునది కాదు. చిత్తమును నిరోధించుటకు అష్టాంగ యోగములు ఉపయోగపడునని యున్నదే కాని (ముక్తి మాత్రం రానేరదు) విజ్ఞానం కొరకు జెప్పబడి యుండలేదు. ఖేచరీ మొదలయిన ముద్రల వలన ముక్తి కలుగునని నీవన్నది విరుద్ధముగ నున్నది. ఆ ముద్రలు కూడ ఏకాగ్రతను సాధించుట కొరకే ఏర్పాటు కాబడినవి. ఒక్క తత్త్వజ్ఞానం వలననే ముక్తి లభిస్తుందని వేదం వక్కాణిస్తూంది. మరియొక దానివలన రాదని వచించినది. వైదిక కర్మానుష్ఠానం ద్వారా కలిగిన చిత్తశుద్ధి వివేకము, వైరాగ్యము శమదమాది సంపత్తిని కలుగజేయుచున్నది. ఆ విధంగా చిత్తశుద్ధిని పొందినవాడు మోక్షం కోరినచో గురుముఖమున తత్త్వమస్యాది మహావాక్య శ్రవణం జేసి అందుండి స్రవించు జీవబ్రహ్మైక్య వేదాంత రహస్యామృతమును పానం చేయవలెను. అదియే మోక్షము' అని బోధించుటతో తెలివినొంది శ్రీశంకరదేశికేంద్ర పదములకు కడుభక్తితో నమస్కరించి శిష్యుడై అద్వైతమునాశ్రయించెను. తరువాత పరమాణువాద మతమువారు శంకరులతో వాదించ నుద్యుక్తులయ్యారు.

## 5.43 పరమాణు వాదులు

పరమాణువాద మతస్థులలో ధీరశివుడను వాడు పెద్ద. ఆయన శంకరులను సమీపించి,

'స్వామీ! నమస్కారములు! పరమేశ్వరుడు లోకములన్నింటికి కర్తయై వెలయుచున్నాడు. అంతవరకు అందరికి సమ్మతమే. నిత్యత్వం గల భూవ్యాది పరమాణువుల సంయోగము వలన లోకములు సృష్టింపబడుచున్నవి. ఎప్పుడా పరమాణువులు వియోగము జెందునో ఆనాడు ప్రళయము సంభవించుచున్నది. కాని పరాత్పరుడు తాను నిమిత్తమాత్రుడై, సాక్షీభూతుడై యున్నాడు' అని వివరించాడు.

ధీరశివుని మత విధానమును విని, 'ధీరశివా! నీవన్నదంతా వేద విరుద్ధమైనది. సమస్తము పరమేశ్వరునుండియే పుట్టుచున్నది. ఆయన సృష్టించనిది ఏమియు లేదు. లోకముల కాయన తండ్రి యని వేదము తెలియ జేయుచున్నది. గౌతమ మునిచే తెలుపబడిన న్యాయవిద్యను అనుసరించిన వారు నక్కలై పుట్టెదరు. కనుక అట్టివన్నియు విడనాడి అద్వైత తత్త్వమునాశ్రయించి ముక్తులు కండు. అందులకు సద్గురువుల నాశ్రయించవలెను' అని శ్రీశంకరాచార్యస్వామి తెలుపగా ధీరశివుడు మొదలైన పరమాణు వాద మతము వారందరు తమ మతమును వీడి శ్రీశంకరపాదులకు శిష్యులై అద్వైతతత్త్వ జ్ఞానార్జన జేయుచు సుఖముగ నుండిరి.

ఆ మరునాడు బ్రాహ్మీ ముహూర్తమున లేచి, త్రివేణీ సంగమంలో స్నానాదు లొనర్చి, శ్రీశంకరపాదులు శిష్యసమేతముగా బయలుదేరి వారము దినములకు కాశీక్షేత్రం జేరుకొన్నారు.

## 5.44 కర్మవాదులు

ప్రయాగ పట్టణమునుండి కాశీ జేరుకొని శ్రీశంకరాచార్య స్వామి మూడు మాసము లుండి అద్వైత మత ప్రచారము జేసిరి. శంకరపాదుల ఆగమనముతో కాశీ పట్టణం కళకళ లాడినది. పురజనులు తండోపతండములుగ వచ్చి జగద్గురువుల దర్శనం చేసికొని పద్మపాదాది యతులను దర్శించి ఆశీర్వచనములు పొంది పోవుచుండిరి. పూర్వ పరిచయం గలవారు శ్రీశంకరాచార్యుల దివ్యతేజం చూచి అబ్బురపడి అమితానంద భరితులైరి. శ్రీఆచార్యస్వామి దేశమం దనేక మతములను నిరాకరించి అద్వైత మతమునకు పట్టాభిషేకము జేసి వచ్చినారని కాశీపురమందు, చుట్టుపట్ల గల కర్మవాదు లందరు ఒకచో సమావేశమై ఎట్లైనను కర్మమతమునకు ప్రముఖస్థాన మిప్పించ వలెనని నిర్ణయించుకొనిరి.

కర్మవాదు లందరు శ్రీశంకరపాదులకు యథావిధిగ నమస్కారము లర్పించి తమ తమ స్థానముల యందాసీనులయ్యారు. అందొకరు లేచి,

'ఆచార్యస్వామీ! కర్మ చేయనిదే ఏమీ లేదు. సృష్టిస్థితులకు కర్మవల్లనే గదా కారణమగుచున్నది. మంచికర్మలు చేయుట వలన మంచిజన్మలు, చెడు కర్మలాచరించినందు వలన నీచజన్మలు కలుగుచున్నవి. జనక మహారాజు మొదలయిన వారందరు సత్కర్మ లాచరించుట వలననే గదా జ్ఞానులై ముక్తిని బడసియున్నారు. ముముక్షువు లందరు కర్మలు చేయవలెనని, దాని వలన సుఖం కలుగునని, ఆ సుఖమే మోక్షమని నిర్ణయించారు గదా!" అని తెలియజేసెను.

కర్మోపాసకుల పలుకు లాలకించి శ్రీశంకరాచార్యులు, 'కర్మోపాసకుడా! "యస్యైతత్ కర్మ" అని శ్రుతి తెలుపుచున్నది. జగత్తు పుట్టిన దనిన అందులకు కారణము బ్రహ్మే, అది సుస్పష్టము. కర్మ జడమై యుండ, జడము సృష్టికి కారణమెట్లగును? మూఢు లయినవారు మాత్రం జడమగు కర్మనాశ్రయించి జనన మరణ రూప సంసారసాగర మందు బడుచున్నారు' అని సూక్తులతో పలుక కర్మవాదులందరు శ్రీశంకరులకు శిష్యులై కర్మమతమును విడనాడి అద్వైతవిద్య నాశ్రయించారు.

## 5.45 చంద్ర మతస్థులు

శివభూషణుడను పేరుగల చంద్రమత గురువు శిష్యుల తోడ శ్రీశంకరాచార్యుల కడకు జేరి,

'యతీశ్వరా! నమస్కారములు! పూర్ణిమ మొదలగు పుణ్యతిథులలో భక్తిశ్రద్ధలతో చంద్రుని ఆరాధించెదరు. లోకము లన్నిటికి ప్రకాశమును కలుగజేయుచున్నాడు చంద్రుడు. ఆయన ప్రత్యేక మండలము గలిగిన వాడై లోకములకు కూడ పాలకుడై అలరారుచున్నాడు. అందు వలన చంద్రుడందరికి పూజనీయు డయ్యాడు. ఆతడే ముక్తి నిచ్చువాడు. అందుచే

మేమందరము ఆయన్నే ఉపాసించు చున్నాము. తాము కూడ మా వలెనే చంద్రుని పూజించి ధన్యులు కండు!' అని తన మత విధానమును వివరించెను.

శ్రీశంకరాచార్యులా పద్ధతిని విని, 'శివభూషణా! అనిత్యమైన వాళ్ళను ఉపాసించిన నిత్యమైన మోక్షం ఎట్లా కలుగును? అదెన్నటికి సాధ్యం కాని పని. కొన్ని కర్మలు చేసిన చంద్రమండల నివాసం కలుగును. ఆ పుణ్యం తరిగిన వెంటనే తిరిగి భూలోకమందు జన్మించడం సత్యం.

'ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ । తత్ర చాంద్రమానం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే' అని శ్రీకృష్ణ భగవానుడు వచించాడు. అనగా పొగ, రాత్రి, కృష్ణపక్షము, ఆరునెలలతో గూడిన దక్షిణాయనము, ఏ మార్గమున గలవో ఆ మార్గమున వెడలి, సకామ కర్మయోగి చంద్ర సంబంధమైన ప్రకాశమును పొంది, మరల వెనుకకు వచ్చుచున్నాడు. అనగా భూమండలమున జన్మించుచున్నాడు. పైగా చంద్రుడు దేవతలకు అన్నమని చెప్పుచున్నది. అట్టివాణ్ణి ఎట్లు సేవించినను ముక్తి రానేరదు. ఒక్క చంద్రలోక ప్రాప్తి మినహాగా చంద్రోపాసకునకు లభ్య మయ్యేది మరి యొకటి కానరాదు. కనుక ఇంతటితో మీ మూఢత్వమును విడనాడి జ్ఞానము నార్జించుకొని ముక్తులు కండు! జ్ఞానమే ముక్తికి మార్గము' అని బోధించారు.

శివభూషణాదులు శ్రీజగద్గురువుల తత్త్వబోధను విని తమ మతమును విడనాడి శ్రీశంకరపాదులకు శిష్యులై అద్వైతతత్త్వ జ్ఞానార్జన చేయుచు సుఖముగ నుండిరి. పిమ్మట కుజుడు మొదలైన గ్రహోపాసకులు శ్రీశంకరపాదులతో వాదించ వచ్చియున్నారు.

## 5.46 కుజాది గ్రహోపాసకులు

గ్రహములు తొమ్మిది. అందు మొదట రవి చంద్రుల నుపాసించువారు శంకరులతో వాదించి అద్వైతులయ్యారు. మిగిలినవారు కుజ, రాహు,

గురు, శని, బుధ, కేతు, శుక్ర మతముల వారున్నారు. వారందరు శ్రీశంకరాచార్యులను దర్శించి,

'స్వామీ! అనేక నమస్కారములు! అంగారకుడు మొదలయిన గ్రహముల నుపాసించిన ముక్తి కలుగునని వేదమందు వచించబడియున్నది. మేమందరము అంగారకాది గ్రహోపాసకులము. మా ఉపాసనలతో తప్పక మాకు ముక్తి కలుగుచున్నది. కావున ముక్తిని పొందగోరువారు మావలె శ్రద్ధతో కుజాది గ్రహములనుపాసించవలెను అన్నారు.

శ్రీశంకరదేశికేంద్రులు కుజాది గ్రహోపాసకుల ఆశయము విని,

'భక్తులారా! గ్రహాల నుపాసించిన ముక్తి లభింపదు. అట్టి ఉపాసన గ్రహపీడలను వదల్చుకొనుట కుపకరించును. తత్త్వజ్ఞానం వల్లనే ముక్తి కలుగుచున్నదని 'సదేవ' మొదలగు వాక్యములు ప్రమాణములుగ నున్నవి. కావున నవగ్రహోపాసనలు విడనాడి ఆత్మతత్త్వ జ్ఞానమునకై పాటుపడుడు!' అని బోధించారు. అంతట గ్రహోపాసకు లందరు శ్రీశంకరపాదుల మాటల యందు గౌరవముంచి శ్రీజగద్గురువులకు శిష్యులై ఆత్మతత్త్వము నాశ్రయించి జ్ఞానులై సుఖమును పొందిరి. పిమ్మట క్షపణకు డనువాడు శ్రీశంకరపాదుల శిష్యగణమందు వేచి యున్నవాడు, శ్రీశంకరాచార్యస్వామి వారి పరీక్షకు సిద్ధపడెను.

## 5.47 క్షపణకుడు శిష్యుడగుట

ఆరుమాసముల క్రితం శ్రీశంకరాచార్యుల ఆజ్ఞకు బద్ధుడై గోలయంత్ర తురీయయంత్రములను ధరించిన క్షపణకుడను కాలమతస్థుడు ఉండబట్టలేక శ్రీజగద్గురువుల కడ కరుదెంచి, నమస్కరించి,

'స్వామీ! చిరకాలము నుండి మీకడ నుండిపోతిని. నన్ను పరీక్షింతు నంటిరి. కాని మీకడ సుఖముగ నుంటిని. నన్ను మన్నించి నా మతవిధానము వినుడు!' అనగా శ్రీశంకరపాదు లంగీకరించి వివరించమనిరి.

'పరాత్పరా! కాలమే పరబ్రహ్మమని మేము నమ్మియున్నారము. ముక్తి కోరువారు మా కాలదేవుణ్ణి ఉపాసించవలెను. ఆయన మాకు ముక్తి నిచ్చుచున్నాడు. తాముము మావలెనే కాలదేవుని ఉపాసించుడు!' అని క్షపణకుడు వివరించెను.

వాని మాటల కాశ్చర్యపడి శ్రీశంకరాచార్యులు 'కాలము గూడ పరబ్రహ్మము నుండియే ఉత్పన్నమైనది. పుట్టినది నిత్యము కాదెప్పుడును. కనుక దాని నుపాసించ తగదు. కాలోపాసన వలన ముక్తి రాదు. ఇకనైన నీ బుద్ధి మార్చుకొని అద్వైత మతము నాశ్రయించుమా! అదియే నీకు ముక్తి నిచ్చును' అని బోధించారు. క్షపణకుడు తక్షణం తన మతమును విడిచి శంకరులకు శిష్యుడై అద్వైతము నాశ్రయించాడు.

## 5.48 పితృమతస్థులు

సత్యకర్మ మొదలయిన పితృ మతస్థులు తమ మత విధానమును తెలిపి శ్రీశంకరులను ఒప్పించుటకు వచ్చి నమస్కరించారు.

'స్వామీ! పితృ దేవతలు ఎల్లపుడు ముక్తులయి ఉన్నవారు. వాళ్ళను సేవించుట వలన ధర్మాదులు లభించి ముక్తి కలుగుచున్నది. వారలకు నిత్యము పితృ తర్పణములు వదలుచుండ వలెను. శ్రాద్ధాదులు శ్రద్ధతో పెట్టవలెను. అట్లు చేసిన గృహస్థులు ముక్తులగుచున్నారు. పితృలోకము చంద్రమండలమునకు పైగా నున్నది. చాంద్రమానమును బట్టి ప్రతీ అమావాస్య పితృదేవతలకు మధ్యాహ్న కాలమగును. మానవమానం ప్రకారము పితృదేవతలకు ఒక దినమగుచున్నది. అమావాస్యనాడు పితృదేవతలకు భోజన మిడిన వాళ్ళు ప్రతీ దినము భోజనము చేసినట్లగును. మనమట్లు చేసిన పితృదేవతలు నిత్య తృప్తులగుదురు. ప్రతీ అమావాస్యనాడు పిండపితృ యజ్ఞము లాచరించ వలనీ యున్నది. కావున పితృదేవతోపాసన చేసినవారు తప్పకుండ ముక్తిని పొందెదరు" అని వివరించారు పితృ మతస్థులు.

శ్రీశంకరాచార్యస్వామి అది విని 'కర్మలు చేయుట వలన ముక్తిరాదని వేదం వచించుచున్నది. అందువలన మీరాడిన మాటలలో సత్యం దూరమైనది. ఆత్మతత్త్వ జ్ఞానమే ముక్తినిచ్చునని పరమప్రమాణమై యుండ కర్మ చేయడం వలన ముక్తి కలుగు ననుటకు ఆస్కార మెక్కడ? కర్మాచరణ ద్వారా చిత్తశుద్ధి మాత్రమే కలుగుచున్నది. చిత్తశుద్ధి గలిగినవాడు సద్గురువుల నాశ్రయించి తత్త్వ విచారణ చేయ వలసి యున్నది. దానివలన ముక్తి తప్పక సిద్ధించును' అని బోధించారు. అంతట సత్యశర్మాదు లందరు తమ తమ మతములను విడనాడి శ్రీశంకరాచార్యులను శరణుజొచ్చి శిష్యులై జ్ఞానమార్గము నవలంబించిరి.

## 5.49 గరుడ శేష భక్తులు

గరుడ శేష భక్తులు శ్రీశంకరుల జూడ వచ్చారు. అందు కుజ్వలీటుడు ఆదిశేషుని భక్తుడు. శంఖపాదుడు గరుడ భక్తుడు. వారిరువురు వారివారి మతస్థులలో గురువులై యున్నారు. వారిరువురు శ్రీశంకరపాదులను జేరి నమస్కరించి,

'యతీశ్వరా! మా మనవి చిత్తగింపుడు! ఆదిశేషుడు శ్రీ పరమేశ్వరునకు సర్వదా శయ్యాసుఖమును కలుగజేయుచున్నాడు. అందువల్ల మేమందరము ఆదిశేషుని ఉపాసించుచున్నాము' అన్నాడు కుజ్వలీటుడు.

'పరమేశ్వరునకు నిత్యం వాహన సౌఖ్యమును కలుగజేయుచున్న గరుత్మంతుని పరమభక్తితో సేవించుచుందుము' అని శంఖపాదుడు వివరించాడు.

వారిరువురి విధానములను విని, 'ఓయీ! భక్తులారా! శయ్యను, వాహనమును ఉపాసించిన ముక్తి రానేరదు. మీకు ముక్తి కావలెనన్న పరాత్పరునే సేవించుడు! ఆ దేవదేవుని దయకు పాత్రులు కండు. ఆయన దయ వలన తత్త్వజ్ఞానార్జన ప్రాప్త మగును. తద్వారా ముక్తిని పొందుదు'

అని శ్రీశంకరాచార్యులు తెలియజెప్పిరి. అంతట వారిరువురు సంతసించి జగద్గురువులు వచించిన విధానము ననుసరించుటకు నిశ్చయం చేసికొని శ్రీశంకరాచార్యుల నాశ్రయించి శిష్యులైనారు.

## 5.50 సిద్ధోపాసకులు

'స్వామీ! నమస్కారములు! మేమందరం సిద్ధుల అనుగ్రహంతో మంత్రాలను పొంది యున్నారము. శ్రీశైలము మొదలైన దివ్య స్థలములలో సత్యనాథుడు మొదలయిన అనేకమంది సిద్ధు లుంటున్నారు. వారందరు మంత్రసిద్ధి ప్రభావం వలన చిరకాలము నుండి అట్లనే ఉండి పోయారు. మేము కూడ వారివలెనే చిరకాలము నుండి జీవించుచున్నాము. అనేక విద్యలు అంజనాదులు మా యధీనమైనవి. మమ్ములను కాదనువారికి శక్తి చాలదు. కనుక తాము కూడ మా వలెనే సిద్ధులై ప్రసిద్ధికెక్కుడు' అని తమ ఉపాసనా విధానమును విశదపరిచారు.

శ్రీ శంకరపాదులు సిద్ధుల ప్రజ్ఞ విన్నారు. 'సిద్ధోపాసకులారా! విచిత్ర వేషములు దాల్చుట వలన ఆడంబరమే మిగులును. అజ్ఞానముతో మాటలాడుట యుక్తము కాదు. వేషాదుల వలన ద్రవ్యార్జనకు అనువుగా నుండిన నుండవచ్చు. అట్టి ద్రవ్యము పాపభూయిష్టమగును. ఆ ద్రవ్య మనుభవించిన వాడు పాపి యగును. ఈ శరీరములు సర్వదుఃఖములకు నిలయములు. ఎంత కాలం జీవించిన నేమి ఫల మున్నది? చిరజీవికి ఆత్మసుఖం లేనప్పుడు జన్మ సార్ధకము కానేరదు. కావున తరణోపాయము పొందుటకు జ్ఞానమార్గము నవలంబించుడు. తద్వారా ముక్తిని బడయుడు' అని తెలియజెప్పగా సిద్ధులు శంకర సూక్తులు మనమున నాటి వారి మతమును విడచి శ్రీశంకరపాదులకు శిష్యులై కృతార్థులయ్యారు.

## 5.51 గంధర్వోపాసకులు

గంధర్వోపాసకులు శ్రీశంకరాచార్యులను తమ మతములో కలుపుకొన నెంచి, సమీపించి,

'యతీశ్వరా! విశ్వావసుడనే గంధర్వుడు మాకు ప్రభువై దైవముగ నున్నాడు. ఆతడు గంధర్వులకు దేవుడు. అట్టి వానిని మేము సదా భక్తిశ్రద్ధలతో పూజించు వారలము. ఆ దేవుని అనుగ్రహంతో మే మందరము గాన మందలి నాదబిందు కళాత్మకమైన విజ్ఞానంతో ఆరితేరిన విద్వాంసులమై యున్నాము. దీని వలన మేమందరము కృతార్థులమై ముక్తిని బడయుచుంటిమి. తామును మావలెనే గాంధర్వ విద్య యందు కళాపూర్ణులై ముక్తిని పొందుడు' అని కోరిరి. అంతట శ్రీశంకరాచార్యులు, 'భక్తులారా! మీ పలుకులు వేదములకు వ్యతిరేకముగ నున్నవి. ఇది మీకు న్యాయమేనా? పరమాత్మ శబ్దాదులకు అతీతమై ప్రకాశించుచున్నదని వేదమున తెలుపబడినది. మీ గాంధర్వ విద్య శబ్దముతో గూడి యున్నది. అందువలన ఇది పరబ్రహ్మ విద్య కానేరదు. పరబ్రహ్మ ఎట్టివాడుగ నున్నాడో వినుడు. ఆతడు నిత్యుడు, అవ్యయుడు, ఆదిమధ్యాంతములు లేనివాడు, నిశ్చయుడు, శబ్ద స్పర్శ రూప రస గంధ రహితుడు, మహత్తత్త్వము కన్న పరమైనవాడు. అట్టి పరమాత్మను తెలిసి కొనినవాడే ముక్తుడు కాగలడు. కావున మీరందరు నాదబిందు కళాతీతమగు పరాత్పరుని ఉపాసించుడు. అందువలన తప్పక ముక్తి లభించును' అని ఉపదేశించగా గంధర్వోపాసకులందరు శ్రీశంకరాచార్యులను ఆశ్రయించి శిష్యులయ్యారు. అద్వైతజ్ఞానము నార్జించుకొని నిత్యానందమును పొందిరి.

అటు తరువాత భేతాళోపాసకులు చితాభస్మము (స్మశాన భస్మము)ను ధరించి శ్రీశంకరపాదులను సమీపించి నమస్కారములు చేసిరి.

## 5.52 భేతాళ మతస్థులు

శ్రీశంకరపాదుల యెదుట తమ మతమును ప్రతిష్ఠింప జేయనెంచి భేతాళ మతస్థులు,

'శ్రీ ఆచార్యవర్యా! మేమందరము భేతాళుడు మొదలైన భూతములను ఉపాసించుచు లోకములను మా యధీనమం దుంచు కొనుటకు తగిన

సమర్థుల మైతిమి. కావున తాము కూడ మావలెనే ఉపాసించిన లోకములు మీ యధీనమం దుండ గలవు' అని తెలియజేసిరి.

శంకరు లది విని, 'భక్తులారా! మీరందరు బ్రాహ్మణులు గదా! మీరిట్టి నీచమైన ఉపాసనలు చేయకూడదని శాస్త్రములు వచించుచున్నవి. సత్కర్మల కట్టి భూతములు ఆటంకములు కలుగ జేయుచున్నవి. సత్కర్మాచరణకు ముందుగా 'అపసర్పన్తు యే భూతా యే భూతా భూమి సంస్థితాః । తే భూతా విఘ్నకర్తార స్తే నశ్యన్తు శివాజ్ఞయా' (భూమి మీద ఏ భూతములు గలవో అవన్నియు దూరముగా నుండుగాక, సత్కర్మలు చేయుటకు ఏ భూతములు విఘ్నములు చేయుచున్నవో అవన్నియు శివుని ఆజ్ఞచే నశించుగాక) అని వచించెదరు. అప్పుడ వన్నియు దూరముగ తప్పుకొనును. ఇది శాస్త్ర ప్రమాణము. సత్కర్మల నాచరించని వారు పరమపదమును పొందజాలరు. కావున నింద్యమైన మీ నీచాచారములను వెంటనే వదలుడు. మీ మీ విధికర్మల నాచరిస్తూ ఆత్మతత్త్వమును తెలిసికొని జ్ఞానులు కండు. జ్ఞానము నలవరచు కొనడమే మోక్షము' అని బోధించాడు.

అంతట వారు శ్రీశంకరాచార్యులు తత్త్వరహస్యమును వినిపించుటతో శ్రీశంకరపాదులకు నమస్కరించి ఆశ్రయించారు. ఉత్తమ దేవతలను ఆరాధించుకొనుచు అద్వైతతత్త్వజ్ఞానము నార్జించుకొని ముక్తిని బడసిరి. అంతటితో శ్రీశంకరాచార్యస్వామి విశ్వప్రేమను అనేకమంది మీద కనబరచి దురాచారములను రూపు మాపి కృతార్థులయి యచ్చోటు వీడి పశ్చిమ సముద్రమునకు ప్రయాణమైనారు.

## 5.53 గోకర్ణ క్షేత్రము

బహుమతములలోని లోపములను తెలియజెప్పి శాస్త్రసమ్మతం గాని మతములను విడిచిపెట్టించి తరించు విధానము గల అద్వైత మత విశిష్టతను బోధించి యావద్భారతము సంచారం జేసి కాశీపట్టణం జేరుకొన్నారు.

అచ్చట అనేక మతములను కాదని తత్త్వరహస్యమును వెల్లడించి ప్రేమతో సరియైన మార్గమున త్రిప్పి తద్వారా అద్వైత మతస్థాపన జేసి పశ్చిమతీర ప్రాంతములకు ప్రయాణమై మార్గమధ్యమం దనేక దేశములు దాటి కొలది దినములకు గోకర్ణ క్షేత్రం జేరుకొన్నారు. వెళ్ళీ వెళ్ళడంతో అందున్న పరమశివుని దర్శించారు.

శ్రీశంకరాచార్యుల దర్శనం కొరకు వేలాది జనం శివాలయానికి వెళ్ళి దర్శించారు. ఆనాడా శివాలయం చూడ ముచ్చటైనది. తీరిక సమయములలో ఆలయంలో శిష్యులకు వేదాంత తత్త్వబోధ చేసేవారు. పురవాసులు వచ్చి వినేవారు. హరదత్తుడను శివభక్తుడు బాగుగ విద్యలు నేర్చినవాడు. శ్రీశంకరులిచ్చు ఉపన్యాసములు కడు శ్రద్ధతో విని శ్రీశంకరులు కేవలం అవతారపురుషులని నిశ్చయించుకొన్నాడు. అప్పటికి తన గురువైన నీలకంఠాచార్యుని కంటె గొప్పవాడు లేడని తలంచేవాడు. శ్రీశంకరపాదుల శక్తిసామర్థ్యములు చూచుటతో అతని తలంపు తారుమారైనది. రెండురోజులు శ్రీశంకర దేశికేంద్రుల తత్త్వబోధ విని తన గురువులకు ఆ విషయం విన్నవించుకొనుటకు చాల కుతూహలం కలిగి గురువులను సమీపించి,

'సద్గురువర్యా! వందనములు! మన శివాలయమున యతీశ్వరులొకరు మహాశిష్య గణంతో అరుదెంచి యున్నవారు. లోకంలో ఎందరెందరినో జయించారట! అపజయ మనునది ఆయ నెఱుగరట! మండనమిశ్రుడు మొదలైన దిగ్గజములు వాదమందు విజయం సాధించలేక నిర్వీర్యులై, జగద్గురువులకు శిష్యులై సేవిస్తున్నారు. శ్రీ ఆచార్యస్వామి శిష్యులకు వేదాంత విజ్ఞాన బోధలు చేయుచుండ నేనచ్చోట కొలదిసేపుండి విని యున్నాను. అద్వైత మత ప్రచారమే వారి ముఖ్యాశయమట. దేశమందు గల మతములలో నుండే లోపములను పూర్ణమైన ప్రేమతో సవరించి నిజతత్త్వమును సాకల్యముగ బోధించడమే వారి అవతారాశయ మట! ఆ ఆశయమును

దేశమం దంతట ప్రచారం చేసి విజయపతాకమును చేపట్టి కుమతములను ఖండించి మన ప్రాంతం మిగిలి యున్నదని దీనిని గూడ ఆ విధముగ ఉద్ధరించిన వారి కోరిక నిర్విఘ్నముగ, సంపూర్తి యగు నని వచ్చి యున్నారట! వాదమందు మిమ్ములను గూడ జయించ వలె నన్న ఆకాంక్షతో మన పురమందు బసచేసి యున్నారు' అని మెల్లగ హరదత్తుడు తన గురుదేవులకు వ్యక్తం చేశాడు.

శిష్యుని పలుకులు ములుకులై హృదయాంతరాళ మందు గాఢముగ నాటుకొనగా నీలకంఠాచార్యు లొకించుక సేపు మౌనం వహించి పిమ్మట,

'శిష్యా! నా శక్తిసామర్థ్యములు నీ వెఱుగవా? ఆ సన్న్యాసి సముద్రమును ఎండగట్టగల డనుకో! ఆదిత్యుని అనేక మారులు ఆకాశము నుండి అవనీతలమునకు దింపగల డనుకో! ఈ భూమినంతను ఒక్కపర్యాయం చాపచుట్ట వలె చుట్టగల డనుకో! ఇంకను ఏలాటి ఘనకార్యముల నైనను చేయగల డనుకో! నన్ను మాత్రం జయించడం కల్ల! క్షణంలో అతణ్ణి ఓడించడం స్థిరం! నా చాకచక్యం, నా ప్రజ్ఞ ఆ సన్న్యాసి చవి చూచును. నీకనుమాన మేల?' అని లోన గల పిరికితనమును వ్యక్తం చేయక హేలగా పలికాడు.

లోనికేగి, 'అదేమియో చూచెదను గాక!' అని మనస్సులో తలచి చక్కగా ద్వాదశ స్థానములలోను విభూతిరేఖలను ధరించి, రుద్రాక్షమాలలను అలంకరించుకొని, సాక్షాత్ శివుని వలె తయారై, శిష్యులను వెంటబెట్టుకొని బయలుదేరి శ్రీశంకరాచార్యుల కడకు పోవుచుండెను. శ్రీఆచార్యస్వామిని సమీపించి చేరువన కూర్చుండెను.

## 5.54 నీలకంఠుడు

నీలకంఠుడు జగద్గురువులతో వాదించుట కుద్యుక్తు డైనటుల సురేశ్వరాచార్యుడు గ్రహించాడు. తన చాతుర్యం వాదంలో చూపించెద

నని, నీలకంఠునితో వాదించుటకు జగద్గురువుల నర్థించాడు శ్రీసురేశ్వరాచార్యుడు. అందులకు శ్రీ శంకరపాదు లంగీకరించగా తయారుగ నుండెను. నీలకంఠాచార్యులు దానిని కనిపెట్టి,

'ఓయీ! నీవు నాతో వాదించ నాయత్తపడుచున్నట్లు కన్పట్టుచున్నావు! అలనాడు నీవు, నీ భార్య శ్రీశంకరులతో వాదించి ఓడిపోయి నటులనే నెఱుగనా? నీ ప్రజ్ఞ అందు వ్యక్తమైనది గదా! స్వయంగా ఆచార్యస్వామితో వాదించ నుద్యుక్తుండనై వచ్చితిని. మధ్య నీ యడ్డం నాకేల?' అని సురేశ్వరాచార్యుని తిరస్కరించి శ్రీఆచార్యపాదులవైపు తిరిగి వాదమునకు సిద్ధముగా నున్నటుల వ్యక్తపరిచాడు. అందులకు సర్వసిద్ధముగ నున్న జగద్గురువులు తన యభిమతమును వ్యక్తం చేయగ నీలకంఠాచార్యులు,

'శంకరాచార్యా! బ్రహ్మసూత్రములకు నే నిదివరకే భాష్యమును రచించి యుంటిని. శివతత్త్వమే మానవులకు శరణ్యమని సిద్ధాంతం జేసినాడ' అని ప్రారంభించు నంత శ్రీశంకరాచార్యులు నీలకంఠాచార్యునికి గల ప్రభావమును సంపూర్తిగ వ్యక్తం చేయువరకు వేచియుండిరి. అంత వరకు వెడలగ్రక్కిన విషయములను పట్టుకొని ఒక్కొక్కదానినే తుత్తునియలు గావించిరి. అట్లు ఛేదించుట గమనించి పక్షములు తెగిన పక్షివలె నీలకంఠుడు కూలబడియెను. పట్టుదల వహించి వితండవాదమునకు నడుం బిగించ సమకట్టెను.

'యతివర్యా! తత్త్వమస్యాది మహావాక్యములు జీవబ్రహ్మైక్యమునే ప్రతిపాదించుచున్నవని పలుకుచున్నారు. తాము కూడ అట్టిభావము స్థిరమైనదిగ భావించుచున్నారు. కాని అదెంతమాత్రము సమంజసముగ నున్నటు లొప్పుటలేదు. లోకములో చీకటి, వెలుగులున్నవి. ఆ రెండింటికి విరుద్ధ భావములు సహజముగ నున్నవే కదా! ఆ రెండింటికి భేదము లేదనడం ఎట్లు పొసగును? అదేవిధముగ జీవేశ్వరులు ఒకే ధర్మము గలవారు

కాదు గనుక వారిరువురకు భేదమే సత్యము. జీవేశ్వరులకు భేదము లేదనుట పొసగునది కాదు.

'శంకరాచార్యా! జీవేశ్వరులకు భేదం లేదని ఒప్పించుటకు ఎన్నెన్నో యుక్తులు పన్ని ప్రయత్నించెదరు. అందు 'బింబము-ప్రతిబింబము' అను సామ్యం చెప్పుదురు. బింబము లేకుండ ప్రతిబింబ ముండదు. బింబము వంటివాడు ఈశ్వరుడు. ప్రతిబింబమువలె జీవుడున్నాడని యందురు. అంత మాత్రమున బింబ ప్రతిబింబ సామ్యంతో జీవేశ్వరులకు భేదము లేదని ఒప్పించుట సమంజసము కానేరదు. ఏలయన సూర్యున కుండే గుణములు ప్రతిబింబమునకు లేవుగదా! అందువలన గుణభేదం ఏర్పడి నందున వైరుధ్యము ప్రత్యక్షమగుచున్నది. ఇందు సామ్యం ఎట్లు సమర్ధనీయము? కనుకనే వ్యోమశివుడు మొదలయిన మహామహులందరు దానిని మిథ్య యని స్థిరపరిచినారు. కావున మీరందరు పలుకునది ప్రమాణరహితం.

ఇదియును గాక, బింబము సత్యము, ప్రతిబింబము అసత్యమే గదా! ప్రతిబింబము బింబము యొక్క ఛాయమాత్రమే అయి యున్నది. ఛాయలెన్నటికి సత్యములు కానేరవు. జీవుడు పరమాత్మ యొక్క ప్రతిబింబ మని అంగీకరించిన అది సత్యమెన్నటికీ కాదు. పరమాత్మకు ఉపాధి లేదు. ఉపాధి లేనప్పుడు పరమాత్మకు ఛాయ యెట్లు కలుగును? ఒకవేళ ఉన్నదని ఒప్పుకొనిన ప్రతిబింబమునకు సత్యత్వమే యుండదు. కనుక జీవుడు మిథ్యావస్తువే యగుచున్నది. జీవుడే లేనప్పుడు తేడా లేదనడం ఎన్నటికీ సాధ్యం కానిమాట. అట్లయినచో బంధము లేదు, మోక్షము లేదు.

మరియొక విషయము – 'జీవునకు బ్రహ్మకు ఉపాధులు లేవు, అవి కల్పితము' లనుచున్నారు. ఆ ఉపాధులు నశిస్తే 'జీవుడే బ్రహ్మ' అని అంటారు వేదాంతులు. జీవేశ్వరులలో ఈశ్వరుని వలె జీవుడుండుట లేదు. ఈశ్వరునకు సర్వజ్ఞత్వమున్నది. జీవుడు మూఢుడు, పైగా అల్పజ్ఞానంతో నున్నవాడు.

అందువలన వారిరువురి ధర్మముల లోను తేడాలు స్పష్టముగ నున్నవి. మరియు ఆవులకు గుఱ్ఱములకు ధర్మాలలో తేడాలున్నవి. ఆ ధర్మములను కాదనుటకు ఎట్లు వీలు లేదో జీవేశ్వరులకు చిన్న, పెద్ద అను తేడాలున్నవి. అట్లు కాదనుట ఎవరికీ శక్యం కాదు. 'నేను పరమాత్మను కాను' అనేది కూడ ప్రత్యక్ష ప్రమాణం కలదియే. దీనిని కూడ కాదనుటకు వీలు లేదు. కనుక భేదం లేదని వాదించడం భ్రాంతి కాక మరేమున్నది? లోకమంతా 'నేను, నీవు' 'వాడు, వీడు' అనే భావంతో మునిగి యున్నది. ఇది నా భార్య, వీడు నా కుమారుడు, ఈతడు నా మిత్రుడు అనుచున్నారు. నాకు, వీనికి భేదము లేదనుచున్నారు. భేదము లేకుండ అభేదము రాదు. అప్పుడు కూడ రెండు ఉండి ఉండవలెను. నేనే వాడు, వాడే నేను అన్నప్పుడు భేదం లేకున్నను ఇద్దరు కనబడుచున్నారు. 'నేను బ్రహ్మను' అనినప్పుడు 'నేను' అనువాడొకడు, 'బ్రహ్మ' అనువా డొకడై తీరుచున్నది. కనుక అద్వైతమనునది శుద్ధ అబద్ధమైంది. గనుక ద్వైతమే స్థిరం' అని నీలకంఠుడు తనలో నున్న దంతయు వెలువరించెను.

శ్రీశంకరాచార్యులు నీలకంఠుని ఉపన్యాస మంతయు విని,

'ఓయీ! మీ విధానము ననుసరించి మీకు తెలిసియున్నంతవరకు వచించి యున్నారు. అది సత్యం కానేరదు. ద్వైతమునకు అతీతమైనది, ఉపనిషత్తులలో నిర్వచించిన అద్వైతము సత్యమై యొప్పారుచున్నది. బ్రహ్మాదులు పరబ్రహ్మము కంటె గొప్పవారు కారు. పరాపరమైనది ఆ పరబ్రహ్మమే. అట్టి చైతన్యస్వరూపుడైన పరబ్రహ్మమును మహావాక్యము స్థిరపరచుచున్నది. జీవునకు ఉపాధి యున్నది. కారణమనే ఉపాధి గలవాడు ఈశ్వరుడు అని శ్రుతి స్పష్టముగ తెలుపుచున్నది. కనుక 'తత్త్వమసి' జీవేశ్వరులకు అభేదమునే ప్రతిపాదించుచున్నది.

'తత్త్వమసి' మహావాక్యములో ఆ పరమాత్మ నీవు అను అర్థమును వివరించుటలో విరోధమే కలుగుచున్నది. ఇందులో జీవేశ్వరులను

అంగీకరించుట చేత భేదము కనబడుచునే యున్నది. చైతన్య పదార్థం ఒక్కటే గాని రెండు కాదు. అది నిత్యమైనది. ఉపాధులు కేవలం కల్పితములు. సత్యం కాదు. కనుక ఉపాధులను లెక్కలోనికి తీసుకొని రాకూడదు. 'తత్–త్వం' అనునవి మాటలు రెండైనా అందు విరుద్ధముగ నున్నదానిని విడచి సత్యమైన దానినే గ్రహించవలెను. చైతన్యం సత్యమైనది గనుక దానినే గ్రహించ వలసి యున్నది. ఇక తత్త్వమసి పరమాత్మనే తెలుపుచున్నది. పరమాత్మ ఒక్కటే కాని ఇన్ని లేవు. ఆనాడెచ్చటనో కాన్పించిన దేవదత్తుడు ఈనాడు మరియొక చోట కాన్పించినప్పుడు (సోయం దేవదత్తః) ఆతడే ఈతడు అని చెప్పడంలో తేడాయే లేదు. కాల వ్యత్యాసమందును, రూపురేఖాదులలోను తేడా గలదు. అట్టి తేడాలున్నంత మాత్రం చేత ఆతడు వేరుకాక పోలేదు. ఆలాగుననే తత్త్వమసి మహావాక్యంలో తత్ (నేను), త్వం (నీవు) ఈ రెండు పదములకు భేదము లేదు. 'సోయం దేవదత్తః' అను దృష్టాంతము ఇచట ప్రస్తావనకు ప్రసిద్ధము, సమంజసము. అందులో గల విరుద్ధాంశములను విడనాడినచో దేవదత్తుడు ఒకటిగానే ఉన్నాడు. (ఆనాటి దేవదత్తుడు చిన్నవాడు, ఈనాటి దేవదత్తుడు ముసలివాడు, గడ్డములు, మీసములు వచ్చి నెరసి యున్న వాడు, త్వరలో పోల్చుటకు శక్యం కాని వాడు) రెండుగా లేడు. తత్, త్వం పదములు వేరైనను జీవేశ్వరులకు భేదం చూపుట లేదు. రెంటికీ తేడా లేకపోవడ మనేది పరమసత్యం' అని సహేతుకముగా వివరించారు.

శ్రీశంకరపాదుల వచనములు నీలకంఠాచార్యులు విని, 'శంకరాచార్యస్వామీ! జీవుడు కొద్దిపాటి జ్ఞానం కలవాడు. ఈశ్వరుడు సర్వజ్ఞాని. జీవుని రూపం చిన్నది. ఈశ్వరుని రూపం పెద్దది. పైగా వారిరువురి రూపములు కంటికి కన్పించుట లేదు. అందువలన గుణములను బట్టి జీవేశ్వరులకు భేదాభేదములు నిర్ణయించ వలసి యున్నది. కనుక లక్షణములను బట్టి తత్త్వమసి యందు తేడా ప్రబలముగ నున్నది. అందువలన జీవేశ్వరులకు అభేదమనుట మీ వంటి వారికి తగునా?'

అంతట నీలకంఠుని జవాబు విని, శ్రీశంకరపాదులు, 'నీవనుకొన్నది కల్పితం కాని నిజం కాదు. ముత్యపు చిప్పలో వెండి కనుపించుచున్నది. అది నిజమా? కాదు. అది కేవలం కల్పితం. పరమాత్మ స్వరూపంలో జీవుని రూపం ముత్యపు చిప్ప లోని వెండివలె కల్పితమే యగుచున్నది. కల్పిత వస్తువు ఒకటి ఉన్నప్పుడు, అకల్పిత వస్తువునకు నిజమైనది ఒకటి ఉండితీరవలెను. జీవేశులు కల్పితములైనప్పుడు అందుకు నిజమైనది పరమాత్మునిగా అంగీకరించవలెను. త్రాడును చూచి పామనుకొన్నప్పుడు త్రాడుని మించి పాము ఎట్లుండునో కల్పితము (త్రాడు)నకు అధిష్ఠానమైనది పామే కనుక జీవేశ్వరులకు స్వరూప నిర్ణయం చేయకూడదు. 'అల్పుడు, విజ్ఞుడు' అనడం కేవలం కల్పితమే యగుచున్నది. సద్వస్తువును అందరు అంగీకరించి తీరవలెను. 'దేహాది ఉపాధులు జీవునకు స్వరూపం. దీనికి అధిష్ఠానం పరమాత్మ' అని ఒప్పుకొని తీరవలెను.

ఈ కనబడు శరీరము, అందున్న ఇంద్రియములు జడములే యగుచున్నవి. ఈ జడవస్తువులకు అధిష్ఠానమైనది జీవుడు. అది జీవస్వరూపంలో ఉన్న చైతన్యం సర్వలక్షణమైనది; ఏకరూపములో నున్నది; అద్దానినే పరమాత్మ అందుము. ఆ పరమాత్మ స్వరూపమే ఈ జగత్తు. జగత్తు పరమాత్మకు మాయోపాధి. అందువలన అది నిజం కాదు. ఈ జగత్తంతా జడమై యున్నది. దీనికి అధిష్ఠాన మేదియో తెలిసికొన వలసి యున్నది. అదే సత్యవస్తువు. ఆ సత్యవస్తువే పరమాత్మ.

జీవేశ్వరులకు ఉపాధులు కల్పించడమే యని ఇదివరలో చెప్పబడి యున్నది. అది చైతన్యం మాత్రమే. శుద్ధస్ఫటికం వద్ద ఒక ఎఱ్ఱని పుష్పమున్నప్పుడు అప్పుడా శుద్ధస్ఫటికం ఎఱ్ఱగా ఉన్నట్లే కన్పించును. అట్లా స్ఫటికం ఎఱ్ఱగా కనుపించినా స్ఫటికములో మాత్రం ఎరుపు లేదు. దాని నిజమైన రంగు తెలుపే గదా! అట్లుగనే కల్పించబడిన ఉపాధులను బట్టి చైతన్యం జీవేశ్వరులుగ తోచును. కనుక జీవేశ్వరుల వలె కాన్పించుచున్న

చైతన్యమునకు మూఢత్వము లేదు, సర్వజ్ఞత్వము లేదు. అది కేవలం నిర్గుణమే.

జీవేశ్వరులకు భేదముం దనుకొను వానికి మోక్షం రాదు సరికదా మృత్యువు ప్రాప్తించును. అట్టి వానికి సంసారసాగరం తప్పదు. జీవేశ్వరులకు భేదం లేనట్టి వారికి మోక్షం కలుగుచున్నది. ఇట్టి విధముగ శ్రుతులు తెలుపుచున్నవి. జీవేశ్వరులకు భేదము కన్పట్టుచుండిన వానికి తత్త్వశాస్త్ర శ్రవణం లేదన్నమాట. చంద్రు డాకసమున కాస్తగ గోచరించును. బహుదూరమం దుండుట వలన అట్లు చిన్నదిగ కాన్పించుట భ్రమ మాత్రమే. విచారించగ చంద్రుడు చిన్నవాడు గాడని తేలుచున్నది. అట్లుగనే 'నేను శివుడను గాను' అనుకోవడం భ్రమ మాత్రమే యగుచున్నది. ఈ భ్రాంతి పోవలయు నన్న వేదాంత తత్త్వ విచారణ చేయవలెను. భ్రాంతి సత్యం కాదు కదా! కనుక 'తత్త్వమసి' జీవేశ్వరులకు భేదము లేదనునది సత్యమే యగుచున్నది. అంతట నీలకంఠుడు,

'శంకరా! కపిలుడు మొదలయిన మహర్షులు జీవుని స్వరూపమును, ఈశ్వరుని స్వరూపమును బహు స్పష్టముగ వివరించి యున్నారు. వారిరువురికి ఉండు భేదమును గూడ బాగుగ వివరించి నిరూపించి యుండగ తాము దానిని వ్యతిరేకించి, రెండూ ఒకటే యనుచున్నారు. పదుగు రాడు మాట పాడియై చెల్లవలెను గదా! మీ ఒక్కరి మాట నేనెట్లు ఒప్పుకొనగలను?'

శ్రీశంకరాచార్యు లంతట, నీలకంఠాచార్యుని సంశయము నివారణ చేయనెంచి,

'శ్రుతులకు, స్మృతులకు విరోధము వచ్చినపుడు శ్రుతి వాక్యమునే అంగీకరించ వలెను. దుర్బలమైన స్మృతివాక్యం అంగీకరించ కూడదు. ఇదే న్యాయము. కపిలుడు మొదలయిన మహాత్ముల వాక్యముల కంటె

'తత్త్వమసి' బలవ్మై యున్నది' అని తెలియజెప్పెను. అంతట నీలకంఠాచార్యులు,

'శంకరాచార్యా! వేదములకు విరోధముగ నున్న స్మృతి వాక్యములు విడిచిపెట్ట మనడంలో సబబు గాన రాదు. మహర్షుల పలుకులు యుక్తియుక్తమై యున్నవి. అవి వేదములతో సమముగా నుండును. కనుక మహర్షుల వాక్యములు వృథా అనడం పాడి గాదు. జీవుడు సుఖము వేరుగను, దుఃఖము వేరుగను అనుభవించుచున్నాడు. అందులో ఒక జీవుడు సుఖమును, ఒక జీవుడు దుఃఖమును అనుభవించుచుండుట అందరెరింగినదే! అందరు సుఖంగా ఉండుట లేదు. ఈ శరీరములలో ఉండు జీవాత్మలు వేరుగను చాలగను ఉంటున్నవి. ఆత్మ ఉన్నప్పుడు అలా జరుగదు. కనుక ఆత్మలు కూడ అనేకమని తేలినది. లేనిపక్షమందు లోక మందు జరుగుచున్న వ్యవహారము లన్నియు ఒకేరీతిని ఉండవలెను. అందుకనే మహర్షులందరు ఒకటి కాదని నిశ్చయించారు. ఒకే ఆత్మ అయిననాడు అంతా దుఃఖముతోనైనను ఉండవలెను. లేకున్న అందరు సుఖముగనైనను ఉండవలెను. అలా ఉంటున్నారా? ఒకరిని సుఖీ అని, వేరొకరిని దుఃఖీ అని అనుచున్నారెందుకు? ఒకరికి ముక్తి వచ్చిన అందరికీ వచ్చును. ఇదంతా అందరు ఎఱిగినదే. కాదనుటకు ఎవరును లేరు.

యతివర్యా! ఇది యటుండ వేదాంతులు ఆత్మను, 'అకర్త, అభోక్త' యనుచున్నారు. కర్త అయినను, భోక్తయైనను అంతఃకరణమే యనుదురు. ఇవి ఆత్మకు లేవనుచున్నారు. జీవునకు చైతన్య మున్నది గనుక కర్త, భోక్త గూడ అతడే. అంతఃకరణము జడము, జ్ఞానము లేనిదియును. అట్టిదానిని కర్త, భోక్తయనుట సమంజసముగ లేదు.

యతీశ్వరా! మరొక్క విషయమును తెల్పెద నాలకించుము! మోక్షము సుఖము నిచ్చునని తెలుపుచున్నారు. లోకములో ఎక్కడ జూచినను సుఖమున్నచోట దుఃఖమే కనుపించుచున్నది. సుఖము, దుఃఖమును

వెంటబెట్టుకొనియే యున్నది. ఆలోచింపగ సుఖము సుఖము కాదనియే తేలుచున్నది. విష మిళితమైన ఆహారమునెట్లు విసర్జించవలెనో సుఖము నావిధముగనే విడిచిపెట్టవలెను. సర్వదుఃఖములు నాశనమైన నాడే మోక్షం లభించునని మేము తెలుపుచున్నారము. మీరు మాటాడునది మోక్షము కానేరదు' అంతట శంకరాచార్యులు,

'పండితోత్తమా! సుఖమునైనను, దుఃఖమునైనను పొందునది మనసే. మనస్సున కట్టి ప్రభావమున్నది. అది ఇంకను బహు విచిత్రమైన ప్రభావం గలది. ఆత్మకట్టి ధర్మములు లేవు. అంతఃకరణములు తేడాగా నుండును గాని ఆత్మ కట్టి ధర్మములు లేవు. ఆత్మ ఒక్కటియే. స్థూల సూక్ష్మ శరీరములు రెండును జడము లయినను చైతన్య సంయోగము కర్తృత్వమును కలుగజేయుచున్నది. చైతన్య సంయోగము లేనిచో ఇంద్రియములు కదలనే కదలవు. సూర్యుని కాంతితో ప్రాణులన్నియు తమతమ దైనందిన వ్యాపారములు ఎట్లు నిర్వర్తించుకొన గలుగు చున్నవో ఆ సూర్యుడు అందరికీ ఎట్లు సాక్షీభూతుడుగ నుంటున్నాడో ఆత్మ సూర్యుని వలెనే సాక్షియై వెలయుచున్నాడు. వెలుగు నిచ్చుచున్న సూర్యునకు కర్తృత్వం లేదు. సాక్షీభూతుడైన ఆత్మకును కర్తృత్వ భోక్తృత్వములు లేవు. చైతన్యము లేని శరీరములను శవము లందురు.

సుఖము లన్నియు దుఃఖములతో కూడి యున్న వనునది సత్యము. ఐతే అది మామూలుగ జరుగుచున్న పని. అసలు సుఖమనగ దుఃఖము లేనిది. ఆనందముతో గూడినది బ్రహ్మసుఖము. అది ఎక్కడో లేదు, తన లోనే యున్నది. అది దేని వలన కలుగునది కాదు. దుఃఖం నశించినంత మాత్రమున మోక్షము రానేరదు. స్వానుభవం వలననే బ్రహ్మసుఖం కలుగును. వచ్చినది ఎన్నటికీ పోదు. అది అనంతమైనది' అని నీలకంఠాచార్యుల పూర్వపక్షము లన్నియు ఖండించి, ఆయన అనుమాన పిశాచములను పారద్రోలి, పరమ ప్రమాణములతో ద్వైతమును కాదని అద్వైత మతమును

స్థాపించారు. అంతటితో నీలకంఠాచార్యులు చెప్పునది లేకపోయెను. శ్రీశంకరాచార్యులు నీలకంఠుని చేతిలో ఓడిపోవడం నిశ్చయ మనుకొన్న వారు నిస్పృహ జెంది శ్రీజగద్గురువుల అఖండ ప్రజ్ఞకు అబ్బురపడిరి. ఆ వార్త దేశమంతట వ్యాపించినది. ఆ క్షణమందు శిష్యులు కూడ నీలకంఠునితో పాటు ద్వైతభావమును వీడి శైవభాష్యమును శ్రీశంకరపాదుల కర్పించి పాదాక్రాంతులై శిష్యులయ్యారు.

నీలకంఠాచార్యుల గురువు ఉదయనాచార్యుడు. ఆయన అద్వైతమతమును వ్యాప్తి చెందకుండ అణగద్రొక్కనెంచిన వారలలో ఉద్దండుడు. శిష్యులు, ప్రశిష్యులు శ్రీశంకరపాదులకు శిష్యులైనా రనిన వార్త విని, అడలిపోయి నిర్వీర్యుడై ఆహారం సహించక శల్యగతుడయ్యాడు. స్వామి ఆ ప్రాంత మంతయు అద్వైతమత స్థాపన జేసి మరికొన్ని దినములకు ద్వారకా నగరమునకు ప్రయాణమైనారు.

## 5.55 ద్వారకానగరము

శ్రీరామచంద్రమూర్తి రాక్షస సంహారం చేసి శిష్టులను రక్షించి దిగ్విజయంతో అయోధ్య చేరుకొన్నారు. లోకమంతయు సంతోషించినది. బ్రహ్మాది దేవతలందరు అపరిమితానంద భరితులయ్యారు. అట్లుగనే శ్రీశంకరావతారమూర్తి నీలకంఠాచార్యులను జయించడం, ఆవార్త లోక మంతయు విని, శ్రీజగద్గురువుల ప్రజ్ఞకు, పరమతముల నుద్ధరించుటకు వ్యక్తంచేసిన విశ్వప్రేమకు అబ్బురపడినది. పశ్చిమ తీరమంతయు ఉద్ధరించి అద్వైత పతాకము నెగుర వేసి మహాపండితుల స్తోత్రములను నిమిత్తమాత్రుడై స్వీకరించుచు శ్రీశంకరపాదులు, శ్రీకృష్ణుడు ద్వారకానగరమును ప్రవేశించినట్లుగనే ప్రవేశించారు. ఆ వార్త వినుటతో పురజనులు అశేషం వచ్చి శ్రీస్వామిని దర్శించారు.

పాంచరాత్రు లనబడు వైష్ణవమత పండితులు ఆగమశాస్త్రమం దారితేరిన వారు శ్రీశంకరాచార్యులను దర్శింప వచ్చిరి. వారందరు భుజముల

యందు శంఖచక్రాంకితములు కాయలు కాచి యున్నవారు. బాణాకారముగను, దండాకారముగను ఊర్ధ్వపుండ్రములను చక్కదిద్దుకొని తులసీ దళములను చెవులయందు ధరించి తులసి మాలలను మెడ నలంకరించుకొని వచ్చారు. వాదించుట యందు వారందరు గడుసరులు. ఎదిరి పక్షమును నేర్పుతో ఓడించగల దిట్టలు. జీవేశ్వర భేదము, జీవుల పరస్పర భేదము, జీవ జడ భేదము, ఈశ్వర జడ భేదము, జడ జడములకు పరస్పర భేదము – ఈ అయిదింటిని పూర్తిగ తెలిసికొనిన వారలకే మోక్షం ప్రాప్తించునని, మిగిలిన వారలకు మోక్షము రానేరాదని వారి మత విధానము ప్రముఖ స్థానము నాక్రమించిన ఆయువు పట్టుగ నున్నది. శ్రీశంకరపాదుల ప్రమేయం లేకుండగనే పద్మపాదాదులు తమ విజ్ఞానముతో పాంచరాత్రులను జయించి అద్వైత సిద్ధాంతమును స్థాపించిరి. పిమ్మట శిష్యసహితం శ్రీశంకరదేశికేంద్రులు ద్వారకను వీడి ఉజ్జయినికి ప్రయాణమైనారు.

## 5.56 భట్టభాస్కరుడు

ద్వారకా నగరము నుండి బయలుదేరి కొలదిరోజులలో ఉజ్జయినీ మహాపట్టణం వేలాది శిష్యపరివారంతో శ్రీశంకరాచార్యస్వామి ప్రవేశించారు. ఉజ్జయిని పురాతన ప్రసిద్ధ నగరము. మహాకాళేశ్వరుని ఆలయము అందున్నది. ఆ సమయము, శ్రీశంకరావతారమూర్తికి సుస్వాగతమనునట్లు మహాకాళేశ్వరునకు అర్చనాదులలో మహా వైభవోపేతముగ సలుపుచున్న దివ్యమంగళ ధ్వనులు చెవుల బడిన శుభ సమయమైనది. అప్పుడు జగద్గురువులు ఆలయం ప్రవేశించి మహాకాళేశ్వరుని వేవిధముల స్తుతించి అచ్చోట గల నొక కళ్యాణ మండప మందు సుఖాసీనులయి విశ్రమించారు. శ్రీశంకరావతార మూర్తి వచ్చా రనిన వార్త నగరం నలుమూలలకు ప్రాకుటతో దివ్యపురుషుని దర్శనార్థమై ఆబాలగోపాలము వచ్చి దర్శించిరి. భట్టభాస్కరుడు మాత్రం రాడయ్యె.

భట్టభాస్కరుడు పండితోత్తముడు. వేదములకు వ్యాఖ్యానం వ్రాసిన దిట్ట. మహాపండితుల మదము నడంచిన మనీషి. శ్రీశంకరులు చూడ దగ్గ వారిలో మిగిలిన పండితుడు భట్టభాస్కరుడే. అందులకే శ్రీఆచార్యస్వామి ఉజ్జయినీ పురం ప్రవేశించారు. అట్టి భట్టభాస్కరుడు తనకు తానుగ శ్రీశంకరులను దర్శించ మనసొప్పునా? ఆ సంగతి శ్రీశంకరపాదులకు అవగాహన గాక పోదు.

వచ్చి రెండురోజులైనను భట్టపాదుడు రాకపోవడం జూచి శ్రీశంకరులు పద్మపాదుని పిలిచి భట్టపాదునకు తమరాకను తెలుప మనిరి. అంతట గురుదేవు నాజ్ఞను ఔదల దాల్చి భట్టపాదుని నివాసమునకు సాగి ఆయనను దర్శించి,

'పండితోత్తమా! వినియుందురు! లోకోద్ధరణకై దేశమందు గల కుమతములను లెక్కకు మిక్కిలిగ ఖండించి, జయలక్ష్మిని చేపట్టి, యావద్భారత భూమి యందు అద్వైత మతమును ప్రతిష్ఠించి, మిమ్ముల నొక్కరిని విడిచి పుచ్చుట భావ్యం గాదని మది నెంచి ప్రేమతో మీ పురం ప్రవేశించారు. జగద్గురువులైన మా శంకర గురుదేవులు లోకోపకారార్థమై వ్యాస విరచిత బ్రహ్మసూత్రములకు అద్వైత పరముగ భాష్యము వ్రాసి యున్నారు. అంతకు పూర్వమే బ్రహ్మసూత్రములకు కొందరు విపరీతబుద్ధితో వ్రాసి యున్నారు. అట్టి వారందరు ఉపనిషత్తుల మార్గమును విసర్జించి తప్పుడు త్రోవల బట్టిరి. దానివలన లోకం సంకటావస్థలో పడిపోయినది. అందువలన విశ్వప్రేమతో శాంతినే ఆశ్రయించి జీవేశ్వరులకు అభేదమునే స్థిరపరచి వేదాంత విజ్ఞాన బీజములను వెదజల్లుచు, లోకమందు ప్రబలి యున్న మోహమును సూర్యుడు చీకటిని మటుమాయం జేయు నటుల జేసి, ఇంకనూ అట్లు జేయ కంకణధారియై మీ నగరం ప్రవేశించారు. కావున తామాచరించుచున్న ద్వైతభావమును విడనాడుడు! లేదంటిరా మీ పక్షం విపక్షం కాకుండ కాపాడుకొనవలసిన భారం మీయందు గలదని

గ్రహించుకొనుడు' అని వినయముగను యుక్తియుక్తముగను వ్యక్తపరిచాడు. పద్మపాదుని మాటలు వినుటతో భట్టభాస్కరుడు అగ్నిలో ఆజ్యము పోసినటుల భగ్గున మండిపడెను. ఆయనలో అంకురించిన తీవ్రతనాపుకో లేకపోయెను.

'ఏమయ్యా! దేశదేశములు తిరిగినాడంటివి! నా సంగతే తెలిసికొనలేక పోయెనా మీ గురువు! కొమ్ములు మొలిచిన పండితుల తలలపై నా పాదములుంచి నృత్యం చేసితి నన్న వార్త వినలేదా? నా మతమును కాదనిన వారి బ్రతుకేమైనదో తెలుసా? తామరతూండ్లను దంతి తినునట్లే. నా యెదుట ఆగుటన నేమియో యని తలంచి యుంటాడు! ఇప్పుడైనను మించి పోయిన దేమీ లేదని పోయి చెప్పు! తెలివి తెచ్చుకొను మనుము! వ్యర్ధప్రలాపముల వలన ప్రయోజన మేమున్నది? న్యాయశాస్త్ర శిఖామణులు తలలు వాల్చి పారిపోయారు! సాంఖ్యులు పలాయనం చిత్తగించి బిలములు దూరిరి! మహామహుల మని పేరుబడ్డ వారనేకులు అడలెత్తి అరణ్యములు చూచుకొనిరి. అట్టి వాళ్ళ వాక్కులు పట్టుకొని వ్రేలాడు మీ గురువా నాతోటి వాదం! సిగ్గు సిగ్గు! మీ వ్యవహారమంతయు వెఱ్ఱిమొఱ్ఱిగ నున్నదే! కిక్కురు మనకుండ దారి తీయుము! పో! పొమ్ము!' అని భట్టభాస్కరుడు ఒడ లెఱుంగక హుంకరించి పద్మపాదునిపై విరుచుక పడియెను.

పద్మపాదుడు ఆ హడావిడులు, వికారములు జూచి చిరునవ్వు నవ్వి భట్టపాదుణ్ణి ఉన్మత్తునిగ భావించి,

'వెఱ్ఱివాడా! ఇంత వివేకము లేకుండ ఎట్లు బ్రతుకఁగలుగు చుంటివి? పరులను తూలనాడుట నీ కలవాటైనది. నీ వెంతటి సమర్ధుడవైనా పరులను దూషించుట పాడిగాదు. సమర్థుడైనవాడు పరుల నెప్పుడు నిందించి మాటాడడు. నీకు గొప్ప పాండిత్య ముండుగాక! లోకాధీశుడు, సర్వజ్ఞుడు, మానవాతీతుడు అయిన జగద్గురువుల కడనా నిలిచేది! రహస్యం వ్యక్తం చేయవలె నన్న అతడవతార మూర్తియని గ్రహించుమా! సూర్యుని వెలుగులో

దీపమునకు కాంతి ఏముండును? ఉలి పర్వతములను పగులగొట్టగలదు. వజ్రమును ముట్టలేదు. గురుదేవుల శక్తిసామర్థ్యములు చవిజూచిన గాని తెలియజాలవు. ఇక్కడ కాదు నీ ప్రగల్భములు! చవి చూచెదవు గాక! నాతో రమ్ము! మావద్ద నీవేమనిన లాభమేమున్నది? ఆలస్యమేల? నే తీసికొనిపోగలను!' అని హేలగా హెచ్చరించాడు.

'ఔరౌరా! ఎంత చులకనగా మాటాడినాడు! నా గ్రామం వచ్చి నా కాహ్వాన మంపగా తిరస్కరించినచో లోకువ కాగలదు!' అని మదిని తలపోసి,

'మేమిదే వస్తున్నారము. నీవు వెళ్ళవచ్చు!' అని భట్టభాస్కరుడు చులకన మాటలతో పద్మపాదుని పంపించెను.

పద్మపాదుని వెంట నడచుటకు సిగ్గుపడి ఆయనను ముందుగ పంపించి చేయునది లేక తన శిష్యులను రావించి వెంట నిడుకొని భట్టభాస్కరుడు ఠీవిగ నడచుచు శ్రీశంకరాచార్యులను కలిసికొనెను. వారుభయులు దగ్గరగ కూర్చొని యుండ వారల ప్రతివాదములు విన అనేకమంది పండితశ్రేష్ఠు లేతెంచిరి. అది యొక్క పెద్ద సభగా మారినది. వాదిప్రతివాదులలో శ్రీశంకరాచార్యులు కేవలం శంకరుడే. రెండవ వారు భట్టభాస్కరుడు. వేదవేదాంగములు వచ్చినవాడు. వేదములకు వ్యాఖ్యానం వ్రాసిన మహనీయుడు. మదగజముల వంటి పండితుల నోడించిన వాడు. జగత్ప్రఖ్యాతి వడసిన మహాపండితుడు. కర్మ మతమందు గాఢమైన అభిమానము గలవాడు. అద్వైతమును ద్వేషించిన వాడు. వ్యాసమహర్షి దృష్టిలో నున్నవాడు. జయింప శక్యముగాని వాడని పేరొందినవాడు.

ఎవరి పక్షసిద్ధాంతమును వారనేక యుక్తులతోను, ప్రమాణములతోను ధృవపరచుకొను చున్నారు. సాటిలేని ప్రతిభతో వాగ్యుద్ధ మారంభ మాయెను. వారుపయోగించు శబ్దజాలము విను వారల కాశ్చర్యము కలుగుచున్నది. యుక్తిపై యుక్తులు ప్రయోగించుచున్నారు. వాద ప్రభావము శ్రోతల కగమ్య

గోచరముగ నున్నది. అది జూచి మహాపండితులు గూడ మూఢులై చిత్తరువు లట్లు జూచుచున్నారు. అట్లు వారిరువురి వాదము కొంత తడవు గడచునప్పటికి భట్టభాస్కరుడు కర్మసిద్ధాంతము నెలవు తప్పుటచే కమలము కమలాప్తుని రశ్మిసోకి కమలినటుల నిర్వీర్యమైనది. అంతట శ్రీశంకరపాదుల తేజము అఖండమై ప్రకాశించుచున్నది. భట్టపాదుడు తన పక్షము ఖండింపబడి యుండుట గ్రహించి ధైర్యము వహించి స్వమత సిద్ధాంతమును విడనాడి పరమతమైన వేదాంత మార్గమును ఖండింప తలపెట్టెను.

భట్టభాస్కరుడంత జీవేశ్వరుల కభేదము సమ్మతము గాదని తనకున్న అనుభవమైన ప్రమాణములు వెడలగ్రక్కెను. శ్రుతి, స్మృతి ప్రమాణము లనేకము లాధారముగ యుక్తియుక్తముగ సత్యమని స్థిరపరచెను. శ్రీశంకరులు వచించిన ధర్మములలో అనేక అనుమానములను వ్యక్తంచేసి జీవేశ్వరాభేదము సత్యము గాదనెను. అంతట ప్రేమతో నుండిన ప్రమాణముగను చక్కగను అరటిపండు వలిచినట్లు సునాయాసముగ అనుమాన నివారణ చేశారు జగద్గురువులు. ద్వైతమతంలో పాతుకొనిపోయి యున్న భట్టభాస్కరుడు శ్రీశంకరపాదులను కాదనుటకు తావులేక విఫలుడై ద్వైత మతమును విడనాడి 'జితోస్మి'యనుచు అద్వైతుడై శ్రీశంకర దేశికేంద్రులను బహు భంగుల కీర్తించి గౌరవించెను. ఆ ప్రాంతమం దున్న అనేకమంది పండితుల కున్న సంశయములను తొలగించిరి. అప్పటినుండి పండితలోక మంతయు పరమశాంతి పొంది నిత్యానంద మనుభవించుచుండెను. అచ్చోట గల వేదబాహ్య మతములను పెక్కింటిని సరిదిద్ది అద్వైత మతస్థాపన గావించి శ్రీశంకరాచార్యస్వామి అవంతి దేశమునకు ప్రయాణమై కొలది దినములకు జేరుకొన్నారు.

అవంతి దేశమందు బాణుడు, మయూరుడు, దండి మొదలయిన మహాపండితులు స్వమతాభిమానముతో గర్వించియున్నారు. వారందరు సకల శాస్త్రములయం దారితేరిన పండితశ్రేష్ఠులు. అద్వైతమత ప్రబోధము

జేసి వారి నందరిని స్వమతములకు దూరం జేసి ప్రస్థానత్రయ భాష్యమును శ్రవణం చేయున ట్లొనర్చిరి. అంతటితో వారందరు శ్రీశంకరులకు గొప్ప భక్తులైనారు. అచ్చోటు విడచి బాహ్లీక దేశము జేరుకొన్నారు.

## 5.57 అర్హుడను జైనుడు

శ్రీశంకరాచార్యస్వామి శిష్యగణంతో బాహ్లీక దేశమందు ప్రవేశించి శిష్యులకు తాము రచించిన భాష్యములను బోధించుచుండిరి. జైనులు వచ్చి శ్రీశంకరపాదుల బోధలు వినుచుండెడి వారు. కాని వారి కది నచ్చి యుండలేదు. జైనమతము 'అర్హత' మను పేరుతో వ్యవహరింప బడుచున్నది. ఒకనాడు అర్హుడొకడు శ్రీశంకరులను సమీపించి 'మా మతవిధానము తమరొక్కసారి వినిన మీ మతమును విడిచి మా మతమును స్వీకరించగలరు! అప్పుడు మాకు శిష్యుడవై వెలుగొందగలవు!' అని మెల్లగ వచించెను. అంతట శ్రీశంకరపాదులు సప్త పదార్ధములెట్టివో వివరించ మనగ అర్హతుడు,

'సప్తపదార్ధ విజ్ఞాన ముండిన గాని మోక్షము లభించదని మా మతము గాఢ విశ్వాసము గలది. ఆ సప్త పదార్ధములను సప్త భంగిచే నెఱుగ వలెనను నియమముతో గూడినది మా అర్హమతము' అని వివరించి సప్తపదార్ధ వివరణము, సప్త భంగి తెఱగులు విశదపరిచెను. అంతట శంకరుడు జీవాస్తి కాయము ఎట్టిదని ప్రశ్నించారు. అర్హతుడంత,

'జీవుడు దేహతుల్య మానముతో గూడి ఎనిమిది రకములైన కర్మలచే బద్ధుడైయున్నా'డనెను. అంతట శ్రీశంకరపాదులు,

'ఓయీ! శరీర పరిణామకుడైన జీవుడు మహత్తు కానేరడు. అణువు గూడ గాడు. ఘటాదులు గూడ మహత్పరిణామం గాని అణు పరిమాణం గలవి గావు. జీవుడే విధముగను రెండును గాడు. జీవుడు మధ్య పరిణామం గలవాడు. శరీరములు చిన్న, పెద్ద, పొట్టి, పొడవుగ నుండుచు ఒకేస్థితి లేకున్నవి. మానవజీవుడు చనిపోయిన తరువాత మానవ శరీరమును విడచి

ఏనుగు శరీరమును ప్రవేశించినపుడు ఆ గజశరీర మంతటను వ్యాపించగలడా? మానవ శరీర మెంత పరిణామం గలిగి యుండునో ఆ కొలతను బట్టి అంతవరకే గజశరీరమం దిమిడి యుండి మిగిలిన గజశరీరము నిర్జీవముగ నుండ వలెను. అట్లే తేనెటీగ శరీరమును ప్రవేశించినపుడు తేనెటీగ యంత పరిమాణమే ప్రవేశించి తక్కినది బయటనుండ వలెను. అట్లు జరుగుచున్నదా? లేదు. కావున జీవుని పరిణామం నిశ్చితమైనది' అని శంకరులు ఖండించగ అర్హతుడు అనేక విధముల తన మతమును ప్రతిష్ఠించుటకు ప్రయత్నించి విఫలు డయ్యెను.

శ్రీశంకరులు మరియొక విషయమును గురించి తెలిసికొన గోరి 'అర్హతుడా! ఆత్మావయవములు చేతనములా? అచేతనములా? చేతనము లనియెదవా అప్పుడవి పరస్పర విరుద్ధ భావములు గలిగియుండి ఐకమత్యం లేకపోవుట వలన శరీరమును బాధించుచున్నవి. లేక జడము లనెదవా మానవ దేహ పరిమితి గలవాడు జీవుడైనందున పూర్తిగా శరీరమును చైతన్యవంతం చేయజాలక పోవును గదా! ఇంక అవయవములలో చైతన్యం లేకున్నచో వృద్ధిక్షయము లుండవు' అని విషయమును అందిచ్చెను. అర్హతుడది విని,

'యతివర్యా! గుఱ్ఱము లనేకములుగ నున్నను ఒకే విధముగ ఐకమత్యంతో రథము నెట్లు లాగుకొని పోవుచున్నవో ఆత్మావయవములు అనేకములుగ నున్నను చైతన్యం పొంది పరస్పర విరోధభావం లేకుండ ఈ శరీరమును నడుపుచున్నవి. అందువలననే శరీరావయవములు శత్రుత్వం లేకుండ వృద్ధి నొందుచున్నవి. అదే విధముగ తగ్గుచున్నవి అని సమాధానమిచ్చెను. శ్రీశంకరాచార్యస్వామి విని,

'అర్హతుడా! రథమును గుఱ్ఱము లనేకము గలసి శత్రుత్వం లేకుండ సంఘీభావంతో ఒకేసారి లాగుచున్నవని వచించితివి. అది బాగున్నది. అట్లా గుఱ్ఱములు లాగుటకు కారణము వేరుగ నున్నది. తోలువాడే కారణుడు.

రథమును నడిపే చాకచక్య మంతయు రథసారధి యందు మాత్రమే గలదని తెలిసికోవాలి. కావున చేతనామయమైన శరీరము రథమును బోలియున్నది. సారథి లేకున్న గుఱ్ఱములు విరోధం లేక సంఘీభావంతో ప్రవర్తించలేవు గదా! అదే విధమున సారథి అనే ఆత్మ లేకున్న అవయవములు పనిచేయ జాలవు. ఆత్మావయవములు ఆత్మ కన్న వేరుగలేవు, అందువలన గమనాగమనములు కలుగుచున్నవి. కావున ఆత్మ నిత్యము కాదందు వేమొ ఆత్మకు ప్రత్యేకత కలదని తెలిసికొనుము. జీవావయవములు పెరిగేవి, తరిగేవి కావు. ఏనుగు దేహములో జీవుడు ప్రవేశించుటతో జీవావయవములు వృద్ధి జెందుచున్నవి. కీటకాదులలో సంకోచము నొందుచున్నవి. జలగ తనకు అవసర మగు నపుడు సాగుచున్నది. అవసరం లేనప్పుడు కురుచ యగుచున్నది. అట్లుగనే జీవుని పరిమాణం నియమితమై యుండుటలేదు. జీవుని అవయవములు వృద్ధిక్షయములు నొందుచున్నవనినను ఈ జీవావయవములు విస్తరించడం, ముడుచుకొనిపోవడం అనునవి జెందుచున్నవి. అదే విధమున ఘటాది పదార్థములు మారుపాటు జెందే స్వభావం గలవి యగుటచే నిత్యములు గాక నాశమొందు విధమున జీవావయవములును నశించే స్వభావం గలవియే యగుచున్నవి. అందుచే జీవునకు నిత్యం లేక ఆత్మ గూడ నశించగా సంచిత ప్రారబ్ధ ఆగాములను దోషములు సంభవించుచున్నవి. జీవుడు నిత్యత్వం కానందున పూర్వజన్మకృత పాపకర్మ ఫలితములు ఈ జన్మలో సంభవించక పోవలసియుండును. ఇది కృతనాశ దోషమగును. అట్లయిన ఈ జన్మలో చేయబడిన కర్మఫలితం సంభవించక క్రొత్త కర్మానుభవమే కలుగ వలెను. ఇది చేయని కర్మ ఫలితమును అనుభవించుట యగును. జీవుడు నిత్యుడు గాకున్నచో చేసికొన్న కర్మల వలన సంసార సముద్రములో మునిగిపోవు జీవునకు ఆనపకాయ బుఱ్ఱ నీటిమీద తేలియాడు మోక్షం రానేరదు. బంధమైనను మోక్షమైనను జీవునకే ఉన్నవని జెప్పవలెను. జీవుడు నిత్యమైనచో కర్మలున్నప్పుడు బంధముగల వాడగుననియు, ఆ బంధము

లేకపోయిన ముక్తు డగు నని చెప్ప వీలుగాదు. కర్మలు నిత్యం కానట్లే జీవుడు గూడ నిత్యుడు గాకున్నచో మోక్షమెవరికి కలుగును? కావున మీ మతమందు అతీతమైన ముక్తి నిత్యం గాని జీవునకు అంటగట్టడం ఏలా శక్యమగునో అగమ్యగోచరము! కాబట్టి జీవునకు సంకోచము, ముకుళితము ఉన్నవనుట ఎన్నటికిని అంగీకరింప వీలు లేదు. కావున మీ విధానములన్నియు పరస్పర విరోధములు గలవి యగుటచే అవి పరమాత్మను పొందుటకు సాధనములు గాజాలవు' అని గంభీరోపన్యాస మిచ్చారు.

అంతట జైనులు, అర్హతులు గర్వము లుడిగిన వారలయి శ్రీశంకరాచార్యస్వామికి పాదాక్రాంతు లయ్యారు. అట్లు విజయుడై నైమిశారణ్య పుణ్యభూములకు వెళ్ళారు. ఆ ప్రాంతమందు గల దరద, భరత, శూరసేన, కురు, పాంచాల మొదలగు దేశములందున్న పండితులు శ్రీశంకరపాదుల దివ్యదర్శనం చేసికొనిరి. వారి నందరిని ప్రస్థానత్రయ భాష్య ప్రభావముతో జయించి అద్వైతులను జేసి అసమాన ప్రతిభను ప్రదర్శించి ప్రఖ్యాతి వడసిరి. పిమ్మట శ్రీహర్షుడను మహా పండితుడు సకల శాస్త్రములలోను నిధియై, అజయ్యుండై మహాగర్వముతో వెలయుచుండెను. అట్టివానిని గురువైన ప్రభాకరుడు కుమారిలభట్టు ఓడించలేకపోయిరి. కాని వానిని శ్రీశంకరాచార్యులు తమ వశం జేసికొన్నారు. పిమ్మట కామరూప దేశస్థుడైన అభినవగుప్తుడను శాక్తేయుడు శ్రీశంకరులకు శిష్యుడయ్యెను. అదెట్లనిన

## 5.58 అభినవగుప్తుడు

కామరూప దేశమందు అభినవగుప్తుడను శాక్తేయు డొకడుండెను. ఆతడు వారి మత గ్రంథమునకు భాష్యరచన చేసిన గ్రంథకర్త. ఆతడు శ్రీశంకరాచార్యుల అఖండ ప్రభావం విని క్రుంగి దారి తెన్నులు గానకుండెను. శ్రీశంకరపాదుల చేతులలో ఓడిపోవడం స్థిరమనుకొనెను. ఆత డిటుల తలపోసెను. 'వేదమనినను దాని భావమనినను శంకరులకు మంచినీళ్ళ

ప్రాయము. వేదబాహ్య మతములను ఆయన అంగీకరించడు. అట్టి తరి ఆయనను కాదను టెట్లు? త్రిమూర్తులు సాయమైనను వాదమం దాయన నోడించుట కడు దుర్లభం. ఆయన కత్తికడ్డులేదు. కొమ్ముటేనుగులు ఆయన కడ క్రుంగిపోయినవి. శ్రీశంకర దివ్యతేజమునకు జడిసి భల్లూకములు పారిపోయెను. త్రిలోకములలోను ఆయనకు సాటియైనవాడు కానరాడు. ఆయనను జయించుటకు వేరు మార్గము లేదా! నా మంత్రములు తంత్రములు వృథా కావడమేనా?

నా మతస్థులను శిష్యులను విడచి ఒక్కణ్ణి విడిపోయిన లోకం హర్షించగలదా! శ్రీశంకరులతో వాదించి ఓడిపోవుట కంటె ముందుగనే దాసోహమని వారి శిష్యగణమున జేరిపోయిన ఉభయతారకముగ నుండును గదా! బయటినుండి నే జేయునది ఏమియు నుండజాలదు' అని నిశ్చయించి తన శిష్య వర్గమును విడనాడి శ్రీశంకర శిష్యగణమందు పరమభక్తుని వలె ప్రవర్తించుచుండెను. తన కుట్ర సాగు నని కులుకుచుండెను. కపట శిష్యుని కనిపెట్టువారు లేరైరి. క్రూరుడు అదను దొరికినప్పుడు నిర్దయుడు కాకుండునా?

పిమ్మట శ్రీ శంకరాచార్యులు అంగ వంగ కళింగాది దేశములలో అద్వైతమత ప్రచారము చేసి అందందు గల కుమతముల నెల్లను అద్వైత మతమునకు ద్రిప్పి నిరుపమ యశస్సు నార్జించి ప్రకాశించుచు గౌడ దేశమందు గల మురారిమిశ్రుని, ఉదయనాచార్యుని, ధర్మగుప్తుని జయించి శిష్యులనుగా జేసికొని దేశమందు స్థిరముగ శాంతిని నెలకొల్పుటకు సంకల్పించిరి.

**ఇది శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక శేఖర ముముక్షు జన నిధాన**
**శ్రీదేవకీనందనాశ్రమ స్వామి కరుణావిశేష లబ్ధ విజ్ఞాన వితాన**
**యఱ్ఱాప్రగడ వెంకటసూర్యనారాయణమూర్త్యభిధాన**
**విరచిత శంకరావతారచరితము నందు ఉద్ధారకాండ సమాప్తము.**

# 6. శాంతికాండ

## 6.1 శ్రీశంకరాచార్య స్వామికి భగందర వ్యాధి

శ్రీ శంకరదేశికేంద్రులు విశ్వప్రేమతో దేశమం దంతటను అద్వైత మతమును స్థాపించి ముముక్షు జనులకు, భక్తులకు, పండిత లోకమునకు పరమహంసయై ఆధారభూతుడై దేదీప్యమానముగ వెలుగొందుచున్నాడు. అట్టి లోకబాంధవునకు భగందర వ్యాధి అంకురించినది. దాని ప్రభావం సామాన్యమైనది గాదు. నిరంతరం మర్మస్థానము నుండి రక్తస్రావ మపారంగా జరుగుచున్నది. శ్రీస్వామి ధరించిన కౌపీనములు, శాఠీలు రక్తసిక్త మగుచుండెను. ఎప్పటి కప్పుడు అవి తీసి మంచివి ధరించుచుండు వారు. ఆ పని తోటకాచార్యుడు కడు భక్తిశ్రద్ధలు కలిగి పరిశుభ్రం చేయుచుండెడివాడు. అంత భయానక రోగ మంకురించి ప్రకోపించినను దానిని నయం చేసుకొందా మన్న మాటయే లేదు శ్రీజగద్గురువులకు. శిష్యులు వేయి చేతులతో సకలోపచారములు చేయుచున్నను వ్యాధి ఆరోజుకారోజు అభివృద్ధి నొందుచునే యున్నది. శిష్యులది గాంచి ఆందోళన జెంది జగద్గురువులను జేరి,

'సర్వరక్షకా! జగదోద్ధారకా! జగద్గురో! తమకు తెలియని విషయములు, ధర్మములు గానరావు. తమ పరిస్థితి జూడ మాకు ఆదుర్దా కలుగుచున్నది. మాకు కలుగుచున్న దుఃఖములు వెల్లడించక తప్పింది కాదు. కరుణించుడు! తామెట్టి విధమైన సంకల్ప వికల్పములు లేక నిశ్చింతగ ఆత్మతత్త్వమందు మునిగి ప్రకృతిని మరచియున్నారు. కేవలం జ్ఞానస్వరూపమును పొందియున్నారు. శరీరములు స్థిరములు గావని, బుద్బుదప్రాయమని తాము దృఢమైన ఎఱుకతో నున్నారు. శరీరములకు సంభవించు వ్యాధులు, కష్టసుఖములు అనుభవించవలసినదేయని మహానీయులందురు. ఈనాడు చేసుకొనిన కర్మను బట్టి వ్యాధులు సంభవించేవి కావని శాస్త్రములు తెలుపుచున్నవి. పుణ్యపాప కర్మ ఫలితాలని పెద్దలందురు. అయినను అట్టి

విధానము అంత మంచిదికాదని విన్నవించు వారము. ఋణశేషము, శత్రుశేషము, రణశేషముండరాదని పెద్ద లనుచున్నారు. స్వామీ! తమకు కలిగిన వ్యాధి తీవ్రరూపము దాల్చియున్నది. అట్టిది నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని మా యభిమతమై యున్నది. గురుదేవా! దీని కేదైనా ఉపాయ మాలోచించుడు! అని వినయముగ వేడుకొనిరి.

శిష్యులాడిన మాటలు విని శ్రీగురుదేవులు పలుకాడలేదు. అంతట వారలు దిగులొంది, 'దీనదయాళో! దేహాభిమానం కించిత్తైనను తమకు లేని కతమున వ్యాధి యననేమొ తెలియరాకున్నది. ఇందు ఆవంతైనను అసత్యం లేదు. మేము తమ వ్యాధి జూచి సహించ జాలకున్నారము. బాంధవా! ఈ వ్యాధిని కుదర్చగల భిషగ్వరులున్నారు. వాళ్ళు పరీక్షించుటకు అనుమతి నొసంగుడు. కన్నులార గాంచి మిన్నకుండుట తమకు ధర్మం కాదు. దానిని నయం జేయు నుపాయమును అన్వేషించకుండ నుండటయు మాకు పాడిగాదు. తమకీ ధర్మములు తెలియనివి గావు. పుష్పముల నాశ్రయించుకొని తుమ్మెదలు అందున్న మధువును ముదముతో పీల్చు మాడ్కి, తమ పాదపద్మముల నాశ్రయించుకొని వాక్సుధారసము నాస్వాదించుచు సుఖముగ కాలము గడుపుచున్నారము. తమకు ఏలాటి అస్వస్థత లేకుండ నుండవలెనని కోరుచుందుము గదా! కావున మా మాట మన్నించి వ్యాధికి తగు చికిత్సకై త్వరపడుదురని వేడుకొనుచున్నారము!' అని ప్రార్థించిరి. అప్పుడా శిష్యుల పలుకులు విని శ్రీశంకరాచార్యులు, 'బిడ్డలారా! నిజమును గ్రహించుడు. రోగ మనునది గతజన్మలో చేసిన పాపకర్మ ఫలితమను రహస్యము మీర లెఱిగి యున్నారు. అనుభవించిన నయమగును గదా! ఏ కారణము వలన నైనను కర్మఫలమును పూర్తిగ అనుభవించకున్నచో శేషించిన దానికై మరి జన్మనెత్త వలసియుండును. వ్యాధి నశించుటతో కర్మఫలము పూర్తి యగును. ఈ విధాన మంతయు శాస్త్రముల యందు విపుల పరచబడి యున్నది. మీకింత తొందరేల? ఇందు

మరియొక రహస్యము ఇమిడి యున్నది, వినుడు! గతజన్మ లోని పాపకర్మ వలన సంభవించు రోగము చికిత్సల వలన నయము కాదు. నా వ్యాధి అట్టిదగుటచే దాని ననుభవించిన నిర్మూల మగును. దీనికి వేరొక మార్గము కానరాదు. ఈ వ్యాధితో ఈ శరీరము పోయినను నాకు భయము లేదు. ఇది ఎప్పటికైనను పోవునదే గనుక అట్టిదానికై విచార మేల?' అని వివరించారు. అంత మాత్రాన శిష్యులూరుకొందురా?

## 6.2 చికిత్స

శ్రీశంకరపాదులు భగందర వ్యాధికి చికిత్స నంగీకరింపకుండుట వలన శిష్యులకు ఆందోళన హెచ్చి, 'పరమాత్మా! తమవంటి వారలకు తామన్నట్లు తనువులపై ఆశలుండకపోవుట నిజము, సహజము కూడ. దానిని కాదనజాలము. ఆర్తత్రాణ పరాయణా! మా మనవి విని కాదనకుడు. మమ్ములను కరుణించుడు! తమ శరీరము మావంటి శరీరము కాదు. పరమ పవిత్రమైనది. మా శరీరములు పాంచభౌతికములు. తమ దన్ననో దివ్య శరీరము. అలాంటి తమ శరీరము బహుకాల ముండవలెనని మేమెల్లప్పుడు కోరుచుందుము. జలచరములకు నీరమెట్లాధారమో తమ శరీరము మాకట్లు ఆధారమై యున్నది. అట్టి యోగప్రదమైన మీ శరీరమును రక్షించుకొనడమే మా విధి. అదియే మాకు పరమ రక్షణ. తమ రక్షణ మాకు లేనినాడు మాకు వినాశమే గతి. దయాసముద్రులు మమ్ములను కాపాడవలెనన్న తమ శరీరమునకు రక్షణ అవసరం గదా! తమకు కావలసిన దేదియు లేదు. కాని లోకమును రక్షించుటకు శరీర రక్షణ ముఖ్యావసర మగుచున్నది. ప్రభో! లోకంతో పాటు మమ్ములను గూడ రక్షించుడు! జగద్రక్షకా! తప్పక ఈ వ్యాధికి చికిత్స చేయుటకు అనుమతించుడు!' అని పరిపరి విధముల గురుదేవుల నర్థించారు.

శ్రీశంకర గురువర్యులు శిష్యుల సంతాపము సహించ నొల్లక దయ గలిగి నలు దిక్కులకు పోయి భిషగ్వరులను గొనితెండని శిష్యుల కానతిచ్చిరి.

పేదకు దొరికిన పెన్నిధి వలె ఉప్పొంగి గుర్వాజ్ఞను శిరసావహించి అందుకు సమర్థులైన శిష్యులు కొందరు సమర్థులైన వైద్యశిరోమణులకై పయనమై పోయిరి. కొంత దవ్వే గునప్పటికి అనుభవం గల వైద్యులను వెదకి పట్టుకొనిరి. వారితో జగద్గురువుల స్థితి దెలిపి అంగీకరింప జేయగ శిష్యులు భిషగ్వరులను వెంట నిడుకొని గురువుల కడకు దెచ్చిరి. శిష్యగణము వైద్యులను తగు విధముగ గౌరవించి శ్రీశంకరపాదులను జూపిరి. అంతట భిషగ్వరులు శంకరుల కడ నిలువబడి వినయ విధేయతలతో నమస్కారము లర్పించి,

స్వామీ! మీ వ్యాధి వివరింపుడు. మేము చేయగలిగిన దంతయు చేయ సిద్ధముగ నుంటిమి. సెలవిండు! అని విన్నవించిరి.

'భిషగ్వరులారా! ఈ వ్యాధి లోపల ఉత్పత్తి కాబడి ఆసన సమీపమందు బహిర్గత మగుచున్నది. దీని కేదైన మందున్నచో ప్రయోగించుడు! పూర్వజన్మకృత పాపకర్మ ఫలితముగ ఈరోగ మంకురించినదని నా నిశ్చయము. అనుభవించినచో నయ మగు నని నా నిశ్చయము. అందులకై చికిత్స నిచ్చగింపకుంటిని. శిష్యుల బలవంతంతో మిమ్ములను రావించితిని. మీకేదైన అనువు గనుపించిన మీ పని మీరు చేయుడు!' అని శంకరులు తెలియజేశారు.

అంతట అశ్వనీదేవతల వంటి వైద్యశిఖామణులు తమకున్న అనుభవమును పురస్కరించుకొని శాస్త్రీయమైన చికిత్స జేసిరి. వార లెంతటి శాస్త్రజ్ఞానం గలిగియుండినా ఎట్టి అనుభవము గలవారైనను ఎట్టి మందు లుపయోగించినను మందుల దారి మందులది, రోగం దారి రోగానిది అయినది. పైగా రోగము ఆ క్షణమున కాక్షణము తీవ్రరూపము దాల్చుచున్నది. అట్లయినను వేయికండ్లతో కనిపెట్టుకొని చికిత్స జేయుచునేయున్నారు. అట్లయినను భిషగ్వరులు విఫలమనోరథులైనారు. అంతట శ్రీశంకరాచార్య స్వామి ముఖ వైఖరి కనిపెట్టి,

'వైద్యశిఖామణులారా! చింతనొందకుడు! రోగములు సాధ్యాసాధ్యములుగ నున్నవి. అసాధ్య మేరికి శక్యము? మీరిచ్చోటు జేరి బహుదినములైనది. మీ కొఱకెందరెందరో వేచి యుందురు. మీ రాకకై వారెదురు జూచుచుందురు. మీరచ్చట లేని లోటు ఎంతైన నుండును' అని మెల్లగ పలికిరి.

అంతట వైద్యులు ముకుళితహస్తులై, సంయమివరా! తాము వచించినదంతయు సత్యమే. రోగ మని భ్రమించి చికిత్స నొసంగితిమి. ఇయ్యది మా అనుభవం మేరకు రోగము వలె గన్పట్టుట లేదు. ఇది కర్మ ఫలితము వలె గోచరించుచున్నది. మిమ్ములను విడనాడి పోవ జాలకుంటిమి. అనేక మంది మిమ్ముల నాశ్రయించుకొని తమ వాగమృతమును పానం జేయుచున్నారు. మాకట్టి యోగ్యత ఎప్పటికి ప్రాప్తించునో కదా! అనుగ్రహించిన నిజనివాసములకు జేరగల'మని విధేయులై విన్నవించగ నారాయణ స్మరణలు పలికిరి. అంతట వారు నిజనివాసములు జేరుకొనిరి. పద్మపాదుడు గురుదేవులను వదలునా? గురుదేవుల వ్యాధి తొలగుట కుపాయ మాలోచించెను.

## 6.3 పద్మపాదుడు యోగశక్తిచే వ్యాధి కుదుర్చుట

శ్రీజగద్గురువులకు చికిత్స కావలెనన్న కోరిక వైద్యులరాక తీరినను వైద్యులు చేయునది లేక తిరిగిపోవడం జూచి నిస్పృహ జెంది యున్నారు. సంయమీంద్రులు శరీరమును మరచి నిర్వికల్పసమాధిలో తమ నిజరూపమును లోపలి దృష్టితో చూచుకొనుచున్నారు. అది శిష్యులను మరింత కలవర పరచినది. శిష్యకోటి క్రుంగిపోవుట పద్మపాదుడు కనిపెట్టి తదేక దృష్టితో యోచించెను.

'శంకరుడే శ్రీశంకరాచార్యులై యవతరించెను. అట్టివానికి పురాకృత పాపము ఎట్లు రావీలగును? శ్రీగురుదేవు లన్నది సరికాదు. అది శాస్త్రవిషయ

ధర్మము. మహావైద్యులు ఇది రోగము కాదనిరి. అట్టివారలను కాదనుటకు అవకాశము గలదా? సరే! ఇంక రోగ మంకురించుటకు హేతు వేమై యుండవలెను? దేశ మంతయు కలయ దిరిగితివి. స్వామి మంత్రతంత్రజ్ఞులైన వారి నెందరినో జయించి యున్నారు. అశ్వనీదేవతలను మించిన వైద్యుల పలుకులు, నా అనుమానమునకు బలము చేకూర్చుచున్నవి. సందేహమేల! ప్రభువర్యుల కెవరో దుర్మార్గుడు ఏదో మారణహోమం ప్రయోగించి యుంటాడు. లేకున్న ఇంత ఘోరమేల?' అని నిశ్చయించి తన ఇష్టదైవ మయిన శ్రీ నరసింహస్వామిని మనసా ఒక్కసారి ధ్యానించి ప్రార్థించాడు. ఆయనకు ఉపాసనాబలం చేత భగవదనుగ్రహం గలుగుటతో,

'శ్రీగురుదేవులకు చేసిన ప్రయోగం వెనుకకు మరలుగాక!' అని సంకల్పం చేశాడు పద్మపాదుడు. అయన కోరిక శ్రీనరసింహస్వామి మన్నించారు. అందులకు శంక యేల? ఆ క్షణంలో శ్రీశంకరులకు అంకురించిన భగందర వ్యాధి వెనుకకు మరలి ప్రయోగం చేసిన కపటశిష్యుడై యున్నఅభినవగుప్తుని ఆవహించినది. శంకరాచార్యస్వామి అద్భుతముగ కోలుకొనుచున్నారు. అభినవగుప్తుడు వ్యాధికి బలి అయ్యాడు. పిమ్మట పరిపూర్ణారోగ్యము శ్రీశంకరునిలో ఉదయించినది. ఆ ప్రాంగణ మంతయు ఆనందసాగర మందు మునిగి తేలియాడి పద్మపాదుని వేనోళ్ళ కొనియాడిరి.

## 6.4 శ్రీ గౌడపాదాచార్య స్వామి

ఒకానొక సాయం సమయాన గంగాతీర సైకత స్థలములలో శ్రీశంకరాచార్య స్వామి సుఖాసీనుడై నిమీలితనేత్రుడై పరమాత్మ ధ్యానంలో నుండి యున్న సమయమున శ్రీగౌడపాదాచార్యస్వామి కాషాయాంబరములు ధరించి దండ కమండలములను చేతబూని దేదీప్యమానముగ వెలుగొందుచు శంకరులను చూచుటకై సమీపించుచున్నారు. శ్రీశంకరపాదులది గ్రహించి పరమభక్తితో ఎదురేగి స్వాగతమిచ్చి పరమగురువులకు సాష్టాంగ

పాదాభివందనము లాచరించి వినమ్రుడై ప్రక్కచాటుగ నిలువబడి వినయముతో తల ఒకించుక వంచి యున్నారు. శ్రీగౌడపాదులకు శ్రీశంకరులను జూచినంత ఆనందబాష్పములు వరదలై ప్రవహించినవి. గృహస్థులు కలిసికొనినప్పుడు సాంసారిక గోష్ఠులు వెడలబోసికొనెదరు. భూపాలుర కలయికలో పరిపాలనా వ్యవహారములు ముచ్చటించుకొందురు. యతులన్న బ్రహ్మజ్ఞాన సంపన్నులగుట జేసి తత్త్వవిషయములు విచారించెదరు. అట్లనే శ్రీశంకర గౌడపాదుల కలయికలో తత్త్వ రహస్యములను, లోక క్షేమమును, తత్త్వప్రచార సంపూర్తిని గురించి ముచ్చటించుకొన్నారు. అంతట శ్రీశంకరాచార్య స్వామి,

'పరమగురువర్యా! మహాత్ముల దర్శనభాగ్యం లభ్యమైన నేడు సుదినము! తమ అనుగ్రహ ప్రభావముతో మూగలు వాచాలురగుచున్నారు. కుంటి వారలు కొండలు దాట గలుగుచున్నారు. పాపులు పుణ్యాత్ము లగుచున్నారు. సకాములు నిష్కాములై సంయమీంద్రు లగుచున్నారు. కార్యములు నిర్విఘ్నము లగుచున్నవి. తమ అపార కృపను వర్ణింప వీణావతి వెరచును. తమ నామస్మరణ సర్వపాప హరమై అనంత పుణ్యప్రద మగుచున్నది. తమ జ్ఞానం అనంతం! అఖండం! సకల సద్గుణ సంపన్ను లగుట జేసి శ్రీశుకమహర్షికి ప్రియశిష్యు లయ్యారు! అపార కరుణాసాగరులైన శ్రీగోవింద భగవత్పాదాచార్యుల వారిని శిష్యునిగా జేసికొని తమ విజ్ఞాన సర్వస్వమును ఆయన కందించినారు. నేను వారి కటాక్షముతో సకల శాస్త్రములను సాకల్యముగ తెలిసికొన గలిగితిని. నా పూర్వపుణ్యం కొలది తమ దర్శనభాగ్యం కలిగి పావనుడనైతిని. అనుగ్రహించుడు!' అని నిగర్వియై విన్నవించెను.

## 6.5 శ్రీగౌడపాదుల ప్రశంస

శిష్యుడు గొప్పవాడగుట కన్న వేరొక భాగ్యముండదు సద్గురువులకు. శ్రీగౌడపాదులకు శ్రీశంకరాచార్యులు ప్రశిష్యుడు. తపోభూములయందు

వసించు వారలకు రవితేజము కనుపించదా? శ్రీ శంకర సుభాషితములు వినుటతో తనలో గల ఆనందం పెల్లుబికి,

'బిడ్డా! నీ అపార సుగుణసంపత్తి, నిర్వికల్ప ప్రవృత్తి, అసమాన విజ్ఞాన విక్రమము, పరమశాంతము నన్నెంతగనో ముగ్ధుణ్ణి చేసి నీ కడకు రప్పించినవి. నిన్ను జూడగనే మున్నెన్నడు కలుగని ఆనందమును పొందితిని. నాయనా! నే రచించిన మాండూక్యోపనిషత్కారికలకు నా కోరికతో భాష్యరచన చేసితివట! ఆ రచన అత్యంతం అద్భుతముగ నున్నదని శ్రీగోవిందపాదులు జెప్పగ వినియున్నాను. అద్దానిని విందా మన్న కోరికతో వచ్చాను' అని వ్యక్తం చేశారు శ్రీగౌడపాదులు.

అంతట శ్రీశంకరులు శ్రీగౌడపాదకారికలకు తా రచించిన భాష్యమును చక్కగ చదివి వినిపించారు. గౌడపాదులు మైమరచి విన్నారు. బంగారమునకు పరిమళ మబ్బినట్లు భాష్యరచన జేసినందులకు శ్రీశంకరులను మెచ్చుకొని వరమొకటి ఈయ సంకల్పించి తన యభిమతమును వ్యక్తం జేయగా 'స్వామీ! తమ దర్శన భాగ్యమును మించిన వరము నాకేల! అయినను తమ కోరికను మనసా అంగీకరించువాడను. నిశ్చింతతోడి మనసుతో సర్వదా స్వస్వరూప పరమాత్మ యందు విహరించునట్లు గ్రహించుడు!' అని వినయముతో శ్రీశంకరుడు వెల్లడించెను. శ్రీశంకరులు కోరిన వరమునకు మిక్కిలి సంతసించి నారాయణ స్మరణ జేయుచు గౌడపాదు లంతర్ధాను డయ్యెను. ఆనాటి ఱేయి ఆ గాథ నంతయు శ్రీశంకరాచార్యులు తమ శిష్యులకు వెల్లడించారు. అంతలో అరుణోదయ మయ్యింది.

### 6.6 సర్వజ్ఞ పీఠ దక్షిణ ద్వారము

ఆనాటి ఉదయముననే గంగానదీ పవిత్ర జలములలో శ్రీశంకరాచార్యులు స్నానమాచరించి నిత్యానుష్ఠానము ముగించుకొని శాంతమూర్తియై మందహాస వదనుడై యుండుట పద్మపాదాది ప్రముఖ

శిష్యులు చూచి వందనపూర్వకంగా 'ప్రభో! ఈ భరత ఖండములో వాయవ్యదిశగా ప్రఖ్యాతి చెందిన కాశ్మీరదేశములో శారదాపీఠమునకు నాలుగు మండపములు గలిగి నాలుగు ద్వారములున్నవట. దానినే సర్వజ్ఞపీఠమని అంటారు. సర్వజ్ఞులైన వారలు మాత్రమే ఆ పీఠముల నధిరోహించుటకు అర్హులని చెప్పుదురు. దాని కున్న నాలుగు ద్వారములు నలుదిక్కులకు నాలుగు ముఖములుగ అమర్చబడి యున్నాయి. తూర్పుద్వార పీఠము తూర్పు దేశమును, పశ్చిమ ద్వార పీఠము పశ్చిమ దేశమును, ఉత్తరద్వార పీఠము ఉత్తర దేశమును, దక్షిణద్వార పీఠము దక్షిణదేశమును రక్షించునని ప్రతీతి. ఏ దిశనున్న పీఠమును ఆ దేశస్థుడైన సర్వజ్ఞుడే అధిరోహించవలెను. ఏ పీఠాధిపతి యైనను లేకున్న ఆ పీఠద్వారము మూసి వేయబడును. ఎంతో కాలము నుండి దక్షిణద్వార పీఠమును పరిపాలించు వారు లేక మూయబడియున్నది. అందుచేత దక్షిణదేశ పరిరక్షణ లేకున్నది. అది దాక్షిణాత్యులకు అవమానకరము కాదా? దాక్షిణాత్యులలో సర్వజ్ఞుడు పుట్టలేదని దాని అర్థం. ఈ పరిస్థితిని చక్కచేయు భారము తమయందు గలదని నివేదించువారము' అని ప్రోత్సహించారు.

## 6.7 పీఠారోహణ పరీక్ష

విశాలహృదయం గలవారలకు విశ్వమే కుటుంబమగును. అట్టివారు తన కుటుంబ అవమానమును భరించగలరా? కాశ్మీర దేశమందు గల సర్వజ్ఞపీఠ దక్షిణద్వారమును తెరచి దాక్షిణాత్యుల అవమానము రూపుమాపుటకు నిశ్చయించారు శ్రీఆచార్యస్వామి. ఆయన కష్టసుఖముల నెఋుగని ధీరుడు. జయాపజయములని ఆయన యెఋుగడు. ఎన్ని భరించిను తనవారి బాధలు మాత్రం భరించెడి వాడు కాడు. అదే ఆయనలో గర్భితమైయున్న విశ్వప్రేమ.

మత్తేభములను మించిన అద్వైత తత్త్వజ్ఞులు, సింహశార్దూలములను క్రుంగదీయు విజ్ఞులు శ్రీశంకరాచార్య శిష్యగణమందు లెక్కకు మిక్కిలిగా

నున్నారు. లంకాపతిని సంహరించుటకు నరకులపతి తోడ కపికులపతి, కపి కులములు వెంటనంటినట్లు శ్రీశంకర శిష్యగణము శ్రీగురుదేవుల ననుసరించి, జయజయధ్వానములు సల్పుచు ఆనందవారాశిలో మునుగుతూ కాశ్మీరమునకు పయనమై పోవుచున్నారు. కొలది దినములకు కాశ్మీరదేశం జేరుకొని సర్వజ్ఞ పీఠ ప్రదేశమును తెలిసికొనిరి. సర్వజ్ఞపీఠ దక్షిణద్వారము తెరచుటకు అనేక అవరోధములు గలవని ప్రతివాదులు చెప్పగా విన్నారు. తెలుపబడిన అడ్డములు అవరోధములు గావని నిశ్చయించి మొదటి అడ్డమును జేరుకొన్నారు. అచ్చట,

'ఎవరయ్యా మీరు? మహా ఒడిదుడుకుగ వస్తున్నారు? ఆగండి! చాలమంది రావడం, వెళ్ళడమైంది. ఇక్కడ ఒక పరీక్ష గలదు. అందు నెగ్గి వెళ్ళాలి. నీకేమైన మా పరీక్షకు తట్టుకొను ధీమా ఉన్నదా? ఉంటే మా పరీక్షకు సిద్ధపడు! మా సర్వజ్ఞ పరీక్షలో నెగ్గినప్పుడు మార్గావరోధం లేకుండ చేస్తాము' అన్నారు అచ్చట ఉన్న ప్రతివాది బృందము. శ్రీజగద్గురువులా పలుకులాలకించి,

ఓహో! అదా మీ అభ్యంతరం! మీరడిగేదేదో అడగండి. నేనందులకు సిద్ధముగ నుంటిని' అన్నారు. ప్రతివాదులు 'మిమ్మల్ని పరీక్షించువారు రానై యున్నారు. తొందర పడకుడు. వారు వచ్చుదనుక కొలదిసే పిచ్చట విశ్రమించండి' అని శ్రీశంకరులను ఆపుజేసిరి.

శ్రీశంకరుల రాక యావన్మందికి తెలిసినది. వారందరు శ్రీఆచార్యస్వామి ప్రభావం వినినవారు కాదు. పరీక్షాధికారులకు వర్తమానం పంపగా కఠినపరీక్ష జరుపుటకు ఆయత్తపడుటతో వేళ తప్పినది. అంతవరకు సమీపమందున్న ఒక దిబ్బమీద శ్రీఆచార్యదేవులు విశ్రమించారు. ఆ మిట్టను 'శంకరమిట్ట' యని పిలుస్తారు. కాణాద మతమునకు చెందిన పరీక్షాధికారి వచ్చి శ్రీశంకరులను పరీక్షకు పిలచెను. అంతట ఈ దిగువరీతిని పరీక్ష జరిగింది.

**కాణాదుడు :** ఏమయ్యా! నీవేనా పరీక్షకు వచ్చావు? బాగున్నది! మా మత రహస్యములను ఎఱుగుదువా? లేక పారిపోతావా?

**శంకరాచార్యులు :** సంశయమేల?

**కాణాదుడు :** పారిపోవుటకా?

**శంకరాచార్యులు :** మిమ్ములను జయించుటకు!

**కాణాదుడు :** సరే! షడ్భావములు చెప్పగలవా?

**శంకరాచార్యులు :** ద్రవ్య, గుణ, కర్మ సామాన్య, విశేష, సమవాయము లను నారింటిని కాణాద మతమందు షడ్భావములందురు.

**కాణాదుడు :** సంయోగం పొందిన పరమాణు ద్వయము నుండి సూక్ష్మమైన అణుద్వయం ఉత్పన్నమైనదని మా మతమందు గల రహస్యము. ఆద్యణుకమును ఆశ్రయించుకొని మహా సూక్ష్మమైన అణువు దేనివలన జనించుచున్నది?

**శంకరాచార్యులు :** అదియా! చెప్పెద వినుడు! ద్విత్వసంఖ్యలే అందుకు కారణము.

**కాణాదుడు :** స్వామీ! సర్వజ్ఞత్వం తమకే గలదు! తాము విజయమును సాధించిరి. సర్వజ్ఞ పీఠము నధిరోహించుటకు సమర్థులయ్యారు.

కాణాదు లట్లు ప్రకటించుటతో అచ్చోటనున్న వారందరు జయజయధ్వానములు మిన్ను ముట్టునట్లు గావించారు. ప్రథమ అవరోధము ఈ విధముగ లీలగ దాటిపోవుచుండ కొంత దవ్వేగునప్పటికి నైయాయకు డడ్డు తగలి,

'ఆచార్యస్వామీ! తమ ప్రభ కొంచెం విన్నాను. కాణాద మతస్థులను జయించారట! బాగున్నది! కాని మా మతమును గురించి పరీక్షనిచ్చి అందుత్తీర్ణులై ఈ గట్టు దాటవలెను.

**శంకరాచార్యులు :** కానిండు

**నైయాయికు :** కణాద ముని మతము (కాణాదము)నకును, గౌతమ మతమునకును ముక్తి విషయమందున్న భేద మేమున్నదో చెప్పండి!

**శంకరాచార్యులు :** గుణసంబంధము నాశనమయిన గాని ముక్తి రాదందురు కాణాదులు. గుణసంబంధము నాశనమయినను అందు జ్ఞానముండి యుండవచ్చును. అట్టిస్థితినే మోక్షమనుచున్నారు గౌతమ మతస్థులు. ఇరు మతములలో గుణనాశము, ఆకాశ సదృశస్థితి సమాన ధర్మములు.

(1) గౌతమ మతమందు 'జ్ఞానము కలిగియుండ వలె' నన్నది హెచ్చుగ నున్నది.

(2) ఈ రెండు మతములలోను పదార్థ భేదము సమానము. పరమేశ్వరుడు నిమిత్త కారణం గలవాడని ఇరుమతముల వారంగీకరిస్తారు.

**నైయాయికుడు :** బాగుగా చెప్పితివయ్యా! చాల దిట్టవలె కన్పట్టుచున్నావు. సర్వజ్ఞుడవైతివి! సర్వజ్ఞ పీఠాధిరోహణకు వెళ్ళుమా!

అట్లు రెండవ అడ్డమును తొలగించుకొని ముందుకు జనునంత సాంఖ్యు లడ్డు తగిలి పరీక్షనిచ్చి, తృప్తిపరచ మనిరి. అందులకు ఆచార్యస్వామి సంసిద్ధుడే కదా! సాంఖ్య పరీక్ష –

**సాంఖ్యుడు** : శంకరాచార్యస్వామీ! మూలప్రకృతి స్వతంత్రముగ జగత్కారణ మగుచున్నదా? లేక పరమాత్మ నాశ్రయించి జగత్తునకు కారణమగుచున్నదా?

**శంకరాచార్యులు :** మూలప్రకృతి సర్వజగత్కారణమని సామాన్యముగ అంద రనేమాట. సాంఖ్యులు గూడ అట్లే పలుకుదురు. వేదాంతులట్లు గాక అస్వతంత్రముగ జగత్కారణ మగుచున్నదని తెలుపుదురు. అయితే పరబ్రహ్మమే సర్వమునకు కారణమని న్యాయధర్మము.

**సాంఖ్యుడు** : యతీశ్వరా! మీ సమాధానము మమ్మెంతో సంతస పరచినది. ఇంక నీ ఇచ్చ చొప్పున పోయి సర్వజ్ఞపీఠము నధిరోహించనగును. సర్వజ్ఞుడవు! శెలవిండు!

ముందుకు చరచర పోవుచుండగా శ్రీశంకరులకు బౌద్ధు డడ్డు తగిలి,

**బౌద్ధుడు** : 'ఏమయ్యా! శంకరాచార్యా! ఆ వేగం తగ్గించు! చాల అడ్డములు దాటి వస్తివి. అవన్నియు అడ్డములు కావు. మా అడ్డమే గడ్డు! ఆగి, మా పరీక్షకు సమాధానములు పలికి మమ్ములను తృప్తిపరిచి మరీ పోవలెను.

**శంకరాచార్యులు :** మీ యభీష్టమేదియో వివరించండి.

**బౌద్ధపరీక్షాధికారి :** యతీశ్వరా! బాహ్యపదార్థములెన్ని? అవేవి?

**శంకరాచార్యులు :** సౌత్రాంతకములు, వైభాషికములను రెండు తెరగుల నున్నవి.

**బౌద్ధపరీక్షాధికారి :** ఆ రెండింటికి గల భేదమేమి?

**శంకరాచార్యులు :** సౌత్రాంతికములో వేద్యజాత మంతయు అనుమాన గమ్యముగ జెప్పబడియున్నది. ఈ రెండు వైభాషికము

ప్రత్యక్ష ప్రమాణముగ చెప్పబడి యున్నది. ఈ రెంటికి క్షణభంగురత్వం సమానమని చెప్పబడుచున్నది.

**బౌద్ధపరీక్షాధికారి :** మా విజ్ఞానమునకు వేదాంతుల విజ్ఞానమునకు గల భేదము చెప్పగలవా?

**శంకరాచార్యులు :** విజ్ఞానములో క్షణికత్వము, బహుత్వమున్నదని మీ విజ్ఞానవాదు లందురు. జ్ఞానము ఏకత్వమని స్థిరత్వము గలదియని వేదాంతుల నిశ్చయము. ఇదియే వారిరువురకు గల తారతమ్యము.

అని వివరించుటతో బౌద్ధపరీక్షాధికారి మెచ్చి తన అభ్యంతరము తొలగించెను. అంతట శ్రీ జగద్గురువులు ముందునకు పోవుచుండ జైన మతస్థ డడ్డు తగిలి పరీక్షలిచ్చి అందుత్తీర్ణుడై జనుమనెను.

**జైనుడిటుల ప్రశ్నించెను.**

'యతీశ్వరా! మీకు తెలియని రహస్యములుండవు. ఈ ఒక్క రహస్యమును బహిర్గత మొనరించండి. అదినిజమైనచో మీ మార్గమున కవరోధముండదు.

**శంకరాచార్యులు :** కానిండు.

**జైనుడు :** అస్తి కాయ శబ్దము వివరించుడు!

**శంకరాచార్యులు :** జీవాస్తి కాయము, పుద్గలాస్తి కాయము, ధర్మాస్తి కాయము, ఆకాశాస్తి కాయము, కాలకాయము అనునవి అయిదు. ఈ పంచాస్తి కాయములు మీ మతమందు ప్రధానము.

అంతట జైన మతస్థులు శ్రీశంకరాచార్యుల యెడ అపరిమితానందమును ప్రకటించుచు జయజయధ్వానములు గావించిరి.

దారి ఇచ్చుటతో శ్రీఆచార్యస్వామి ముందునకు సాగుచుండిరి. అంతలో నొక జైమిని మతస్థుడు ప్రత్యక్షమై,

**జైమినీయుడు** : మాకు వేదము ప్రధానమైనది. ఎరుగుదువా? మేము జైమినీ మతములోని వారము. మా మతము నందు శబ్దస్వరూపమేది? ఆ శబ్దము ద్రవ్యమా? గుణమా? చెప్పి దాటుము!

**శంకరాచార్యులు :** అకారాది అక్షరములంతటా వ్యాపించియున్నవి. ఇవి చెవులకు మాత్రము వినబడునవి. ఈ అక్షర సముదాయము గుణము కాదని ద్రవ్యమేయని మీ మతస్థులనుచున్నారు. ప్రళయము వచ్చినను శబ్దములు నశించవు. వేదములు గూడ నిత్యము గావని వేదాంతములోని మాట. పరమాత్మ ఒక్కడే నిత్యమైన వాడు. ఉపనిషత్తులు గూడ పరమాత్మ జ్ఞానం కలిగిన తరువాత సచ్చిదానంద పరబ్రహ్మమే నిత్యమైనది, మిగిలిన వన్నియు కనబడునవి యగుటచే నాశం కలవి యగుచున్నవి. ఇది వేదాంత మతము యొక్క పరమరహస్యము.

**జైమినీయుడు** : శ్రీశంకరాచార్యా! ఇంతటితో మీ సర్వజ్ఞత లోకమునకు వ్యక్తమాయెను. ముందు మీకడ్డములు లేవు. ఇదియే ఆఖరి పరీక్ష. మహానుభావా! మీ మహిమ వర్ణించ ఈనాటి వారి తరమా! ఆచారము ననుసరించి పరీక్ష జరుపబడినది. గాని మిమ్ములను పరీక్షించ మా తరమా! ఈ క్షణము లోకమునకు పండువైనది.

అంతలో పద్మపాదుని చేయి పట్టుకొనియుండ వారల కిరుపార్శ్వముల యందు వింజామరలు వీచుచుండిరి. నేత్రములు పట్టి బరాబరులు

పలుకుచుండగ శిష్యప్రశిష్యులు జయజయ నినాదములు భూనభోంతరాళములలో ప్రతిధ్వనించుచుండ శ్రీశంకరావతారమూర్తి చిద్విలాసుడై సర్వజ్ఞపీఠాధిరోహణకు నిరాటంకముగ జనుచున్నారు.

## 6.8 సర్వజ్ఞ పీఠాధిరోహణము

శ్రీశంకరులు సర్వజ్ఞులై సర్వజ్ఞ పీఠ సామీప్యమునకు జేరునంతలో, 'యోగీశ్వరా! ఆగుము! సర్వవిద్యలలోను నిన్ను పరీక్షించుటాయెను. కృతార్థుడవైతివి. సర్వజ్ఞుడవని ప్రఖ్యాతి నార్జించుకొంటివి. లేకున్న జగత్ప్రఖ్యాతి వడసి బ్రహ్మస్వరూపుడైన మండనమిశ్ర మహాపండితుడు నీ యెదుట నిస్తేజుడు కాగలడా! నీ ప్రజ్ఞాదులు సాటిలేనివి. నీవెంతటి ప్రజ్ఞా దురంధరుడవైనను ఈ సర్వజ్ఞ పీఠము నధిరోహించుటకు మరియొక అర్హత గూడ నుండవలెను. ఆత్మ పరిశుద్ధముగ నుండవలెను. అదియే రెండవ అర్హత. నీయెడ ఒకించుక అనుమానము కలుగుచున్నది. అందువల్ల నదియును పరీక్షింపనగును. అందు నీవు ఉత్తీర్ణుడవు కాగలిగిన ఈ సర్వజ్ఞ పీఠాధిరోహణకు ఆటంకముండదు. అందెంత మాత్రము సంశయము లేదు. అంతదనుక ఆగుమా!' అని ఆశ్చర్యమును కలుగజేయు పలుకు లాకసము నుండి వినబడియెను. అంతలో మరల,

'మహాత్మా! తాము బ్రహ్మచర్యాశ్రమము నుండియే సన్న్యాసాశ్రమం స్వీకరించారు. బాగున్నది! అందు ఆదర్శముగ ధర్మములను నిర్వర్తించుచున్నారు. ఇందెంత మాత్రం సంశయం లేదు. అవతారాశయం బహు గొప్పదని ఋజువు కాబడినది. అందువలననే 'పరమహంస పరివ్రాజకాచార్య'లను బిరుదము నొందితిరి! కాని అలనాడు పరకాయ ప్రవేశం చేసి కాంతాలోలుడవై విహరించితివి. అప్పుడు అద్దానిని సర్వజ్ఞత్వ పరిపూర్తి కొఱకై స్వీకరించియున్నారు. అందువలన మీ ఆత్మ పరిశుద్ధికి అనుమానము అలుముకొన్నది'. ఏమనియెదరు? అని గగనవాణి అడిగింది.

ఆ పలుకులు అంబ వని శ్రీఆచార్యస్వామికి తెలుసును. 'జగజ్జననీ! నేను జన్మించిన దాదిగ ఈ క్షణము వరకు ఈ శరీరంతో ఏవిధమైన పాపపు పని చేసి యుండ లేదని రూఢిగ పలుకుచున్నాను. వేరొక శరీరం చేసిన పాపం ఈ శరీరమునకు అంటదు కదా! అందులకు ఆధారము శాస్త్రములే కదా! ఒకవేళ చిద్వికారము వల్ల దీనికి పాపం వస్తుందని అనెద వేమొ అట్టివి నా మనస్సునకు లేనే లేవు. ఈ శరీరంతో చేసిన పాపములు ఈ శరీరం నశించుటతోడనే పోవును. ఇది నిజతత్త్వము. అందులకు శాస్త్ర ప్రమాణములు చూపగలను. ఈ నా శరీరము బహు యోగ్యమైనది. అందులకు సందేహము ఏమియు లేదు. ' అని శ్రీశంకరాచార్యస్వామి నిష్కర్షగ చెప్పారు.

అందుకు శారద ఒకించుక మౌనం దాల్చి, పిమ్మట శ్రీజగద్గురువులను కొనియాడి సర్వజ్ఞ పీఠాధిరోహణకు అంగీకరించి వెల్లడించినది. అట్టి శు భసమయాన దేవదుందుభులు మ్రోగినవి. దేవతలు కుసుమములను వర్షించిరి. పండితుల ఆనందం గంగాప్రవాహమైనది. పద్మపాదాది శిష్యులు ఆనందవారాశిలో మునిగి తేలియాడిరి. అట్టి దివ్యమంగళ శుభ సమయాన రావణ సంహానంతరం శ్రీరాముడు అయోధ్యకు వేంచేసి పట్టాభిషిక్తుడైనట్లు శ్రీశంకరపాదులు సర్వజ్ఞ పీఠాధిరోహణ గావించిరి. ఆ సుసమయము యావద్భారత దేశమునకు భావిభాగ్యోదయమైనది. ఆ వెలుగే శాశ్వత విజ్ఞానభిక్ష కాగా దానిని మనం అక్షయముగ ననుభవించుచున్నాము.

లోకములను తప్పుడుత్రోవ నుండి మళ్ళించడవే శ్రీశంకరాచార్యస్వామిఆయన ఆశయం. దేశ సమైక్యమే ఆయన ఆశ. ఆయన హృదయమే విశ్వప్రేమకు నిలయం. శ్రీశంకరుల వాక్కులే పుణ్య నదీజలములు. వారి ఆశయములే భారత భాగ్యోదయ సౌధమునకు పునాదులు. స్వమతాధిక్యమును నిలబెట్టుట కొరకే సర్వజ్ఞపీఠము నధిరోహించిరి. కొలది రోజులు మాత్రమే సర్వజ్ఞ పీఠాధిపత్యము వహించి

తన శిష్యగణమందు గల ఒకనిని తత్పీఠమున కధికారిగ జేసి బదరికా వనం వైపు ప్రయాణమైనారు.

## 6.9 చతురామ్నాయ మఠ స్థాపన

క్షేత్రం చక్కటి పదునులో బాగుగ దున్నబడి విత్తనములు చల్లబడినవి. కాలమానం బాగున్నది. నాటబడిన విత్తనములు మొలకలెత్తినవి. కనులపండువుగ తయారైనది పైరు. అట్లు దేశం నలుమూలలా కలయదిరిగి చెడు మతములనే కలుపుమొక్కలను తీసివేసి అద్వైత మతమనే మేలి పంట పండించారు. పండిన పంట భద్రపరచుకొనవలెను. అజాగ్రత్త వహించిన దొంగలపాలు గాని, పెంటపాలు గాని కావచ్చు. దేశంలో సమకూర్చబడిన ఐకమత్యం స్థిరముగ వర్ధిల్లవలెను. లేనిచో చేసిన పని వృథాయే గదా! తెలివైన రైతు గాదులు కట్టి అందు భద్రపరచుకొని కావలసినపుడు సుఖించి అనుభవించును. రైతు నిర్మించిన గాదులు వంటి నిర్మాణమొకటి చేయవలెనను సంకల్పం శ్రీశంకరుల విశాలహృదయంలో మొలకెత్తినది. విశాలమైన దేశమునకు సుస్థిరమైన భవనం కావలెను. అట్టి భవనంలో మన మందరం స్థిరముగ వాసం చేయాలన్నదే ఆయన దృఢ సంకల్పం. దానికి నాలుగు దిక్కులా నాలుగు స్తంభము లుండవలెనని సంకల్పించెను. వ్యాసుడు విభజించి పెట్టిన వేదము నాలుగు భాగములు. ఆ నాలుగు నాలుగు స్తంభములైతే వాటికి హిమాలయములంత లోతులో పునాదులు వేసి నిర్మించి కాశ్మీరమందు సర్వజ్ఞ పీఠమునకు నాలుగు దిక్కులకు నాలుగు పీఠములు స్థాపన చేసినట్లు శ్రీశంకరులు నాలుగు స్తంభములపైని నాలుగు మఠములు నిర్మించారు. ఆ మఠములే భారతీయులకు శాశ్వత రక్షణ సౌధముగ వెలసినవి. భారతీయులు లోకానికి గూడ జ్ఞానభిక్ష పెట్టుకొనుచున్నారు. ఆధ్యాత్మిక తత్త్వమునందు అభిమానము అలవడుటకు ప్రచారమే గత్యంతరము. ఆ ప్రచారము నిరంతరము జరుగుచుండవలెను.

మఠములనగా బైరాగులు వచ్చి పోయే సత్రములు గావు. 'మఠశ్ఛాత్రాదినిలయః' – శంకర మఠములు శ్రద్ధా కేంద్రములుగను, సంఘాన్నుత్తేజ పరచునవిగను, సంఘసంస్కర్తలను తయారు చేయునవిగ నుండుటకు స్థాపించబడినవి. ధృవములను కలిపి దిక్కులు ఏకం చేసి ఆయన కున్న శక్తినంత అందివిడ్చి నిర్మించారు. ఆయన బాట లభేద్యమనియు, తిరిగి మనము సుడిగుండములలో పడిపోకుండ నుందు మనియు వారి సత్సంకల్పం. చతురామ్నాయ పీఠములు – ఉత్తరాన బదరి యందు, తూర్పున పూరీ జగన్నాథమందు, దక్షిణాన శృంగేరి యందు, పశ్చిమాన ద్వారక యందు స్థాపించారు.

## 6.10 మఠముల వివరణ

**ద్వారకా మఠము** : మొదటిసారిగ స్థాపించిన మఠము ద్వారకా మఠమని కొన్ని గ్రంథములు తెలుపుచున్నవి. దీనినే శారదా మఠమనియు, లేక కాళికా మఠమనియు పిలుస్తారు. జరాసంధుని దాడులకు తట్టుకొనుట కనువైన తావని శ్రీకృష్ణుడు నిర్మించెనది. మధురావాసము కంటె అన్ని విధముల ద్వారకావాసము మిగుల ప్రీతిని కలుగజేసే దని మురహరి పలికిన మాట. ద్వాపరాంతమందు ద్వారక సముద్రమందు మునిగినా పురుషోత్తముని మందిరము చెక్కుచెదరలేదు. ఇచ్చటనేక శివలింగములు, సాలగ్రామములు ప్రతిష్ఠింపబడి యున్నవి. పురాణములలో దీనిని కుశస్థలి యన్నారు. ద్వారకలో పశ్చిమామ్నాయ కాళికా మఠమును స్థాపించారు.

**గోవర్ధన మఠము :** గోవర్ధన మఠమునే పూరీమఠమంటారు. ఇది తూర్పున జగన్నాథపురిలో స్థాపించబడింది. ఇది పరమపవిత్రమైన సప్తక్షేత్రములలో నొకటిగా వన్నె కెక్కినది. ఈ క్షేత్రమునకు నీలాద్రి, నీలాచలమను పేరులున్నవి. ఇచ్చట బహు పురాతనమైన దేవాలయమొకటి గలదు. శ్రీకృష్ణ బలరామ సుభద్ర మూర్తులు దేవాలయమందు స్థాపించబడినవి. శ్రీకృష్ణుడు

జగన్నాథుడగుటచే దేవాలయమునకా పేరు కలిగినది. ఈ జగన్నాథ క్షేత్రమునకు కోయిలీ వైకుంఠమను పేరు కూడ ఉంది. శ్రీకృష్ణ నిర్యాణానంతరం వారి దివ్య శరీరమునకు అగ్నిసంస్కార మిక్కడే జరిగిందని స్థలపురాణం. ఒకనాడు సుభద్ర నివసించే భవనమునకు శ్రీకృష్ణ బలరాములు ప్రవేశము చేయుచుండ సుభద్ర వచ్చి వారిమధ్యగా నిలబడియుండెను. అప్పుడా భవనములో నుండి వ్రజకథ వినబడుచుండెను. ఆ కథ వీనులవిందై వారి మనస్సులు హరింపబడి తన్మయులైరి. ఆ సమయాన దేవర్షి ప్రత్యక్షమై ఆ ముువ్వర నారూపంలో అచ్చట స్థిరంగా ప్రకాశించ మని కోరగా ముువ్వరు మూర్తి రూపములు వెలసినవట. ఈ క్షేత్రమందు శ్రీజగన్నాథునకు సమర్పించు ప్రసాదము చాల పవిత్రమైన దని నిరాలుడను కవి అన్నాడు. శ్రీజగన్నాథుని మహిమలనేకములు. పూరీ జగన్నాథ క్షేత్రమందు చతురామ్నాయ పీఠములలోనిదిగా గోవర్ధన మఠమును స్థాపించిరి.

**జ్యోతిర్మఠము :** భారత దేశమున ఉత్తరాన గల బదరీ క్షేత్రమందు జ్యోతిర్మఠమును స్థాపించిరి. దీనినే శ్రీమఠమని యందురు. ఈ క్షేత్రము బహు పురాతనమైనది. పురాణములు ఈ క్షేత్ర మహిమను వేనోళ్ళ పొగడుచున్నవి. ఇచ్చట పెక్కు శక్తిమందిరములు, శివాలయములు గలవు. బదరీ నారాయణ దేవుని ఆలయం జీర్ణం కాగా శ్రీఆచార్యస్వామి ఆలయ నిర్మాణ ప్రతిష్ఠాదులు గావించిరి. కుమారుని వెంటబెట్టుకొని రమ్మనమని అవసానదశలో నున్న ఆర్యాంబ ధనం మూటగట్టి అగ్నిశర్మను పంపించినట్లు, అతడా ధనమును శ్రీశంకరపాదుల ముందుంచగా ఆ ధనం తనకెందుకని యెంచి ఆ ధనంతో హిమాలయపు లోయలో 23000 అడుగుల యెత్తున శ్రీబదరీనాథ దేవాలయ నిర్మాణము గావించి యున్నారని, శ్రీ బదరీనాథునకు భోగం సమర్పించే బంగారు గిన్నె శ్రీశంకరపాదు లొసగినదే యని ఉత్తరాది శ్రీశంకరుల చరిత్రలో తెలుపబడి యున్నది. అగ్నిశర్మను ఆనాడే బద్రీనాథ దేవాలయమునకు పూజారిగ నియమింపబడినట్లు

చెప్పబడుచున్నది. ఆయన వంశస్థులే నేటికీ బద్రీనాథ దేవాలయ పూజారులుగ నున్నారు. అట్టిది పరమపవిత్రమని యెంచి శ్రీఆచార్యస్వామి చతురామ్నాయ పీఠములలోనిదగు జ్యోతిర్మఠమును బదరీ క్షేత్రమందు స్థాపించారు.

**శారదాపీఠము :** ఇక దక్షిణదిశలో మైసూరు రాజ్యమందు శృంగేరీ క్షేత్రమున్నది. శ్రీశంకరపాదులు దక్షిణదేశ యాత్రకు జనినప్పుడే శారద పీఠమును నెలకొల్పినటుల చెప్పుకొన్నాం. చతురామ్నాయ పీఠములను స్థాపించుటలో దానిని శారద మఠముగ రూపొందించినటుల చెప్పుట కాస్కారము కలుగుచున్నది. ఈ క్షేత్రము రామాయణ కాలము నుండి పరమ పుణ్యస్థలముగ ప్రఖ్యాతి వడసియున్నది. శ్రీశంకరులీ తావునకు తొలిసారిగా వచ్చినపుడు తుంగాతీర ప్రాంతమందు ప్రసవవేదనలో నున్న కప్పకు త్రాచుబాము తన పడగను విప్పి ఎండ తగులకుండ గొడుగుపట్టి యుండుట స్వయముగ జూచి అచ్చెరువొందిరి. ఈ క్షేత్రము సర్వపాపములను హరించునని ప్రసిద్ధి బడసెను. అట్టి ప్రత్యేకతలు హెచ్చుగ నుండుటచే శ్రీఆచార్యస్వామి శృంగేరీ క్షేత్రమందు చతురామ్నాయ మఠమైన శారదా మఠస్థాపన జేసియున్నారు.

**మహావాక్యములు :** నాలుగు వేదముల నుండి నాలుగు మహావాక్యములు తీసి నాలుగు మఠములకు పంచి పాలించమన్నారు జగద్గురువులు (1) ఓం ప్రజ్ఞానం బ్రహ్మ (2) ఓం అహం బ్రహ్మాస్మి (3) ఓం తత్త్వమసి (4) అయమాత్మా బ్రహ్మ అనునవి అనాది నుండి వచ్చుచున్నవి. శు కరహస్యోపనిషత్తు, శ్రీవిద్యారణ్య ప్రణీతమైన పంచదశి, శివతత్త్వ సుధానిధి, నిర్ణయసింధు, యతిధర్మ నిర్ణయం మొదలగు ప్రమాణ గ్రంథములలో మహావాక్యములు నాలుగనియే తెలుపుచున్నాయి. ద్విజులకు గోత్ర, ప్రవర, శాఖ, సూత్రాదులున్నటుల యత్యాశ్రమం స్వీకరించు వారలకు వేదము, మహావాక్యము, సంప్రదాయాదులు నిర్ణయించబడి యున్నవి. అందువలన మఠములను పాలించుటలో గూడ సన్యాస క్రమమును జతపర్చబడినవి.

**గోత్రములు :** అవిగతము, కాశ్యప, భృగు, భూర్భువః అను నాలుగు గోత్రములను నాలుగు మఠములకు పంచి యున్నారు.

**సంప్రదాయములు :** గృహస్థులకు సంప్రదాయము లున్నటుల పీఠములకు ఒక్కొక్క సంప్రదాయమును కలుగజేసారు. కీటవారము, భోగవారము, ఆనందవారము, భూరివారము అనునవి చతురామ్నాయ మఠముల వారి సంప్రదాయములుగ నిర్ణయించారు శంకరపాదులు. సంప్రదాయముల భావములు గంభీరములు, దిగువ వివరించబడినవి.

**కీటవారము :** సదా నిర్వైరముగ భూతదయ గలిగి హింస చేయకుండ నుండువాడు కీటవార సంప్రదాయమునకు చెందిన వాడగును.

**భోగవారము :** జీవులను విషయముల నుండి అనగా భోగములను వారింతురో వారల సంప్రదాయము భోగవారమగును.

**ఆనందవారము :** భోగవిలాసము నుండి జనులను ఎవరు వారించెదరో వారు ఆనందవార సంప్రదాయము గలవారగుచున్నారు.

**భూరివారము :** భూరియనగ బంగారము. దానియందు గల ఆసక్తినుండి మానవులను ఎవరు వారించెదరో వారిది భూరివార సంప్రదాయము.

**పదవులు :** యతుల గాంభీర్యము పదవులను బట్టి యుండును. ఆచార్యస్వామి పది పదవులను నాలుగు మఠములకు పంచి ఇచ్చారు. తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి అనునవి పది పదవులు బిరుదుల వలె ప్రకాశించును.

**తీర్థ :** **త్రివేణీ సజ్గమే తీర్థే తత్త్వమస్యాది లక్షణే,**
**స్నాయాత్ తత్త్వార్థ భావేన తీర్థనామా స ఉచ్యతే ॥**

తత్త్వమసి అనే మహావాక్యమును త్రివేణీ సంగమంతో పోల్చినారు. ఆ త్రివేణీ సంగమంలో స్నానము ఎవరు చేయుదురో వారలనే తీర్థులన్నారు.

అనగా 'తీర్థ' బిరుదమునకు అర్హులగుదురు. యతుల పేరు చివర తీర్థ అని చేర్చెదరు.

**ఆశ్రమ : ఆశ్రమగ్రహణే ప్రౌఢ ఆశాపాశ వివర్జితః ।**
**యాతాయాత వినిర్ముక్త ఏష ఆశ్రమ ఉచ్యతే ॥**

అనగా (ఆశ్రమ గ్రహణ ప్రౌఢ) యత్యాశ్రమ గ్రహణ నిపుణుడును, ఆశాపాశములను విడచిన వాడును, మోక్షమును బడసిన వాడును 'ఆశ్రమ' బిరుదునకు అర్హుడగుచున్నాడని శ్రీశంకరాచార్యుల యభిమతము.

**వన : సురమ్యే నిర్జనే స్థానే వనే వాసం కరోతి యః ।**
**ఆశాబన్ధ వినిర్ముక్తో వననామా స ఉచ్యతే ॥**

సురమ్యమైన నిర్జన వనములలో వసించువాడు, ఆశాపాశములు లేనివాడును, 'వన' బిరుదమునకు అర్హుడగుచున్నాడు.

**అరణ్య : అరణ్యే సంస్థితో నిత్యమానన్దే వనే ।**
**త్యక్త్వా సర్వమిదం విశ్వమారణ్యః పరికీర్త్యతే ॥**

ఆనందనందన మను అరణ్యమున నిత్యము ప్రకాశించువాడు, ఈ సర్వవిశ్వమను నరణ్యము నంతటిని త్యజించినవాడు అరణ్య బిరుదమునకు అర్హుడై కీర్తింపబడును.

**గిరి : వాసో గిరివనే నిత్యం గీతాధ్యయన తత్పరః ।**
**గమ్భీరాచల బుద్ధిశ్చ గిరినామా స ఉచ్యతే ॥**

నిత్యము పర్వతారణ్య భూములలో నివసించుచు గీతాధ్యయన తత్పరుడై గంభీరము, అచంచలమునైన బుద్ధి గలవాడు 'గిరి' బిరుదమున కర్హుడు.

**పర్వత : వసన్ పర్వత మూలేషు ప్రౌఢం జ్ఞానం బిభర్తి యః ।**
**సారాసారం విజానాతి పర్వతః పరికీర్త్యతే ॥**

పర్వత సానువుల యందు నివసిస్తూ పరిపక్వమైన జ్ఞానంతో సారాసారములను తెలిసికొనిన వాడు 'పర్వత' బిరుదు నొందుటకు యోగ్యు డగుచున్నాడు.

**సాగర : తత్త్వసాగర గమ్భీరో జ్ఞానరత్న పరిగ్రహః ।**
**మర్యాదాం నైలఙ్ఘతే సాగరః పరికీర్త్యతే ॥**

తత్త్వసాగర గంభీరుడు జ్ఞానరత్నము చేత ప్రకాశింపబడువాడు శాస్త్రమర్యాదలను అతిక్రమించని వాడు 'సాగర' అను పదవికి అర్హుడగుచున్నాడు.

**సరస్వతి : స్వరజ్ఞానరతో నిత్యం స్వరవాదీ కవీశ్వరః ।**
**సంసార సాగరా సారహన్తాసౌ హి సరస్వతీ ॥**

వేదము ఉచ్ఛరించుటకు స్వరం విధి. స్వరము తప్పక పలుకవలెను. అట్టి స్వరజ్ఞానం గలిగి వేదము నుచ్ఛరించుటెరిగి, కవులలో శ్రేష్ఠుడై సారం లేని సంసార సాగరమును దాటువాడే 'సరస్వతి'.

**భారతి : విద్యాభారేణ సంపూర్ణః సర్వభారం పరిత్యజన్ ।**
**దుఃఖభార న జనాతి భారతీ పరికీర్త్యతే ॥**

సకల భారములన విడచి విద్యాభారముతో పరిపూర్ణుడైన భారము నెరుంగని వాడు 'భారతి'యను పదవికి తగినవాడు అగుచున్నాడు.

**పురి : జ్ఞానతత్త్వేన సమ్పూర్ణః పూర్ణతత్త్వ పదే స్థితః ।**
**పరంబ్రహ్మరతో నిత్యం పురీనామ స ఉచ్యతే ॥**

జ్ఞానతత్త్వముతో పరిపూర్ణుడై పూర్ణతత్త్వ పదము నందు సదా పరబ్రహ్మమందు రతుడై యున్నవాడే 'పురి' పదవికి అర్హుడు.

## 6.11 పశ్చిమామ్నాయ మఠము

మఠనామము – శారదా మఠము లేక కాళికా మఠము

సంప్రదాయము – కీటవారము

అంకితనామము – (బిరుదులు లేక పదవులు) తీర్థ, ఆశ్రమ
క్షేత్రనామము – ద్వారకా క్షేత్రము
దేవనామము – సిద్ధేశ్వరుడు
దేవి (శక్తి) – భద్రకాళి
ఆచార్యులు – విశ్వరూపుడు (కొన్నిట సురేశ్వరుడని గలదు)
తీర్థనామము – గోమతీ తీర్థము
బ్రహ్మచారి – స్వరూపుడు
వేదము – సామవేదము
మహావాక్యము – తత్త్వమసి
గోత్రము – అవిగతము (కొన్నిట వాశిష్టమని యున్నది)
పాలిత ప్రాంతము – సింధు, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర దేశములు.

## 6.12 పూర్వామ్నాయ మఠము

మఠ నామము – గోవర్ధన మఠము
సంప్రదాయము – భోగవారము
అంకితనామము – (బిరుదులు లేక పదవులు) వన, అరణ్య
క్షేత్రనామము – పురుషోత్తమము
దేవనామము – జగన్నాథుడు
దేవి – విమల
ఆచార్యులు – పద్మపాదుడు
తీర్థనామము – మహోదధి
బ్రహ్మచారి – ప్రకాశకుడు
వేదము – ఋగ్వేదము

మహావాక్యము - ప్రజ్ఞానం బ్రహ్మ
గోత్రము - కాశ్యపము
పాలితప్రాంతము - అంగ, కళింగ, ఉత్కళ దేశములు.

## 6.13 ఉత్తరామ్నాయ మఠము

మఠ నామము - జ్యోతిర్మఠము (శ్రీమఠము)
సంప్రదాయము - ఆనందవారము
అంకిత నామములు - గిరి, పర్వత, సాగర
క్షేత్రనామము - బదరికాశ్రమము
దేవనామము - నారాయణుడు
దేవి - పూర్ణాగిరి
ఆచార్యులు - తోటకాచార్యులు
తీర్థనామము - అలకనంద
బ్రహ్మచారి - ఆనందుడు
వేదము - అథర్వణ వేదము
మహావాక్యము - అయమాత్మా బ్రహ్మ
గోత్రము - భృగు గోత్రము
పాలితప్రాంతము - మరు, కాశ్మీర, కాంభోజ, పాంచాల మొదలైన ఉత్తర దేశములన్నియు

## 6.14 దక్షిణామ్నాయ మఠము

మఠనామము - శృంగేరీ మఠము
సంప్రదాయము - భూరివారము
అంకితనామములు - సరస్వతి, భారతి, పురి

| | | |
|---|---|---|
| క్షేత్రనామము | - | రామేశ్వర క్షేత్రము |
| దేవనామము | - | ఆదివరాహమూర్తి |
| దేవి | - | శారద (సర్వమంగళ యగు కామాక్షియని కొన్నిట గలదు) |
| ఆచార్యులు | - | పృథివి |
| తీర్థనామము | - | తుంగభద్ర |
| బ్రహ్మచారి | - | చైతన్యుడు |
| వేదము | - | యజుర్వేదము |
| మహావాక్యము | - | అహంబ్రహ్మాస్మి |
| గోత్రము | - | భూర్భువస్ |
| పాలితప్రాంతము | - | ఆంధ్ర, తమిళ, కేరళ, కర్ణాటక దేశములు. |

(ఈ నాలుగు మఠములలోను ఆచార్యుల నామములు ఒకరీతిగ కన్పడుట లేదు).

ఈ మఠములను నాల్గింటిని పరిపాలించుటకు విధులను తయారు చేసి శ్రీశంకరాచార్యులు శాసన రూపమున రచించిపెట్టెను.

## 6.15 మఠామ్నాయ మహా శాసనము

మఠములను పరిపాలించుటకు కొన్ని విధులకు లోబడియున్నచో నిర్వహణ కుంటుపడుటకు ఆస్కారముండదని ఈ దిగువ మహానుశాసనము చేసి చతురామ్నాయ మఠముల కందిచ్చియున్నారు శ్రీశంకరపాదులు. వాని సారాంశ మిలా ఉంది.

(1) శాసనబద్ధులై నలుగురు ఆచార్యులు నాలుగు మఠములను క్రమబద్ధముగ స్వధర్మ ప్రవర్తకులగుదురు గాక.

(2) స్వధర్మము ననుసరించని ఆచార్యులు దండనార్హు లగుదురు గాక! ఆచార్యులు సర్వదా ధర్మ ప్రచారము చేయుచుండవలెను.

(3) తమకు ఏర్పాటు గావింపబడిన దేశములలో ప్రతిపత్తిని సమకూర్చు నిమిత్తం బాగుగ సంచారము చేయుచుండవలెను. ఎల్లప్పుడు మఠమునందు తిష్ఠవేసికొని కూర్చుండుట ఆచార్యునకు తగదు.

(4) మేము సాధించిన వర్ణాశ్రమ సదాచార ధర్మములను తమ దేశములో యథావిధిగా రక్షితము లగునట్లు ఆచార్యులు చూచెదరు గాక!

(5) దేశమందు ధర్మమునకు గ్లాని సంభవించినపు డెల్ల మాంద్యమును విడచి దక్షత వహించెదరు గాక!

(6) ఒకరి భూభాగమందు మరియొక ఆచార్యులు ప్రవేశించరాదు. ఈ విధిని ఆచార్యులు పరస్పరామోదముతో కట్టుబడి యుండెదరు గాక!

(7) మర్యాద లోపించిన నాడు మంగళప్రదమైన నియమములు అంతరించును. కలహపు కుంపట్లు రగుల్కొనును. కనుక నియమములను ఉల్లంఘించరాదు.

(8) నాచే నిర్మింపబడిన ఈ ఆర్య మర్యాద యథావిధిగ చతురామ్నాయ మఠముల ద్వారా రక్షింపబడునట్లు పరివ్రాజకులు తమ శక్తిని వినియోగించవలసి యున్నది.

(9) శుచిగలవాడును, ఇంద్రియ నిగ్రహము కలవాడును, వేదవేదాంగాది విశారదుడును, సర్వశాస్త్రముల యందు నిధియైన వాడును, యోగి పుంగవుడును అయినవాడే నా ఆస్థానమందు ప్రవేశించుగాక! అనగా అట్టివారే ఆచార్య పదవికి అర్హు లగుదురుగాక!

(10) చెప్పబడిన అర్హతలు గలవానికి నా పీఠమునకు ఆధిపత్యము లభించును. ఇందులకు విరుద్ధముగ పీఠాధిపత్యము సంపాదించినచో ప్రజ్ఞ గలవారి నిగ్రహమునకు పాల్పడునని తెలుసుకొనవలెను.

(11) తగు సమర్థుడైన ఆచార్యుడు లభించినప్పుడు ఎట్టి విఘ్నముల నైనను ఎదుర్కొని మత ప్రతిష్ఠను కాపాడి సనాతనమైన ధర్మమును రక్షించుగాక!

(12) నా పీఠమునకు తగిన యతీశ్వరుడు పట్టాభిషిక్తు డైనచో ప్రజ లందరు ఆ యతిపుంగవుణ్ణి నన్నుగానే భావించి 'యస్యదేవః' అను శ్రుతి వాక్యము ననుసరించి గౌరవింతురు గాక!

(13) పీఠాధిపతికి అంత్యదశ వచ్చినప్పుడు ఒక పీఠమునకు ఒక్కరినే పట్టాభిషిక్తుని చేయవలెనే గాని పెక్కుర నెప్పుడు నియమించరాదు.

(14) ధర్మ సంరక్షణార్థము సుధన్వ మహారాజునకు గల అధికారమును ఇంద్రాజ్ఞ వలె పాలింతురు గాక!

(15) యతి యొక్క ఐశ్వర్యము ధర్మరక్షణ కొరకు మాత్రమే. అది బాహ్యచిత్తులగు వారలకు ఉపకరించేదిగ నుండుటకు మాత్రమే.

(16) సుధన్వుడును, మిగిలి మహారాజులును ఈ ధర్మ పరంపరను శాశ్వతముగ కాపాడుదురు గాక!

(17) చాతుర్వర్ణముల వారును త్రికరణ శుద్ధిగ యథాయోగముగ ఆయా గురుపీఠములను ఆయా ప్రజలు అర్చింతురు గాక!

(18) ప్రభువులు తమ ప్రజలనుండి పన్ను తీసికొను నట్లు ధర్మాకారం పొందిన ఆచార్యులు మఠరక్షణ నిమిత్తం పన్నును గ్రహింతురుగాక!

(19) ధర్మవే అన్నిటికి మూలము. మానవులు సదాచారము నవలంబించవలెను. కనుక ఆచార్యుని అనుశాసనము అన్నిటి కంటె మించినది. మానవులకు మూలము ధనమే. అది సదాచారులు అవలంబించి యుండునుగదా! కనుక ఆచార్యుని అనుశాసనము అన్నిటిని మించినదై యున్నది.

(20) ఆచార్యుని ప్రయత్నపూర్వకమైన ఉపదేశమును అందరు పొందవలెను. అందు ఉదారులగు వారు ముఖ్యముగ స్వీకరించవలసి యున్నది.

(21) పాపాత్ములు గూడ ఆచార్యులు విధించు శిక్ష పొందినచో పరిశుద్ధులై (పుణ్యాత్ములై) పుణ్యాత్ములు స్వర్గాది పుణ్య లోకములు పొందునట్లే పొందగలరు.

(22) ఈ నియమము లన్నియు మనువు, గౌతముడు మొదలైనవారు చెప్పినవే. విశిష్ట శిష్టాచారము గూడ మూలభూతమైన వేదము వల్లనే ప్రసిద్ధమై యున్నది.

(23) కావున ఆచార్యుల ఉపదేశములు, శిక్షలు పరిపాలనీయము లైనవి. కనుక ప్రభువును, ఆచార్యుడును (ఇరువురును) వందనీయులు. నిందనీయులు మాత్రం గారు.

(24) లోకహితమును గోరి సర్వవర్ణముల వారికిని, అన్ని ఆశ్రమములలో నున్న వారికిని ఈ ధర్మపద్ధతి యథా శాస్త్రీయముగ విధించబడుచున్నది. అని శాసించి చతురామ్నాయ మహాశాసనమును చిత్రించిరి.

(25) 'కృతయుగమందు బ్రహ్మదేవుడును, త్రేతాయుగమందు వశిష్ఠ మహర్షియును, ద్వాపర యుగమున వ్యాసమహర్షియును జగద్గురువులై యుండిరి. ఈ కలియుగమున నేనే జగద్గురువునై అవతరించితి (కృతే విశ్వగురు ర్బ్రహ్మాత్రేతయయాం ఋషిసత్తమః ద్వాపరే వ్యాస ఏవ స్యాత్ కలావత్ర భవామ్యహమ్॥) నని శ్రీశంకర భగవత్పూజ్యపాద విరచిత మహానుశాసనమందు వెలువరించి యున్నారు.

## 6.16 తత్త్వ గ్రంథములు

పలుకులు బంగారముగ నున్నప్పుడు గౌరవం లభించును. అట్టి బంగారుపలుకులు హృదయమును ద్రవింపజేయును. ప్రజలను భక్తులుగ మలచి జ్ఞానులుగ రూపొందించుటయే శ్రీశంకరుల యభిమతము. పసిడి పలుకుల మహోదధిని మన కందుబాటు చేయ సమకట్టి యావద్భారత దేశమునకును అందుబాటైన గీర్వాణ భాషయందు చిత్రించి అందిచ్చెను. ఆయన భాష మృదుమధురము, సులభ శైలిలో నుండి సంస్కృత భాష రానివారికి కూడ అర్ధమగు రీతిని పొందుపరుప బడి వీనులవిందుగ నున్నది. సామాన్యులకు గూడ నర్ధము గానిది తత్త్వశాస్త్రము. పైగా అగాధమైనది. చక్కటి ఉపమానములతో కొరుకబడని ఘట్టములు, తేటతెల్లముగ వెలువరించిన దయాసముద్రుడాయన. ఇంతవరకు మనకు లభ్యమైన గ్రంథములు 153 శంకరస్మృతి యను గ్రంథరాజము కేరళ దేశ రాజధానీ నగరమైన తిరువేంద్రమందు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమందు గలదు.

ఉపదేశ గ్రంథములు, భాష్య గ్రంథములు, స్తవ స్తోత్రములు అను మూడు తెరగులుగ నున్నవి శంకరకృత గ్రంథములు. ఇంచుమించుగ అవన్నియు ప్రచారమందున్నవని చెప్పవలెను. వారి గ్రంథములలో నొకటి గొప్పదని గాని వేరొకటి తక్కువని వచించుటకు ఆస్కారము లేక దేనికదే గొప్ప విశిష్ఠత గలిగి యలరారుచున్నవి. వారి గ్రంథములీ దిగువన పొందుపరుపబడినవి.

## 6.17 ఉపదేశ గ్రంథములు

1. అద్వైతానుభూతి
2. అనాత్మ శ్రీవిగర్హణ ప్రకరణము
3. అమరక శతకము
4. అజ్ఞాన బోధిని
5. అపరోక్షానుభూతి
6. ఆత్మషట్కము

7. ఆత్మపూజ
8. ఆత్మబోధి
9. ఆత్మజ్ఞానోపదేశవిధి
10. ఆత్మానాత్మ వివేకము
11. ఉపదేశ సహస్రి
12. ఏకశ్లోకీ
13. కాశీపంచకము
14. కేవలోఽహమ్
15. కౌపీన పంచకము
16. గుర్వష్టకము
17. చర్పట మంజరిక
18. చర్పట మంజరిక (మోహముద్గర) (భజగోవిందం)
19. జీవన్ముక్తానందలహరి
20. తత్త్వోపదేశము
21. తత్త్వబోధ
22. ధన్యాష్టకము
23. నిరంజనాష్టకము
24. నిర్వాణ షట్కము
25. నిర్వాణ దశకము
26. నిర్వాణమంజరి
27. నిర్గుణ మానసపూజ
28. పంచీకరణము
29. పంచసార తంత్రము
30. ప్రబోధ సుధాకరము
31. ప్రశ్నోత్తర రత్నమాల
32. ప్రశ్నోత్తర మణిమాల
33. ప్రాతఃస్మరణ
34. ప్రౌఢానుభూతి
35. బ్రహ్మజ్ఞానావలీల
36. బ్రహ్మానుచిన్తనం
37. మనీషా పంచకము
38. మఠామ్నాయము
39. మాయాపంచకము
40. యోగతారావలి
41. వాక్యవృత్తి
42. వాక్యవృత్తి
43. వాక్యసుధ
44. విజ్ఞాననౌక

45. వివేక చూడామణి
46. వేదాంతకేసరి
47. వేదాంత డిండిమ
48. శంకరస్మృతి
49. శతశ్లోకీ
50. సదాచారము
51. సన్న్యాస పద్ధతి
52. సర్వవేదాంత సిద్ధాంత సంగ్రహము
53. సర్వసిద్ధాంత సంగ్రహము
54. సాధన పంచకము
55. సారతత్త్వోపదేశము
56. స్వాత్మ నిరూపణ
57. స్వాత్మ ప్రకాశిక

## 6.18 స్తోత్రములు

1. అచ్యుతాష్టకము
2. అచ్యుతాష్టకము
3. అన్నపూర్ణా స్తోత్రము
4. అంబాష్టకము
5. అర్ధనారీశ్వర స్తోత్రము
6. ఆనందలహరి
7. ఆర్తత్రాణ నారాయణాష్టకం
8. ఉమామహేశ్వర స్తోత్రము
9. కనకధారా స్తోత్రం
10. కళ్యాణవృష్టి
11. కాలభైరవాష్టకము
12. కాశీస్తోత్రము
13. కృష్ణాష్టకము
14. కృష్టాష్టకము
15. గంగాస్తోత్రము
16. గంగాస్తోత్రము
17. గణేశభుజంగ ప్రయాతము
18. గణేశ పంచరత్నములు
19. గౌరీ దశకం
20. గోవిందాష్టకం
21. జగన్నాథాష్టకం
22. త్రిపురసుందర్యష్టకం
23. మానసపూజ
24. వేదపాద స్తోత్రము

25. దక్షిణామూర్త్యష్టకము 26. దక్షిణామూర్తి స్తోత్రము
27. దక్షిణామూర్తి వర్ణమాలాస్తవం 28. దశశ్లోకీస్తవం
29. దశావతార స్తోత్రం 30. దేవీషష్ట్యుపచార స్తోత్రం
31. దేవీభుజంగ ప్రయాతము 32. దేవీ అపరాధ క్షమాపణ స్తోత్రం
33. ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం 34. నవరత్న మాలిక
35. నారాయణస్తోత్రం 36. పాండురంగాష్టకం
37. పుష్కరాష్టకం 38. భగవన్మానసపూజ
39. భవానీ భుజంగ ప్రయాతము 40. భవాన్యష్టకం
41. భ్రమరాంబాష్టకం 42. మణికర్ణికాష్టకం
43. మంత్రమాతృకాపుష్ప స్తోత్రం 44. మీనాక్షీ పంచరత్నములు
45. మీనాక్షీ స్తోత్రము 46. మృత్యుంజయ మానసిక స్తోత్రం
47. యమునాష్టకం 48. యమునాష్టకం
49. రామభుజంగ ప్రయాతము 50. లక్ష్మీనృసింహ పంచరత్నములు
51. లలితా పంచరత్నములు 52. విష్ణుపాదాది కేశాంత స్తోత్రం
53. విష్ణుభుజంగ ప్రయాతము 54. వేంకటేశ్వర మంగళస్తోత్రం
55. వేదసార శివస్తోత్రం 56. శారదాభుజంగ ప్రయాతము
57. శివపంచాక్షర స్తోత్రం 58. శివనామావళి
59. శివభుజంగ ప్రయాతము 60. శివపంచాక్షర రత్నమాల
61. శివపాదాది కేశాంత పాదాంత స్తోత్రము 62. శివపాదాది కేశాంత పాదాంత స్తోత్రము

63. శివాపరాధ భంజన స్తోత్రం
64. శివానందలహరి
65. షట్పది
66. సంకటనాశ లక్ష్మీనృసింహ స్తోత్రం
67. సువర్ణమాల
68. సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాతము
69. సౌందర్యలహరి
70. హనుమత్పంచకం
71. హరిమీడే స్తోత్రం
72. సద్గురుపాదుకాస్తవం

## 6.19 భాష్య గ్రంథములు

1. బ్రహ్మసూత్ర భాష్యము
2. ఉపనిషద్భాష్యములు
3. గీతాభాష్యము
4. విష్ణుసహస్రనామ భాష్యము
5. లలితా త్రిశతీ భాష్యము
6. సనత్సుజాతీయ భాష్యము
7. హస్తామలక భాష్యము
8. ఆపస్తంబీయ భాష్యము
9. గాయత్రీ భాష్యము
10. సాంఖ్యకారికా భాష్యము
11. సుభగోదయ స్తోత్రవాసనా భాష్యము

శ్రీశంకరాచార్యస్వామి కృత గ్రంథములు చదివి మూలపడవేయునవి గావు. ఒకసారి చదివి మరల చదివిన ద్విగుణీకృత భావములు పొడసూపుచుండును. కర్మరుడు నిష్కామ కర్మయోగి కావలెను. భక్తుడు పరమభక్తుడు కావలెను. జ్ఞాని విజ్ఞాని కావలెను. అందరు భయమును వీడి నిర్భయము గలవారై శాశ్వతానందము పొందవలెను. ఇవి ఆయన రచనాశయములు. సత్సంకల్పములు జయప్రదములగును గదా!

## 6.20 సాధన పంచకము

అవతారాశయం సంపూర్తి కానున్న సమయాన శ్రీశంకరపాదుల హృదయము ద్రవించి అమృతము కాగా దానిని తమ బిడ్డలకిచ్చి నిజధామం

జేరుకొందమని తలంచెను. యతులు ప్రవేశం చేయునపుడు ప్రకటన చేసికొనుచు వచ్చెదరు. వెడలునపుడు చెప్పకుండ వెళ్ళాలి. ఇది యతులకు పరమ ధర్మము. ఐనను శ్రీశంకరాచార్యస్వామి యతుల కోవకు చెందినవారు కారనియే చెప్పవలెను. ఆయన యతులకు బాటలు నిర్మించిన ఇంజనీయరు. మట్టితోను, బూడిదతోను బాటలు పోయలేదాయన. మొదట మార్గమును చదును చేసి గట్టిపరచి దానిపై నల్లకంకర, ఇసుక, సిమెంటు కలిపి తగినంత దళసరిగ పోతపోసి చదునుచేసి తోడుకుపోవనట్లు తయారుచేసి అందిచ్చిన రాజమార్గమది. శ్రీశంకరుల మార్గమావిధముగ నున్నందున నేటికిని చెదరకుండ నుండగలిగెను. ఆ మార్గమును రక్షించుకొను భారము మనపై మోపియుండెను. అది భారము గాదు. మన ప్రవర్తన చక్కదిద్దు విధానము. ఆయన నిర్మించిన మార్గమును రక్షించుకొను విధానము ఈ క్రింది విధమున ఆ దయామయుడు రూపొందించెను.

**వేదో నిత్యమధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనేశస్య విధీయతామపచితిః కామ్యే మతి స్త్యజ్యతామ్**
**పాపౌఘః పరి ధూయతాం భవసుఖే దోషోఽనుసన్ధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్ తూర్ణం వినిర్గమ్యతామ్**

తాత్పర్యం: నిత్యం వేదాధ్యయనం చేయుము. అందు చెప్పబడిన కర్మలను నిష్ఠతో నాచరించుము. అట్లు చేసినచో అది ఈశ్వరపూజ యగును. కామ్యకర్మలను మాత్రం ఆచరించబోకుము. పాపములను పోగొట్టుకొనుము! సంసారంలో ఉండే దోషాలను అనుసంధానం చేసికొనుము! ఆత్మేచ్ఛను వృద్ధి నొందించుకొనుము! త్వరలో నీ గృహము నుండి హాయిగ తప్పుకొనుము!

**సఙ్గః సత్సు విధీయతాం భగవతో భక్తిర్దృఢాధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాశు సన్త్యజ్యతామ్**

**సద్ విద్వానుపాస్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షరమర్థ్యతాం శ్రుతిశిరోవాక్యం సమాకర్ణ్యతామ్**

తాత్పర్యం: సత్సంగము పొందుచుండుము. భగవంతుని యెడ దృఢమైన భక్తి గలిగి యుండుము. శాంతము మొదలైన సుగుణములను అలవరచుకొనుము. కామ్యకర్మలను విడచిపెట్టుము. నిజమైన పండితులనే సేవించుము. వారి పాదుకలను నిత్యము సేవించుచుండుము. పరమాత్మను చేరుటకు సహాయపడు ఏకాక్షర మంత్రమగు ఓంకారమును అర్థింపుము. శ్రుతిశిరోవాక్యములను వినుచుండము.

**వాక్యార్థశ్చ విచార్యతాం శ్రుతిశిరః, పక్షః సమాశ్రీయతాం**
**దుస్తర్కాత్ సువిరమ్యతాం శ్రుతిమతస్తర్కోఽనుసంధీయతాం**
**బ్రహ్మైవాస్మి విభావ్యతామహం హర్గవ్వః పరిత్యజ్యతాం**
**దేహేఽహం మతిరుజ్ఝ్యతాం బుధజనైర్వాదః పరిత్యజ్యతామ్**

తా॥ ఉపనిషద్వాక్యముల అర్థమును విచారణ చేయుము. జ్ఞానపక్షమును చక్కగ ఆశ్రయించుము. కుతర్కముల జోలికి పోకుము. శ్రుతి సమ్మతమగు తర్కమును అనుసంధానము చేయుము. బ్రహ్మనై యున్నానని నిరంతరము భావింపుము. గర్వమును, అహంకారమును చక్కగ విడిచిపెట్టుము. దేహమున అహం బుద్ధిని అనగా దేహమే నేను అను బుద్ధిని విడనాడుము. బుధజనులతో వాదులాడవలదు.

**క్షుద్ వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం**
**స్వాద్వన్నం నతుయాచ్యతాం విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్**
**శీతోష్ణాది విసహ్యతాం నతు వృథావాక్యం సముచ్చార్యతాం**
**ఔదాసీన్యమభీప్స్యతాం జనకృపా నైష్ఠుర్యమత్సృజ్యతామ్**

తా॥ ఆకలి రోగమునకు చికిత్స చేయుము. ఔషధము వలె అన్నమును సేవించుము. రుచికరములైన ఆహారమును యాచించకుము. విధివశమున

లభ్యమైన దానితో సంతుష్టి నొందుము. శీతోష్ణ ద్వంద్వములను సమదృష్టితో వహించుము. వృథా మాటలాడకుము. ఉదాసీనుడవు కమ్ము, నిష్ఠూరపడు లాగున ప్రవర్తించకుము.

**ఏకాన్తే సుఖమాస్యతాం పరతరే చేతః సమాధీయతాం**
**పూర్ణాత్మా సుసమీక్ష్యతాం జగదిదం తద్బాధితం దృశ్యతాం**
**ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితిబలాన్నాప్యుత్తరైః శ్లిష్యతాం**
**ప్రారబ్ధస్త్విహ భుజ్యతామథ పరబ్రహ్మాత్మనా స్థీయతామ్**

తా॥ ఏకాంత స్థలమున సుఖముగ గూరుచుండుము. ఆత్మను చిత్తమందు సమాధాన పరచుకొనుము. లోకమును పూర్ణమైన పరమాత్మగా చూస్తూ అది వినీలమైనట్లు నిశ్చయించుకొనుము. జ్ఞానము నుపయోగించి చేయ బోవు కర్మలయందు ఆసక్తిని విడచిపెట్టి ప్రారబ్ధ భోగమును అనుభవిస్తూ పరమాత్మయందే సదా విహరించుము.

ఈ సాధన పంచక శ్లోకములను నిత్యము పఠించుచు చిత్తంతో తద్భావములను గ్రహించువాడు వెన్వెంటనే సంసృతి దావానల తాపోపశమనము పొంది ప్రశాంతు డగు ననుటకు సందియము లేదు.

## 6.21 నిజ ధామ నిష్క్రమణము

యాత్రీకులు కేదారమందు శీతల ప్రభావమునకు తట్టుకొనజాలకుండుటను కరుణారస హృదయుడు సహించజాలక ఉష్ణగుండమును సృష్టించి, ఆ ప్రాంతమందొకచో విశ్రమించి ఇంక చేయదగు కార్యములు లేవని నిశ్చయించి శ్రీశంకరపాదులు అంతర్ముఖులై యుండిరి. శ్రీశంకరపాదులు కేదారమందున్నారని తెలిసి శ్రీదత్తాత్రేయులవారు శ్రీజగద్గురువులను కలసికొన్నారు. 'శంకరా! అనేక జన్మలెత్తినా సాధించలేని అద్భుత కార్యములనేకం ముప్పదిరెండేడుల జీవితంలో జయప్రదంగా సాధించి మతసమైక్యాన్నిసమకూర్చితివి! నీయవతారము సాటిలేనిది!

లోకమునకు ఎనలేని మేలొనర్చితివి! విష్ణ్వాదులు, బ్రహ్మాదులు నిన్ను చూడ నిచ్చగించి రానై యున్నారు. తరుణం దాటిపోవునని ముందుగా వచ్చితిని. శాశ్వతకీర్తిని గడించావు. నిన్ను పొగడ బ్రహ్మాదులకు తరమా!' అని కీర్తించునంతలో,

పాశుపతి పాదముల అంతు కనుగొనజాలని శ్రీమహావిష్ణువు వరాహరూపమును చాలించి, నిజరూపంలో ఇప్పుడైనను కనుగొననెంచి కేదారమందున్న శ్రీశంకరావతారమూర్తిని దర్శించ ప్రత్యక్షమాయెను. శిరస్సు అంతు కనుగొనలేని చతురాననుడు హంస రూపమును విడచి కమలనాభుని వెంట పద్మభవు డరుదెంచెను. దేవతలు, సిద్ధులు, సాధ్యులు మున్నగువా రందరు దివిజకాంతులు విరజిమ్మే వేలాది దివ్యవిమానములలో ఆకాశం మూసివేసి దివ్యకుసుమాలను వర్షించుచుండగా, శ్రీశంకరవరులు నిజధామం చేరుకొన నున్నారని కొందరు ఆనందం పట్టలేక నృత్యం చేయుచుండగా, మరికొందరు వీనులవిందుగా గానం చేస్తున్నారు. మరికొందరు 'మహానుభావా! కైలాసం కైలాసం వలె లేదు. నీ శక్తిని స్తుతించ ఆదిశేషునికి శక్తి చాలకున్నది. ఘనకార్యములు అనేకం చేసి అందరినీ సామరస్యంతో ఏకంచేశావు. చేయదగినవన్నీ దయతో ముగించావు. ఏ యవతారము నీయవతారమునకు సాటిరాదు. నీరాకకై ముక్కోటి దేవతలు ఎదురు చూస్తున్నారు. నిజధామం చేరుకో!' అని స్తుతించి వేడుకొన్నారు. అక్కడ ఉన్నవారందరును జయజయ ధ్వానములు సల్పుచున్నారు. అంతలో నంది హర్షంతో మధురమైన అంకెలు వేయుచు వచ్చి నిలువబడి యున్నది. శంకరునకు శిరోభూషణముగ నుండుటకు శశి ఆయత్తపడుచున్నది. నాగులు కంఠాభరణములుగా నుండుటకును, సకల శుభములు పాదముల నాశ్రయించుటకును, గంగ గరళకంఠుని చల్ల బరచుటకై శిరమున నివాసం చేయుటకు వచ్చియున్నారు. అంతలో పరమహంసలు పశుపతి పాదపద్మ సౌధంలో ఏకాంతవాసం చేయ నుద్యుక్తులయ్యారు.

నేలపై రాలిన అంకోల బీజములు ఉరిమినప్పుడు తమ తల్లిని పట్టుకొనునట్లు, సూదులు అయస్కాంతము నాకర్షించినట్లు, లతలు వృక్షముల నాశ్రయించునట్లు, నదులు సముద్రుని జేరునట్లు భక్తులు శ్రీశంకరాచార్యస్వామి పాదపద్మముల నాశ్రయించుటకు తండోపతండములుగ విచ్చేసిరి. చేరిన వారందరు ఆనందవారాశిలో మునిగి తేలియాడుచున్న సమయాన, అవతారమూర్తి యందు వాగ్రూపములోనున్న గిరిజాకన్య, మేరుగిరికి వేంచేయనున్న గిరిజాపతికి సుస్వాగతమిచ్చుటకు ముందుగ బయలుదేరి వెళ్ళెను. ఆ దివ్యసమయమందు జగద్గురువులో నుండి సహస్రాధిక రవికిరణాలను మించిన దివ్యతేజం మింటి కెగసి నందివాహనుడై పరివారసమేతుడై పయనించి, ఉత్తరదిక్కున వెండికొండపై దిగి, నటరాజు నాట్యము చేయుచుండ నగరాజపుత్రిక నీరాజనమిచ్చి, సంతోషం పట్టలేక అక్కున నొక్కుకొని అర్ధనారీశ్వరునిగా జేసికొన్నది.

ఇయ్యది యఱ్ఱాప్రగడ బుచ్చిమాంబా వెంకటాచల తనూజుడును

**శ్రీశ్రీశ్రీ శ్రీ దేవకీనందనాశ్రమ స్వామివారి శిష్యపరమాణువునైన**

**వేంకటసూర్యనారాయణమూర్తిచే రచింపబడిన షట్కాండావృతమైన**

**శ్రీశంకరావతార చరితమను ఆంధ్ర వచనకావ్యము నందు**

**సర్వము శాంతికాండ సమాప్తము.**

**శ్రీవేంకటేశ్వరార్పణమస్తు**

**స్వస్తి, ఓంతత్సత్.**

## అనుబంధము 1

శంకరాచార్యుల కాల నిర్ణయము (క్రీ.పూ. 509) ఆది శంకరులు 32 సంవత్సరముల జీవిత కాలములో అత్యద్భుత ముగా భారత దేశాన్ని ఒకే త్రాటి క్రిందకు తీసుకొని వచ్చిన అవతార మూర్తి. అట్టి మహామహుడు జీవించిన కాలంపై వివిధాభిప్రాయా లున్నాయి. కొందరు క్రీ. శ. 788 నుండి 820 అనియు, మరి కొందరు 6,7 వ శతాబ్దులకు చెందిన వాడనియు, ఇంకను కొందరు 4వ శతాబ్దము వాడనియు అనుచున్నారు. ఇటీవలి భారతీయ చరిత్రకారులు మాత్రం క్రీ.పూ. 809 లో అవతరించాడని వెల్లడించారు. గ్రంథ విస్తరణ భీతితో ఆయా వాదముల నన్నీ తెలుపకుండా గట్టి ఆధారములను కొన్నిటిని మాత్రము ఈ దిగువ పేర్కొంటున్నాను.

**1వ ఆధారము :** శ్రీచిత్సుఖాచార్య విరచితమైన బృహచ్ఛంకరవిజయము'లో 32వ ప్రకరణము ఇలా ఉంది:

**"తతస్సా దశమే మాసే సంపూర్ణ శుభ లక్షణే,**
**షడ్వింశే శతకే శ్రీ మద్యుధిష్ఠిర శకస్యవై** **12**
**ఏకత్రింశేథ వర్షేతు హాయనే నందనే శుభే,**
**మేషరాశిం గతే సూర్యే వైశాఖే మాసి శోభనే॥** **13**
**శుక్లపక్షేషు పంచమ్యాం తిథ్యాం భాస్కరవాసరే,**
**పునర్వసు గతే చంద్రేలగ్నే కర్కటకాహ్వయే॥** **14**
**మధ్యాహ్నే చాభిజిన్నామ ముహూర్తే శుభవీక్షితే,**
**స్వోచ్ఛస్థే కేంద్రసంస్థేచ గురౌ మందే కుజే రవౌ॥** **15**
**నిజ తుంగ గతే శుక్రే రవిణా సంగతే బుధే,**
**ప్రాసూత తనయం సాధ్వీ గిరిజేవ షడాననమ్॥** **16**

పై శ్లోకాలను బట్టి యుధిష్ఠిర శకము 2631 సంవత్సరం నందన సంవత్సర వైశాఖ శుక్ల పంచమి ఆదివారము నాడు చంద్రుడు పునర్వపు

నక్షత్ర మందుండగా కర్కాటక మందు అభిజిల్లగ్నములో శ్రీఆదిశంకరులు అవతరించి నటులు తెలుపుచున్నది.

**2వ ఆధారము :** వ్యాసాచల విరచిత శంకరవిజయకావ్యములో 4వ అధ్యాయము

**"అబ్దే కలే రనల వర్ష శరాక్షి సంఖ్యే ,**
**శ్రీ నందనే దినమణా వుదగద్వభాజి**
**రాకేధి పంచమితాథావసితేతరాయాం,**
**వారే రవేర దితిభేశుభయోగయుక్తే ॥ 20**
**లగ్నే శుభే శుభయుతే సుషువే కుమారం,**
**శ్రీ పార్వతీవ సుఖినీ శుభవీక్షితే**
**జాయా సతీ శివగురో ర్నిజతుంగ సంస్థే,**
**సూర్యే కుజే రవి సుతే చ గురౌ చ కేంద్రే" 21**

కల్యబ్దము, అనల = 3 (త్రేతాగ్నులు), వర్ష = 9 (నవవర్షములు), శర = 5 (పంచబాణములు), అక్షి = 2 (కండ్లు). దీనిని బట్టి 3952 వచ్చింది.

సంప్రదాయానుసారము దీనిని తిరగ వేయాలి. 2593 వస్తుంది. అది నందన నామ సంవత్సర వైశాఖ శుక్ల పంచమి ఆదివారము. కల్యబ్దము 5070 వత్సరాలు. ఇందులో నుండి 2593 తీసివేస్తే 2477 వస్తుంది. ఈ సంఖ్య నుండి క్రీ.శ.1968 తీసివేస్తే వచ్చేది 509. అంటే క్రీ.పూ.509 అన్న మాట!

**3వ ఆధారము :** ఆనందగిరి ప్రణీత "ప్రాచీన శంకర విజయము" 3వ సర్గ 80

**"తిష్యే ప్రయాత్యనల శేవధి బాణ నేత్రే,**
**యో నందనే దినమణా వుదగధ్వ భాజి**
**రాధేదితే రుడిని నిర్గత మంగ లగ్నే,**
**ప్యాహూతవాన్ శివగురుస్స చ శంకరేతి॥"**

తిష్యే = కలియుగమందు, అనల = 3, శేవధి = 9 (నవనిధులు), బాణ = 5, నేత్రే = 2. దీన్ని బట్టి 3952 వస్తుంది. 2వ ఆధారంతో ఏకీభవిస్తుంది.

**4వ ఆధారము :** కేరళీయ శంకర విజయములో 2వ అధ్యాయము:

**"ప్రవృద్ధే తత్ర చాసూత నందనం నందనే శుభే,**
**వైశేఖే మాసి పంచమ్యాం శుక్ల పక్షే పునర్వసౌ 53**

**ప్రాదుర్భావే కుమారస్య లగ్న మాసీత్ సుశోభనమ్,**
**బలయుక్త శుభజ్యోతి స్సమారూఢ సమీక్షితమ్ 54**

**యేన సర్వజ్ఞతా మేతి జాతవాన్ భువి మానుషః,**
**సచ యో గోప్య భూత్తస్య ద్విజ పుత్రస్య సంభవే॥" 55**

ఇది కూడ పై మూడు అభిప్రాయాలనే సమర్థిస్తున్నది.

**5వ ఆధారము :** 'జినవిజయము' అనే గ్రంథము శంకరులకు వ్యతిరేకభావము కలది. ఈ గ్రంథము ప్రకారము కూడ ఆదిశంకరుల జనన సంవత్సరం క్రీ.పూ. 509 అనే సూచిస్తున్నది. కుమారిలభట్టు శంకరాచార్యుల కన్న 48 సంవత్సరములు పెద్దవారని చిత్సుఖాచార్యులు తమ బృహచ్ఛంకర విజయ కావ్యమున అన్నారు. కుమారిలభట్టు జననం క్రీ.పూ. 557 అని తెలియబడినది. క్రీ.పూ. 494 ప్రాంతమున ఆదిశంకరులు కుమారిలభట్టును కలసి యుండిరి. జినవిజయము ననుసరించి ఆది శంకరులు కైవల్యమందినది యుధిష్ఠిరశకము 2657 అనగా క్రీ.పూ. 477 అగును. అది రక్తాక్షి సంవత్సరము. పుణ్యశ్లోకమంజరి కూడ దీనినే సమర్థించుచున్నది.

**6వ ఆధారము :** పండితకోట వెంకటాచలం 'క్రోనాలజీ ఆఫ్ నేపాల్ హిస్టరీ' నేపాలు దేశమును వృషదేవవర్మ కల్యబ్దము 2615–2554 లో పరిపాలించిరి. ఆ కాలమున ఆదిశంకరులు నేపాలి దేశమును దర్శించినటులున్నది.

**7వ ఆధారము :** రాజా సుధన్వుని తామ్రశాసనము:

సుధన్వమహారాజు స్వయముగ ఆదిశంకరుల నుద్బోధించుచు తామ్రశాసన మొకటి చేసియున్నటుల ద్వారకాపీఠాధిపతులు 'విమర్శ' అను గ్రంథమున ముద్రించి యున్నారు. అది యుధిష్ఠిరశకము 2663 అనగా క్రీ.పూ.478-477 నకు చెందియున్నది. గోవర్ధన పీఠము వారు ద్వారకా పీఠము వారినే సమర్థిస్తున్నారు.

**8వ ఆధారము :** పంచాంగములు :

ఆంధ్రదేశములో చిరకాలమునుండి వంశ పరంపరగా పంచాంగములు చేయువారు అనేకులున్నారు. అందు సృష్ట్యాది గత సౌరాబ్దములు, మహనీయుల గతాబ్దములు వివరించుచునే యున్నారు. అందు శ్రీ శంకరభగవత్పాదాబ్దములు తెలుపుచున్నారు. 1968-69 పంచాంగములో 2041 అని ఉన్నది. ఈ దైవజ్ఞుల నిర్ణయము. క్రీ.శకములో జన్మించారన్న వాదాన్ని పూర్తిగా త్రోసిపుచ్చుతోంది. ఏది యెటులున్నను క్రీస్తు పూర్వపు వారే నని వారి నిర్ణయము.

**9వ ఆధారము :** పి.ఎస్.ఓక్ వ్రాసిన "సమ్ బ్లండర్స్ ఆఫ్ ఇండియన్ హిస్టారికల్ రిసర్చ్"

పి.ఎస్.ఓక్ 'రీ రైటింగ్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ' అన్న సంస్థకు అధ్యక్షుడు. 8-5-1967 తేదీ కల 'జాగృతి' అనే తెలుగు పత్రికలో ఉన్న ప్రకారం శ్రీ ఆదిశంకరులు క్రీ.పూ.509 సంవత్సరము నందే జన్మించి నటుల విమర్శనాత్మక నిర్ణయము చేసి యున్నారు. క్రీ.శ.788-840 లో కామకోటి పీఠానికి 38వ అధిపతిగా ఉన్న అభినవశంకరులు ఆదిశంకరులని భ్రమించరాదని వారి నిర్ణయము.

**10వ ఆధారము :** శివరహస్యం 9 వ అంశ, 16 వ అధ్యాయము

**"మదంశజాతం దేవి! కలావపి తపోధనం,**
**కేరళేషు తదా విప్రం జనయామి మహేశ్వరి॥**

**తస్యైవ చరితం తేద్య వక్ష్యామి శృణు శైలజే,**
**కల్యాదిమే మహాదేవి! సహస్రద్వితయాత్పరం॥**
**కేరళే శశల గ్రామే విప్ర పత్న్యాం మదంశతః,**
**భవిష్యతి మహాదేవి శంకరాఖ్యో ద్విజోత్తమః॥"**


దీని అర్థం కలియుగమందు రెండు వేలేండ్లు గడచిన పిమ్మట కేరళదేశమంది శశల అనే గ్రామమందు బ్రాహ్మణ దంపతులకు శంకరుడనే పేరున నా అంశతో అవతరించ బోతున్నాను అని శివుడు పార్వతికి తెలిపియుండెను.

**11వ ఆధారము :** భవిష్యోత్తర పురాణము, 36 వ అధ్యాయము

**"కల్యాదౌ ద్విసహస్రాంతే లోకానుగ్రహ కామ్యయా,**
**చతుర్భిస్సహ శిష్యైస్తు శంకరోవతరిష్యతి॥"**

లోకానుగ్రహ కాంక్షతో కలియుగము రెండువేల సంవత్సరములు గడచిన పిమ్మట నలుగురు శిష్యులతో శంకరుడు అవతరించును. ఇది 10వ ఆధారం కంటె ప్రబలంగా ఉంది.

పై ఆధారములు ఆదిశంకరులు క్రీ.పూ. 509 లో అవతరించినారని నిర్ధారించుచున్నవి. దీనిని బట్టి శ్రీశంకరుల జాతకచక్రము:




కల్యబ్దము 2593 (509 బి.సి.) నందన సంవత్సర వైశాఖ శుద్ధ పంచమీ ఆదివారము పునర్వసూ నక్షత్ర కర్కాటక లగ్నమందు అభిజిత్ ఘడియలలో శ్రీ ఆది శంకరుల అవతారము

## అనుబంధము 2

### శ్రీ శృంగేరి శారదాపీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వాముల వారి చరిత్ర

శృంగేరిలోని శ్రీ శారదాపీఠమును జగద్గురు శ్రీశంకరభగవత్పాదులు మొదటగా నెలకొల్పి శ్రీ సురేశ్వరాచార్యులను ప్రప్రథమ పీఠాధిపతిగా నియమించినప్పటి నుండి ఆ పీఠాధిపత్యం పలువురు మహాస్వాముల నేతృత్వంలో అవిచ్ఛిన్నంగా సాగినది. ఆ మహాగురు పరంపరలో 36 వ పీఠాధిపతి నేటి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వాముల వారు. వీరి పవిత్ర చరిత్ర అసామాన్య వైచిత్రితో మాన్యమై ధన్యతమాతితమమై ఆరాధనాపాత్రమై అలరారునట్టిది.

గుంటూరు జిల్లా పలనాడు ప్రాంతమైన అలుగు మల్లెపాడు గ్రామము వేద విద్వాంసుల నిలయము. ఆ గ్రామములోని తంగిరాల వంశము వారు కృష్ణయజు శ్శాఖీయులు, ఆపస్తంబసూత్రులు, కుత్సస గోత్రులు. ఆ వంశమునకు చెందిన శ్రీమతి అనంతలక్ష్మమ్మ, శ్రీ వెంకటేశ్వరావధాని పుణ్యదంపతుల తపఃఫలమై క్రీ.శ. 1951 ఏప్రిల్ 11 వ తేదీన ఉదయించిన బాలుడే నేటి మన శ్రీ మహాస్వామి. నలుగురు కుమార్తెల తరువాత పుత్రాపేక్షతో దృఢభక్తి సంకల్పములతో ఆ గ్రామములోను తరువాత చేరుకొన్న మచిలీపట్టణము లోను వీరొనరించిన శివారాధనలతో దైవానుగ్రహ ప్రాప్తి కలిగి కలిగిన ఈ సుపుత్రునకు సీతారామాంజనేయులు అని పేరు పెట్టుకొన్నారు.

పువ్వు పుట్టగానే పరిమళించునట్లు శైశవము నుండియే ఈ బాలునకు ఆధ్యాత్మిక దృష్టి సుస్పష్టమై ఆ శిశువు నోట వెలువడిన మాటలలో అత్త, తాత అన్నమాటలు కాక దేవుని పేర్లు వెలువడేవి! తప్పటడుగులు వేయుచు ఇంటి లోని పూజామందిరము లోనికే మాటి మాటికీ వెళ్ళుచుండే వాడు.

పిల్లవానికి ఏడాది వయస్సు రాక ముందే అవధాని గారి కుటుంబము మచిలీపట్టణము విడిచి నరసరావు పేటకు మారారు.

ఐదవ ఏట సీతారామాంజనేయులుకు సంస్కృతవిద్యాభ్యాసము శ్రీ ప్రతాపగిరి శివరామశాస్త్రి గారి వద్ద మొదలయింది. గర్భాష్టమమున ఉపనయనమైనది.

తండ్రి వేదాధ్యయన గురువు. పురపాలకోన్నత పాఠశాలలో చేరినా పిల్లవానికి వేదాధ్యయనంలోను, సంస్కృతభాష నేర్వడంలోనే శ్రద్ధ, మక్కువ ఎక్కువ. పాఠశాల లోని పాఠ్యాంశాలు ఒకసారి విన్నంతనే కరతలామలకమై అన్ని తరగతుల లోను సర్వ ప్రథముడుగా ఉత్తీర్ణుడగుచూ వచ్చేవాడు. విజయవాడ ఆకాశవాణి కేంద్రము నకు సంస్కృతకార్యక్రమాలకు ఇతనిని తఱచు పిలచే వారు. పాఠశాలలోని విద్య ఒక వంక, ఇంటి వద్ద వేదాధ్యయనము వేరొక వంక – ఇవి కాక సంహితా బ్రాహ్మణ ఆరణ్యకములు కూడ అభ్యసించి, గుంటూరు జిల్లా వేదప్రవర్ధక విద్వత్పరిషత్తు నిర్వహించిన వేద పరీక్షలో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణు డయ్యెను.

సీతారామాంజనేయులుకు గల మేధా శక్తి అత్యాశ్చర్యకరమైనది. ఏకసంథాగ్రాహి. తండ్రి ఉపనయనములు చేయించు చుండగా ఒకటి రెండు సార్లు చూచి యుండెనట. ఒక సారి అవధాని గారు ఊరికి వెళ్ళి ఒక ఇంట ఉపనయనము చేయించుటకు సమయానికి రాలేక పోయారట. అప్పుడు సీతారామాంజనేయులు బ్రహ్మపీఠము ఎక్కి ఉపనయన కార్యక్రమాన్ని సక్రమంగా జరిపించి అందరిని ఆశ్చర్యచకితుల్ని చేశాడు!

1961 సంవత్సరంలో జగద్గురు శ్రీ మదభినవ విద్యాతీర్థ మహాస్వామి వారు విజయవాడకు వేంచేసినపుడు 10 ఏండ్ల సీతారామాంజనేయులు వారితో నిరర్గళంగా మాట్లాడి వారి అనుగ్రహానికి పాత్రు డయ్యాడు. బాలునికి పట్టు వస్త్రమును బహూకరించి ఆశీర్వదించారు. తరువాత శ్రీవారు నరసరావు

పేటకు విజయం చేసినపుడు సీతారామాంజనేయులు వారిని దర్శించి వారి అనుగ్రహ దృష్టిలో పడినాడు. 1966 సంవత్సరంలో కూడ శ్రీవారు మరల నరసరావు పేట వచ్చినపుడు కూడ బాలుడు సీతారామాంజనేయులు మహాస్వామిని దర్శించడం వారిద్దరు సంస్కృతంలో సంభాషించుకొనడము జరిగినది.

శ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి ఆ సంవత్సరము ఉజ్జయినిలో చాతుర్మాస్యవ్రతము జరుపుతున్నారు. ఒక నాడు శ్రీచరణులు సిప్రానదిలో స్నానము చేసి వస్తున్నారు. ఒక బాల బ్రహ్మచారి వారికి సాష్టాంగ ప్రణామము చేసి తనను శిష్యునిగా గ్రహించి శాస్త్ర విజ్ఞానము ననుగ్రహింప మని ప్రార్థించాడు. ఆ బ్రహ్మచారి పదునైదేండ్ల వయస్సు గల మన సీతారామాంజనేయులు! శ్రీచరణులు బాలుని ప్రార్థనను అంగీకరించినారు. నాటి నుండి సీతారామాంజనేయులు శ్రీవారి పాద కమలములు వీడ లేదు. శ్రీవారి సేవలో ఏడెనిమిది సంవత్సరాలలో కృష్ణయజుర్వేదము నందు, న్యాయ వ్యాకరణ పూర్వోత్తర మీమాంసాది శాస్త్రములలో అఖండ పాండితిని సంపాదించెను.

సీతారామాంజనేయుల అసామాన్య వైదుష్యము ఆధ్యాత్మికతా శక్తి శ్రీచరణులకు ఆతనిపై అపారమైన వాత్సల్యం కలిగించినది. తమ తరువాత శ్రీ శృంగేరి శారదా పీఠానికి ఉత్తరాధికారిగా నియమించ వలె నన్న సంకల్పము వారికి కలిగి ఏకాంత ఘడియలలో ధ్యాన నిమగ్నులై శ్రీ శారదాదేవి అనుమతిని పొందారు. ఆనంద నామ సంవత్సర ఆశ్వయుజ కృష్ణ ద్వాదశి నాడు (11-11-1974 తేదీన) సీతారామాంజనేయులుకు సన్న్యాసాశ్రమము నిచ్చి, శ్రీ భారతీతీర్థ అనే ఆశ్రమ నామాన్ని అనుగ్రహించారు. వేలాది భక్తుల సమక్షమున శ్రీ మహాస్వామి శ్రీ భారతీ తీర్థ స్వామిని తమ ఉత్తరాధికారిగా నియమితులను చేసి ఆ నిర్ణయాన్ని ప్రజానీకానికి తెలియజేశారు. సన్న్యాసాశ్రమస్వీకారం చేసిన తరువాత

గురువుగారితో కలిసి భారతదేశము నంతటను విజయ యాత్ర సలిపారు. తరువాత మరొక సారి గురువుల ఆజ్ఞ మేరకు శ్రీ భారతీ తీర్థస్వాములు ఒక్కరు యావద్భారతదేశము తిరిగి విజయ యాత్ర సలిపారు.

1989 సెప్టెంబరు 21 తేదీన శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వాముల వారు బ్రహ్మీభూతు లయ్యారు.

శుక్లనామ సంవత్సర ఆశ్వయుజ కృష్ణ పంచమి గురువారము నాడు (19-10-1989 తేదీన) శ్రీ భారతీతీర్థ స్వాములవారు శ్రీ శృంగేరి శారదాపీఠాధిపతిగా పట్టాభిషిక్తు లయ్యారు. పీఠాధిరోహణము చేసిన పిమ్మట శ్రీచరణులు భక్తకోటి మన్ననలను అనుగ్రహించి ఆంధ్ర, మహారాష్ట్ర, తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రములే కాక, ఢిల్లీలో కూడ పర్యటించి విజయయాత్ర చేశారు. శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాములవారు వివిధశాస్త్రనిష్ణాతులే కాదు అసాధారణ సంభాషణా కౌశలములో వారికి వారే సాటి. తెలుగు, కన్నడము, తమిళము, హిందీ, సంస్కృత భాషలలో శ్రీవారు అనర్గళంగా ఇచ్చే అనుగ్రహ భాషణాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వాములవారు అపూర్వ మహిమాన్వితులు. ఎందరో భక్తులు శ్రీవారిని సేవించి కష్టముల బారి నుండి వెలువడిన వారు. ఒక ఉదాహరణ. 1991 సంవత్సరంలో 70 ఏళ్ళ భక్తుడు హృద్రోగమునకు శస్త్రచికిత్స వెంటనే చేయవలసిన దని వైద్యులు చెప్పారు. శ్రీస్వామికి తెలిసి శస్త్రచికిత్స వద్దని తమ అమోఘాశీస్సుల మంత్రాక్షతలు పంపారు. ఆ భక్తుడు కోలుకొని సంపూర్ణారోగ్యముతో నేటికీ స్వామివారి సేవలో మెలగుతున్నాడు.

శ్రీశ్రీశ్రీ మహాస్వాముల వారు ఆస్తిక లోకమునకు పెన్నిధి. శ్రీచరణుల సన్నిధిలో లభ్య మయ్యే ఆనందానుభూతి అనితరసాధ్యము, అనుభవైకవేద్యము. అపరశంకరు లైన శ్రీవారు మహాపవిత్రక్షేత్రమైన శృంగేరిలో నిరంతర తపోభిరక్తులై భక్తబాంధవులై అనుపమ యతిపుంగవులై విరాజిల్లుచున్నారు.

## అనుబంధము 3

**శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ దేవకీనందనాశ్రమ స్వామి**
**స్థాపక: వేదోద్ధరణనిధిః, సరస్వతీనిలయమ్, బిళ్ళకుఱ్ఱు,**
**ప్రాచ్య గోదావరీ మణ్డలమ్**

1108 శ్రీవిరాజితస్య జగద్గురోః శ్రీశంకరభగవత్పాదస్య అద్వైతామృత సందేశః సచేతనస్య, సవివేకస్య, సర్వస్య మానవ ప్రపంచస్య శాశ్వత సద్విజ్ఞాన భిక్షాం

ప్రాహిణోత్. శంకరః లోకశంకర ఏవేత్యత్ర నాస్తి విచికిత్సాహేతుః ఏతాదృశావతార పురుషస్య దివ్యచరితమ్ మానవై స్సర్వై రవశ్యం మనన నిదిధ్యాసాదిభి

రుపాసిత్యం నను. మమతాహంకార శూన్యస్య ఆదిశంకరస్య చరితస్మరణం నకేవల మఘౌఘ విధ్వంసకం కింతు అక్షయ పుణ్యప్రదం విశేషజ్ఞానసంవర్ధకం చేతి కిం బ్రవీమి. శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్యస్య శంకరదేశికస్య దివ్యకథా భవతా సముల్లేఖినీ యేత్మహం వచ్మి. తదనురుధ్యైవ మదంతేవాసీ

శ్రీ ఎఱ్ఱాప్రగడ పాథోధి పూర్ణచంద్రః వేంకటసూర్యనారాయణమూర్తిః

"శ్రీ శంకరావతార చరితము" ఇతి నామ్నా విలసితం బృహద్గ్రంథ మాంధ్రభాషాయామ్ విరచయ్య ధన్యో భవత్॥

ఆంధ్రరచనకావ్య మిదం శ్రీశంకరావతారచరితం మృధుమధురయా శైల్యా పండిత పామర గ్రాహ్యయా భాషయా అఖండయా పద వచన రచనయా, వాచకానాం మనాంసి ఆనందామృత సింధా వుత్పావయతీతి. భారతీయానాం సర్వేషాం గేహేషు సర్వదా ఆరాధనీయోయం గ్రంథః. భారతే సర్వత్ర సుప్రసరయా భాతు. కావ్యరచయితుః, రచనాయాశ్చనః నారాయణ స్మరణపూర్వికాః శుభాశిషః భవంతు॥

**స్వస్తి, శ్రీ స్వామి**

పై దానికి ఆంధ్రానువాదము:

1108 శ్రీవిరాజితులైన జగద్గురు శ్రీశంకరభగవత్పాదుల వారి అద్వైతామృత సందేశము వివేకపూర్ణమై, సచేతనమై సర్వమానవ కోటికి శాశ్వత విజ్ఞాన భిక్ష ప్రసాదించు నది. శంకరులే లోకశంకరు లనుట నిర్వివాదము. ఆ అవతార పురుషుని దివ్య చరితమును మానవు లందరు మనన నిది ధ్యాసాదులతో ఉపాసించ దగి యున్నది. అహంకార మమకార రహితులైన ఆదిశంకరుల దివ్య చరితము స్మరణమాత్రాన కేవల పాప నాశకమే గాక అక్షయపుణ్యప్రదము, అనంత జ్ఞానదాయిని అని వేరే చెప్పవలెనా! శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శంకరదేశికేంద్రుల దివ్యచరితమును వెలువరించ మన్న నా ఆశయమును శిరసావహించి శ్రీ ఎఱ్ఱాప్రెగడ వంశాంబుధి పూర్ణచంద్రుడు వేంకట సూర్య నారాయణ మూర్తి "శ్రీ శంకరావతార చరితము" అనుపేర బృహద్గ్రంథమును ఆంధ్రమున రచించి ధన్యుడయ్యెను.

ఈ ఆంధ్రవచన కావ్యము "శ్రీ శంకరావతార చరితము" మృదు మధుర శైలిలో పండిత పామర రంజకమైన భాషలో కుంటు వడని వచన రచనా ధారలో నుండుట వలన చదువరులను ఆనందామృతధారలో నోలలాడించుచున్నది. ప్రతి భారతీయుని ఇంటను ఎల్లప్పుడు ముఖ్యముగ ఆరాధింప దగిన గ్రంథరాజము. భారతావని యందంతట శీఘ్రముగ ప్రకాశించు గాక! కావ్య రచయితకు, రచనకు మా నారాయణ స్మరణ పూర్వక శుభాశీస్సులు!

**స్వస్తి, శ్రీ స్వామి**

## అనుబంధము 4

## శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజక శేఖర దేవకీనందనాశ్రమ స్వామి చరిత్ర

మహారాష్ట్రము లోని కొల్హాపురం మహాలక్ష్మీశక్తిపీఠమున్న పుణ్యక్షేత్రం. పంచద్రావిడుల లోని దేశస్థశాఖ వారు కాళే వంశీయులు. ఆ వంశము లోని పరమశ్రోత్రియ దంపతులు సదాశివ కాళే, పార్వతీబాయి. వేదవేదాంగ పారంగతుడయిన సదాశివ కాళే దత్తాత్రేయభక్తుడు. ఆ దంపతుల పెద్ద కుమారుడు రామచంద్ర కాళే. 23-7-1888 తేదీన రెండవ కుమారుడుగా కారణజన్ముడైన ఆత్మారామ కాళే పసితనము నుండి అంతర్ముఖుడై స్తబ్ధుడుగా ఉండడం చూచి తల్లిదండ్రులు గ్రహశాంతులు, వైద్యక్రియలు చేయించినా నిష్ఫలమవ్వడంతో సదాశివ దత్తదేవుని ప్రార్థించాడు. దత్తదేవుడు కలలో కనిపించి ఇచ్చిన ఆదేశానుసారం పిల్లవానిని దత్తమందిరంలో దైవపాదసన్నిధి నుంచి ఆ దంపతులు ధ్యానమగ్నులయ్యారు. దానితో ఆత్మారాముడు స్తబ్ధత వీడి చిరునవ్వులు చిందిస్తూ తల్లిదండ్రుల నానందపరచాడు. ఐదవ యేట అక్షరాభ్యాసం, గర్భాష్టమిన వడుగు చేసారు. గురుకులంలో జేరిన ఆత్మారాముడు విద్యావైభవంలో బాటు ఆటపాటలలో చురుకుగా ఉండి అందరినీ అలరించేవాడు. ఆత్మారాముడు 13 ఏండ్ల వయస్సులో ఉండగా అన్న రామచంద్రునికి పెళ్ళిచేసారు. చిన్న కుమారునికి కూడ వివాహము చేద్దామని తల్లిదండ్రుల ఆశ. అది తీరక మునుపే కొద్ది రోజులలో ఆ దంపతులు తనువులు చాలించారు. ఆత్మారాముడు కూడ దత్తభక్తుడు. కలలలో అతనికి తరచు దత్తదర్శన మయ్యేది. ఆ కలలలో దేవునితోబాటు దండకమండలుధారు లైన సన్న్యాసులు కనబడేవారు. అది దత్తదేవుని ఇచ్ఛాసంకేతంగా తీసికొని అన్నకు చెప్పి ఇల్లు విడచి సన్న్యాసాశ్రమస్వీకార నిశ్చయంతో బయలుదేరాడు.

నృసింహవాడి లోని దత్తాత్రేయాలయంలో త్రిరాత్రోపవాసదీక్ష చేశాడు. ఆ ఆలయంలో పరమహంస పరివ్రాజకాచార్య మాధవాశ్రమస్వామి అనుగ్రహంతో 15-6-1902 తేదీన 15 ఏండ్ల ఆత్మారాముడు దేవకీనందనాశ్రమ స్వామి అనే తురీయాశ్రమనామం వహించడం జరిగింది. శిష్యుని అపూర్వ తేజోవైభవాలను నైష్ఠికతను చూచి ఆనందించిన మాధవాశ్రమస్వామి దీవించి "నీవు దత్తాంశాసంభూతుడవు. లోకసంచారం చేసి ధర్మాన్ని ఉద్ధరించు" అని ప్రబోధించారు.

గుర్వాజ్ఞ శిరసా వహించిన దేవకీనందనాశ్రమస్వామి ఆసేతుహిమాచలలం

పర్యటించి పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ భవ్యక్షేత్రాలు సేవిస్తూ అబూ పర్వతప్రాంతమైన గహనారణ్యంలో కేవలజలపానంలో తపస్సు చేశారు. కొన్ని నాళ్ళ తర్వాత నర్మదాతీరంలోని భరూచి పట్టణం చేరుకొన్నారు. అక్కడ 462-1906 నాడు విశ్వేశ్వరసన్నిధిలో విధ్యుక్తంగా దండం విసర్జించారు.

1911 సంవత్సరంలో (విరోధికృత్ నామ సంవత్సవం) సప్తగోదావరీ మధ్యప్రాంతము కౌశికీతీరమయిన బిళ్ళకుఱ్ఱు గ్రామంలో (కొత్తపేట మండలం) స్వామి దేవకీనందనాశ్రమ స్వామి ప్రవేశించారు. అప్పటి ఆ గ్రామవాసులు స్వామిని చాతుర్మాస్యం నిర్వహించమని కోరారు. ఆ నాటి నుండి స్వామికి బిళ్ళకుఱ్ఱు ఆశ్రమపీఠమై వెలసింది.

స్వామి బిళ్ళకుఱ్ఱులో 'సరస్వతీ నిలయము' అను పేరిట ఒక గ్రంథాలయం నెలకొల్పి అందు వేదవేదాంగ, వేదాంత, శాస్త్ర, కావ్యగ్రంథాలను 10000 సంపుటాలను సేకరించారు. వెండి నెమలి వాహనంపై సరస్వతీవిగ్రహ ప్రతిష్ఠ చేసి దేవీనవరాత్రపూజలు వైభవంగా జరిపించేవారు. 1934 సంవత్సరంలో బిళ్ళకుఱ్ఱులో వేదోద్ధరణ సంస్థను స్థాపించారు.

బిళ్ళకుఱ్ఱులోను, సాకుఱు గరువులోను, ఇందుపల్లి లోను వేదపాఠశాలలు స్థాపించి ఎందరో వేదపండితు లగుటకు కారణభూతు లయ్యారు.

సన్న్యాసస్వీకారము నాటి నుండి షష్ట్యబ్దిపూర్తి వరకు స్వామివారు 47 చాతుర్మాస్యదీక్షలు నిర్వహించారు. బిళ్ళకుఱ్ఱులోను, రాజమహేంద్రవరం లోను, కుంచవరాగ్రహారంలోను, వల్లభాపురంలోను, మండపేటలోను, అనంతశయనంలోను లక్షబిల్వార్చనలు జరిపించారు.

దేవకీనందనాశ్రమస్వామి వారికి విశాఖపట్టణం, ఉభయగోదావరులు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలోనే కాకుండా తమిళనాడు లోని అనంతశయనం, చెన్నై, మధురై, కుంభకోణం, తూత్తుకొడి మొదలైన ప్రాంతాల వారు, హరిద్వార్, కలకత్తా, ముంబైలలో అనేకులు శిష్యు లయ్యారు. వారిలో కొందరికి స్వామి సన్న్యాసాశ్రమం ఇప్పించారు.

స్వామివారు బహుమహిమాన్వితులు. వారు చూపిన మహిమలు అత్యద్భుతంగా ఉండేవి. మధుర మీనాక్షి దేవాలయం లోనికి వెళ్ళిన ఒక భక్తునికి స్వామి అమ్మవారితో ఆడుచున్నట్లు కనిపించారు. గుడి బయటకు రాగా ఇంతకీ స్వామి బయటనే ఉండి మందస్మితులై ఉన్నారు. రాజమహేంద్రవరం మార్కండేయాలయంలోనికి వెళ్ళిన కొందరు భక్తులకు స్వామి కుడిపాదం లింగంపై నుంచి త్రిశూలధారిగా దర్శన మిచ్చారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. స్వామివారి ఉపదేశాలు, సందేశాలు, మహిమలు, చరిత్రలు పలు గ్రంథరూపాలలో వెలువడ్డాయి. అందు కొన్ని ఇవి:

1. యతీంద్ర తత్త్వ మంజరి (కోటమర్తి యజ్ఞన్న శాస్త్రి విరచితం, 1915)

2. శ్రీదేవకీనందనాశ్రమ విజయం (కేశవశాస్త్రి, అనంతశయనం, 1927)

3. సద్గురుస్తవం (పొన్నాడ కృష్ణమూర్తి, రాజోలు, 1928)

5. స్వామి చరిత్రము (బిదురు వెంకటాచలతీర్థులు, సుద్దపల్లె, 1939)

6. శ్రీదేవకీనందనాశ్రమస్వామి చరిత్రము (నిట్టల సీతారామశర్మ, రాజమండ్రి, 1949)

శ్రీదేవకీనందనాశ్రమస్వామి 23-4-1973 ప్రమాదీచ వైశాఖ బహుళ ఏకాదశి సోమవారము నాడు దేహం చాలించి పరమపదసిద్ధి పొందారు.

పైన ఇచ్చిన సమాచారానికి ఆధారం ప్రొఫెసర్ బి.రామరాజు గారి "ఆంధ్రయోగులు" , షష్ఠభాగము, పే. 132, నవోదయ బుక్ హౌస్, 3-3-865, కాచిగూడ, హైదరాబాదు-27, ఫోను: 04024652387

## అనుబంధము 5

బందరు సామవేద విద్యాలయ, శంకర మఠ గాయత్రీ పీఠ వ్యవస్థాపకులు, శ్రీ గాయత్రీ పీఠాధిపతులు, శ్రీ శంకర చిద్విలాసాది గ్రంథకర్తలు **శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతీ స్వామి** వారి ఆశీ:పూర్వక ప్రశంస

ప్రపంచకమున కంతకును శాంతిసౌఖ్యముల నొసంగ గల ఉపనిషత్ సిద్ధాంతమైన అద్వైత సిద్ధాంతమును ఈ కలి యుగములో ఉద్ధరించుటకై పరమేశ్వరుడు వేదములో 'వ్యుప్త కేశాయచ' అని ఉన్న ప్రకారము సన్న్యాసి రూప అవతారమును ఎత్త నిశ్చయించుకొని కేరళ దేశములో కాలడి అను అగ్రహారములో పరమ పవిత్రమైన బ్రాహ్మణ వంశములో పండితోత్తములును మహర్షికల్పులు నగు శివగురువునకును ఆయన సతీమణి యగు ఆర్యాంబా సాధ్వికిని 509 బి.సి. లో శంకరులుగా అవతరించి, 8 సం.ల వయస్సునకు అన్ని వేదములను, శాస్త్రములను అభ్యసించి, సర్వజ్ఞులయి సన్న్యసించి గోవిందభగవత్పాదాచార్యుల వారి యొద్ద ఉపదేశమును పొంది ఊన షోడశ వయ:కాలములో ప్రస్థాన త్రయ భాష్యములను, ప్రకరణ గ్రంథములను, స్తోత్రములను 150 కి పైగా రచించి వ్యాసానుగ్రహముచే ఇంకొక 16 సంవత్సరముల వయస్సును పొంది, ఆసేతు శీతాద్రి పాదచారియై తిరిగి, అప్పటికి దేశములో నున్న 72 కుమతములను ఖండించి అద్వైత మతమునకు ఆధ్యాత్మిక సామ్రాజ్య పట్టాభిషేకమును గావించి, షణ్మఠములను గూడ స్థాపించి 'సర్వజ్ఞ', 'జగద్గురు' సార్థక నామములతో విరాజిల్లి, 32వ సంవత్సరమున భౌతిక దేహమునువీడి నిజ ధామమైన కైలాసమునకు ఏగిన ఆది శంకర భగవత్పాదుల పరమపవిత్ర చరిత్ర కంటె మానవులను తరింపజేయునది ఇంకొకటి లేదనిన అతిశయోక్తి కానేరదు.

శ్రీరామచరిత్రను ఎంతమంది వ్రాసినను, అంత కంటె పరమ పవిత్రమైన చరిత్ర ఇంకొకటి లేనందున ఇప్పటికి కవీశ్వరు లందరు ఆ

చరిత్రనేవ్రాయు చున్నట్లు కలియుగములో శంకరుల చరిత్రను ఎంతమంది వ్రాసినను, అంత కంటె పరమపవిత్రమైన చరిత్ర ఇంకొకటి లేనందున, తూ।గో।జిల్లా కొత్తపేట తాలూకా అవిడి గ్రామములో సుప్రసిద్ధమై పవిత్రమైన ఎఱ్ఱాప్రెగడ వారి వంశములో జన్మించి ఆస్తికోత్తములై శిష్టాచారసంపత్తి కలిగి విజ్ఞానులైన శ్రీ వేంకట సూర్య నారాయణమూర్తి గారు శ్రీ ఆదిశంకరుల పవిత్రచరిత్రను అనేక వయనములతో, ఎంతో విపులముగ సులభమైన భాషలో అందరికి తెలియులాగున ఆకర్షణీయమైన నవలా శైలిలో చక్కని వర్ణనలతో పెద్ద గ్రంథమును రచించినారు. ఆ గ్రంథమును చదువుట ప్రారంభించిన యెడల చివరి వరకు అదే తీసుకొని వెళ్ళును. మధ్యను ఆపుదామన్నను ఆగనీయదు. రామాయణములో షట్కాండలు రాముని చరిత్రకు సంబంధించినవై యున్నటుల ఈ చరిత్ర లోని షట్కాండలు శ్రీశంకరుని చరిత్రకు సంబంధించినవై విరాజిల్లుచున్నవి. ఈ గ్రంథము ప్రతి ఆస్తికుని గృహములోను ఉండదగిన దని నా అభిప్రాయము.ఇట్టి అమూల్యమైన ఆదిశంకరుల పరమ పవిత్ర చరిత్ర రచించిన శ్రీ వేంకట సూర్యనారాయణమూర్తి గారి జీవితము ధన్యము. వారికి సకల శ్రేయస్సులు కలుగు గాక అని మా నారాయణ స్మరణపూర్వక ఆశీస్సులు!

**శంకరమఠము, అమలాపురము**
**కీలక మాఘ కృష్ణ సప్తమి**
**ఆదివారము, 9-2-1969**
**స్వామి విద్యాశంకర భారతి**

## అనుబంధము 6

### శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ సత్యానందేంద్ర సరస్వతీస్వామి

### శ్రీ గండభేరుండ అష్టముఖీ నారసింహ పీఠాధిపతి వారి ఆశీః ప్రశంస

అజ్ఞానాంధమున కొట్టుమిట్టాడు భారతమున జ్ఞాన జ్యోతి వెలిగించిన దివ్య పురుషుడు జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యుడు. అల్ప జీవిత వ్యవధిలో అనల్ప ప్రతిభతో అనన్య సాధ్యమైన ధార్మికైక్యమును భరతవర్షమున స్థాపించి నాడు. ఈ యవతార పురుషుని జీవితమును "శ్రీ శంకరావతార చరితము" అను పేర శ్రీ ఎఱ్ఱాప్రెగడ వేంకట సూర్యనారాయణమూర్తి తెలుగులో అందించుట ఆంధ్రుల అదృష్టమని భావించవలెను.

ఈ రచయితలో ఆధ్యాత్మిక విచారము హెచ్చుగా నున్నది. శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీమద్దేవకీనందనాశ్రమస్వామి వారి ప్రియశిష్యుడు. ప్రత్యేక శ్రద్ధ వహించి కేవల ధర్మప్రచారాశ్రయముతో వెలువరించిన ఈ గ్రంథము భక్తుల ఆదరము పొందుట నిశ్శంకము.

రచన శైలి రమ్యముగా నున్నది. విసువు పుట్టించకవీనుల విందై మనలను ముందుకు గొంపోవును. శంకర కృత స్తోత్రములు ఆయా ఘట్టములందు సమంజసముగ చేర్చబడినవి. భక్తి జ్ఞాన వైరాగ్యముల కూడలి యైన ఈ యీ వచన కావ్యము అశాంతి నిండిన నేడు ప్రతివారికి ముఖ్యముగా పఠనీయము. శ్రీ ఆదిశంకరుల జనన కాలము నిష్పేచీగా నిర్ణయించుట ప్రశంసార్హము.

ఈ ఉద్గ్రంథము త్వరలో వెలువడి భక్తసమాజమును ధన్యుల జేయు గాత మని

**మా నారాయణ స్మరణ పూర్వక ఆశీస్సు!**

**స్వస్తి, ఓమ్ తత్సత్**

**శ్రీ స్వామి**

## అనుబంధము 7

శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ బ్రహ్మానందతీర్థ స్వాముల వారు బ్రహ్మశ్రీ యఱ్ఱాప్రగడ వేంకట సూర్యనారాయణమూర్తి గారు రచియించిన "శ్రీ శంకరావతార చరితము" మృదు మధుర సులభ శైలిలో వ్రాసిన సమగ్ర జీవిత చరిత్ర. సంస్కృత శంకర విజయములను గాని, వాటి కనువాదములుగ వెలసిన తెలుగు పద్యకావ్యములను గాని అర్థము చేసి కొనలేని వారికీ వచన కావ్య మత్యంత ముపయోగకరము. శైలి కేవలము గ్రాంథికము గాక, కేవలము గ్రామ్యము గాక నుభయ మిశ్రిత మగుటచే అందరికిని ఆనందదాయకము కాగలదు. ఈ బృహద్గ్రంథమును వ్రాసిన గ్రంథికర్త ఆంధ్రవాఙ్మయము లోని ఒక లోటు తొలగించిన వారైనారు.

ఆ యా సందర్భములలో శ్రీశంకరుల యెడ లోకు లెట్లు వర్తించి యుందురో వారు ఇతరులతో నెట్లు వ్యవహరించి యుందురో ఊహించి వ్రాసి ఘట్టములకు సందర్భశుద్ధి గలదు. శ్రీమద్భాగవతాంతమున అందులోని కథలను సంక్షేపముగ నొక అధ్యాయములో వివరింప బడినటుల శ్రీ ఆచార్యులవారి చరిత్రను క్లుప్తముగ గ్రంథాంతమున వ్రాయుట ఉ పయుక్తముగ నున్నది. శ్రీ ఆచార్యులవారు రచియించిన 'సాధనపంచకము'ను భారతీయులకు వారి అంత్యసందేశముగ గ్రంథాంతమున జేర్చుట కొనియాడదగి యున్నది.

గ్రంథకర్త ఉపాధ్యాయ పదవి నుండి విరమించి నపుడు ప్రజల వలన ఆయనకు అనన్య సామాన్యమైన సన్మానము జరిగిన దని విన్నాను. దీనిని బట్టి వీరు ఉపాధ్యాయవృత్తిలో గూడ జీవితమును పరమార్థ దృష్టితోనే గడపినటుల విదిత మగుచున్నది. కాబట్టియే శ్రీ ఆచార్యులవారి అనుగ్రహము కలిగి గ్రంథము నింత చక్కగ సర్వాంగసుందరముగ వ్రాయగల్గినారు.

హోమియోపతీ వైద్యములో కూడ వీరు ప్రశంసనీయమైన అనుభవమును సంపాదించి, ఇతర చికిత్సలకు లొంగని ఘోరమైన వ్యాధులను అవలీలగ నివారణ చేయగలిగిన సిద్ధహస్తులని ప్రశంస కెక్కిన భిషగ్వరులు.

ఇట్టి పవిత్రాత్ముడు వ్రాసిన గ్రంథమునకు ఎక్కువ విలువ గలదు. వారి యిలువేల్పైన శ్రీ తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామికి కృతి సమర్పణము గాను, దేవతాది ప్రార్థనలుగాను రచియించిన పద్యములు చూడ వీరికి కవిత్వమందు కూడ నిపుణత కలదని విశదమగుచున్నది.

ఆంధ్రు లీగ్రంథమునకు తగిన ఆదరణ నొసంగి గ్రంథకర్త యింకను ఇట్టి సద్గ్రంథములు రచియించు నటుల ప్రోత్సహించెదరని ఆశించుచున్నాము.

**ఇతి నారాయణ స్మృతిః**

**ఇందుపల్లి**
**27-11-1969**
**బ్రహ్మానందతీర్థ స్వామి**

## అనుబంధము 8

తర్కరత్న, న్యాయ వేదాన్త విద్యాపారీణ, దర్శనాలంకార బిరుదాంకితులు బ్రహ్మశ్రీ బులుసు అప్పన్న శాస్త్రి గారి ఆశీ:పూర్వక ప్రశంస

చార్వాక బౌద్ధ జైన పాశుపతాది మతములు భారత దేశమం దంతటను వ్యాపించి భారత ధర్మములను (స్వాహాకార స్వధాకార వషట్)లోపింప జేసి బౌద్ధాది మతములను వ్యాపింప జేసి యుండ కుమారస్వామి కుమారిలభట్టుగ నవతరించి కర్మకాండయే ప్రధానమని బౌద్ధాది మతములను ఖండించి బ్రహ్మ వతార మగు మండనమిశ్రుని శిష్యునిగ గైకొని, తద్వారమున కర్మ ప్రచారము చేయించుచు, తాను గురుతిరస్కార ప్రాయశ్చిత్తముగ తుషాగ్ని యందు ప్రవేశించి యుండ, మధ్యకాలమున శ్రీ శంకరులు కర్మకాండ బంధహేతువు కాని దు:ఖా సంభిన్న సుఖ హేతువు కానేరదని తలచి ఆర్యాంబా గర్భ శుక్తి ముక్తా ఫలాయ మానమై శివగురువు వలన జన్మించి, తల్లి ఆజ్ఞను వడసి, గోవింద భగవత్పాదుల చెంత జేరి, వేదాంత రహస్యములను వడసి, తాను బ్రహ్మసూత్ర ఉపనిష ద్భగవద్గీతలకు భాష్యములను రచించి, వ్యాసానుగ్రహము బడసి, దేశ మంతటను ప్రచారము చేయుచు, అప్పటికి మిగిలి యున్న దుష్ట మతములను ఖండించుచు, తుషానల ప్రవేశము చేసి యున్న కుమారిలభట్టు చెంతకు చేరి వాదభిక్ష నొసగ వలసినదని ప్రార్థింప, 'నా శిష్యుడు మండన మిశ్రుని జయించిన నన్ను జయించినట్లగు' అన్న వారి యాజ్ఞను బడసి మండనమిశ్రుని సన్నిధి జేరి వారిని జయించి, వారికి తురీయాశ్రమ మిచ్చి మిగిలిన దేశమంతటను సంచరించి, అదుష్టముగ షణ్మతములను స్థాపించి "షణ్మతస్థాపనాచార్య", 'జగద్గురు' అను విద్యోపాధులను బడసి, నాలుగు దిక్కుల యందు నాలుగు పీఠములను స్థాపించి, నలువురు శిష్యులను నాలుగు పీఠముల యందుంచి, ధర్మ జ్ఞాన పరిపాలనను వారి కాదేశించి, కేదారమున నందివాహనారూఢుడై కైలాసమున కేగిరి.

ఈ వృత్తాంత మంతయు శ్రీ విద్యారణ్యస్వామి గ్రంథరూపమున రచియించి యుండిరి. అట్టి గ్రంథమును సూత్రప్రాయము జేసి, బ్రా॥వే॥ యెఱ్ఱాప్రగడ వేంకట సూర్యనారాయణమూర్తి గారు మృదు మధుర భాషతో గ్రాంథికము గాక గ్రామ్యము గాక సులభ శైలి భాషలో విశదీకరించిరి.

## ఇందలి విశేషణములు

శంకరభగవత్పాదులు గోవిందభగవత్పాదుల సన్నిధి కేగు సమయమున మధ్యే మార్గచరిత్రను విపులముగా వర్ణించియుండిరి మరియు పరకాయ ప్రవేశము, నీలకంఠాది మత్తగజముల నడగ ద్రొక్కిన విషయములను చక్కగ చిత్రించియుండిరి. ఈ గ్రంథము సంప్రదాయానుసారము ఆ బాల వృద్ధులకు సుఖకరముగ నీ 'శ్రీశంకరావతార చరితము" వ్రాసి రనుటలో అతిశయోక్తి ఇంచు కంతయును లేదు.

వీరు ఆంధ్రకవితాశక్తి కలవారై, ఆ కవితాధోరణిని దూరముగ నుంచి ఆంధ్ర లోకమునకు ఈ చరితమును రచియించి అందించుటచే నాకు బ్రహ్మానందము కలిగినది. నాకీ చరితము లోని కొన్ని ఘట్టములను నేను కోరినవి చదివి వారు స్వయముగ వినుపించు సమయమున నాకు ఆనందబాష్పములు ప్రవాహముగ జనించిన వనుటలో సందేహము లేదు.

వీరు యింతటితో తృప్తి నొందక మరి శంకరాచార్య విరచిత గ్రంథములకు కొన్నింటికైనను ఈ భాష తోటి వ్యాఖ్యను రచించి ఆంధ్ర లోకము నుద్ధరించెదరు గాక యని వీరిని నా మన:పూర్వకముగ ఇదియే నా కోరిక యని

బ్రా॥వే॥ వేంకట సూర్యనారాయణమూర్తి గారిని కోరుచుంటిని.

**ఇట్లు**

**భట్నవిల్లి, అమలాపురం తాలూకా**

**18-12-1969**

**బులుసు అప్పన్న శాస్త్రి**

## అనుబంధము 9

### విద్యా భాస్కర శ్రీ దినవహి సత్యనారాయణ గారు
### రామచరితమానసము, షాజహాన్, ఇత్యాది గ్రంథ రచయిత

**'సౌభాగ్యకుటీర్"**
**రాజమహేంద్రవరము**
**శ్రీరామనగరము**
**28-10-1967**

శ్రీ యెఱ్ఱాప్రెగడ వేంకటసూర్యనారాయణ మూర్తి గారిని రాజమహేంద్రవరములో కలిసి నప్పుడు వారు రచించిన "శ్రీశంకరావతార చరితము" లోని ఘట్టములను అక్కడక్కడ చదివి వినిపించ వలసినదిగా కోరితిని.

వారు వ్రాసినది చరిత్రాంశములను అన్నిటిని గుది గ్రుచ్చినట్టి జీవిత చరిత్రమేమో అనుకొంటిని కాదు. శ్రీ శంకరుని జీవితమును, రచనలను కూలంకషముగ చర్చించిన బృహద్గ్రంథము. వారది చదువునపుడు ఏదో నవలను ముందు విషయమును ఉత్కంఠతో విను రీతిని మైమరచివింటిని. ఆబాలగోపాలమునకు అర్థమగు భాష. బైబిలులోని వాక్యములట్లు శక్తివంతములగు చిన్న వాక్యములు. ఏ మాత్రమును కుంటువడని ధార.

సంశయగ్రస్త మగు భాగములకు చక్కని మలుపుల నిచ్చి ఔచిత్యమును పోషించారు. ఉదాహరణకు:

(1) మొసలి నోట బడ్డ శంకరుడు మాతృదేవిని సన్న్యాసానికి అనుమతి గోరి నపుడు ఆయన నోటన చెప్పించక సహపాఠకులచే ఆ అంగీకారమును ఆర్యాంబను గోర జేసినారు.

(2) చండాలు డెదురైనపుడు అతనిని దూరముగా తొలగు మని గద్దించినది శంకరుడు కాడు. శంకరునకు ముందు నడచి దారి సూచించు శిష్యుల నోట పలికించారు.

(3) 'భవతి భిక్షాం దేహి' అను కేక నాలకించి తట్టుముట్టాడు దారిద్ర్యము చేత నిండా కట్టు గుడ్డ లేక తలుపోరగిల బెట్టి మాటున నుండి జన నయనానంద కరుడగు శంకరబాలునకు పట్టుడోగిరము పెట్టనేరక పరితపించు పరమ సాధ్వి దు:ఖము నెంచి యబ్బాలుడు దేవిని కనకధారా స్తవమున ప్రసన్నను జేసి బంగారు ఉసిరికల గురిపించిన ఘట్టము నెంతో హృదయరంజకముగ చిత్రించినారు. అంతే గాదు ప్రక్క ఇంటి ధనికుని పేరాస, పొరిగింటి పేదల యెడ వారి కున్న నిర్లక్ష్యము ఈ నాటి యువకుల గుండెలకు సూటిగ నాటునట్టి మాటలలో తెల్పారు.

పరకాయ ప్రవేశ విద్యా మహిమ చేత శ్రీశంకరులు రాజు కళేబరములో ప్రవేశించి కామకళా మర్మముల గ్రహించు పట్ల మనలను శృంగార రసవాహినిలో నోలలాడించారు. ముక్తజీవి బద్ధుడై ఆవరణ దోషాతిశయము వలన భోగలాలసు డగుచుండ శిష్యు డన్యాపదేశముగ చేసిన ప్రబోధ మెంతయు మెచ్చ దగి యున్నది.

మతఖండనము లందలి వాదోపవాదములు కథాసంవిధానమున కడ్డు తగులకుండా జిజ్ఞాసువుల కుపయోగపడేటట్లు అనుబంధములో చేర్చిరి. శంకర కృతస్తవములను, స్తోత్రములను ఆయా ఘట్టముల కడ చేర్చికావ్యమును రసవత్తర మొనర్చినారు. శంకరుని జీవిత మింత రసవత్తరముగ వ్రాయబడ్డ వచన కావ్యమును తెలుగులో నేనింతవరకు చూడలేదు. లేదనియే నా నమ్మిక. ప్రతివారును చదువదగ్గ విషయము లింక నెన్నియో నిందున్నవి.

సకల విద్యా సుధీ భూషణులును, భక్తాభీష్ట ప్రదాయులు నగు గురువర్యులు శ్రీ దేవకీనందన యతీంద్రుల కరుణాకటాక్ష వీక్షణము వీరి చేత నింకను ఉద్గ్రంథములను వ్రాయించు గావుత మని పరాత్పరుని వేడుకొనుచున్నాను.

**ఇట్లు**

**భక్తచరణరేణువు**

**(సం.) దినవహి సత్యనారాయణ**

## అనుబంధము 10

రచయిత శ్రీ యజ్ఞాప్రగడ వెంకట సూర్యనారాయణమూర్తి వంశక్రమణిక

ఆపస్తంబసూత్రులు, ఆంగీరస, భార్మ్యస, మౌద్గల్యస గోత్రులు

మృత్యుంజయుడు, కామేశ్వరమ్మ

వెంకటాచలము జోగయ్య సుబ్బయ్య సూర్యనారాయణ శాయమ్మ సూరమ్మ

వెంకటాచలము, విజయలక్ష్మి

రామయ్య కామమ్మ లత్సమ్మ

వెంకటాచలము, బుచ్చిమాంబ

పెద్దవియ్యమ్మ వీరశంకరము చిన్నవియ్యమ్మ శేషమ్మ మాణిక్యాంబ

**వెంకటసూర్యనారాయణమూర్తి** గోపాలకృష్ణమూర్తి

**వెంకటసూర్యనారాయణమూర్తి**, సత్యవతి

రాజ్యలక్ష్మి వెంకటగిరిసత్యనారాయణమూర్తి వెంకటేశ్వరరావు కాంతాలుమేలు

వెంకటరామకృష్ణ పద్మావతి